# నిత్య సత్య బోధ

## (దివ్య సందేశామృతము)

### (ఇది కవర్ పేజి యొక్క దివ్య సుమధుర భావన)

ప్రేమ, శాంతి అనే దివ్యసాగరంలో జీవుడు ప్రవేశించిన తక్షణమే తనలోని హృదయపద్మం ఒక్కసారిగా జ్ఞాన భాస్కరుని దివ్యతేజోవిరాజితమైన కిరణములు సోకి వికసించుట మొదలవుతుంది. అప్పటివరకు జీవి లోపలఉన్న అరిషడ్వర్గముల స్థానంలో సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస, దయ అనే సద్గుణములు ప్రవేశించి జీవిని సత్సంగత్వము, నిస్సంగత్వము అనే జీవిత పుస్తకాన్ని తెరిచేటట్లుగా చేస్తుంది. ఈ ఉన్నత పయనం యొక్క లక్ష్యము, గమ్యము అయిన నిర్మోహత్వ స్థితే నీలోని భగవంతుని గుర్తించుట. ఆ స్థితిలోనున్న జీవియొక్క అణువు - అణువు దివ్యత్వమనే దివ్యసుగంధాల పరిమళము విశ్వవ్యాప్తమవుతుంది. ఆ దివ్యసుమధుర స్వరరాజమే నాదోపాసన ఓంకారము. ఈ దివ్యతరంగాలు మీదరికి చేరి మిమ్ములను దివ్యాత్ములుగా, దివ్యస్వరూపులుగా తీర్చిదిద్దే ఒక దివ్యమైన చిత్రరాజమిది.

ఇంత మంచి ఆధ్యాత్మిక దివ్యతరంగాలలో కూడిన భావచిత్రాన్ని అందించిన భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్యచరణారవిందములకు వినమ్రతతో కూడిన శతసహస్రకోటి

పాదాభివందనములు సమర్పిస్తూ......

సదా సాయిచరణ దాసులము,

| తల్లి | బిడ్డ | బిడ్డ (ఆత్మీయులు) |
| --- | --- | --- |
| యస్. **విశాలాక్షి** | డి. రవి కుమార్ | బి. జ్ఞాని |

## రచయిత మనవి:

భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య పాద పద్మములకు ప్రణమిల్లుతూ తొలుతగా ఈ గ్రంథాన్ని పాఠక లోకానికి అందించాలన్న కాంక్ష కలిగించి, జీవులకు కావలిసిన ఆధ్యాత్మిక ఆహారాన్ని అందించాలన్న సుసంకల్పము కలిగించిన 'భగవాన్'కు మరియొకమారు కృతజ్ఞతాపూర్వకమైన నమస్కారాన్ని అందిస్తున్నాను.

జన్మను తీసుకున్న ప్రతీ జీవి కర్మానుసారమే భూమిపైకి వస్తాడన్నది నిర్వివాదాంశం. కానీ ఆ జీవి వచ్చినది ఎందులకు? తాను చేస్తున్నదేమిటి? రేపటి తన గమ్యం ఏమిటి? తాను ఎచటకు చేరాలి? ఈ

ప్రశ్నలను తనకు తానుగా వేసుకున్నప్పుడు సమాధానం తెలియాలంటే ఎంతో కొంత ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అవలంభించి సాధనా దిశగా అడుగు వెయ్యక తప్పదు. అటువంటి అత్యున్నతమైన ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించాలంటే గురువు, సద్గురువుల యొక్క మార్గదర్శకత్వం ఎంతైనా అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి కలియుగ అవతారం కనుల ముందు **సాక్షాత్కరించిన** భగవాన్ బాబా కరుణామయుడై తన యొక్క ప్రేమసుధారసాన్ని జీవులపై వర్షించుటకు అందించినవి ఈ సుధాబిందువులు. ఈ సుధాబిందువులను గ్రోలిన మానవ జాతి తప్పక తన సాధనా దిశలో అడుగు ముందుకు వేస్తూ అతి త్వరలో తాను చేరదలచిన గమ్యాన్ని చేరగలడని భావిస్తున్నాను. భగవాన్ జీవులను ఉద్దేశించి ఎన్నో మార్లు నుడివిన ఖానా, పీనా, సోనా, మర్నా వీటికోసం కాదు "నీవు" అనేది ఏది ఉన్నదో దానిని ఎరుకలోకి తెచ్చుకొనునిమిత్తమై మానవ జన్మను పొందినావు అని తెలియపర్చినారు. మానవత్వాన్ని మరచినట్లైతే నీవు మానవుడుగా గుర్తించబడవు అన్నారు. మాధవుడివి కావలసిన నీవు మాధవుడిగా మారకపోయినా ఫర్వాలేదు, మానవుడిగా బ్రతుకు అని అన్నారు. అటువంటి మాధవత్వాన్ని పొందే ప్రయత్నములో సాధకులైన తన బిడ్డల మీద అవ్యాజమైన ప్రేమతో అప్పుడప్పుడూ అందించిన ఈ ఆణిముత్యాలను ఒక చోట పేర్చి రత్నహారంగా మార్చి భగవాన్ మెడలో వేయుటకు మనము అనుకూలముగా మారి జీవిత పరమార్థాన్ని సాధించాలి అన్న సదుద్దేశంతో దీనిని అందించుటకు సమాయత్తము చేసినారు. భగవాన్ అందించిన ఈ ఆణిముత్యములు అణువు అణువునా అంతర్ శోధన గావించి అంతర్మధనము ద్వారా అంతరాత్మయైన ఆత్మారాముని కనుగొని అంతర్ శాంతిని అనుభవించాలి. అవతార పురుషుల తత్వము, లక్ష్యము మరియు ఆ లక్ష్య సాధనకై వారు ఎంచుకునే మార్గము అవతార పురుషులే స్వయంగా వివరిస్తే తప్ప మానవులకు అవగతం కాదు. అందుకే అవ్యాజమైన ప్రేమతో తన బిడ్డలమైన మనపై కురిపించిన ఈ అనుగ్రహ వర్షంలో మీరు కూడా తడిచి మంచి పంటను అందుకుంటారని ఆశిస్తున్నాను. ఈ దివ్య పదంలో అందరమూ చేయి చేయి కలిపినడుద్దాం.

సదా సాయి సేవలో, సాయి చరణ దాసి.

సాయి బిడ్డ

యన్**. విశాలాక్షి**

# <u>ముందు మాట</u>

**(1)**

ఓం

ఈ పుస్తకములోని అంశములు భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా వారు గ్రంథకర్త విశాలాక్షిగారి ధ్యానావస్థలో అందించిన దివ్యమైన సాధనా దిశలోని అంతర్ సూక్ష్మాలు. దీనిని చదివిన సాధకులు తప్పక తమ యొక్క ఆధ్యాత్మిక ప్రగతికి కావలసిన దానిని అందుకొనగలరు. శాంతి, సంతోషాలు వారికి అందుబాటులోకి వస్తాయి. జిజ్ఞాసులైనవారు వారికి కావాలసిన ఆధ్యాత్మికమైన సందేహాలకు తప్పక సమాధానాన్ని పొందగలరు. భగవాన్ బాబా ఈ సందేహాలకు నిత్యజీవితములో ఎదురయ్యే సాధారణ ఉదాహరణలతో సుస్పష్టముగా జవాబులిచ్చారు. ఈ ప్రశ్నోత్తరాలు ఆధ్యాత్మిక విషయాలను చర్చిస్తూ, సాధన, నమ్మకము, విశ్వాసము, శాంతి సంతోషాలు, మానవ సంకల్పము, గురువు యొక్క అవసరము, మనస్సును అరికట్టుట, కోరికలు, స్వచ్ఛత, మోక్షము, భగవదనుగ్రహాన్ని ఎలా పొందాలి? యోగులు, భగవంతుడు ఎందుకు జన్మలు తీసుకుంటారు? మొదలగున్నవి ఎన్నో ఈ పుస్తకములో అందించుట జరిగింది. 'భగవాన్'కు, అమ్మకు మధ్య జరిగిన ఆంతరంగిక సంభాషణలలో భగవాన్ తాను ఎవ్వరు? తన నిజస్వరూపం ఏమిటి? అని అత్యద్భుతముగా విశదపర్చారు. ఎన్నో విషయాలలో భగవాన్ తన జీవితమునే ఉదాహరణముగా తీసుకుంటూ సుస్పష్ట సమాధానాలను ఇచ్చారు. మామూలు మానవాళికి తెలిసిన కొన్ని ఆధ్యాత్మిక విషయాలను ఇందులో సరిదిద్దారు.

నేను, నా భార్య శివాంగిని 1997 నుంచి భగవాన్ బాబా వారితో మా ఆధ్యాత్మిక ప్రయాణం మొదలైనది. ఆమెను 2004 లో స్వామి జీవన్ముక్తురాలివి అని అన్నారు. 2005 లో ఆమె దేహం

చాలించింది. తాను వెళ్ళిన తర్వాత నా యొక్క ఆధ్యాత్మిక ప్రయాణం వేగముగా జరుగుట మొదలైనది. నేను 2009 లో రిటైర్ అయ్యిన తర్వాత అమెరికా నుండి పుట్టపర్తికి వచ్చి 4 నెలలు గడుపుతూ ఉండేవాడ్ని. గత 40 సంవత్సరాలుగా అమెరికాలోనే చదువు, వివాహము, ఉద్యోగము, ఆధ్యాత్మిక జీవనము గడిపినాను. యిప్పటికీ ఆధ్యాత్మిక జీవినాన్ని సాగిస్తూ గమ్యం చేరే ప్రయత్నములో బాబావారి దివ్యచరణాలను ఆశ్రయించుకొనియే ఉన్నాను. నా భార్య శివాంగిని బాబావారి మధ్య జరిగిన సంభాషణలను ఇంగ్లీషులో 'మేకింగ్ అఫ్ ఎ యోగిని', 'ఇన్నర్ ఎక్స్పిరియన్సెస్' (Making of a Yogini, Inner Experiences) అనే పుస్తకాలను వ్రాసినాను. వాటిని తెలుగులో 'సాయి శివాంగిని', 'అంతర్గత అనుభవాలు' హిందీలో 'ఆంతరిక్ అనుభవ్' అనే పేర్లతో అనువాదం చేయటం జరిగింది.

నేను 2012 లో పుట్టపర్తి వచినప్పుడు **<u>విశాలాక్షి</u>** అమ్మతో మొట్టమొదటి పరిచయము ఏర్పడినది. శ్రీ సత్యసాయి అనుగ్రహ గృహములో అమ్మతో కలవటం తటస్థించింది. మొదటి కలయికలోనే తన స్వచ్ఛమైన, ప్రేమపూరితమైన నవ్వు ఆధ్యాత్మిక అనుభవాలు పంచుకొనే విధానము తనపట్ల ఒక మంచి భావము కలిగించినది. ఆమె వ్రాసిన 'శ్రీ సత్యసాయి దివ్య అనుగ్రహ కడలి తరంగాలు' అనే పుస్తకము చదివినాను. నేను పుట్టపర్తిలో ఉన్న సమయములో ఆమెతో చాలాసార్లు నా యొక్క ఆధ్యాత్మిక అనుభవాలను పంచుకున్నాను. దాంతో భగవాన్ పట్ల వారు చూపించే అనుగ్రహముపట్ల దివ్యమైన ఆనందాన్ని అనుభవించాను. వృద్ధాశ్రమంలో అమ్మ బిడ్డగా ఉండి సేవ చేయుచున్న రవికి అమ్మ తన ఆధ్యాత్మిక అనుభవాలను పంచియిస్తూ, ఆధ్యాత్మిక ప్రగతికి కావాలసిన సలహాలు ఇస్తూ ఒక తల్లిగా బిడ్డపై చూపించే ప్రేమ భగవాన్ అందించే ప్రేమ ఏవిధంగా అందించారో అదేవిధంగా సుస్పష్టముగా గమనించగల్గినాను. వీరిద్దరితో పరిచయం నా అదృష్టముగా భావించినాను.

ఈ పుస్తకము లోని దివ్య సందేశాలను డిసెంబర్ 2013 నుంచి ఆంగ్ల భాషలోకి అనువాదం చేయడం మొదలు పెట్టాను. అందులోని ఒక సందేశములో భగవాన్ గాయత్రీ మంత్రం గురించి వివరించారు. నేను మహా శివరాత్రి జాగరణ కుల్వంత్ హాల్లో రాత్రి అంతా చేస్తూ ఈ గాయత్రీ మంత్రాన్ని క్రియా రూపకముగా ఉపయోగించి మనస్సును అరికట్టి భగవంతునిలో నిలిపే ప్రయత్నము చేశాను. దాని వలన నాకు ఆధ్యాత్మికముగా మేలు జరిగింది. శరీరములోని సకల శక్తులను జాగృతము చేసి బుద్ధిని ఉజ్వలింప చేయడానికి, మనస్సును అరికట్టడానికి ఈ మంత్రం ఒక గొప్ప పనిముట్టు. కర్మ యోగ సందేశాన్ని

చర్చించినప్పుడు మేము మాలోని కొన్ని సందేహాలను తీర్చకోలేకపోయాము. ఆ నాటి రాత్రి స్వామి అమ్మగారి ధ్యానములో మా సందేహాలను తీర్చడమే కాక జవాబులో ఇచ్చిన వాక్యాలను అప్పటికప్పుడే అమ్మగారితో వ్రాయించారు. ఆ దివ్య వాక్కులను ఎలా చెప్పారో అలాగే ఈ పుస్తకములో తు. చ. తప్పకుండ ప్రచురించబడినది.

నేను 2014 మార్చిలో అమెరికాకు వెళ్ళాను. ఏప్రిల్ లో స్వామి తిరిగి పుట్టపర్తికి రప్పించారు. ఇచ్చట నా సమయాన్ని కర్మ యోగ ఆచరణలో మరియు ఈ పుస్తకాన్ని ఆంగ్ల భాషలోకి అనువాదము చేయుటలో సద్వినియోగపర్చడం జరిగింది. స్వామివారి ఆధ్వర్యములో అమ్మగారు నా ధ్యాన స్థితిలోకి ప్రవేశించి నా ధ్యానంలో కొత్త పద్ధతులను నేర్పి నా ఆధ్యాత్మిక పురోగతికి సహకరించారు. అమ్మగారు గురువుగా నాకు చేయుచున్న ఈ సహకారానికి అంతులేని కృతజ్ఞతలు.

ఈ పుస్తకములో నేర్చుకోతగిన, అర్ధము చేసుకో తగిన ఆధ్యాత్మిక విషయాలు ఎన్నో ఉన్నాయి కనుక మరలా మరలా చదువవలసి ఉంటుంది. మనకు అనుభూతులు కలిగిన తరువాతనే పాత సందేశాలలో క్రొత్త అర్ధములు బయటపడుతాయి. నేను ఎన్నో విషయాలు ఈ పుస్తకము ద్వారా అర్ధము చేసుకొన్నాను. కొన్నింటిని వాస్తవములో అనుభవించాను. ఉదాహరణగా మానవ విలువలు ఎంత ముఖ్యము, ఇంద్రియాలు ఎంత ప్రమాదము, జ్ఞాన మార్గమైనా, భక్తి మర్గామైనా, మోక్షానికి ఒకే ఒక్క ఉపాయము సర్వస్యశరణాగతియే. ఒక ఆత్మయే ఇంకొక ఆత్మకు పురోగతిని కలిగిస్తుంది తప్ప ఇంకో విధానము లేదు, కర్మ ప్రతీ క్షణములో ఇమిడి బలీయముగా ఉంటుంది. స్వామి వారి దయతో సహనము, ఓర్పు అనే విలువలు ఇదే సమయములో ఎన్నో అనుభవాల ద్వారా, వ్యక్తుల ద్వారా పెంపొందించుకున్నాను.

నా జీవిత చరిత్రలో 2014 వ సంవత్సరము సువర్ణాక్షరాలతో లిఖించతగినది. ఇటువంటి సద్గతిని ప్రసాదించిన భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య పాద పద్మములకు శత సహస్ర కోటి ప్రణామములు సమర్పించుకుంటూ ..........

సదా సాయి సేవలో

బేలె జ్ఞాని

## (2)

ప్రప్రథమంగా నా ఆధ్యాత్మిక పురోగతికి ఎన్నో రూపాలలో, ఎన్నో విధాలుగా పరోక్షంగా తోడ్పడుతున్న గురువు, సద్గురువు, భగవంతుడైన భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య చరణములకు శత సహస్ర కోటి ప్రణామములు అర్పిస్తున్నాను. నేను జీవితంలో ఆధ్యాత్మికంగా మరియు లౌకికంగా ఎదుగుటకు సహాయ సహకారాలు అందిస్తున్న త్యాగ జీవులైన నా తల్లి తండ్రులు డి.వి. ప్రసాద రావు, డి. **వరలక్ష్మి** గార్లకి; ప్రత్యక్ష గురువులైన **విశాలాక్షి** (అమ్మ) మరియు జ్ఞాని గార్లకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

తల్లితండ్రుల ప్రమేయంతో 2001 సం||లో మొదటిసారి స్వామిని దర్శించి తదుపరి మరి కొన్ని సార్లు ప్రశాంతి నిలయంలో స్వామి సేవ మరియు దర్శనం చేసుకునే అవకాశాన్ని స్వామి ప్రసాదించారు. కొన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసిన తరువాత స్వామి సేవా సంస్థలలో పని చెయ్యాలనే ఉద్దేశంతో 2011 సం||లో పుట్టపర్తికి వచ్చి సేవ చేస్తున్న కొంత కాలానికి అమ్మతో పరిచయం ఏర్పడింది. ప్రస్తుతం స్వామి మార్గ దర్శకత్వంతో జీవన గమ్యాన్ని చేరే దిశగా అడుగులు వేస్తూ అమ్మతో ఉంటూ స్వామి యొక్క అనుగ్రహంతో నిర్మించబడిన "శ్రీ సత్య సాయి అనుగ్రహ గృహము (వృద్ధాశ్రమం)" లో సేవ చేసుకునే భాగ్యాన్ని స్వామి కల్పించారు.

అమ్మతో పరిచయమైన కొద్ది రోజుల్లోనే స్వామి నా ఆధ్యాత్మిక పురోగతికి తోడ్పడేటువంటి సందేశాలు, సాధనా ప్రక్రియలు అమ్మ ద్వారా నాకు తెలియపర్చుట మొదలైంది. మొదట్లో స్వయంగా స్వామియే అమ్మ ద్వారా నాకు అవసరమైన రీతిలో శిక్షణ ఇస్తున్నారు అన్నది నమ్మకపోయినా నేను **వీక్షించిన** అద్భుతాలు, అనుభవించిన ఆధ్యాత్మిక అనుభూతులు, స్వామి పెట్టే పరీక్షల ద్వారా క్రమేణా నేను గమనించగలుగుతున్న మానసిక పరివర్తన వంటివి నేను సత్ సాంగత్యంలో సన్మార్గంలో జీవన గమ్యం చేరే దిశగా ప్రయాణిస్తున్నానన్న నమ్మక విశ్వాసాలు దృఢపరిచినాయి. అమ్మ ఎంతో ప్రేమ, శాంతి, సహనములతో నాకు తోడ్పడుతున్న వైనము ఊహించలేనిది. ఈనాటికీ స్వామి అందచేస్తున్న సూచనలను ఆచరించి అనుభవించేందుకు కావలసిన శిక్షణ తన ద్వారా పొందుతున్నాను. అదే విధంగా

జ్ఞాని గారు ఆధ్యాత్మిక మార్గంలో నాకు అవసరమయ్యే సూచనలు, సలహాలు, సహాయసహకారాలు అందిస్తున్నారు. స్వామి ప్రేమతో ఈ పుస్తక రూపంలో అందచేసిన "నిత్య సత్య బోధ"ను పదిమందికీ పంచుట వలన నేను కొంతలో కొంతైనా ఆచరణలో పెట్టే ప్రయత్నం జరుగుతున్నది. స్వామి ఈ పుస్తక రూపంలో చేసిన బోధను గురించి ఈ విధముగా తెలుపుట జరిగింది.

**"నేను మీ మంచి కోసమే చెబుతున్నాను. ఈ బోధన మీ లోపల జ్ఞానాన్ని వికసించేటట్లుగా చేయాలి. నిత్యమూ బోధిస్తూ ఉన్నాను. సత్యమైన విద్యను అంటే ఎప్పటికీ మార్పులేని, మార్పు చెందని జ్ఞానాన్ని ప్రసాదించేది ఈ 'నిత్యసత్యబోధ' అన్నది మరొక్కసారి ఎరుకలోకి తెచ్చుకోండి."**

నాకు ఉన్న అవరోధాలైన తమస్సు, క్రోధము, అభిమానము, అసహనం మరియు మోహమును ఎలా అధిగమించాలి అన్న దానికి స్వామి ఇచ్చిన పరిష్కారాలు నన్ను ఎంతో ఉన్నత పథంలో పయనించేటట్లుగా చేసి ఆధ్యాత్మిక అనుభూతులను పొందేలా చేస్తున్నాయి.

ఆధ్యాత్మిక ఉన్నతికి సాధన చేయవలసిన అవసరం ఏమిటి? ఎటువంటి సాధన చేయాలి? ఎలా చేయాలి? అన్నవాటిని తెలియపరుస్తూ, సాధనా దిశగా ఎట్టి దశలో ఉన్న సాధకులకైనా సాధారణంగా ఎదురయ్యే సందేహాలకు స్వామి అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఎన్నో ఉపమానాలతో ఇచ్చిన సందేశాలు ఈ పుస్తక రూపంలో మీతో పంచుకోవటం జరుగుతున్నది. కర్మ భక్తితో ఆచరించినపుడే అది జ్ఞానమవుతుందని, అట్టి జ్ఞానాన్ని పొందే మార్గంలో ఎదురయ్యే అవరోధాలైన అరిషడ్వర్గాలను ఎలా అధిగమించాలి? మనస్సు అనాత్మ తత్వాన్ని అనుసరించుటే కష్ట నష్టాలకి, సుఖ దుఃఖాలకి మూలకారణము అని తెలియచెబుతూ అందుకు ఏ విధంగా మనస్సును నిగ్రహించవచ్చో తెలుపుతూ దానిని ఆత్మతత్వంలో ఎలా ప్రవేశింపచేయాలి? సాధన క్రమబద్ధంగా నిరంతరం చేయవలసిన అవసరం ఏమిటి? ధ్యానం అంటే ఏమిటి? ధ్యానం ఎలా చేయాలి? సంసారం అంటే ఏమిటి? సంసారంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనుటకు ఏవి అవసరం? జీవన గమ్యాన్ని **సురక్షితంగా** ఎలా చేరవచ్చు? సాధకునకు గురువు యొక్క అవసరం ఏమిటి? గురు విశిష్టత ఏమిటి? ఇలా ఇంకా ఎన్నో అనేక విషయాల గురించి

స్వామి అవగాహన కలిగించటం జరిగింది.

స్వామి మన నుంచి ఆశించేది ఒకే ఒక్కటి. అది సర్వశ్య శరణాగతి. "సద్గురువు చేత పడ్డ జీవి, పులి నోట పడ్డ జీవి తప్పించుకునే ప్రసక్తే లేదు" అని స్వామి చెప్పారు. ఈనాడు అట్టి అవకాశము, అదృష్టము మన అందరికీ కలిగించుట జరిగింది. ఆధ్యాత్మిక జిజ్ఞాసులకు గానీ, సాధనాపరులకు గానీ ఈ పుస్తకంలో ఉన్న ఏ ఒక్క విషయమైనా తప్పక ఉపయోగపడగలదని నమ్ముతున్నాను.

ఇంతటి అనుగ్రహ ఆశీస్సులు మాపై చూపుతున్న మీకు సదా కృతజ్ఞతలు స్వామి.

మీ
బిడ్డను స్వామి.....
డి. రవి కుమార్

# గాయత్రి మంత్ర విశిష్టత

వి. గాయత్రి మంత్రం గురించి కాస్త వివరించండి స్వామి.

స్వా. గాయత్రీ శక్తి విశ్వవ్యాపక శక్తి. ఆ శక్తితో సంబంధము ఏర్పరచుకున్న యెడల సూక్ష్మ ప్రకృతి స్వాధీనమగును.

వి. దాని వలన మానవుడు ఏమి పొందగలడు?

స్వా. దాని వలన భౌతికము, మానసికము, ఆత్మకు సంబంధించిన అన్ని **క్షేత్రములలో**ని అన్నీ సంపదలను పొందుటకు వీలు కలిపిస్తుంది.

వి. అంటే ఏ రకంగా స్వామి?

స్వా. శరీరము నందలి విభిన్న అంగముల నుండి నాడులు శరీరమునందు అంతటనూ వ్యాపించి ఉండును.

కొన్ని నాడులు కలిసిన యెడల **గ్రంథి** అని పిలవబడును. మానవ శరీరము నందలి వివిధ గ్రంధుల యందు వివిధ శక్తులు కలిసిపోయి ఉండును. ఆయా మంత్రములను జపించుట వలన ఆయా గ్రంధుల యందు కలిసిపోయి ఉన్న శక్తులు బయటకు బహిర్గతపర్చబడును.

**ఓం** - అనునది ఉచ్ఛరించినపుడు శిరస్సు పైన ఆరు అంగుళముల ప్రాంతమునందును

**భూర్భువ** - అనుదానిని ఉచ్ఛరించినపుడు కుడి కన్నుకు పైన నాలుగు అంగుళముల ప్రాంతమునందును

**భువ** - అనుదానిని ఉచ్ఛరించినపుడు మానవుని త్రినేత్రము పైన మూడు అంగుళముల ప్రాంతమునందును

**స్వః** - అనుదానిని ఉచ్ఛరించినపుడు ఎడమ కన్నుకు పైన నాలుగు అంగుళముల ప్రాంతమునందును

**తత్** - ఆజ్ఞా చక్రము ప్రాంతమునందున "తాపిని" అను గ్రంధి యందు నిబిడీకృతమైయున్న "సాఫల్య" శక్తిని మేల్కొల్పుటకు సహాయం చేయును.

**స** - ఎడము కన్ను యందున్న "సఫలత" అను గ్రంధి యందు కలిసిపోయి ఉన్న "పరాక్రమము" అను శక్తిని మేల్కొల్పుటకు

**వి** - కుడి కన్ను యందున్న "విశ్వ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "పాలన" అను శక్తిని మేల్కొల్పుటకు

**తుర్** - ఎడమ చెవి యందున్న "తుష్టి" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "మంగళకరము" అను శక్తిని మేల్కొల్పుటకు

**వ** - కుడి చెవి యందున్న "వరద" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "యోగము" అను శక్తి యొక్క సిద్ధి కొరకు

**రే** - నాశికామూలము యందున్న "రేవతి" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "ప్రేమ" అను శక్తి యొక్క సిద్ధి కొరకు

**ణి** - పై పెదవి యందున్న "సూక్ష్మ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "ఘన" అను సంజ్ఞ కల శక్తిని జాగృతము చేయుటకు

**యం** - క్రింద పెదవి యందున్న "జ్ఞాన" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "తేజము" అను శక్తిని జాగృతము చేయుటకు

**భర్** - కంఠము నందున్న "భర్గ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "రక్షణ" అను శక్తిని జాగృతము చేయుటకు

**గో** - కంఠకూపము నందున్న "గోమతి" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "బుద్ధి" అను శక్తి యొక్క సిద్ధి కొరకు

**దే** - ఎడమ వైపు ఛాతి యొక్క అగ్రభాగము నందున్న "దేవిక" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "గమనము" అను శక్తిని జాగృతము చేయుటకు

**వ** - కుడివైపు వైపు ఛాతి యొక్క అగ్రభాగము నందున్న "వారాహి" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "నిష్ఠ" అను సిద్ధి కొరకు

**స్య** - ఉదరమునకు పైభాగమున చివరి ప్రక్కటెముకలు కలియు స్థానమున ఉన్న "సింహిని" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "ధారణ" అను శక్తిని మేల్కొల్పుటకు

**ధీ** - కాలేయము నందున్న "ధ్యాన" అను గ్రంధి యందు నిబిడీకృతమై ఉన్న "ప్రాణ" అను శక్తిని జాగృతము చేయుటకు

**మ** - ప్లీహము నందున్న "మర్యాద" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "సంయమ" అను శక్తిని మేల్కొల్పుటకు

**హి** - నాభి యందున్న "స్ఫుట" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "తపో" అను శక్తిని మేల్కొల్పుటకు

**ధి** - వెన్నుబాము చివరి బాగము నందున్న "మేధా" అను గ్రంధి యందు నిబిడీకృతమై ఉన్న "దూరదర్శిత" అను శక్తిని జాగృతము చేయుటకు

**యో** - యడమ భుజము నందున్న "యోగమాయ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "అంతర్నిహితము" అను శక్తిని మేల్కొల్పుటకు

**యో** - కుడి భుజము నందున్న "యోగిని" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "ఉత్పాదన" అను శక్తిని మేల్కొల్పుటకు

**నః** - కుడి మోచేయు యందున్న "ధారిణి" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "సరసతా" అను శక్తిని మేల్కొల్పుటకు

**ప్ర** - ఎడమ మోచేయి యందున్న "ప్రభావ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "ఆదర్శ" అను శక్తిని మేల్కొల్పుటకు

**చో** - కుడి మణికట్టు నందున్న "ఊష్మ" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "సాహసము" అను శక్తిని మేల్కొల్పుటకు

**ద** - కుడి అరచేతి యందున్న "దృశ్య" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "వివేకము" అను శక్తిని మేల్కొల్పుటకు

**యాత్** - యడమ అరచేతి యందున్న "నిరంజన" అను గ్రంధి యందు ఇమిడి ఉన్న "సేవ" అనే శక్తిని మేల్కొల్పుటకు

ఈ విధంగా గాయత్రీ మంత్రము యందలి 24 అక్షరములకునూ మన శరీరము నందు వివిధ ప్రాంతములనందు గల 24 గ్రంధులకును, ఆ గ్రంధుల యందు ఇమిడి యున్న 24 రకాలైన శక్తులకునూ సన్నిహిత సంబంధము కలదు. 9 అను సంఖ్య మార్పులకు లోను కాని బ్రహ్మ తత్వాన్ని సూచిస్తుంది. ఎనిమిది అను సంఖ్య మాయా తత్వాన్ని సూచిస్తుంది.

1. ఏ కారణాల వల్ల మేము మనస్సును అదుపుచేయలేకపోతున్నాము స్వామి?

   మీరు ఈ కారణాల వల్ల మనస్సును నిలుపలేకపోతున్నారు:

   i. వ్యాధి - అంటే శారీరకంగా సహకరించకపోవడం.
   ii. మనస్సు యొక్క జడత్వం.
   iii. సంశయం - ఒక వస్తువు ఇలాంటిదా? అలాంటిదా? అనే ఆలోచన. ఈ విధంగా ప్రవర్తిస్తే ఇష్టార్థం సిద్ధిస్తుందో లేదో అని సందేహం.
   iv. ప్రమాదం - అంటే యోగానికి దారితీసే మార్గాన్ని అనుసరించకపోవటం.
   v. అలసట - తమోగుణం ఆధిక్యత వల్ల శ్రద్ధా ప్రయత్నాలు లోపించడము.
   vi. అనురాగం - అంటే ఇంద్రియ విషయాల చేత ఆకర్షించబడటం.
   vii. భ్రాంతి - ఒక వస్తువుని మరొకటిగా పొరబడటం.
   viii. భూమికలను అందుకోజాలక పోవటం - అంటే సమాధి స్థితి లోని అత్యున్నత **క్షేత్రాలను** అందుకో

లేక పోవటం.

ix. సమాధి స్థితి భ్రంశం - అంటే సమాధి స్థితిని అందుకొని, ఆ స్థితిలో ఎక్కువ సేపు ఉండలేకపోవటం.

ఈ తొమ్మిది మనస్సును చలింపచేస్తాయి. ఈ అడ్డంకులన్నీ ఓంకారాన్ని ధ్యానిస్తే తొలిగిపోతాయి.

2. మనస్సు అదుపులోకి ఎలా వస్తుంది స్వామి?

మనస్సు అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల అదుపులోకి వస్తుంది. అంతే కాక వివేక సాధనల మెల్ల మెల్లగా మనస్సును ఇంద్రియ విషయాల నుంచి మరల్చి ఆత్మలోనే పూర్తిగా నిలిపి అభ్యాసం జాగ్రత్తగా నిరంతరం ధీర్ఘకాలం సాగిస్తుంటే చిత్తం ఏకాగ్రమై సుస్థిరమౌతుంది.

3. చిత్తమును ఏకాగ్రత కావించుట ఎలా స్వామి?

చిత్తాన్ని సుస్థిరమైన ఏకాగ్రతనొందించడం అతి ముఖ్యం. లేత చెట్ల చుట్టూ కంచె వెయ్యాలి. అవి పెరిగి మహా వృక్షములయ్యాక వాటికి అలాంటి సంరక్షణ అవసరం లేదు. ఆదర్శ విషయంగా సుస్థిరత ఉండటం అవసరం. ఏదో ఒక మార్గం సరి అయినది అని నీ బుద్ధికి ఎప్పుడు నిశ్చయం కలుగుతుందో అప్పుడు దాన్ని అనుసరించటానికై ప్రాణాలనైనా అర్పించటానికి సిద్ధపడి ఉండాలి. శీలంలో నిస్చయాత్మికత్వము అత్యావశ్యకము. భగవంతుడిని శరణు చొచ్చితే మనస్సు యొక్క కేంద్రీకరణాన్ని అడ్డగించే కారణాలన్నీ నశించి <u>**ఆత్మసాక్షాత్కారం**</u> సిద్ధిస్తుంది.

4. స్వామీ! మనస్సును నిష్కల్మషం చేయుట ఎట్లు?

సునిశిత బుద్ధి చేత, స్వచ్ఛమైన మనస్సు చేత మాత్రమే ఆత్మను గ్రహించగలరు. మనస్సు వెంటబడే ఆహార పదార్థాలను దొరకనీయకుండా ఆరోగ్యకరమైన తిండి అంటే భగవత్ విచారణ అన్నదానిని పెట్టడం ద్వారా శాశ్వత, అశాశ్వతముల విచక్షణకు పూనుకున్నట్లైతే బుద్ధి కూడా పదునెక్కుతుంది. భగవంతుని మీద, ఆయన నామం మీద, ఆయన రూపం మీద నీ ఆలోచనలు లగ్నం అవ్వాలి. అలా

చేసినట్లైతే నీవు ఎప్పుడూ స్వచ్ఛము, శాశ్వతము అయినదాని వెంట ఉన్నట్లు గ్రహించ గలుగుతావు. అప్పుడు నీవు స్వచ్ఛము శాశ్వతమైన ఆనందాన్ని పొందుతావు. అందువల్లనే నేను సాధనగా నామస్మరణకు అంత ప్రాధాన్యతను ఇస్తాను. స్మరణకు, మననకు ఒక నామాన్ని, ఒక రూపాన్ని ఎన్నుకో. కాని ఇతర నామ రూపాలను గురించి చెడు మాట్లాడకు. సమిష్టి కుటుంబము లోని స్త్రీ వలే ప్రవర్తించు. ఆమె మామగారిని, ఆయన సోదరులను, తన బావగార్లను గౌరవిస్తుంది, చూస్తుంది. కాని ఆమె హృదయం మాత్రం తన భర్తపై నిలుపుతుంది. అంటే నీవు ఏ రూపాన్ని, ఏ నామాన్ని ఎన్నుకున్నా నీ హృదయస్థానం నీవు ఎన్నుకున్న రూపం మీదే ఉంటుంది. అప్పుడు ఆ రూపాన్ని, ఆ నామాన్ని విడువలేని స్థితి వస్తుంది. మనస్సు హరియించబడుతుంది.

5. సాధనలో విజయాన్ని పొందాలంటే ఏవి అవసరం స్వామి?

సాధనలో విజయం పొందాలంటే క్రమశిక్షణ అవసరం. ఈ ప్రపంచంలో విజయాన్ని సాధించాలంటే ఆత్మవిశ్వాసాన్ని, ఆ తరువాత ఆత్మత్యాగాన్ని కలిగి ఉండాలి. ఈ మూడు విషయాలు లేకుంటే నీ జీవితం అర్థం లేనిది. నది అడ్డదిడ్డంగా ప్రవహిస్తే దానికొక ఆనకట్ట కడతాం. అది సముద్రంలో కలిసే లోపల దానిని పనికి వచ్చేటట్లుగా వాడుకుంటాము. అలాగే వాటి ఇష్టం వచ్చినట్లు లక్ష్యం లేకుండా వచ్చే ఆలోచలను సాధనా అన్న ఆనకట్ట ద్వారా క్రమబద్ధం చెయ్యాలి. త్యాగము అనే రూపాన్ని అవి పొంది ఆత్మవిశ్వాసం అనే సముద్రంలో కలిసేటట్లు చెయ్యాలి. త్యాగము, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అనే త్రిగుణాలను సాధించాలంటే ఇది ఎంతో అవసరమని గ్రహించాలి. ఎంత మంచి వంట అయినా ఒక్క కిరోసిన్ చుక్కతో పాడవుతుంది. కావున ఎంత సాధన అయినా క్రమశిక్షణ అనేది లేనప్పుడు నిష్ఫలమౌతుంది.

6. ఆధ్యాత్మిక అభివృద్ధి ఎలా ఉండాలి? దానిని ఎలా సాధించాలి స్వామి?

నీవు బడిలో ఏ తరగతికి తగ్గ వాడివో నిర్ణయించుకున్నట్లుగానే, నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఏ దశకు వచ్చిందో నీకు నీవే తెలుసుకోవాలి. ఆ తర్వాతా ఆ తరగతి నుండి పై తరగతికి వెళ్ళడానికి నిశ్చయించుకోవాలి. నీ శక్తిని అంతా ఉపయోగించి ప్రయత్నించాలి. అప్పుడు నీవు తప్పక భగవత్ అనుగ్రహం పొందగలుగుతావు. బేరాలు పెట్టవద్దు, నిరుత్సాహ పడవద్దు. దారి తప్పకుండా లక్ష్యం వైపుకు

ఒకొక్క అడుగు వేస్తే చాలు. నిన్ను అహంకారం లోకి లాగేసే ఐశ్వర్యము, పాండిత్య గర్వము, పదవీ గర్వము విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇతరుల దోషాలను వెతకవద్దు. నీ దోషాలనే వెతుకు.

7. సాధన ఎలా ఉండాలి స్వామి?

సాధనా దిశగా ఎదగాలి అని నిర్ణయించుకున్నాక ఒక్కసారి కూడా చెలించకుండా సాధనలో నిశ్చలంగా ఉండాలి. బస్సు కదలికలో ఉన్నప్పుడు దాని వెనక దుమ్ము మబ్బులాగా ఎగురుతూ వస్తూ ఉంటుంది. కానీ అది ఒక్కసారిగా ఆగినపుడు దుమ్ము ప్రయాణికుల ముఖాల మీద పడ్తుంది. కావున ఎప్పుడూ కదులుతూ ఉండు. అనగా సాధనలో స్థిరంగా మునుగు. అప్పుడు ఆ విషయ ప్రపంచపు ధూళి మేఘం నీ ముఖాన్ని కప్పదు. విషయ వాసనలు ఆవరించి ప్రయాణంలో ముందుకు సాగకపోతే ఈ దుమ్ము ధూళితో సదా నిండిపోవలసి ఉంటుంది. జీవితంలో ఎన్నో గొప్పవి సాధించారు. అవి సాధించటానికి ఎంతగానో కష్టపడతారు. కానీ 16 నుండి 30 సం|| వయస్సు ఎంతో ముఖ్యమైనది. ఈ వయస్సు చేజారిపోతే మళ్ళీ ఎప్పుడూ తిరిగిరాదు. తప్పుడు మార్గాల్లోకి వెళ్ళనే కూడదు. ఈ వయస్సులో భగవంతుని దివ్యమైన అడుగుజాడల్లో నడవవలసి ఉంటుంది. తెలుసుకున్నంత మాత్రాన చాలదు. వాటిని ఆచరణలో పెట్టాలి. సంతోషమయమైన జీవనానికి నైతిక జీవనం అత్యుత్తమమైన విధిగా దాన్ని అమలుపర్చాలి. కొన్ని సమయాల్లో ఒక అనుభవం దుఃఖాన్ని ఇస్తుంది. కాని అదే అనుభవం ఒక్కోసారి సంతోషాన్ని ఇస్తుంది. కారణం మనస్సు. ఈ మనస్సుకున్న స్వభావం చంచలత్వ గుణం. ఈ గుణాన్ని అరికట్టి చిక్కిన సమయాన్ని సద్వినియోగపర్చుకోవాలి. మార్గము చెప్పేవారు, చూపే వారు లేక బాధ పడ్తున్నవారు ఎందరో. భగవంతుడే మార్గదర్శకత్వం వహిస్తున్నప్పుడు ఈ ఉపేక్ష దేనికి ? నిన్ను తీరం చేర్చడేమో అన్న అపనమ్మకమా? లే! లేచి మాలిన్యాన్ని కడిగి ఒక్కసారిగా పవిత్రంగా తయారవ్వు.

8. సాధనలో పాటించవలసిన నియమాలు ఏమిటి స్వామి?

i. నిజానికి **ఆత్మసాక్షాత్కారానికి** క్రమశిక్షణ అనేది తొలిమెట్టు. అనగా మొదటి మెట్టు. దీన్ని ఈ శిక్షణా కాలంలో ఎందుకు తొలిమెట్టు అంటున్నాన్నంటే, ఈ వేళ చాలా మంది జనం కష్టాలను, అసౌకర్యాలను భరించలేక పోయినా మహా విషయాలను, ఘనమైన విషయాలను పొందాలని మాత్రం కోరుకోవడం వల్లనే.

నీకు నీవుగా అర్పితమయ్యే క్రమశిక్షణ నిన్ను సంతోషము, ఆనందాల వైపుకు తీసుకొని వెళ్తుంది.

ii. గురుత్వాకర్షణ శక్తి ప్రతీదాన్ని ఎలా క్రిందకు లాగివేస్తుందో అలాగే మీలో ఉన్న తమస్సు అనేది మిమ్మల్ని నిరంతరం క్రిందకు దిగజారుస్తుంది. కావున మీరు నిరంతరం జాగరూకతతో చురుకుగా ఉండాలి.

iii. ఇత్తడి గిన్నె ఎలా తోమాలో అలాగే సాధన ద్వారా అంటే జపము లేక ధ్యానాల ద్వారా మనస్సును తోమాలి. నీవు ఎప్పుడూ క్రమశిక్షణ అన్న అలవాటును వదలవద్దు. పరిపూర్ణ స్థితికి చేరినాక నియమాల విషయము, క్రమశిక్షణ విషయము ఆలోచించవలసిన అవసరం లేదు. ఎప్పుడైతే ధ్యానం చేయుటకు ఒక రూపన్నో, వస్తువునో తీసుకుంటావో ధ్యానం చేసే వ్యక్తి, ధ్యేయము అంటే ధ్యాన వస్తువు, ధ్యానించడము ఏకమై కలిసిపోవాలి. అప్పుడే విజయం ప్రాప్తిస్తుంది. ధ్యానంలో ఏకాగ్రతను పరిపూర్ణంగా పొందవచ్చు. నా ఆజ్ఞను శిరసావహించు భక్తుడు అనుసరించవలసిన మార్గము ఇదే. ఎన్నడూ సందేహించకు. నీకు డ్యూటీ ఎక్కడ వేసినా అనగా క్యాంటీన్లో కాని, బయట కానీ కుల్వంత్ హాలు నందు కాని ఎచట అయినా డ్యూటీ డ్యూటీయే కదా? ఈ సేవ భగవంతుని సేవయే. కానీ నీవు నిరుత్సాహపడకూడదు. దర్శనం లేదు, నేను ఏదో పొందాలనుకున్నాను దాన్ని పొందలేకపోతున్నానని బాధ పడనక్కర్లేదు. నేను దర్శనం ఇవ్వాలనుకుంటే నాకు ఎలాంటి అడ్డంకులూ లేవు. ఇటువంటి ఆలోచనల ద్వారా ఆధ్యాత్మిక లాభాన్ని ఎక్కువగా పొందగలవు.

9. క్లిష్ట పరిస్థితులను భక్తులు ఎలా ఎదురుకోవాలి స్వామి?

నష్టముగానో, ప్రమాదంలాగానో కనిపించే దాని చేత విచారంలో మునిగినపుడు నామస్మరణతో భగవన్నామాన్ని జపించడము, జ్ఞప్తికి తెచ్చుకోవడము, కీర్తించడంలో మునిగిపో. అది నీకు విశ్వాసాన్ని, ధైర్యాన్ని, సత్యమైన ఆదర్శాన్ని ఇస్తుంది. ప్రమాదాలు, కష్టాలు భగవంతునికి సమీపంగా చేరేవారిలో ఎక్కువగా కనబడుతాయి. కాని ఎటువంటి తుఫానులనైనా భరించగల స్థితిని భగవంతుడు అందచేస్తాడని జ్ఞాపకం చేసుకోండి. జనం వాళ్ళను చూచి పరిహసిస్తారు. పిచ్చివాళ్ళు అని అంటారు. కాని, తాము భగవంతుని అనుగ్రహమనే ఆసుపత్రిలో ఉన్న విషయం వారికి తెలుసు. తమ విధివ్రాత మీద వారికి పూర్తి నమ్మకం ఉన్నది. భగవంతుని మీద నమ్మకం ఉన్నది. కావున వాళ్ల మీద విషంక్రక్కే సమయాన్ని కూడా నవ్వుతూ తీసిపారేస్తారు. ఎందుకంటే తమలో గుప్తంగా ఉన్న ఆత్మశక్తిని తెలుసుకోవడమే కారణం.

10. ఆధాత్మిక స్థితిలో సాధకునికి సాధకునికీ మధ్య పోలిక ఉండవచ్చునా స్వామి?

ఆధ్యాత్మిక సాధనను నేను మొదలుపెట్టి ఇన్ని సంవత్సరాలు అయ్యింది అన్ని సంవత్సరాలు అయ్యింది అని గోల చెయ్యవచ్చు. ఎన్నో సంవత్సరాల నుండి నేను స్వామి వద్దకు వస్తున్నాను, కానీ నాకన్నా వెనక వచ్చిన వీరి స్థితి పెరిగింది. నా స్థితి ఏమిటి ? అని బాధ పడుతూ ఆ బాధను అసూయగా మార్చుకుని సాధనా స్థితిని మర్చి తోటి సాధకునిపై విషంక్రక్కే ప్రయత్నంలో తాను సాధించుకున్నదానిని కూడా నిష్ప్రయోజనం చేసుకుంటున్నాడు. ఒక రాతి మీద ఇరవై దెబ్బలు కొట్టావు. కానీ అది విరగలేదు. మరొకరు వచ్చి కొడితే రెండు దెబ్బలకే అది విరిగింది. అంటే ఆ రాయి ఇరవైరెండు దెబ్బలకు విరిగింది. అదే రీతిలో గత జన్మలో నుంచి ఈ జన్మలోకి వచ్చిన కారణ శరీరంలో పూర్వం చేసిన సాధన దాచుకుని ఈ జన్మలో ఆ స్థితిని అనుభవించుట జరుగుతుంది. మానవుని జీవనానికి ఇదే పరమార్థం.

11. సాధనలో ముందడుగు వేయుటకు ఎటువంటి నియమాలను పాటించాలి స్వామి?

ఉత్తమ శ్రేణి జీవితానికి అంకితమైన వాళ్ళే నీ చుట్టూతా ఉండేలా చూసుకో. వాళ్ళు నీ యొక్క లక్ష్య సాధనకు ముందుకు పోవటానికి ప్రోత్సాహం ఇస్తారు. దీని వల్ల చిత్తసుద్ధిని పొందగలవు. ఔషధం పూర్తిగా పనిచెయ్యాలంటే వైద్యుడు చెప్పే కఠిన పథ్యాన్ని పూర్తిగా పాటించాలి. నువ్వు పుట్టపర్తి లేక ఇంకేదైనా **పుణ్యక్షేత్రానికి** వెళ్ళినా "నీ కారు" బ్యాటరీ **ఛార్జ్** అవుతుంది. లేక కనీసం నీ యాత్రకు లక్ష్యమైనా అవుతుంది. నీ సాధనా అనే బ్యాటరీని **ఛార్జ్** చేసుకో. ఆ తరువాత నీ స్థానానికి వెళ్ళాక కారుని పనిలేకుండా ఉంచకు. అట్లా చేస్తే బ్యాటరిలో శక్తి తగ్గిపోతుంది. కారుని బయటకు తీసి నడుపుతూ ఉండు. అప్పుడు బ్యాటరీ దానంతట అదే **ఛార్జ్** అవుతుంది. అట్లాగే సత్సంగము, సత్ప్రవర్తన, భజన, నామస్మరణ, సద్గ్రంధపఠనము ఇత్యాదివి కొనసాగించకపోతే ఈ **ఛార్జ్** అంతా వ్యర్థమైపోతుంది. ఈ రోజుల్లో మనిషికి ఇష్టం వచ్చినట్లుగా చేయడం, ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం అలవాటయ్యింది. అంతఃకరణ చేత కానీ, నైతికమైన విలువలతో కానీ, మర్యాద చేత కానీ నిగ్రహించడం లేదు. ఔషధము అన్నది అనారోగ్యవంతుడికి కానీ ఆరోగ్యవంతుడికి కాదు, పూర్తిగా చచ్చినవాడికి కాదు. సందేహాలు, కుతూహాలతో పరితపిస్తున్న వాళ్ళకు కానీ వేరే వాళ్ళకు సలహాలు ఎందుకు? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనేవి లోనికి దూరి నీ మీద అధికారం చెలాయిస్తాయి. మనిషి ఎంతటి భ్రమలో పడ్డాడంటే దొంగతనంగా లోపలకు దూరిన

ఆ దొంగలనే ఇంటి యజమానులుగా సన్మానించుతాడు. మేలుకో! లే! ఈ దొంగల్ని ఎదుర్కొనలేకపోతే వాళ్ళే నీ నిధిని కొల్లకొడ్తారు. ఇచ్చిన ఈ సదవకాశాన్ని సద్వినియోగపర్చుకోవలసిన సమయాన్ని వదులుకోవద్దు.

12. సాధకునికి ఎదురయ్యే అవరోధాలు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి స్వామి?

క్రోధము, గర్వము మొదలైన ఇతర ఉద్రేకాలు నిన్ను ఒక పిచ్చివాని స్థాయికి తగ్గిస్తాయి. ఒకొక్కప్పుడు పశుస్థాయికి తగ్గించివేస్తాయి. కావున మనిషి లోపలే ఉన్న విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానాలను గుర్తించి వాటిని సరి అయిన దారిలోకి మళ్ళించి ఉన్నతోన్నతమైన ఆనందాన్ని పొందాలి. నీ ఇంద్రియాల మీద ఆధిపత్యం పోగొట్టుకోవడమే సర్వ కష్టాలకు, తికమకలకు, అలజడులకు కారణం. ఇంద్రియాలను ఇష్టం వచ్చినట్లుగా పోనిస్తారు. ఇంద్రియాలను అడ్డంకి లేకుండా అక్రమంగా వదిలిపెట్టడంతో సరిగ్గా విచక్షణ చూపలేకపోతారు. శాంతంగా, నెమ్మదిగా ఆలోచించలేకపోతారు. అలా అనేక మార్లు తప్పుడు పనులలోకి ఆలోచనలలోకి పోతారు. క్రోధము అన్నది మత్తు పదార్థం లాంటిది. తప్పుడు పనులు చెయ్యమని అది లోపల ప్రేరేపిస్తుంది. సర్వ పాపాలకు అది మూలము. అదొక పెద్ద రాక్షసి. క్రోధము ఇతర పాపాలన్నింటినీ చేయుటకు దారి తీస్తుంది. మనకు తెలుసు. విశ్వామిత్రుడు తపస్సుతో సాధించిన మంచి అంతా క్రోధం అన్న ఒక్క చెడ్డతో లేకుండా పోయింది. క్రోధం కల్గిన ఒక్క క్షణంలో వేల సంవత్సరాలు తపస్సు చేసి సాధించిన పుణ్యం అంతా పోయింది. నీకు అడ్డుపడిన పొరను తొలిగించు. నిన్ను క్రింద స్థాయికి దించుతున్న వాటిని కనుగొని సమూలంగా నాశనం చెయ్యి. నీవు ఆత్మస్వరూపునిగా, నిత్యస్వరూపునిగా, ఆనందస్వరూపునిగా భావించుకో. అప్పుడు నీ ప్రతీ కర్మ ఒక యజ్ఞంగా ఒక పూజగా మారుతుంది. నీ చెవి, కన్ను, నాలుక, పాదం అన్ని నిన్ను నాశనం చేసే ఉచ్చులు కాకుండా నీ ఉద్ధరణకు సాధనాలవుతాయి. తమోగుణాన్ని తపోగుణంగా మార్చి నిన్ను **<u>రక్షించుకో</u>**. నీ హృదయాన్ని తెరువు. దాంతో పరంజ్యోతి ప్రకాశం లభిస్తుంది.

13. మనస్సుని నిగ్రహించుట ఎలా స్వామి?

నీవు అవిద్యలో ఉన్నంత కాలం అనగా శిక్షకుడివి కాకుండా అజ్ఞానంలో ఉన్నంత కాలమూ

సచ్చిదానందాన్ని రుచి చూడలేవు. ఇంద్రియ సుఖాల వెంట పరిగెత్తే ఈ మర్కట బుద్ధిని మనిషి ఎలా నిగ్రహించగలుగుతాడని తుకారాంని ప్రశ్నించినపుడు అతను సమాధానం చెబుతూ ఆ కోతిని పరిగెత్తనీయి కాని నీవు మాత్రం ఎక్కడున్నావో నిశ్శబ్దంగా అక్కడే ఉండు. ఆ మర్కట బుద్ధి వెంట దేహాన్ని పోనియ్యకు. ఆ మనస్సుకి ఇలా చెప్పు. "ఈ దేహాన్ని నీకొక నౌకరుగా ఇవ్వను" అని. అప్పుడు మనస్సు నిగ్రహించబడి ఓడిపోతుంది. ఇంటిని పడగొట్టటానికి ఎట్లా ఒక పద్ధతి ఉన్నదో సరిగ్గా అట్లాగే సంక్లిష్టమైన మనస్సనే సమస్యను కూలకొట్టటానికి కూడా ఉన్నది.

14. సాధనకు స్థల ప్రభావం ఉంటుందా స్వామి?

సాధకుడు అన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించవలసిందే. తన జీవితాన్ని గడిపే స్థల ప్రభావం కూడా ఉంటుంది. ఒకసారి నేను చెప్పాను. మధుర, కాశి ఇతర **<u>పుణ్యక్షేత్రాలలో</u>** మనకు లభించే ప్రశాంతిని గురించి చెబుతూ సముద్రంలో కలిసే స్థలం దాకా గంగా నది ప్రతీ అంగుళము ప్రవిత్రమే అయినప్పటికీ హృషీకేశము, హరిద్వారము, కాశీ నగరము మొదలుగున్నటువంటి దాని తీరంలో కొన్ని స్థలాలు ఆధ్యాత్మిక తరంగాలు ప్రత్యేకంగా నిండి సాధకునికి అతని సాధనను అన్ని స్థాయిలలో శుద్ధి చేసుకోవడానికి తోడ్పడుతుంది. ఏకాగ్రత సాధించే సాధకుడు జాగ్రత్త వహించాలి.

15. మనిషి జ్ఞానిగా మారటానికి ఏమి చెయ్యాలి?

యోగం అంటే చిత్త వృత్తిని నిరోధించటమే. అంతర్ చైతన్యమనే సరుస్సులోని అన్ని అలజడులను త్రెంపి పారవెయ్యాలి. ప్రశాంతం ఉపరితలం మీద కానీ, ప్రశాంతమైన చైతన్యపు లోతుల్లో కానీ, ఆవేశము, కాంక్షల యొక్క తరంగాలను సృష్టించుకోకూడదు. జ్ఞానానికి ఈ సమస్థితే గుర్తు. చాంచల్యాలన్నింటిని కుదర్చటానికి సాధన అన్నది మందు. వివేక విచారణ అన్నది పథ్యం. అంటే మీ లోపల ఉన్న మాలిన్యాన్ని కడిగి వెయ్యాలి.

16. భక్తి అంటే ఏమిటి స్వామి?

మనస్సు, అభీష్టములు సర్వమూ భగవంతునికి అర్పితం చేసి ఆయన అనుగ్రహ నిమిత్తమై

ప్రాకులాడటమే భక్తి. భక్తి అనగా కొలువు అని అర్ధం. సేవ అని రెండవ అర్ధం. మూడవది భయంతో కూడిన స్నేహం అని అర్ధం. భగవంతునితో విడిపడనిదే భక్తి. ఎట్టి సమయమునందైనా, ఎట్టి ప్రదేశమునందైనా, ఎట్టి కాలమునందైనా, ఎట్టి విషయమునందైనా భగవంతునితో ఏమాత్రమూ ఎడబాటు సంభవించ కూడదు. భక్తి అనగా ఒక్క మాటలో చెప్పాలంటే కృతజ్ఞత. భక్తి అనే వత్తి లేకపోతే మానవుని జీవన జ్యోతి వెలగదు. సంస్కారవంతులుగా తయారు కావాలి. సంస్కారమనగా నీలో ఉన్న దురభ్యాసములను, దుర్గుణములను, దురాలోచనములను దూరం చేసుకొని సదభ్యాసములు, సద్గుణములు అభివృద్ధి పర్చుకోవాలి. మీరు మంచి వారు కావాలి కాని గొప్పవారు కానక్కర్లేదు.

## 17. మానవ జీవితంలో విశ్వాసం యొక్క ప్రాధాన్యత ఎట్టిది?

జీవుడు తాను నివసిస్తున్న ఇంటిని కట్టుకునే ప్రయత్నం ప్రారంభించి చివరకు కట్టాలన్న నిర్ణయంతో గోడలు కట్టి దానిని చూచి చాలా బాగా కట్టాను అన్న సంతృప్తిని వ్యక్తపరుస్తాడు. కానీ చుట్టూ ఉన్న గోడల్ని చూచి సంతృప్తి పడితే పైన కప్పులేకపోతే నీవు ఎంత కట్టినా వ్యర్ధమే కదా? చలువరాతి గోడలు కట్టావు. చాలా ఖరీదైన పద్ధతిలో నీవు కట్టుబడి చేస్తున్నావు అంటే నీవు జీవితానికి కావలసిన విలువలతో గోడలు కట్టావు. కానీ విశ్వాసం అనే పైకప్పు వేసుకోవడం మర్చినట్లైతే ఆ ఇంట్లో నీవు ఉండుటకు వీలు కాదు కదా? నీవు ఉండుటకు వీలుకల్పించేదే విశ్వాసము. ఈ విశ్వాసమే భగవత్ సాన్నిధ్యము. మిమ్మల్ని దారి తప్పించే ఆకర్షణలు చాలా ఉంటాయి. మనస్సును అంధకారం ఆవరిస్తున్నప్పుడు నీ యొక్క అడుగులకు వెలుగు చూపే ఏ చిన్న దీపమునైనా స్వాగతించవలసిందే. అటువంటి స్థితిని ఈ రోజు భగవంతుడు మీ మీద అత్యంత ప్రేమతో అందించాడు. దీనిని అందుకొనుటకు మీరు సంసిద్ధులై ఉండాలి.

## 18. మనస్సును ఉత్తేజపర్చుట ఎలా స్వామి?

ఉత్తేజము అంటే అపరిమితమైన ఉత్సాహంతో శక్తితో నీవు చెయ్యగలిగింది చెయ్యగలగటమే. ఆ స్థితి నీ యొక్క మనస్సును బుజ్జగించి మంచి అలవాట్లను కొంచంగా రుచి చూపించి ఇది చాలా మధురంగా ఉంటుంది, ఒక్కసారి తిని చూడు దీని శక్తి కూడా నీకు తెలుస్తుంది. మహా కొండలని కూడా పిండి చెయ్యగలదు, అంతటి శక్తివంతమైన ఆహారాన్ని ఎందుకు త్రుణీకరిస్తున్నావు? నీవు నేను చెప్పినట్లే

విన్నట్లైతే, నీ స్థితి నా స్థితి బాగుపడ్తాయి అని మనస్సుని బుజ్జగించి చెప్పుట ప్రారంభిస్తే అది చిన్న పిల్లవానివలె నీ మాటలకు, నీ మంచితనానికి నవ్వుకుంటూ లొంగిపొయ్యి నీవు చెప్పిందల్లా చేయుటకు సంసిద్ధమయ్యి ఎక్కువ ఉత్సాహంగా ముందుకు వచ్చి ఆ ఉత్తేజంలో నీవు చెయ్యాలనుకున్న సాధనా అనే రోడ్డు పైకి తీసుక వచ్చి నిత్య సంతోషము అనే వాహనంలో కూర్చుండబెడ్తుంది. సరైన వాహనంలో ఎక్కినాక సరైన సమయానికి నిన్ను గమ్యం చేర్చుట దాని పని. కానీ దేనికైనా కృషి, పట్టుదల ముఖ్యం. విషపూరితమైన నాగుపాము కూడా నాద స్వరం వినగానే సర్వమూ మరచి నాట్యం చేయుట ప్రారంభిస్తుంది. అలాగే మృదుమధురమైన భగవంతుని నామస్మరణ శాంత స్వరంతో మంద్రంగా వినిపించేటట్లుగా చేసావనుకో మొదట వింటుంది తర్వాతా శాంతి లభించి కొంచం తన్మయత్వం కలుగుతుంది. చివరకు నీవు తలచే రూపం నీ కళ్ళ ఎదుట నిలిచి నీ లోపల నృత్యం చేయుట అనగా ఆనంద శిఖరాలను అధిరోహిస్తున్న అనుభూతి హృదయానికి అవగతమౌతుంది. ఆ సమయంలో ఈ మనస్సు ప్రక్కన నుండి అంతా గమనిస్తూ తాను కూడా ఉల్లాసంగా మారి ఉత్తేజంగా తయ్యారయ్యి "నిన్ను" ఉత్తేజితుడ్ని చేసి ఉన్నత పథం వైపు ప్రయాణించేటట్లుగా చేస్తుంది.

19. సాధకుడి ఆధ్యాత్మిక ప్రయాణం ఏవిధంగా కొనసాగించాలి స్వామి?

ఒక విషయము గుర్తించుకో. ఒక మొక్కను నీవు పెంచి పోషించాలి అనుకున్నావు. ఆ మొక్క నేవళంగా పెరగాలంటే నీవు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. మొక్క చిన్నగా ఉన్నప్పుడు దానిని పశువులు మేయకుండా ఉండుట కొరకు చుట్టూ కంచెవేసి దానిని **<u>రక్షిస్తావు</u>**. ఇంక కొంచెము పెద్దయిన తర్వాత మొక్కకు ఒక కర్ర ఊతంగా ఇచ్చి మొక్క నిలువుగా పెరుగుటకు చేయూతని ఇస్తావు. తర్వాత మొక్క పైకి ఎగబ్రాకుటకు దారం కట్టి పైకి వెళ్ళుటకు దారం సహాయమందిస్తావు. ఈ తీగకు మధ్య మధ్య ప్రక్క కొమ్మలు వచ్చినపుడు వాటిని కట్ చేస్తే ఒక్క తీగగా పైకి ఎగబ్రాకుటకు ప్రయత్నిస్తుంది. అలాగే జీవి యొక్క స్థితి కూడా. కావున నేవళంగా పెరుగుటకు గురువు యొక్క **<u>గైడెన్స్</u>** అవసరము. తర్వాత ఈ అరిషడ్వర్గాల బారీ పడకుండా అనగా పశువులు మేయకుండా కాపాడవలసిన బాధ్యత గురువుదే. అనగా మొక్క అంటే నీవు దేనిని అయితే సాధనగా ఎన్నుకున్నావో దానిని నీ లోపల పాతిపెట్టినపుడు భూమిలోనుండి వచ్చినట్లు నీ లోపల నుండి చిన్న అంకురంగా మొలకెత్తి నీవు చేస్తున్న సాధన ద్వారా మొక్క పెరగడం మొదలవుతుంది. ఈ మొక్కకు కంచె వెయ్యటమే గురువు పర్యవేక్షణ. దీని ద్వారా మొక్క

సేవళంగా పెరగటానికి గురువు సహాయ సహకారాలను అందిస్తాడు. అంతర్ముఖంగా నీవు చేసే సాధన ద్వారా నాతో అనుభంధం పటిష్టమయ్యి నన్ను చేరే మార్గాన్ని నీవు అభిలషిస్తూ నాకు నీకు మధ్య ఏర్పర్చే దారి ఈ దారము. ఈ దారము ద్వారా నీవు పైకి ఎగబ్రాకుతున్నప్పుడు మధ్య మధ్య ఇంకా మేము ఉన్నాము అంటూ నీ లోపల దాగుకుని ఉన్న అంతర్ శత్రువులు బయటకు వస్తాయి. వాటిని బుద్ధి అనే కత్తెరతో మొలకెత్తగానే కత్తిరించినట్లైతే ఎటువంటి అవరోధాలు లేకుండా మొక్క పైకి ఎగబ్రాకి సచ్చితానందము అనే స్థితికి చేరి సర్వం ఆత్మ స్వరూపంగా అవగతమౌతుంది. ఇలా అవగతమైన జీవి సదా ఆనందాన్ని అనుభవిస్తూ దాన్ని బ్రహ్మానందంగా అనుభవిస్తాడు.

20. ఇంద్రియాలను నిగ్రహించుట ఎలా స్వామి?

ఇంద్రియాలను ఎంత త్వరగా విజృంభింపచేస్తే అంత త్వరగా అలిసిపోతాయి. అప్పుడు వాటికి "చూశావా నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించావు. దీనిలో ఏమైనా ఆనందం ఉన్నదా? లేని దాని కొరకై నీవు ఎందుకు వెంపర్లాడాలి అని అనుకుంటున్నావు? స్వచ్ఛమైన జీవితానికి కావలసినంత ఆనందాన్ని పొందే నిమిత్తమై వచ్చిన ఈ దేహాన్ని ఇలా బ్రష్టు పట్టించే నిమిత్తమై నీవు యోచించే, నీవు చెయ్యాలనుకునే ఈ కార్యాన్ని నేను జరగనివ్వను. ఈ క్షణం నుండి నేను చెప్పింది నీవు వినాలి" అని ఇంద్రియాలను నీ చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలి.

21. ఆశయం నెరవేరుటకు ఏమి చెయ్యాలి స్వామి?

నీవు అడవి లోపలకు ఒక మాను కొరకు వెళ్ళినావు. దొంగతనంగా తెచ్చుకోకూడదు కావున **ఫారెస్ట్** ఆఫీసర్ యొక్క అనుమతి పొందుతావు. నీవు దొంగలించుకుండా అడుగుతున్నావు కావున ఆ ఆఫీసర్ నీ నిజాయితీకి మెచ్చి నీకు ఒక చెట్టు చూపించి దీనిని కొట్టుకు వెళ్ళు, ఇది చాలా మంచి చెట్టు, ఇది పనికి వస్తుంది, చాలా కాలం మన్నుతుంది అని చెప్పి కొట్టుకోవటానికి కావలసిన గొడ్డలి కూడా ఇచ్చాడు. అలసత్వం చేత కొట్టుకోవడం చేతకాకపోతే నీవు ఆఫీసర్ను అడిగి, అనుమతి పొంది, అతను నీ మీద జాలి పడి సెలెక్షన్ చేసి ఇచ్చినందుకు కృతకృత్యుడవు అవుతావు. నీవు కావాలననుకున్న జీవితాన్ని అందుకునే ప్రయత్నము చెయ్యాలి. నీవు కోరుకునే జీవితమే చెట్టు. నీకు నేను విధించిన సాధనయే నీకు

నేను ఇచ్చిన గొడ్డలి. దీంతో చెట్టును కొట్టుకోవటం ప్రారంభించు. ప్రారంభమే లేకపోతే చూస్తూ కూర్చుంటే గొడ్డలే వెళ్ళి చెట్టుని కొడుతుందా? నీవు చేత్తో పట్టుకోవాలి, చెట్టు దగ్గరకు వెళ్ళాలి, కొట్టాలి అన్న సంకల్పం కలగాలి. ఇన్నీ సమకూరితేనే కదా సంకల్పం నెరవేరేది?

22. మోహమును ఛేదించుట ఎలా?

మమకారం అనేది పెద్ద పొద. ఈ పొద లోపల ఎన్నో క్రూర జంతువులు లోపల దాక్కుని ఎప్పుడు నీవు చెయ్యి లోపల పెడతావా అని ఎదురుచూస్తూ కాటువేసే ప్రయత్నము చేస్తూ ఉంటాయి. ఈ మమకారమనే మోహముకు లొంగకూడదు. మమకారమనే పొదలోని క్రూర జంతువుల కాటుకు గురికాకూడదు అంటే వైరాగ్యము అనే సూక్ష్మ బుద్ధి చేత కొంచెం కొంచెం తొలగించటం మొదలుపెట్టగానే లోపల ఉన్న జీవులు ఇచ్చట **<u>క్షేమకరమైన</u>** ప్రదేశం కాదు. ఇంకొక పొద వెతుక్కుందాము అని మరో స్థలాన్ని వెతుక్కొని వెళ్ళిపోతాయి. కావున వైరాగ్యమనేది నిన్ను మోహపాశం నుండి **<u>సురక్షితంగా</u>** బయటకు తీసుకురాగల ఏకైక సాధనం. ఈ సాధనం సంపాధించాలంటే తప్పనిసరిగా గురువు మార్గం చూపవల్సిందే.

23. సాధనలో ఎదురయ్యే శత్రువులు ఏవి స్వామి? వాటి ప్రభావం ఎటువంటిది?

ప్రప్రధమ పెద్ద శత్రువులు మూడు పొంచి ఉంటాయి.

i. కామం

ii. క్రోధం

iii. అభిమానం

ఈ అభిమానం ఎప్పుడూ ఒక్కతి ఉండదు. తన నేస్తమైన క్రోధాన్ని ప్రక్కనే ఉంచుకుంటుంది. ఒక తమాషా ఏమిటంటే ఈ క్రోధమనెడిది అరిషడ్వర్గాలలో అత్యుత్తమమైనది. ఎందుకంటే మిగితా ఐదుగురికి ఏ సమయంలోనైనా, ఏ విషయంలోనైనా సహాయకారిగా ఉంటాను, మీకు అవసరం వచ్చినప్పుడు నా సహకారం తప్పనిసరిగా ఇస్తాను అని వాగ్ధానం చేసి ఉన్నది. అందుకని దేనికైనా సరే వెంటనే ఉండి తన సహాయాన్ని అందించేదాన్లో సిద్ధంగా ఉంటుంది. ఇక కామం అనెడిది ఉన్నదే అది చాలా తమాషా అయినది. ఒక్కసారి అది అడిగినప్పుడు అడిగినది ఇవ్వటం మొదలు పెడితే కామాలు, ఫుల్లాపులు లేకుండా అడగడం

మొదలుపెడ్తుంది. కనీసం ఇది అడగవచ్చా? అడగకూడదా? అనే ఇంగిత జ్ఞానం కూడా మరచి అన్నీ నాకు కావాలి కావాలి కావాలి. ఇదే దాని పని. దాని పని చెయ్యలేదనుకో ప్రక్కనే ఉన్న ఫ్రెండుని (క్రోధాన్ని) పిలిచి నాకు కొంచెం సహాయం చెయ్యి అని అడుగుతుంది. అసలుకే జాలి హృదయం కలిగిన ఫ్రెండ్. నీవు ఇంత అడుగనక్కరలేదు, నేను అడుగకుండానే సహాయమందిస్తాను అలాంటిది అడిగితే కూడా సహాయము చెయ్యకపోతే నేను స్నేహితుడ్ని ఎలా అవుతాను అంటూ తన ప్రేమను ఇంకా ఎక్కువగా అందించటానికి సిద్ధమవుతుంది. ఈ అభిమానమనేది నిన్ను సదా ఆటపట్టించే ఆటవస్తువు. ఎందుకంటే అశాశ్వతమైన దానిని శాశ్వతముగా భావించే స్థితి కల్పించేలా చేసి చివరకు భ్రమ అనెడిది మర్చిపోయి ఇదే శాశ్వితం అనుకునేటట్లుగా చేస్తుంది. దీని మాయా ప్రభావం నుండి బయట పడాలి. ప్రతీక్షణం నీవు అశాశ్వితుడివి నీవు నన్ను ఆటలాడించ వద్దు. శాశ్వితమైన దానిని కనుగొన్నాను. ఈ శాశ్వితమైనవాడు నా నుండి ఏమీ ఆశించుట లేదు. నాలుగు రోజులు ఉండి వెళ్ళే నీవు ఎందుకు ఇన్ని రకాలుగా ఆశిస్తున్నావు? నీవు ఆశించే దాని వల్ల నీకు లాభమున్నదేమో కానీ నాకైతే లాభము లేదు, లాభం లేని పనులు చేసి నష్టము నేనెందుకు అనుభవించాలి? అని ఒక ప్రశ్న వేయి. ఏమి సమాధానం ఇస్తుందో వేచి చూడు. నీకు లాభము లేక పోయినా నాకు లాభమున్నది కావున నిన్ను ఆశ్రయించుకుని నా పని నేను చేసుకుంటాను, నాకు అంటూ ఒక ఆశ్రమము కావాలి అందుకే నిన్ను ఆశ్రయించి నా పని నేను చేసుకుంటాను. ఆశ్రయించిన వారిని ఆదరించుట నీ ధర్మమూ అంటూ అధర్మాన్ని బోధించే ఇటువంటి వారికి ఆశ్రయమిచ్చి నిన్ను నీవు హతమార్చుకునే స్థితిని కల్పించే ఈ దొంగలను సమూలంగా నాశనం చేయాలి. నీ నిజస్వరూపాన్ని గుర్తించు. ఒక్కసారి గుర్తించిన తరువాత అటువంటి శత్రువులను దూరంగానే ఉంచాలి. క్షణకాలం అనుభవించే ఈ క్షణికమైన సుఖం ఎంత వరకూ ఆనందాన్ని అందివ్వగలదు?

## 24. సాధన యొక్క ఫలితము ఏమిటి స్వామి?

కామం, క్రోధం; అహంకారం, మమకారం ఇవి ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. వీటిని జంటగా సంహరించాలి. ఒకదాన్ని సంహరించినా రెండవది దానికి ప్రాణభిక్షపెట్టి బ్రతికిస్తుంది. కావున జంటగా చంపటమే శ్రేయస్కరం. ఏరకంగానూ కష్టపడకపోతే ఫలితం దొరకదు. ఆ ఫలితాన్ని వదిలివేసే ప్రయత్నమే చేయాలి. భగవంతుని కోసం తపస్సు చేయుట మొదలుపెట్టిన సాధకునికి భగవత్ **సాక్షాత్కారం** లభించగనే తాను, ఆయన ఒక్కటే అనేది అవగతమవుతుంది. సాధన

యొక్క ఫలితము **సాక్షాత్కారము**. ఈ సాధన యొక్క ఫలితము విరక్తి, వైరాగ్యము. ఈ రెండిటి ద్వారా **సాక్షాత్కారాన్ని** అందుకోవాలి అన్న సదుద్దేశముతో ప్రారంభించిన దీనిని యజ్ఞంగా భావించి నీ నిజ జీవితానికి కావలసిన రంగాన్ని సిద్ధం చేసుకోవలసిన సమయము. అంతరంగంలో అలజడులు సృష్టించి ఆ అంతరంగంలోనే కొలువైనవాడ్ని కనుగొనే ప్రయత్నమే ఇది. భూగర్భ జలాలు ఎక్కడెక్కడ ఎంత ఉన్నది అని **పరీక్షిస్తున్న** పరీక్షకుల మాదిరే దేహి దేహాల కలయికలో లోపల అంతర్భాగంగా ఉన్న ఆలోచనలను పసిగట్టి వాటిని బయటకు తరమటమే ఈ పరీక్షకుడు అయిన భగవంతుని పని.

25. మానవుడిపై గుణాల ప్రభావం ఎటువంటిది స్వామి?

పరీక్షలో నీవు వ్రాసే సమాధానాలకు తగ్గట్టుగానే మార్కులు వస్తాయి. ఎక్కువా రావు, తక్కువా రావు. ఒకొక్కప్పుడు నీకు ఐదో, ఆరో మార్కులు రావచ్చు. ఒక్కోసారి ఈ ఐదో, ఆరో మార్కులు కూడా రాకుండా సున్నా రావచ్చును. అయితే పాస్ కావటానికి రావాల్సిన కనీస మార్కులకు ఏ రెండు మూడు మార్కులో తక్కువగా వస్తే మాత్రం వాటిని 'గ్రేస్' మార్కులుగా కలిపి నిన్ను పాస్ చెయ్యవచ్చు. సాధనలో కూడా ఇది సత్యం. దాన్లో తక్కువ అభివృద్ధి ఫెయిల్ కావటం లాగా చెడ్డది. మంచి అభివృద్ధి అయితే ప్రశంసించి అనుగ్రహం నిన్ను ముందుకు తీసుకెళ్తుంది. నీవు కావాలనుకున్న ఫలితాన్ని పొందటానికి మూడు గుణాలు సమంగా ఉండాలి. త్రిగుణాలు బంధనాలు. ఆవు యొక్క ముందు కాళ్ళని, వెనుక కాళ్ళని, మెడ, కొమ్ములని కట్టివేసినట్టుగా మనిషి కూడా వాటి చేత బంధించబడ్డాడు. త్రిగుణాలు అట్లాంటి మూడు బంధాలే. అట్లా కట్టేస్తే పాపం! ఆ పశువు ఎట్లా కదులుతుంది? సత్వ గుణం బంగారు త్రాడు, రజో గుణం రాగి త్రాడు, తమో గుణం ఇనుప త్రాడు. పదార్థాల విలువల్లో తేడా ఉన్నప్పటికీ మూడూ మనిషిని గట్టిగా బంధించేవే. దీని నుండి తప్పించుకోలేవు. కనుక ఏ గుణానికి నీవు బంధీవి కారాదు.

26. సాధనా దిశగా నమ్మక విశ్వాసాలు యొక్క ప్రాధాన్యత ఏమిటి స్వామి?

నమ్మకము, విశ్వాసము ఈ రెండూ మానవునకు ఉండవలసిన లక్షణాలు. ఈ రెండింటినీ వదిలివేస్తే ఎటు వెళ్తావు? అనేది తెలియకుండా పయనం జరుగుతుంది. మనం వెళ్ళవలసిన గమ్యంపై నమ్మకం అనేది చాలా ఎక్కువగా ఉన్నట్లయితే విశ్వాసంతో నీవు చేరే గమ్యం చేరగలవు. అందుకే ఆధ్యాత్మిక **క్షేత్రంలో**

నమ్మకము, విశ్వాసము అనేవి రెండు నేత్రాలు. భగవంతుడు ఏదైనా ఒకటి చెప్పాడంటే దానిని అపరిమితమైన నమ్మకంతో ఆచరించాలి. ఇది ఎందుకు చెప్పారు? ఎందుకు చెయ్యాలి? చేస్తే ఏమి వస్తుంది? ఎంత సాధిస్తాను? ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటూ కాలాన్ని గడిపితే నేను నీకంటూ ఇచ్చిన సమయం అయిపోతుంది. మరలా జన్మను తీసుకోవాల్సిందే. కానీ ఆ జన్మలోనైనా నమ్మకం లేకపోతే అప్పటి సంగతి కూడా అంతే కదా? ఇలా ఎన్ని జన్మలు పొందినా నీలో నమ్మకము, విశ్వాసము లేనిచో అలాగే పునరపి జననం పునరపి మరణం తప్పదు.

27. జ్ఞానాన్ని సమపార్జించుకొనుటకు దైవానుగ్రహము యొక్క అవసరం ఏమిటి స్వామి?

అశాశ్వితమైన ఈ దేహము, ఈ దేహ ఉపయోగార్థమై ఇచ్చిన అంగాలను దేనికోసమైతే ఇవ్వబడినవో గుర్తించు. అవి అరిషడ్వర్గాలను ప్రకోపించుటకు ఇవ్వలేదు. వాటి అవసరం చిన్న బిడ్డగా ఉన్నప్పుడు ఎలా ఉపయోగించుకున్నవో అలానే ఉండాలి. దానికి ఇంకో పని అప్పగిస్తున్నావంటే పెరిగింది అజ్ఞానం. కాని జ్ఞానం పెరగాలి. ఈ జ్ఞానం పెరగటానికి దైవానుగ్రహమనే సముద్రంలోకి వచ్చి స్నానం చెయ్యవలసిందే. ఈ సముద్రం లోపలకు వెళదాము అన్న ప్రయత్నంతో నీళ్ళ లోపలకు వచ్చావు. కాళ్ళు తడిచినాయి కదా చాలులే, ఇంకా లోపలకి వెళితే మునిగిపోతానో, ఏమైపోతానో అన్న ఆలోచనతో సేఫ్ గా ఒడ్డున కూర్చుని స్నానం మొదలు పెడితే ఈ నీటితో పాటు ఒడ్డున ఉన్న ఇసుక కూడా నీపైన పడి విసుగు కలిగిస్తుంది. అంతకుముందు ఉన్న ఫ్రెష్నెస్ కూడా పోయి చిరాకు అనిపిస్తుంది. దీనికి కారణం నీపై నీకు గట్టి నమ్మకం లేకపోవటమే. ఒక్కసారి గట్టి నమ్మకము అనెడిది కలిగించుకుని ఎక్కువ దూరం కూడా వద్దు కొద్ది దూరం వెళ్తే చాలు నీకు చిరాకు కలిగించే ఇసుక నీపై పడకుండా **<u>సురక్షితంగా</u>** స్నానం చేయవచ్చు. రిలాక్స్ అవ్వవచ్చు. మోహబంధాల నుండి విడిపడి సమస్థితిని అనుభవించవచ్చు.

28. సత్పురుషుల యొక్క సాంగత్యంతో సాధకులు ఏమి తెలుసుకొనవచ్చు స్వామి?

సత్సంగం నీలాంటి స్వభావం కలిగిన ఇతర వ్యక్తులలో నిన్ను కలిసేటట్లుగా చేస్తుంది. అది అంతర్ ముఖంగా నీలోని జ్యోతిని వెలిగించి దేనికోసమైతే నీవు వెదుకుచున్నావో దానిని కనుగొనేలా చేస్తుంది. భగవంతుడ్ని స్తుతిస్తూ ఏది సచ్చిదానందమని నీవు అంటున్నావో అందులోని 'సత్'లో కలవటమే

సత్సంగము. ఈ విశ్వం మొత్తానికి ఆధారమైన ఆ స్థిరత్వమే సత్ అంటే. నీలో ఉన్న 'సత్'తో, సత్యంతో ప్రకాశాన్ని చూడని మనస్సు ఏ సత్యాన్ని గుర్తించిందో ఆ సత్యం మీద ఆ సత్యంతో సాంగత్యాన్ని అనుభవించు. ఆ సత్యంతో ఉండుట వలన నీలోని జ్యోతి అఖండమైన జ్యోతిగా వెలుగొందుతుంది, ప్రకాశం ఉదయిస్తుంది, అంధకారం దూరమవుతుంది. అజ్ఞానిగా మనిషి పుట్టినపుడు తాను జ్ఞానిగా మారాలంటే సత్పురుషుల మాటలు వినటం, వాళ్ల సలహా మేరకు నడుచుకోవటం, వాళ్ల స్పర్శను అనుభవించటం వలన జ్ఞానులుగా, పరమహంసలుగా తయారవుతారు. గురువుకు నీవు పూర్తి శరణాగతి అవ్వాలి. ఈ శరణాగతి మార్గంలో పెద్ద అడ్డంకులు అహంకార మమకారాలు. యుగ యుగాల నుండి నీ వ్యక్తిత్వంతో వస్తూ అవి ఈ జన్మలో గాఢంగా వేళ్ళు పెనవేసుకున్న విధంగా అయినాయి. వాటిని తొలగించాలంటే వివేక వైరాగ్యాలనే పనిముట్లను ఉపయోగించి కత్తిరించటమే కాదు, భూమిలో నుండి పూర్తిగా పీకి పారవెయ్యాలి. ప్రతీ రోజు నీవు భౌతికంగానే కాదు ఆధ్యాత్మికంగా పెరగాలి. కర్మలు లేకుండా పురోగతి కష్టసాధ్యం. జ్ఞాని కూడా కర్మలను ఆచరించవలసిందే. ఐతే నీళ్ళల్లోంచి బయటకు వచ్చిన హంస ఒక్కసారి రెక్కల్ని విదిలించడంతో నీళ్ళల్లోకి వెళ్తున్నప్పుడు ఈకలు, రెక్కలు ఎంత పొడిగా ఉన్నాయో అంత పొడిగా చేయగలిగినట్లుగా జ్ఞానులపై కర్మల యొక్క ప్రభావము ఉండనే ఉండదు. ఎందుకంటే, నిరహంకారంతో పోలిక లేకుండా వారు కర్మలు ఆచరిస్తారు. లోక **<u>క్షేమాన్ని కాంక్షించడము</u>**, లోక **<u>క్షేమం</u>** కలిగించే కర్మలలో మునగడం వారి స్వభావం. కావున వారు అన్నింటికీ అతీతులు.

29. సాధన అనే యజ్ఞం యొక్క లక్ష్యం ఏమిటి స్వామి?

ఇంద్రియములను వశపరచుకున్నవాడే రుద్రుడు. ఇంద్రియాలను వశం చేసుకుని రుద్రునిగా రూపొందడమే సాధన లక్ష్యం. ఏతావాతా మానవత్వం ఈశ్వరత్వంగా మారిపోవడమే ఆంతరిక యజ్ఞ లక్ష్యం. ఇంద్రియ నిగ్రహం కోసమే ఈ యజ్ఞయాగాదులు చేస్తున్నారు. పశుత్వ లక్షణాలను యజ్ఞంలో సమిధలుగా వ్రేల్చినపుడు సద్గుణాలనే పదార్ధాలు మధురానుభూతిని కలిగించి నిన్ను ఒక మధుర పదార్ధంగా మిగుల్చుతుంది. ఆ మధుర పదార్ధమే దైవత్వము. ఈ దైవత్వాన్ని అనుభవించవలెను గానీ చెప్పుటకు, చూపుటకు సాధ్యము కానిది.

30. సాధకుడు పాటించవలసిన జాగ్రత్తలు ఏమిటి స్వామి?

నీ ఆరోగ్యము, నీ ప్రవృత్తి తెలిసిన సమర్ధుడి మార్గదర్శకత్వంలో సాధన చెయ్యాలి. అత్యుత్సాహము, క్రమరాహిత్యము అన్న రెండిటిని వదిలివెయ్యాలి. వివేకం లోపించినట్లైతే సాధన బోను అవుతుంది. పరిమితి మర్చిపొయ్యి వేడి చేస్తే బట్టీలోని ఇటుక పాడవుతుంది. బట్టల షోడా కొంచెం ఎక్కువ అయితే మూటెడు బట్టలు పాడవుతాయి. ప్రక్క ఇంటి వాళ్ళతో నాలుగు మాటలు ఎక్కువ మాట్లాడే లోపల పొయ్యి మీద ఉన్న అన్నము ఎక్కువ ఉడికి పాడయిపోతుంది. సాధకుడికి జాగురూకత, జాగ్రత్త, చురుకుదనం అన్నవి చాలా ముఖ్యం. ఆత్మ పరిశీలన లేకపోవడం చేత చాలా మార్లు యోగం రోగంగా మారిపోతుంది.

31. శాంతి, ఆనందం, ప్రేమలను ఎలా పొందవచ్చు స్వామి?

నీవు చూసిన దాన్ని బట్టి దారి తప్పకు. నీ కళ్ళతో నీవు చూడనిది ఇంకా ఎక్కువ విశిష్టమైనది. తనలోనే సమస్త ఆనందాన్ని, దాన్ని ఆవిష్కరించుకునే సాధనాలను మానవుడు కలిగి ఉన్నాడు. ఐతే తనలో ఉన్న వాటిని తెలుసుకోలేని భయంకర అజ్ఞానంలో అతడు చిక్కుకున్నాడు. ఆంతరంగికమైన శాంతి ఆనందాల ఊటను పట్టుకోవడానికి ముందు ఇంద్రియ సంతృప్తి కోసం కోరిక అన్న వ్యవహారాన్ని తొలగించుకోవాలి. దీని కోసం నీవు ఏ ప్రయత్నమూ చేయడం లేదు. ఇంట్లో, సమాజంలో, జాతిలో, ప్రపంచంలో శాంతి కానీ ప్రేమ కానీ సత్యం కానీ లేవు. కామాది భావోద్రేకాల స్పర్ధలో నిండిన పోటీ ప్రపంచంలో బ్రతుకుతున్నారు. కవలలు కూడా భిన్న మార్గాలలో ఉంటారు. భగవంతుడు మాత్రమే లక్ష్యంగా, మార్గదర్శకుడిగా ఉన్నప్పుడే నిజమైన శాంతి, ప్రేమ, సత్యాలు ఉండగల్గుతాయి. నిరంతర నామస్మరణం శరణాగతికి సంకేతం. స్మరణ చాలు. నిరంతర సోహం స్పృహను అఖండ హంస జపం అంటారు. అది దుఃఖ భయాందోళనల నుంచి విముక్తిని ప్రసాదిస్తుంది. మనస్సు పోతే ఇక మోహమే లేదు. మోహక్షయమే మోక్షము.

32. యోగ్యమైన జీవనానికి ఏవి అవసరము స్వామి?

క్రమశిక్షణా పూరితమైన ప్రయత్నం మీద ఆధ్యాత్మిక ప్రగతి, ఆనందాలు ఆధారపడ్డాయి. అది తీవ్రమైన కఠినమైన శ్రమ ద్వారా వస్తుందే కాని సుఖమైన సులభ మార్గాల ద్వారా రాదు. క్రమబద్ధమైన

అలవాట్లు, ఏకాగ్రమైన మనస్సు, ఇంద్రియ సుఖ పరిత్యాగం, ఆత్మ యందు విశ్వాసం ఉన్నప్పుడే జీవితం జీవించడానికి యోగ్యమవుతుంది. మార్గము తెలియని వాడు లక్ష్యం చేరలేడు. లక్ష్యం తెలియని వాడు మార్గాన్ని ఎన్నుకోలేడు. దాని మీద నడవలేడు. నీ ప్రయాణం మొదలుపెట్టక ముందే ఈ మార్గాన్ని గురించి, **లక్ష్యాన్ని** గురించి సరి అయిన అవగాహన ఉండాలి.

33. మానవునికి మానవునికి మధ్య వ్యత్యాసం ఎటువంటిది స్వామి?

మానవులలో చాలా తేడాలు ఉంటాయి. ప్రత్యేకంగా నాలుగు రకాల వారు ఉంటారు.

i. శరీరానికి కలిగే కష్టాల చేత అలసిపోయినవాడు. వాడినే ఆర్తుడు అని పిలుస్తారు.

ii. ఐశ్వర్యం, ధనం, అధికారం, స్వార్థం, సంతానము వాటి గురించి పరితపిస్తూ ఉంటాడు. వాడిని అర్థార్థి అని పిలుస్తారు.

iii. మూడవ వాడు ఆత్మజ్ఞానం కోసం గాఢంగా పరితపిస్తూ ఉంటాడు. మత గ్రంధాలను, పవిత్ర గ్రంధాలను చదువుతూ తన సమయం ఆత్మజ్ఞానం కోసం వెచ్చిస్తాడు. నిరంతరం ఆధ్యాత్మిక సాధనాపరుల వెంట తిరుగుతూ తనకు ఉపయోగకారిగా ఉన్నవాటిని స్వీకరించి తన సాధనా దిశగా ముందుకు అడుగులు వేస్తాడు.

iv. నాలుగవ వాడు జ్ఞాని. అతడు బ్రహ్మతత్వంలో మునిగి ఉంటాడు.

34. స్వామీ! మీ అనుగ్రహానికి పాత్రులమైన మేము అదృష్టవంతులము స్వామి.

మీరు విశ్వాసము ఉంచిన యెడల మీ యొక్క సంస్కారాలన్నీ నా శరీరముపైకి ఆకర్షించి మీకు కర్మక్షయము చేసి మిమ్ములను **రక్షించెదను**. భక్తుల యొక్క భావనను బట్టి దైవము అనుగ్రహించు ఫలముండును. స్వామి సకల దేవతాతీత స్వరూపులు. సర్వ దేవతా స్వరూపములకునూ అతీతమైన మహాతత్వము నాది. అట్టి నా దర్శన, స్పర్శన, సంభాషణ పొందగల్గినవారు ధన్యులు.

35. మా హృదయాలలో మీరు కొలువై ఉండేందుకు మేము ఏమి చేయాలి స్వామి?

ప్రేమ అనే జలంతో; ప్రార్ధన, పశ్చాత్తాపము అనే డిటర్జంటుతో మీ హృదయము పరిశుభ్రము

చేసుకుంటే కోరికల మరకలు తొలిగిపోవచ్చు. అప్పుడు నేను అటువంటి హృదయంలో అనుగ్రహాన్ని నింపుతాను.

36. జీవికి జనన మరణాలు తప్పవా స్వామి?

మీకు వివరించి చెబుతున్నదంతా జనన మరణ చక్రమునకు చాలా దగ్గర సంబంధం కలిగి ఉంటుంది. ఆధ్యాత్మిక పరిణామానికి తావీయని వ్యక్తి మరలా మరలా ఈ జనన మరణ చక్రంలో పడిపోవలసి వస్తుంది. ఈ విధానంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. కానీ ఇలా చిక్కు పడిపోకుండా ఉండాలంటే ఎవ్వరైనా నన్ను శరణు పొందవల్సిందే. నా యందు పూర్ణ విశ్వాసం ఉండాలి. అంతే చాలు. మిగతా విషయాలన్నింటికి శ్రద్ధ నేనే వహిస్తాను.

37. దేహాభిమానాన్ని వీడి ఆత్మాభిమానాన్ని పెంపొందించుకోవాలి అంటారు కదా స్వామి?

ముమ్మాటికీ. దేహము అనిత్యము, మనస్సు చంచలమైన కోతి వంటిది అని తెలుసుకున్న దానికి మాత్రమే ఆత్మ దృష్టి ఉంటుంది. ఆత్మ దృష్టిని నిరంతరము హృదయమునందు ఉంచుకున్నవాడే ముక్తుడు. దేహము చూస్తామా అంటే ఇదొక నీటి బుడగ వంటిది. ఇది అనిత్యమైనదని తెలిసి కూడనూ మీరు దీనినే నమ్ముకుని జీవిస్తున్నారు. మీలో దేహాభిమానము ఉన్నంతవరకూ మీ జీవితమంతయు కేవలం కష్టనష్టములతో, సుఖదుఃఖములతో, పాపపుణ్యాలతో బాధపడవలసిందే. దేహి మాత్రమే స్థిరమైనది. దానినే "ఆత్మ" అని పిలిచారు. మీ దేహము యొక్క పేరు మీ తల్లిదండ్రులు పెట్టినది. పేరు లేకపోతే రూపము గుర్తించుటకు వీలు కాదు. "**<u>విశాలాక్షి</u>**" అనే పేరు నీ రూపానికి గుర్తు. "సత్య సాయి బాబా" అనే పేరు ఈ దేహాన్ని నిరూపిస్తుంది. మీరు అశాశ్వితమైనటువంటి దేహాన్ని ధరించి ఈ బాహ్య ప్రపంచములో జీవిస్తూ ఉండటం చేత ఈ విధమైన భౌతిక లక్షణాలను గమనించవలసి వస్తుంది. కానీ ఇవన్నీ కేవలం దృశ్యకల్పితములే! ఏది మీరు చూడలేరో అదే సత్యము. అదియే ఆత్మ. కాబట్టి నీవెవరు? అని అడిగినపుడు నేను ఆత్మను అని మీరు చెప్పాలి.

38. జ్ఞానం అంటే ఏమిటి స్వామి?

మానవుని యొక్క కోరికలే మనస్సుగా తయారవుతున్నాయి. ఈ మనస్సు నుండియే వాక్కు అనేది వస్తున్నది. ఈ కోరికల వల్లనే కొన్ని దుర్భావములు, దుర్బుద్ధులు, దురాలోచనలు కలుగుతున్నాయి. భగవంతుడు ఎందుకు కనులనిచ్చాడు? చెడ్డను చూడకుండా మంచిని మాత్రమే చూడటానికి. చెవులని ఇచ్చినది ఎందుకు తెలుసునా? మంచి విషయాలు వినటానికి. నోటినిచ్చింది ఎందుకో తెలుసునా? మంచి మాటలు చెప్పటానికి. మీకు ఇచ్చిన ప్రతీ అంగము పవిత్రము గావించుకోవాలి. ఈ విధమైన పవిత్రమైన దేహమును భగవంతునికే అర్పితము చేయాలి కానీ ఇతరులకు అర్పితము చేయకూడదు. మీకు కావలసినవి అన్నీ తాను ఇస్తాడు. కానీ నీవు భగవంతుని మాత్రమే మనస్సులో పెట్టుకోవాలి. ఎక్కడ చూచినా భగవంతుడే. ఆకాశము భగవంతుడే, భూమి భగవంతుడే, ప్రజలంతా భగవంతుడే. అందరి యందు భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు ఎప్పుడూ కూడను "ఓం" అనే శబ్దములో మీ శ్వాసలోనే ఉన్నాడు. అలాంటి తత్వాన్ని కనుగొన్నప్పుడే అది నిజమైన జ్ఞానమవుతుంది.

39. భక్తులపై, సాధకులపై భగవంతుడి అనుగ్రహం ఉంటుందా స్వామి? భగవత్ అనుగ్రహాన్ని ఎలా పొందవచ్చు?

అందరూ సాధకులే! గురువుల ఆజ్ఞను అలక్ష్యం చేయకూడదు. అవినయంగా మెలగకూడదు. వినయ విధేయులై ప్రవర్తించాలి. ప్రతీ సాధకుడు సత్కర్మలు ఆచరించినపుడే చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగినపుడే జ్ఞాన సిద్ధి లభ్యమవుతుంది. సమయం చిక్కినప్పుడల్లా నవ విధ మార్గాలైన శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం వీటిట్లో ఏ ఒక్కటి ఆచరించినా భగవదనుగ్రహం లభిస్తుంది. వారికి సన్నిధై, పెన్నిధై ఉంటాడు భగవంతుడు. వాల్మీకి, కుచేలుడు, ధ్రువుడు, ప్రహ్లాదుడు మున్నగువారు ఇందుకు తార్కాణము. శబరికి ఏ శక్తి లేకపోయినా కందమూలాదులు భుజించి చెట్ల క్రింద కూర్చుని ఋషులు బోధించే విషయాలను ఏకాగ్రతతో వినడం వలన శబరి చేసిన సర్వ కర్మలూ తపస్సుగా మారిపోయాయి. ఈ విధంగా మీరు చేసే పనులన్నీ భగవంతునికోసమే చేస్తున్నామనుకున్నప్పుడు చెడ్డ పనులు ఏ మాత్రమూ చేయలేరు. కనుక ఏ కర్మలు ఆచరిస్తున్నా భగవత్ ప్రీత్యర్థం అనే భావనతో ఆచరిస్తూ, గురువు యొక్క శుశ్రూష వల్ల, గురువుకు విధేయుడై ఉండుట వల్ల, గురు సాంగత్యం వల్ల తప్పక భగవదనుగ్రహం లభిస్తుంది. వ్యాసుల వారి దగ్గర

అనేక మంది శిష్యులు వేదాధ్యయనం నిమిత్తమై చేరేవారు. అందులో మొదటివాడు వైశంపాయనుడు. అతను భక్తి శ్రద్ధలతో, వినయ విధేయతలతో గురువాజ్ఞను పాటించి తన జీవితమును సార్ధకము గావించుకున్న వ్యక్తి. సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలన మున్నగున్నవి నేర్పునదే విద్య. ఇట్టి విద్యను నేర్చుకునేవాడే విద్యార్ధి. నేర్చుకోవలసినది కూడా ఇదే. ఈ విధంగా గురువు దగ్గర వైశంపాయనుడు విద్యను నేర్చుకుని ఒక గురుకులము స్థాపించాడు. గురుకులమనగా గురువు గారి ఇల్లే గురుకులం. శిష్యులకు నిలయం. గురువు తినునదే శిష్యులకు ప్రసాదంగా ఇచ్చేవారు. రాత్రింబవళ్ళు గురువులోనే జీవితము గడిపేవారు. అనగా గురు భక్తి, గురువు యడల వారి విద్య ఉన్నతంగా ఉండి అచంచలమైన భక్తి విశ్వాసాలతో భగవంతుని మదిలో స్థానమేర్పరుచుకొనేవారు.

40. కర్మ, భక్తి మరియు జ్ఞాన మార్గాలలో ఏది శ్రేష్టము స్వామి?

దేవుడు, దేహం ఈ రెండూ కలిసి పనిచేసి సంపాదించినపుడు ఆ సంపాదనను ఇద్దరూ పంచుకోవలసి ఉంటుంది. ఐతే దేవుడు ధనాశాపరుడు కాదు. నైవేద్యం పేరిట కొబ్బరికాయ కొట్టి దేవునికి నివేదన చేసి ప్రసాదం పేరిట సగం నాది సగం నీది అని కొట్లాడే స్వభావం నరుడికి ఉండవచ్చునేమో కానీ నారాయణుడికి మాత్రం ఉండదు. భగవంతుడు ఇచ్చే వాడే కానీ పుచ్చుకునేవాడు కాదు. అతడు ఆశించేది భక్తి, ప్రేమలు మాత్రమే. ఐతే దైవ భాగాన్ని ఎవరికి ఇవ్వాలి అన్నది ప్రశ్న. ఈ ప్రపంచంలో అందరూ భగవంతుని బిడ్డలే. అయినా వారిలో చాలా మంది దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ దరిద్ర నారాయణులుగా చలామణి అవుతున్నారు. కనుక ఆయనకు చెందవలసిన భాగాన్ని అతి దీన స్థితిలో ఉన్న తన బిడ్డలకు ఎదో రూపేణ అందచేస్తే ఆయన సంతోషిస్తాడు. దైవానుగ్రహం పొందటానికి దీనజన సేవయే ఉత్తమమైన మార్గం. ఈ విధంగా మానవ ప్రయత్నానికి మరో పేరైన ధర్మాచరణకు దైవానుగ్రహం తోడైతే తప్పక విజయం సిద్ధిస్తుందని చెబుతున్నాను. ధర్మాచరణ, మానవ ప్రయత్నమన్నది కర్మ మార్గం. దైవానుగ్రహం పొందే విధమే భక్తి మార్గం. ఈ రెండిటి కలయికయే జ్ఞానము. కనుక ధర్మ బుద్ధిలో దైవ ప్రీతికరంగా దైనందిన కర్మలను ఆచరిస్తూ ఆ కర్మల ఫలితాన్ని ఆ సర్వేశ్వరుడికి అర్పిస్తూ నేను దేహాన్ని కాను, నేను ఆత్మను అన్న అద్వైత భావం జ్ఞానము. అట్టి జ్ఞానాన్ని పొందటమే అసలైన విజయం. ఆ ఆనందంలో విజయానికి సారధి సత్యం. ధర్మం వారధి.

41. దేహము దేవాలయంగా ఎప్పుడు తీర్చిదిద్దబడుతుంది స్వామి?

దేహమున్నంత మాత్రాన, దేహాలన్నీ దేవాలయాలు కావనియూ భక్తి భావన తోడైతేనే దేహం దేవాలయంగా అనుభూతికి వచ్చి జన్మ సార్ధకమౌతుందని గుర్తించాలి. ఎట్లనగా శుద్ధి కొరకు చేసెడిది స్నానము. బుద్ధితో జోడించి దైవ భావంతో ఆచరించెడిది అభిషేకము. అట్టి జలాన్నే శుద్ధోదకమని అరచేత గ్రహించి కళ్ళకద్దుకుని త్రాగుటలోని పరమార్ధము. అపుడు ఎచటనుండి తెచ్చిన జలమైనా గంగాజలం అవుతుంది. ఏమైనాసరే దేవతార్చనలో పవిత్రభావయుక్త కర్మాచరణకే ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉంటుంది. కానీ ఆ సందర్భంగా ఉపయోగించబడే వస్తు పదార్ధాలకు కాదు. కావున వినయ విధేయతలతో కూడిన భక్తితో దేహం దేవాలయంగా అనుభూతిలోకి వస్తుంది.

42. అహంభావమును చెడుగా ఎందుకు పరిగణిస్తారు స్వామి?

లోకంలో కొందరు ఎదుటి వ్యక్తిని మనిషిగా గుర్తించరు సరి కదా తామేదో గొప్పవారమని, అధికులమని భ్రమించి దర్పమును ప్రదర్శిస్తారు. వాస్తవానికి ఆ దర్పమే అహంభావ లక్షణము. అది మనిషి పతనానికి దారి తీస్తుంది. మహా మహా యోధులు ఎందరో కూడా అలా అహంభావ లక్షణంతోనే పతనమైన ఉదంతాలెన్నో చరిత్రలో మీకు కనిపిస్తాయి. ఐతే అందుకు భిన్నంగా అణకువ, నమ్రత, వినయములను అలవర్చుకుని గొప్పవారిగా ప్రజల ప్రసంశలు అందుకున్నవారు ఎందరో ఉన్నారు. వివేకము వినయవంతుల లక్షణము. దానిని మనిషి యొక్క బలహీనతగా పరిగణించరాదు. ఏసుక్రీస్తు దైవ స్వరూపుడైననూ ఏనాడూ తను దైవ సమానుడనని ప్రకటించుకోలేదు. ఒక ప్రభు సేవకునిలానే మానవ రూపంలో ఉద్భవించాడు. సంచరించాడు. శిలువ వేసినపుడు కూడా అతి వినయంగానే మృత్యువుని ఆహ్వానించాడు. అతిశయం ఉన్నవానికి అవమానించబడే ఆపద ఎప్పుడూ పొంచే ఉంటుంది. కాని వినయం ఉన్న వానికి గౌరవించబడే అర్హత ఎదురొస్తుంది. ఇది తెలుసుకుంటే చాలు.

43. ప్ర. స్వామి, వివేకి అని ఎవరిని అంటారు?

జ. కాల కర్మ కారణములు ఒకేసారి కలిసి వచ్చినపుడు లభ్యయోగము కలుగుచుండును. వివేకి అయినవాడు దానిని గుర్తించి లబ్ధిపొందును. వాడినే వివేకి అందురు.

ప్ర. అవధూతకు, భగవంతునికి గల వ్యత్యాసమేమి స్వామి?

జ. నేను బ్రహ్మము. బ్రహ్మమే సర్వశ్వమూ అనునది అవధూత అనుభవము. కాని నేను బ్రహ్మము, నేనే సర్వశ్వము అనెడి స్థితి నాది.

ప్ర. స్వామి ఈ స్వల్ప బేధము లోని రహస్యము అర్ధముకాలేదు.

జ. సమస్త ప్రాపంచిక బంధములనుండి విడిబడిన అవధూత నాలో లీనమగుచూ బ్రహ్మానంద స్థితిని అనుభవించుచున్నాడు. అతనిలో వ్యక్తిత్వము లేదు. వ్యక్తిత్వము లేనపుడు సంకల్పము లేదు. ఈ సృష్టి యొక్క మహా సంకల్పములో, మహా శక్తిలో నేనున్నాను. జీవులనెడి మాయా శక్తి రూపములో కూడా నేనున్నాను. నాలో లీనమైన అవధూతను నీవు తిరిగి జన్మకు రావలసిందని నేను ఆజ్ఞాపించిన యెడల తిరిగి జన్మకు రావలసిందే. సంకల్పముతో కూడిన సత్యజ్ఞానానంద రూపము నాది. సంకల్పము నశించిన సత్యజ్ఞానానంద రూపం వారిది.

ప్ర. విత్తనములు వేయించిన తదుపరి తిరిగి మొలకెత్తవు కదా? బ్రహ్మ జ్ఞానమును పొందిన తదుపరి బ్రహ్మమే తానయినపుడు తిరిగి జన్మను ఎత్తుట ఎట్లు సాధ్యము స్వామి?

జ. వేయించిన విత్తనములు మొలకెత్తకపోవుట సృష్టి ధర్మము. ఆ వేయించిన విత్తనములు మొలకెత్తింప చేయుట సృష్టికర్త యొక్క శక్తిసామర్ధ్యములు. అసలు నా అవతారమే సత్య నిరూపణ చేయుటకే ఏర్పడింది.

44. యోగి అని ఎవరిని అంటారు స్వామి?

యోగులు అసలు నేనెవరినో నా అసలు స్వభావమేమిటో ఖచ్చితంగా తెలుసుకోగలిగిన అదృష్టవంతులు. నా స్థాయికి చేరుకోవడం కోసమే మానవ జన్మ అనుగ్రహించబడినదని వారు పూర్తిగా అర్ధం చేసుకుంటారు. జంతువుల వలే కాక ఒక్క మానవులు మాత్రమే నా స్థాయికి ఎదగగలరని వారికి తెలుసు. జీవితం అంతమయ్యాక ఎక్కడికి చేరుకోవాలో సరిగ్గా తెలుసుకొని వారు అక్కడికే చేరుకుంటారు. జ్ఞానాగ్నిలో అక్కరలేని విషయాలను దగ్ధం చేయుట వలన వారు ఇటువంటి ప్రయోజనాన్ని పొందగలరు. మీలోని ఒకొక్క ఇంద్రియము ఒకొక్క దేవత చేత ప్రభావితమౌతుంది. సమాధి స్థితిలో ఉన్న యోగికి **ఆత్మసాక్షాత్కారమైనపుడు** పదహారు కళలు తమ తమ భూతములలో లీనమవుతాయి. యోగి యొక్క భౌతిక శరీరమునందలి శక్తులు విశ్వాంతరాళములోని భూతములలో విలీనమవుతాయి.

45. అహం నశించనిదే మోక్షము కలగదంటారు కదా స్వామి. యోగి యొక్క స్థితి ఎట్టిది?

మనిషిలోని అహం యొక్క ప్రేరణ వల్లనే కర్మలు ఆచరించబడతాయి. అహం అన్నది మనస్సు, బుద్ధి అను వాటి యొక్క నియమ నిబంధనల చేత నిబద్ధితమైన చైతన్య జ్యోతి. **ఆత్మసాక్షాత్కారము** పొందిన యోగికి పూర్వ జన్మలోని కర్మ ఫలములు ఏమీ మిగలవు. అహం యొక్క ధోరణి పూర్తిగా నశించనిదే ఆత్మ**సాక్షాత్కారము** జరుగదు. అందువలన యోగికి ఆత్మ**సాక్షాత్కారమైనప్పుడు** కర్మలూ, వాటి ప్రతి ఫలములు, అహం యొక్క కేంద్రము, దాని యొక్క మాయాజాలములన్నియునూ శాశ్వితుడైన పరమాత్మలో లీనమవుతాయి. యోగి పరమాత్మలో లీనమై వ్యక్తిత్వరహితుడు అగుచున్నాడు. పరమాత్మ వ్యక్తిత్వ సహితుడై శక్తిస్వరూపుడై ఉన్నాడు. కర్మలు, వాటి ఫలములు నశించి యోగికి స్థూలదేహ స్పృహ లేనపుడు భగవాదవస్తలో ఉండును. పరమాత్మ సిద్ధావస్తలోనున్న యోగి ద్వారా కూడా తన దివ్య లీలలను ప్రకటించవచ్చు.

46. నమ్మకమన్నది ఉంటే దేనినైనా సాధించవచ్చునా స్వామి?

జీవుల మానసిక స్థితి చూసి నవ్వు వస్తుంది. ఒక వైపున అన్నింటికీ భగవంతుడే మూల కారణం అని చెబుతూ ఉంటారు. మరలా భగవంతుడు అప్పచెప్పిన పనిని చేయటానికి అమ్మో ఎక్కడ చేయగలము? అంటూ అసక్తతను ప్రదర్శిస్తూ ఉంటారు. అంటే ఇప్పటి వరకూ తాను చేసాడా? రేపు తాను చేస్తాడా? నమ్మకము అనెడిది ఉందంటాడు. నమ్మకము ఉనప్పుడు కళ్ళు మూసుకుని నడవవచ్చు. ఒక సంవత్సరము తరువాత చేయబోయే పనికి ఇప్పటి నుండి ఎన్నో ప్లాన్లు వేస్తుంటాడు మానవుడు. కారణం ఏమిటి? తాను దీర్ఘకాలం జీవిస్తాను అన్న నమ్మకమే. కానీ అది తన చేతిలో లేదని తెలుసు. అయినా నమ్మకం అనేది అంత గట్టిగా ఉండుట వలన జరగబోయేదాని గురించి అంత గట్టిగా ప్లాన్ వేస్తాడు. ఎదో పనికిమాలిన పనులకే అంత పకడ్బందీగా ప్లాన్లు వేస్తున్నప్పుడు పనికి వచ్చే విషయము, పదార్థము ఏదైతే ఉందో దానిని గ్రహించుటకు ప్లాన్ అక్కరలేదా? నీవు చాలా పెద్దగా ఊహించుకోవటంతో నీవు సాధించాలి అనుకున్నది కొండలా నీకు కన్పిస్తుంది. అంటే కొరుకుడు పడని భావాలు కొండంతై నీ ఎదుట నిల్చితే ఆ కొండ ఎలా ఎక్కాలి? అని ఆలోచనలు సాగుతూ ఉంటాయి. దీనికి నీవు ఏమి చేయాలి? వివేకముతో

ఆలోచించగలిగితే నీవు ఎలుకగా మారిపోతే కొండ ఎక్కుట చాలా సులభం. సులభమైన దానిని ఎందుకు కష్టంగా భావిస్తున్నారు అంటే నమ్మకము ఉన్నది అంటూ దానిని ఉపయోగించుట లేదు కావున.

47. మానవులమైన మేము మాధవుడిగా తయారవ్వుట చాలా కష్టం అనిపిస్తుంది స్వామి.

ఈ ప్రపంచంలో కష్టం కానిది ఏముంది? విను, నీకు ఏదైనా గట్టిగా కావాలని అనుకుంటే అందులో ఎదురయ్యే కష్టాలను గురించి ఏమాత్రమూ లక్ష్య పెట్టవు. ఎన్ని అవాంతరాలు వచ్చినా ప్రయత్నం మానవు. ఈ ప్రాపంచిక సుఖాల కోసం ఎన్నో అసాధ్యమైన పనులు చేసి సాధించుకున్న వాళ్ళని ఎంత మందిని నీవు, నేను చూడలేదు? కానీ భగవంతుడి విషయం వచ్చే సరికి ప్రజలు అసలు ప్రయత్నం మొదలు పెట్టకుండగనే మానేస్తుంటారు. ప్రజలు కొద్ది నిమిషాల సమయం కేటాయించి నన్ను జాగ్రత్తగా గమనించగలిగితే "నా జీవితమే నా సందేశమని" అందులో ప్రతీ క్షణమూ అందుకు నిదర్శనమని గుర్తించగలుగుతారు. కానీ ఎవరూ ఆ పని చేయరు. మానవుని జీవితం కూడా నా జీవితం లాగా ఎప్పుడు ఉంటుందో అప్పుడు అతడు సులభంగా నాలో చేరిపోగలడు.

48. శ్రద్ధ, విశ్వాసములు అంటే ఏమిటి స్వామి?

మనిషి అభివృద్ధి పొందాలంటే ముఖ్యముగా శ్రద్ధ దానితో పాటు దృఢమైన విశ్వాసము ఉండాలి. శ్రద్ధ అంటే సంపూర్ణమైన నమ్మకముతో కూడిన అంగీకారము. విశ్వాసము అనునది అనుభవంతో పొందవలసి ఉంటుంది. మనం దేనికోసమైనా సరే విశ్వాసమును ఆధారము చేసుకుని జీవించగలగాలి. అవసరమైన వేళల్లో తప్పకుండా సహాయము అందగలదనే విశ్వాసం నిరంతరం ఉండాలి. విశ్వాసంతో పాటు ఒక విధమైన భద్రతా భావం కూడా మనలో ఉన్నప్పుడు అది ఆత్మవిశ్వాసం అవుతుంది.

49. శక్తికి, జ్ఞానానికి మధ్య సంబంధం ఎటువంటిది స్వామి?

శక్తి హీనమైన జ్ఞానం నిర్లిప్తతకు దారి తీస్తుంది. జ్ఞానహీనమైన శక్తి గృడ్డిదై వినాశనానికి దారి తీస్తుంది. అందు చేత జ్ఞానంతో ప్రకృతి బంధాల నుండి విడుదల పొందాలి. ఆ తర్వాత శక్తి అనుగ్రహంతో పరిపూర్ణతను సాధించాలి. శక్తికి జ్ఞానం నుండి అనుమతి లభించాలి. చైతన్యాన్ని పురుషుడు అంటారు.

కర్మను నిర్వహించే దానిని ప్రకృతి అంటారు.

50. దైవానుగ్రహం ఎలా పొందాలి?

దైవానుగ్రహం పొందాలంటే ముందుగా దైవంపై సంపూర్ణ భక్తి, విశ్వాసాలు ఉండాలి. అంతే కాదు దైవానికి ప్రీతికరమైన పనులు కూడా చేస్తూ ఉండాలి. కానీ మానవ నైజం ఎటువంటిదంటే ఏ పని చేసినా స్వార్థము, స్వప్రయోజనము చూసుకుంటుందే తప్ప ఆ కార్యసాఫల్యం ఎవరి వల్ల జరుగుతుంది అన్న విషయం మాత్రం ఆలోచించదు. ఏ పని చెయ్యాలన్నా "ప్రజ్ఞ" అంటూ ఎదో ఒకటి ఉండి తీరాలి. ప్రజ్ఞ లేకపోతే ఫలితం ఉండదు. ఆ ప్రజ్ఞానమే బ్రహ్మ. ఏది మానవ ప్రయత్నమని మీరు అనుకుంటున్నారో అది నిజానికి దైవ ప్రజ్ఞ. దైవ ప్రేరణ వల్ల జరుగుతోంది. మానవుడు అన్నీ తానే చేస్తున్నట్లుగా అహంకరిస్తున్నాడు. కానీ దైవమే తనను ఒక పనిముట్టుగా చేసుకొని సర్వమూ సాదిస్తున్నాడన్న నిజాన్ని మాత్రం తెలుసుకోలేకపోతున్నాడు. అది అర్థం చేసుకోలేకపోతున్నాడు. దీనిని అర్థం చేసుకుంటే దైవానుగ్రహం పొందవచ్చు.

51. ప్ర. స్వామీ! మిమ్మల్ని గుర్తించ వీలగునా? మీరెవరో తెలుసుకోవచ్చా?

జ. నేను నేనే. పంచభూతాత్మకమైన ఈ సృష్టిలోని ప్రతీ అణువు అణువు నందునూ అంతర్లీనంగా మాతృస్వరూపముగానూ, పితృస్వరూపముగానూ ఉన్నది నేనే. సమస్త సృష్టికి గురురూపము నేనే.

ప్ర. భగవంతుడు నిరాకారుడు, నిర్గుణుడు అని అంటారు కదా స్వామి.

జ. ఆకారము లేకుండా ఉండుట కూడా ఆకారమే. గుణములు లేకుండా ఉండుట కూడా గుణమే. సాకార నిరాకారములకు, సగుణ నిర్గుణములకు ఆధారముగా ఉండే నేను వాటికి అతీతుడ్ని.

52. అన్నీ మీరే అయినపుడు జీవులకు కష్టసుఖాలు ఎందుకు?

నీలో, నీవూ నేనూ కూడా ఉన్నాము. అయితే నీలో ఉన్న నీవు జీవుడవు. నీలో ఉన్న నేను మాత్రము పరమాత్మను. నీకు కతృత్వ భావన ఉన్నంత వరకూ నీవు నేనుగా కాలేవు. అంతవరకు సుఖదుఃఖాలు, కష్టనష్టాలు, పాపపుణ్యాలు అనే ద్వంద్వములనుండి నీవు బయట పడలేవు. నీలో ఉన్న

"నీవు" **<u>క్షీణ</u>**దశకు వచ్చి నీలో ఉన్న "నేను" ఉచ్ఛదశ అందుకున్నప్పుడు మాత్రమే నీవు నాకు దగ్గరయ్యేదవు. నాకు దగ్గర అయ్యే కొలదీ నీ బాధ్యత తొలగిపోవును. నా బాధ్యతలో ఉన్నప్పుడు శ్రేయస్సును పొందగలవు.

53. మోక్షము అద్వైత స్థితిలో ఉన్నవారికే సాధ్యమా స్వామి?

నీవు వేరుగాను, నేను వేరుగాను ఉన్నంత మాత్రమున నష్టమేమి లేదు. నీలోని అహంకారము నశించి ద్వైతస్థితిలో ఉన్ననూ శ్రేయస్సు లభించును. సమస్తమునూ నా అనుగ్రహము వలననే కలుగుచున్నదనియు, నీవు కేవలము నిమిత్తమాత్రమైన తత్వమని తెలుసుకొన్న యెడల ఆనంద స్థితిలో ఉండవచ్చును. మోహము క్షయమునొందుటయే మోక్షము కనుక నీవు ద్వైత స్థితిలోనూ మోక్ష సంసిద్ధత పొందగలవు. నీవు నాకు అత్యంత సామీప్య స్థితిలో ఉన్నప్పుడు నేను నీ ద్వారా అభివ్యక్తమగుచుందును. నాలోని సర్వ శక్తులూ నీ యందు అభివ్యక్తమగుచునప్పుడు, నీలోని అహంకారము నశించినపుడు, నీలోని మోహము క్షయమగును. విశిష్టమైన ఈ అద్వైత సిద్ధాంతమందు నీకు ఆనందము సిద్ధించును. మోహము లేదు కనుక ఇది కూడా మోక్షమే. నీలోని అహంకారము పూర్తిగా నశించి కతృత్వ భావన సంపూర్తిగా దహించబడినపుడు "నీవు" అనునది మిగలక "నేను" అనేది మాత్రమే ఉండును. కనుక అద్వైత స్థితిలో ఉన్ననూ మోక్షము పొందగలవు. నీవు ద్వైతములో ఉన్ననూ, విశిష్టాద్వైతములో ఉన్ననూ, అద్వైతములో ఉన్ననూ బ్రహ్మానంద స్థితి మాత్రం ఒక్కటే. అది మనస్సుకు, వాక్కునకు అందరానిది. కేవలం అనుభవైకవేద్యము మాత్రమే.

54. సాధకులకు నిష్ఠ ఉండాలి అంటారు కదా స్వామి?

నిరంతర జనన మరణాలనే వరదను **<u>క్షేమంగా</u>** దాటటానికి నిష్ఠ అనే వంతెన చాలా అవసరం. అది బలంగా **<u>సురక్షితంగా</u>** ఉండాలి. అట్లా కాకపోతే సముద్రంలో ఎగిసి ఎగిసి పడుతున్న అలలలో అంటే ఆ నీళ్ళల్లో పడి కామ క్రోధాలనే సొరచేపలతో నిండిన సముద్రంలోకి కొట్టుకొని వెళ్తావు. కాయిక, వాచిక, మానసిక తపస్సుల మూడింటిలో ఏ ఒక్కటి లేకపోయినట్లైతే ఆత్మజ్యోతి కాంతినియ్యదు. జ్యోతికి దీపము, వత్తి, నూనె మూడూ ముఖ్యమే. దేహమే దీపము, మనస్సే నూనె, నాలుకే వత్తి. ఈ మూడూ సరిగ్గా ఉండాలి.

55. కాయిక తపస్సు అంటే ఏంటి?

కాయిక తపస్సు మనస్సు యొక్క శక్తియుక్తులను ఇతరుల సేవ కోసం, దైవ పూజ కోసం, ఆయన లీలాగానం కోసం, ఆయన నామంతో ప్రకాశించే ప్రాంతాలను దర్శించడము, ప్రమాదం కలిగించే మార్గం లోకి పోకుండా ఇంద్రియాలను నిగ్రహించడానికి, దైవ మార్గంలో నడవడానికి ఉపయోగించాలి. రోగులకు, దిక్కు లేని వారికి సేవ చెయ్యాలి. నైతిక నియమాలను పాటించడం లాంటి ఉపయోగకరమైన పనులు చెయ్యాలి.

56. వాచిక తపస్సు అంటే ఏమిటి స్వామి?

అతిగా మాట్లాడటం మానివెయ్యాలి. వ్యర్థ వాక్కులు రానియ్యకూడదు. పరోక్షంలో మాట్లాడటం, నీలాపనిందలు వెయ్యటం చెయ్యకూడదు. కఠినంగా ఎప్పుడూ మాట్లడకూడదు. మృదు మధురంగా మాట్లాడాలి. మనస్సులో ఎప్పుడూ మాధవ స్మరణ జరుగుతూ ఉండాలి. ఏ వ్యక్తి గొప్పతనమైనా అతని శీలసంస్కారము మీద ఆధారపడుతుంది. అతని అధికారము, ధనము, హోదా మీద ఆధారపడదు. కావున మొదటగా మీలోని సలక్షణాలను, సద్గుణాలను పెంచుకునే ప్రయత్నం చెయ్యాలి.

57. సాధన అంతర్ శుద్ధి కొరకేనా స్వామి?

అవును. అంతర్ శుద్ధి నీ ప్రధమ లక్ష్యం కావాలి. త్రాగే పాత్రలో ఏవైపు నీవు ఎక్కువ శుభ్రం చేస్తావు? లోపల వైపా? బయట వైపా? నీ దగ్గర మంచి కూరగాయలు, చింతపండు పులుసు, మిరపకాయలు, ఉప్పు ఉండవచ్చు. వంటవాడికి వంట బాగా రావచ్చు. పొయ్యి కూడా మంచిది కావచ్చు. కానీ రాగిపాత్రకు సరిగ్గా కళాయి లేకపోతే సాంబారు ప్రమాధకరమయ్యి వాడటానికి వీలు లేకుండా పోతుంది. తిన్న వాళ్లకి అది విషం అవుతుంది. సత్కర్మ, సదాచారాలనేవి రాగి లోహాన్ని సాంబారుకు తగలకుండా కాపాడుతాయి. గాయత్రీ, సంధ్యా వందనము మూడువేళలా చేయుట వలన ఆవేశాలను, ప్రవృత్తులను, వాసనలను వండే నీ హృదయ పాత్రకు కళాయిగా పనిచేస్తాయి. మావటివాడు అంకుశంతో ఏనుగు శక్తిని లొంగదీసుకొని సర్కస్ రింగులో దానితో పనులు చేయించినట్లుగా నీ యొక్క సాధన మీలోని అన్ని ప్రవృత్తులను అణిచిపారవేస్తుంది. కావుననే ఈ గొప్ప అవకాశాన్ని చేజార్చుకోకండి.

58. భగవంతుడే కేంద్రంగా కలిగిన మానవుడు సంతుష్టయోగి, ఇంద్రియ సుఖాలతో త్రుళ్ళిపడేవాడు భోగి, అనారోగ్యంతో కూరుకపోయినవాడు రోగి అంటారు. ఇది ఎలా స్వామి?

ధర్మార్థకామ్య**<u>మోక్షాలనే</u>** చతుర్విధ పురుషార్థాలను సాధించటానికి ప్రప్రథమంగా కావలసింది మనోదేహాల యొక్క ఆరోగ్యం. రోగం అంటే అసుఖ భావన. సమచిత్తాన్ని, నిగ్రహాన్ని చెడకొట్టడం వల్ల కలిగే దైహిక, మానసిక పరిస్థితి. ఇది రెండు కారణాల వల్ల కలుగుతుంది. దుష్ట ఆహారం వల్ల, దుర్వికారం వల్ల. రోగం వచ్చాకనో లేక దాన్ని ఆపు చేయటానికి వీలు లేనంతగా పెరిగినాకొ మందుల కోసం పరిగెత్తేదానికంటే దాన్ని నిరోధించడమే తెలివైన పని. భగవంతుడే కేంద్రంగా కలిగిన మానవుడు సంతుష్ట యోగి. ఇంద్రియ సుఖాలతో త్రుళ్ళి పడేవాడు భోగి. అనారోగ్యంతో ఉండేవాడు రోగి అని అనవచ్చు.

59. ప్ర. షట్చక్రాలను బంధించి యోగులు ఏవిధమైన సాధన చేస్తారు స్వామి?

జ. యోగులు తమ ప్రాణ శక్తిని ఆజ్ఞా, విశుద్ధ, అనాహత, మణిపూరక, స్వాధిష్టాన మరియు మూలాధార చక్రములను చుట్టి పైనుంచి క్రిందకు, క్రింది నుంచి పైకి పరిభ్రమించేటట్లు చేస్తారు. ఒక్క క్రియకు పట్టే కాలము ఒక సంవత్సరములో జరిగే ప్రకృతి సహజమైన ఆధ్యాత్మిక వికాసానికి సమానమవుతుంది. ప్ర. ఒక యోగి సంకల్పానుసారముగా దీనిని చేయవచ్చును కదా స్వామీ?

జ. అవును చెయ్యవచ్చు.

ప్ర. అంటే తనతో సంబంధమున్న జీవుల యెడల యోగి ఈ విధముగా చేయవచ్చా?

జ. లేదు. అవతార మూర్తుల ఆగమనం గురించి ఆలోచించు. ప్రారబ్ధానుసారంగా ఆయా వ్యక్తుల మానసములయందు ఆయా భావములను కలిగించి కర్మ ఫలములను అనుభవింప చేసి ప్రత్యక్షముగా తన యొక్క అవతార తత్వాన్ని నిజస్వరూపాన్ని తెలియ పరచుటకు యోగులు, భగవంతుడు కూడా రావడం జరుగుతుంది.

ప్ర. అంటే తమ యొక్క కర్మ ఫలాలను అనుభవించుటకు జీవులు జన్మను తీసుకుంటారు. మరి యోగులు, భగవంతుడు కూడా జన్మలను తీసుకోవటం లోని అంతరార్థం ఏమిటి స్వామి?

జ. జీవుల కర్మ ప్రారబ్ధ కర్మ. ఆ కర్మను అనుభవించుటకే జీవులు జన్మను తీసుకుని రావటం జరుగుతుంది అన్నది అనుభవేకవేద్యమే. కానీ, ఇచట భగవంతుడు ఎందుకు వస్తున్నాడు అంటే ఈ జీవులలో కూడి

సమకాలీకులుగా భువిపైకి వచ్చి మీ యొక్క కర్మ భారాన్ని తగ్గించుకోవాలంటే మీ యొక్క జీవనం ఎలా ఉండాలి? మీరు మీ కొరకు రాలేదు, కేవలం కర్మ నిమిత్తమై వచ్చింది దేహం. ఈ కాయం సత్కర్మాచరణ చేస్తూ సద్భావాలతో, సదాలోచనలతో, సత్కర్మనిమిత్తమై వచ్చినదిగా గుర్తించుటకు తమ తమ జీవితాలలో అటువంటి వాటిని ప్రతిబింబిస్తూ జీవుల గతి మార్చుటకే భువిపైకి రావడం. వారి యొక్క కర్మ ఫలాల్ని తగ్గించుటకై వీరు సహాయకారులుగా ఏతెంచి వారిని, వారి యొక్క గతిని మార్చుటకు ప్రయతిస్తూ ఊర్ధ్వముఖ పయనానికి దారి చూపెట్టే కార్య నిమిత్తమై కాయాన్ని ధరించి వస్తారు.

60. మానవుడు వీడవలసింది ఏది? పొందవలసింది ఏది?

మానవుడు వీడవలసింది దేహము, పొందవలసింది పరబ్రహ్మము. ఏది వదులుతావో అది నీవు కాదు. ఏది వీడుటకు సాధ్యము కాదో, మారుటకు వీలులేదో అట్టి సత్యనిత్యమైనదే నీ స్వరూపము. దానిని ఆత్మ అంటారు. అట్టి ఆత్మయే పరమాత్మ. దానిని ఎవరూ వదులుటకు సాధ్యము కాదు. శరీరము వదులుట అంటే జీవి ఈ ఇంటి నుండి వేరొక ఇంటికి వెళ్ళుటవంటిది . జనన మరణాలు దేహ సంబంధములే కానీ ఆత్మ సంబంధము కాదు.

61. స్వామీ! వాతావరణంలోనున్న కాలుష్యమే మానవజాతి పతనానికి కారణం అవుతుందని అనుకుంటున్నాను. దీని గురించి కొంచెం వివరించండి.

కాలుష్యాన్ని నివారించి, వాతావరణాన్ని పరిశుభ్రపరిచేదే నామస్మరణ. కావుననే ప్రతీవ్యక్తి ఉదయం నిద్ర లేస్తూనే భాగవన్నామాన్ని నోరార పలుకుతూ, హృదయ పరివేష్టితుడైన భగవంతుని కనుగొన్నప్పుడు ఇంక కాలుష్యం ఎచట నుండి వస్తుంది? బ్రహ్మ ముహూర్తంలో లేచి ఓంకారం జపించడము ఆరోగ్యానికి, ఆహ్లాదానికి **<u>క్షేమదాయకం</u>**. నామాన్ని పదే పదే పలకడం ద్వారా నీవే కాక ఇతరులకు కూడా ఆనందాన్ని పంచుతున్నావు. ఇలా చేయుటవల్ల నిత్యం నీ లోపల సద్భావాలు, సచ్చింతనలు ఉద్భవించి వాటితో రోజు ప్రారంభించినట్లైతే ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండ గలుగుతావు. దీంతో ఆత్మ సంతృప్తిని పొందగలవు. పది మంది కూర్చొని సత్సంగాన్ని నిర్వహించినట్లైతే అనేక విషయాలు నేర్చుకునే, తెలుసుకునే అవకాశం కలుగుతుంది. మనకు జన్మ ఎందుకు వచ్చింది? దీని గమ్యం ఏమిటి? ఇటువంటి

విషయాలపై అప్పుడప్పుడు విచారణ సల్పినట్లైతే మానవ జాతి ఇంత హీన స్థాయికి వెళ్ళేది కాదు. అప్పుడప్పుడూ విచారణ వల్ల "ఈశావాస్య మిదం సర్వం" అనేది అర్ధమవుతుంది. అంటే తనలోని ఆత్మ, ఎదుటి వాని లోని ఆత్మ ఒక్కటే అనేది అవగతమవుతుంది. "ఏకోవసి సర్వ భూతాంతరాత్మ" అనేది అనుభూతి పొందగలరు. దీనివల్ల మానవ జాతి పతనం కాకుండా ఉంటుంది.

ప్ర. అంటే ఇవ్వాళ ఆధ్యాత్మిక సంస్కరణ జరిగితీరాలి కదా స్వామి?

జ. జరిగే తీరాలి. నేడు ప్రపంచంలో జరిగే మతాల పేరిట కలహాలు, కల్లోహాలు, హింసాకాండ, దౌర్జన్యాలకు అంతులేదు. మానవుల మతుల్లో సరైన అవగాహన లోపించడమే ఈ విధ్వంసకాండకు మూలము. మతం, మతి, మనిషి అన్న మూడింటిని సక్రమ మార్గంలో ఉద్ధరించాలి. ప్రేమ, కరుణ, దయ, జాలి, సర్వమత సమన్వయం, ఆధ్యాత్మిక ప్రచారాలు, ప్రబోధాలు ఆత్మానందాన్ని ప్రబోధిస్తాయి. ఆధ్యాత్మిక సంస్కరణోద్యమం తప్పక జరిగి తీరాలి. అప్పుడే మానవ జాతి ఉద్ధరించబడుతుంది.

62. భక్తి మార్గంలో పయనిస్తున్న వారికి ఏదైనా సందేశం ఇవ్వండి స్వామీ.

విషయ సుఖాలు శాశ్వితమైనవి అని భావించినంత కాలము మనస్సు పరమాత్మపై లగ్నము కాదు. తన, మన, ధన, ప్రాణాదులతో భగవంతుని శరణు జొచ్చినచో భగవానుని అభయహస్తము, సాంసారిక జీవన తాపత్రయములను తుదముట్టించును. ఇవి దుఃఖజనితములు. వీటిని అధిగమించుటకే భగవంతునికి శరణాగతి చేయుట. భగవంతుడు భక్త సులభుడు. అన్ని మార్గాలలో భక్తి మార్గము భగవంతుని చేరు సులభ మార్గము.

63. మానవుడు తెలుసుకోవలసినది సాధించవలసినది ఏమిటి స్వామి?

ఆత్మ సౌందర్య సౌధాన్ని తెరచి చూపించే తాళం చేవియే సాధన. సాధన అంతయు అంతర్గత మధనమే. ఎనుబది నాలుగు లక్షల జీవరాసులలో మానవ జన్మ పరమోత్కృష్టమైనది. మానవుడు బుద్ధి జీవి. బుద్ధి జీవియైన మానవుడు తన జీవితకాలమంతయూ ప్రకృతి లోని ఆకర్షణలకు, ప్రలోభాలకు లోనై తన నిజ జీవిత పరమార్ధమునకై ఏ మాత్రమూ కాలమును ఉపయోగించుకొనుట లేదు. జనన మరణాల మధ్యలో ఉన్న మానవుడు మరణానికి, జననానికి మధ్యలో ఉన్న స్థితిని గ్రహించవలసియున్నది. ఇది

ఎప్పటికైనా మానవుడు సాధించి తీరవలసియే ఉన్నది. స్వధామమునకు చేరవలసినదే.

64. సాధనా మార్గంలో ప్రవేశించిన జీవులకు అనేక రకాలైన ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి. అవి ఎన్ని రకాలు స్వామి?

గుణసహితులైన మీరు గుణరహితుడైన భగవంతుని తెలుసుకోవలసి ఉన్నది. ఈ సాధనా మార్గంలో ప్రవేశించి, పయనించు మానవులకు అనేక ఆటంకములు ఎదురగుచుండును. ఈ ప్రతిబంధకములకు మలములని పేరు.

i. అణవ మలము - అంటే ఆధ్యాత్మిక జ్ఞానము తెరలు తెరలుగా రావడం స్థిరంగా ఉండక పోవడం జరుగుతుంది.

ii. కార్మిక మలము - గురువు, జ్ఞాన పురుషుడు జ్ఞాన బోధ చేయుచున్ననూ వాటి యందు మనస్సు ప్రవేశిస్తున్నా స్థిరంగా ఉండకపోవడం జరుగుతూ ఉంటుంది.

iii. మాయా మలము - పరాకున కూడా పరమేశ్వర సంబంధమైన జిజ్ఞాసకు అవకాశమియ్యనిది.

iv. మాయేయ మలము - నిరంతర దురాలోచనతో పాప కార్యములు చేయుట యందే మనస్సును ప్రవేశింపచేయునది.

v. తిరోధాన మలము - నిర్గుణ పరబ్రహ్మమందు దృష్టి కలగకుండా తదితర దేవతలపై దృష్టిని మరల్చునది. కాలమును వృధాగా గడుపుచూ జనన మరణాది దుఃఖ పరంపరలను కలుగ చేయునది తిరోధానముల ప్రభావము.

ఈ ఐదు రకముల మలములను అధిగమించి ఆత్మజ్ఞానాన్ని సముపార్జించు కోవాలనుకునే ఆధ్యాత్మిక సాధకుడు నైతిక శిక్షణకు అలవాటుపడి ఉండాలి.

65. జీవిత పరమార్థము ఏమిటి స్వామి?

ఆదర్శవంతుడైన మానవుడు నిరాడంబరమైన ధర్మబద్ధమైన జీవితం గడపాలని నిర్దేశించినప్పటికీ సర్వకాల సర్వావస్థలలోను భగవంతుని ప్రేమించడమే మానవ జీవిత సార్థకత. మనస్ఫూర్తిగా ఇటివంటి దివ్యతత్వమును అంటిపెట్టుకొని ఉండటమే జీవిత పరమార్థము.

66. సత్వరజోస్తమ గుణముల గురించి కొంచం విపులంగా సెలవివ్వండి స్వామి.

ప్రకృతికి సత్వరజోస్తమ గుణాలు అను త్రిగుణములు కలవు. ఈ ప్రకృతిని అధిగమించి లొంగకున్న వాడే పురుషుడు. అందుకే ప్రకృతిని స్త్రీ తత్వంగా పోల్చారు. స్త్రీ అను పదములో స, త, ర అనే మూడు అక్షరములే ఈ సత్వరజోస్తమ గుణములుగా వర్ణించారు. ఇది స్త్రీలింగ వాచికమైననూ త్రిగుణములు కలిగిన ప్రతీ జీవిని స్త్రీ గానే పరిగణించుట పాటి. త్రిగుణాతీతుడు కనుక పురుషోత్తముడైన భగవంతుడు మాత్రమే ఏకైకపురుషుడు. అట్టి త్రిగుణాతీతుని, గుణరహితుని తెలుసుకొనుటయే వ్యక్తిగత సాధనలోని పరమార్ధము.

67. సేవ వల్లనే ఆత్మ దర్శన ప్రాప్తి కలుగుతుంది అంటారా స్వామి?

సేవ చేయుట వలన మనస్సు నిర్మలమవుతుంది. హృదయం విశాలం అవుతుంది. పవిత్ర భావాలకు హృదయం నిలయం అవుతుంది. దయ, ప్రేమ, కరుణలు సంప్రాప్తమవుతాయి. అట్టి దైవీ గుణాలకు నిలయమైనప్పుడు అజ్ఞానం దూరమవుతుంది. అహంకారం దూరమవుతుంది. రాగ వాసనలు మటుమాయమైపోతాయి. కనుక ప్రతీ ఒక్కరూ సేవకు అంకితం అవ్వాలి. ఈ సేవ ద్వారా నిన్ను నీవు తెలుసుకునే ప్రయత్నము ప్రారంభించగనే అంతర్ ఆనందము దొరుకుతుంది. అదే సత్య సందర్శనము. అదే ఆత్మానందానుభూతి.

68. భగవంతుని వర్ణించుట అసాధ్యము అనిపిస్తుంది స్వామి.

చంద్ర బింబాన్ని చూడటానికి ఎటువంటి దీపమూ అవసరం లేదు. చంద్రుడు ప్రసరింపచేసే వెన్నెల సహాయంతో చంద్రుడ్ని చూడగలము. అదే విధంగా భగవంతుని విషయం చెప్పుకోవలసి వస్తే మానవ మాత్రుల మాటలకు శక్తి చాలదు. అందువల్ల భగవంతుని గురించి భగవంతుడు చెప్పిన మాటలే శరణ్యమవుతాయి.

69. మానవుడు తన గమ్యం చేరుటలో ఆశ్రమ ధర్మాలు ప్రతిబంధకాలా స్వామి?

మనస్సు భగవంతుని మీద లగ్నం చేయటానికి దుష్ట బుద్ధిని శుద్ధం చేయడానికి మనోవాక్కాయ

కర్మల ద్వారా భగవంతుడ్ని అర్చించటానికి ఏవిధంగానూ ఆశ్రమ ధర్మాలు అంటే బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస అవస్థలలోని విధులు కానీ వర్ణధర్మాలు కానీ అడ్డంరావు. లింగ వర్ణ ఆశ్రమ బేధాలు, దేహమే సత్యం, ఈ జగత్తే నిత్యమైనది సత్యమైనది అన్న భావాలకు అతీతంగా ఉండాలి.

70. జ్ఞాన, భక్తి, కర్మ మార్గములు మూడూ మానవుడిని తన గమ్యం చేరుస్తాయా?

నూటికి నూరుపాళ్ళు అనవచ్చు. మొదట భగవంతుడు తర్వాత ప్రపంచం, చివరకు నేను. ఈ జనన మరణము అనే దాని నుండి విముక్తికి నీవు ఇప్పుడు కానీ తర్వాత కానీ సాధకుడివి కావలసిందే. ఇప్పుడంతా తల క్రిందులుగా జరుగుతున్నది. జీవుడు మొదలు, దేవుడు చివరన. నీవు ఆయనను జ్ఞాన, భక్తి, కర్మ మార్గములలో ఎదో ఒక్క దాంతో పట్టుకోవచ్చును. నీవు రైల్లో మొదటి తరగతి, రెండవ తరగతి, మూడవ తరగతి ఏదో ఒక దాంట్లో ప్రయాణము చేయవచ్చు. గమ్యం ఒక్కటే. వీటిని ఆచరణలో పెట్టు. ఇవన్నీ ఒకే కిరణం యొక్క భాగాలు.

71. మానవ తత్వం గురించి తెలియపర్చండి స్వామి.

మనిషి ఇరవై నాలుగు తత్వాలను గమనించాలి. పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ ప్రాణాలు, పంచభూతాలు మిగిలిన మనో, బుద్ధి, చిత్తాది, అహంకారములు అనే నాలుగు. మొత్తం ఇరవై నాలుగు. ఇరవై ఐదవది జీవుడు. జీవుడికి ఒకవైపు ఇరవై ఆరవదైన పరమాత్మ మరొక వైపున అహంకారము. జీవుడు మిగితా ఇరవై నాల్గింటినీ ప్రకాశింపచేసి సత్యానికి అంటే ఇరవైఆరవ దానికి వాటన్నింటిని లాగుకుని రావాలి. వాటిని ప్రకాశింపచేస్తే అవి మాయమవుతాయి. అవి మాయ యొక్క అంటే అజ్ఞానం, అంధకారం యొక్క సంతానం కాబట్టి కాంతిలో బ్రతుకలేవు.

72. సత్య సందర్శనం ఎలా ప్రాప్తిస్తుంది స్వామి?

సొరకాయ నీళ్ళల్లో మునుగుతుంది. కానీ అదే సొరకాయ ఎండిపోతే తేలుతుంది. అట్లాగే నీలోపల అన్నీ ఎండిపోయిన తరువాత నీవు కూడా ఈ భవసాగారముపై తేలుతావు. అంటే నీలోని మోహబంధాలను, కోరికలను తొలగించుకో. ఆదుర్దాలను, ఆందోళనలను వదిలించుకో. అప్పుడే నీవు మార్పు, అవకాశం అనే

నీళ్ళ మీద ప్రభావం పడకుండా తేలగలుగుతావు. ఆ నీరు కూడా ఆవిరి అయినపుడు ఆకాశానికి లేవగలుగుతావు. తేలికతనాన్ని పొందుతావు. బరువు తగ్గించుకోండి. మూటాముల్లే వదిలించుకోండి. దాంతో నీవు పైపైకి లేవవచ్చును. చిత్తవృత్తి నిరోధమే యోగము. మనిషి యొక్క అంతర్ చైతన్యశక్తిని కలవరపర్చే ప్రవృత్తులను నిరోధించేదే అది. ఈ ప్రవృత్తులు నీ యొక్క బరువును అధికం చేస్తాయి. నిన్ను క్రిందికి లాగే కోరికల నుండి విముక్తుడవు కావాలి. సత్యం యొక్క సమక్షంలోకి చేరాలన్న ఆకాంక్షను కలిగి ఉండాలి. తాను కనుక్కొనబడాలని నీ అంతరంగంలోని సత్యం వేచి ఉన్నది. మోకాలు లోతు నీళ్ళల్లోనే ఉన్నా దాహంతో చస్తున్నవాడిలా మనిషి కూడా అరచేతిలో సర్వరోగ నివారిణిని ఉంచుకుని బాధపడుతున్నాడు.

## 73. శాంతం ఎపుడు లభిస్తుంది?

జీవితంపై ఎక్కువ మోహపడి దాని ఉచ్చులలో ఎక్కువగా చిక్కుకోకండి. మీ ఆవేశాలను స్వాధీనంలో ఉంచుకోండి. సముద్రం ఉపరితలానే తరంగాలు అలజడి కలిగిస్తాయి. అడుగున శాంతమే ఉన్నది. కాబట్టి నీవు నీలోతుల్లో నీవు మునిగినపుడు తరంగాల అలజడి నుండి విముక్తుడవు అవుతావు. అనేక విషయాలు శాశ్వతమైన విలువ లేనివి అని గుర్తించాలి. అందువల్ల వాటిని ప్రక్కకు నెట్టి వేయాలి. స్థిరమైన దానిని మాత్రమే పట్టుకుని ఉండు. ఏది పనికిమాలిన చెత్తనో ఏది పెన్నిధియో తెలుసుకొనుటకు విచక్షణ ఉపయోగించుకోవాలి.

## 74. మానవుడు పెంపొందించుకొనవలసిన లక్షణాలు ఎటువంటివి?

మీ అలవాట్లు మంచిగా ఉండి, మీ దృష్టి విశాలం చేసుకుని, మీ అంతర్ దృష్టి గాఢమయి ఇంకా ఏకాగ్రం కావాలి. భగవంతుని సర్వవ్యాపకత్వాన్ని మానవుల యొక్క ఏకత్వాన్ని మీరు గుర్తించాలి. మీరు సహనాన్ని, ఓరిమిని, దాతృత్వాన్ని, సేవా భావాన్ని నేర్చుకోవాలి. తీర్థ యాత్ర చేసిన తర్వాత ఇంట్లో కూర్చున్నప్పుడు మీ అనుభవాలను నెమరువేసుకుంటూ భగవంతుని తెలుసుకోవడంలో ఇంకా ఉన్నతమూ, సంపన్నమూ, వాస్తవమూ అయిన అనుభవాన్ని మరలా మీరు పొందుటకు నిశ్చయించుకోండి. ఈ లక్ష్య సాధనకు కావాల్సిన నిశ్చయం చేసుకుని అడుగు ముందుకు వేయండి. ఆ

అడుగు ముందుకు పడేటట్లుగా నేను ఆశీర్వదిస్తాను.

75. భగవంతునితో సత్ సంబంధాన్ని ఎలా ఏర్పర్చుకోవచ్చు స్వామి?

ధ్యానంతో జ్ఞానం, జపంతో భక్తి పెంపొందుతాయి. ఈ రెండిటితోనూ అహంకారపు కుళ్ళు నుండి నీ హృదయాన్ని శుద్ధి చేయగల్గుతావు. అనేక నాజూకులతో నామాన్ని గానం చేసినట్లైతే ప్రేమ అనే గొలుసుతో నీవు భగవంతునితో సంబంధం ఏర్పర్చుకోగల్గుతావు. ఎవరికి యుక్తమైన కాలంలో వారు వారి స్వీయ ప్రయత్నం ద్వారా వాళ్ల ఆర్తి వల్ల వారికి సొంతమైన ఒక అనుభవాన్ని భగవంతుడు వారికి చూపిస్తాడు. "నశ్రేయో నియమం వినా". నియమం లేకుంటే అభివృద్ధి లేదు. నిగ్రహం శక్తిని పెంచుతుంది. క్రమబద్ధత దాన్ని ఎక్కువ ప్రయోజవంతం చేస్తుంది.

76. కర్మను ఏ విధంగా ఆచరించాలి స్వామి?

మానవునికి ఎన్నో ఆశలుంటాయి. ఈ ఆశలన్నింటినీ కూడా క్రమ క్రమేణా తగ్గించుకుంటూ రావాలి. కేవలం <u>సెల్ఫ్</u> చూచుకోకుండా <u>హెల్ప్</u> చేయడం నేర్చుకోండి. ఏది చేసినా హృదయ తృప్తి కోసం చేయండి. కర్మను ఆత్మతృప్తి కొరకు ఆచరిస్తున్నాము అని భావించాలి. నీ యొక్క దేహాన్ని కొన్ని రోజులు ప్రేమిస్తావు. తర్వాత ప్రేమించలేక పోతావు. నీది అనుకున్నది నీవు ప్రేమించలేని సమయము వస్తుంది. ఆ సమయంలో నీవు అనే నీ నిజ స్థితిని నీవు అనుభవించగలవు.

77. ఆత్మ సందర్శన ప్రాప్తికి ఏవి అడ్డంకులు స్వామి?

లోకుల దృష్టి బాహ్య స్వరూపానికి మాత్రమే పరిమితము అయ్యేలా ఉంటుంది. బాహ్యస్వరూపము కేవలము ఒక ప్యాకేజి వంటిది. ప్యాకేజిని తొలగిస్తే గానీ పదార్థము మనకు కనిపించదు. దైవత్వమనేది ఈ ప్రకృతిలో పంచభూతములచేత కప్పబడి ఉన్నది. మానవుని ఆవరించిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాల వలన కంటికి కనిపించకుండా ఉన్నది. ఈ ప్యాకేజ్ తీసివేసినపుడు చక్కని అందమైన దైవ స్వరూపం **<u>సాక్షాత్కరిస్తుంది</u>**. కేవలం ప్యాక్ పైన దృష్టి పెట్టకూడదు. దానిని తెరచి చూస్తే గానీ అందమైన లోపలి పదార్థం కనిపించదు.

78. ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు ఏమి తెలుసుకోవాలి స్వామి?

ఏవిధంగా అయితే ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు చేతిలో కర్ర, కాలికి బూట్లు, కళ్ళకు అద్దాలు పెట్టుకుంటారో అదే విధంగా ఈ ఆధ్యాత్మిక శిఖరాన్ని అధిరోహించుటకు బాహ్యము అనే దృష్టిని తప్పించుకునే భగవత్ దృష్టి అనే కళ్ళజోడు ధరించటము నేర్చుకుంటే సృష్టి అర్థమవుతుంది. సృష్టికి మూలం కామం. ఏది అయితే సృష్టికి మూల స్థానమో అదే స్థానం లయకర్త కొలువై ఉండే స్థలం. ఎలా అంటే కోరికలు అడుగంటిపోయే స్థానం ఏది? స్మశానం. ఇచట నీవు అన్నీ అయిపోయి చివరకు ఏమీ లేని స్థితి అంటే ఏదైతే తీసుకుని భూమి మీద సంచరించావో దానిని అర్పించుటకై ఎతించే స్థలం. అలాగే మనస్సు నుండి నీవు తీసుకున్న కామం అనే దానిని ఆచరణ చేసి చూపి నీ చేత బలమైన కర్మ చేయించి తనలో నిన్ను లీనం చేసుకుంటుంది. ఇందులో ఏమీ లేదు అన్న సత్యాన్ని రుజువు చేసి తన యొక్క శక్తిలో నిన్ను లీనం చేసుకుంటుంది. స్మశానానికి, జన్మస్థానానికి అవినాభావ సంబంధం ఉంది. రెండూ కర్మకు అవకాశమిచ్చే స్థానాలు. జనన మరణాల ఫలితాన్ని తప్పించుకోవాలని నీవు కోరుకుంటావు. నీవు దీని కోసం మనస్సు నశించేటంత వరకూ శుద్ధి చేయాలి. నీవు ఆత్మకి పాత్రయైన మనోదేహాల వ్యాపార ఫలితమైన శరీరంతో కాక ఆత్మతో తాదాత్మ్యం చెందితే కానీ సాధించలేవు. నీవు క్రమశిక్షణతో కూడుకున్న ప్రయత్నంతో ఏదైనా సాధన చేయకపోతే నీ మీదకు అనుగ్రహం దిగిరాదు.

79. మేము దూషణ, భూషణ తిరస్కారాలకు చెలించకుండా ఎలా ఉండగలం స్వామి?

అభిమానం నిన్ను నీవు తెలుసుకునే ప్రయత్నం చెయ్యకుండా అడ్డుపడుతుంది. ఈ అభిమానం ఏ విషయంలో రావాలి? నిన్నెవరైనా ఏదన్నా ఒక చిన్న మాట అంటే బాధపడ్తావు. అసలు నీవు ఎవరు? ఎర్రగా, తెల్లగా, నల్లగా ఉన్న ఈ శరీరమా? అదే నీవు అయితే దాన్ని వదిలి ఎందుకు వెడ్తావు? ఎక్కడకు వెళ్తున్నావు? కనీసం కన్న వారికి, కట్టుకున్న వారికి, నీకు విద్యా బోధన చేసిన వారికి, బంధువులకు ఎవరికీ చెప్పకుండా ఎచ్చటకు వెడుతున్నావు? అడ్రెస్ చెప్పాలి కదా? అడ్రెస్ కూడా తెలీదు. ఊరు తెలీదు, ఏమీ తెలీదు. మరి అటువంటిదా నీవు? కాదు! నిత్య సత్య నిర్మలమైన నీ నిజ స్వరూపాన్ని దండించే అధికారం ఎవరికీ లేదు. ఒక ఉదాహరణ చెప్పనా? నీవు నడుస్తున్నప్పుడు నీ నీడ చెడ్డ వాటి మీదా పడ్తుంది, మంచి

వాటి మీదా పడ్తుంది. మరి అది నిన్నేమైనా అంటుతుందా? నీ నీడయే కదా? మరి నిన్నెందుకు అంటదు? అంటే నీవు వేరు, నీడ వేరు. అలాగే నీవు వేరు శరీరము వేరుగా గుర్తించాలి. శరీరాన్ని దూషించినపుడు నీవెందుకు బాధపడతావు? ఆ బాధ శరీరానిది అర్థమైందా?

80. సాధకుడు వేటిని అధిగమించాలి స్వామి?

ప్రప్రథమంగా అరిషడ్వర్గాలను జయించాలి. ఆత్మ జ్ఞానం ద్వారా ఇంద్రియాలు, మనస్సు మరియు బుద్ధి మీద సంపూర్ణ ఆధిపత్యం పొందవచ్చు. థర్మామీటర్ శరీరము యొక్క ఉష్ణోగ్రతను తెలిపినట్లుగానే నీ మాటా, నీ ప్రవర్తనా, నడవడీ నీ మానసిక సామాగ్రిని ప్రవృత్తులను సూచిస్తూ నిన్ను బాధించే ప్రపంచజ్వరం ఎంత ఎక్కువగా ఉన్నదో సూచిస్తుంది. ఇవన్నీ ద్వేషాహంకారాల వంటి ఆవేశాల చేత కలుషితం కాకుండా శాశ్వితంగా, సాత్వికంగా ఉండాలి. ఇతరులలో శాంతాన్ని కలిగిస్తూ శాంతంగా మాట్లాడాలి. పశుత్వమనే మురికి గుంటలో దొర్లుతూ భగవంతుడ్ని సమీపించాలని అనుకుంటే అవుతుందా? మోక్షసాధనలో వస్తు సంపదలు, వ్యక్తి కోరికలు అడ్డంకులు. సంకల్పానుసారంగా మంచివాయువును ఆహ్వానించాలి. అజ్ఞాన అంధకారములు నిన్ను పాడుచేయకుండా ఉండాలి. మార్పులు అనే సముద్రం మీద జీవితం అనేది వంతెన. దాని మీద నుండి దాటు కానీ దాని మీద ఇల్లు కట్టుకోకు. మనిషిలోని సహజమైన, ఆనందమైన జీవితాన్ని కించపరిచే అరిషడ్వర్గాలను అణిచివేయి. చంచలత్వం నిశ్చలమయ్యాక యోగ స్థితిని అధిరోహించి ఆత్మలోని దివ్య వైభవం తెలుసుకోవాలి.

81. ఆనంద ప్రాప్తికి ఏవేవి ఆధారములు స్వామి?

నేడు మీకు ఆనందోదయమే కానీ సూర్యోదయము లేదు. ఆనందమే జీవితానికి అందం. ఈ అంద ఆనందముల కలయికయే ఆత్మ. ఆనందమే మీ ఆహారం. ఆహారమునకు మూలాధారం వర్షం. వర్షానికి మూలాధారం యజ్ఞం. యజ్ఞానికి మూలాధారం కర్మ. కర్మకు మూలాధారం వేదం. వేదానికి మూలాధారం బ్రహ్మ. ఆ బ్రహ్మ అనుగ్రహం తగ్గటం వల్లనే కష్ట నష్టాలు. భగవంతుని నామమే వేదం. అంతర్వాహిని వలే ప్రవహిస్తున్న ఈ యజ్ఞ ప్రవాహం ఎవరికీ కానరాదు. యజ్ఞంలో త్యాగం చేయవలసింది అహంకార మమకారాలే.

82. అభిమానాన్ని తొలగించుట ఎలా స్వామి?

అభిమానం అనేది కంచుకోట లాంటిది. ఈ కంచుకోటను చేధించే ప్రయత్నం చేయాలి. అనగా కంచు కరిగేటంతటి వేడి నీవు పెట్టినట్లైతే అది కరిగి నీవు లోపలకు వెళ్ళుటకు దారి దొరుకుతుంది. అంటే నీ లోపల వేడి ఉద్భవించేలా భగవంతుని నామస్మరణ అనే వేడిని తగిలించి అభిమానం అనే తలుపు బద్దలుకొట్టి అంతఃపురమనే నీ సౌధములోకి ప్రవేశం సంపాదించుకోవాలి.

83. సత్సంగం సాధకునికి ఏ విధంగా సహాయకారి స్వామి?

సత్సంగంలో చేరడానికి ప్రయత్నించి అట్లా చేరడం చేత కలిగే లాభాలన్నింటినీ పొందాలి. సత్సంగం చేత నిర్మోహత్వం, నిర్మోహత్వం చేత మోక్షము లభిస్తాయి. నిరాశ, నిస్పృహలకు ఎప్పుడూ లొంగవద్దు. నష్టాన్ని, దుఃఖాన్ని సంతోషంగా అనుభవించు. అవి నీ వ్యక్తిత్వాన్ని గట్టి పరచడంలో సాయం చేస్తాయి. రాళ్ల మధ్యన వజ్రం కనిపిస్తుంది. బంగారం దొరకాలంటే మండుగుండికి ఉన్న త్రాటి ద్వారానే మందుగుండిని పేల్చాలి. ఔషధం పూర్తిగా గుణమివ్వాలంటే వైద్యుడు చెప్పే కఠిన పథ్యాన్ని పూర్తిగా పాటించాలి. నీ మనస్సుని శుద్ధి చేసుకున్నాకనే సత్సాంగత్యం నుండి మంచి లాభాన్ని పొందగలవు. అప్పుడే ఆత్మానందాన్ని అనుభవించగలవు. అట్లాగే నీవు చెడ్డ అలవాట్లకు, ఆలోచనలకు లొంగినపుడు నీకు తటస్థపడిన దివ్య పురుషుల యొక్క పవిత్ర సాంగత్యం నుండి మధుర సువాసన నీకు లభించదు. ఉత్తమశ్రేణి జీవితానికి అంకితమైనవాళ్లే నీ చుట్టూత ఉండేటట్లు చూసుకో. వాళ్ళు నీ లక్ష్య సాధనకు నీవు వెళ్ళే బాట మీద ముందుకు పోవటానికి ప్రోత్సాహాన్ని ఇస్తారు. నీవూ చిత్త శుద్ధి పొందగలుగుతావు. సత్సంగం నెమ్మదిగా బంధం కల్గించే కార్యకలాపాల్నుంచి విరమణ కలిగేటట్లు చేస్తుంది. అజ్ఞానిగా మనిషి పుట్టినపుడు తనను తాను మంచిగా తయారు చేసుకోవడానికి ఒక పద్ధతి ఉన్నది. ఆ పద్ధతే సత్పురుషుల్ని దర్శించడం, సత్పురుషుల మాటలు వినడం, సత్పురుషులతో మాట్లాడటం, వాళ్ల సలహా మేరకు నడుచుకోవటం. ఈ పద్ధతిని అమలుపర్చినట్లైతే అజ్ఞాని పరమహంసగా, జ్ఞానిగా మారగలుగుతాడు.

84. జీవితం చాలా కష్టముగా తోచుచున్నది. అందులోని ఇబ్బందులని ఎలా ఎదుర్కోవాలో కాస్త వివరించండి స్వామి.

చాలామంది మానవులు ఆనందం కొరకు సముద్రం వద్దకు వెళ్తారు. సముద్రంలోని నీరు, నీటిపై వచ్చే

నురగ, అలలు చూచి ఒడ్డున కూర్చుని చాలా బాగుంది, చాలా బాగుంది అంటూ చూచి ఆనందిస్తారు. చూడటంలోనే ఆనందం అనుభవిస్తే దానిని ఎప్పుడు అనుభవిస్తాడు? చూస్తేనే ఇంత ఆనందం లభ్యమౌతుంటే అనుభవిస్తే ఇంక ఎంతటి ఆనందాన్ని అనుభవించవచ్చు? ఈ సాగరమే జీవన సత్యాన్ని బోధిస్తుంది. ఈ సాగరంలో ఉండే నీరే జీవితము. ఎన్నో అలలు అనగా కష్టనష్టాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు జీవితంలో ఎదుర్కొనే అనేక సంఘటనలను తెల్పుతాయి. దాని మీద వచ్చే నురగయే నీవు అనుభవించే ఫలము. అనగా ఆనురగ ఎంత సేపు ఉంటుంది? పైగా అది ఎందులో కలుస్తుంది? అనగా క్షణకాలము. వీటి ద్వారా వచ్చేది అనుభవిస్తావు. అవి మరలా జీవితంలోనే కలిసిపోతాయి. వీటికి అంతం లేదు. నీవు అనేడిది ఉన్నంత వరకూ ఇది జరుగుతూనే ఉంటుంది. ఒక్క సారి ధైర్యం చేసి, శాంతం అనే నావికుడ్ని పట్టుకుని జీవితం అనే నీటిలోకి దిగండి. ముందు నీ ప్రయత్నంతో కొంత దూరం వెళ్ళగలుగుతావు. ఆ తర్వాత నీరు నిన్ను ముంచేస్తుంది. ప్రమాదం సంభవించబోతుంది అన్నది అర్ధమయినపుడు ఈత వచ్చిన నావికుడు నిన్ను పట్టుకుని లోపలకు **సురక్షితంగా** తీసుకువెళ్ళి నీవు ఎంత సేపు ఆనందాన్ని అనుభవించాలని అనుకున్నావో అంత సేపు నిన్ను అచ్చట గడిపేలా చేసి నిన్ను **సురక్షితంగా** నీ స్థానానికి తీసుకువచ్చి దింపి వెళ్ళగలడు. అంటే జీవితంలో నీవు నడవగలిగినంత దూరం నడిచినాక అప్పుడు లోతైన, భయంకరంగా అనిపించే సాగరం లాంటి జీవితం కనిపిస్తుంది. అప్పుడు ప్రార్ధన మొదలుపెడితే గురువు అనే నావికుడు నీకు సహాయము అందించటానికి సంసిద్ధమవుతాడు. సురక్షితంగా నిన్ను లోపలకు అంటే జీవితంలోకి తీసుకువెళ్ళి మునిగిపోకుండా మరలా ఒడ్డు చేరుస్తాడు. ఇంతే కాదు సముద్రం లోపల ప్రాణానికి హాని కలిగించే జీవరాశి చాలా మెండుగా ఉంటాయి. వాటి నుండి నిన్ను **రక్షిస్తాడు.** అనగా నీకు హాని కల్గించే ఎన్నో దుర్గుణాలకు సంబంధించిన అరిషడ్వర్గాలు జీవితమనే నీటిలో అంతర్గతంగా నీలోనే ఉండి నీ నుండే శక్తిని గ్రహించి చివరకు నిన్నే అంతమొందించే విధంగా చాలా గట్టిగా తమ మనుగడను సాధించుకుంటాయి. అటువంటి వాటిని అంతమొందించాలంటే మంచి నేర్పరి అయిన వేటగాడు కావాలి. అందుకే గురువు యొక్క ప్రాసస్త్యత చాలా ఎక్కువ. ఇచ్చిన అవకాశం, వచ్చిన అవకాశం ఈ రెండూ చేజార్చుకోవద్దు.

85. మా జీవన గమ్యాన్ని త్వరగా చేరాలంటే ఏమి చేయాలి స్వామి?

కోరిక చాలా పెద్దదే. పెద్దదానికి తగ్గట్లుగా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. నువ్వు రైలు

ఎక్కాలంటే రైలు ఛార్జీ, బస్సు అయితే బస్సు ఛార్జీ, విమానం ఎక్కాలంటే విమాన ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది. వీటిల్లో ఛార్జీ ఒక్కటే కాదు. ఎంత త్వరగా వెళ్ళాలన్నది కూడా ఇమిడి ఉంటుంది. ఎదో వెళ్దాంలే అనుకుంటే బస్సు కాని రైలు కాని ఎన్నుకోవచ్చు. వేగంగా నీవు చేరాలంటే విమానం ఎన్నుకోవలసిందే. దాని మూల్యం చెల్లించాల్సిందే. ఈ మూల్యం అనేదే సాధన. మీరు ఎంత ఆర్తితో నన్ను పిలుస్తారో అంత త్వరగా పలుకుతాను. మీరు పిలిచేది నన్నే అయి ఉండాలి. నన్ను పిలిచినపుడు నేనే పలుకుతాను.

86. జరుగుతున్నదీ, జరగబోయేది అంతా భగవంతుని సంకల్పమే అని చెప్పినపుడు మానవ సంకల్పము అనేది ఉంటుందా స్వామి?

అంతా నా సంకల్పమే అని చెప్పాను కానీ మానవుడు అంత శరణాగతి భావంతో ఉండుటలేదు. సంకల్పము నాదే. జీవుల కర్మానుసారము సంకల్పము చేయవలసి ఉంటుంది. ఈ కర్మ ఎచ్చట నుండి వచ్చింది? అంతా మీ సంకల్పమే అని అడుగవచ్చు. బుద్ధిని ప్రసాదించాను. మనస్సుని ప్రయోగించి, బుద్ధిని ప్రక్కకు నెట్టి చేసే కర్మఫలితాన్ని నా సంకల్పంగా ఎలా తీసుకుంటారు? మోహపాశములో చిక్కుకున్న మానవుడు మాయ అనే సాలెగూటిలో చిక్కుకుని భగవత్ సంకల్పమైన ఉన్నత సంకల్పాన్ని ప్రక్కకు నెట్టి చేయవలసినది అంతా చేసేసి ఇది భగవత్ సంకల్పం అంటే నేను ఒప్పుకోను. హృదయ స్థానం నుండి నీవు తీసుకునే నిర్ణయం భగవత్ సంకల్పం. మాయ చేత మనస్సు మాట విని నీవు చేయు పని నీ సంకల్పమే. దానికి అనుభవించవలసింది నీవు అనుభవించవలసిందే. పూర్తి శరణాగతి ఏర్పడినప్పుడు నీవు చేయు ప్రతీ కర్మ, ప్రతీ ఆలోచనా ఉన్నతంగా ఉంటుంది. అంటే భగవత్ భావన, సంకల్పము ఎప్పుడూ మంచిగానే ఉంటాయి. దీనినే ఒక విధంగా చెప్పాలంటే సర్వస్యశరణాగతి అని కూడా అనవచ్చు.

87. మోక్షము, జీవన్ముక్తి మరియు జీవన రాహిత్యము. వీటి గురించి తెలియపర్చండి స్వామి.

మోక్షము అంటే జన్మ సంబంధంగా నీవు ఈ లోకంలో ఇంక సంబంధ బాన్ధవ్యములు వదిలేసి నన్ను చేరటానికి సమాయత్తమైనాక నా రాజ్యం లోకి నిన్ను ఆహ్వానిస్తాను. నా సామ్రాజ్యం పేరే మోక్షము. అక్కడ ఉండాలి అంటే నీవు సంపాదించిన పూర్వ జన్మల్లో దాచుకున్న పుణ్య సంపద ఈ ప్రాప్తిని కలిగిస్తుంది. అచట జీవులు చేరి ఆనందాన్ని అనుభవిస్తారు. దాన్ని మోక్షసామ్రాజ్యము అంటారు. రెండవది జీవన్ముక్తి. ఇది

చాలా గొప్పది. ఎందుకంటే జీవితం జరుగుతూ ఉండగానే నన్ను పూర్తిగా అనుభవిస్తారు. తన అనుభవంలో భగవంతుని అనుభవించగలుగుతున్నాడు అంటే తన స్థితి ఎంత ఉన్నతంగా ఉన్నదో ఊహించు. అంటే పూర్తిగా నాలో అంతర్లీనంగా కలిసిపోయ్యి తనకు అంటూ ఏమి లేని స్థితిని సాధించి నాతో, నాలో కలిసిపోవుట యొక్క అంతరార్ధమే జీవన్ముక్తి. అనగా ప్రత్యేకంగా లేదు కావున ఇక ఎక్కడ నుండి మరలా వస్తాడు? ఆహార పదార్ధం జీర్ణమయ్యి ప్రత్యేక రూపం లేకుండా ఎలా నీలో కలిసిపోయి శారీరానికి శక్తిని ఇస్తుందో అలాగే నాలో మీరు కలిసిపోతారు. అదే జీవితానికి శక్తినిస్తుంది. మూడవది జీవన రాహిత్యం. ఇది పొందిన వారు వారి పూర్వ జన్మల్లో కూడా ఉత్తమ జన్మనే పొంది దాని ఫలితంతో ఇప్పుడు కూడా ఉత్తమ జన్మనే పొందుతారు. ఒకవేళ మధ్యస్తంగా ఉన్నా వారి యొక్క భావాలు ఉన్నతంగా ఉండి ఉత్తమ సంస్కారంతోనే జీవి నడవగలుగుతాడు. "శీతోష్ణః సుఖ దుఃఖేషు" అనగా సమస్థితిని అనుభవించి స్థిత ప్రజ్ఞులుగా పిలవబడుతూ అనుభవించేది అంతా భగవదనుగ్రహంగా స్వీకరించి జీవితంలో ఇంక అనుభవించవలసింది ఏదీ లేదు, అనుభవించినా భగవత్ ప్రసాదంగా భావించి జన్మ నుండి విముక్తిని పొంది భగవంతుని సమీపిస్తారు. మూడూ దగ్గర దగ్గర ఒక్కటే. ఎలా అనగా, రాజు యొక్క అంతఃపురం ఉన్నదనుకో సేవకులు అంతఃపురం దాకా రాగలుగుతారు. మంత్రి ఐతే ఏ గదిలోకైనా నిరభ్యంతరంగా వెళ్ళగలుగుతాడు. కాని రాణీవాసం లోకి వెళ్ళ లేడు. రాజు, రాణి అయితే ఎచ్చటికైనా, ఎప్పుడైనా వెళ్ళగలరు అనుభవించగలరు. కావున అటువంటి స్థితిని పొంది తన స్థాయిని గుర్తింపు పొందితే భగవంతుడు ఒసగే అంతఃపురంలో చోటుచేసుకోవచ్చు.

88. సాధకుడు కామ క్రోధాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి స్వామి?

మొట్టమొదటిగా ఇంద్రియ నిగ్రహం అన్నది తీసుకోవాలి. వాక్కు ద్వారా కోరికలను బహిరంగ పరుస్తాము. ఈ కోరిక అనేది మనస్సు నుండియే ఉద్భవిస్తుంది. మనస్సు కోరిన కోర్కెలను నెమ్మదిగా దానికి తెలిపి దాని నుండి వచ్చే కష్టాలను, బాధలను తెలియపరచాలి. లోపలికి తీసుకోబడేదెప్పుడునూ నిర్మలంగానూ, సాత్వికంగానూ ఉండాలి. శబ్దం, దృశ్యం, అభిప్రాయాలు, భావాలు, సంబంధాలు, ప్రభావాలు అన్నీ కూడా గౌరవాన్ని, వినయాన్ని, సమతూకాన్ని, సమచిత్తాన్ని, సౌరళ్యాన్ని పెంచాలి. క్రోధం అన్నది మత్తు పదార్ధం లాంటిది. నీ కోరిక తీరనపుడు వెంటనే నీకు నేనున్నాను పర్వాలేదులే అంటూ కామానికి క్రోధం తోడ్పడుతుంది. పొదలోని పెద్దపులిలాగా మృత్యువు పొంచియున్నది. కావున సమయాన్ని వృధా

పర్చుకోకుండా అలసత్వాన్ని, క్రోధాన్ని త్యజించటానికి ప్రయత్నించాలి. తుఫానుల నడుమ ప్రశాంతంగా ఉండాలి. శాంతంగా ఉండేవాళ్ళ సాంగత్యంలో కలిసి ఉండు. అటువంటి వాళ్ళ సాంగత్యంలో ఉన్నట్లయితే పొరపాటున క్రోధగుణమనేది నీ లోపల ఉద్భవించినా వాటిని అణగత్రొక్కటానికి వాళ్ళ యొక్క శాంతమే నీకు సహాయకారి అవుతుంది. దీని ద్వారా అంటే ఒకటి పట్టుకుంటే రెండవది నీకు సొంతమవుతుంది. పారమార్థిక చింతనలు కలవారితో నీయొక్క కదలికలు ఉండాలి. ఎందుకంటే మిఠాయిలు చేసి వాటిని జాగ్రత్తగా అద్దాల పెట్టెలో పెట్టావనుకో వాటి మీద ఈగలు వాలవు. అలాకాక బయట పెట్టేసినట్లైతే వాటి మీద ఈగలు వాలి రోగాలు రావటానికి కారణం అవుతుంది. అలాగే నీలోని సద్గుణములనేవాటిని కాపాడుకోకపోతే ఈ దుర్గణములనే ఈగలు రాలి చెత్త పదార్థంగా తయారుచేస్తాయి. కావున వాటిని వాలకుండానే చూడాలి. ఈ కాపాడగలిగేదే గురుసాంగత్యం. దీని పట్ల అచంచలమైన భక్తి, విశ్వాసము అనేవి మెండుగా దండిగా పెంచుకొని జీవన మార్గాన్ని సుగమం చేసుకోండి.

89. భగవత్ వాణిని మేము ఎప్పుడు వినగలము స్వామి? భగవంతుని సర్వవ్యాపకత్వము గురించి విశదపర్చండి స్వామి.

వీనుల నిండైన నాదస్వరం వినుటకు చెవులు పని చేయాలి. అలాగే భగవాన్ అడుగుల సవ్వడి వినాలంటే నీవు సైలెంట్ అయితేనే ఆ స్వరం వినిపిస్తుంది. ఆ సవ్వడి చేసే ప్రతిధ్వనులు అద్భుత ఆనంద తరంగాలను ప్రేరేపింపచేస్తుంది. ఆ తరంగాలు నిన్ను టచ్ చేయాలంటే ఆ సముద్రం లోపలకు వెళ్ళవలసిందే. రాగ ద్వేషాలతో కూడిన జీవితాన్ని విడిచి రసవత్తరమైన జీవితాన్ని అనుభవించినట్లైతే నీలోని రమ్యగుణాభి రాముడు సదా నిన్ను వరిస్తాడు. సముద్రం లోపలనే ఉన్నావు. కానీ నీరు ఎచట ఉన్నది అని అడిగినట్లయితే అది అమాయకత్వమనుకోవాలా? లేక అహంకారపు ఛాయ అనుకోవాలా? ఎందుకంటే జగన్మాత సృష్టించిన ఈ సృష్టిలోనే ఉండి నీవు ఎచట ఉన్నాను అని ఆలోచిస్తే నీటిలోపలే ఉండి నీరు ఎచట ఉన్నది అని నీవు వెతికినట్లుగా ఉంటుంది. నీ చుట్టూ ఉన్నది, నీ పైన ఉన్నది అంతా జగన్మాత సృష్టియే. ఆ సృష్టిలో నీవు ఒక పరమాణువు అన్నది మర్చిపోతున్నావు. దీన్ని మర్చిపోకూడదు.

90. భగవంతుని అనుగ్రహం జీవుడ్ని ఏ విధంగా కాపాడుతుంది స్వామి?

మీ యొక్క కర్తవ్యాన్ని ఎప్పుడైతే అమలుపరుస్తారో భగవంతుడు కూడా ఇంకా కొంచెం ఉత్సాహము ఎక్కువ చేసుకొని బిడ్డల ఆకలి తీర్చుటకు సంసిద్ధుడవుతాడు. ఈ **క్షేత్రంలో** చల్లిన గింజలు మొలకెత్తియే తీరాలి. భగవత్ సంకల్పంతో అనుగ్రహమనే వర్షం చాలా దండిగా పడటం వల్ల భూమిలోని గింజలు పైకి వచ్చి రాతి క్రిందకు కొట్టుకుపోయి సూర్యరస్మి తగలక మొలకెత్తటానికి అవకాశం లేక ఎప్పుడు మొలకెత్తుదామా? అన్న ఆతృతతో ఎదురు చూస్తున్నాయి. వాటికి మొలకెత్తే సమయము ఆసన్నమయినది కావున మరలా భగవదనుగ్రహమనే వర్షం చాలా దండిగా కురిసి వర్షపాతానికి రాతి క్రిందకు కొట్టుకుపోయిన గింజల్ని మరలా వర్షంతోనే భూమిలోకి తీసుకొచ్చి మొలకెత్తేటట్లు చేస్తుంది. రెండింటికీ అదే వర్షపాతం అవసరమయినది. జీవుని యొక్క కర్మలు బలీయంగా ఉన్నప్పుడు ఈ దైవానుగ్రహమనే వర్షమే నిన్ను ప్రక్కకు నెడుతుంది. అచట కొంత కాలం సేద తీరి నీ స్థితి ఎరింగి, వేచిచూచి, నీలోని అజ్ఞానాన్ని నాశనం చేసుకుని జ్ఞాన భాస్కరుని వెలుగుకిరణాలు నీపై ప్రసరించగనే లోపల ఉన్న బుద్ధి **ఆత్మసాక్షాత్కారాన్ని** కోరి మరలా భగవదనుగ్రహమనే వర్షం కోసం తహతహలాడి, తాపత్రయపడటంతో దయామయుడైన భగవంతుడు ఆ అనుగ్రహవర్షాన్ని కురిపించి రాతి క్రింద ఉన్న గింజలను మరలా **క్షేత్రరాజ్యమైన** ఈ **క్షేత్రంలోకి** తీసుకువస్తాడు. కావున సరైన పంట పండించుకొనుటకు అనువైన సమయము ఆసన్నమైనది. దీనిని అశ్రద్ధతో చేజార్చుకోవద్దు. మీ యొక్క సమయాన్ని వృధాపర్చుకోకండి. మీ మీద దయతో మీకు అప్పగించిన పనిని పూర్తి చేసి నా వద్దకు చేరే ప్రయత్నము కొనసాగించండి.

91. స్వామి, మీరు బోధిస్తున్న దానిని మీరు ఆశించే విధంగా మేము ఆచరణలో చూపలేకపోతున్నాము.

ఔను నిజమే. నా బాధ కూడా అదే. ఒక ఆకారాన్ని తీసుకుని మీ ముందు నడచి, మీకు బోధించి బోధించి ఎవరైనా ఒక్కరైనా దొరకకపోతారా అని అనుక్షణం ఎదురుచూచాను. దేహానంతరం కూడా ఈ ఎదురుచూపులే నాకు మిగిలాయి. జీవుల యొక్క ప్రారబ్ధకర్మలు చాలా బలీయంగా పాతుకుపోయినాయి. వీరిని ఉద్ధరిద్దామన్నా చేయి విదిలించుకుని పారిపోతుంటే భగవంతుడు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. నేను నోరు ఎండుకుపోయేటట్లు అప్పుడూ చెప్పాను, ఎప్పుడూ చెబుతాను. ఎంత చెప్పినా వినకపోగా, పైగా నా మీద ఎందుకు ఇంత శ్రద్ధ చూపుతున్నారు స్వామి? ఇది నమ్మవచ్చునా అనే పెద్ద అనుమానం

వచ్చినట్లయితే ఎలా? నీవు అతి జాగ్రత్తగా కొండ ఎక్కి అజాగ్రత్తతో కొండ అంచున కాలుబెట్టినట్లైతే అగాధంలోకి పడిపోవడం తథ్యం. కావున ఎంత జాగ్రత్తగా ఎక్కావో అంతకన్నా ఎక్కువ జాగ్రత్తతో కొండ మీద నిలబడటానికి ప్రయత్నం చేయాలి. ప్రయత్నలోపం నీలో ఉంచుకుని సరైన సాధన సల్పక అందించినదానిని అజాగ్రత్తతో నేలపాలు చేసుకుంటే మరలా దొరకని అమృత సమయము. ఈ అమృతాన్ని ఒలకబోసుకుని దోసిలిపట్టి కావల్సినంత త్రాగి నీవు అనెడిది కాంతులీనే వరకూ ప్రయత్నాన్ని కొనసాగిస్తావని ఆశతో ఎదురుచూస్తున్నాను. ఇది మీ నిరీక్షణ కాదు భగవంతుని నిరీక్షణ. అప్పటినుండి ఇప్పటి వరకూ ఎన్నో సందర్భాల్లో భక్తుని కొరకు భగవంతుడు పరిగెడుతున్నాడు. అలాగే ఈ రోజు కూడా అదే సందర్భము.

92. జన్మలకి కారణం జీవి చేసుకున్న కర్మలేనా స్వామి?

జీవితము అనెడిది రంగవల్లి. అనేక రంగులతో తీర్చిదిద్దటం వల్ల అందంగా కనిపిస్తుంది. అలాగే జీవితం కూడా అనేకమైన బంధాలతో అనేకమైన వాటితో రంగు రంగులుగా కనిపిస్తూ ఇది శాశ్వతము అనే భ్రమను కల్పిస్తూ మానవుడిని ముంచెత్తుతుంది. కానీ ఈ రంగవల్లికి మూలం వెనుకనున్న చుక్కలు. ఒక చుక్క నుండి ఇంకొక చుక్కను కలుపుతూ గీసే గీతే లేకపోతే చుక్కలు చుక్కలుగానే ఉండిపోతాయి. నీవు చేసే కర్మలే నీవు గీసే గీత. చుక్కే జీవితం. నీవు చేసే కర్మల ద్వారా ఈ జీవితం ఇంకొక జీవితానికి **కనెక్ట్** చేయబడుతుంది. అలాగే నీ చుట్టూ ఉన్న జీవులు. ఇవన్నీ కలిపి పెద్ద రంగవల్లి తయ్యారయ్యింది. ఈ రంగవల్లికి ఆధారం చుక్కలు. అలాగే ఈ జన్మకు ఆధారం కర్మ. ఈ కర్మలను సత్ కర్మలుగా చేయండి. సదాలోచనలు జరపండి. ఆవేశాలకు తావీయద్దు. క్రోధాన్ని సమూలంగా నాశనం చేయండి. లోభం అనెడిది నిన్ను లొంగదీసుకుని మరలా లేవలేని అసహాయుడిని చేస్తుంది. మోహ, మద, మాత్సర్యాలు మదపుటేనుగు వలే తయారయ్యి చివరకు నీవు అలసి సొలసి నీకు నీవుగా డస్సిపోయి కింద పడే సమయం వస్తుంది. కావున వాటి ఆటపాటలకు లొంగకు. నీవు ఎంత మంచి రంగవల్లి తయారు చెయ్యాలనుకుంటావో ఆఆర్డరులో చుక్కలు పెట్టవలసి ఉంటుంది. దానిని కలుపుకుంటూ పోవలసి ఉంటుంది. ఆ రంగవల్లి తయారు చేయుటకే నేను ఇచ్చే ఈ గైడెన్స్. మీరు పొందుతున్న ఈ విలువల ద్వారా జన్మరహస్యాన్ని ఛేదించండి. మీరు ఎవరు? నేను ఎవరు? ఈ రెండింటికీ మధ్య బేధము మీకు అవగతమయ్యేలా నా బోధనలు తీసుకోండి. లేవండి! తమస్సులో నిద్రించకండి. బహుదూరపు బాటసారులు కాకండి. మీకు నాతో

ఉన్న బంధాన్ని గుర్తుకు తెచ్చుకోండి. నా కదలికలను సామాన్యంగా తీసుకొని అమాయకత్వంలో అపోహలో మునగకండి. సమయాన్ని వృధా చేయకండి.

93. భక్తితో ముక్తి లభిస్తుంది అంటారు. అది ఎలా స్వామి?

భక్తి శక్తి వైపుకు తీసుకెళ్తుంది. శక్తి మీకు యుక్తిని ప్రసాదిస్తుంది. యుక్తి మీరక్తిని (అనురక్తి) యోగ్యమయిన వస్తువులపై స్థిరం చేస్తుంది. ఈ తీరున వికసించిన భక్తి చివరకు మిమ్మల్ని ముక్తి దరికి చేరుస్తుంది. హృదయమనే భౌతిక అవయవము కంటే ఆధ్యాత్మిక హృదయం భిన్నంగా ఉంటుంది. ఆ భిన్న హృదయములో భగవంతుడు బందీయై ఉంటాడు. అచట స్థానాన్ని సంపాదించుకున్న యెడల వారి లోపల ఆధ్యాత్మికత అనెడిది అనుభవేకవేద్యంగా తీసుకుంటారు. క్రమశిక్షణ అనేది క్రమ క్రమంగా నీవు ఇచ్చిన కట్టుబాట్లకు లొంగుతుంది. పరివర్తన, ప్రవర్తన ఈ రెండిటిపై ఫలం ఇవ్వబడుతుంది.

94. స్వామీ! మీ నుండి స్వయంగా దివ్య సందేశాన్ని అందుకొనుట మా అదృష్టము.

మీ ప్రార్ధన మేరకు మీ యొక్క మానసిక స్థితిని పెంచి మీరు కోరుకున్న స్థితిని అందించవలసిన బాధ్యత నా మీద ఉన్నది. నేను బోధించేది మీరు పాటించినా పాటించకపోయినా నా విధిని నేను కొనసాగిస్తూనే ఉన్నాను. స్టూడెంటుకి మంచి మాస్టర్ దొరుకుటే అదృష్టం. మంచి మాస్టర్ దొరికినా స్టూడెంట్ మంచిగా చదువక పోతే, ఒకవేళ చదివినా శ్రద్ధగా పరీక్ష వ్రాయకపోతే **మార్క్స్** ఎలా సాధిస్తాడు? ఈ రోజు పరిస్థితి అలానే ఉన్నది. విద్యార్థి కోసం మాస్టర్ వెంట పడుతున్నాడు. వ్యతిరేక దిశలో జరుగుతోంది. ఇచట ఒక కారణం ఉన్నది. ఏమిటంటే, విద్యార్థి అడిగిన విధానాన్ని అనుసరించి గురువు శిష్యుని వెదకి పట్టుకొనవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన దానిని జీవితానికి సమన్వయించుకుని అడుగు ముందుకు వెయ్యండి. క్షణ క్షణము మీ అభివృద్ధి కొరకే ఒక తల్లిగా గురువుగా నా బాధ్యతా నేను నెరవేరుస్తున్నాను. నమ్మకము, విశ్వాసము అనేవి మెండుగా తీసుకుని ఒక్కక్క అడుగు ముందుకు వేస్తూ గమ్యం చేరవలసిన సమయం ఇది. సమయం మించితే దొరకదు. దొరికిన సమయాన్ని సద్వినియోగ పర్చుకోండి.

95. అందరూ ఒకే విధమైన సాధన చేయవలసి ఉంటుందా స్వామి?

అన్ని రోగాలకు మందు, పథ్యం ఒకే పద్ధతిలో ఉండదు. రోగిని బట్టి, రోగాన్ని బట్టి ట్రీట్మెంట్ ఇవ్వటం జరుగుతుంది. రోగాన్ని డాక్టర్ గుర్తిస్తాడు. అలాగే ఒక్కొక్క జీవి యొక్క పూర్వ జన్మ సంస్కారము, ఈ జన్మలోని సంస్కారంతో ట్రీట్మెంట్ నిర్ణయించ బడుతుంది. నీకు వైద్యాన్ని గురించి తెలియదు. కానీ అంతా తెలిసిన వాడిలా మాట్లాడితే ట్రీట్మెంట్ ఇచ్చే డాక్టర్ తాను కోరుకున్న ట్రీట్మెంట్ ఇవ్వాలా? లేక మీరు కోరుకున్న దానిని ఇవ్వాలా? రోగి రోగాన్ని తగ్గించే మందు ఇవ్వడమే డాక్టర్ బాధ్యత కనుక రోగాన్ని కుదుర్చుకోవటానికి డాక్టర్ వద్దకు వచ్చాక మీ దేహాన్ని డాక్టర్కు అప్పగించండి. మీలోపల విషయ వాసనలు రేకెత్తకుండా ఉండునంతవరకు భగవంతుడు కూడా ఎదురు చూస్తూ ఉంటాడు. లౌకిక, బౌతిక వాసనలు పూర్తిగా పరిత్యజించగలగాలి. సన్యసత్వము అంటే పరిత్యాగము అని అర్ధము.

96. భగవత్ <u>**సాక్షాత్కారము**</u> ఎలా లభిస్తుంది?

భగవంతుడు మీ యందే ఉన్నాడు. మీకన్నా వేరుగా లేడు. సరి అయిన రీతిలో సాధన సల్పినపుడు మీనుండే ఆవిర్భవిస్తాడు. కానీ అది గుర్తించుట లేదు. దాన్ని గుర్తించాలంటే పరిపూర్ణమైన, స్వార్ధరహితమైన ప్రేమను అభివృద్ధిపర్చుకోవాలి. అప్పుడే ప్రేమ స్వరూపుడు <u>**సాక్షాత్కరిస్తాడు**</u>. ప్రేమయే లేకుండిన ఎన్ని సాధనలు చేసినా ఫలితము ఉండదు.

97. భగవంతునికి చేరువవుటకు మా స్థితి ఎలా ఉండాలి స్వామి?

భగవంతుని వద్దకు చేరటమంటే భస్మమయిన తర్వాత బూడిద ఎలా ఉంటుందో అంటే దానిని వేరే విధంగా మార్చటానికి ఎలా వీలు కాదో అలా మానవునిలో అన్ని గుణాలు నాశనమయిపోయి అది ఇక ఎటువంటి మార్పు చెందుటకు వీలు లేని విధంగా తయారయితేనే భగవంతుడు దానిని అంగీకరిస్తాడు.

98. నిందలు, అవమానాలను సాధకుడు ఎలా ఎదుర్కోవాలి స్వామి?

జయదేవుడు, తుకారాం, కబీరు, గౌరాంగుడు, రామకృష్ణుడు, రామదాసు వంటి సాధువులందరూ కష్టాలనీ, దుఃఖాలనీ అనుభవించే భగవంతుడిని చూడగలిగి ఆయనతో లయమైనారు. మానవుని స్మృతి అన్న దేవాలయంలో వారు శాశ్విత స్థానాన్ని సంపాదించుకున్నారు. నిందాపహాస్యాలను ఆనందంతో కూడిన

జీవితంగా తీసుకోవాలి. ఎదుర్కోవాలి. అల్పులనుంచి ఇలాంటి నీచమైన నిందలు అవతార పురుషులకు కూడా తప్పలేదు. కోకిల కనబడితే దాన్ని గాయపరుద్దామని కాకులు వెంటబడ్డాయి. అల్పుల అసూయకు సత్పురుషులు లక్ష్యం అవుతారు. సత్పురుషులు క్రూరుల యొక్క అసూయ, ద్వేషానిందదూషణలకు ఎప్పుడూ లక్ష్యమవుతారు. ఉయ్యాలలో నుండి భూమ్మీదకు వచ్చి తన చివరి ఘడియల వరకూ కృష్ణుడు ఈ ఆటంకాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన యొక్క ప్రతీ అడుగులో ద్వేషం, నీలాపనిందలు, అకారణ దూషణ, అప్రతిష్టలు వెన్నాడినవి. ఆయన తన చుట్టూ వ్యాపింప చేసిన కాంతి, ప్రేమలను చూచి సహించలేక ఆయన పేరును, ఆయన ప్రచారాన్ని నాశనం చేసే రాక్షసత్వానికి పాల్పడ్డారు. ఆయన ఉద్దేశాలను చెడగొట్టి ఆయనను దారి మళ్ళించడానికి గాను ఎన్నో ప్రయత్నాలు చేసారు. కానీ సత్యమే జయించింది. నీలాపనిందల పొగమంచుకి కొంతసేపు సత్యం మరుగున పడవచ్చును. కానీ విజయం తథ్యం. నీలాపనిందలను, అసత్యాలను వ్యాపింపచేసేవారి మాటలకు చెవులప్పగించకు. మనస్సును కుదువబెట్టకు. ధైర్యంగా ముందుకు సాగు. ప్రతీ క్షణం నీ కొరకై ప్రేమతో అందిస్తున్న దానిని అందుకుని దానికి కృతజ్ఞత అనేది చూపుటకై ఆచరణ చూపాలి కదా? ఆహారమందించే వాడిని, దానిని పాత్రలో సిద్ధం చేసే వారిని, ప్లేట్లలో పెట్టి ప్రేమగా తినిపించే వారిని మరువవచ్చా? ఇంతకన్నా కృతఘ్నత వేరొకటి కలదా? జీవితాన్ని సరిచేసుకుని మానసిక పరిపక్వతతో అడుగు ముందుకు వేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

99. స్వామీ, మీకు శరణాగతులం కావాలి అంటే మా స్థితి ఎలా ఉండాలి?

కోరికలు లేకపోవుట అనే ఈ పవిత్ర మార్గాన్ని అనుసరించుటకు తనను తాను సమర్పించుకోవాలి. సమర్పణ చేసుకోవటానికి కొన్ని అడ్డంకులు ఉన్నాయి. ఈ ప్రపంచంలో ధనికుని ఇంట్లోకి కానీ ముఖ్యమైన పదవి ఉన్న వారి ఇంట్లోకి కానీ అడ్డంకి లేకుండా లోపలికి పోవుట సాధ్యం కాదు.

ఇంటి ద్వారం వద్ద కాపలా వాడు ఉంటాడు. వాడు ఇంటాయనతో నీకేమి పని? అని అడుగుతాడు. పరిమితమైన అధికారాలు, లౌకిక పదవి ఉన్న వారి విషయం లోనే నీవు వారి ఇంట్లోకి వెళ్ళటానికి నియమ నిషేధాలుంటే, అపరిమితమైన శక్తులున్న భగవంతుని ఇంట్లోకి వెళ్ళాలంటే నియమ నిబంధనలు ఉండుటలో ఆశ్చర్యం ఏముంది? ఆయన ప్రధాన ద్వారం వద్ద ఇద్దరు సైనికులు కాపలా ఉన్నారు. వారు నిన్ను అడ్డగిస్తూ ఉంటారు. వారి పేర్లు శమము, దమము అనగా ప్రయత్నము, సహనము. ఇవి లేకుండా

నీవు దైవ నివాసం లోపలకు ప్రవేశించుటకు సాధ్యం కాదు. ఆత్మ ప్రాప్తికి, సత్య లబ్ధికి ప్రాచీనులు ఒక రాజ మార్గాన్ని సాధనంగా వేసారు. అలాంటప్పుడు ముళ్ళ డొంకల్లో, సందు గొందుల్లో తిరగడం ఎందుకు? మీకు విధించిన జప సాధన, ధ్యాన సాధనాలను అభ్యాసం చెయ్యండి. అనుభవమున్న వారి నుండి తెలుసుకోండి. పూలతో పూజ చెయ్యండి. మాలతో జపం చెయ్యండి. అయితే ఉన్నత లక్ష్యం చేరేవరకు మాత్రమే. చెట్టుకున్న పూలు పూజ చేస్తే చెట్టుకి, పూలకు లాభం. నీకేమిటి లాభం? నీకు లాభం కలగాలంటే నీ లోపల ఉన్న దుర్గుణాలను పరిత్యజించాలి. నీ హృదయంలో వికసించే కమలాన్ని భగవంతుడు ఆశిస్తాడు. దానిని అందించే ప్రయత్నానికి పూనుకోవాలి.

100. జీవన సాఫల్యం సాధించుట ఎలా స్వామి?

జీవన సాఫల్యం సాధించుటకు రెండు మార్గాలున్నాయి:

i. ప్రార్ధన
ii. ధ్యానము

ప్రార్ధన నిన్ను భగవంతుని చరణాల వద్ద వేడుకునే వాడిలా చేస్తుంది. ధ్యానమేమో భగవంతుని నీ వద్దకు అంటే క్రిందకు వచ్చేటట్లు చేస్తుంది. నిన్ను ఆయన స్థాయికి ఎదిగేటట్లుగా చేస్తుంది. ఒకరిని క్రింద స్థాయిలో మరొకరిని పై స్థాయిలో కాక ఇద్దరినీ ఒక్క స్థాయిలో నిలుపుతుంది. ప్రార్ధన ద్వారా బంధ విముక్తి కలిగించే దానికి రాచబాట ధ్యానం. అర్రులు చాచే ఇంద్రియాలను నిగ్రహించాలి. భగవంతుడు నిన్ను పట్టుకొనకపోతే నీవు పడిపోతావు. నీవు ఏమి చేసినా, నీవు ఎక్కడ ఉన్నా ఆ పని కోసం దేవుడు నిన్ను అచట పెట్టాడని విశ్వసించు. అప్పుడది ఒక విద్యగా, సాధనగా అవుతుంది. ప్రతీ రోజు, ప్రతీ కర్మలో, ప్రతీ ఆలోచనలో, ప్రతీ మాటలో దేవుడికి ఇంకా దగ్గరగా జరగాలి. అది నీకు మహదానందాన్ని ఇస్తుంది. అది నిజమైన **<u>మోక్షాన్ని</u>** ఇస్తుంది.

101. కోరికలను ఎలా అదుపు చెయ్యాలి స్వామి?

ఆధ్యాత్మిక జీవితంలో గుర్తించదగ్గ విషయము కోరికలను అణచటమే. స్వీయేచ్ఛను, దైవేచ్ఛకు సమర్పించడమే. మనోవాక్కాయ కర్మలన్నింటినీ అర్చన కార్యంగా వృద్ధి చెందించుకోవాలి. రావణుడు

చనిపోయినపుడు ఆ దేహం మీద పడి మండోదరి "నీ కామాన్ని తప్ప శత్రువలందర్నీ జయించావు. నీవు విద్వాంసుడివి. అత్యంత శక్తివంతులైన శత్రువులను కూడా అణిచివేసావు. కానీ నీ కోరికకు మాత్రం బానిస అయినావు. అదే నీ పతనానికి కారణమైంది" అని శోకించింది. బూతద్దం సూర్య కిరణాలను ఏకం చేసి కాగితాన్ని, గడ్డిని ఎలా కాల్చగల్గుతుందో అలాగే శ్రద్ధతో కూడిన ఏకాగ్రత అమితమైన కోరికల బీజాలను కాల్చివేస్తాయి. అందుకే ప్రాతః సాయంకాల, సంధ్యా వేళల్లో కనీసం ఐదు నిమిషాలు ధ్యానం చేయండి అని చెబుతాను. దాన్ని శ్రద్ధతో చేయండి.

102. ధర్మార్ధ కామ్య **<u>మోక్షాలను</u>** సాధించటానికి ఏవి అవసరం స్వామి?

భగవంతుడే కేంద్రంగా కల్గిన సంతుష్ట మానవుడు యోగి. ఇంద్రియ సుఖాలతో త్రుళ్ళిపడేవాడు భోగి. అనారోగ్యంతో కూరుకు పోయినవాడు రోగి. ధర్మార్ధ కామ్య మోక్షాలను సాధించటానికి ప్రప్రధమంగా కావల్సింది మనో దేహాల యొక్క ఆరోగ్యం. రోగము అంటే అసుఖ భావన. సమచిత్తాన్ని నిగ్రహాన్ని చెడగొట్టడం వల్ల కలిగే దైహిక మానసిక పరిస్థితి. ఇది రెండు కారణాల వల్ల కలుగుతుంది. దుష్ట ఆహారం వల్ల, దుర్వికారం వల్ల రోగం వచ్చాకో లేక దాన్ని అదుపు చేయటానికి వీలు లేనంతగా పెరిగినాకో మందులకోసం పరిగెత్తే దాని కంటే దాన్ని నిరోధించటమే తెలివైన పని. కేవలం జప ధ్యాన నామస్మరణల లాంటి సాధనలే కాదు అవసరం. వీటిని చెయ్యాల్సిందే. కాని వీటి ప్రభావానికి తోడుగా నీవు సాత్విక **లక్ష్యాలతో** సదాలోచనలకు వీలయ్యే జీవితాన్ని గడపాలి.

103. సాధన ఎన్ని రకాలు? వాటిలో ఉన్నతమైనది ఏది స్వామి?

సాధనలు మూడు రకాలు:

i. మీన సాధన - చేప నీళ్ళల్లోనే బ్రతుకగలదు. అలా బ్రతకడాన్ని జ్ఞాపకం చేసుకుంటే అర్ధం అవుతుంది. అలాగే ఏకాంతంలో ధ్యానం చేయడమే మీన సాధన. నలుగురిలో కూర్చుంటే సాధన ఫలవంతం కాదు.

ii. మృగ సాధన - ఇతరులలతో కలసి ఉన్నప్పుడే ఏకాగ్రత కుదిరితే అది మృగ సాధన. ఇంకెక్కడికీ అంటే నీళ్ళ ల్లోకి వెళ్ళి సాధన చేయలేవు. ఇందులో వలే కొందరు ఇతరుల సాంగత్యంలోనే ఏకాగ్రతను పొందగల్గుతారు. ఏకాంతంలో ఏకాగ్రతను పొందలేరు. ఏకాంతంలో ఉంటే వారు కుటుంబ సమస్యల్ని

ఆలోచించడము మొదలు పెట్టారు.

iii. కూర్మ సాధన - తాబేలు నీళ్ళల్లోనూ, భూమి మీద సమానంగా ఉండగలదు. అంటే నలుగురిలో ఉన్నా, ఏకాంతంగా ఉన్నా ఏకాగ్రత పొందగల్గడమే కూర్మ సాధన. ఇది సాధకుడు పొందవలసిన స్థితి.

104. అంతిమ సత్యాన్ని మనిషి ఎలా తెలుసుకోగలుగుతాడు స్వామి?

నీ మీద నీవు విశ్వాసం కలిగి ఉండు. సాధన యొక్క ఖచ్చితమైన time table కు కట్టుబడి ఉండగలిగే నీ శక్తి మీద, మోక్షము అనే **లక్ష్యాన్ని** సాధించడమనే నీ శక్తి మీద విశ్వాసం కలిగి ఉండు. తరంగం మీదనే విశ్వాసం లేకపోతే సముద్రం మీద ఎలా ఉంటుంది? బుద్ధి, నైపుణ్యాలను వాడటం ద్వారా ఒక చిన్న ఉక్కు ముద్ద అందమైన గడియారం అవుతుంది. మరి వివేక వైరాగ్యాల ద్వారా మనిషి అంతిమ సత్యాన్ని తెలుసుకునే ఋషిగా మారలేడా? సర్వమత పవిత్ర గ్రంధాలు మనిషి శాశ్వత శాంతి స్థానం చేరటానికి సహాయం చేస్తాయి. లక్ష్య సాధనకు చేరే బాటలో ఇవన్నీ మజిలీలు. తర్వాత ప్రయాణంలో ఇంకో మజిలీ చేరడం ఎలాగో చెబుతారు. అచట నుండి మరొక మజిలీకి బయలుదేరుతారు. ఆధ్యాత్మిక మార్గంలో ఎదురయ్యే అడ్డంకులకు సాధకుడు సాధారణంగా ఒక రకమైన నిరసన తెలుపుతాడు. కానీ ఈ పరీక్షలు భవిష్యత్తులో అభయం కోసమేనని భావించాలి. పటాన్ని వ్రేలాడదీయడానికి ముందు మేకు గట్టిగా దిగిందా? లేదా? అని దాన్ని ఒక్క సారి ఊపి చూస్తావు. సమమైన బుద్ధి ద్వారా నిశ్చలమైన, చెదిరిపోని, మార్పు చెందని జ్ఞానం సంపాదించాలి. ఈ జ్ఞానాన్ని సంపాదించడానికి అజ్ఞానము దూరం చేసి మీరు చేసే సాధనలో మెళకువలను తెలుసుకుని అడుగు ముందుకు వెయ్యండి. గురువు యొక్క బోధనా పద్ధతులు వేర్వేరుగా ఉంటాయని తెలుసుకోవాలి. ఒక్కటే మందు అన్ని రోగాలకు పని చెయ్యదు. రోగాన్ని బట్టి మందు వాడాలి. ట్రీట్మెంట్ అయి పొయ్యాక రోగం తగ్గిన తర్వాత స్వతంత్రుడిగా ప్రకటించాక ఇక పథ్యము ఉండదు. అప్పటివరకూ వైరాగ్యమనే దానిని పొందుటకు ట్రీట్మెంట్ అవసరం. డాక్టర్ని నేనే.

105. మొదటి దశలో ధ్యానం ఎలా అభ్యసించాలి?

ధ్యానానికి మొదట కూర్చున్నప్పుడు భగవంతుని గురించి కొన్ని శ్లోకాలను, స్తోత్రాలను పఠించాలి. దాంతో చెల్లా చెదరైన మనస్సు ఏకాగ్రమై తాను కోరుకున్న స్థితిని అందుకోవటంలో ప్రథమ ఫలితాన్ని అందుకోవచ్చు. నెమ్మది నెమ్మదిగా జపం చేస్తున్న వేళ నామానికి సంబంధించిన రూపాన్ని మనోనేత్రం

ముందు ఉంచుకోవాలి. నామస్మరణ నుండి మనస్సు తప్పించుకుపోతే రూపం మీదకు తీసుకు వెళ్ళాలి. రూపం మీద నుండి తొలిగితే నామం మీదకు తీసుకువెళ్ళాలి. ఏదో ఒక దాని మాధుర్యాన్ని అనుభవింప చేయాలి. ఇలా చేసినట్లైతే మనస్సు త్వరగా లొంగిపోతుంది. నీవు ఊహించుకున్న చిత్రం హృదయానికి ఏది ఇష్టమైనదో అది భావచిత్రంగా రూపాంతరం చెందుతుంది. క్రమంగా పరమేశ్వరుడు తన కోరిక తీర్చాలని అనుకున్నప్పుడు ఆరూపాన్ని ధరించి **<u>సాక్షాత్కారమిచ్చుట</u>** జరుగుతుంది. ఈ సాధనను జపహిత ధ్యానము అంటారు. ఇది ప్రారంభదశలో వారికి మంచిది. దీనిలోని ఆనందాన్ని రుచి చూచిన తరువాత రోజుకి కొంత సమయాన్ని పెంచుకుంటూ అనుభవించిన శాంతి సంతోషాల వైపుకు మనస్సు త్రిప్పినట్లైతే ధ్యానఫలితాన్ని రుచి చూచిన వారు అవుతారు. దీని తరువాత ఆనందం తన సొంతం అవుతుంది.

106. దీనికి (ధ్యానానికి) సమయ పాలన అవసరమా స్వామి?

బ్రహ్మీముహూర్తంలో నిద్ర లేచుటకు ప్రయత్నించు. లేవగానే ధ్యానానికి కూర్చోవాలి. ఇందుకు నీకు మొదట అలారం అవసరం ఉండవచ్చు. క్రమేణా ధ్యానం మీద మనస్సు మళ్ళుతున్నకొద్దీ ఆనందాన్ని అందుకుంటున్నకొద్దీ మెళకువ వస్తుంది. స్నానం అన్న ఆచారం నీ ఇంద్రియాలను నిద్ర లేపి నీ సాధనను ఫలవంతం చేయనీయదు. ఇది అనేక వైపులకు లాగుతుంది. క్రమశిక్షణలో కూడిన ధ్యానం అత్యవసరం. ఈ స్థితిని అందుకొనుటకై కొంచెం కష్టమైనా క్రమశిక్షణకు అలవాటు చేసినట్లైతే మచ్చిక చేయబడ్డ మనస్సు కట్టుబడి నీ ఆజ్ఞను నిర్వర్తించటానికి సిద్ధంగా ఉంటుంది. కావున ప్రతీ రోజు క్రమం తప్పని సాధన అలవాటు చేసుకొమ్మని, ఆచరించమని నేను ఇచ్చే ఈ సలహాను పాటించి నీవు అనే ఈ సత్ పదార్థాన్ని తెలుసుకునే ప్రయత్నము ప్రారంభించి ఉత్తమ గతిని సాధించండి.

107. స్వామి! ధ్యానము ద్వారా మనశ్శాంతి ఎలా పొందవచ్చు?

విఘ్నం లేకుండా జపహిత ధ్యానము ప్రతీ రోజు చేయాలి. అప్పుడు పాపపు చెడ్డ ఆలోచనలు; తామస ఆహార పానీయాలపై అర్రులు చాపని; అసహ్యమైన నీచ వస్తువులను పట్టుకోని; ఇష్టపడలేని దుష్ట నీచ కుతంత్రాలను కోరుకొనని; అప్రతిష్ఠకి గాయపడని, బాధపడని; కుతంత్రాలను తయారు చేయని ఒక రోజు తప్పక వస్తుంది. నీవు ఆనందపడినంత కాలము ధ్యానము గాఢంగానూ, క్రమంతోనూ చేయగా ఇది

సాధ్యమవుతుంది. అప్పుడు నువ్వు భగవంతుని ప్రాంగణంలో, మాటలకందని శాంతి ఆవరణలో ఉంటావు.

108. ధ్యానములో ప్రథమముగా చేయవలసిన ప్రయత్నము ఏమిటి స్వామి?

మీకు నచ్చిన దైవ రూపాన్ని ధ్యాన వస్తువుగా స్వీకరించి చలించకుండా, నిద్ర రాకుండా, చికాకు కల్గించకుండా ఉండే సుఖాసనంలో కూర్చుని మనోనేత్రం ముందు ఆ యొక్క రూపాన్ని తలుచుకుంటూ తప్పించుకునే ఇంద్రియాలను పట్టుకుని ఆపాలి. లేదా పుణ్యకథలలోని ఘట్టాల మీద లేదా స్వామి చూపించిన అద్భుతాల మీద మనస్సు పెట్టు. జిహ్వ మీద నామంతో, భావావేశమనే 'బ్రష్'తో, బుద్ధి అనే చేతితో స్వామి చిత్రాన్ని చిత్రించడం మొదలు పెట్టాలి. పైనుండి క్రిందకు ,క్రింది నుండి పైకి భగవంతుని రూపాన్ని చిత్రీకరించుకుంటూ మొదలుపెట్టాలి. దీంతో తాను ప్రేమతో ధ్యానించాలనుకున్న రూపం నుండి మనస్సు విడిపడదు. ధ్యానానికి కావలసిన ప్రథమ ప్రయత్నము ఇది. దీని ద్వారా మనస్సు స్థిరముగా ఉండి మీరు స్థిరముగా ఉండేటట్లు చేస్తుంది.

109. ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఎవరి సహాయం అవసరం స్వామి?

నీకు గులక రాయి గురించే తెలియదు. కాని ఆ రాయిని ఉపయోగించి నీవు కట్టాలి అన్న శిఖరాన్ని ఎలా కట్టగలవు? ముందుగా నీవు కట్టదల్చుకున్న దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకో. అప్పుడు కట్టుట ప్రారంభిస్తే నీ బిల్డింగ్ లేక నీవు కట్టే కట్టుబడి సురక్షితంగా ఉంటుంది. ఒక ఇంజనీరుకు నీ పని అప్పగించావు. ఏ కొలతలు ఇవ్వాలో, ఏ విధంగా అయితే సురక్షితంగా ఉంటుందో ఆయనకు తెలుసు. కావున నీ బిల్డింగ్ సురక్షితంగా ఉంటుంది. ఇప్పుడు నీ జీవితం అనే బిల్డింగ్ భగవంతుడు అనే ఇంజనీర్ కి అప్పగించావు. ఈ ఇంజనీర్ ఒక మంచి కాంట్రాక్టర్ కు ఇరవైనాలుగు గంటలూ బాధ్యత నీదే అని అప్పగించాడు. ఆ బిల్డింగ్ పూర్తి అయ్యే వరకూ నీది ఎమీ లేదు. దానిని అప్పగించిన ఇంజనీర్ మధ్య మధ్య గమనిస్తూనే ఉంటాడు. నీవు ఇచ్చే ధనాన్ని బట్టి నీ బిల్డింగ్ త్వరగా పూర్తి అయ్యేటట్లు చేస్తాడు. కావున ధనాన్ని ఇవ్వుటయే నీ బాధ్యత. బిల్డింగ్ తయారు చేసి ఇవ్వటం భగవంతుని భాద్యత.

110. జ్ఞాన సిద్ధులు అని ఎవరిని పిలుస్తారు స్వామి?

ఈ లోకంలో మన మనస్సు అనేక కామ, కాంచనాది విషయాల పైకి పోతుంది. మనస్సును ఇలా చెదిర్చి ఏకాగ్రతకు అడ్డుపడటం అవిద్య యొక్క లక్షణం. నిశితమైన తర్క విచారం చేసి మీ హృదయాలలోని చీకటి మూలల్లో దాగుకుని ఉన్న కోరికలను వెతికి పారద్రోలాలి. మనో విజయం సాధించాలి. అప్పుడు మీరు ప్రశాంత చిత్తులై జ్ఞాన సిద్ధులు అవుతారు. వాంఛ నిర్మూలన లేని జప ధ్యానాలు నిష్ప్రయోజనాలు. సద్భావనలతో నిరంతరం జీవిస్తూ ఉండే వ్యక్తి మాత్రమే తరిస్తాడు.

111. మనిషి పునర్జన్మ నుండి విముక్తిని ఎప్పుడు పొందుతాడు?

సంకల్పాలు, కోరికలు లోపల ఉన్నంతవరకు మనిషి పుట్టకుండా తప్పించుకోలేడు. సంకల్పము లేకుండా కోరిక నుండి పూర్తిగా విముక్తుడైన రోజున అతడు పునర్జన్మ నుండి విముక్తుడు అవుతాడు.

112. అజ్ఞానం అనే అంధకారం ఎలా దూరం చెయ్యాలి స్వామి?

మనిషికి దారి చూపడానికి వేదం, శాస్త్రాలు కాంతిని ప్రసరిస్తాయి. అయితే ఆ కాంతి ఎంత వెలుగైనా విరజిమ్మనీ గ్రుడ్డివాడికెప్పుడూ అంధకారమే. విశ్వాసం లేని వాళ్లకు, చాంచల్యమున్న వాళ్లకు, పడిపోతున్న వారికి కాంతి ఒక్కటే మార్గము. శాశ్వతమైన ఆనందాన్ని ఎలా పొందాలన్నది వేదశాస్త్రాలు మీకు చూపిస్తాయి. కానీ మానవుడు భ్రమలో చంచలమైన పాపాలతో, ఆపదలతో నింపబడిన ఆనందాల కోసం ప్రయత్నిస్తున్నాడు. అతడు సాధించే ఆనందాన్ని ఇంద్రియాలు కాల్చిపారేస్తున్నాయి. అవి శిక్షణ లేని సేవకులు. తమ యజమాని అయిన మనస్సును శాసిస్తున్నాయి. ఆ మనస్సును నీ ఆధీనంలోకి తెచ్చుకోవాలి. అప్పుడు ఆ సేవకులు నీ పాదాల మీద పడ్తారు. మనస్సు చక్రవర్తి, ఇంద్రియాలు సైనికులు. ఇప్పుడు మనస్సు తన ప్రధాన మంత్రి అయిన బుద్ధి చెప్పే మాటలు వినకుండా సైనికులు చెప్పే వాటికే విలువిస్తున్నది. కావుననే సైనికులే రాజ్యమేలుతున్నారు. కావున సైనికులే రాజు గారిని ఏలుతున్నారు. ఒక్కసారి బుద్ధికి అధికారం ఇవ్వండి. ఒక్క నిమిషంలో ఇంద్రియాలు గుడారంలోకి పంపించబడి మనస్సు తననుతాను **రక్షించుకుంటుంది**. హృదయాకాశంలో ఆత్మ సూర్యుడు. దానికి విషయ వాసనలనే నల్లని, దట్టని మేఘాలు కమ్ముకుని వెలుగు కనిపించకుండా చేస్తుంది. ఆయన తన ప్రయత్నము ఎంత చేసినా అవివేకమనే ఈ మబ్బులు అడ్డు పడి నీ యొక్క స్థితిని పెంచకుండా చేస్తుంది. పశ్చాత్తాపమనే ప్రభంజనం ఆ

మేఘాలను చెదరగొట్టాలి. దాంతో నీలో పేరుకుపోయిన అజ్ఞానం నశించి ఆత్మస్వరూపాన్ని అందుకోగలవు. నా ఈ ప్రయత్నం సఫలం చేసుకోండి. అంధకారం లోకి ప్రయాణం చెయ్యవద్దు. పట్టుకున్న చేతులు కూడా విదిలించుకుంటే దారి చూపేవారు కరువవుతారు.

113. సాధకుని ప్రవర్తన ఎలా ఉండాలి స్వామి?

దోషభూయిష్టమైన ఆలోచనలు **జాడ్యంలాగా** పట్టినప్పుడు వాటిని విశ్లేషించి నీ ప్రవర్తనను మార్చుకొనవలసి ఉంటుంది. ఇతరుల శీలంలోని దోషాలను వెదికి పట్టుకోవటానికి ప్రయత్నించవద్దు. తన యొక్క ఆధ్యాత్మిక ప్రవృత్తిని తగ్గించి పారవేసే ఈ దోషాలను తీసివేసుకోవడానికి ఆత్మపరీక్ష చాలా అవసరం. దుమ్ము, ధూళి పడిందని తెలియకుండా ఉండేందుకు జనం ముదురు రంగు బట్టలు కొంటారు. మరకలు స్పష్టంగా కనిపిస్తాయి. కావున తెల్ల రంగు బట్టల్ని ఇష్టపడరు. కానీ నీ యొక్క మాలిన్యాన్ని దాచేయడానికి ప్రయతించకు. మలిన వృత్తులకు సిగ్గుపడు. వాటిని వేగంగా శుభ్రం చేయడానికి అడుగు ముందుకు వేయి. అసూయ, లోభాల వల్ల పుట్టే పచ్చి అబద్ధాలకు చెవి యొగ్గకుండా సత్యాలు, పుణ్యవిషయాలు మాట్లాడుకోవడం కోసం కలవడానికి వీలయ్యేసత్సంగాన్ని ఏర్పాటు చేసుకోమని సలహా ఇస్తున్నాను. అక్కడ నీవు పవిత్ర గ్రంధాలను చదువుతావు, భగవత్ లీలలను మాట్లాడుతావు. ఇతరులపై చెడుని మాట్లాడటానికి, ఇతరుల ప్రవర్తనను విమర్శించటానికి విలువైన కాలాన్ని వ్యర్థపర్చడమెందుకు? సరిగ్గా నీ హృదయాన్ని ఏది విశాలం చేస్తుందో, ఏది అశాంతిని కల్గిస్తుందో నీకు నువ్వే కనుక్కోవాలి. అప్పుడు మొదటి దానిని గట్టిగా పట్టుకో. రెండవ దానిని వదిలివేయి. నా ఈ ప్రయత్నము ఎంత చేసినా, ఎంత చెప్పినా వింటున్నారు, వదిలివేస్తున్నారు. దీనివల్ల ప్రయోజనం ఏమిటి? విన్న దానిని, తెలిపిన దానిని కొంతలో కొంతైనా ఆచరణలో పెట్టండి. నేను వేల మందికి బోధిస్తున్నాను. కాని వారిలో ఆచరణలో పెట్టగలిగిన వారిని లెక్కలోకి తీసుకోవాలి.

114. ఆనందంగా, ఆరోగ్యంగా ఉండుటకు ఏమి చెయ్యాలి స్వామి?

లోపలి తీసుకోబడేది ఎప్పుడూ నిర్మలంగాను, సాత్వికంగాను ఉండాలి. మీరు తీసుకునే ఆహారం కానీ, భావాలు కానీ పరిశుద్ధంగా ఉండాలి. శబ్దము, దృశ్యము, అభిప్రాయాలు, భావాలు, పాఠాలు,

సంబంధాలు, ప్రభావాలు అన్నీ కూడా గౌరవాన్ని, వినయాన్ని, సమతూకాన్ని, సమచిత్తాన్ని పెంచుకునేటట్లుగా ఉండాలి. ఆనందానికి, ఆరోగ్యానికి మనస్సే ముఖ్యం. కావున ఆ మనస్సుపై దుష్ప్రభావాన్ని వేయనటువంటి ఆలోచనలనే మనస్సుకి తీసుకోవాలి. దానిని చక్కగా స్థిరంగా ఉంచటానికి జప, ధ్యానము, సత్సంగము చాలా అవసరము. ఇటువంటి ఆహారాన్ని దానికి అందించాలి. వర్షానికి గుర్తు భూమి తడవడమే. భక్తికి గుర్తు భక్తునికి ఉన్న శాంతమే. జయాప జయాలు, కీర్తి, అపకీర్తి, లాభ నష్టాలు అనే వాటిని శాంతంగా ఉంటే జయించగలరు.

115. సాధనా దిశగా సాధకుడు గమనించ వలసినవి ఏవి స్వామి?

ప్రేమయే లేకుండిన ఎన్ని సాధనలు చేసినా ఫలితముండదు. రోజంతలో ఎంతో సమయాన్ని వృధా చేస్తునారు. ఏద్దైనా చెప్పితే సమయం లేదంటారు. కాల స్వరూపుడు భగవంతుడు. కావున కాలాన్ని వ్యర్ధ పర్చకండి. మనస్సును స్థిరంగా ఉంచుకోండి. సరైన సమయంలో విత్తులు నాటాలి. అప్పుడే సమయానికి పంట చేతికి అంది వస్తుంది. నీవు గింజలే నాటకుండా పంట కొరకు ఎదురు చూస్తే పంట ఎచటి నుండి వస్తుంది? అలాగే నీవు సాధనా అనే గింజలు నీ హృదయ స్థానంలో నాటనే లేదు. దాని యొక్క ఫలితాలను వెంటనే ఆశిస్తే ఎలా? అవి ఫలించటానికి కావలసిన సమయాన్ని ఇవ్వాలి. దాని పోషణ నిమిత్తమై కొంచము ఎరువు వెయ్యాలి. అప్పుడు పంట ఏపుగా పెరిగి రైతు కోరుకున్న దానికన్నా ఎక్కువ ఫలితాన్ని పొందుతాడు. నిత్యమూ ఆధ్యాత్మికంగా ఎదుగుటకు ఎంతో సహాయ సహకారాలను అందుకొని జీవన మార్గాన్ని సుగమం చేసుకొని గమ్యం చేరాలి. ఫలమును ఆశించకుండా మీ కర్తవ్యాన్ని నిర్వహించండి. ఫలితాన్ని అందించేవాడు వేరే ఉన్నాడు. దృష్టి ఎప్పుడూ సాధించే నీ తపనపై కేంద్రీకృతం అవ్వాలి. ఫలితముపై కాదు. జన్మ రహస్యాన్ని తెలుసుకోవాలి. జన్మ సార్ధక్యతను సాధించాలి. ఇది సాధన యొక్క అంతరార్ధము. గోల చేసి పొందవలసింది కర్మ ఫలాన్ని కాదు. కర్మ త్యాగాన్ని. ఇది సాధించుటకై మునులు, ఋషులు కూడా వేల సంవత్సరాలు తపోదీక్షలో ఉండి సాధించారు. ఈ సాధనే మిమ్మల్ని తీరం దాటిస్తుంది.

116. మోక్షము అంటే ఏమిటి స్వామి? ఇది అందరికీ సాధ్యమా?

సర్వ బంధముల నుండి విడుదల కావడమే మోక్షము. అనగా అనిత్య, అశాశ్వతములైన అనాత్మ

తత్వము నుండి నిత్య సత్య నిర్మలమైన ఆత్మతత్వమును పొందటమే మోక్షమందురు. ఇది అందరికీ సాధ్యమగునా? అని అడిగితే ఎందుకు సాధ్యము కాదు? అట్టి యోగ్యత సంపాదించుకున్న వారికి అందరికీ సాధ్యమే. దానికి తగిన ప్రయత్నములు చేసి సాధించాలి. సాధన చేసిన వారికి లభించుచునే ఉన్నది. రోగమున్న ప్రతీవాడు మందును తినుటకు అర్హుడే. వీరు తినవచ్చు, వారు తినకూడదు అన్న తారతమ్యం ఉండదు కదా? కాకపోతే విలువైన మందులను తీసుకొను శక్తి అందరికీ ఉండదు. అట్లే శక్తి కలిగిన వారు ఎవరైనను భగవత్ అనుగ్రహము అను ఔషదమును సేవించి భవరోగమను మందును తీసుకొని నివారణ చేసుకొనవచ్చును.

117. నేను అనెడిది గుర్తించుటకు ఎటువంటి ప్రయత్నం చెయ్యాలి స్వామి?

అద్దంలో తన ప్రతిబింబం చూడాలి అనుకున్నవాడు అద్దానికి ఎదురుగా నిలబడాలి. వెనుకకు తిరిగి నా ప్రతిబింబము కనిపించుట లేదు అని అడిగితే ఏమి సమాధానము చెప్పాలి? నీవు అటువైపు చూస్తూ ఉండటం వల్ల నీ ప్రతిమ కాక బాహ్య ప్రపంచమే కనిపిస్తుంది. ఒక్కసారి వివేక విజ్ఞానాలనే వాటిని ఉపయోగించి నీవు అద్దము వైపు తిరగక పోయినా అద్దాన్ని నీ వైపుకు త్రిప్పుకో. అప్పుడు భౌతికానికి నీకు అడ్డంగా అద్దం ఉండి నిన్ను నీవు తెలుసుకునే ప్రయత్నము ప్రారంభిస్తావు అన్నది ఎరుకలోకి తేవాలని ప్రయత్నం చేయమంటున్నాను. నా ఆశీస్సులు సాధకునికి ఎప్పుడూ ఉంటాయి. చెప్పిన దానిని చెయ్యనపుడు నేను కూడా ఏమీ చేయను. చూస్తూ ఊరుకుంటాను. ఒక్క సారి భగవంతునికి ప్రామిస్ చేసినాక నీ చేయి పట్టుకొనుటకు ఆయన రెడీగా ఉన్నా చేయి అందించుటకు మీరు సిద్ధంగా లేకపోతే నేను ఏమి చేయను?

118. భగవత్ **సాక్షాత్కారం** పొందుటకు భక్తునికి దీర్ఘ కాల నిరీక్షణ ఎందుకు స్వామి?

భగవంతుడు భక్తుడికి నిరీక్షణా సమయాన్ని ఎక్కువ ఇస్తాడు. దాని వలన **ప్రక్షాళన** ఎక్కువ జరుగుతుంది, ఓరిమి ఏర్పడుతుంది. దాంతో భగవంతునికి పూర్తిగా శరణు అవ్వగలుగుతాడు.

119. ఏకాత్మ భావం ఎలా ప్రకటితమవుతుంది స్వామి?

"నేను" అనేది అన్నింటికీ ఆధారమైనది. మీరు ఎప్పుడైతే నేను ఇదీ, నేను అదీ అని అనుకున్నప్పుడు ద్వైత భావం ప్రకటితమవుతుంది. నేను నేనే అంటే అద్వైత లేక ఏకాత్మ భావం ప్రకటితమవుతుంది. నేను అనేది చాలా పేర్లతో పిలవబడుతుంది. అది దేవుడు, ఆత్మ, బ్రహ్మ, శ్రీ కృష్ణుడు, శ్రీ రాముడు, శివుడు, అల్లా, ఏసు అని పిలవబడుతుంది. సాధకుని అంతఃకరణము పవిత్రము చేయుటకే ఈ ఏకాత్మ భావన.

120. జీవితాన్ని ఫలప్రదం చేసుకోవడం ఎలా స్వామి?

మీ కోసం కేటాయించబడిన **ఆయుప్రమాణం** తరిగిపోతోంది. అందుకే అజ్ఞానమనే నిద్ర నుండి మేల్కొనండి. మీ ఆలోచనలు సరైన రీతిలో కొనసాగించండి. ఈ దేహాన్ని కేవలము పనిముట్టుగానే భావించండి. దేహపోషణ కోసమే జీవితాన్ని అంకితం చేయడం మానవత్వ లక్షణం కాదు. తిరిగి రాని గతాన్ని గురించి విచారిస్తూ ఏమవుతుందో తెలియని భవిష్యత్తు గురించి కలలు కంటూ మీ యొక్క జీవిత **లక్ష్యాన్ని** అలక్ష్యం చెయ్యద్దు. భూతకాల బీజమే వర్తమానమని, వర్తమాన ఫలితమే భవిష్యత్తని ఇంతకు ముందు తెలియపరిచాను మరలా తెలియ పరుస్తున్నాను. ప్రస్తుత పరిస్థితి ఉత్తమమైనదిగా తీర్చిదిద్దుకున్నప్పుడే భవిష్యత్తులో దీని ఉత్తమ ఫలితాలను అందుకుంటారు. మీరు పొలానికి రోజూ నీరు పెడుతూ ఉండవచ్చు కానీ దానిలో ఒక కలుగు ఉన్నట్లైతే నీరంతా కలుగు నుండి బయటకు వెళ్తాయి. అలాగే ఇంద్రియాలు కూడా. ఇంద్రియానురక్తే ఈ కలుగు. మానవ శరీరంలోనే మోక్ష ద్వారం ఉంది. కావున ప్రతీమానవుడు జాగ్రత్తపడి జీవితాన్ని ఫలప్రదం చేసుకోవాలి. సుఖానుభవాలు ఇతర శరీరాలకు కూడా సాధ్యమే. కాని మోక్షము మాత్రం అసాధ్యం.

121. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించుటకు ఏవి అవసరము స్వామి?

బిల్డింగ్ కట్టాలి అన్న వ్యక్తి పునాది సరిగ్గా వేయాలి? ఎంత బిల్డింగ్ కట్టాలి? ఎలా కట్టాలి? అన్న ప్లాను ముందే నిర్ధారించుకోవాలి. ప్లాను లేకుండా కట్టి దాన్ని పడగొట్టి ఇలా బాగాలేదు, అలా బాగాలేదు అని అనుకునే ముందు సరి అయిన ప్లాన్ తో బిల్డింగ్ పని మొదలుపెట్టావనుకో బిల్డింగ్ బాగా తయ్యారవుతుంది. పునాదిపైనుండే బిల్డింగ్ పైకి కట్టుటకు మొదలు పెడతారు. పైన కట్టేటంత వరకూ

మెట్లతో పని లేదు. పైన కట్టిన తర్వాత మెట్ల అవసరం ఉంది. అలాగే మామూలు జీవితానికి నీవు పెద్ద ప్రయత్నము చేయనక్కర్లేదు. ఎందుకనగా భగవంతుడు అందరికీ అందుబాటులో ఉండే జీవితాన్ని ప్రసాదించాడు. జీవితంలో స్పెషల్ చదవాలి అనుకున్నవాడే కాలేజీలో చేరి డిగ్రీ చదువుతాడు. అలాగే జీవితపు ఉన్నత శిఖరాన్ని ఎక్కాలి అనుకున్నవాడు క్రింద నుండి పైకి చూస్తూ కూర్చుంటే పైకి ఎలా ఎక్కగలడు? మెట్ల పైకి వెళ్ళే మార్గంలో వెళ్ళినట్లైతే నీవు పైకి చేరుకోగలవు. జీవితము అనే పునాది పైనుండి నమ్మకము అనే మెట్ల ద్వారా విశ్వాసము అనే గమ్యం చేరాలి. ఈ గమ్యం చేరటానికి భగవత్ కృప అనే సాధనం కావాలి. కొంచం కట్టి కొంచం కూలదోస్తూ బిల్డింగ్ ఎప్పటికి కడతావు? ఎప్పుడు పైకి చేరుతావు? కొంచం నమ్మకం కలగటము మరలా వెంటనే అపనమ్మకం. దీనితో ఎలా నీవు అనుకున్నది సాధిస్తావు? సాధన మీద కానీ, గురువు మీద కానీ అపనమ్మకం కలగనే కలగకూడదు. మెట్ల మీద కాలు పెట్టిన తర్వాత ఎక్క గలనా? లేదా? అన్న సందేహం వలదు. చేతనైనంత శక్తిని కూడదీసుకుని నీవు అనుకున్న సమయానికో లేదా కొంచం ఆలస్యంగానైనా చేరటానికి ప్రయత్నించాలి.

122. సంస్కారం అంటే ఏమిటి స్వామి? ఉన్నత సంస్కారం ఎలా పొందవచ్చు?

సంస్కారమనగా మీలో ఉన్న దురభ్యాసములు, దుర్గుణములు, దురాలోచనములు దూరం చేసుకుని సదభ్యాసములు, సద్గుణములు అభివృద్ధిపర్చుకోవాలి. మీరు మంచి వారు కావాలికానీ గొప్ప వారు

పూనుకున్నాడు. ఈ రోజు పిల్లలు కూడా అనవసరమైన విషయాల పట్ల ఉత్సాహము, ధైర్యము చూపెడుతున్నారు. అసలైన ఇంద్రియాల విషయంలో వదిలివేస్తున్నారు. వాల్మీకి ,ఋషుల యొక్క దర్శన, స్పర్శనచే మారిపొయ్యి అవే ధైర్య, సాహసాలను ఉపయోగించి మహర్షియై, కవియై రామాయణ మహాకావ్యాన్నే అందించాడు. స్పర్శ అనేది ఎంత గొప్పతనాన్ని అందిస్తుందో తెలుసుకొని ప్రవర్తించినట్లైతె ఉన్నతమైన దానిని అందుకోవచ్చును.

123. భగవంతుని అడగదల్చుకున్నది ఏ విధంగా అడగాలి స్వామి?

మీ యొక్క అభీష్టములు ఎలా ఉంటె అలా జరుగుతుంది. మీ భావన సరిగ్గా ఉంటె భగవంతుని

యొక్క అనుగ్రహం సరిగ్గా ఉంటుంది. అంటే మీఆలోచనలు సదా నీవు సాధించాలి అనుకున్న ప్రయత్నము మీదే ఏకాగ్రతతో  ఉండాలి. మనస్సు సదా భగవంతుని చుట్టూనే తిరుగుతూ ఉంటే నీ ఇంద్రియాలలో ప్రధానమైనవైన వాక్కు, మనస్సు ఈ రెండూ నిన్ను శరణు వేడుకుంటాయి. ఒకసారి బ్రహ్మ దేవుడు ఒకతని తపస్సును మెచ్చి వరము ఇచ్చుటకు ప్రత్యక్షమై "నేను నీకు వరమిస్తాను. కానీ నీవు ఒక్క మాటలో అడగాలి" అన్నాడట. వెంటనే అతను "వంద జన్మలు వద్దు. ఈ జన్మలోనే, ఇప్పుడే **మోక్షాన్ని** ప్రసాదించండి" అని అన్నాడట. వెంటనే బ్రహ్మ నేను నీకు మొదటే చెప్పాను. ఒక్క మాటకే అవకాశమిచ్చాను. కావున నీవు మాట్లాడిన మొదటి మాటను నీకు వరముగా అనుగ్రహిస్తున్నాను అన్నాడట. అనగా భగవంతుని నీవు అడిగింది ఆయన ఇచ్చుటకు సంసిద్ధంగా ఉంటాడు. కాని కొంచం విచక్షణతో అడగాలి. అంటే వాక్కు సదా నీయొక్క ఆత్మను పరిపాలించేదిగా ఉండాలి. వాచిక తపస్సు అనేది ప్రారంభించాలి. చెప్పదల్చుకున్నది, అడగదల్చుకున్నది మొదట సంసిద్ధంగా ఉండాలి. దీనికి ఆంజనేయ స్వామినే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సీతాన్వేషణ సందర్భంగా సీతను చూచి తిరిగి వచ్చిన ఆంజనేయుడు రాముని వద్దకు వచ్చు సమయంలో దాదాపు వంద అడుగుల దూరంలో ఉండగానే "సీతను కనుగొంటి" అని మొదటి వాక్యంగా నివేదించాడు. అనగా చెప్పదలుచుకున్నది ముందుగా భగవంతుని ముందు కానీ ఎచటనైనా కానీ వాక్కుని నియంత్రించి చెప్పదల్చుకున్నది గానీ అడగదల్చుకున్నది గానీ అడగాలి. కావున ఈ రోజు నా యొక్క దీవెన ఫలించాలంటే మీ మీ అభీష్టాలు సరిగ్గా ఉండాలి అన్నదానికి ఇంత చెప్పవలసివచ్చింది. సమయాన్ని, సందర్భాన్ని మీరు మీకు అనుకూలంగా మలచుకుని దివ్యపథం వైపు అడుగులు వెయ్యాలి.

124. మోహము అనేది ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఏ విధముగా అవరోధము స్వామి?

నీవు అనే సత్పదార్థము ఏదైతే ఉన్నదో దానిని అనుభవించటానికి మోహము, అనురాగము, అనుభందము అన్నది అసూయను, పక్షపాతాన్ని, భ్రాంతిని కలిగిస్తాయి. అవి సత్యాన్ని మరుగు పరుస్తాయి. అవి బుద్ధిని పనిచెయ్యకుండా చేస్తాయి. అన్వేషణ సల్పే వాడికి సంబంధించినంతవరకు రాగమే పెద్ద రోగము. యోగికి రాగము తగినది కాదు. స్వీయ పక్షపాతాలు, కల్పనలు, అనురాగాల నుండి విముక్తులు కావాలి. నీవు అలవాట్లు, పద్ధతులు పెట్టుకున్నట్లైతే వాటిని వదిలించుకోవడం కష్టం. వరదలో కొట్టుకుపోతున్న కంబళ్ళ మూటను ఒకడు చూచాడు. నిజానికి అది ఎలుగుబంటి. కాపాడుదామని

నీళ్ళల్లోకి దూకి పట్టుకోగా అది వీడు తప్పించు కోవటానికి వీలు లేకుండా గట్టిగా పట్టుకోవటం వల్ల చనిపోయాడు. అలాగే మీరు కూడా నిధి అనుకున్న దానిని మీకు మీరుగా దూకి పట్టుకోవడం వల్ల పట్టు సదలించుకోవటం చేతకాక బంధించబడుతున్నారు. ఈ బంధాల నుండి విముక్తిని కొరుకోండి. భగవంతుడిని ఒక్కసారి పట్టుకున్నారు. ఈ పట్టు సడలించుకోకూడదు. చేతనైతే భౌతిక బంధాల నుండి విముక్తిని కోరుకోండి.

125. ధ్యానంలో వెలుగు కిరణాలు కనిపించుటలో అర్ధమేమిటి స్వామి?

ఇది ఒక విధమైన ధ్యాన పద్ధతి. ఈ వచ్చిన కాంతి కిరణాలు ఏవైతే ఉన్నవో అవి అవయవాల నుండి ఉద్భవించిన చిన్న మెరుపు కిరణాలు. ఈ కిరణాలను ఏకం చేసి **<u>బృకుటి</u>** స్థానానికి తీసుకవచ్చి బంధించినట్లైతె ధ్యానావస్థ కొంత **<u>పటిష్టమవుతుంది</u>**.

126. మేము ఎటువంటి ఆహారము నియమములు పాటించాలి స్వామి?

సాత్వికాహారం శ్రేష్టం శ్రేయస్కరము. అనగా కారం, ఉప్పు, పులుపు, చేదు, వగరు ఇటువంటి పదార్ధాలు మోతాదు మించకుండా తీసుకోవాలి. దీని వలన దుష్టగుణాలైన అరిషడ్వర్గాలు నీ దరికి రావు. మనస్సును ఉద్రేకపర్చే ఆలోచనలు ఆపుచేస్తాయి. నూనె పదార్ధాలు ఎక్కువ వాడవద్దు. తిండి ఎక్కువ తినవద్దు. అధిక ఆహారం తామసిక గుణాన్ని పెంచి పోషిస్తుంది. దీని వలన ఒళ్ళు బరువు, నిద్ర, అలసట, చేద్దాములే అన్న అలసత్వం పెరిగి నీవు దేనికీ పనికిరావు అన్నట్లుగా తయారు చేస్తుంది. ఇక సాత్వికాహారంలో ఏవి అయితే వద్దని చెప్పానో అవి ఎక్కువ తీసుకున్నట్లైతే రాజసిక గుణం మెండుగా వచ్చి అరిషడ్వర్గాలు ఎదేచ్ఛగా విహరించి నిన్ను కామానికి, క్రోధాగ్నికి గురిచేసి నీ యొక్క పతనాన్ని చూస్తుంది. వారానికి ఒక రోజు ఆహారం తక్కువ చేసి తీసుకోవటం వల్ల నీకూ మంచిది, దేశానికీ మంచిది. ఆహారం సాత్వికం కావాలంటే మనస్సునీ, దేహాన్ని రెండిటిని పుష్టివంతం చేయగల్గాలి. అది మరీ ఉప్పగా ఉండకూడదు. మరీ చేదుగా, మరీ వేడిగా, తీయగా, పుల్లగా ఉండకూడదు. దాన్ని పొగలు కక్కుతున్నప్పుడు తినకూడదు. దాహం కల్గించే ఆహారాన్ని తినకూడదు. పరిమితి, నిగ్రహము ఉండటమే సామాన్య సూత్రం. నీళ్ళల్లో వండిన పదార్ధాన్ని మర్నాడు తినకూడదు. అట్లా తింటే కీడు చేస్తుంది.

వేయించిన వాటిని కూడా దుర్వాసన రాక ముందే తినేయాలి. రాజసికాహారం సాత్వికాహారానికి వ్యతిరేకమయినది. అది ఎక్కువ ఉప్పు, తీపి, వేడి, పులుపు, వాసనలతో ఉంటుంది. అలాంటి ఆహారం ఉద్రిక్తపర్చి మత్తును కల్గిస్తుంది. జిహ్వ మరియు కామము మనిషికి మహా శత్రువులు. కావున నీవు తీసుకునే ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. క్షుత్తు, కామము నిన్ను నరకంలోకి లాగుతాయి. జిహ్వ కోరిందెల్లా దాని దురాశనెల్లా తీర్చకు. కామానికి, రుచికి బానిస కాకు. సాత్వికాహారం తీసుకో. సాత్వికుల సమూహంలో తీసుకో.

127. నిద్ర అనేది ఏ విధంగా సాధకునకు శత్రువు. నిద్రను జయించుట ఎలా స్వామి?

నిద్ర అతి భయంకరమైన శత్రువు. తనతో పాటు క్రోధాన్ని తోడు తీసుకుని వస్తుంది. అంటే నిద్ర అనుభవించకుండా చేసిన క్షణంలో నన్ను ఈ రకంగా మీరు నెట్టి వేస్తున్నారు అంటే నా బలం చాలటం లేదు. నాతోబుట్టువులను పిల్చుకుని వస్తాను. చూద్దాం అప్పుడు ఎవరు గెలుస్తారో అంటూ తన తోబుట్టువు అయిన క్రోధాన్ని పిల్చుకు వచ్చి తన బలాన్ని చూపించి విజయాన్ని పొంది మనిషి మానసిక స్థితిని అల్లకల్లోలం చేసి మానవత్వ గుణాలు అడుగంటిపోయేటట్లు చేసే భయంకర శత్రువు. ఈ శత్రువును ఆదిలోనే అంటే పసిగట్టిన మరుక్షణంలోనే చంపుటకు ప్రయత్నించాలి. ఈ నిద్ర అనేది నిన్ను నీవు తెలుసుకునేటందుకు అడ్డుగా నిలిచే అడ్డుగోడ. ఈ గోడను కూలగొట్టక తప్పదు. ఈ గోడను కూలగొట్టాలంటే తస్మాత్ జాగ్రత్త అనే ఖడ్గాన్ని దగ్గర పెట్టుకుని ఎప్పటికప్పుడు దానిని పడగొట్టే ప్రయత్నం చేయాలి.

128. అద్వైతం, ద్వైతం మరియు విశిష్టాద్వైతం అనగా ఏమి? వాటిలో ఏది ఉన్నతము స్వామి?

అద్వైతం అనగా భగవంతుడు, తాను ఒక్కటే. అనగా వేరుగా ఇంకేదీ లేదు అన్న నమ్మకమే అద్వైతం. ద్వైతం అంటే నీవు వేరు, నేను వేరు అనగా విడి విడిగా ఉన్నాము అనే అర్థం స్ఫురింప చేస్తుంది. ఇక విశిష్టాద్వైతం అంటే నీవు వేరు, నేను వేరు, అనుభవించునది వేరు. అంటే ఇచట మూడుగా కనిపిస్తున్నది. దీనినే విశిష్టాద్వైతము అందురు. అన్నింటిలోకి అద్వైత భావం చాలా గొప్పది. ఇచట మూడుగా లేదు, రెండుగా లేదు. ఉన్నది అంతా ఒక్కటే అనే భావం. ఆత్మతత్వము తెలుపుతుంది. ఈ

ఆత్మతత్వాన్ని ప్రదర్శించాలంటే సామాన్య స్థితిలో ఉన్న జీవులు దీనిని అనుభవించలేరు. ఆధ్యాత్మిక స్థితి గొప్పగా గలవారే అనుభవించగలరు. భగవంతునితో సమమైన స్థితిని అనుభవించడమంటే సామాన్యమైనది కాదు. చాలా గొప్ప స్థితి. దీనినే అనన్య భక్తి అంటారు. విశిష్టాద్వైతము కల్గిన వారి తోనే చిక్కంతా వచ్చింది. ఎలా అంటే భగవంతుడు ఉన్నాడంటారు. కానీ తన లోపల కాదు. తనలో కాదు. భగవంతుడంటే ఇంకొక చోట ఉన్నాడు. నేను ఇక్కడ ఉన్నాను. ఆయన ప్రసాదించేది అందుకునేవాడు ఇంకొకడున్నాడు. అంటూ తనను తాను మూడుగా విభజించుకుని భగవంతునితో ఉన్న **అవినాభావ** సంబంధం వదులుకుంటాడు. ద్వైతి, సర్లే నీవు ఉన్నావు కదా నాకేమీ ఫర్వాలేదు అన్న భావనతో ఉంటాడు. ఇంక అద్వైతి నీలోనే నేనున్నాను నాకేమిటి? అన్న భావనలో ఉంటాడు. ఎటొచ్చి అద్వైత భావనతో ఉండేవాడు చాలా గొప్పవాడు అని చెప్పవచ్చును.

129. రజో గుణం, తమో గుణం, సత్వ గుణ లక్షణాలు ఏమిటి స్వామి?

కర్మ ఫలాన్ని కోరటం రజో గుణ లక్షణం. ఫలితం వల్ల నీకు లాభం కలగనప్పుడు కర్మ త్యాగం చెయ్యడం తమో గుణ లక్షణం. ఫలితం వస్తుందని తెలిసి కూడా దాన్ని పట్టించుకోకుండా, దానిపై ఆశక్తి చూపకుండా కర్మను ఆచరించడం సత్వ గుణ లక్షణం. వేసే వేషాన్ని బట్టి నాలుకతో మాట్లాడేమాటలను బట్టి ఎవరు సాధువో కాదో నిర్ణయించలేము. దాన్ని నిర్ణయించేది నీ గుణమే. మంచి చేసే శక్తి సమస్త జీవజాలానికీ ఉంది. కావున అందరిలో మంచిని వృద్ధి చేయడం ప్రపంచ **సంక్షేమానికి** మార్గము.

130. కర్మను ఎట్టి భావంతో ఆచరించాలి స్వామి?

కాలపురుషుని పంజా నుండి తప్పించుకోగల్గిన కర్మశక్తిని వినియోగించుకోండి. కర్మ సిద్ధాంతం నీకు ఆశను కల్పిస్తుంది. కర్మ ఎలాంటిదో ఫలితం అలాంటిది. కర్మఫలాన్ని ఆశించి ఇంకా బంధంలో చిక్కుకోకండి. భగవంతుని చరణాల వద్ద కర్మను సమర్పించు. అది ఆయన్ని స్తుతించనీయి. అది ఆయనను ఇంకా ప్రకాశించేటట్లు చేస్తుంది. కర్మల వల్ల జరిగే జయాప జయాలను పట్టించుకోకు. కర్మ ఫలాన్ని భగవంతునికి అర్పించగలిగేటువంటి, నీ తోటి మానవులతో నీ ఆనందాన్ని పంచుకోగలిగేటటువంటి నీ శక్తిని పెంచుకో. జయాప జయాలు భగవంతునికి వదిలి వేయి. నీ చేయి పట్టి నడిపించగలిగినవాడు నీ చేయిపట్టి నడిపిస్తూ

ఉండగా నీకు ఆలోచన ఎందుకు?

131. స్వామీ, నేను దివ్యానుభూతి ఎందుకు అనుభవించలేకపోతున్నాను?

సూదిని సూదంటురాయి ఆకర్షించలేకపోతే సూదికి అంటిన మట్టిది దోషము. అలాగే భగవంతుడు భక్తునివద్దకు రాకపోతే దోషం భక్తుని గుండెల్లో ఉన్నదన్నమాట. అది ఉండవలసినంత స్వచ్ఛముగా లేదన్నమాట. మీకు మీ మీద కానీ, భగవంతుని మీద కానీ విశ్వాసం ఉంటే చాలు. ఎందుకంటే నిజానికి మీరెవరు? మీకు తెలిసినా, తెలియకపోయినా మీలోని ప్రతి ఒక్కరూ దివ్యాత్మస్వరూపులే. కొన్ని మందులని పైకి పూసినట్లుగా కొన్ని కర్మలనూ, కొన్ని సాధనలనూ మీరు చేసినట్లైతే ఆ కర్మల యొక్క, సాధనల యొక్క అంతరార్థాన్ని తెలుసుకోవడం మందును లోపలకు తీసుకోవడమవుతుంది. సర్వ ఉపనిషత్సారమయిన గీత ఆంతరంగిక జీవితాన్ని ఎట్లా శుద్ధి చేయాలో, పవిత్రం చేయాలో తెలుపుతుంది. దయ, ప్రేమ, కరుణ, జాలి, త్యాగం లాంటి సద్గుణాలు మనిషిని భక్తుడని లేక జ్ఞాని అని ప్రపంచం యెడల విరక్తుడని పిలిచేటట్లు చేస్తుంది. ఆ తరువాత జ్ఞానులయి **రక్షించబడుతారు**. ఒక లక్ష్యం చేరాలంటే ఒక మెట్టు తర్వాత ఒక మెట్టు ఎక్కవలసిందే కానీ ఒక్క సారిగా సిద్ధిని పొందలేరు.

132. చిత్తాన్ని స్థిరపర్చుట ఎలా స్వామి?

చిత్తాన్ని చిన్న పిల్లవాడిగా చూడు. రోజు రోజుకీ తెలివిగల వాడిగా, సన్మార్గాన్ని అవలంబించే వాడిగా, కనిపించేవన్నీ మాయా ఉత్పాదనగా స్పృహ వచ్చే వరకూ ఆ పిల్లవాడిలో సత్సంగాన్ని పెంచుతూ అతని లోపల ఉన్న భయ దోషాన్ని తొలగించి దృష్టిని లక్ష్యము మీదనే నిశ్చలంగా నిలిచేటట్లు చెయ్యాలి. చిత్తాన్ని ఎప్పుడూ బలాత్కరించకు. అది సుకుమారంగా, ఓపికగా నీవు ఇచ్చే శిక్షణకు లొంగుతుంది. విరక్తి కలిగేటట్లుగా చేసి దాని తిరుగుబోతుతనాన్ని సరి చెయ్యి. ఆత్మజ్ఞాన బోధన ద్వారా దాని అజ్ఞానాన్ని నాశనం చెయ్యి. దానికి ఇదివరికే ఉన్న **బ్రహ్మసాక్షాత్కార** విషయంగా ఉన్న ఉత్సాహాన్ని ఇంకా పటిష్ఠం చెయ్యి.

133. మనిషి తన జీవిత గమ్యం చేరుటకు తన భావాలు ఏ విధంగా మలచుకోవాలి స్వామి?

ప్రతీ సూర్యోదయంతో అంత్యాన్ని సమీపిస్తున్న ప్రయాణాన్ని గురించి నీవు ఎక్కువగా పట్టించుకోవాలి. రధోత్సవాలు మీరు చూసి ఉంటారు. పతాకాలతో, తోరణాలతో బ్రహ్మాండంగా అలంకరిస్తారు. సన్నాయిలు, శంఖాల సంగీతంతో అనేక మంది నిపుణులు రధాన్ని లాగుతారు. కుస్తీల వాళ్ళు, నాట్యాల వాళ్ళు, వందిమాగదులు దాని ముందుండి ఆ సందర్భానికి వన్నె తెస్తారు. వేల మంది రధాన్ని చుట్టుముట్టి వీధి అంతా నిండుతారు. వాళ్ళ చూపు సహజంగా వినోదాల మీదకు వెళ్ళినా రధంలో ఉన్న మూర్తికి చేతులు జోడించి వంగి నమస్కరించినపుడు వారు ఎంతగానో సంతోషిస్తారు. తక్కినదంతా అంత ముఖ్యం కాదు. కొందరికైతే అది అంతా అసందర్భము. అట్లాగే జీవిత వ్యవహారంలో దేహమే రధము. దానిలో ప్రతిష్టాపించిన మూర్తి ఆత్మ. సంపాదించడం, ఖర్చు పెట్టడం, నవ్వడం, ఏడవడం, గాయపర్చడం, మాన్పడం మొదలైన అనేకమైన నిత్య జీవిత సర్కస్ వ్యాయామాలన్నీ భగవదారాధనకు, ఆత్మలబ్ధికి అప్రధానాలు. దేహమనే రధానికి బుద్ధి సారధి. ఇంద్రియ వ్యామోహము అనే త్రాటితో కోరికలనే దారి మీద దాన్ని లాగుతారు. మోక్షం దాని లక్ష్యము. రధము లోని యజమాని మూలవిరాట్టైన ఆత్మ స్వరూపుడు. నీవు లాగే రధాన్ని ఇట్లా చూడాలి. దీనికి బదులుగా జనం కోరికల చేత, అవసరాల చేత లాగబడి తోయబడి జన్మ నుంచి మరణానికి గుండ్రంగా భయంకరంగా తిరుగుతున్నాడు. ప్రయాణపు దారిలోని ఏ మైలు రాయినీ దాటడం లేదు. ఏ వంతెనా దాటడం లేదు. పురోగమనమే కనిపించుట లేదు. ప్రయాణ పద్ధతిని నిర్లక్ష్యం చేస్తున్నారు. నీవు క్రమశిక్షణా పూర్వకమైన ప్రయత్నాన్నో, ఏదో ఒక సాధననో చేయకపోతే అనుగ్రహం దిగి రాదు.

134. స్వామి, మీ దర్శన, స్పర్శన, సంభాషణలకు నోచుకున్న మేము ఎంతో అదృష్టవంతులము.

నిత్య జీవితంలో మీరు చేసే ప్రతీ కర్మను ఆధ్యాత్మికంగా అంటే దైవభావంతో నిర్వహించి నిరంతరమూ దైవమునందే జీవించి జన్మను సార్ధకం చేసుకోవాలి. నా జీవితమే నా సందేశంగా, నా పాద స్పర్శయే సత్యరూప సందర్శకంగా, ప్రేమమూర్తిగా, ధర్మ జ్యోతిగా, కనుల ముందు కదులాడే దైవంగా, మాట్లాడే మనిషిగా, సద్గురువుగా, చిదానంద రూపమైన నేను మీతో ఇలా మాట్లాడుతూ గడుపుట అనేది మీ పూర్వ జన్మ పుణ్యం కొద్దీ దొరికింది. భక్తుడు భగవంతునికి ఎంత శరణు అవుతాడో భగవంతుడు భక్తునికి అంత కన్నా వంద రెట్లు శరణు అవుతాడు.

135. భగవదన్వేషణలో జ్ఞానేంద్రియముల ప్రాధాన్యత ఏమిటి స్వామి?

భగవదన్వేషణలో ఆటంకములు కలుగుటకు మీ యొక్క ఆహార విహారములే దోషములు. శరీర పోషణకు ఆహారము అవసరమే. ఆధ్యాత్మిక సాధకుడు సత్వగుణ ప్రధానమైన ఆహారమునే తీసుకొనవలయును. జిహ్వని జయించలేని వానికి జీవితములో శాంతి లభించదు. ఆధ్యాత్మిక సాధకులు అధిక ప్రసంగులు కాకూడదు. నోటి ద్వారా రుచి చూచుట, మాట్లాడుట అను రెండు పనులు జరుగుచున్నవి. పంచ జ్ఞానేంద్రియములలో నోటికి మాత్రము రెండు పనులు ఉన్నవి. మిగిలిన కన్ను, చెవి, నాలుక చర్మముల ద్వారా ఒకొక్క పని మాత్రమే జరుగుచున్నది. నోటిని అరికట్టినచో జ్ఞానేంద్రియములని అన్నింటినీ జయించుటకు అవకాశము చిక్కును. ఇది సాధనకు ప్రధానాంశము. వెన్న కరగలేదంటే మంట చాలలేదన్నట్లుగా భగవంతుని చేరలేదంటే సాధన చాలలేదనే అర్థము కదా? భగదన్వేషణలో జ్ఞానేంద్రియములు మిక్కిలి ప్రాధాన్యత వహించుచున్నవి.

136. భగవంతుడు ఏమి ఆశిస్తాడు స్వామి?

ధన మదము, అధికార మదము, జాతి, కుల, వర్ణ, వర్గ, అంతస్తుల మదము, చర్మ సౌందర్య గర్వములను చూచి భగవంతుడు మెచ్చుకొనడు. మంచిగా నిజ జీవితం గడుపు వాడే భగవంతునకు ప్రియుడు, భక్తుడు. హృదయములో దయ అందరికీ ఉన్నది. కానీ దానిని మంచికై వినియోగించుటయే మానవుడు చేయవలసిన విధి. "హృదయము" అన్న నాలుగు అక్షరముల మాటలో "దయ" అను రెండు అక్షరముల మాట మధ్యలో ఇమిడి ఉన్నది కదా? దానిని సార్థకం చేసుకోవాలి. మనసా, వాచా, కర్మణా మానవుడు ప్రేమిస్తూ, ప్రేమించబడుతూ ఉన్నప్పుడే భగవత్ ప్రేమకు పాత్రులవుతారు. భగవంతుని ప్రేమించుటయే నిజమైన భక్తి. ఎదుటి వాని కళ్ళల్లోకి నీవు చూచినట్లైతే నీ ముఖమే వాని కళ్ళల్లో కనబడుతుంది కదా? మరి వానిని పొగడినను, తెగడినను నిన్ను నీవే దూషించుకొనుట వర్ణించుకొనుట జరుగుచున్నదను సత్యాన్ని గమనించినచో ప్రతివానిని భగవంతునిగానే గ్రహించి ప్రేమింతువు. అందరినీ ప్రేమించుటయే సాధకుని ముఖ్య కర్తవ్యం. ప్రేమకు పరాకాష్ట పరమాత్మయే. భక్తికి గమ్యము సత్య శివ సుందర స్వరూపుడైన భగవంతుడే.

137. ఆనందం, పారవశ్యం మరియు హర్షం అంటే ఏమిటి స్వామి?

ఆనందం అనునది పరమేశ్వరునికి సంబంధించిన విషయం. పారవశ్యం అనునది యోగికి కలిగే అనుభవం. అసలు కోరికలు లేని వాడికి కలిగేది హర్షం. సమస్తమైన జీవులకు సుఖం అనేది అందుబాటులో ఉన్నది. అయితే దానితోబాటు దుఃఖం కూడా అనివార్యంగా ఉన్నది.

ప్ర. మరి ఆనంద స్థితిని ప్రసాదించుటకు భగవంతుడు జీవులకు సన్నిహితంగా ఉంటాడా స్వామి?

జ. భగవంతుడు జీవరాసుల భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక చైతన్యములకు చాలా సన్నిహితుడై ఉన్నాడు. అతడు స్మర్తృగామి. అనగా పిలిచిన వెంటనే పలికెడి స్వభావము కలిగియున్నాడు. తన భక్తుల, ఆశ్రితుల కష్టనష్టములను రూపుమాపి ఇహ పర సుఖములను ఇవ్వగల సర్వ సమర్థుడు.

ప్ర. మరి యోగులు కర్మబంధ విముక్తులు ఎందుకు అవుతారు స్వామి?

జ. వారు జపధ్యానములందునూ, తపస్సునందును ఉందురు. ఆ తపోఫలమును వారేమీ ఉంచుకొనరు. అది సృష్టికంతటికీ ధారాదత్తము చేయుదురు. భక్తులను అనగా సాధనాపరులైన జీవులను ఆదివ్యాదుల నుండి **<u>రక్షించుటకు</u>** తమ తపోఫలితమును ధారపోసి కర్మబంధ విముక్తులగుదురు.

138. మానవుడి ఆధ్యాత్మిక స్థితి ఉన్నతంగా ఉన్నప్పుడు చైతన్యము, ప్రకృతిలు అనేవి బ్రహ్మ మరియు మాయ అని పిలవబడతాయా? దీనికి ఉదాహరణ ఇవ్వండి స్వామి.

దీనికి నేనే ఉదాహరణ. నేను పదనాలుగవ ఏట ఇల్లు వదిలి, సంసారాన్ని త్యజించి విరాగియైన ఆంతర్యం స్వయంగా నేనే బ్రహ్మయని అదే విధంగా నేనే మాయయని తెలియచెప్పటం. అపరిమితుడు, అనంత గుణములు కలిగిన బ్రహ్మస్వరూపమునకు పరిమితిని కలిగించే శక్తియే మాయ. నేను అపరిమిత బ్రహ్మస్వరూపమైనప్పటికినీ పుట్టపర్తిలో జన్మించి మాయా శక్తికి లోబడి పరిమితులలో వ్యవహరించానని సూచించడము. పద్నాలుగు సంవత్సరములు దాటిన తదుపరి నేను మాయకు బంధీని కానని నేను అపరిమిత బ్రహ్మస్వరూపుడినని స్పష్టంగా తెలియచేయడం. భక్తజనోద్ధరణకై అవతరించిన పరతత్వమే నేనని తెలియ చేయడం.

139. శరణాగతి అంటే ఏమిటి స్వామి?

శరణాగతి, శరణాగతి అంటూ ఉంటారు. అసలు శరణాగతి చేయడం ఎలా? ఒక సారి ఒక భక్తుడు నన్ను స్వామీ! శరణాగతి చేయటం ఎలా? అని అడిగినాడు. వెంటనే నేను నీవు శరణాగతి చెయ్యడం కూడానా? ముందు నామస్మరణ చెయ్యి చాలు. భగవంతుడు నీకు శరణు అవుతాడు అని చెప్పినాను. నామస్మరణ వల్ల భగవంతుడు భక్తునికి శరణు అవుతాడు.

ప్రేమమయుడు, సర్వశక్తిమయుడు అయిన దేవాధిదేవుడు భక్తునికి ఆధారము, సర్వమూ అను భావముతో భగవంతుని హస్తమునందు పనిముట్టుగా భావించుటలో శరణాగతి ప్రారంభమగును. ఈ దశ నుండి భక్తుడు భగవాన్ చూపిన మార్గంలో నడుచుచూ తన శక్తికతీతమైన పరిస్థితులలో ముందుకు సాగును. ఈ ప్రయాణ గమ్యము ఏకాత్మభావము. ఈ స్థితి సృష్టిలో ఏకాత్మభావాన్ని అనుభవించును. సుఖదుఃఖములు, లాభ నష్టములు, పాప పుణ్యాలు, సృష్టి - పరమాత్మ అను భిన్నత్వము ఏకాత్మభావనలో విలీనమగును. రెండు అనునది లేక ఉన్నది ఒకే ఒక్క సత్యమని గుర్తించుటచే బ్రహ్మ లేక ఆత్మ లేక సాయి యొక్క అనుభూతి కలుగుతుంది.

140. స్వామీ! దర్శనమిచ్చునపుడు మీరు ఎంతో అమాయకంగా కనిపిస్తారు. దీనిని ఎలా తీసుకోవాలి.

అమాయకమా? నేనా? ప్రశాంతి నిలయంలో కనిపించే నేనే విశ్వరూపం ధరించి కనిపిస్తాను. ఎలాగా అని అంటావా? అక్కడ సజీవ శిల్పాలనన్నింటినీ ఆవిధంగా నేర్పుగా మలచి సార్ధకంగా సేవలు చేయిస్తున్న ఈ సూపర్మైండ్ మాత్రమే అంతటా దృగ్గోచరమవుతుంది. అదే సత్య సందర్శనం. అదే **<u>ఆత్మసాక్షాత్కారం</u>**. మృదుమధురంగా చిరునవ్వులు చిందిస్తూ నిశ్శబ్దంగా ప్రేమ తరంగాలను ప్రసరింప చేస్తూ మరపురాని మధురానుభూతులతో హృదయాన్ని పరవశింపచేస్తున్న ఈ అపూర్వ శక్తియే ప్రపంచంలో అన్నింటినీ మించిన పరమాద్భుతము.

**ప్ర.** ఇలాంటి భగవంతుడే గురువుగా ఉండగా ఇంకొక గురువు అవసరం ఉన్నదా స్వామి? అది ఎలాంటిది?

**జ.** చాలా అవసరం ఉన్నది. ఎందుకనగా, నా నుండి సంపూర్ణశక్తిని అందుకొనువాడు సద్గురువు. ఈ రెండు పాత్రలు అనగా భగవంతుడు, సద్గురువు అనే పాత్రలు నేనే పోషిస్తున్నాను. నా నుండి కొంత శక్తిని గ్రహించి దాని నుంచి ఉత్తమగతిని పొందుటకు సహాయ సహకారాలను అందించేవాడే గురువు. కామినీకాంచనములకు గానీ, శీతోష్ణములకు గానీ, మానావమానములకు గానీ లొంగని, కృంగని, పొంగని స్థితప్రజ్ఞుడే, ద్వంద్వాతీతుడే, అఖండ ప్రజ్ఞాస్వరూపుడే, మోహనిర్మూలనము కావించువాడే గురువు. ముక్తిని

అతిసులభంగా ప్రసాదించగలడు.

141. స్వామీ! మీ ప్రేమ ప్రసరించని చోటే లేదా?

లేదు! ఈ ప్రేమ ప్రసరించని చోటే లేదు. ఈ సాయి విశ్వకుటుంబి. సాయి ప్రేమకు ఎల్లలు లేవు. నేను ఆత్మ బంధువును. విస్తరించటమే నా జీవితమని ఎప్పటినుండో చెబుతున్నాను. విస్తరించటమే జీవ లక్షణం, ముడుచుకు పోవటమే మృత్యు లక్షణం. మనిషిగా పుట్టినవాడు ఇలా క్రమవికాశాన్ని పొందాలి. అందుకే నా జీవితమనే మహాకావ్యాన్ని తెరిచిపెట్టి లోకానికి అందిస్తూ వచ్చాను. నా జీవితమంతా త్యాగమయం, మహాయజ్ఞం. యజ్ఞపురుషుడ్ని నేనే.

142. మీ యొక్క భక్తులకు సాయి అనునది ఎరుక కానీ అన్య జీవులకు ఎలా స్వామి?

బ్రహ్మ లేక ఆత్మ అనే పదములకు పర్యాయ పదముగా సాయి అని ఉపయోగించుటే అంతరార్థము యొక్క నిగూడార్థము. పరిమితమైన మనోబుద్ధులను ఆధారం చేసుకొని సాయి అనగా కంటికి కనిపించు దివ్యశక్తులుగల ఈ ఐదు అడుగుల మూడు అంగుళాల సుందర రూపంగా భ్రమించరాదు. మాయామోహ బంధితులై సాయి అనగా చూపులకు విదితమగు ఈ రూపమే తప్ప అన్యం లేదని భావించరాదు.

**ప్ర.** మీరు తెలిపే మీ నిజ రూపాన్ని ఎలా దర్శించాలి స్వామి?

**జ.** నేను నా నిజ రూపంతోనే **సాక్షాత్కరిస్తున్నాను**. అర్థం కాలేదా? ఏమిటా నిజ రూపం అంటావా? విశ్వ ప్రేమ, విశ్వ జనీన ప్రేమ, స్వార్థ స్వప్రయోజనాకాంక్షతో ఏమాత్రం కలుషితం కాని ప్రేమ, పవిత్ర ప్రేమ, నిప్పు వంటి నిజమైన ప్రేమ, తనలో పడిన శలభాలకు సద్గతిని కలిగించే యాగాగ్ని ప్రేమ, తనలో వేసిన లోహాల మురికిని తీసివేసే ప్రేమ, తన స్పర్శతో ఇనుమును బంగారంగా మార్చే ప్రేమ, బండరాళ్ళను ఉలితో చెక్కి ఆకారాలను సృష్టించే ప్రేమ, చిత్రికపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రేమ, బీటలు వారిన నేల దాహం తీర్చే తొలకరి వాన వంటి ప్రేమ ఇలా చెప్పుకుంటూపోతే అంతం ఉండదు. దాని లోతుని కానీ, విస్తీర్ణాన్ని కానీ, క్వాలిటీని కానీ, క్వాంటిటీ కానీ, ఎత్తును కానీ, ఘన పరిమాణాన్ని కొలిచేందుకు, తూచేందుకు మానవ మేధా సాధనాలు ఎన్నటికీ కనిపెట్టలేని తత్వమే సాయి.

143. యోగికి అహంకారము ఉండదా స్వామి?

యోగికి శక్తి సామర్ధ్యములు తనకే ఉన్నవని భ్రమించిన యెడల పరమాత్మ వారి గర్వమును భంగము చేయును. పరమాత్మ చేతిలో పనిముట్టుగా వాడుకొనుటకు యోగి యొక్క అహంకారము పరమాత్మలో లీనమైపోవలెను. మానవుడు పతనమవుటకు లక్ష మార్గములను అనుసరించిన యెడల వారిని ఉద్ధరించుటకై దైవము పది లక్షల మార్గములు అనుసరించును. ఇప్పుడూ అదే జరుగుచున్నది.

144. స్వామీ! మీ దర్శనానంతరము ఎనలేని దివ్యానుభూతిని పొందిన ఈ తనువూ, మనస్సూ అలౌకికమైన అద్భుత తరంగాలలో తేలియాడుతుంది.

అవును. ఇది చాలా అవసరం. పరమానందానుభూతితో ఆనందభాష్పాలతో తనమునకలు కావటం, దర్శనానంతరం దర్శన దృశ్యాలను మరీ మరీ స్మరించుకొనుట, భజనలో హృదయాన్ని కదిలించే ఆధ్యాత్మిక శక్తి తరంగాలతో నిండిపోయిన భగవన్నామాన్ని నోరార పలకడము, స్వామి మరలా దర్శనమిచ్చేవరకు స్వామిని గురించిన సంభాషణలు వీటన్నిటి ఫలితంగా అవిచ్ఛిన్నమైన ఆనందం పొందుతూ తనకు తెలియకుండగనే తనయొక్క పాపఫలితాన్ని తగ్గించుకుంటాడు.

145. శిష్యుడికి ఉండవలసిన లక్షణాలు ఏమిటి స్వామి? ఏమి గ్రహించాలి?

మొట్టమొదటిగా వినయ విధేయతలు కలిగి ఉండాలి. అలా లేని వాడు సద్విద్యార్థి కాలేడు. భక్తి, క్రమశిక్షణాదీక్షలతో భవ్య, దివ్య విద్యలు నేర్చుకోవాలి. అలా నేర్చుకునేవాడే శిష్యుడు. అనిత్య, అసత్య, అస్థిర జీవనాన్ని వీడి నిత్య, సత్య, స్థితమైన బ్రహ్మవిద్యను చర్చ, చింతన ద్వారా గ్రహించాలి, దర్శించాలి. తద్వారా ముక్తిని పొందాలి. అదే జనన మరణాతీత స్థితి.

146. ఇంతటి స్థితిని గురువు శిష్యుడికి అందించాలంటే సద్గురువు తప్పక గురువును ఆశీర్వదిస్తూ, పట్టుకుని నడపవలసిందే కదా స్వామి?

తప్పకుండా! గురువుకు అప్పగించిన కార్యమునకై సద్గురువు సహాయము గురువుకి తప్పక ఉంటుంది. ఎందరో బిడ్డలు. వారి జీవన గమ్యం. ముందు గురువు. తర్వాత సద్గురువు. తర్వాత

భగవంతుడు. ప్రాకృత, లౌకిక విషయ ప్రాధాన్యతాజ్ఞానమే విద్య అనే భ్రమలో కొట్టుమిట్టాడుతున్న వారిని తప్పక తీరం దాటించాలి. ఆ బాధ్యత గురువుది. ఈ దివ్య జీవన శిఖరాధిరోహణలో విశ్వాసమే తొలి మజిలీ కదా? ఈ తొలి మజిలీతో సంతృప్తిచెందక భక్తి శ్రద్ధలను ఆలంబనంగా చేసుకుని ముందుకు సాగేకొద్దీ అవగాహనలో వినూత్నమైన మార్పు సంభవిస్తుంది. దీని వెనుక స్వామి యొక్క అదృశ్యహస్తమున్నట్లుగా సంభ్రమాశ్చర్యాలతో కనుగొంటారు. ఆంతరంగిక పరిణామం తప్పక ఉద్భవిస్తుంది. ఈ పరిణామము విలక్షణమైనది. మానవ మేధస్సుకు అతీతమైనది.

147. అట్టి గురువు నేర్పు విద్య ఎట్టిది స్వామి?

పర విద్య నేర్పెడు వాడే గురువు. ఏ విద్య వల్ల అన్ని విద్యలూ తెలియబడునో, ఏది మూలాధారమో, ఏది దివ్య జ్యోతియో, ఏది జ్ఞానమో, ఏది అఖండమో, ఏది చైతన్యమో, ఏది త్రికాలబాధ్యమో, ఏది త్రిలోక్యపూజ్యమో, ఏది త్రిగుణాతీతమో, ఏది సర్వ వ్యాప్తమో, ఏది మోహభ్రాంతుల నాశకమో, ఏది నిత్య సత్యమో, ఏది ఆచలమో, ఏది శుద్ధ బుద్ధ ముక్త స్వరూపమో అట్టిదే పర విద్య. దానిని నేర్పెడు వాడే గురువు.

148. స్వామి! మీరు ఈ జీవితాన్ని ఎందుకు అంతు లేని పరీక్షగా చేసారు? కొంచమైనా విరామం, కాస్త విశ్రాంతి, కొంచెం సరదా, సంతోషం ఎందుకు ఉండకూడదు?

మీరు ఇలా ఫిర్యాదులు చేస్తారని నాకు తెలుసు. అందుకే నేను కొన్ని మినహాయింపులు కూడా మీకు ఇచ్చాను. నేను ఏమి చెబుతున్నానంటే విను! ఈ పరీక్షల్లో అంత భయం ఎందుకు? అలాంటి సమయాల్లో కూడా నేను నీ హృదయంలోనే ఉన్నాను కదా. నీకు సమాధానం దొరకని ప్రశ్నలకు జవాబు ఇవ్వటానికి ఎల్ల వేళలా నేను సిద్ధంగానే ఉన్నాను కదా. కేవలం నీ బుద్ధిని చురుకుగా ఉపయోగించి నన్ను తలచుకుంటే చాలు. ఇంత కంటే మంచి అవకాశం నీకెక్కడైనా దొరుకుతుందా? ఈ ప్రపంచంలో మీరు వ్రాసే పరీక్షలకు ఎవరినైనా అడిగి సమాధానం వ్రాసే అవకాశం ఉండదు. కానీ భగవంతుడు పెట్టే పరీక్షల్లో మాత్రం అటువంటి అవకాశం ఉంటుంది.

ప్ర. ఈ పరీక్షలను జీవులు ఎలా తెలుసుకుంటారు?

జ. కేవలం మానవునికి మాత్రమే తన తెలివిని ఉపయోగించి విచక్షణా జ్ఞానంతో పనులు చేయగల సామర్థ్యం కల్పించబడ్డది. ఈ చైతన్యపు స్థాయి కొందరిలో అట్టడుగున, కొందరిలో మధ్యస్థంగా, మరి కొందరిలో ఈ చైతన్యము ఉన్నత స్థాయిలో ఉంటుంది.

149. ఆనంద ప్రాప్తికి ఏవి అవసరం స్వామి?

ఆనందం కావాలనుకుంటారు కానీ జనం సాధనలో ప్రవేశించడానికి మాత్రం వెనుకాడుతారు. ఒక్క పైసా ఖర్చు పెట్టడానికి ఇష్టపడరు. ఈషణ్మాత్రం కష్టపడటానికి ఇష్టపడరు, సిద్ధపడరు. కానీ ఆకాశంలోంచి తమ ఒడిలోకి మోక్షం రాలిపడాలని మాత్రం వాళ్ళనుకుంటారు. వాళ్ళ బుర్రలో ఏమీ కష్టం లేకుండా దేవుడు ప్రత్యక్షం కావాలనుకుంటారు. యాజ్ఞవల్క్యుడు ఆధ్యాత్మిక సాధనకు ఇల్లు వదలి వెళ్తూ భార్య మైత్రేయికి సువర్ణాన్ని, పశువులనిచ్చినపుడు తన సాధనకు వాటి పట్ల ప్రయోజనముందా? అని అడిగింది. ఆధ్యాత్మిక ఐశ్వర్యం అనే అనుభూతి ముందర అవి అస్థిరము, తక్కువని ఆయన సమాధానం చెప్పినపుడు ఆమె వాటిని పరిత్యజించి తపస్సు, శ్రద్ధలనే విలువైన ఐశ్వర్యాన్ని కోరుకున్నది. వీటి ద్వారా ఆమె పారలౌకిక ఆనందాన్ని కోరుకున్నది. ఇక్కడే మోక్షమనేది పొందగల్గింది.

150. "భావగ్రాహి జనార్ధనుడు" అన్న దానికి అర్థము ఏమిటి స్వామి?

భావమయమై శరీరం భగవన్మయమైన క్షణముననే జీవుడు శివుడుగా, నరుడు నారాయణుడిగా, మానవుడు మాధవుడిగా, పురుషుడు పురుషోత్తముడిగా పరిణతి చెందుతారు. భావగ్రాహి జనార్ధనుడు అనే దానికి అర్థము ఇదే. ఇందులోని పరమార్థమేమనగా నిత్య జీవన సరళిలో దైవానికి నివేదించెడి పదార్థముల పాకశుద్ధి, పదార్థశుద్ధులను దైవము గ్రహించడు. భక్తుడు ఏ భావంతో సమర్పించుతున్నాడన్న పవిత్ర భావాన్నే గ్రహిస్తాడు. అంటే మీ భావాల్ని భగవంతుడు మాత్రమే గ్రహించగలుగుతాడు. మీ సాటి మానవులు మిమ్మల్ని, మీ లోపల భావాల్ని గ్రహించలేరు. కారణం దైవానికి తనకంటూ భావాలేమీ ఉండవు. అనగా మీ దేహమందున్న నీ భావమే తన భావమన్నది అంతరార్థము, పరమార్థము కూడా. నీకు అర్థమయ్యే ఉంటుంది కదా. అంటే నీ భావాన్ని జోడించి తదనుకూలంగా స్పందించుట కారణంగా, ఒకరికొకరితో భావ వైవిధ్యము కల్గి, అనర్థాలపాలగుట సంభవించుట సర్వ విదితమే కదా? అయితే దేహం

దేవాలయం అన్న భావమే శరణాగతి అన్నది ఎప్పుడు ఏ విధంగా నిరూపించబడుతుందనగా తానున్న చోటనే తన భావమందు పరమాత్మ రూపము, వైభవము మెదలిన వెంటనే దేహం దేవాలయముగా, హృదయం పరమాత్మగా రూపొంది అట్టి అనుభూతి అనిర్వచనీయానంద స్థితిలో నిన్ను తనమున్కలుచేయును. అది స్వానుభవానికే పరిమితము కానీ తదన్య విధానములకు అందనిది, అంతుపట్టనిది అని గమనించాలి. అంటే అర్థమేమనగా ఆ స్థితి యందు దేహం దేవాలయముగానున్నా తెలియకుండా ఉంది. అది భక్తితో సమ్మిళితమైన క్షణానే అర్థమవుతుంది.

151. అరిష్ట పంచకములు అనగా ఏమిటి స్వామి?

ఆనాటి గురుకులావస్థలో విద్యార్థులు అచట శిక్షణకు కట్టుబడి తు.చ. తప్పక నియమములు పాటించేవాళ్ళు. ఆజ్ఞను ఉల్లంఘించే విద్యార్థిని ఆ పరిసర ప్రాంతానికి కూడా రానిచ్చేవారు కాదు. అకారపంచక అరిష్టములు కలిగిన వ్యక్తిని గురువులు సహించేవారు కాదు. అకారముతో ఆరంభమయ్యే అరిష్ట పంచకములలో మొదటిది అలక్ష్యము. రెండవది అవినయము. మూడవది అహంకారము. నాల్గవది అసూయ. ఐదవది అసభ్యత. ఈ ఐదింటినీ కూడిన వాడు విద్యార్థిగా తగినవాడు కాడు. అలక్ష్యము చేయకూడదు. అవినయము ప్రకటించకూడదు. అహంకారము అంతకంటే ప్రమాదకరమైనది. అసూయ మహా పాపస్వరూపమైనది. ఇంక అసభ్యత అంటే మానవుడిగా ఉండి కూడా సమాజమునందు ఏ విశిష్ట భావముతో జీవించాలో దానికి విరుద్ధంగా జీవించుటయే అసభ్యత.

152. శిష్యులు గురు సాంగత్యంలో ఉన్నప్పటికీ వారిలో సరైన పరివర్తన రాకపోవటానికి కారణం ఏమిటి స్వామి? అటువంటి శిష్యుల పట్ల గురువుల స్పందన ఏ విధంగా ఉంటుంది?

గత జన్మల కర్మలు, విషయ వాసనలు కలిసి అనుమానాలు, అపోహలను పెంచుతాయి. కన్పించే సంకుచిత భావాలు, గర్వము, తన ఆనందమే తనకు ప్రధానము వంటివి సిద్ధ పురుషుల పాదాలకు దూరంగా ఉంచుతాయి. తానే ఎంతో జ్ఞానము, వైరాగ్యము, సిద్ధులు పొందినా సామాన్యులు, సాధకుల కోసం తాము మామూలు వ్యక్తిగా ప్రవర్తిస్తూ సామాన్య వ్యక్తి స్థాయిలో ఉంటూ వారిని తన వైపు మళ్ళించుకుని ప్రేమతో, స్నేహంతో తమతో కలుపుకుని ఉద్ధరిస్తారు. కానీ గురువుల పట్ల వారి దృష్టిని ఇంకొక విధంగా

మల్చుకుని వారి జన్మను కలుషితం చేసుకుంటూరు. చెడు ప్రచారం చేస్తుంటారు. చెడ్డ పనికి సహకారం దొరుకుతుంది. అట్టివారు జన్మజన్మల నరకాన్ని అనుభవిస్తారు. నిజమైన సిద్ధ పుషులు, మహాత్ములు బైట పడరు. వారి దృష్టి మీ మీద రవ్వంత పడినా ఎంతో మార్పు కనపడుతుంది. ఏమి చెప్పినా మీ ఉన్నతిని దృష్టిలో పెట్టుకుని చెబుతారు. రకరకాల పద్ధతుల ద్వారా సాధనను పెంచి సాధకులను ముక్తి మార్గం లోకి చేరుస్తారు. మహాత్ములు, సిద్ధ పురుషులు, సద్గురువుల సాంగత్యాన్ని వదులుకోనేవదులుకోకూడదు. వారి సన్నిధిని విడిచి పెట్టనే కూడదు. సహనంతో వారిని ఆశ్రయించాలి. ప్రతీదానికి కొంత సమయం పడుతుంది. వేచి చూడాలి. ఓపికతో వేచి చూడాలి. ప్రత్యక్షంలో కానీ పరోక్షంలో కానీ గురువులను నిందించనేకూడదు. వారు కరుణా సముద్రులు. ఆ కరుణ గంగను ఆస్వాదించాలి.

153. యోగులు మరియు గురువులు లోకానికి ఏవిధంగా సహాయ పడుతుంటారు స్వామి?

భగవంతుని కృపను పొందిన వారికే మానవ జన్మ లభిస్తుంది. అది చాలా అరుదైన అవకాశం. మానవుల కోసం ముక్తి ద్వారాన్ని తెరిచి ఉంచుతాడు భగవంతుడు. ఎందరో మహాత్ములు, సిద్ధపురుషులు మనిషిని ఉద్ధరించి ముక్తి ద్వారం గుండా పంపించాలని తపన పడుతున్నారు. మానవుడు ఎదుర్కొంటున్న కష్టాలు, దుఃఖాలు, భయాలను పంచుకొనటానికి తిరిగి అవి జీవితంలో రాకుండా ఉండే సాధన నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారు. మానవుడు ఇంద్రియ ప్రభావం నుండి బయటపడి ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపేందుకు వీలైన అభయహస్తాన్ని అందించేందుకు నిరంతరం కృషి చేస్తుంటాడు గురువు. వాళ్ల ఆశ ఒక్కటే. అది జీవులు హుందాగా, ఆనందంగా, సంతృప్తిగా జీవించాలని. అందుకోసం భూమి చుట్టూ తమ దివ్య తరంగాలను ప్రభావితం చేసేలాగా వారు తమలోని శక్తితో భూమిని <u>ఛార్జ్</u> చేస్తారు. రహస్యంగా వారు పంపే శక్తిని ఉపయోగించుకునేవారు సంతోషంగా జీవిస్తుంటారు. ఎలాగైతే సూర్యుడు ఉదయించి ప్రపంచాన్ని కాంతితో నింపుతాడో సాధకునికి గురువు అలా జ్ఞాన కిరణాలతో ప్రకాశించేటట్లు చేయగలడు. గురువులు తమపని తాము చేసి జ్ఞానము, ప్రేమ, సాధన, అనురాగము మొదలైనవి అందిస్తూ వైరాగ్యాన్ని నేర్పుతారు.

154. గురువులు ఎన్ని రకాలుగా ఉంటారు స్వామి?

మామూలు గురువులు కాదు. ఆధ్యాత్మిక గురువే గురువు. అట్టి గురువులు ఎనిమిది రకాలుగా

ఉంటారు.

i. బోధ గురువు

ii. వేద గురువు

iii. నిషిద్ధ గురువు

iv. కామ్య గురువు

v. వాచక గురువు

vi. సూచక గురువు

vii. కారణ గురువు

viii. విహిత గురువు

**బోధ గురువు** - బోధ గురువు కేవలం శాస్త్రాలను పఠించి బోధించేవాడు. ఉత్సాహ ప్రోత్సాహాలను అందులోని నిబంధనలకు అనుకూలంగా ఇస్తూ ఉంటాడు.

**వేద గురువు** - తత్వార్థములను బోధించి తత్వవేత్తలను గావించి మనస్సును దైవం వైపుకు మరలుస్తాడు.

**నిషిద్ధ గురువు** - కామ్య కర్మలను బోధించి ఇహ పరముల యందు మోదమును అందించుతాడు.

**కామ్య గురువు** - పుణ్య కార్యములను ఆచరింప చేసి తద్వారా ఇహపరములయందు సుఖమును అందించుతాడు.

**వాచక గురువు** - యోగ తత్వాన్ని బోధించి దివ్యత్వమైన ఆత్మ తత్వాన్ని అనుభవింపచేస్తాడు.

**సూచక గురువు** - శమదమాది షట్సంపత్తిని బోధించి ఇంద్రియాలు నిగ్రహింపచేసేవాడు.

**కారణ గురువు** - జీవబ్రహ్మైక్యానుసంధానము కలిగింపచేస్తాడు.

**విహిత గురువు** - అనేక విధాలైన సందేహములను రూపు మాపి మనస్సును పరిశుద్ధము గావించి చిత్తశుద్ధితో ఆత్మతత్వాన్ని గుర్తింపచేస్తాడు.

వీరందరిలోనూ జీవబ్రహ్మైక్యానుసంధానము కలిగించే కారణ గురువే ప్రధానమైన గురువు. ఈ రెండు బింబ ప్రతిబింబాల సంబంధాన్ని బోధించేటటువంటివాడే అసలైన గురువు. ఆ గురువు అనుగ్రహం పొందటానికి ప్రతీ ఒక్కరూ ప్రయత్నించాలి. వినయ విధేయతలతో, భక్తి శ్రద్ధలతో అన్ని విద్యలను అభ్యసించాలి. గురువు యొక్క ప్రేమను పొందాలి. గురువు అనుగ్రహాన్ని పొందిన వాడు దేనినైనా సాధించవచ్చు.

155. స్వామి! గురుబ్రహ్మ, గురువిష్ణుః ... అనే శ్లోకముకు అర్ధము గురువు **సాక్షాత్తు** త్రిమూర్తి స్వరూపుడనేనా లేక వేరే అర్ధం ఏదైనా కలదా?

బ్రహ్మదేవుడు తన దివ్య సంకల్పంతో సృష్టిని చేస్తాడు. విష్ణువు తన సంకల్పంతో సృష్టిని పాలిస్తాడు, ఈశ్వరుడు లయం చేస్తాడు. ఈ త్రిమూర్తులు గురు రూపంలోనే ఉన్నారని, త్రిమూర్తి స్వరూపుడు గురువే అని చెప్పటం జరిగింది. దుర్లభమైన మానవ జన్మను పొందిన జీవులు తాము భూమి మీదకు ఎందుకు వచ్చారో, ఏమి చెయ్యాలో, ఎక్కడికి వెళ్ళాలో ఏమీ తెలియక అమ్మ పెట్టిన గోరుముద్దలు తింటూ ఆట పాటలతో కాలం గడుపుతూ ఉంటారు. జీవితం అంటే ఇది కాదు నాయనా! క్షరములేని అక్షరములను అభ్యసించి ఆ అక్షర పరబ్రహ్మతత్వంలో కలిసిపోవాలని చెప్పి "ఓం నమః శివాయ" అను పంచాక్షరీ మహామంత్రమును పలకమీద దిద్దించి ఆ మంత్రం బలము పోషించి నిన్ను **రక్షించి** నీ జన్మ సాఫల్యతను పొందుటకై అక్షరాభ్యాసము అనునది ఏర్పర్చారు. దీనిని గురువు ద్వారా జీవుడు పొందుతాడు. జీవుడిలో జ్ఞాన దృష్టిని పెంపొందిస్తాడు కావున గురువు బ్రహ్మ అయినాడు. అంటే జ్ఞాన సృష్టికర్త గురువు. బాల్యమునందు ప్రారంభించిన విద్యను క్రమశిక్షణలో అభ్యసించి సద్బుద్ధితో, సమ బుద్ధితో, సన్మార్గంలో పెట్టడమే సద్విద్య లక్షణము. శాంతము, సహనము, ఓర్పు, సమదృష్టి విష్ణుతత్వము. అటువంటి లక్షణములు కలిగిన గురువు సహాయంతో విద్య నేర్చుకుని విద్యావినయములతో అన్ని రంగములలో అర్హత, అర్హత వల్ల ధనము, ధనము వల్ల ధర్మ మార్గమును అనుసరించి ఇహపరములను సాధించుటయే విష్ణుతత్వము. అందుకని గురువే విష్ణువు. ఇక మహేశ్వరుడు. ఆయన జ్ఞాన దాత. మానవ జన్మ ఎత్తి నీవు నిర్వర్తించవలసిన కర్తవ్య కర్మలను ధర్మబద్ధంగ ఆచరించి మరలా నీ స్వస్థానానికి నీవు చేరుకోవాలని గుర్తుచేస్తూ భౌతికమైన, లౌకికమైన విద్యలే కాక జ్ఞాన విద్యను అభ్యసించుటకు అక్షరాభ్యాసమునాడు చెప్పినట్టు క్షరముకాని విద్య అంటే క్షరముకాని అక్షర పరబ్రహ్మలో లీనమై మంగళప్రదమైన శివంలో లయం అయిపో అని చెప్పే ఆధ్యాత్మిక గురువే మహేశ్వరుడు. అందువల్లనే గురువు అనే పదంలో అంతరార్ధము అజ్ఞానమనే చీకటిని పోగొట్టి జ్ఞాన మార్గమును చూపించువాడు అని చెప్పినారు. తల్లి ప్రధమ గురువు అయినా జ్ఞానాన్ని ప్రసాదించి, విచక్షణా జ్ఞానము, లోక జ్ఞానము కలిగించు దైవత్వాన్ని అందుకొనుటకు సహాయ సహకారాల్ని అందించేది గురువే కావున త్రిమూర్తి స్వరూపుడు గురువు.

156. గురు సన్నిధిని చేరిన ప్రతీ ఒక్కరూ ఉన్నత స్థాయిని అందుకుంటూరా స్వామి?

అలా ఎలా చెప్పవచ్చు. వ్యక్తులలో దాగి ఉన్న అహంకారం వారిని గురువులు, మహాత్ములు, సిద్ధపురుషుల దగ్గరకు వెళ్ళనీయదు. వెళ్ళినా వారిని శ్రద్ధతో అంకితమవ్వనీయదు. గురువుల సన్నిధిలో ఉన్నట్లుగా కనిపించినా వారిలో కావలసినంత మార్పు, ఎదుగుదల కనిపించవు. ఆ కారణంతో ఎంతో సమయాన్ని వృధా చేసుకుంటూరు. కొంత మంది అపురూపంగా లభించిన మానవ జన్మను దుర్వినియోగం చేసుకుంటూరు. ఇంద్రియాలు, కోరికలు, మోహం ఇటువంటి వాటినుంచి తప్పించుకోవాలంటే కేవలం సద్గురువులు, మహాత్ముల సన్నిధిలో వారి మార్గదర్శకత్వంలో జీవించాలి. చిన్న చిన్న స్వార్ధాలతో అహంకార పూరితమైన ప్రవర్తనతో గురువులతో దాగుడుమూతలాడుతుంటూరు. వారి చేష్టలు మహాత్ములకు అర్ధమవుతాయి. అయినా కోపగించుకోకుండా మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తుంటూరు. సామాన్యులు, సాధకులు గురువులను వదిలి వెళ్ళినా గురువులు మాత్రం పరోక్షంగా వదలకుండా వారిని సన్మార్గంలో పెట్టేందుకు నిరంతరం ప్రయత్నిస్తుంటూరు.

157. వినయానికి తోడు విశ్వాసము ఉన్నప్పుడే ఉద్ధరించబడుతారని అనుకుంటున్నాను. ఇది నిజమే కదా స్వామి?

మంచిగానే ఆలోచించావు. వినయమున్న చోట విశ్వాసము తప్పక ఉండియే ఉంటుంది. ఒక వేళ లేక పోయినా క్రమేణా వచ్చియే తీరాలి. ఎందుకంటే సత్యమైన మాట సాయి మాట. చాలా చాలా చెబుతుంటూను. అవి విని ఆచరణలో పెట్టుకున్న వారికి అవి అక్షర సత్యాలే. దానిలో భాగంగా సేవ చేసిన వారిని సేవ్ చేస్తాను అని చెప్పాను. అలాంటి సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి. ఇటువంటి విశ్వాసము లేని వారికి ప్రేమ కలుగదు. ప్రేమ లేని వారికి శాంతి లభించదు. శాంతి లేని వాడు సత్యమార్గంలో ప్రవేశించడు. సత్య మార్గంలో ప్రవేశించని వానికి ఆనందము శూన్యము. ఆనందము లేని వాడికి దేవుడు కూడా లేడు. కనుక ఆనందాన్ని అనుభవించాలంటే సత్యమార్గంలోనికి ప్రవేశించాలి. కనుకనే విశ్వాసమున్న చోట ప్రేమ ఉంటుంది. ప్రేమ ఉన్న చోట శాంతి ఉంటుంది. శాంతి ఉన్న చోట సత్యముంటుంది. సత్యమున్నచోట ఆనందం ఉంటుంది. ఆనందం ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. మూల కారణం విశ్వాసమే.

158. స్వామి! శ్శుచి అన్నది ఎటువంటిదై ఉండాలి?

ఏ శ్శుచి? బాహ్య శ్శుచియా? లేక అంతర్ శ్శుచియా? అంతర్ బహిర్ శ్శుచిని అభివృద్ధి పర్చుకోవాలి. కేవలం బాహ్యమైన శరీరమును పరిశుద్ధి గావించుకోవటం చేత తాను శ్శుచి కాలేడు. అంతర్ శుద్ధి అత్యవసరమైనటువంటిది. కళాయి లేని పాత్రల యందు సాంబారు వండినపుడు ఆ సాంబారంతా చిలుముపడుతుంది. అదే విధంగా అంతర్ పాత్ర అయిన హృదయమునందు ప్రేమ అనేటటువంటి కళాయిని వేసి అందులో ఏ విధమైనటువంటి వంటలు వండినా పరిశుద్ధంగానే ఉంటాయి. కనుక ప్రతీ మానవునికి అంతర్ శుద్ధి అత్యవసరం. ఎట్టి అపవిత్రములైన భావములను ప్రవేశించనీయకుండా, ఎట్టి దుష్ట భావములను చేరనీయకుండా, దుర్బుద్ధులను ప్రవేశపెట్టకుండా భగవత్ ప్రేమ చేతనే హృదయము పవిత్రం గావించుకుని నింపుకోవాలి. ఈ ప్రేమ అనేటటువంటి కళాయితో ఎట్టి వంటలనైనా మనం వండుకోవచ్చు. కనుక అంతర్ శుద్ధి అత్యవసరమైనటువంటిది. దీనికి తగినట్లుగా బహిర్ శుద్ధిని కూడా అభివృద్ధి పర్చుకోవాలి. దీనినే "శ్శుచి" అంటారు. మరి మిగిలినది "దక్ష" అంటే **దక్షుడు** కావాలి. ఏది అది? తాను పట్టిన భగవంతుడ్ని ఎలాంటి కష్ట పరిస్థితులయందు కానీ, ఎలాంటి బాధలయందు కానీ ఏ మాత్రం వదల రాదు. తాను మంచి "**దక్షుడు**" కావాలి. ఆ విధమైనటువంటి దీక్షను పూనినటువంటి వాడే "**దక్షుడు**". అనగా ఎట్టి పరిస్థితులలోనూ, ఎట్టి వానియందునూ, కాలకర్మకర్తవ్యాలు మారినప్పటికినీ తన భావములను మార్చుకొనకుండా ఉండటం, ఇష్టమైనది కానీ అయిష్టమైనది కానీ, ప్రీతి అయినది కానీ అప్రీతి అయినది కానీ, ద్వేషమైనది కానీ ఇక్కడ రజో గుణములకు ఏమాత్రం అవకాశం ఇవ్వ కూడదు. రాజకీయ సంబంధమైన భావములు హృదయములో చేర్చుకోకూడదు. అదియే **దక్షునికి** తగినటువంటి విలువలు. అనగా వీటి కోసం దీక్షను పూనినటువంటి వాడు **దక్షుడు**.

నీవు ఏదో అడగాలని మొదలుపెట్టావు. అర్థమైనది కానీ మధ్యలో నుండి ఎందుకు అడుగుతున్నావు? అంటే దానికి అర్ధము తెలుసునా? ఏమి తెలుసునో చెప్పు చూద్దాము. ముందుగా నీవు అడుగదల్చుకున్న శ్లోకం పూర్తిగా చెప్పు.

159. "నీకు తెలిసిన అర్థాన్ని అర్థవంతంగా చెప్పు అని నా చేత స్వామి చెప్పించిన సమాధానం"

అనపేక్ష శ్శుచిర్దక్ష, ఉదాశీనో గత వ్యధః

సర్వారంభ పరిత్యాగి యోమద్భక్త స్సమే ప్రియః

అనపేక్ష అనగా నాకు తెలిసిన అర్ధం చెబుతాను స్వామి. తప్పు ఉంటే సరిదిద్దండి. మీ భక్తులు ఎట్టి ఆశలనూ లేకుండా ఉండాలి. ఎట్టి ఆపేక్షలూ లేకుండా ఉండాలి. అయితే శరీర, ఇంద్రియ, మనో, బుద్ధులతో కూడిన మానవుడు అపేక్ష లేకుండా ఏ విధంగా ఉండగలడు? ఏవో కొన్ని అభీష్టములు వారికి ఉండియే ఉండాలి. అప్పటికప్పుడు ఆనందాన్ని చేకూర్చేటటువంటి ఇంద్రియ సుఖాలు ఒక వైపున, మరొక వైపున ఇంద్రియాలకు అతీతమైన వాంఛ. మిగిలినటువంటి వాంఛలన్నియూ ఈ రెండింటియందే అంతర్భూతమై ఉంటున్నాయి. మానవులమైన మేము ఈనాడు అనేక విధములైన అభీష్టములు లేకుండా ఏ విధంగా జీవించగలము స్వామి? అంటే మాకంటూ ఎటువంటి అభీష్టములు లేకుండా జీవించుటయే అనపేక్ష అంటారు అనుకుంటున్నాను. కాని ఇది ఎలా సాధ్యమో మీరే తెలియపర్చండి స్వామి.

**జ.** బాగానే చెప్పావు, బాగానే అడిగావు. దీనికి ఒక చక్కని ఉపాయం చెప్పనా? నీ వాంఛలను నీవు కోరు. తప్పు లేదు. కానీ భగవత్ ప్రీత్యర్థంగా వినియోగపరచి నీ వాంఛలను నీవు అనుభవించు. "సర్వ కర్మ భగవత్ ప్రీత్యర్థం" అనే భావంతో ఉత్తమమైన భావాలను అభివృద్ధి పరుచుకుని, సత్యనిత్యములైనటువంటి వాటిని పాటిస్తూపోవాలి. ఇది నాది, అది నీది అనేటటువంటి బేధభావము లేకుండా, సర్వమూ భగవంతుని యొక్క ప్రీత్యర్థమై నేను అనుభవిస్తున్నాను అనే భావంతో చేసినపుడు, ఎట్టి అభీష్టములు లేనటువంటి వారిగా రూపొందగలరు. ప్రాకృతమైన కోరికల నివృత్తిగానీ, అప్రాప్తమైనటువంటి కోరికలు కానీ కోరవచ్చు. కానీ నేటి మానవునికి లౌకికమైనటువంటి కోరికలు చాలా ఎక్కువగా ఉంటాయి. అలౌకికమైన కోరికలు చాలా తక్కువగా ఉంటాయి. కానీ ఈ రెండింటి యందు ఉన్నటువంటి దైవత్వం ఒక్కటే. అయితే ఈ అభీష్టములు నెరవేరటానికి ఏది ఆధారము? ఇందాక నీవు అడిగావే "శ్శుచిర్దక్ష" అది చాలా అవసరము.

160. అంటే అటువంటి అనపేక్ష, శ్శుచిర్దక్షతలు కలవాడు ఉదాశీనుడా స్వామి?

అవును. అనగా దేనితోనూ సంబంధం లేనట్లుగా ఉండాలి. అనగా ఇది నాది, అది నీది అనేటటువంటి బేధములకు అవకాశం ఇవ్వకూడదు. ఉదాశీనుడిగా తాను ఉండాలి. ఎటువంటి పరిస్థితులనైనా తాను ఉదాశీనంగా భావించి అనుభవించాలి.

161. సరే స్వామి, ఇచట "గతవ్యధః" అని చెప్పుటలో అంతరార్థము తెల్పండి.

జ. అనగా జరిగినదాని గురించి గానీ, జరగబోయేదాని గురించి గానీ ఏమాత్రం విచారించకూడదు. గడిచిపోయింది గడిచిపోయింది. ఇది ఏనాటికీ తిరిగి రాదు. భవిష్యత్తు అనేది ఖాయమైనది కాదు. కనుక గడిచిన దానిని గురించి గానీ, భవిష్యత్తును గురించి గానీ విచారించకుండా వర్తమానమును మాత్రం దృష్టి యందు ఉంచుకుని కార్యములో ప్రవేశించాలి. వర్తమానంలో మీరు సరియైన దీక్షతో కార్యమును సాధించినపుడే సర్వ విధములా విజయాన్ని పొందినవారు అవుతారు. ఈ నాటి మానవుడు అన్ని విధాలా అశాంతికి గురికావడానికి వర్తమానంలో ఉండకపోవటమే మూలకారణం. ప్రయత్నించినటువంటి కార్యం చెడిపోయిందని <u>పాస్ట్</u> ను గురించి ఎప్పుడూ విచారిస్తూ ఉంటాడు. దీని వలన ఫలితము ఏమిటి? ఇక రాబోయే దాని గురించి అనేక విధముల పరితపిస్తూ ఉంటాడు. రాబోయేది నీది కాదు. కాలగర్భంలో కలసి ఉన్నటువంటి దాని గురించి విచారించి ప్రయోజనమేమిటి? కనుక వర్తమానమును దృష్టి యందు ఉంచుకుని, ఆకార్యంలో దీక్షను పూనాలి. ఎందుకంటే అది విత్తు. ఈ విత్తు ద్వారానే గతము, భవిష్యత్తు రెండూ జరుగుచున్నాయి. ఈ విత్తు గురించి మర్చిపోతున్నావు. రాబోయే చెట్టును గురించి, గతంలోని చెట్లను గురించి చింతిస్తున్నావు. కనుక వర్తమానాన్ని దృష్టి యందు ఉంచుకోవాలి. అపుడే మానవుడు అన్ని విధాలా విజయాన్ని సాధించగలడు.

162. స్వామి, చింతలు మానేసి ప్రతీదీ పరిత్యజించడమేనా "సర్వారంభ పరిత్యాగి" అంటే?

అవును. అన్ని విధములైన వాంఛలను, అహంకారములను మీరు దూరం చేసుకోవాలి. ఈ అహంకారము ఉండినంతవరకు మానవుడు ఎట్టి చిన్న ఆధ్యాత్మిక అభివృద్ధినీ సాధించలేడు. అహంకారం చేతనే మానవుడు అన్ని విధాలా పతనమైపోతున్నాడు. అహంకారం చాలా చెడ్డది. ఈ అహంకారం ఉండినంతవరకూ భార్యబిడ్డలుగానీ, ఎవ్వరైనా కానీ ఏ మాత్రం గౌరవించరు. కేవలం ప్రాకృతికంగా గౌరవించినట్లు నటన చేయవచ్చును. కానీ ఏ మాత్రం ప్రేమించరు. కావున అహంకారమనెడిది మానవుల పాలిట ద్వేషిగా మీరు భావించాలి. ఈ అహంకారము ఉండినంత వరకూ మీరు ఏ చిన్న కార్యమునూ సాధించలేరు. బంధుమిత్రులు కూడా మిమ్మల్ని ప్రేమించరు. కనుక ఈ అహంకారము ఏ మాత్రం

చొరబడకుండా అంటే అవకాశమే ఇవ్వకుండా చూచుకోవాలి. దీనిని ఒక్క దానిని పరిత్యజిస్తేనే మానవత్వమనేది అవగతమవుతుంది.

163. "యోమద్భక్త స్సమే ప్రియః" అన్న దానికి అర్థం ఏమిటి స్వామి?

పైన చెప్పినటువంటి గుణములు కలిగిన భక్తులు మాత్రమే నాకు ప్రియమైనటువంటి వారు. ఇక మిగిలినటువంటి వారు కాదు అని స్పష్టంగా చెబుతున్నాను. భగవంతునితో సన్నిహిత బాంధవ్యాన్ని కలుపుకోవాలనుకున్నప్పుడు, సరైన ప్రేమను అందుకోవాలనుకున్నప్పుడు, నిత్య సత్యమైన స్థితి మరియు స్థానమును పొందవలెననుకున్నప్పుడు ఈ విధమైన గుణములను మీరు అభివృద్ధి చేసుకునియే తీరాలి. మీరు భగవంతుని ప్రేమకు పాత్రులు అవ్వాలంటే తప్పనిసరిగా ఈ గుణాలను అభివృద్ధి చేసుకోనియే తీరాలి. పైకి కొందరు "నమస్కారం" అంటారు. లోపల అంతా కారమే. ఇలాంటి కారంను హృదయంలో నింపుకుని ఎన్ని నమస్కారాలు చెప్పినా ప్రయోజనం లేదు. పవిత్రమైన గుణాలతో హృదయాన్ని నింపుకోవాలి. అభిమానమనేది ఈ అహంకారంతో ఏర్పడుతుంది. ఈ అహంకారాన్ని పోగొట్టుకోవాలంటే వినయాన్ని పెంచుకోవాలి. ఈ అహంకారం ఉండేంతవరకూ క్రోధం, ద్వేషం, అసూయ, డంబం ఇటువంటి దుర్గుణాలు వెంటాడుతూనే ఉంటాయి.

164. అయితే స్వామీ, మానవుడు దుర్గుణాలను దూరం చేసుకోవటానికి ప్రప్రథమంగా పూజలు, ధ్యానము ఇటువంటి వాటిపై మనస్సు లగ్నం చేయగలిగితే కొంతవరకూ శాంతిని పొందవచ్చా?

లేదు. ఎన్ని పూజలు చేసినప్పటికీ, ఎన్ని వ్రతములు ఆచరించినప్పటికీ, ఎన్ని సాధనలు సల్పినప్పటికీ హృదయములో ఆవేశము, అహంకారము రెండూ ఉండినంత వరకు ఏమాత్రమూ శాంతిని పొందలేరు. కనుక మొట్టమొదట మానవుడు అహంకార నిర్మూలనం చెయ్యాలి.ఇది అహంకారం మమకారంతో కూడినటువంటిది. కనుక మీరు దీనిని దూరం చేసుకోవాలి. నేను పూజలు చేస్తున్నాను, నేను వ్రతాలు చేస్తున్నాను, నేను సాధన చేస్తున్నాను అంటారు ఇవి ఏవీ కూడా నన్ను చేరే ప్రక్రియలు కావు. కానీ భగవంతుడు ప్రసాదించిన ఈ దేహాన్ని సద్వినియోగ పర్చుకోవాలి. దుర్వినియోగ పర్చుకోకూడదు. దీని వలన జీవితమే వ్యర్థం అయిపోతుంది. జీవుడుకి దేవుడుకి ఉన్న బేధాన్ని గుర్తించాలి. వ్యక్తియే

జీవుడు. సమిష్టియే దేవుడు. అందరియందు ఉండేటటువంటి వాడే దేవుడు. కనుక వ్యక్తిత్వము నుండి సమిష్టి తత్త్వము లోనికి మీరు ప్రవేశించాలి. అపుడే దైవత్వము మీకు ప్రాప్తిస్తుంది. దీనిని అర్థం చేసుకోలేనపుడు ఎన్ని శ్లోకాలు చదివినా, కంఠస్తము చేసినా మిగిలేది శోకమే. దీని నుండి దూరం కావాలంటే సద్గుణాలను పెంచి పోషించుకోవాలి. మధురమైన ప్రేమ తత్వానికి నిలయం కాగలిగి ఒక ప్రేమామృత బిందువుగా మారగలిగినపుడే అంతర్యామి స్థిరమై హృదయ సుమార్చన అందుకుంటాడు. అద్వైత స్థితిని ప్రసాదిస్తాడు.

165. స్వామీ! అసలు కోరికలే లేకుండుట అసాధ్యమనిపిస్తుంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయము గుర్తించాలి. కోరికల నుండి విముక్తిని పొందటం అన్న విషయంలో ఒక పని చెయ్యవచ్చు. అదేమంటే కోరిక యొక్క దిశను మార్చుకోవచ్చు. ఈ ప్రాపంచిక ఆనందములను కోరుకునే బదులు భగవంతుడ్ని పొందాలన్న తీవ్రమైన కోరికను పెంచుకుని కేవలం భగవంతుడు మాత్రమే అనుగ్రహించగల ఆనందాన్ని పొందవచ్చును. ఆ విధంగా లౌకికమైన కోరికలను భగవంతుడి దిశగా మళ్ళించుకోవటం ద్వారా సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

166. కోరికల యొక్క దిశను మార్చాలి అని మీరు చెబుతున్నది తేలికగా అనిపిస్తున్నది. కానీ అది సాధ్యమేనా స్వామి?

మరొక్కసారి చెబుతున్నాను. మీ ఆలోచనలను నా యందే లగ్నం చెయ్యండి. నా యందే భక్తి కలిగి ఉండండి. నన్నే పూజించండి. నా యందే నీ దృష్టిని నిల్పు, నీవు ఏమి చేసినా అది నాకే అర్పించు. ఆ విధంగా చేయుటవలన నీవు తప్పకుండా నన్ను చేరగలవు. మీరు నిజంగా నాకు ఎంతో ప్రియమైన భక్తులు కనుక ప్రతిజ్ఞ చేస్తున్నాను. నేను మీకు చాలా విషయాలను చెప్పాను. నీకు అన్నీ విని ఇంకా కొంత తికమకగానే ఉండి ఉండవచ్చు. కాబట్టి ఇంకా పూర్తిగా తేలిగ్గా చెబుతాను. నీకు ఆధ్యాత్మిక వేదాంతము అర్థం కాకపోతే పోనీ ఫర్వాలేదు. కేవలం నన్నే శరణు పొందు. పూర్తిగా శరణాగతులుకండి. ఏది నీవు చేయవలసిన ధర్మమో అది నన్నే తలచుకుంటూ సమర్పణ భావంతో చెయ్యి. మిగతా విషయాలన్నీ నేను చూచుకుంటాను అని హామీ ఇస్తున్నాను.

**ప్ర.** విషయాన్ని ఇంత పూర్తిగా విపులంగా అందించారు స్వామి.

**జ.** అవును. ఎంతో అగాధమైన, లోతైన సత్యాన్ని చెప్పాను. ఇది సమస్త మానవాళికోసం చెబుతున్నాను. శాశ్వతమైన సత్యాన్ని బోధించాను. ఇది మానవాళికి నా సందేశం. దీనిని శ్రద్ధగా విని ఆచరించిన నాడు నాకు ఎంతో ప్రియమైన వారు అవుతారు. ఈ సందేశాన్ని ప్రచారం చేసినవారు కూడా నాకు ప్రియమైన వారు అవుతారు. నా ఈ సందేశాన్ని అనుసరించే వారు చెడు మార్గము నుండి విముక్తులై ఉత్తమగతులను, ఉత్తమ లోకాలను పొందుతారు.

167. అంతర్వాణి అంటే ఏమిటి స్వామి?

అంతఃకరణము జంతువులలో ఉండదు. వీటిలో ఇది మంచా, చెడా అన్న విచక్షణ ఉండదు. కానీ మనుషులలో దయామయుడైన భగవంతుడు లోనుండి తన మాటలను వినగలగటం వలన ఇది మంచి, ఇది చెడు అని తెలుసుకోగల వివేకము ఉంటుంది. భగవంతుని వాణియే "అంతర్వాణి". మరొక విధంగా చెప్పాలంటే మానవుడు తనలో నుండి భగవంతుడు చెప్పేది వినవచ్చు.

168. భగవదనుగ్రహము పొందుటకు మా భావం ఎలా ఉండాలి స్వామి?

భగవదనుగ్రహమునకు నోచుకోని జీవితం జీవితమే కాదు. భగవంతుని ప్రేమను పొందలేని జన్మ జన్మే కాదు. అందువల్ల ఆధ్యాత్మిక మార్గమును స్వీకరించి అవసరమైన సాధనను చేస్తూ సాయి ప్రేమను, అనుగ్రహమును పొందటానికి పాత్రులు కండి. గుర్తుంచుకోండి జీవితమంటే ఒక యజ్ఞం. ఒక త్యాగం. మీరు చేసే ప్రతీ పని భగవంతునికి నివేదనే. శరణాగతి భావంతో భగవదర్పణ బుద్ధితో మీరు చేసే దైనందిన కార్యక్రమములు చేస్తూ ఉంటే మీ నిద్ర కూడా సమాధి కాక మరేమి అవుతుంది.

169. భగవదర్పిత భావంతో కర్మలను ఆచరించక కర్మ భారాలను పెంచుకుంటున్నట్లుగా అనిపిస్తుంది. దీనిని ఎలా అర్థము చేసుకోవాలి స్వామి?

మంచి ప్రశ్న వేసావు. అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలనంతవరకూ ఆ చీకటిలో మ్రగ్గవలసిందే. తనకు తానుగా ఒక దీపాన్ని వెలిగించుకోవాలి అన్న జ్ఞానం లోపల ఉదయించవలసిందే. ఇప్పుడు వచ్చిన

పెద్ద బాధ ఏమిటంటే పెద్దవాళ్ళు వాళ్లకు జరిగిపోయిన దానిని గురించి ఆలోచిస్తూ బాధపడ్డారు. చిన్నవాళ్ళు ఎప్పుడూ ఊహల్లో, భవిష్యత్తులో తేలియాడ్తూ ఉంటారు. వర్తమానంలో జీవించటము లేదు కావున ఇన్ని బాధలు పడ్తూ ఉన్నారు.

170. ఈ రోజుల్లో ఏది చెప్పినా, ఏది చేసినా తప్పుగానే కన్పించుతుంది. ఎందుకు అలా జరుగుతుంది స్వామి?

అపనమ్మకము అనే ఒక మాయదారి రోగము ఇప్పుడు జనంలో తీవ్రంగా,
వేగంగా వ్యాపిస్తున్నది. అది విశ్వాసమనే లేత వేళ్ళను కాల్చివేసి జీవితాన్ని బూడిదపాలు చేస్తుంది. తీర్పు చెప్పే అధికారము మీకు లేనప్పటికీ తీర్పు చెప్పాలని నటన చేస్తున్నారు. సంశయము, కోపము, విషము, రోగము అనువాటిని ఏమాత్రమూ పెరగనివ్వకూడదు. ఆదిలోనే వాటిని త్రుంచివేయాలి. నమ్మకము పెంచుకోవటానికి నిదర్శనాన్ని అదే మీకు కలిగిస్తుంది.

**ప్ర.** స్వామీ! మిమ్మల్ని అర్థం చేసుకోవటం సాధ్యమా?

**జ.** నన్ను అర్థం చేసుకోవాలంటే మీరు నన్ను అనుభవించాలి. నన్ను అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి. మీరు ప్రతిరోజూ నన్ను తెలుసుకోవాలని చేసే ప్రయత్నం ఎప్పటికపుడే కొత్తగా నిన్నకంటే నేడు వేరుగా ఉంటుంది. అందువల్ల నన్ను తెలుసుకోవాలన్న ప్రయత్నం చేయడం వ్యర్థం.

171. ప్రారబ్ధకర్మను అనుభవిస్తూ మీ దర్శన భాగ్యాన్ని పొందిన జీవి మిమ్ములను ఏమి కోరాలి స్వామి?

భగవాన్ దగ్గరకు వచ్చి నీకు ఏమి కావాలి? అని అడిగితే తన వ్యాధి గురించి అడగటానికి కూడా మనస్కరించనంత ఆనందం, పరిపూర్ణ వైరాగ్యం హృదయంలో వెల్లువిరుస్తుంది. అది నీకు తెలుసు. ఆ స్థితి మీరు ఎప్పుడూ అనుభవిస్తూ ఉంటారు. అటువంటి స్థితి జీవి అనుభవిస్తున్నప్పుడు ఇంక ప్రారబ్ధం అనుభవిస్తున్నది ఎక్కడ? బాధను అనుభవించవలసిన సమయంలో వైద్యుడిచ్చిన మత్తుమందు ప్రభావం వల్ల బాధ తెలియకుండా పోయినట్లు ప్రారబ్ధమును అనుభవించవలసిన సమయంలో భగవత్ దర్శనంతో కష్టాలను, బాధలను మరిచిపోయి జీవి అద్వితీయమైన ఆనంద స్థితిని అనుభవిస్తాడు. కావున భగవంతుని ఆగమనం గుర్తించిన జీవి, లౌకిక, భౌతికాన్ని వదిలివేసి అటువంటి స్థితిని అందుకుంటాడు. అందుకే ఇహ,

పర సుఖ సౌఖ్య దాయిని అని భగవంతుని కీర్తిస్తారు.

172. స్వామి, మీ యొక్క సాన్నిధ్యములో ఎనలేని శాంతిని అనుభవించు జీవులు ఈనాటికీ మీ యొక్క సూక్ష్మ శరీరము నుండి అదే శాంతిని పొందగలుగుచున్నారా?

ఈ స్వరూపము నందలి దివ్య కిరణములు స్థూల సన్నిధిలో ఉన్న వారిని పవిత్రీకృతము చేయుచుండును. సూక్ష్మ రూపము నుండి వెలువడు దివ్య కిరణములు భూమండలమంతా పవిత్రము చేయుచుండును. కారణ రూపము నుండి వెడలు దివ్య కిరణములు కోటాను కోట్ల బ్రహ్మాండములను పవిత్రము చేయుచుండును. మహా కారణ శరీరము సదా సచ్చితానంద అద్వైత స్వరూపముగా ఉండి మహా విశ్రాంతిలో ఉంటుంది. దాని నుండి వెలువడు దివ్య కిరణములు సాలోక్య, సామీప్య, సాయుజ్య అవస్థలయందు అవదూతలు, అంశావతారములు, మహాస్థితి పురుషులు, మహా యోగులు మొదలైన వారిని పవిత్రము చేయుచుండును. నా దివ్య నామస్మరణ చేయునపుడు అగోచరమైన రీతిలో నేనచటనే ఉపస్థితుడనై ఉందును. దివ్య లీలల ద్వారా నా ఉనికిని చూపిస్తూ ఉంటాను.

173. స్వామి, మీరు సర్వజ్ఞులు, సర్వశక్తిమయులు , సర్వవ్యాపకులు అన్న విషయం ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

నేను సర్వే సర్వత్రా స్థితమై ఉండు ఆదితత్వమును. ఆయా అవసరములనుబట్టి నేను అచ్చట ఉన్నట్లు వ్యక్తమగుచుందును. వ్యక్తము కానంత మాత్రమున నేను అచ్చట లేనట్లు కాదు. జీవరాశులలోని అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములందు నేను స్థితుడై ఉన్నాను. నా ఉనికి వలననే అవి ఆయా క్రియాకలాపాలను కావిస్తున్నాయి. నేను ఫలానా కోశమునందున్నట్లు నీకు అనుభవమిచ్చినచో ఆ కోశమునందు నేను ఉన్నట్లుగా భావించెదవు. నీకు నేను అనుభవమును ఇవ్వనంత మాత్రమున నేను ఆయా కోశాలలో లేనని కాదు అర్థం. నేను సర్వే సర్వత్రా ఉన్నాను. సమస్తములైన జ్ఞాన విజ్ఞానములు నా పాదపీఠకల వద్ద ఉన్నవి. సర్వమూ కేవలం నా సంకల్పంతో జరుగుచున్నది అని గ్రహించగల్గిన వారు నన్ను అందుకొనగలరు. దివ్యానందాన్ని అనుభవించగలరు.

174. సచ్చింతన అంత్యమున రావలెనంటే నేటి నుండియే ప్రయత్నించవలెనా స్వామి?

అవును. దేహ భ్రాంతిలో ఉన్న వారికి ఆత్మతత్త్వము అర్ధము కాదు. దేహతత్త్వము స్థిరము కాదు. మరణ కాలమున ఎట్టి భావమును, ఎట్టి స్థితిని కలిగియుండవలెను అనెడిది తెలుసుకోవటం అత్యవసరం. ఎందుకంటే ఆ స్థితిని తెలుసుకొనుటకే జీవిత కాలంలో చేయు సర్వ సాధనలు. ఆ సాధనల ఫలమే అంత్యమున అట్టి పవిత్ర చింతన వచ్చుటకు కారణము. కార్యకారణములు అవినాభావములు. పిండి కొద్దీ రొట్టె కదా? సాధన కొలదీ సద్గతి. కావున సద్గతికి అంత్యమున చింతించు పవిత్ర చింతనయే దానికి గుర్తు. జీవితమున దేనిని ఆచరిస్తామో దానినే అంత్యమున స్మరించగల్గుతాము. అంత్య కాలమనగా ఎపుడో కాదు. ఎప్పటికపుడే నశ్వర శరీరాలకు ప్రతి క్షణమూ అంత్యమే. అట్టి అంత్య సమయమున ఏమి స్మరింతురో అదియే తరువాత పరిస్థితులకు అనుకూలము అవును. అనగా పునర్జన్మకు పునాది. అట్టి సమయమున భగవంతుని స్మరించిన వాడు నా భావాల్ని పొందుతాడు. అంటే నన్నే చేరుతాడు. మానవుని ప్రతీ కర్మ, ప్రతీ సాధన మరణ కాలమున సంస్కరించేవిగా ఉండాలి. ఆ సమయమున పవిత్ర చింతన అనగా ప్రణవ చింతన వచ్చునట్టి సాధన అభ్యసించాలి.

175. ఆహార విహారాది కర్మలు ఏ రకంగా ఉండాలి స్వామీ?

స్వల్పంగా తినటం వల్ల ఇంకా ఎక్కువ కాలం బ్రతకగల్గడమే కాక ఎక్కువ ఆరోగ్యంగా కూడా ఉంటారు. క్రమం తప్పకుండా రోజుకి రెండు సార్లు ప్రార్థిస్తే అది బలాన్ని ధైర్యాన్ని ఇస్తుంది. అది రోగాన్ని తట్టుకునే శక్తి ఇస్తుంది. ఎవరైనా ఒక గ్లాసు నీళ్ళు ఇస్తే వెంటనే "థ్యాంక్యూ" అంటావు. అటువంటప్పుడు నిన్ను కాపాడుతూ నీకు హాని కలగకుండా చూసే భగవంతునికి ఎంత కృతజ్ఞత చూపించాలి? కర్మను దేవదేవుడికి సమర్పించాలి. అప్పుడవి మనో దేహాలకు ఆరోగ్యాన్ని ఇస్తుంది. భౌతిక యంత్రాలకు కూడా విశ్రాంతి ఇస్తారు. వాటిని ఎడదెగకుండా నిరంతరం నడపలేవు. అలాంటప్పుడు ఎంతో సున్నితంగా తీర్చిదిద్దబడిన ఈ మానవ దేహం సంగతి ఏం చేస్తావు? వారానికి ఒక్క రోజు ఉపవాసం ఉండు. ఇది దేహానికి, దేశానికి కూడా మంచిది. కేవలం నీళ్ళనే తీసుకో. దాంతో చెత్త అంతా కడిగివేయబడుతుంది. ఆహార నియమం వల్లనే **పశుపక్షులు** తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాయి. ఆరోగ్యంగా ఉన్న మనిషే దేహాన్ని మరచి, తన భావాలను భగవంతునికి సమర్పించి తద్వారా ఆనందాన్ని పొందగలుగుతాడు. అనారోగ్యం అన్నది అలసత్వము, బద్ధకముల వల్ల కలిగే తప్పని ఫలితము. ఆరోగ్యమన్నది కఠినమైన జీవనం వల్ల

కలిగే తప్పని ఫలితం. నీ పనులని నీవే చేసుకో. ఆరోగ్య పరిస్థితి తప్పక మెరుగవుతుంది. సంతృప్తే గొప్ప టానిక్కు.. భక్తి, విరక్తి అని రెండు తెడ్లతో జీవన సముద్రాన్ని దాటుటకు దేహాన్ని ఒక పడవగా ఉపయోగించుకోండి.

176. షోడశ కళాప్రపూర్ణుడు అని భగవంతుని స్తుతిస్తుంటారు. దాని అర్థము ఏమిటి స్వామీ?

పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కోశాలు వీటితో హృదయం కలిపి పదహారు. ఈ పదహారు ఎవరి ఆధీనంలో ఉంటాయో వారు భగవంతునితో సమానం. కావుననే భగవంతుని ముందు నమస్కారం చేసినపుడు "నా ఆధీనంలో ఉంచుకోలేనటువంటి ఈ పదహారును నీకు అప్పగిస్తున్నాను. అన్యులకు వదిలితే దీనిని పరిపాలించలేరు" అన్న దానికి సంకేతంగానే పదహారు రూపాయలు భగవంతునికి సమర్పించేది.

177. మానవ జాతిలో సమిష్టి స్థాయి పరిణామం కావాలి అంటారా స్వామి?

బాగా గుర్తించావే. వ్యక్తుల కూడికయే సమాజం. ఒక వ్యక్తి ఉద్ధరించబడితే చాలదు. సమాజంలోని వ్యక్తులందరూ ఐక్యమత్యంతో చక్కని నడవడిక కలిగి ఉన్నతాదర్శములతో ఉంటేనే ఆ సమాజం అభివృద్ధిలోకి వస్తుంది. సమాజం సరిగ్గా ఉంటేనే దేశం పురోభివృద్ధి గాంచుతుంది. సమిష్టి స్థాయి పరిణామం కోసము ఆధ్యాత్మిక పరిణామం తీసుకువచ్చినట్లైతే తప్పక సమాజం బాగుపడుతుంది.

178. ఆధ్యాత్మిక సంస్కరణ మానవ జాతికి ఏ విధంగా ఉపయోగకారి స్వామి?

నేడు ప్రపంచంలో జరిగే మతాల పేరిట కలహాలు, కల్లోహాలు, హింసాకాండ, దౌర్జన్యాలకు అంతు లేదు. మానవుల మతుల్లో సరైన అవగాహన లోపించడమే ఈ విధ్వంసకాండకు మూలము. మతం, మతి, మనిషి ఈ మూడింటిని సక్రమ మార్గంలో ఉద్ధరించాలి. ప్రేమ, కరుణ, దయ, జాలి, సర్వమత సమన్వయం, ఆధ్యాత్మిక ప్రచారాలు, ప్రబోధాలు ఆత్మానందాన్ని ప్రబోధిస్తాయి. ఆధ్యాత్మిక సంస్కరణోద్యమం తప్పక జరిగి తీరాలి. అప్పుడే మానవ జాతి ఉద్ధరించబడుతుంది.

179. మా భావాలు ఏ విధంగా ఉండాలి స్వామి?

ఉన్నత భావాలు, విశాల భావాలు, విశ్వాసము ప్రతి ఒక్కరూ పెంచుకోవాలి. ఇటువంటి ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడు కల్మషాలకు, కార్పణ్యాలకు తావే ఉండదు. మానవుల మధ్య ఉన్న బేధ భావాలు తొలగిపోతాయి. కేవలం బోధ వల్ల మార్పు రాదు. ఆచరణతో మాత్రమే మార్పు సంభవం. అటువంటి మార్పు వచ్చినపుడు అసలైన మానవులుగా తయారవుతారు. తద్వారా వారు ఏదైతే కోరుకుంటున్నారో దానిని అందుకోవచ్చు.

180. ఈనాడు మానవుని దుస్థితికి గల కారణం ఏమిటి స్వామి?

మానవత్వం లేని భక్తి నిరుపయోగం. ఇంక ఎక్కడ పరిపూర్ణ మానవతా వాది? మానవుడు పుట్టి కొన్ని లక్షల సంవత్సరాలయినా మానవత్వం మాత్రం ఇంకా పురిటి నొప్పులు పడుతూనే ఉన్నది. ఈనాడు కేవలం ఆకార మానవుడే కనబడుతున్నాడు. మానవత్వం గల మానవుడు కనిపించుటలేదు. నేడు పశుపక్ష్యాదుల మధ్య సహకారం కనిపిస్తుంది. కానీ మానవుల మధ్య కనిపించుటలేదు. ఒక చిన్న బెల్లం ముక్క చీమకు కనిపిస్తే తన తోటి చీమలను వెంటబెట్టుకుని వచ్చి అన్నీ కలసి మోసుకుపోతాయి. ఒక కాకికి ఎంగిలి మెతుకులు కనిపించినట్లైతే తన తోటి కాకులను పిలిచి వాటితో పాటు తానూ తీసుకుంటుంది. మానవుడు మాత్రం వీటికి విరుద్ధంగా ఐకమత్యం లేకుండా జీవిస్తున్నాడు.

181. మేము ప్రప్రథమంగా చేయవలసిన సాధన ఎటువంటిది స్వామి?

ఎప్పుడూ మంచే చెబుతాను. మీ హృదయాల్లో ఉండే దౌర్భల్యము, మీ మనస్సులో ఉండే మాలిన్యము, మీ లోపల ఉండే దైవత్వాన్ని మరుగున పడేస్తుంది అన్న విషయం గ్రహించిన మరు క్షణంలో మిమ్మల్ని బాధపెడ్తున్న రోగాన్ని గుర్తించినట్లే లెక్క. ఒక్కసారి రోగ నిర్ధారణ అయ్యాక ఇక రోగాన్ని తగ్గించుకోవటం ఎంత సేపు? మొదట మీరు చేయవలసిన సాధన ఏమిటి అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. సర్వ జీవులను నిష్కల్మషమైన హృదయంతో ప్రేమించండి. నిస్వార్థంగా సేవించండి, ప్రేమించండి. నీలో ఉండే ఆత్మయే సర్వులలో వెలుగుతున్నది అని గుర్తించండి. సర్వులనూ ప్రేమించడమంటే నిన్ను నీవు ప్రేమించుకోవడం అన్నమాట.

182. స్వామి, మానవుడిలో మాధవుడ్ని దర్శించే మార్గం తెలియపర్చండి.

మానవ సేవయే మాధవ సేవగా భావించినపుడు మాధవుడిని మానవుడిలో చూడగల్గుతారు. మాధవుడిని చూడాలంటే మొట్టమొదట మానవత్వాన్ని గుర్తించాలి. మానవత్వాన్ని గుర్తించకుండా మాధవత్వాన్ని అనుభవించడము అసాధ్యం. కావున మాధవుడిని దర్శించాలంటే తప్పనిసరిగా మానవసేవయే త్రోవ.

183. కేవలం సేవలోనే దర్శన ప్రాప్తి లభిస్తుదంటారా స్వామి?

సేవ జీవితమునకు ఆనందమును, రుచిని కలిగించే లవణం వంటిది. సేవలో ఉన్నది పవిత్రత. సేవ ద్వారా భగవంతుని మెప్పును కూడా పొందవచ్చు. సేవకుడిగా, నమ్మిన బంటుగా హనుమంతుడు ప్రశంసలు అందుకున్నాడు. సేవను గురించి చెప్పడం కన్నా సేవ చేసి చూపించాలి.

184. మానవుడి లక్ష్యం ఏమిటి స్వామి?

మనిషి యొక్క ఇరవై నాలుగు తత్వాలను విశ్లేషించి తెలుసుకున్నప్పుడు ఏమీ మిగలదు. కారణం ఇవన్నీ కనిపించే సత్యాలే కాని పరమ సత్యాలు కావు. అవి జగత్తు, కదిలేవి, మారేవి, క్షణికములు, అసత్యములు. దీన్ని నీవు తెలుసుకో. నీ మనస్సుకే బహిర్ రూపమైన ప్రపంచమంతా తెలుస్తుంది. మాయ యొక్క అనేక కల్పనల్లో మొదటి సంకల్పమే విశ్వంగా మూర్తీభవించింది. అదంతా కూడా పంచభూతాలు విభిన్నమైన పాళ్ళల్లో కలియడమే. దీన్ని తెలుసుకోవటానికి మనిషికి నాసిక, జిహ్వ, నేత్ర, త్వక్, శ్రవణేంద్రియాలు ఏర్పడ్డాయి. కాబట్టి నేను దేహాన్ని కాదు అంటే ప్రకృతి, జీవజాలం "నేను" కాదు లేక "ఆత్మ" కాదు. అవన్నీ కేవలం ఆత్మలా కనపడటం మాత్రమే. ఇంద్రియాలు, మనస్సు, కారణం అన్నీ అదృశ్యమయ్యి అహంకారం తనలో తాను లయిస్తుంది. కాబట్టి సుషుప్తిని సమాధితో పోలుస్తారు. అది ఆనందంలో ఉంటుంది. జాగ్రత్ స్థితే దానికి ఆ జ్ఞానాన్ని కలిగిస్తుంది. కాబట్టి జాగ్రత్ స్థితిలోని ఎరుక, నిద్రాస్థితిలోని ఆనందం జ్ఞానాన్ని ఇస్తాయి. తనకు ఈ రెండు కలిగినపుడు అది విజయ లక్ష్యం. సమాధి అంటే చెదిరిపోని బుద్ధి. సమాధి అంటే సత్ చిత్ ఆనందం.

185. ఆదర్శ స్థితికి ఏవి అవసరము స్వామి?

ఆదర్శ స్థితికి సత్యమే ఆధారంగా కల్గిన బుద్ధి; మాలిన్యము సహించని చైతన్యము ఈ రెండు అంశాలూ ముందుగా కావాలి. ఈ ఆస్తియే మనిషిని ఆస్తికుడ్ని చేస్తుంది. వీలయినంతలో బుద్ధి అన్నది మౌలిక సమస్యలయినట్టి మీ ప్రశ్నల మీదే ఆధారపడి ఉంటుంది.

186. యజ్ఞము యొక్క అంతరార్థము ఏమిటి స్వామి?

బాహ్యముగా జరిగే ఈ యజ్ఞముల అంతరార్ధమును తెలుసుకున్నప్పుడే వాటి విశిష్టతను మీరు గుర్తించిన వారు అవుతారు. ఈ యజ్ఞములు స్వార్ధం కోసం చేసేవి కావు. లోక కల్యాణం కోసం చేస్తున్నారు. కోపము, అసూయ, ద్వేషం ఇత్యాది దుర్గుణాలు మీలో తలెత్తిన తక్షణమే వాటిని మనస్సనే బలిపీఠంపై బలివ్వడానికి ప్రయత్నించాలి. బాహ్య యజ్ఞములు సంవత్సరానికి ఒక పర్యాయము ఏదో ఒక ప్రదేశమునందు జరుపుకుంటారు. కానీ అంతర్ యజ్ఞ వేదిక మనము ఎక్కడికి పోయినా మన వెంటే ఉంటుంది. ఇది దేశ, కాల, పాత్రలకు అతీతంగా నిరంతరం నీడవలే నీ వెంటనే ఉంటుంది. కనుక మీలో దుర్గుణములు బయలుదేరిన వెంటనే వాటిని సంహరించటానికి ప్రయత్నించాలి. అప్పుడే మీరు దైవ ప్రీతికి అర్హులవుతారు. దుర్గుణాలను ఏనాడు దూరం చేసుకుంటారో ఆనాడే మీలో దైవత్వము ఆవిర్భవిస్తుంది.

187. సాధనా దిశగా ముందడుగు వేయుటకు తెలుసుకోవలసినది ఏమిటి స్వామి?

అంతర్ శత్రువులతో చేసే యుద్ధంలో మనిషి మనిషికీ బేధం ఉంది. ప్రతివాడూ తన సాధనకు తగినంత ఈ జన్మలోనూ, గత జన్మల్లోనూ అతని కర్మలకు తగినంత ఫలితాన్ని పొందుతాడు. ఆధ్యాత్మిక మార్గంలో ప్రతీ వాడు తన చేతుల్తో పట్టుకున్న దీపం వెల్తురులో తనకు తగిన వేగంతో తానున్న చోటు నుండి ముందుకు కదలాలి. నీవు అవిద్యలో ఉన్నంత కాలమూ, శిక్షణ లేకుండా అజ్ఞానంలో ఉన్నంత కాలమూ సచ్చిదానందాన్ని రుచి చూడలేవు. దాన్ని పొందలేవు. నీవు మెడలో ఇంకా మూడు పేటల గొలుసు ధరించి ఉన్నావు. ఒకటి నల్లటి రంగు కల్గిన తమస్సు, రెండవది ఎర్రని రంగు కల్గిన రజస్సు, మూడవది తెల్లని రంగు కల్గిన సత్వ గుణము. ఈ గుణాలకు బద్ధుడివి అన్న దానిని నిరాకరించు. ఆ గొలుసు ఎప్పటికైనా జారిపోవాలి. అసూయ, ద్వేషం, లోభం లేని శిశువులాగా కావాలి. నీ కుటుంబం అంటే నీ వాళ్ళు

అనే పరిధి దాటి లోకాన్ని అంతటినీ దయతో చూడగలగాలి. అలా చూడగలిగినప్పుడు మాయ అనే గడప దాటటానికి నీవు మొదటి అడుగు వేసినట్లు.

188. సాధకుడికి భగవంతుడు మరియు గురువు ఏ విధంగా సహకరిస్తారు.

భూమి లోపల నీరు చాలా పుష్కలంగా ఉన్నది. ఒక్కొక్క చోట చాలా త్రవ్వితే కానీ నీరు దొరకదు. కానీ ఒక్కోచోట అనగా నదులకు దగ్గరగా ఉన్న భూమిలో చాలా దగ్గరగా నీరు కనిపిస్తుంది. కారణం నీటి శాతం ఎక్కువ ఉండుట. అలాగే జీవితం కూడా ఎలా అంటే మీ జీవితమనే **క్షేత్రంలో** ఈ నీరే భగవత్ కృప. ఇది అందరిలో ఉంటుంది. ఈ నదియే గురువు. దీనిని గురుకృప వలన కనుగొనవచ్చు. లోపల ఉన్న దానిని బహిర్గత పర్చుటే భగవంతుని పని. కావున భగవంతుడు గురువుకి జీవి లోపల అంతర్లీనంగా ఉన్న వాటిని వెదికి వెలికి తీసే పనిని అప్పగిస్తాడు. ఈ లోపల ఉన్న నీటిని బయటకు తీయాలంటే మిషను అవసరము. దీనికి విద్యుత్ అవసరము. ఈ కనిపించని విద్యుత్ భగవంతుడు. కావల్సినంత కరెంటును తీసుకుని గురువు అనే మిషను నీ లోపల అంతర్గతంగా ఉన్న దైవీక శక్తిని సాధన ద్వారా బయటకు లాగుతాడు. ఈ నీటితో పాటు భూమి లోపల అనేక ఖనిజాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ ఖనిజాలే సద్గుణాలు. వీటి ద్వారానే దైవీక శక్తిని వెలికి తీసి దానిని సమృద్ధిగా పొందే అవకాశం కల్గిస్తాడు. ఈ మిషన్ చాలా శక్తివంతంగా ఉన్నప్పుడు తాను కోరుకున్న దాని కంటే చాలా ఎక్కువ నీరు తక్కువ సమయంలో పొందవచ్చు.

189. సాధకుని ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ఏవిదంగా పోల్చవచ్చును స్వామి?

నీవు చేసే సాధనయే అరిషడ్వర్గాలని జయించేటట్లు చేస్తుంది. ఈ కొండలనేవే లేకపోతే, నీవు వాటిని ఎక్కకుండా నేలమీదనే ఉన్నావనుకో పడిపోతావని ఉండదు కదా! కొండ ఎక్కినపుడే జాగ్రత్త వహిస్తావు. అనగా కొండ అంటే ఈ ఆరు గుణాలలో ఏ ఒక్కటి ఆశ్రయించినా అది మనిషిని ఎవరెస్టు శిఖరం అంత ఎత్తుకి ఎత్తేస్తుంది. అజాగ్రత్త వల్ల అచట నుండి పడిపోవటము జరుగుతుంది. మరలా నీవు లేచి నడవలేనంతగా నిన్ను చేస్తుంది. అందుకే వాటిని కొండలతో పోల్చాను. ఈ కొండలు మనిషిని అధఃపాతాళములోకి నెట్టివేస్తాయి. మనిషి జీవితమనెడిది ఒక పెద్ద సాగరము. ఈ సాగరంలో సాధన అనే నౌక ఎక్కి ప్రయాణించవలసి ఉంటుంది. ఈ నౌకలో ప్రయాణిస్తున్నప్పుడు నౌకకు రంధ్రాలు పడ్డట్లైతే ఈ రంధ్రాల

నుండి నీరు లోపలకు వెళ్ళి పడవ మునిగిపోయేటట్లు చేస్తుంది. పడవ మునిగిపోతే నీవు ఒడ్డుకు రాలేక దానిలో పడి మరణించడం ఖాయం. ఈ పడవకు రంధ్రమే పడకుండా జాగ్రత్తపడాలి. ఒక వేళ రంధ్రం పడ్డా దానిని పూడ్చుకునే తెలివితేటలైనా ప్రదర్శించాలి. లేకపోతే జీవితమే నష్టపోతావు. అందుకే ఈ కొండ ఎక్కుట అనే విద్యను మంచిగా నేర్చుకోవాలి. లేదా ఈ విద్య నేర్చుకున్న వారి సహాయంతో **క్షేమంగా** ఒడ్డు చేరటం ముఖ్యం. అటువంటి విద్య ద్వారా శాంతి, సహనము, ప్రేమ, దయ, క్షమ అనే గుణాల చాలా మెండుగా స్వీకరించి జీవితమనే నౌకను **సురక్షితంగా** ఒడ్డు చేర్చుకోవటం ఒక కళ.

190. సమాధి నమస్కారం చేసుకునేవారి భావాలు ఏ విధంగా ఉండాలి?

ఈ దేహానికి చేసిన సమాధిని చూచుటకు చాలా మంది విచ్చేస్తున్నారు. దేహిని గుర్తించే వారు లేరు. పడి పడి నమస్కారాలు సమాధికి చేస్తున్నారు. సమమైన స్థితిని అందుకోవటమే సమాధి స్థితి. ఆ స్థితి ఎక్కడా కానరావటం లేదు.

191. గురువు యొక్క విశిష్టత ఏమిటి స్వామి? గురు సాంగత్యం ఎందుకు అవసరము?

గురువు నిస్వార్థపూరితమైన ఆలోచన మరియు ప్రార్థనలతో ఈ శరీరానికి కావలసిన ఆహారాన్ని అందించి, శరీరం నీవు కాదు, నీవు అనే నిన్ను సదా తన యొక్క ఆలంబనలో ఉంచుకునేటట్లుగా ఉండి, తన పరిధిలో నీకు రక్షణ కలిపిస్తాడు. ఈ రక్షణ కొరకే గురుసాంగత్యం. మీ యొక్క జీవితమనే రాయి ఒక మంచి శిల్పి చేతిలోనికి వచ్చిందనుకో అది మీ యొక్క జన్మ సంస్కారాన్ని గుర్తించి ఒక మంచి రూపాన్ని చెక్కి పదిమందికి ఉపయోగపడేటట్లుగా జీవకోటి నమస్కారాన్ని అందుకునే అర్హతను కల్పించి నీకు ఒక ఉన్నత స్థాయిని అందించే ఈ ప్రయత్నం భగవంతుడనే శిల్పి చేస్తున్న పని. దేహ పరంగా వదిలివేస్తే దేహిగా నిన్ను నీవు గుర్తించే శుభ ఘడియలను అందించే పని గురువు, సద్గురువు యొక్క పని. అదే పిచ్చివాని చేతిలో ఒక రాయిని ఉంచినట్లయితే దానిని ముక్కలు ముక్కలు చేస్తాడు. అంటే అజ్ఞానమనే తెరలో ఉన్న జీవికి జీవితమనే రాయిని చేతిలో పెట్టినట్లైతే అది వాడికీ పనికి రాదు, పది మందికీ పనికి రాకుండా చేస్తాడు. కావున దానిని చక్కగా మలచగల శిల్పి చేతిలో పెట్టటం జ్ఞానవంతుని పని. ఈ పనిని గురువు నిర్వహించగలడు. ఈ గురువుకు తర్ఫీదు సద్గురువు ఇవ్వగలడు. అట్టి సద్గురువు మీ యొక్క చేయి

పట్టుకుని నడిపించే ప్రయత్నం చేస్తున్నాడు. మీ యొక్క జ్ఞాన నిధిని కాపాడుకుని మోహం అనే చిల్లి కుండలో జీవత్వం ఒలికి పోకుండా విశ్వాసము అనే రెండు చేతులూ అడ్డుపెట్టి పదార్ధం నిలుపుకుని మీరు కోరుకునే స్థితిని పొంది మీకు మీరుగా ఉండి నేను ఆశించిన పద్ధతిలో మీ జీవన మార్గం ఏర్పాటు చేసుకుని ఇకనుంచైనా మీ నుండి నేను ఆశించిన దానిని అందిస్తారని అభిలషిస్తున్నాను.

192. గురువు పట్ల శిష్యుడికి విశ్వాసం ఎలా ఉండాలి స్వామి?

అనుభవం అనెడిది జీవితంలో ఒక్కసారి జరిగినా, పదిసార్లు జరిగినా ఆ సంఘటన నీలో ఊహించలేనంత మార్పును చూపించాలి. అదియే నిన్ను ఉన్నత స్థితికి తీసుకువెళ్ళే ఆలోచనా తరంగాలను సృష్టిస్తుంది. కృష్ణపరమాత్మ, అర్జునులను ఒక్క సారి జ్ఞప్తికి తెచ్చుకో. కృష్ణపరమాత్మ కాకిని చూపించి ఇది కాకియా బావా? అని అడిగినపుడు "నీవు ఏదనుకుంటే అదే. నేను అనుకున్నది ఏదీ కాదు కదా" అన్నాడు అర్జునుడు. నీ స్థితిని **పరీక్షించటానికి** నా ఈ ప్రయత్నము అన్నాడు కృష్ణుడు. అలాగే గురువు, సద్గురువు చెప్పిన దానిని అలోచనలేక ఆచరించగలగాలి. దీనినే విశ్వాసం అంటారు. నీవు కోరుకున్నట్లు గురువు ఉండడు. ఎందుకంటే ఆ గురువు కూడా సద్గురువు చేతిలో పరికరమే. సద్గురువు ఏదైతే చెబుతాడో దానిని ఆచరించటానికి గురువు సిద్ధంగా ఉంటాడు. దాని మంచి చెడ్డలతో తనకు నిమిత్తం లేదు. అటువంటి స్థితిలో ఉన్న వాడినే తన బిడ్డగా ఎంచుకుని, గురువు ద్వారా ఇంకొక జీవికి ఉత్తమగతిని అందించే ప్రయత్నానికి సహకారిగా అందిస్తాడు సద్గురువు. పులినోట పడ్డ జీవి సద్గురువు చేతపడ్డ జీవి తప్పించుకోలేరు.

193. సాధకునికి ఎటువంటి పట్టుదల అవసరం స్వామి?

ఏదో ఒక అనుభవం కల్గితే తప్ప విశ్వసించదల్చుకోకపోతే మంచిది వచ్చి అనుభవించు. అంతే కానీ, ఒకరోజు వచ్చి నేను సత్యసాయిబాబాని చూచాను, ఆయన పొడవైన గౌను వేసుకుంటారు, అద్భుతమైన కేశసంపద ఉన్నది అంటూ మర్నాడు వెళ్ళిపోతే ప్రయోజనం లేదు. కాలాన్ని దుర్వినియోగం చేస్తూ **కాలక్షేపం** చేస్తే నీవు నన్ను ఎట్లా అర్ధం చేసుకుంటావు? పరిశోధించాలని నిర్ణయించుకో, నేర్చుకోవాలని నిర్ణయం చేసుకో, లోపలకు దూకు. అప్పుడు తెలుసుకుంటావు. గతంలోనూ, ఇప్పుడూ వేలాదిమంది

వచ్చారు. చాలామందికి తెలుసుకోవాలనే కోరిక లేదు. కోరిక ఉన్నా చాలామందికేమో ఇంద్రియానుభూతికన్నా మానసికానుభూతికి ఎక్కువ విలువ ఇవ్వాలని తెలియదు. అలాంటి విలువను తెలుసుకున్న తర్వాత దానిని సాధించేవరకూ వదలకూడదు. శారీరకంగా నీవు ఇచట ఉండి ఎచ్చటనో విహరిస్తున్నంతసేపూ నేను చెప్పేదానిని నీవు ఆచరణలో పెట్టలేవు. ఆచరణలో పెట్టలేనపుడు ఎంత బోధించినా ఆ బోధనలు నిష్ఫలితాలను ఇస్తాయి. ఎన్నో విధాలుగా చెప్పి చూస్తున్నాను. పలువిధాలుగా పలురకాలుగా చెప్తున్నాను. దీనిలో ఏ ఒక్కటైనా మీకు ఆమోదయోగ్యంగా ఉంటుంది అన్నది నా ఆశ.

194. సుఖమయ జీవితము ఎలా పొందవచ్చు?

మానవుని జీవితమనే ఈ **<u>క్షేత్రంలో</u>** కర్షకుడు జీవి. ఈ జీవి ముందు మంచివి, చెడ్డవి అన్న రెండు రకాలయిన గింజలు రాశులుగా పోసివున్నాయి. నీ ప్రక్కన మంచి గింజల్ని తీసి ఇవ్వగల చెయ్యగలిగిన అనుభవశాలురైన వారు ఉన్నారు. వారి యొక్క సలహాతో గింజల్ని తీసుకుని వాటిని నాటాలి. అది కూడా సకాలంలో అనగా జీవితము బాగా ఉన్నప్పుడే నాటుకున్నట్లైతే భగవంతుని యొక్క అనుగ్రహ వర్షం ధారాపాతంగా పడి మంచి పంటను అందుకోవచ్చు. అదే విధంగా మానవుడు విచక్షణలో సత్ కర్మలు ఆచరిస్తే తాను పొందే ఫలితము కూడా మంచిదిగానే ఉంటుంది. దీనితో జీవితము సుఖమయము చేసుకోవచ్చు.

195. బలహీనతలను, నిందలను ఎలా ఎదుర్కోవాలి స్వామి?

అసత్యం, క్రోధం, అసూయ ఇటివంటి విషయాలపైపు వెళ్ళవద్దు. ఇవన్నీ మృత్యువుతో సమానమైన పిరికితనము వంటివి. బలహీనతల లక్షణాలని తెల్పుతాయి. నీవు ఉన్నదానికంటే తక్కువ స్థాయిని నీవు సత్యంగా భావించడం వల్ల "బలహీనత" పుడ్తుంది. నీవు గింజపైన ఉండే పొట్టు అని నిన్ను నీవు అనుకుంటున్నావు. నిజానికి నీవు అందులోని గింజవు. "నేనున్నాను" అంటే ఆహమస్మి అని అనుకున్నంత కాలమూ భయము తప్పదు. కానీ ఎప్పుడైతే "అహం బ్రహ్మాస్మి" అంటే నేను బ్రహ్మను అని తెలుసుకొనగల్గుతావో నీకప్పుడు **<u>అజేయమైన</u>** శక్తి లభిస్తుంది. అవతలవాడు నిన్ను తిట్టినా ప్రశాంతంగా ఉండు. మధురంగా ఇలా మాట్లాడు "ఓహో ... నా ప్రవర్తన నీకు అట్లా అనిపించినందుకు ఆశ్చర్యం

కలుగుతున్నది" అని అను. గుండెకు తీసుకోకుండా బదులుగా నవ్వు. స్వామికి కూడా అబద్ధాలు ప్రచారం చేయడంలో **<u>దక్షులైన</u>** ఈ విచిత్ర వ్యక్తులు తప్పలేదని గుర్తుంచుకోండి. ఇటువంటి తిట్లను విన్నప్పుడు నవ్వి ప్రశాంతంగా వుండండి. కఠినాతి కఠినమైన హృదయం కూడా మెత్తపరచబడటం వల్ల అక్కడ దివ్యత్వం మొలకెత్తుతుంది. జ్ఞాని సాధించే నిధియే తృప్తి.

196. పౌర్ణమి (పూర్ణిమ) సాధకులకు ఏ విధంగా సహాయకారి స్వామి?

పూర్ణిమ సాధకునికి సాధనలో ముందుకు వెళ్ళుటకు సహాయ సహకారాలను అందించే దినము. భగవంతుడు షోడశ కళాప్రపూర్ణుడు. అనగా పదహారు కళలతో దేదీప్యమానంగా విరాజిల్లుతుంటాడు. అనగా ఆ రోజు పరిపూర్ణమైన ఆశీస్సులు అందుకుని మీలో ఉన్న ఒక్కొక్క దుర్గుణాన్ని విడిచిపెడుతూ చివరకు అమావాస్యనాటికి మీ మానసిక స్థితి దుర్గుణాలు లేని స్థితిలో ఉండాలి. మరలా ఒక్కొక్క సద్గుణాన్ని పెంచుకుంటూ పున్నమి నాటికి పున్నమిచంద్రుని వలే వెలగాలి. ఇది నిరంతర సాధన. మీ జీవితం ఉన్నంతవరకూ కొనసాగవలసిందే.

197. జన్మసార్ధక్యతకు గురువు ఎలా సహాయకారి?

గురువు నీ జీవితాన్ని, నిన్ను హెచ్చరిస్తుంటాడు. అప్పుడప్పుడు నీవు అజ్ఞానం లోకి వెళ్ళగానే నిన్ను మేల్కొల్పే ప్రయత్నం చేస్తాడు. నీకు సత్యాన్ని తెలిపి దాని వైపు ప్రయాణించేటట్లు చేస్తాడు. నీకు తెలుసుకోవాలన్న కోరికే లేక పోతే, తెలియని దాని గురించి తెలుసుకోవాలన్న అభిలాష, సాధించాలనే బుద్ధి లేకపోతే నీవు కోరుకున్న స్థితి అందుకోలేవు. ఆకలి ఉన్నవాడికి తిండి పెడితే చాలా ఆతృతగా తింటాడు. ఆకలి లేని వానికి అన్నం పెడితే దానిని ఒక బాధగా భావించి తిరస్కరిస్తాడు. మొక్కను పోషించే తోటమాలి గురువు. కానీ ఆ మొక్కను నాటుకోవలసిన బాధ్యత నీదే. ఆయన వద్దకు రాక మునుపే మొక్కను నాటివుంటే కనుక అది ఎలా పెంచితే ఏపుగా పెరుగుతుందో నీకు తెలియపరుస్తాడు. ఈ మొలకకు కొత్తగా ఆయనేమీ జతచేయడు. అయితే అది దాని ఇష్టం వచినట్లుగా కాక త్వరగా పెరగటానికి ఆరోగ్యంగా ఉండేటట్లుగా చేయగలడు. అనగా నీ ఇంట్లోనే ఉన్న నిధి నీకు కన్పించలేదు. కానీ అది తెలిసిన వ్యక్తి దానిని త్రవ్వి నీకు తీసి ఇచ్చి నీకు ఉన్న దారిద్రాన్ని దూరం చేయగలడు. అంటే దానిని పొందటమెట్లా,

పొందిన దానిని సద్వినియోగపర్చుట ఎట్లా అనేది నీకు చెప్పి సహాయాన్ని అందిస్తాడు. లేకపోతే దుర్వినియోగం చేసుకుంటావు. నీ జీవనాశ్రమానికి చెందిన ధర్మం మీదా, నిన్ను నడిపించే నీ గుణం మీద కర్మ మరియు ఉపాసనలు ఆధారపడి ఉన్నాయి. ముక్కుతో త్రాగినట్లైతే అమృతమయినా అపాయమే. ప్రతి సాధకునికి ఒక జీవన విధానం, ఒక ఉద్ధరించబడే పద్ధతి, ఒక పురోగతి మార్గము ఉంటాయి. నీకేది శ్రేష్టమో గురువుకి బాగా తెలుసు. అంటే గురువు పక్షపాతి, అసూయాగ్రస్తుడని కాదు అర్ధం. అందర్నీ ఒకే రకం చారల చొక్కా తొడుక్కోమని చెప్పేవాడు కాదు. ఎవరికి ఏది అవసరమో, ఎంత అవసరమో అంతే అందించగలవాడు. సరి అయిన గురువు దొరకటమే కష్టము. అలాంటిది గురువు, సద్గురువు, భగవంతుడే దొరికాడు. ఆ అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుని జన్మ సార్ధక్యతను సాఫల్యతను సాధించియే తీరాలి.

198. అహంభావనను ఎలా అధిగమించాలి స్వామి?

అహంభావము అనెడిది అత్యపాయకరము. అది మధ్యపానం మాదిరి. ఇంద్రియాలను తప్పు దారిలోకి లాగుతుంది. బుద్ధి యొక్క, హృదయం యొక్క సద్గుణాలు ప్రకటించబడేది ఒక్క వినమ్ర స్వభావం కలిగిన వారిలోనే. గర్వం శిరస్సు వంగనివ్వదు. ఉక్కు మాదిరి నిలబడి వంగటానికి, విరవటానికి శక్యంకాకుండా ఉంటుంది. ఇటువంటి దానిని వంచటానికి ప్రయత్నించి సఫలీకృతులైతే అదే నిజమైన బలం. ఈ బలం సాధించే ప్రయత్నం చేయాలి. ఐహిక వాంఛలకు, ఇంద్రియ తృష్ణలకు ఇష్టమయ్యే లౌకిక విషయాలకు అధికంగా అనురక్తులు కావటం అలవాటు చేసుకోకండి. నీవు ఎంతో కష్టపడి సంపాదించి నీవి అని గర్వంగా చెప్పుకున్న వాటినల్లా విడిచిపెట్టి వట్టి చేతులతో వెళ్ళవలసిన క్షణం గురించి ఒక్కసారి ఆలోచించండి. అహంభావన తొలగుటకు ఇవి పాటించాలి:

i. మానసిక మౌనం
ii. పరిశుభ్రత
iii. సేవ
iv. ప్రేమ
v. ద్వేష రాహిత్యం

భగవంతుని చేత తయారు చేయబడిన నాటకంలో ప్రతీవాడికి ఒక పాత్ర ఉంది. నీవు చేసే అవమానం పాపం అవుతుంది కాబట్టి ఎవ్వరినీ అవహేళన చేయకు, అవమానించకు, గాయపరచకు. ఇదే గొప్ప సాధన.

199. సాధకుడికి ఎటువంటి ఏకాగ్రత ఉండాలి స్వామి?

కొందరు నా దగ్గరకు వచ్చి, స్వామీ! నాకు ఏకాగ్రత కుదరటం లేదు అంటారు. వాళ్ళ మాటలకు, అజ్ఞానానికి నాకు నవ్వు వస్తుంది. కారు డ్రైవరు కూడా ఏకాగ్రత అన్న కళకు అధికారియై ఉండాలి. తన ప్రక్కన కానీ వెనుక గానీ ఎవరైనా మాట్లాడుకుంటూ ఉంటే వాటి మీదకు దృష్టి పోదు. ఏక దృష్టితో తనకు ఎదురుగా ఉన్న రోడ్డుపైనే దృష్టి నిలుపుతాడు. అందుకే శ్రీకృష్ణుడు కూడా అర్జునికి గీతోపదేశం చేసిన తర్వాత "నేను చెప్పింది ఏకాగ్రమైన శ్రద్ధతో విన్నావా?" అని ప్రశ్నిస్తాడు. మంచి శిష్యుడైన అర్జునుడు యుద్ధంలో నిల్చిన ఉభయసైన్యాల మధ్య తాను భగవంతుని మాటలు ఏకాగ్రమైన శ్రద్ధతో విన్నానని సమాధానం ఇస్తాడు. అలాంటి ఏకాగ్రతను అభ్యసించాలి. ఆ అభ్యాసమే నిన్ను సరి అయిన స్థాయిలో నిలుపుతుంది.

200. స్వామీ, సాధన ఎంత కాలం చేయాలి?

నీకు ఏది లభిస్తుంది? ఏ వేళలో లభిస్తుంది అన్నది అంతా ఆయన అనుగ్రహం మీద ఆధారపడి ఉంటుంది. నీ మార్గం నుండి నీవు తొలగకుండా అంటే సాధకుని ప్రయత్నం ధ్యానాన్ని అభ్యసించడమే. ఆపైన మిగిలినదంతా భగవంతుని అనుగ్రహమే. ఎన్ని రోజులు చేసావు, ఎంత కాలం చేసావు అన్నదానిమీద ఆధారపడదు. కొందరికి కొన్ని జన్మలు పట్టవచ్చు, మరి కొద్ది మందికి కొన్ని రోజులలో లక్ష్యం సిద్ధించవచ్చు. అది ఒక్కొక్కరి శ్రద్ధ, భక్తి, సాధనల మీద ఆధారపడుతుంది. దాన్ని ఈ కారణం వల్ల అని చెప్పలేవు.

201. సుఖమయ జీవితానికి ఏమి అవసరం?

సుఖమయ జీవితానికి రెండు విషయాలు అవసరం. ఒకటి ధ్యానము రెండు ధాన్యము. శరీర పోషణకు ధాన్యము, భగవంతుని దేవాలయంలో ప్రవేశించి ఆయన మహిమలలో లీనం కావటానికి ధ్యానము.

202. సాధకులు పాటించవలసిన నియమాలు ఏమిటో తెలియపర్చండి స్వామి.

i. ప్రాపంచికమైన బుద్ధి ఉన్నవాళ్ళ సంశయగుణాన్ని లక్ష్యం చేయకు. వాళ్ళు నిన్ను వివేక వైరాగ్యాలనే

రాచమార్గం నుండి తప్పించి సందుగొందుల్లోకి లాగటానికి ప్రయతిస్తారు. మహాపురుషుల మీద విషం క్రక్కే అల్ప మానవులకు అవతార పురుషులు కూడా గురి అయినారు. అలాంటప్పుడు తమ ప్రేమను పెంచుకుని విశ్వవ్యాప్తం చేద్దామనుకున్న వారు ఎట్లా తప్పించుకుంటారు.

ii. ప్రపంచానికి ద్వితీయ ప్రాధాన్యం ఇవ్వు.

iii. ప్రపంచం యొక్క ఉచ్చులను సడలించుకోవడం అన్న దానికి ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వు.

iv. చిన్నబిడ్డలుగా బొమ్మలతో ఆడుకుంటున్నపుడు వాటిని వదిలివేసి ఏడ్చిన తక్షణమే తల్లి నీ దగ్గరకు వస్తుంది. అలాగే భౌతికమైన సంబంధాల పట్ల విముఖత చూపించి భగవంతుని కొరకు నీవు ఎప్పుడు ఏడుస్తావో అప్పుడు జగజ్జనని నీ వైపుకు పరిగెత్తుకుంటూ వస్తుంది. నీ హృదయపు లోతుల్లోంచి కోరుకో. సర్వ ప్రాణాలతో **ఆకాంక్షించు**. అప్పుడే శేషసాయి యొక్క అనుగ్రహాన్ని పొందగలుగుతావు.

203. భగవత్ అనుగ్రహం ఎటువంటిది?

భోజనం ప్లేటులో పెట్టినది పెట్టినట్టుగా తింటే వంటపదార్థాల రుచి వేరుగా ఉంటుంది. చాలా బాగుంటుంది. మరలా వడ్డించుకుని తినాలని అనిపిస్తుంది. పెట్టిన తర్వాత మాఇష్టం వచ్చినపుడు తిందాములే అనుకుని ప్లేటును ప్రక్కన పెట్టి మీనమేషాలు లెక్కపెడ్తూ ఈ కూర బాగా లేదు, అన్నం ఎండిపోయింది అని అంటే వడ్డించిన వాడి తప్పు కాదు. తిన్న వాడి తప్పు. పెట్టిన పదార్థం వేడిగా అంటే అప్పటికప్పుడే తినటానికి సిద్ధమవ్వాలి. దానికి తోడు కొంచం నెయ్యి వేసుకుని అనగా నమ్మకము అనెడిది కలిపి భుజించిన భోక్త భుక్తి తీరి ముక్తి తీరం చేరటానికి అర్హత సాధించుకుంటాడు.

204. అద్వైత స్థితి జీవుడి లక్ష్యం కావాలా స్వామి?

అవును. ఈ రహస్యాన్ని అర్థం చేసుకోవటానికి మీరు ప్రయత్నించాలి. ప్రయత్నించినపుడే ప్రేమించేది, ప్రేమించబడేది నారాయణుడే అనే విషయం అనుభవం లోకి వస్తుంది. సద్గురువు పట్టిన పట్టును సడలించుకోకూడదు.

205. ప్ర. దైవత్వం ఎవరికీ కాన రాదు. అది కనిపించి ఎడ్వర్టైజ్ చేసుకునేటువంటిది కాదు కదా స్వామి?

జ. ఔను! ఎవరి స్వానుభవంతో వారు అనుభవించే దివ్యానందమే దైవత్వం. ఒక్కొక్క పేపర్లో ఒక్కొక్క **అడ్వర్టైజ్మెంట్** కనిపిస్తుంది. తప్పుడు విషయాలనే అడ్వర్టైజ్ చేస్తుంటారు. గమనించావా?

ప్ర. గమనించాను స్వామి. అది వాళ్ల మూర్ఖత్వం. నిజంగా వాళ్ళు మనుష్యులైతే అలాంటి తప్పుడు విషయాలను అడ్వర్టైజ్ చేయరు కదా.

జ. ఏవో తాము విన్నటువంటి విషయాలను పేపర్లో వేయటం, నోటికి వచ్చినట్లు మాట్లాడటం చాలా పొరపాటు. చదివేవారు, వినేవారు కూడా సత్యాన్ని గ్రహించాలి. సత్యాన్ని అనుసరించి మెలుగుతూ ఉంటే దండించగలవాడు ఒక్కడూ ఉండడు. ఇంద్రియములను అరికట్టలేక దేహ సంబంధమైన భ్రాంతులను వదిలిపెట్టలేక నిత్యసత్యమైన ఆత్మతత్వాన్ని మర్చిపోతున్నారు. మీయందే ఉన్న కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, మానసిక తత్వాలను అనుసరిస్తున్నారు. మీ యందే ఉన్న సత్యాన్ని విస్మరించి అనిత్యము, అశాశ్వతము అయిన వాటి వెంట పడుతున్నారు.

206. మనస్సు ఎట్టిదో తెలియపర్చండి స్వామి.

అది సుగంధంతో కూడిన పుష్పాల పై వ్రాలే, పెంట కుప్పలపైనా వ్రాలే ఈగ లాంటిది. అంటే మంచి, చెడు రెండిటి పైనా వ్రాలేది. దానిని ఎలా నమ్మగలరు? మనస్సు పిచ్చి కోతి వంటిది. దేహము నీటి బుడగ వంటిది. ఇటువంటి దేహాన్ని. మనస్సుని నమ్ముకుని బ్రతుకుతున్నారు. ఏనాడైతే దేహతత్వాన్ని, ఇంద్రియ తత్వాన్ని వదిలివేసి,అంటే మరిచిపోయి ఆత్మతత్వాన్ని చింతిస్తారో ఆనాడు మీరే ఆత్మ స్వరూపులని గుర్తించగలుగుతారు.

207. ఏదైనా పని చేస్తున్నప్పుడు మా భావన ఏ విధంగా ఉండాలి స్వామి?

**సెల్ఫ్** కంటే **హెల్ప్** మిమ్మల్ని ఆత్మతత్వాన్ని తెలుసుకునేటట్లుగా చేస్తుంది. **సెల్ఫ్** కంటే **హెల్ప్** చాలా మంచిది. ఏది చేసినా నా ఆత్మతృప్తికి నేను చేస్తున్నాను, ఆచరిస్తున్నాను అని మీరు అనుకుంటే ఆత్మతత్వాన్ని అర్థం చేసుకున్నవారు అవుతారు.

208. ప్రేమతత్వం ఎటువంటిది స్వామి?

దాహమును తీర్చే గంగా ప్రవాహము ప్రక్కనే ఉండగా దానిని వదిలిపెట్టి మంచు బిందువులను ఆశిస్తున్నారు. అంటే మీ యందే ఉన్న ప్రేమను విస్మరించి లౌకిక విషయాలకై ఆరాటపడుతున్నారు అని అర్థము. ప్రేమ ధనాన్ని మీ హృదయమనే బ్యాంకులో డిపాజిట్ చేసుకుంటే ఎక్కడికీ పోదు. పైగా డబుల్ డబుల్ అవుతుంది. ఎక్కడైనా దొంగతనం జరగవచ్చు. కానీ మీ హృదయమనే బ్యాంకులో దొంగతనం జరగటానికి వీలు లేదు. దీనికి తలుపులు, తాళాలు లేవు. ఏమీ లేక పోయినా సత్యనిత్యమై ఉంటుంది.

**ప్ర.** ఈ ప్రేమతత్వం ఎక్కడ పుడ్తుంది? ఎక్కడ అంతమవుతుంది స్వామి?

**జ.** ఇది దాసోహం తత్వంలో ప్రారంభమై సోహం తత్వంలో అంతమవుతుంది.

**ప్ర.** అయితే ఈ ప్రేమ ఏ విధంగా ఉండాలి?

**జ.** సర్వార్పిత భావనతో కూడినదై ఉండాలి. అటువంటి భావనతో భగవంతుని ప్రార్థిస్తున్నారా? ఈ అర్పిత భావము ఈనాడు ఎచటనూ కనిపించుట లేదు. ప్రేమ తత్వాన్ని మానవుడు గుర్తించుకోలేక క్షణికమైన విషయాలకోసం ప్రాకులాడుతున్నాడు. దీనికి కారణం స్వార్థము పెరిగినది, పరార్థము తరిగినది. సంకుచిత భావములు పెరిగినవి, విశాల భావాలు తరిగిపోయినవి. ఆశలు పెరిగినవి, ఆశయాలు తరిగినవి. దివ్యమైన భావాలను మానవుడు విస్మరించుట వలన అనేక అవస్థలలో క్రుంగి, క్రుళ్ళి, క్రుశించిపోతున్నాడు. ప్రేమ లేని హృదయం ప్రేత భూమితో సమానం. పవిత్రమైన దివ్యత్వాన్ని నిరూపించేది ప్రేమ ఒక్కటే. అయితే తనను తానే గుర్తించలేని వ్యక్తి ఇక దేనిని గుర్తించగలడు? ఇదే ఈనాడు జగత్తులో జరుగుతోంది. ప్రతీ మానవుడు జగత్తునంతా గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ తానెవరో తెలుసుకోవడం లేదు. అంతరాత్మ **సాక్షిగా** దీనిని తెలుసుకుని అనుసరించడమే తగిన అన్వేషణ. కానీ ఈనాటి మానవుడు మనస్సునో లేక దేహమునో అనుసరిస్తున్నాడు. అందుకే ఇన్ని కష్ట నష్టాలు ఎదుర్కొంటున్నారు.

209. స్వామీ! మనిషి ఏర్పర్చుకోవలసిన జ్ఞాన సంపద గురించి కొంత వివరించండి.

భక్తితో పాటు జ్ఞానాన్ని జోడించి మీరు ఉపాసిస్తే ఇది జరుగుతుంది. ఏది జరుగుతుంది? మీ చుట్టుతా జరిగేది ఏది న్యాయమో, ఏది అన్యాయమో అన్న విచక్షణ తెలుస్తుంది. ఈ విచక్షణ లేకపోవటం వల్ల జరిగేది ఏమిటంటే మీ చుట్టూరా జరుగుతున్న న్యాయాన్ని అన్యాయమనుకుని, అన్యాయాన్ని

న్యాయమనుకుని మనిషి లోభపడుతూ మోహపడుతూ ఉంటాడు. ఆ లోభ మోహాలకి, అనవసరమైన వాటికి, కామానికి చిక్కుకోటానికి, అవసరం లేని చోట క్రోధం తెచ్చుకోటానికి ఈ మొత్తానికీ కారణం ఏమిటంటే న్యాయ అన్యాయాలకు బేధం తెలియకుండా ఉండటమే. కాబట్టి విచక్షణ అనేది మనిషికి చాలా చాలా ముఖ్యమైనది. ఎవరైతే ఈ విచక్షణా జ్ఞానాన్ని సునిశితమైన సాధన చేసి తమలో పెంచుకోలేదో అటువంటి వాళ్ళు ఏ క్షణంలో ఏ విధంగా స్పందిస్తారో అనేది వాళ్ళకే తెలియదు. అంటే అర్థం మీలో ఆ విచక్షణ ఎంత శుద్ధంగా వృద్ధి అవ్వాలి అనే దానికి ఒక సాధనా మార్గం అవసరం. భక్తితో పాటలు పాడుకోవటం ద్వారా అంతా భగవంతునికి వదిలివేస్తున్నారు. కావున గర్వం లేక పోవుట వల్ల ఏ పని మీద కూడా మీకు మీ అహంకారపరంగా జరిగే ఒక పట్టు ఉండక భగవంతునికే వదిలేస్తూ ఉండటం వల్ల ఎంతో సునాయాసంగా ఆ పని జరగటము, ఆ పని ద్వారా వచ్చే ఫలితము మీకు ఇష్టమైనదిగా వచ్చినా, కష్టమైనదిగా వచ్చినా అది భగవత్ ప్రసాదంగా తీసుకునే ఒక అలవాటు వస్తుంది. కాబట్టి ఎటువంటి ఫలితమైనా అంత గట్టిగా మిమ్మల్ని కుంగదీయదు, లొంగనీయదు, పొంగనీయదు. కాబట్టి అటువంటి ఒక సమాన స్థితికి చేర్చే ప్రయత్నం నామస్మరణ అనే సాధన చేయించగలుగుతుంది. భక్తితో చేకూర్చకపోతే అది అహంకారానికి దారి తీస్తుంది. కాబట్టి విచక్షణ ద్వారా న్యాయాన్యాయములు తెలుస్తాయి. జగము మాయా మయమని తెలుస్తుంది. అంటే అర్థం ఏమిటి? మాయ అనేది ఏమిటి అంటే లేకపోవడం కాదు - కాకపోతే ఇప్పటికి మాత్రమే ఇది ఉంది, ఇది ఎప్పటికీ ఉండేది కాదు. ఉన్నట్లుగా కనబడుతుంది. ఉదాహరణకు మీరు రాత్రి కలగంటున్నారు. అప్పటికి కల నిజమే. కానీ ప్రొద్దున లేచిన తరువాత ఇదిమాయ మాత్రమే అనేది మీకు తెలుస్తుంది. అలాగే ఇంకొక ఉదాహరణ తీసుకుంటే ఒక త్రాడును చూచి పాము అనుకున్నప్పుడు, అది పాము అనుకున్నంతసేపు పామే అని భయభ్రాంతులు చెందుతారు. కాని తాడు అని తెలిసిన తరువాత ఇది మాయ అని తెలుస్తుంది. అట్లాగే ఈ ప్రపంచంలో ఉన్నప్పుడు మయామయమైన ఈ భౌతిక ఆకర్షణలకు లోనవుతూ జీవిస్తున్నారు. కాని ఎప్పుడైతే తెలివి వచ్చి దీన్నుంచి బయట పడుతారో అప్పుడు ఇది మాయ అని తెలుసుకుంటారు. కాబట్టి అటువంటి తెలివికీ, తెలివిలేని తనాన్నుంచి తెలివికి తీసుకువెళ్ళే శక్తి ఈ భక్తితో చేసే జ్ఞానానికి ఉంది. ఇంత సుధీర్ఘమైన, ఇంత లోతుగా ఉన్న సందేశాన్ని ఇచ్చాను. ఇంకొక విషయం ఏమిటంటే "దుర్గుణ కాయజాది షడ్రిపులు జయించు కార్యము తెలుసు". పై రెండింటి యందు అసలు కారణం ఒకటి ఉంది. అది ఏమిటి అంటే, ఇవన్నీ బయట విషయాల వల్ల మీకు నిజంగా జరగటం లేదు. మీలో ఉన్న షడ్రిపులు అనగా మీలో ఉన్న ఆరుగురు

శత్రువులని జయించలేకపోతున్నారు. కావున, బాహ్యంగా మీకు ఇబ్బందులు వస్తున్నాయి. మీలోని కామాన్ని మీరు జయించలేకపోతున్నారు. జయించలేనపుడు మిమ్మల్ని బయటనుంచి ఆకర్షించేవి ఎన్నో ఉంటాయి. మీలోని క్రోధాన్ని మీరు గ్రహించలేనపుడు బయట నుండి మిమ్మల్ని క్రోధానికి గురిచేసే మనుషులు, అవకాశాలు ఎన్నో ఉంటాయి. ఇలా ఏదైతే మీలో బలహీనత ఉందో బయట ప్రపంచంలో అటువంటి ఒక పరిస్థితి రాగానే ఈ బలహీనత బయట పడుతుంది. ఈ బలహీనత పెద్దదవుతుంది. ఈ బలహీనత మీలో వృద్ధి చెందుతుంది. అంటే అక్కడకు వచ్చే సరికి ప్రతీ పరిస్థితి ఈ ప్రపంచంలో మీకు చెబుతున్న పాఠం ఏమిటంటే మీలో బలహీనత ఇంకా ఉన్నది సుమా! అని చెప్పడం. కాబట్టి అది తెలిసినపుడు మీరు వాటి వైపు ఎక్కువగా అంటే బయట జరిగిన పరిస్థితులు క్రుంగ తీసినపుడు ఆ భావాలను బయటకు రానివ్వకుండా మిమ్మల్ని మీరు సరిచేసుకోవాలని మీకు చెప్పకనే చెప్పాను. కాబట్టి సరి చేసుకునే పద్ధతిలో ఆ ఆరుగురితో కలసి జీవించే పద్ధతి కూడా మీకు జ్ఞానమే నేర్పుతుంది. అది భక్తితో కూడిన జ్ఞానము. మీరు చెయ్యవలిసిందల్లా ఒక్కటే. భక్తితో కూడిన జ్ఞానంతో భగవంతుని ఉపాసించండి. ఇది నిజమే కదా! లేకపోతే త్యాగరాజు అంత పేదరికంలో ఉన్నా కూడా ఒక మహారాజు తన జీవితానికి సరిపొయ్యే విధంగా ఆభరణాలు, వజ్ర <u>వైడూర్యాలు </u>పంపించినా కూడా "నాకు ఇవి ఏమీ అక్కర్లేదు. నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవా సుఖమా?" అని తిరస్కరించి రాముని సన్నిధిపై దృష్టి నిలిపాడంటే మీరు ఆలోచించుకోడానికి బాగానే ఉంటుంది. కానీ ఈ పరిస్థితుల్లో మీకు ఒక ఉద్యోగం నుండి ఇంకొక ఉద్యోగంలోకి వెళ్ళాలంటే వాళ్ళు ఒక పదివేల రూపాయలు ఎక్కువ ఇస్తానంటే వెళ్ళిపోయే రకం మీది. కాబట్టి ఈ లోభము లేక కామము అనునవి అంత తొందరగా వదిలేవి కావు. అటువంటి బలమైన షడ్రిపులను కట్టడి చేసి చూపెట్టిన మహానుభావుడు త్యాగయ్య. ఆయన ఆ స్థితిలో ఉన్నాడు కాబట్టి వాటి గురించి తన కృతులలో ఇలా చెప్పగలిగాడు. "కాయజాది షడ్రిపులు జయించు కార్యము నాకు తెలుసయ్యా" అన్నాడు. భక్తితో కూడిన జ్ఞానాన్ని సాధించి మీకు ఏవైతే అడ్డంకులుగా ఉన్నవో వాటిని గుర్తించి తొలగించుకుంటూ వివేకంతో నిజతత్వాన్ని అనుభవించగలగాలి. ఆ జ్ఞాన సంపదే భగవంతుని హృదయ పీఠమునందు సుస్థిర స్థానాన్ని అందించగలదు.

210. భక్తి మార్గంలో మా ప్రయాణాన్ని ఏ విధంగా కొనసాగించాలో కాస్త తెలియపర్చండి స్వామి?

ఈ విషయంపై చెప్పాలంటే "దేవుడున్నాడు" అన్న ఐదక్షరాల వాక్యాన్ని మీరు ప్రధానంగా

తీసుకోండి. దినమంతా దీనినే చింతిస్తూ, భావిస్తూ, ఆచరిస్తూ, ఆనందిస్తూ అందరికీ అందిస్తూ ఉంటే ఇంత కంటే లోక కల్యాణం మరొకటి లేదు. దేవుడున్నాడని కేవలం భావించడం మాత్రమే కాదు. దైవవాణిని మనసా, వాచా, కర్మణా ఆచరించాలి. అందులోని పరమానందాన్ని ఆస్వాదిస్తూ ఇతరులకు అందచెయ్యడమంటే ప్రజా శేయస్సును కోరడమే కదా? ఇందులకై భక్తుని గుండె ఏమి చెబుతుందో చూడండి. "ప్రభూ! ప్రాపంచిక సుఖాలే, సౌఖ్యాలే ఇంత ప్రలోభం కలిగించినపుడు నువ్వు ఎంత సమ్మోహనకరంగా ఉంటావో" అంటూ భగవంతుని ఉనికిని అనుభూతిచెందడం, మనసారా అంగీకరించడం, ఆపై భగవంతుని అనుగ్రహం పొందటానికి ఎలాంటి యోగ్యతను కలిగి ఉండాలో తెలుసుకుంటే భక్తి మార్గంలోని మొదటి మెట్టుని చేరుకున్నట్లే. మరి ఆ భక్తి మార్గంలోని ప్రయాణం ఎలా కొనసాగించాలో వివరిస్తాను. గమనిస్తావా? భోగభాగ్యాలు, విజ్ఞాన సంపదలు, పాండిత్యవైభవము ఇవేవి భగవత్ కృపకు దారి తియ్యలేవు. భగవంతుని పొందటానికి ఉన్న ఒకే ఒక్క సాధనం ప్రేమ. ఈ రోజుల్లో మీరు ప్రతీ రంగంలోనూ విజయ ప్రాప్తికై లంచం పెట్టవచ్చును. కానీ భగవంతుడు మాత్రం యుక్తులతోనో, అడ్డదారులు తొక్కడం ద్వారానో దొరకడు. భగవంతుడు మీకు అత్యంత సమీప వ్యక్తి. భ్రమ అనే ద్వారాన్ని తీయి, అజ్ఞానమనే తెరను తొలగించు, మూసిన కంటిని తెరువు. అంతే ఆయన నీ ఎట్ట ఎదురుగా ఉంటాడు. ప్రేమ అనే సాధనతో సన్మార్గాన పయనిస్తూ ఉన్నా భగవదనుగ్రహం పొందటం అంత సులభం కాదు. ఎన్నో అడ్డంకులు, ఎన్నో విమర్శలు, ఎన్నో కష్టాలు, ఎందరితోనో విరోధం లాంటి ప్రతిబంధకాలు అడుగడుగునా ఎదురవుతూనే ఉంటాయి. ఇవే కాక ప్రాపంచిక ఆకర్షణలు, ప్రలోభాలు. వీటిని అధిగమించటానికి ఎవరూ చేయూతనివ్వకపోగా భక్తుని పిచ్చివానిగా పరిగణిస్తారు. భక్తుని చూచి పరిహసిస్తారు. అదే విధంగా భగవద్భక్తి గలవానికి ఐహిక విషయాసక్తుడు పిచ్చి వానివలే, అవివేకుని వలే, అంధుని వలే కనిపిస్తాడు. మానవుడ్ని బంధించే, బాధించే అన్ని విధములైన పిచ్చి పనులలో భగవంతుని పట్ల పిచ్చియే అపకారము లేనిది. పైగా ఎక్కువ లాభసాటియైనది. ఈ ప్రపంచము పిచ్చి పరిపాలకులవల్ల చెప్పలేనంతగా పాడైపోయింది. కానీ పిచ్చిభక్తి ఉన్నవారివల్ల పాడవలేదు. పిచ్చి మార్గదర్శకత్వం వహిస్తూ నేతలు అనుకున్నవారికి నాణ్యమైన నేర్పరితనం లేకపోవుట వల్ల చెప్పలేనంతగా పాడయిపోయింది. పిచ్చి భక్తి ఉన్న వారి వల్ల మాత్రము సామరస్యము, శాంతి, సౌభాతృత్వము, ప్రేమలే పెంపొందాయి. దీనికి ఒక చిన్న కథ చెప్పనా? ఒకసారి ఒక ఊరికి ఒక సాధువు వేంచేసాడు. ఆ మహాత్ముని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని జనం తండోపతండాలుగా రావడం మొదలుపెట్టారు. ఆయన మహిమను గురించి విన్న ఒక పెద్ద వ్యాపారస్తుడు

ఒక రోజు మందీమార్బలంతో దర్శనానికి వచ్చాడు. విలువైన కానుకలు సమర్పించుకున్నాడు. సాధువు వాటివంక చూడను కూడా చూడ లేదు. వ్యాపారికి ఆశ్చర్యం కలిగింది. ఆ మహాత్ముని తేజోవంతమైన కళ్ళు, నిర్మలమైన దృష్టి, ఆ తేజస్సు అలా చూస్తూ వ్యాపారి ఇలా అన్నాడు. మహాత్మా! తమరు చాలా గొప్పవారు, మహనీయులు, శ్రేష్ఠులు. నిజంగా చాలా గొప్ప వారు. ఎందువలన అలా అంటున్నావు అని సాధువు ప్రశ్నించాడు. మీరు భగవంతుని కోసం ప్రాపంచిక సుఖాలను త్యజించారు. నిజంగా మీరు చాలా గొప్పవారు అని భక్తితో బదులిచ్చాడు వ్యాపారి. అలా అయితే నాకంటే నీవే చాలా గొప్పవాడివి అన్నాడు సాధువు. అదెలాగా? అని అయోమయంగా చూచాడు వ్యాపారి. ఎందుకంటే నీవు ప్రాపంచిక సుఖాల కోసం భగవంతుడ్నే త్యజించావు కదా అని చిరునవ్వుతో బదులిచ్చాడు సాధువు. ప్రాపంచిక సుఖాలను అనుభవించగలగడమే జీవిత లక్ష్యమని, అవి మీకు సమకూర్చే వాడే దేవుడని వ్యాపార దృష్టిని భక్తిగా భావించే వారే ఎక్కువ శాతం ఉన్నారు. పుట్టపర్తిలో ఉంటే రోగాలు వస్తాయా? అని అతి తెలివిగా ప్రశ్నించే వారి అజ్ఞానం, మూర్ఖత్వానికి జాలి పడవలసిందే. వాస్తవానికి దైవ ద్వేషం అనునది అహంకారం కాదా? అలాంటి వారి మాటలకి భక్త సులభుడ్ని అయిన నేను చెప్పే సమాధానం విను. దైవ ద్వేషులు కొందరు చుట్టూ చేరి ఎక్కడో ఒక మూల రామా! కృష్ణా! గోవిందా! అని భగవంతుని నామం జపిస్తూ కూర్చుంటే అన్నవస్త్రాలు లభిస్తాయా? అని ప్రశ్నిస్తూ మిమ్మల్ని తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తారు. భగవంతుడు అట్టి భక్తులకు అన్నమునే కాదు అమృతమును కూడా ఇస్తాడని ఆ మూర్ఖులకు తెలియదు. భగవన్నామం ఒకటి చాలు. దాని యందు ఎంతటి శక్తి అయినా ఉంది. భగవంతుని నామం జపిస్తూ తీసుకున్న ఒక్క శ్వాస, చేసిన ఒక చిన్న సంజ్ఞ, ఆర్తితో పిలిచిన ఒక పిలుపు, భగవంతుని ఎడబాటుని సహించలేని వేదనాభరితమైన ఒక్క కేక చాలు ఆయన అనుగ్రహం పొందటానికి. ఆ దేవ దేవుని యెడల గల విశ్వాసమే భక్తుల ఊపిరి. ఆ దీనవత్సలుని దయా వర్షంలో తడిసి ముద్ద అయిన భక్తుల మాటలను మీరు విన లేదా? భగవంతుడు ఏర్పర్చిన జీవిత క్రమం బీమా కంపెనీ కంటే కూడా తెలివిగా మీ భవిష్యత్తును అమర్చి ఉంచుతుంది అని ఒకరంటే దేవుడొక్కడే తప్పు లేని సలహా ఇస్తాడని మరొకరంటారు. ఆయన తప్ప ఎవరు మోయగలరు ఈ బ్రహ్మాండ భారాన్ని? పరిపూర్ణంగా విశ్వసించిన యెడల వారి భక్తి ప్రపత్తులే వారిని కాపాడును. ఏనాడూ భగవంతుడు మిమ్మల్ని మరువడు. కాని మరిచేది భక్తుడే. భగవంతుడు భక్తులను విడిచిపెట్టడు. భక్తులే భగవంతుని విడిచిపెడతారు. కానీ భక్తులను బంగారానికి వన్నె వచ్చేలా చేసే ప్రక్రియ ద్వారా పరీక్షించి మెరుగులు పెడతాను. సంపూర్ణ శరణాగతి కోరతాడా లేక విడిచి పెట్టి పారిపోతాడా అని

గమనిస్తూనే ఉంటాను. కఠినమైన ఇంద్రియ నిగ్రహం, సమ్యమనము అలవర్చుకునేలా చేయూతనిస్తూనే సమస్యలకు గురిచేస్తూ వాటిని ఎదుర్కునే మనోధైర్యాన్ని ప్రసాదిస్తాను. భవ సాగరాన్ని దాటించే నావికుని పాత్ర పోషిస్తూ సుడిగుండాల నుండి క్షేమంగా తీరం దాటిస్తాను. ఎందరి జీవితాలలోనో ఎన్నో అద్భుతాలను కావించి, కావిస్తూ ఎందరెందరినో ఆనంద తరంగాలపై ఓలలాడించాను. దేవుని రుచి చవిచూపించాను. ఇది అంతా భక్తి తోనే సాధ్యమయ్యేది కాని అన్యధాకాదు. అందుకే ఆధ్యాత్మిక క్షేత్రంలో భక్తికి అంత పెద్ద పీట వేసారు.

211. స్వామీ! మిమ్మల్ని చేరే మార్గంలో బంధువులు, తల్లిదండ్రులు, బిడ్డలు అడ్డుపడుతుంటే ఏమి చేయాలి?

పరిపూర్ణంగా భగవంతుని విశ్వసించే భక్తుల భక్తి ప్రపత్తులను బయటివాడే కాదు, కుటుంబ సభ్యులు, బంధువులు కూడా వ్యతిరేకించడం మీరు గమనిస్తూనే ఉంటారు. భక్తులు ఇలా స్వంత వారే విరోధులుగా మారే పరిస్థితులను ఎదుర్కొనవలసి రావడం చాలా సహజమైన విషయమే. మీకు మరలా గుర్తు చేస్తాను. త్యాగరాజు భక్తిని అన్నా వదినలు గౌరవించారా? సక్కుబాయి భక్తిని అత్తగారు గుర్తించిందా? తుకారాం భక్తిని భార్య మెచ్చుకుందా? నేడు నా భక్తులకు కూడా ఇలాంటి సంఘటనలు ఎదురవుతూనే ఉంటాయి. కానీ ఆ పరిస్థితులలో నిజమైన భక్తుల స్పందన ఇలా ఉండాలి. భగవత్ మార్గము నందు ఎవరు అడ్డు తగిలినా తిరస్కరించమని వేదాలే బోధించాయి. ఇప్పుడు వేదపురుషుడినైన నేను కూడా భగవంతుని ఎడబాటు కలిగించే విషయములందు పాల్గొనినపుడు తల్లి అయినా సరే ధిక్కరించవచ్చని చెబుతున్నాను. మీకు ఉదాహరణగా రామాయణంలో భరతుడు కైకను ధిక్కరించి వెళ్ళాడు, హరి చింతన చేయకూడదని శాసించిన తండ్రి హిరణ్యకశ్యపుని ధిక్కరించాడు కుమారుడైన ప్రహ్లాదుడు, గురువైన శుక్రాచార్యున్ని ధిక్కరించి తన సర్వస్వమూ విష్ణువుకు అర్పించుటకు సిద్ధమయినాడు శిష్యుడైన బలి చక్రవర్తి, భగవంతునికి అడ్డు తగిలినప్పుడు సోదరుడైన రావణుని ధిక్కరించి రాముని సన్నిధికి చేరుకున్నాడు విభీషణుడు, భగవంతునికి తనకు మధ్య గల సంబంధ బాంధవ్యములకు అడ్డు తగిలినపుడు మీరా బాయి తన భర్తనే ధిక్కరించి ద్వారక చేరిపోయింది. కనుక భక్తునికీ, భగవంతునికీ ఉన్న సన్నిహిత సంబంధ బాంధవ్యములకు ఎవరూ అడ్డుతగులుటకు వీలు కాదు. భక్తి విద్యాలయంలో ప్రవేశించగనే పరీక్షలా అనట్లుగా కష్టాలను ఎదుర్కొనవలసిందే మరి. పరీక్ష వ్రాయనిదే ఉత్తీర్ణత ఉండనట్లే

కష్టాలను తట్టుకొనలేని వారికి దైవ **<u>సాక్షాత్కారము</u>**, దైవానుగ్రహము కలగదు. నిజానికి హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులే లేకపోతే ప్రహ్లాదునికి దైవ **<u>సాక్షాత్కారము</u>** లభించెడిదా? అనేక విధాలైన కష్టాలకు గురి అవ్వబట్టి ప్రహ్లాదుని భక్తి లోకవిదితమైంది. ఇలా కష్టాలు పదే పదే పరామర్శిస్తున్నా నిజమైన భక్తుని విశ్వాసము సడలిపోదు. సుఖాలతో పాటు దుఃఖాన్ని కూడా దైవ ప్రసాదంలాగా భావిస్తారు. ప్రహ్లాదుడు భగవత్ చింతన తప్ప అన్య చింతన ఎరుగడు. అతని దృష్టిలో ఏనుగు, పాము, విషము, అగ్ని అన్నియూ నారాయణ స్వరూపములే. అవి ఎట్లా హాని చేస్తాయి అతనికి? మీ హృదయాన్ని ముట్టడించి పీడించే రాజస, తామస గుణములనెడివి హిరణ్యకశ్యపుని పాలిటికి భగవన్నామం నృసింహావతారం వంటిది. వైద్యులిచ్చు క్యాల్షియం ఘటికలు, విటమిన్ ఘటికలు, రక్తహీనత పోగొట్టు ఘటికలు వ్యాధిని దూరం చేసే ఈ ఘటికలు ఎలాగో నామ ఘటికలు మానసిక ఆందోళన అనే వ్యాధిని పోగొట్టును. భగవన్నామాన్ని నోరారా కీర్తించండి. నాలుక పైనామము ఇంటిగడపపై దీపము వంటిది. లోపలా వెలుపలా కూడా వెలుతురు ప్రసరింప చేయును. ఇలా నామస్మరణ ద్వారా తరించే సులభమైన మార్గము దొరుకుట భక్తుల అదృష్టమని వేరే చెప్పాలా?. వాస్తవానికి నా అనుగ్రహము భక్తులపై విశేష అనుగ్రహంగా ఉంటుందనేది కాదనలేని ఎదార్ధం. నేనేమి మిమ్మల్ని ప్రహ్లాదుని లాగా కష్టాలు పడమనలేదే, శబరి లాగా సంవత్సరాల తరబడి ఎదురు చూడమన లేదే, ధ్రువునిలా అరణ్యంలో తపస్సు చెయ్యమనలేదే, గజేంద్రునిలా ఎలుగెత్తి పిలువమనలేదే, బలిచక్రవర్తిలా సర్వస్వమూ త్యాగము చెయ్యమనలేదే, మీరాబాయిలా విషం త్రాగమనలేదే. ఇంతే కాకుండా భగవత్ ప్రేమ ఎలా ఉంటుందో తరచూ చెబుతూనే ఉంటాను కదా. ఒక్క విషయాన్ని చాలా గట్టిగా చెప్పదలచుకున్నాను. కాలమనే కల్లోల భరిత సాగరంలో విరోచితంగా మునకలు వేసి సాయిఅనుగ్రహమనే అత్యంత అపురూపమైన, అరుదైన ముత్యాన్ని చేజిక్కించుకోగలిగారు. అది మళ్ళీ మీ చేయి జారి అగాధంలో పడిపోకుండా జాగ్రత్తపడండి. ఆ ముత్యాన్ని గట్టిగా పట్టుకోండి. అది అందించే ఆనందం మీలో శాశ్వతంగా నిండిపోవాలని ప్రార్ధించండి. మీ జీవితాన్ని ఫలప్రదం చేసుకునే మార్గం ఈ ఒక్కటే.

212. స్వామీ! మానవుడు తనలో ఉన్న అహంకార, మమకారాల్ని వదిలిననాడే తనలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుటకు వీలవుతుందా?

మంచిగానే గుర్తించావు. "స్వశ్వరం స్వయంజ్యోతి స్వరూపం సర్వరక్షణం". భగవంతుడు సర్వుల

దేహము యందును సర్వ రక్షకుడిగా, సర్వజ్యోతిర్మయునిగా ప్రకాశిస్తున్నాడు అనే తత్వాన్ని మీరు గుర్తించుకున్న తర్వాత అహంకార మమకారములు అరికట్టుకోవడం అతి సులభం అవుతుంది. స్వయం జ్యోతి మీ శరీరమునందే ఉంటున్నది. స్వరూపం సర్వరక్షణం. రక్షకుడు మీ ఆకారమునందే ఇమిడి ఉంటున్నాడు. దైవము ఉన్నాడా? లేడా? దైవమును మీరు చేరే మార్గం ఏమిటి? అన్న విషయంపై అనాదిగా విచారణ జరుగుతూనే ఉంది. ఇది ఒక జటిలమైన సమస్యగా రూపొందింది. అనేకమంది ఋషులు, యోగులు తమ చాకచక్యము, తపోబలము, పాండిత్యము చేత సుదీర్ఘ ప్రతిజ్ఞల చేత తపస్సులు ఆచరించి ఈ సమస్యకు పరిష్కారం గుర్తించారు. ఎట్లా అనగా "వేదాహమేతం పురుషం మహాంతం. ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్" అనగా మేము తేజోవంతమైనట్టి, ప్రకాశవంతమైనటువంటి, అజ్ఞానమనే అంధకారమునకు ఆవల ఉన్నటువంటి మహాపురుషుని దివ్యశక్తిని కనుగొన్నాము అని జగత్తుకు చాటారు మహర్షులు. ఎక్కడ వెతికారో, ఎక్కడ తెలుసుకున్నారో అన్న విషయాలను వెల్లడి చేసారు. వారు వెదికినది తెలుసుకున్నది మీ లోపలనే అంతరాత్మనందే, దివ్య భావమునందే, ఈశ్వరమునందే, శరీరిని మేము గుర్తించామన్నారు. అందరూ ఆ స్థితిని చేరుకోగలగాలి. అంతర్యామిని గుర్తించి దర్శించుకోగలగాలి. ఈ దేహమునందున్న దేహిని గుర్తించగలగాలి. అందుకే విశ్వవిరాట్ స్వరూపుడనైన నేను మీ స్థాయికి అంటే క్రిందికి దిగివచ్చి మీకు అందరికీ అర్థమయ్యేలా చెబుతున్నాను, చేసి చూపిస్తున్నాను. ఇంత కంటే అదృష్టము ఇంకొకటి ఉందా? ఉంటుందా?

213. ప్రవృత్తి, నివృత్తుల గురించి కొంచం విశదపర్చండి స్వామి?

మానవ జీవితం సంయోగ వియోగాత్మకమైన మహోత్తుంగ తరంగములతో కూడిన సాగరము వంటిది. కాబట్టి ఎవరికైనా కష్టనష్టములు తప్పవు. ఇది ప్రవృత్తి ధర్మము. కానీ నివృత్తి ధర్మము వేరే ఉంటున్నది. "అమ్మా నాకు ఆకలి అవుతుంది" అన్నప్పుడు పిల్లవానితో నాయనా! అన్నము భుజించు ఆకలి తీరుతుంది అని చెబుతుంది ప్రవృత్తి తల్లి. కానీ నివృత్తి తల్లి ఆ విధంగా చెప్పదు. నాయనా! నీకు ఆకలైతే అన్నము భుజించు. అయితే ఎట్టి ఆహారమును ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా భుజించాలి అని చక్కగా విచారణ చేసి హితమైన ఆహారమును భుజించు అని హితవు చెబుతుంది. ఆకలి అవుతుందని చేతికి చిక్కినవన్నీ తింటే కడుపు పాడవుతుందని హితవు చెబుతుంది. ఆరోగ్యానికి హాని కలిగించని ఆహారాన్ని మీరు భుజించాలి అని నివృత్తి మార్గంలో ఉండే తల్లి బోధిస్తుంది. ఇది నివృత్తి ధర్మం. ప్రవృత్తి,

నివృత్తుల తత్త్వమును వేదము కూడా చక్కగా బోధించింది. మీకు అవసరమైన వాటి కోసం ఆశపడటంలో తప్పులేదు. కానీ ఆశకు పరిమితి ఉండాలి. పరిమితితో పాటు ప్రమాణమును అనుసరించాలి. నోటికి వచ్చినట్లుగా మాట్లాడ కూడదు. చేతికి చిక్కినదంతా భుజించ కూడదు. మనస్సుకి తోచినదంతా చెప్పకూడదు. ఏ విషయము ఎప్పుడు చెప్పాలి, ఎవరికి చెప్పాలి, ఏ విధంగా చెప్పాలి అని ముందు విచారణ చెయ్యాలి. మీరు చెప్పే విషయాలు ఇతరులను నొప్పించేవిగా ఉండకూడదు. ప్రవృత్తి, నివృత్తుల తత్త్వాన్ని మీరు చక్కగా పాటించాలి. ప్రవృత్తి ప్రకృతి యొక్క స్వభావము. నివృత్తి ఆత్మ యొక్క స్వరూపము. ప్రవృత్తి సంకుచిత తత్త్వాన్ని బోధిస్తుంది. నివృత్తి హృదయాన్ని విశాలం కావిస్తుంది. కావున నివృత్తినే మీరు ప్రధానంగా తీసుకోవాలి.

214. కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు అని చెబుతారు. వీటిలో సాధకుడు దేనిని ఎన్నుకోవాలి స్వామి?

కర్మ మార్గము కమనీయ పుష్పము. భక్తి మార్గము పచ్చి కాయ వంటిది, జ్ఞాన మార్గము ఫలము వంటిది. ఈ మూడు ప్రత్యేకం కావు. చెట్టున పువ్వు లేక కాయ పుట్టదు. కర్మ లేకుండా భక్తి మార్గము మీలో ప్రవేశించదు. కాయ లేకుండా ఫలము కలగబోదు. అనగా భక్తియే లేకపోతే జ్ఞానమనే పరిపక్వత ఏర్పడదు. జ్ఞానము అనే శిఖరము చేరాలంటే భక్తిని మీరు అనుభవించాలి. భక్తి స్థాయిలో జీవితం పరిపక్వ స్థితికి తెచ్చుకోవాలంటే కాయలనే కర్మల యందు ప్రవేశించాలి. కనుక కర్మ వలన భక్తి, భక్తి వలన జ్ఞానము లభిస్తుంది. కర్మ లేక భక్తి, భక్తి లేక జ్ఞానము అనుభవించుటకు వీలు లేదు. ఈ మూడు మార్గముల గమ్యము ఒక్కటే. అంతేకాక ఇంకొక ఉదాహరణ కూడా చెప్పుకోవచ్చు. పొయ్యికి పెట్టే మూడు రాళ్ళను కర్మ, భక్తి, జ్ఞాన యోగాలుగా చెప్పవచ్చు. పొయ్యి మీద గిన్నె పెట్టి, గిన్నెలో నీళ్ళు పోసి, బియ్యం పోసి, గిన్నె క్రింద మంట పెట్టాలి. అప్పుడే అన్నం ఉడుకుతుంది. గిన్నె భక్తి, నీరు కర్మ, అగ్ని జ్ఞానము. ఈ మూడింటి చేరికయే కదా అన్నం వండటం. ఏది లేకపోయినా వంట పూర్తి కాదు. అలాగే ఈ మూడు లేకపోతే మీరు గమ్యంచేర లేరు. పువ్వు లేనిదే కాయ రాదు, కాయ లేనిదే ఫలము కానేరదు. ఇవి వేరు వేరు కావు. మోక్ష సాధనకు ఇవి సోపానాలు. అందుకే కర్మ లేకుండా భక్తి, భక్తి లేకుండా జ్ఞానము లేదు. ఈ మూడు మార్గముల గమ్యం ఒక్కటే. అదే మోక్షము. ఇవి త్రిమూర్తుల వంటివి. త్రివేణి సంగమం వంటివి.

215. భగవంతునికి మమ్ములని మేము ఏవిధంగా అర్పించుకోవాలి?

నీవు నాకు శరణాగతుడివి కావటం తప్ప మీ నుండి నేను కోరేది ఏమీ లేదు. నేను అంతకన్నా వేరేదాని కోసం ఎదురుచూడడంలేదు. నీవు నాకు సర్వశ్య శరణాగతి ఎలా కావాలో తెలుసుకున్న తరువాత నేను మీ వ్యవహారంలో జోక్యం చేసుకుంటాను. అప్పుడు దేనికీ భయపడవలసిన అవసరం లేదు. అయితే మీ ప్రవర్తన నమ్మనట్లుగా ఉంది. మీరు శరణాగతులు కావటం అంటే మీ కష్టాలు, బాధలు, దుఃఖాలు, సమస్యలు సర్వం మీరు వదిలి పెట్టడం. వాటిని నా చేతుల్లో పెట్టి నిరీక్షణా బాధ్యతను పూర్తిగా నాకు అప్పగించటము. మీ భారమంతా పూర్తిగా నాదేనని నన్ను పూర్తిగా విశ్వశించి నపుడు, మిమ్మల్ని మీరు నాకు సంపూర్ణంగా సమర్పించుకున్నప్పుడు, మీరు నా పైన పూర్తిగా ఆధారపడినపుడు నేను ఏదైనా చెయ్యగలను. చేస్తాను. మీరు కోరుకున్నట్లుగా నేను చెయ్యాలనుకుంటే మీరు నన్ను పూర్తిగా నమ్మనట్లే. భక్తుడు భగవంతుని శరణుజొచ్చిన తక్షణం అతడి భారాన్ని భగవంతుడే స్వీకరిస్తాడు. ఇంక భక్తుడు విచారించవలసిన అవసరమే ఉండదు, ఉండకూడదు. భగవంతుని ఆశ్రయించిన తరువాత కూడా భక్తుడు దుఃఖ పడ్డాడంటే భగవంతుని రక్షణా భారం పైన అతనికి విశ్వాసం లేనట్లే అవుతుంది. నియమ బద్ధమైన జీవితాన్ని దూరంచేసుకుంటూ, భవిష్యత్తును నాశనంచేసుకుంటూ మానవతా విలువలను మర్చిపోతున్నారు.

216. సద్గురువును చేరిన శిష్యుడు ఏ విధంగా తన జీవన విధాన్ని మార్చుకోవచ్చు స్వామి?

శాస్త్ర విచారణ మరియు గురువు యొక్క ఉపదేశము స్వప్రయత్నంతో సిద్ధిస్తాయి. సద్గురువనే జ్ఞాన సూర్యుడు శిష్యుని హృదయ గుహ లోపల ఉన్న అజ్ఞాన అంధకారమనే చీకటిని పారద్రోలే ప్రయత్నం చేసి దానిని పారద్రోలగలడు. దానిని నాశనం చెయ్యగలడు. కనుక సూర్య కాంతి కంటెనూ గురువు అనుగ్రహ కాంతి గొప్పది. బ్రహ్మజ్ఞాని అయిన సద్గురువుతో సంబంధము ఏర్పడినపుడు ఆత్మజ్ఞానము సులభముగా సాధ్యమగును. ఆత్మ మరియొక ఆత్మతోనే అనుసంధానము ఏర్పర్చుకొనుటవలన మాత్రమే ఇది సాధ్యమగును. ఆత్మ మరియొక ఆత్మ వల్ల మాత్రమే ప్రేరణ పొందగలదు. గ్రంధపఠనము వలన ఆత్మవికాశము కలుగదు. ఆత్మజ్యోతి ప్రకాశించుటకు కావలసిన ప్రేరణాశక్తి గ్రహించువాడు శిష్యుడు. గురువు నుండి ప్రేరణా శక్తిని గ్రహించు అర్హత శిష్యునికి ఉండవలెను. చిత్తశుద్ధి లేనిదే పారమార్ధిక చింతన కలుగదు. అచంచలమైన విశ్వాసము కలిగిన శిష్యులు మాత్రమే గురూపదేశం పొందే అర్హత కలిగి ఉంటారు.

అసలైన ఆర్తి కలిగినపుడు పారమార్థిక చింతన, దానిని పొందవలెననెడి పరితపన లోపల ఉద్భవించినపుడు భగవంతుడే సద్గురువు రూపమున నీ చెంత చేరి తత్వోపదేశం చేస్తాడు. ఇది సత్యం. శాస్త్రజ్ఞానము, శ్రద్ధావ్యాఖ్యానము, వాక్పటిమ, ఉపన్యాస పాండిత్యము మాత్రమే లక్షణము కాదు. ఇవి పాండిత్య ప్రదర్శనకే కానీ పారమార్థిక చింతనకు పనికిరావు. సాధనకు అంత కంటే పనికిరావు. తాను స్వయముగా ఆత్మదర్శనం చేయగలిగిన సద్గురువు మాత్రమే శిష్యుని యందు అసలైన ఆధ్యాత్మిక ప్రేరణను కల్గించగల్గును. పరిపక్వ హృదయములో సద్గురువు ద్వారా ఉపదేశము పొందుట వలన, త్రికరణ శుద్ధితో గురువు యొక్క ఆజ్ఞ పాటించుటవలన మాత్రమే ఆత్మ జ్ఞానము కల్గును. గురువు నుండి ఉపదేశము పొందిన తరువాత సాధకుడు తన లక్ష్యం యందే ధ్యానము కేంద్రీకరించి నిర్ణీత మార్గమున ఆత్మ జ్ఞానమును పొందగలడు. గురువు లభించి ఉపదేశము పొందినప్పటికీ కూడా అభ్యాసం లేనిదే తెలుసుకున్న దానిని ఆచరణ పెట్టుటకు ప్రయత్నించనిదే ఆత్మ **సాక్షాత్కారము** కలుగదు. ఈ రకంగా సద్గురువును ఆశ్రయించిన సాధకుడు తప్పక ఆత్మ **సాక్షాత్కారాన్ని** సాధించాలి అన్న తాపత్రయము, తపన అన్నది తప్పక ఉండవలసిన లక్షణములు.

217. భౌతిక ప్రపంచములో భార్యా పిల్లలు, ఆస్తిపాస్తులు ఇవన్నీ కలిపి భవసాగరం అని అనవచ్చునా స్వామి?

లోకంలో మీరు ఎందరో పండితులను చూస్తూ ఉంటారు. వేదాలు, ఉపనిషత్తులు, వాటిని వివరించే శాస్త్రాలు బాగా అధ్యయనం చేసి అక్కడక్కడా సభలలో తమ వాగ్ధాటితో సభ్యులను ఆకట్టుకుని ఆనందింపచేస్తూ ఉంటారు. తగిన పారితోషికాలు, సన్మానాలు పొంది దండిగా ధనం సంపాదిస్తుంటారు. జ్ఞాన బోధ చేస్తున్నారే కానీ తాము మాత్రం ఒక విధంగా అజ్ఞానంలో ఉండటాన్ని మీరు గమనిస్తూనే ఉంటారు. తామే శ్రేష్టులమనే భావం, పాండిత్య గర్వం, తక్కిన వారంతా తనకన్నా తక్కువ వారనే దృష్టి, ఎవరివల్లనైనా చిన్న పొరపాటు ఏదైనా జరిగితే కోపగించడము, అనుచితంగా ప్రవర్తించడము, నిజ జీవితంలో కామ క్రోధాది గుణములకు దాసులవ్వటం మీరు గమనించే ఉంటారు. ఇంత పాండిత్యము, ఇంత బోధనాపాటవం ఉన్నా వారిలో దేహాత్మభావాన్ని పట్టి నిలుపునది ఈ మాయా శక్తియే. తెలియని వారిని తిప్పలు పెట్టుటలో ఆశ్చర్యం లేదు గానీ అన్నీ తెలుసు అనుకున్న వారిని కూడా అజ్ఞానంలో పడవేయడమే ఈ మాయా శక్తి యొక్క అఘటిత ఘటనా పటుత్వమని చెప్పవచ్చు. సకల జీవులు అనంతమైన భవసాగరంలో కొట్టుమిట్టాడుతున్నాము అంటారు. ఇంతకూ భవసాగరం అంటే ఏమిటి? భార్యా పిల్లలు,

వాళ్ళను పోషించడము, కష్ట సుఖాలు, చింతలు, చికాకులు, రోగాలు, బంధు వియోగాలు ఇదే సంసార సాగరం. దీన్ని ఈదలేకున్నామని చాలా మంది భావన. కానీ, నిజానికి ఇది కాదు. జీవుడు జననమరణ చక్రంలో పడి తిరుగుతూ ఉండటమే సంసారం.

పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం.

ఇదే దుస్తరమైన భవసాగరం. దేహమే నేననే అజ్ఞానంలో, భ్రాంతిలో జీవించే వారందరిదీ ఇదే స్థితి. ఇలా భ్రమింప చేసేది మాయయే. దృశ్యకల్పితమైన ఈ జగత్తు మిధ్య అనీ, సర్వ వ్యాపకమైన పరమాత్మయే సత్యమనీ అదే తాననే జ్ఞానం కలిగితే తప్ప ఈ సంసారం తొలగదు. ఈ జ్ఞానం కలిగిన తక్షణమే తాను పరమాత్మయే కాని జీవుడు కాడు. తక్కిన జీవులంతా పరమాత్మే కానీ వేరు కాదు అనే స్థితిని పొందటం చేత సంసార సాగరం దాటటం సంభవిస్తుంది. అఖండమైన ఆత్మను పాంచ భౌతిక దేహాదులచే వేర్వేరుగా కనబడునట్లు చేసిడిది మాయయే. ఇదే దీని అఘటిత ఘటనా పాటవం.

218. సన్యాసమంటే ఏమిటి? త్యాగమంటే ఏమిటి? వీటి స్వరూపాలు ఏమిటి? తెలియపర్చండి స్వామి.

మంచి ప్రశ్నయే అడిగావు. మంచి సమాధానమే ఇస్తాను. కామ్యము అనగా కోరికలను మానివేయుటయే సన్యాసము అని, కర్మ ఫలాలను విడిచిపెట్టడమే త్యాగమని పండితులు చెప్పింది మీరువిని ఉండవచ్చు. కాని అది కొంత వరకూ సత్యమే కానీ పూర్తిగా కాదు. త్రివిధాలైన ఈ త్యాగం విషయంలో నా అభిప్రాయము ఇది విను. యాగ, దాన, తపస్సులనే మూడు కర్మలను మాత్రం ఎన్నడూ విడువకూడదు. అవి చిత్తశుద్ధిని కలిగిస్తాయి. అయినప్పటికీ ఆ యజ్ఞయాగాది కర్మలు కూడా కర్తృత్వ మమకారాన్ని, ఫలాపేక్షను విడిచిపెట్టి చెయ్యాలన్నదే నా నిశ్చయమైన అభిప్రాయం. విద్యుక్త కర్మలను విడిచిపెట్టడం ఎప్పుడూ న్యాయం కాదు. శరీర కష్టాలకు భయపడి కర్మలను మానివేయడం మంచిది కాదు. దేహధారులకు కర్మలను ఆశాంతమూ వదిలివేయుట సాధ్యము కాదు. అందువలన కర్మఫలాన్ని వదిలినవాడే నిజమైన త్యాగి. చెడు స్వభావం కలవారు అంతా తానే చేస్తున్నట్టు అహంకారంతో సంచరిస్తారు. ధర్మాధర్మాలయందున్న ప్రవృత్తి నివృత్తులను, కర్తవ్యాకర్తవ్యములను, భయాభయాలను, బంధమోక్షములను స్పష్టముగా తెలుసుకున్నవాడే బుద్ధివంతుడు. ప్రకృతి వలన పుట్టిన సత్వరజస్తమో గుణాలకు అతీతమైనది ఏదీ దేవతలలో కానీ, ముల్లోకాలలో కానీ ఉండదు.

219. మానవుడికున్న ఆశ గురించి కొంచెం విశదపర్చండి స్వామి.

మానవుడికి శ్వాసకన్నా ఆశ గొప్పది. శ్వాస ఆగిపోయినా ఆశ మాత్రం చావదు. అసలు ఆ మాటకొస్తే క్షణక్షణం చావకుండా మనిషిని బ్రతికించేది ఈ ఆశే. జూదంలో ప్రతీసారీ ఓడిపోతున్నా ఆఖరి పందెంలోనన్నా గెలుపు సాధించుకోలేమా? అన్న ఆశ పీడిస్తుంది. లేకపోతే ధర్మరాజంతటి మహానుభావుడు సర్వసంపదలూ కోల్పోయి, సహోదరులను జారవిడుచుకున్నా ఆశ చావక ఆఖరికి అర్ధాంగి ద్రౌపదిని కూడా కౌరవార్పణం చేసేదాకా నిగ్రహించుకోలేక పొయ్యాడు. ఆశ ఉండాల్సిందే, నిరాశ పోవాల్సిందే. కానీ ఈనాడు మానవుల్లో ఉంటున్నది ఆశ కాదు దురాశ. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందన్న సామెతలా ఆశ హద్దు మీరితే, హద్దు దాటితే అది దురాశే అవుతుంది. అది అన్ని అనర్ధాలకు దారి తీస్తుంది. తనకూ, తన కుటుంబానికీ తగినంత తిండి, బట్ట, ఇల్లు, ఉండాలనుకోవటంలో తప్పు లేదు. అందుకోసం కష్టపడటంలోనూ తప్పు లేదు. అది సహజమైన ఆశ. అందుకు సక్రమమైన మార్గంలో శ్రమించడం ఇంకా ఆనందం. అవసరాలు వేరు, విలాసాలు వేరు. కడుపులో ఆకలి తీరేందుకు తినేది తిండి. అలా కాకుండా ఐదు నక్షత్రాల హోటలుకు వెళ్ళి ఫోర్కుల్ని, స్పూనుల్ని సుతారంగా వేళ్ళతో పుచ్చుకొని ఖరీదైన పదార్ధాలను గోళీకాయంత సైజులో తీసుకుని చప్పరిస్తూ లొట్టలెయ్యయ్యడం అవసరం కాదు అది ఆడంబరం. అలాంటి విందు పార్టీలు, మందు పార్టీలు చెయ్యాలన్నా, చేసుకోవాలన్నా తగిన ఆర్ధిక స్థోమత వనరులు ఉండాలి. రోజల్లా చెమటోడ్చి శారీరిక శ్రమ చేసినా, ఆఫీసుల్లో మేధా శక్తితో శ్రమించినా, అందుకు లభించే భత్యాలు, వేతనాలు సామాన్య మానవుని జీవనానికి సరిపోవడం అంతంత మాత్రమే. అందుకని అదనపు సంపాదన వైపు మనిషి దృష్టి మళ్ళుతుంది. శ్రమ పడకుండానే ధనార్జన చేసే మార్గాలను అన్వేషించడం మొదలవుతుంది. ఉద్యోగ ధర్మాన్ని విస్మరించో, ఒకొక్కసారి అతిక్రమించో అక్రమార్జనకు పూనుకుంటాడు. అవినీతి పంధాన పయనిస్తాడు. అపార ధన, కనక, వస్తు, వాహనాదులను సమకూర్చుకుంటాడు. ఎంత సంపాదించినా తనివి తీరదు. అలాంటి సంపాదనలోనే సుఖ జీవనం ఉన్నదని భ్రమిస్తాడు. మనిషికి అసలు దుఃఖ జీవనం అప్పుడే ఆరంభవవుతుంది. క్షణక్షణం బ్రతుకు భయం భయంగా తయారవుతుంది. ఈ సంపాదనను **సంరక్షించుకునే** తాపత్రయంలో తిండి సరిగ్గా తినలేడు. క్రమంగా ఆరోగ్యం మందగిస్తుంది. ఔషధ సేవ నిత్య కార్యక్రమము అవుతుంది. టెన్షన్ పెరిగిపోతుంది. దాంతో బీ.పీ పెరుగుతుంది. ఈ లోగా ఏ ఏ.సి.బి వారో దాడి చేసి పట్టుకుంటారు. పరువు గంగలో కలిసిపోతుంది. పరపతి పల్చబడిపోతుంది. పార్టీలో పొగడిన నోళ్ళే

బాహాటంగా తెగడుతాయి. అవసరానికి ఒక్కరూ ఆదుకోరు. ఉన్నదంతా ఊడ్చుకుపోయాక చివరకు ఏమి మిగిలింది? వెనక్కు తిరిగి చూస్తే అంతా శూన్యం. ప్రతి నిత్యం ఇలా ఎంతమందో బజార్నపడి బ్రతుకు తెరువుకోసం బిచ్చమెత్తలేక ఆత్మహత్యలకు పూనుకుంటున్నా మనిషికి ఇంకా కనువిప్పు కావడంలేదు. సంపద పెరిగిన కొలదీ సమస్యలధికమవుతాయి. సమాధి దగ్గరకు చేరుస్తాయి. కనుక కల్గిన దానితో తృప్తిగా జీవించినట్లైతే పరలోకం మాటెలా ఉన్నా ఈ లోకంలో బ్రతికినన్నాళ్ళు సుఖజీవనం సాగించవచ్చు. సుఖ జీవనానికి సంతృప్తే ప్రధాన సాధనమని ఒప్పుకుంటారా? లేదా?

220. స్వామీ! సర్వ దేవతలూ, సర్వ తీర్థములూ దేహంలోనే కొలువై ఉన్నాయని చెబుతారు కదా. అది ఎలా?

అవును తెలుసుకోవలిసిన విషయమే. శరీరమందు దేవతలందరూ వసింతురు. వారు వివిధ అవయవములకు అధిష్టాన దేవతలై ఉన్నారు. త్యాగరాజు మూలాధారము నందు, జంబుకేశ్వరుడు స్వాధిష్టాన మందును, కాళహస్తీశ్వరుడు మణిపూరకమునందు, నటరాజు అనాహతమునందు, విశ్వేశ్వరుడు ఆజ్ఞాచక్రమునందు, కాళహస్తీశ్వరుడు విశుద్ధమునందును, శ్రీకంఠేశ్వరుడు సహస్రారమునందును నివసింతురు. సమస్త పవిత్ర **క్షేత్రములు** కూడా ఈ శరీరమునందే ఉన్నవి. ఫాల భాగమున కేదారము, నాసికాగ్రమందు అమరావతి, వక్షస్థలమందున **కురుక్షేత్రము**, హృదయమునందు ప్రయాగ ఉన్నది. అంతే కాక శరీరమునందు గ్రహములన్నియు తమకు ప్రత్యేక స్థానములను పొందియున్నవి. సూర్యుడు నాదచక్రమునందును, రాహువు ముఖమునందును, బృహస్పతి మనిపూరమునందును, చంద్రుడు బిందుచక్రమునందును, అంగారకుడు నేత్రములందును, బుధుడు హృదయమునందును, శుక్రుడు స్వాధిష్టానము నందును, శని నాభిస్థానము నందును, కేతువు ఉదరము నందును నివసిస్తున్నారు. అసంఖ్యాకములగు నదులు మరియు పర్వతములు కూడా శరీరమునందు ప్రత్యేక స్థానముల యందు ఉన్నవి. భౌతిక ప్రపంచమునందు ఉన్నవి అన్నియు శరీరమునందు కూడాను మీకు లభిస్తాయి. ఈ శరీరము ఒక సూక్ష్మ ప్రపంచము లాంటిది. అందుకనే దీనిని పిండాండము అని చెప్పబడును.

221. స్వామీ! మేము మా ఊహలకు, ఆశలకు తగ్గట్టుగానే మీరు ప్రతిస్పందించాలి అని కోరుకుంటాము.

ఇది అజ్ఞానమే కదా?

తప్పకుండా. మీ భక్తికి మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకో అనుగ్రహిస్తాను అని అడిగితే ఏం కోరుకుంటారు? మీకు సర్వ సుఖాలు అందించగల ఏర్పాటేదైనా కోరుకుంటారు లేదా కష్టము లేని సుఖవంతమైన జీవితాన్ని అర్థిస్తారు. జీవితం పూలపాన్పులాసాగే రకరకాల వరాల్ని అనుగ్రహించమని ప్రార్థిస్తారు. అంతే తప్ప పూర్వజన్మల కర్మానుభవాన్ని అనుభవించటానికి సిద్ధపడరు. ఎందు చేతనంటే పూర్వ జన్మలో పుణ్య కార్యాలు తప్ప ఏనాడూ పాపము చేసి ఎరుగని పుణ్యమూర్తులుగా మిమ్మల్ని మీరు భావించుకుంటారు. అందు చేత భగవంతుడు కూడా మీ ఊహలకు, ఆశలకు తగ్గట్టుగానే స్పందించాలని, అనుగ్రహించాలని తపన పడతారు. కానీ ఒక్కసారి అయినా నేను పుణ్యమూర్తినేనా? నా కోరిక సమంజసమేనా? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోరు. నా ప్రేమ బాటలో, సేవా మార్గంలో పయనిస్తున్న సాధకుడు మాత్రం ఈ ప్రశ్న వేసుకునియే తీరాలి. ఎందుచేతనంటే అలనాడు గీతను బోధించిన నన్ను ఈరోజు దర్శించుకుంటూ నా కనుసన్నలలో మెలగుతున్నారు కాబట్టి దానికి అనుగుణంగా కష్టాల పరంపరను అవసరమైతే అనుభవించటానికి సిద్ధ పడాలి. అప్పుడే భగవంతునికి దగ్గరవుతారు, నా దివ్య ప్రేమను అందుకోగలుగుతారు. కురుసభలో దుర్భరమైన అవమానాన్ని అనుభవించకపోతే శ్రీ కృష్ణుని దివ్యానుగ్రహం లభించెడిదా? రాయిగా ధూళిలో పడి ఉండి వేచి చూచుటలోనే శ్రీరాముని దివ్యానుగ్రహం పొందింది. బాల్యం నుండి వృద్ధాప్యము వరకు సర్వ సుఖాలు త్యజించి జీవితమంతా <u>**నిరీక్షించి**</u> ఉండకపోతే రాముని అనుగ్రహం పొందేదా? అందుచేత కర్మానుభవాన్ని బట్టి లభించే కష్టసుఖాల్ని భగవంతుడిని ప్రార్థిస్తూ అనుభవించండి. అయితే ఇక్కడొక ధర్మసందేహం మీ మనస్సులలో తలెత్తుతూ ఉండవచ్చు. మీ యొక్క కర్మానుభవాన్ని బట్టి కష్టాలను అనుభవించవలసి వస్తే మరి దైవాన్ని నమ్ముకుని ప్రయోజనం ఏమిటి అని? భగవత్ విశ్వాసం మీ కష్టాల్ని అనుభవిస్తున్నట్లు తెలియకుండగనే అనుభవింపచేస్తుంది. దీనికి ఉదాహరణగా ఒక కథ చెప్పనా? బాగా డబ్బు కలిగిన ఒక ధనవంతునికి లేక లేక ఒక బిడ్డ కలిగినాడు. ఆ బిడ్డను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నాడు. వాడి జన్మ నక్షత్రాన్ని పండితులకు చూపించగా వారు నీ బిడ్డ <u>**ఆయుష్**</u>ప్రమాణము 15 సంవత్సరములే అని చెప్పగా ఈ ధనవంతునికి చాలా బాధ కలిగి తన గురువు వద్దకు వెళ్ళి విషయాన్ని వివరింపగా గురువుగారు నీవు విచారించవద్దు. దైవాన్ని నమ్ముకో, నిరంతరం దైవ నామస్మరణలో కాలం గడుపు. ధర్మకార్యాలు, పుణ్యకార్యాలు చెయ్యి. నీ కొడుకు గురించి ఆలోచించకు. వాడి సంగతి దేవుడు చూచుకుంటాడు అని చెప్పాడు. గురువు గారు చెప్పినట్లుగా

ధర్మకార్యాలు, పుణ్యకార్యాలు చేస్తూ కాలం గడపసాగాడు. కొద్ది సంవత్సరాల తర్వాత ఒక రోజు అతనికి కలలో తన పుత్రుడు మరణించినట్లుగా కలవచ్చి కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నాడు. నిద్ర నుండి లేచి ఇదంతా కలనా అనుకుని గురువు వద్దకు వెళ్ళి జరిగినదంతా చెబుతూ బాధపడ్తూ వున్నాడు. కళ్ళు ఎర్రబడి ముఖం ఉబ్బిపోయి ఉన్నది. ఇది చూచి గురువుగారు బిడ్డా! నీవు పుత్రవియోగ దుఃఖాన్ని అనుభవించవలసి ఉన్నది. దాన్ని నీవు అనుభవించావు. కానీ నీపుత్రుడు మరణించలేదు. నీకర్మానుభవమూ, భగవదనుగ్రహం రెండూ నెరవేరాయి. భగవంతుని కృప ఇలానే ఉంటుంది. మీకు కష్టాలను అనుభవిస్తున్నట్లు తెలియకుండగనే అనుభవింపచేస్తాడు. అందుకే దైవం పైన అచంచల విశ్వాసము కలిగి ఉండాలి. అవగాహన కల్గి ఆచరించవలసిన జీవిత సత్యమిది. జీవితంలో ఎదురయ్యే అనేక కష్టాల్ని, సమస్యల్ని చూచి భయపడుతారు. భయం భక్తుడి అవిశ్వాసానికి నిదర్శనం. ఎంతటి దుర్భరమైన కష్టాలనైనా అచంచల విశ్వాసంతో అనుభవించటానికి సిద్ధంకండి. ఆ కష్టాల్ని దూదిపింజల్లా నేను తొలగిస్తాను. నీ కర్మఫలాన్ని నీవు అనుభవిస్తేనే కదా నీకు మంచి చేసే అవకాశం నాకు వస్తుంది. సుఖాన్నైనా, దుఃఖాన్నైనా భగవత్ ప్రసాదంగా భావించండి.

222. మానవుడికి మాత్రం ప్రత్యేకంగా అనుగ్రహించబడిన విచక్షణా జ్ఞానాన్ని కర్మాచరణ యందు సక్రమంగా వినియోగించి కర్మాచరణ చేయుటే పుణ్య కర్మ లేక సత్కర్మగా గుర్తించబడుతుందా?

చాలా బాగా గుర్తించావు. మనస్సు నందలి ప్రేరణే కర్మాచరణకు పునాది. అట్టి ప్రేరణ యొక్క యుక్తాయుక్తములను మంచి చెడ్డలను బుద్ధి ద్వారా విచారణ చేయు విధానమునే విచక్షణా జ్ఞానమని తెలియనగును. ఈ సందర్భముగా తెలుసుకొనవలసిన అతి ముఖ్యమైనదేమనగా కర్మాచరణ జరుపబడే విధానమెట్టిది? అనగా కర్మాచరణకు మనస్సు ఆలోచన లేక యోచన ప్రధానము. మనస్సు ఆదేశించిన మేరకే ఇంద్రియములచే ఆయాకర్మలు ఆచరింపబడును. అట్టి కర్మల యొక్క దోషాదోషముల ప్రమేయము, ప్రభావము ఇంద్రియములకు వర్తింపదు. సంబంధముండదు. అనగా ఆలోచనలు, యోచనలు ప్రధానము. మనస్సు ఆలోచించిన మేరకే ఇంద్రియములు కర్మాచరణకు పూనుకొనును.

223. మనిషివా? పశువువా అని కోపం వచ్చినపుడు వాడకం సహజంగా జరుగుతుంది అంటే దీని అర్థము

విశదీకరించండి స్వామి.

జీవత్వం నుండి శివత్వమునకు, నరత్వము నుండి నారాయనత్వమునకు, మానవత్వము నుండి మాధవత్వమునకు చేర్చగలిగెడిది 84 లక్షల జీవరాసులలో మానవులకొక్కరికే దైవముచే ఏర్పాటు చేయబడినది. కారణం మానవాళికొక్కరికే పైచూపుగల విధంగా దేహమును నిర్మించటం జరిగింది. ఎట్లనగా దేహనిర్మాణంలో మానవుని వెన్నుపూస నిలువుగా ఉండుటచే మానవుడు ఎదురుగా ఉన్నవాటిని, పైనున్న వాటిని, క్రింద ఉన్న వాటినీ చూడగలడు. కానీ జంతుజాలమునకు అధోదృష్టియే కాని ఊర్ధ్వదృష్టి ఉండదు. కారణం వాటి శరీర నిర్మాణం నందు వెన్నెముక అడ్డంగా నిర్మించబడుటయే. కనుక వాటి చూపు ఎదురుగానున్న వాటిపైన, క్రిందనున్న వాటిపైన ప్రసరించగలదు. వాటి జీవితం అంతా ఆహార సంపాదనకు, సంతానాభివృద్ధికే అంటే వాటి వరకే. కుటుంబ పోషణా బాధ్యత లేదు. ప్రాణ రక్షణకే బాధ్యత ఇచ్చుట వలన అన్యమైన జీవులకు హాని కలుగునేమోయని కానీ పాపం అనెడి భావము కానీ ఉండదు. కారణం వాటికి భగవంతునిచే పాప, పుణ్య, సుఖ, దుఃఖ, మంచి, చెడుల మధ్య బేధము కానీ, ప్రభావం చూపించెడవి కానీ, గుర్తించెడవి కానీ అంటే విచక్షణా జ్ఞానం అనుగ్రహించకపోవుటయే. విచక్షణా జ్ఞానం కలిగిన మానవుడు విచక్షణ లేకుండా ప్రవర్తించినపుడు సహజంగానే మనిషివా? పశువువా? అని అడుగుతారు. అంతేకాక మనిషిలో విచక్షణా జ్ఞానం నశించి అరిషడ్వర్గములలో అతి పెద్దదైన క్రోధాన్ని ప్రదర్శించుచూ తనను తాను మర్చిపోవుచూ నోటికి ఇష్టము వచ్చినట్లుగా తూలనాడుతూ అసభ్యమైన పదజాలంతో తనకు తానుగానే నేను మనిషిని కాను అంటూ తాను పశువు గుణాలను ప్రదర్శిస్తూ నేను మనిషిని కాను పశువును అని చెప్పుకుంటాడు.

224. స్వామీ ఈ ప్రాపంచిక జీవన సరళిలో భయము లేని వారెవ్వరు?

నిజమే నీవు అన్నది. ఈనాటి మానవులకు అనేక రకాల భయాలు చోటుచేసుకుంటున్నాయి. భోగములను అనుభవించెడివారలకు రోగభయం, మంచి కులములో పుట్టిన వారికి కుల భ్రష్టులగుదురేమో అని భయం, ధనమున్న వారికి రాజశాసనముల వలన పన్నులు ఉండునని భయము, మౌనంగా జీవించెడి వారకు దీనులమన్న భయము, భలాఢ్యులకు వారలను మించిన బలాధికులగు శత్రువులు కలరన్న భయము, రూపవంతులకు వార్ధక్య భయము, పండితులకు వాద ప్రతివాదకుల భయము, గుణవంతులకు దుర్జనుల వలన భయము. చివరకు శరీరం నశిస్తుందన్న భయము. శరీరధారులకు భువిపైన అంతా

భయమే. కానీ వారిలో భయము లేని వారు ఒక్కరే ఒక్కరు. వారే వైరాగ్యం పొందినవారు. అనగా రాగ ద్వేషములకు అతీతులు. ఎటువంటి పరిస్థితుల యందైనా ఇష్టా ఇష్టములు, రాగ ద్వేషములు లేని వారలే సదా దైవాన్ని తమ స్మృతి యందు ఉంచుకునేడి వారు. వారలకు దైవమే ఆశ్రయము, ఆశ్రమము. యావత్ సృష్టి దైవానికి ఆధీనమై ఉండగా దైవము మాత్రము భక్తుని ఆధీనములో ఉండుట వలన నిజభక్తునికి ఎటువంటి భయము, ఎవరి వలన కానీ, ఎట్టి పరిస్థితులలో కానీ కలుగదు అన్నది నిర్వివాదాంశంగా చెప్పవచ్చు. కనుకనే సర్వదా, సర్వకాలేషు, సర్వ భావేషు హరిచింతన ఉత్తమము. ఇదియే జ్ఞాన మార్గము. ఈ మార్గమును విశ్వసించి చెరించెడి వారలే ధన్య జీవులుగా పరిగణించబడుదురు.

225. మానవ జీవన లక్ష్యం ఏమిటి? ఏ దిశగా కొనసాగుతుంది?

ఈ పునర్జన్మను తప్పించుకుని అంటే జన్మరాహిత్యాన్ని పొందే అవకాశం మానవ జన్మకే ఇవ్వబడింది. అర్ధమైనదా? అంటే జన్మరాహిత్యాన్ని పొందే అవకాశం మానవ జన్మకే ఇవ్వ బడింది. అందుకని అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఏ ప్రయోజనం కోసమైతే ఈ మానవ జన్మ లభించిందో ఆ ప్రయోజనం కోసమే జీవితాన్ని వెచ్చించాలి. వ్యర్ధ కార్య కలాపాలలో వృధా చేసుకుంటే జన్మసార్ధక్యత చేకూరదు. ప్రతీ మనిషికీ ఏదో ఒక ప్రయోజనం నిర్ధారించబడే ఉంటుంది. ఆ **లక్ష్యాన్ని** గుర్తించి దాని సాధనకై కృషి చేసి సఫలీ కృతులవ్వటమే జీవిత లక్ష్యం. ఈ మహత్తర సత్యాన్ని విశిదీకరించటానికి పరమాత్మ మానుషరూపంలో అవతరించి తద్వారా మానవజాతికి దానిని ఎరుక పరుస్తాడు. సమ దృష్టి, ప్రశాంత చిత్తము, ఆగ్రహ అహంకార రహితము, దయార్ధ్రహృదయము, పరమాత్మ సేవ వంటి సులక్షనములు కలిగి మహాత్ములై మెలిగి విషయ లాలసతకు, ఇహలోక సుఖాలకు బానిసలు కాకుండా నియమ నిష్టలతో భగవత్ సేవకై జీవనం సాగించాలి. అప్పుడే ఆత్మసంతృప్తి, ఆత్మానందం అనుభవం లోకి వస్తాయి. జన్మసార్ధక్యత లభించి ముక్తి మార్గం సులభమవుతుంది. ఇంతకన్నా లక్ష్యం ఏమిటి? దారి ఏమిటి?

226. మానవుడు ఎటువంటి బంధాలలో చిక్కుకుంటున్నాడు స్వామి?

ఈ నాటి మానవుడు ఏడు రకాల పగ్గాలతో అంటే త్రాళ్ళతో కట్టబడి ఉంటున్నాడు.

i. శరీరం

ii. కర్మ

iii. రాగం

iv. ద్వేషం

v. అహంకారం

vi. అధికారం

vii. అజ్ఞానం

అజ్ఞానం అవివేకం నుండి పుట్టింది, అవివేకం అహంకారం నుండి పుట్టింది, అహంకారం ద్వేషం నుండి పుట్టింది, ద్వేషం రాగం నుండి పుట్టింది, రాగం కర్మ నుండి పుట్టింది, కర్మ నుండి పుట్టిందే దేహం కాబట్టి దేహానికి కర్మయే ఆధారం. కర్మకు రాగం కారణం. రాగానికి ద్వేషం ఆధారం. ద్వేషానికి అహంకారం మూలం. అహంకారానికి అవివేకం మూలం. అవివేకానికి అజ్ఞానం మూలం. మొదట అజ్ఞానం నాశనం కావాలి. చీకటి పోవాలి. ఎంత పోరాడినా చీకటి పోదు. చిన్న దీపం ముట్టిస్తే చీకటి పోతుంది. దైవ నామమే దీపం. తమస్సు పోవాలంటే జ్ఞాన దీపాన్ని వెలిగించుకోవాలి. జ్ఞానాన్ని అభివృద్ధి పర్చుకోవటానికి నామం అనే నావను ఆశ్రయించాలి. అత్యంత ప్రధానమైనవి రెండే రెండు. ఒకటి దానము రెండు నామము.అవే అన్నదానము, హరినామము. ఈ రెండు రెక్కలలో జీవన సార్థక్యతను సాధించి భగవత్ తత్వాన్ని అనుభవించవచ్చు.

227. అయితే సద్భక్తి సర్వత్రా లభిస్తుందా? దానికి తరుణోపాయం తెల్పండి స్వామీ?

అట్టి సద్భక్తి సర్వత్రా లభించదు. కేవలం ఒక్క సత్సంగమనెడి సజ్జన సాంగత్యము వలననే లభించగలదు. కానీ లోకరిత్యా ఏ ఒక్కరూ సజ్జన సాంగత్యము వైపు మొగ్గుచూపరు. కారణమేమనగా సజ్జన సాంగత్యము తమకు అనుకూలంగా ఉండక పోవుట ఒక కారణమైతే, ఏ విధంగా మెలగవలెనో నిర్దేశించుట రెండవ కారణం. సజ్జన సాంగత్యము రోగము వచ్చినపుడు సేవించెడి ఔషధము వంటిది. త్రాగినప్పుడు వెగటుగా ఉన్ననూ రోగనివారణ తప్పక కల్గును. అది ఇనుప గొలుసు వంటిది. దానిని పట్టుకుని పైకి వెళ్ళినా మధ్యలో తెగనటువంటిది. సంగ రాహిత్యమునకు దారి చూపును. రాగ ద్వేషాదులను నిర్మూలించుకునెడి మానసిక స్థితికి సహకరిస్తూ మనస్సును అంతర్ముఖ సాధనకు పురికొల్పును. తత్కారణముగా ఆత్మవిచారణ, నిత్యానిత్య వస్తు నిర్ధారణ చేయు సద్బుద్ధిని ప్రేరేపించును. చివరగా తాను

దేహము కాదనియూ, దైవము చేతి యందలి పనిముట్టివి అన్న స్మృతిని కల్గించి, ఆత్మాభిమానము వైపు మొగ్గు చూపును. విషయ వాసనల యెడ విముఖత, ప్రాపంచిక సంబంధ బాంధవ్యముల యెడ ఉదాసీనతకు మార్గ దర్శకత్వం అగును. సజ్జన సాంగత్యము వలన శాస్త్రములందలి విషయములపై విశ్వాసము కలిగి జ్ఞానుల యొక్క సంపర్కము లభించుట కారణముగా మానవునిలో ఆవశ్యకమైన పరిణతి లభించును.

228. అన్ని అనర్థాలకు కారణం మనస్సేనా స్వామి?

అవును అన్ని అనర్థాలకు మూలకారణం మనస్సే. దానిని బాగా గుర్తించినపుడు బాగుపడుతారు. "**<u>డిస్టిల్డ్</u>**" వాటర్ ఉంటుంది. అది చాలా పవిత్రంగా మలినం లేనటువంటిది. వర్షము వచ్చే సమయంలో పాత్ర పెడితే ఆ పాత్రలో పడే నీరు పవిత్రంగా ఉంటుంది. అది నీవు త్రాగు. ఏ జబ్బూ ఉండదు. అదే రీతిగా మీకై మీరు కోరికల చేత మనస్సును మలినం చేసుకుంటున్నారు. ఈ కోరికల వల్లనే మనస్సంతా చెడిపోతున్నది. దాన్ని మీరు ఎప్పుడూ కూడా మలినం చేయకూడదు. పవిత్రంగా పెట్టుకోవాలి. ఏ కోరిక వచ్చినా "ఛీ" ఇది నా మనస్సును పాడుచేసి పెడుతుంది అని దాన్ని ప్రక్కకు నెట్టాలి. కనుక ఇప్పుడు మీరు నేర్చుకొనవలసింది ఏమిటంటే గ్రంధాలు చదువుటతో పాటు మీ భ్రాంతులను తొలగించుకుని మనస్సులో మాలిన్యం లేకుండా చూచుకోవాలి.

229. వైరాగ్యము అంటే కొంచెం విపులీకరించండి స్వామీ.

భగవంతుడు హృదయ మనోబుద్ధులను మనశ్శాంతి నిమిత్తమై అందించాడు. అయితే మానవునికి నేడు సుఖశాంతులు లేకుండా పోతున్నాయి. సుఖ శాంతులు లేనపుడు ఎన్ని ఉండి ప్రయోజనమేమటి? జంతూనాం నరజన్మ దుర్లభం. మానవ జన్మ చాలా దుర్లభమైనది అని వర్ణిస్తున్నారు. దీనికి అనుగుణంగా మీరు నడుచుకుంటున్నారా? భగవంతుడు అనుగ్రహించిన వాటిని
సరి అయిన మార్గంలో ప్రవేశపెట్టుటలేదు. బుద్ధిని సరి అయిన స్థితిలో పెట్టి విచారించుట లేదు. హృదయాన్ని నిర్మలంగా ఉంచుకోవుటలేదు. కనుక మానవునకు శాంతి అత్యంత దూరమైపోతుంది. దీనితో సుఖమనేది కూడా దూరమైపోతుంది. సుఖశాంతులు లేని జీవితం ఒక జీవితమా? కొంత మంది గొప్పవారు

వైరాగ్యమును సాధించాలన్నది ధ్యేయంగా పెట్టుకుని ప్రయత్నిస్తూంటారు. కానీ వైరాగ్యమంటే ఏమిటి? వైరాగ్యమంటే ఆలిని, ఆస్తిని వీడి అడవులకేగుట కాదు. ఈ స్థూల ప్రపంచం జడమైనదిగా విశ్వసించాలి. సూక్ష్మ ప్రపంచం మాయా స్వరూపంగా విశ్వసించాలి. కారణ స్వరూపం ఇది ప్రతిబింబంగా తీసుకోవాలి. ఈ విధంగా మూడింటి అర్ధమును చక్కగా గుర్తించినపుడే మీకు వైరాగ్యమనేటటువంటిది సహజంగా లభిస్తుంది. కానీ ఈనాటి మానవుడు ఈ మూడింటికీ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు. సూక్ష్మమైన ప్రపంచమే దీనికి సరియైన ముక్తిగా భావిస్తున్నాడు. కారణ స్వరూపమైనటువంటి మానవ జన్మమునే వైకుంఠంగా విశ్వసిస్తున్నాడు. స్థూల, సూక్ష్మ, కారణ స్వరూపములతో మానవునికి ఏ మాత్రమూ సంబంధము లేదు. మహాకారణ స్వరూపుడైన భగవంతుడినే విశ్వసించాలి. కనుక ఈ స్థూలమంతా జడ స్వరూపంగా విశ్వసించాలి. ఈ జడంలో ఏమాత్రం చైతన్యము లేదు. లభ్యం కాదు. సూక్ష్మ జీవితమనేటటువంటిది మాయ. మాయ అనగా లేనట్లుగా కనుపించే దానినే మాయ అంటారు. ఇక కారణ స్వరూపము ప్రతిబింబమే. ఇది బింబము కాదు. బింబము కానపుడు దీనిని ఎందుకు బింబముగా విశ్వసించాలి? ఈ మూడింటినీ చక్కగా అర్ధము చేసుకొన్నప్పుడే వైరాగ్యము ప్రాప్తిస్తుంది.

230. కర్మయోగము, రాజయోగము, సన్యాసయోగము గురించి తెలియపర్చండి స్వామి.

నీవు మంచి చేయాలి అన్న సత్ సంకల్పముతో ఆచరించే కొన్ని క్రియలు అనగా బాధలో ఉన్న వారికి శాంతిని చేకూర్చడము, శారీరకంగా దేహమునకు అవసరమైనవి అందిస్తూ వారిని ఆనందపరిచే నిమిత్తమై నీవు చేసే కర్మను సత్కర్మగా పరిగణించవచ్చు. ఈ స్థితి నుండి ఇంకొంత ఉచ్ఛస్థితిలో నీవు చేసే సాధనా పరంపరలోని భాగంగా తోటి జీవుల ఆధ్యాత్మిక ప్రగతికి కావలసిన సోపానాలు తయారు చేస్తూ తన సోపానాలను తయారు చేసుకుంటూ ముందుకు సాగటమే కర్మయోగము. ఈ కర్మ యోగములో జీవుడు ఉద్ధరించబడుతాడు. కావున జీవిని ఉద్ధరించుటకు నీవు ఎప్పుడు సమాయత్తమవుతావో అదే యోగము. కర్మతో కూడుకున్నది కావున అది కర్మయోగము. ఈ కర్మయోగము నుండి నీవు పొందే లక్షల ఆస్తి చివరకు లక్ష్యము లేకుండా ఉండిపోతుంది లక్ష్యము లేని సంపాదన. కానీ ఇచట లక్ష్యంతో కూడిన సంపాదన కావటం వలన కూడగట్టిన ధనము విలువ ఎన్నో రెట్లుగా పెరిగి నీవు రాజువయ్యేలా చేస్తుంది. ఈ పుణ్య సంపదనే రాజయోగం అంటారు. అట్టి రాజయోగం నుండి నీవు సంపాదించిన పుణ్య సంపాదనను లోకం కోసం ధార పోసి స్వార్ధ స్వప్రయోజనాలన్నవి మరచి త్యాగము చేయుటయే సన్యసత్వం. ఇచ్చట తన ,పర,

తరతమ బేధాలు లేని పరిత్యాగము చేయగలిగిన స్థితి. జీవి జీవుడ్ని, దేహం దేహిని గుర్తించి సర్వస్వాన్ని త్యాగం చేయగలిగిన స్థితి సన్యసత్వంగాగుర్తించాలి.

231. స్వామీ! ఆత్మ సందర్శనప్రాప్తి కొరకు అరిషడ్వర్గాలను జయించవలెనా?

అరిషడ్వర్గాలను జయించాల్సిందే. దీనితో పాటు హరిషడ్వర్గాలను సాధించాలి. హరిని చేరు మార్గము సుగమము చేయగల సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస, దయ అను ఆరింటినీ హరిషడ్వర్గాలు అని చెప్పవచ్చు. నివృత్తి మార్గంలో ఇవి అత్యంత ప్రధానమైనవి కనుక వీటి గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

i. **సత్యం:** ఏది సత్యము అంటే బ్రహ్మ సత్యం. మిగిలాది అంతా మిథ్య. అది ఆత్మ విచారణ ద్వారా తెలుసుకోవలసిందే తప్ప మాటల్లో చెప్పుటకు కష్టం. దేహ భ్రాంతితో జీవించేవాడు కనిపించేదంతా సత్యం అనుకుంటాడు. కానీ అది సరియైనది కాదు. సత్యము త్రికాల బాధ్యము. అది ఎప్పటికీ మారనిది. అందుకే బ్రహ్మ సత్యము. ఈ ప్రపంచంలో ప్రతీదీ మార్పుచెందేటటువంటిదే. ఏదైనా చూచినది చూచినట్లుగా చెప్పటం నిజము. అది సత్యం కాదు. అయితే విలువలతో కూడి బ్రతికే వ్యక్తి నిజమే చెప్పాలి. అయినా అది ప్రియంగా ఉండాలి. పరుషంగా ఉండకూడదు. ఏ విధంగానూ బాధించకూడదు. సత్యం కోసం త్యాగం చేసిన మహా పురుషులు ఎందరో ఉన్నారు. వారిని మార్గదర్శకులుగా చేసుకుని సత్య జీవనం గడపవలసిన అవసరం ఉన్నది.

ii. **ధర్మం:** హరిషడ్వర్గాలలో రెండవది ధర్మం. సత్యం నాస్తి పరో ధర్మః అన్నారు. సత్యానికి మించిన ధర్మం మరొకటి లేదు. సత్యమే ధర్మము. ధర్మము యొక్క స్వరూపమే దైవము. అందుకే శ్రీరామ చంద్రుడ్ని రామో విగ్రహవాన్ ధర్మః అని స్తుతించారు. "ధర్మో **<u>రక్షిత రక్షితః</u>**". ధర్మాన్ని **<u>రక్షించేవారు</u>** ఎప్పుడూ ధర్మముచే **<u>రక్షించబడతారు</u>**. దైనందిన జీవితంలో ఆచరించవలసిన ధర్మాలు అనేకం ఉన్నాయి. ఎవరి ధర్మాన్ని వారు పాటించక తప్పదు. ఏది ఎలా పాటించాలో భగవద్గీత బహు చక్కగా చెప్పింది. "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అంటాడు కృష్ణుడు. అంటే ప్రాపంచిక ధర్మాలన్నీ ప్రక్కకు నెట్టి పరమాత్ముడినే ఆశ్రయించాలని అర్థం. ఆధ్యాత్మికంగా చూచినపుడు ఉన్నది ఒకే ధర్మం. అదే ఆత్మ ధర్మం. దాన్నే అందరూ అనుసరించాలి.

iii. **శాంతి:** మూడవదైన శాంతి పదార్థంలోనే, ప్రపంచంలోనే ఉన్నదన్న భ్రమతో అందరూ పరుగులు పెడ్తున్నారు. కానీ నిజానికి అది మీలోనే ఉన్నది. "నాకు శాంతి కావాలి" అని కోరుకునే వారందరూ "నాకు" అనే అహంకారాన్ని "కావాలి" అనే కోరికను త్యజిస్తే శాంతి లభిస్తుంది. ఇది బయట షాపుల్లో దొరికేది కాదు. కేవలం నీలోపలనే ఉన్న "అంతర్ శాంతి" అనే దుకాణంలోనే దొరుకుతుంది.

iv. **ప్రేమ:** హరిషడ్వర్గాలలో నాల్గవది ప్రేమ. దానికి పుట్టిల్లు దైవం. అందుకే ప్రేమే దైవం. కొంత మంది మాటల్లో ప్రేమ ఒలుకుతూ ఉంటుంది. కానీ ప్రేమ అన్నది పెదవులకు పరిమితం కాదు. ట్యాంక్ లో నీరు ఉంటేనే 'ట్యాప్'లో నీరు వస్తుంది. అలాగే గుండెల్లో ప్రేమ నిండుగా ఉంటేనే దేహేంద్రియాల ద్వారా ప్రకటితమవుతుంది. పవిత్రమైన హృదయం లోనుండి వచ్చే ప్రేమ ఎప్పుడూ పవిత్రంగానే ఉంటుంది. హృదయం నుండి పెల్లుబికే ప్రేమ మరలా హృదయంలోకే దూకుతుంది. కనుక ప్రేమ దేహ సంబంధమైనది కాదు. దైవ సంబంధమైనది. ఏదైతే ప్రాపంచికంగా ప్రేమ అనుకుంటున్నారో అది నిజానికి ప్రేమ కాదు. అభిమానం, అనురాగం, వాత్సల్యం అని ఏదైనా అనవచ్చు కానీ ప్రేమ మాత్రము కాదు. భగవదవతారములను భక్తితో పరిశీలిస్తే తప్ప ప్రేమ అనేది అర్థం కాదు. అందరినీ ప్రేమించి, అందరినీ సేవించు. ప్రతి దినమూ ప్రేమతో ప్రారంభించు, ప్రేమతో గడుపు, ప్రేమతోనే ముగించు వంటి ఆదేశాలు ఎక్కువగా నేను మీకు బోధించే బోధలలో ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఎందుకొరకు అన్నది ఇప్పటికే అర్థమయి ఉండాలి. నదిలోని నీటిని నదిలోనే తర్పణం విడిచినట్లుగా దైవ ప్రేమతో దినం గడిపే జీవులు ఆ ప్రేమను మరలా దైవానికే అంకితం లేక అర్పణ చేయటం అత్యుత్తమమైనదిగా గుర్తించాలి.

v. **అహింస:** ఐదవదైన అహింస నా అవతార కార్యక్రమంలో సుస్పష్టంగా మీరు గమనించే ఉంటారు. దీనికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చాను. ఎందుకంటే రామ, కృష్ణ అవతారాలలో ఏదో కొందరు రాక్షసులను సంహరించడం ద్వారా ధర్మ స్థాపన చేయుట జరిగింది. అయితే ఈ కలియుగంలో దుష్టులు, దుర్మార్గులే ఎక్కువగా కనిపిస్తున్నారు. వాళ్ళందరినీ **శిక్షిస్తూ** పోతే ఇక మిగిలేది ఎవరు? అందుకే ప్రేమతో కూడిన పరివర్తనయే ధ్యేయంగా పెట్టుకుని అహింసా మార్గంలో ఎందరి జీవితాలనో సరిదిద్దుతూ ఉన్నాను. బుద్ధుని మొదలు బాపూజీ వరకూ వారు అనుసరించిన అహింసా మార్గము చాలా గొప్పది.

vi. **దయ:** హరిషడ్వర్గాలలో చివరిది దయ. అది లేని వాడు మానవుడు అని చెప్పుటకు వీలు లేదు. దయగల హృదయమే దైవ మందిరము. భగవంతుడు పరమ దయామయుడు. అతనిని చేరాలంటే దయ

అనెడిది చాలా ఉపకరిస్తుంది. కనుక సర్వభూతముల యందు దయ కలిగి దయతో మెలగాలి. మానవతావిలువలతోజీవించేవాడుమానవుడనిపించుకుంటాడు.

ఈ విలువలన్నీ నిజానికి హరి నుండే ఉద్భవించాయి. హరినే ఆశ్రయించి ఉంటాయి. కావున హరిని వెతుక్కుంటూ వెళ్ళే వారికి ఇవి బాగా ఉపయోగపడతాయి అని వేరే చెప్పనక్కరలేదు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనేవి మనిషిని అధః పాతాళానికి చేరిస్తే హరిషడ్వర్గాలయిన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస, దయ లనే ఈ ఆరు మానవుని అత్యంత ఉన్నతమైన స్థితికి చేర్చి హరికి సమీపంగా తీసుకు వెడుతాయి. ఇటువంటివి కేవలం అనుగ్రహం వల్లనే పొందవచ్చు. జీవి వీటిని ఆశ్రయించడం వల్ల అరిషడ్వర్గాలు వాటంతట అవే పలాయనం చిత్తగించక తప్పదు. ఇవి ఎప్పుడైతే హరియించబడ్డాయో మిగిలి ఉన్న నిన్ను నీవు అనుభవించవచ్చు. అదియే ఆత్మ సందర్శన ప్రాప్తికి నిన్ను పైమెట్టుపై నిలబెట్టి ఉన్నత శిఖరాన్ని అధిరోహించేటట్లు చేస్తుంది.

232. అసురులైనా, భూసురులైనా, అఖండ తెలివితేటలు గలవారైనా దయచేత ధన్యులు కావాలి అన్నది కాస్త వివరించండి స్వామీ.

అవును చాలా మంచి ప్రశ్నయే అడిగినావు. ఎందుకంటే ఎంత తెలివి ఉన్నా కూడా వారు నరులు కావచ్చు , అసురులు కావచ్చు, ఈ భూమి మీద ఉన్న రాజులు కావచ్చు ఎవరైనా సరే ఎంత తెలివి ఉన్నా కూడా ధన్యులు కావాలంటే అది భగవంతుని అనుగ్రహం వల్లనే జరుగుతుంది. అందువల్ల ఎన్ని ఉన్నా ఈ జీవితంలో విజయము అనేది నిజంగా కలగాలి, మానవ జన్మ కలిగినందుకు దానికి ఒక పరమావధి అనేది మీకు అందాలి అంటే దానికి భగవంతుని కరుణ లేకుండా జరిగే విషయము కాదు. కామమునకు, మోహమునకు దాసులైన వారికి భగవంతుని కరుణ అందదు. కామము అంటే ఒకటి కావాలి అని అనుకోవడం, మోహము అంటే ఉన్న విషయము తెలియకపోవడం. కావాలి అని అనుకోవడం అది ఒక బంధాన్ని తెచ్చిపెడ్తుంది. ఎందుకంటే ఏది కావాలి అని అనుకుంటున్నారో అది దొరికేటంతవరకూ మనస్సుకు శాంతి లేదు. కావున పరి పరి విధాలా ఇది కావాలి, అది కావాలి అంటూ మనస్సు వెళ్ళిపోతూ ఉంటుంది. ఇది కామానికి గుర్తు. ఇక మోహమనేది మనసున ఉవ్వెత్తున నిలిచి ఉన్న విషయాన్ని, ఉన్న నిజాన్ని మీకు తెలియకుండా కప్పిపుచ్చుతుంది. వెరసి ఈ రెండూ కూడా **విక్షేప**, ఆవరణ శక్తులు లాంటివి

అని చెప్పవచ్చు. **<u>విక్షేపము</u>** అంటే మనసు పరి పరి విధాల పోవడం. ఆవరణ అంటే దాన్ని కప్పివేయడము. ఈ రెండూ కూడా ఒక మనసులోనే జరుగుతున్నాయి. కాబట్టి వీటికి దాసులైన వారు అంటే మనస్సుకు లోనైనవారు అని మీరు ఆలోచించాలి. అంటే మనసుకు లోబడటం తప్పా? అంటే తప్పకుండా తప్పే. ఎందుకంటే మనస్సు మీకు ఇవ్వబడిన ఒక పనిముట్టే తప్ప అది మాస్టర్ కాకూడదు కదా. మనస్సు గనుక మాస్టర్ లాగా ఒకడ్రస్సు వేసుకుంటే అది చూసే వాళ్లకు కూడా హాస్యాస్పదంగా ఉంటుంది. ఇది ఎటువంటిదంటే ఇంటి యజమాని అయి ఉండి బంట్రోతు వేషం వేసుకుని కూర్చుని ఉంటే ఆ సన్నివేశం బయట నుండి చూచే వారికి ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో ఎంత వింతగా ఉంటుందో అదే విధంగా ఈ రోజుల్లో మీ జీవితాలు ఉంటున్నాయి. మీ పనిముట్టు అయిన మనస్సు యజమానిగా, ధీమాగా ఒక స్థితిలో ఉండి మీ జీవితాన్ని నడిపిస్తుంది. దానికి తోచినట్లు ఆ విధంగా నడిపిస్తుంటే మీరు బుద్ధిని ఉపయోగించకుండా దాని వెంటపడి అది కావాలి, ఇది కావాలి అని దాని వెంట వెళుతూ ఉండటము. ఏది కావాలనుకుంటున్నదో దాని వెంట పడి ఏది వద్దనుకుంటుందో వాటిపై ఒక ద్వేషాన్ని పెంచుకోవటము ఈ విధంగా ఇటువంటి విషయాలు చూస్తూ ఉండుట వలన మీరు మనస్సును అనుసరిస్తున్న వాళ్ళు అవుతున్నారు తప్ప మీ మనస్సును నడపగలుగుతున్నారా? మాయ అనే దాన్ని చూచి మోసబోతున్నారు. లోపల ఉన్న నిజాన్ని మీరు తెలుసుకోలేకపోతున్నారు. పరమాత్మ అవతార రూపంలో మీ చెంతనే ఉన్నా కూడా ఇది నిజము అని చెబుతున్నా కూడా ఆ నిజము నీకు ఎంతవరకు కావాలో నీకు నచ్చినట్టే చూడటము అనేదే జరుగుతుంది. అంటే ఏం జరుగుతుందంటే ఈ మాయ అన్న పొరలనుండి మాత్రమే చూడగలుగుతున్నారు. కానీ లోపల ఉన్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారు. గుట్టు అనండి, కట్టు అనండి ఈ రెండు విషయాలు మీరు చేయలేకపోతున్నారు. కావున ఇటువంటివారందరు కూడా కామ, మోహ దాసులే. ఇటువంటి వారికి భగవదనుగ్రహం అంటే కరుణ ఏవిధంగా లభిస్తుంది?

233. "సిరికి" దాసులు కాకండి "హరికి" దాసులు కండి అని మీరు చెప్పే దానిని కొంచెం వివరించండి స్వామి.

ఇది ఎంతో మంది అనుభవంతో చెప్పిన మాటలు. ఎందుకంటే సిరి సంపదలు ఎప్పుడు వస్తాయో ఎప్పుడు పోతాయో ఎవరికీ తెలియదు. కాలచక్రము క్రిందికి పైకి తిరుగుతూ ఉంటుంది. పైనున్న వారు క్రిందికి రావచ్చు, క్రిందనున్న వారు పైకి పోవచ్చు. అందువలన ధన బలమే గొప్పదని విర్రవీగకూడదు. ధనముతో పొందలేనివి ఎన్నో ఉన్నాయి. మీరు ధనముతో "ఆరామము" కొనవచ్చు కానీ "ఆ రాముని"

కొనలేరు. ఆరామము కొనాలంటే భౌతికమైన ధనం ఉంటే చాలును. ఆ రాముని చేరాలంటే ఆత్మశక్తి, ఆత్మశుద్ధి కావాలి. ధనముతో పడకను కొనగలరు కానీ నిద్రను కొనలేరు. సంపదలతో సకల వసతులూ కల గృహము, పడక గది, గదిలో సుఖముగా పడుకునేందుకు ఫోం బెడ్ కొనగలరు. కానీ నిద్రను కొనలేరు. పడుకుంటే ఆలోచనలు. నిద్రపట్టదు. నిద్ర పట్టినా కలత నిద్ర, కలవరింపులు, పలవరింతలు. ఎందుకని? మనస్సు నిండా ఏవో ఆలోచనలు, ఆందోళనలు. ధనముతో ఔషధాలని కొనగలరు కానీ నిద్రను కొనలేరు. ధనముతో ఆరోగ్యాన్ని, ఆయుష్షుని కొనలేరు. ఎందుకు? ఔషధం మానవుడు తయారు చేసినది. ఆయురారోగ్యములు భగవంతుడు ప్రసాదించునది. ధనముతో పుస్తకములు కొనగలరు కానీ అందులోని ప్రజ్ఞాన విజ్ఞానములను కొనలేరు. ఎందువలన? ధనమున్నదని పుస్తకములు కొన్నారు. లైబ్రరీలో పెట్టారు. కానీ దానిని చదివి ఆకళింపు చేసుకుని ఆచరణలో పెట్టాలన్న, జ్ఞాన విజ్ఞానములను ధనముతో కొనలేరు. ధనముతో కంటి అద్దమును అంటే కళ్ళజోడును కొనవచ్చుకానీ చూపును మాత్రం కొనలేరు. ధనముతో ఏ వస్తువునైనా కొనవచ్చు కానీ సద్గురువును మాత్రం కొనలేరు. ఎందుకంటే జన్మ జన్మాంతర సుకృత విశేషము వల్లన మాత్రమే సద్గువు యొక్క పాద సేవ దొరుకుతుంది. ధనముతో ఏ వస్తువునైనా కొనగలరు కానీ దైవాన్ని మాత్రం కొనలేరు. ఏ పదార్థమునైనా కొనవచ్చు. కానీ పరమాత్మను మాత్రం పొందలేరు. ధనముతో భోగ వస్తువులను కొనగలరు కానీ పరమార్ధ సుఖమును మాత్రం పొందలేరు. ఎందువలన? భోగవస్తువుల వలన పరిమితమైన సుఖము లభిస్తుంది. పరమేశ్వరుని పొందుటవలన అపరిమితమైన ఆనందం లభిస్తుంది. కాబట్టి ధనమున్నదని అహంకార పడకూడదు. ధనమున్నవారందరూ సుఖపడుతున్నారని, ధనము లేని వారు కష్టపడుతున్నారని భావించకూడదు. అయితే ధనము ఉండవలసినదే. కానీ అది జీవిత పరమావధి కాకూడదు. సంపదలే సర్వశ్వము అనుకున్నప్పుడు తనకన్నా ఎక్కువ వారిని చూచినపుడు ఈర్ష్యకలుగుతుంది. దాని వలన స్నేహ, బంధుత్వాలు చెడిపోతాయి. అందుకే ధనాన్ని ప్రేమించకండి గుణాన్ని ప్రేమించండి. సిరికి దాసులు కాకండి హరికి దాసులు కండి. జీవిత మాధుర్యాన్ని అనుభవించండి.

234. నిజ భక్తుడికి ఉండవలసిన లక్షణములు ఏమిటి స్వామీ?

నిరాడంబరత, నిశ్చలత, నిస్వార్ధత, సంపూర్ణ శరణాగతి నిజ భక్తునికి ఉండవలసిన లక్షణాలు. ఇవి నిజభక్తుల యెడ శోభిల్లెడి అలంకారములు. అట్టి భక్తులను అన్వేషిస్తూ **<u>సాక్షాత్తు</u>** భగవంతుడే అనుగ్రహింప

వస్తాడు. నిజ భక్తి దైవాన్ని, భక్తుని హృదయమనే పాత్రలో జ్ఞానమనే భిక్ష పెట్టమని అర్థించునే కాని ప్రాపంచిక సుఖాలని ఇచ్చెడి వాటిని కావు. దైవాన్ని తలచుటకు కాలనియమము, స్థల నియమము, జాతి, మత, కులముల ప్రాధాన్యత లేదు. దైవాన్ని స్మరించవలననెడి భావమే సుముహూర్తము.

235. ఇంద్రియవశుడైనవాడు ఏ విధంగా ఆలోచనాసరళి కొనసాగించాలి స్వామి?

వాళ్ల ఆలోచనా సరళి ఈ విధంగా కొనసాగించినట్లైతే కొంతలో కొంత వారు అందుకోవలసిన స్థితిని అందుకోగలరు. ఇంద్రియములకంటే మనస్సు గొప్పది. మనస్సుకన్నా బుద్ధి గొప్పది. బుద్ధి కన్నా ఆత్మ గొప్పది. ఆత్మని ఆశ్రయిస్తేనే పురోగతి, లేకుంటే అధోగతి అన్న జీవనసత్యము అవగతమైతే దేహాభిమానము దూరమగును. ఆత్మాభిమానము చేరువైనచో జన్మ సార్ధకత సిద్ధించును. విషయ సుఖాలు విషతుల్యములు, ఆత్మసుఖము అమృతతుల్యమని సుబోధకమగును. దైవ స్మరణయే సంపద. దైవాన్ని విస్మరించుటయే ఆపదయని అనుభవానికి వస్తుంది. ఆ శుభ ఘడియయే దైవాన్ని ఏమరక యుండునటువంటి మానసిక పటుత్వమునకు పట్టుకొమ్మయగును. అది దైవ స్మృతి వల్లననే అనుభవమునకు వచ్చును. అంతే కాని భక్తి పేరుతో ఆచరించెడి అష్టోత్తర, సహస్ర నామార్చనలు, లిఖిత జపములు, పారాయణలు, కాల పరిమితి గల దీక్షల వలన అనన్యభక్తి ప్రాప్తించదు. కారణమేమనగా అందు స్థల, కాల నియమములకే ప్రాధాన్యత. మనస్సు పరిపరి విధముల పరుగులిడుట, ఆడంబరతకు ప్రాధాన్యముండుట రెండవ కారణము. విషయ సుఖాలను కోరుతూ విశ్వేశ్వరానుగ్రహము పొందుటకు అవకాశం ఎట్లుండును? అన్న యోచనయే లేక విచారణకు తావులేని సాధారణ ప్రక్రియయే సాధారణ భక్తి కార్యక్రమములు అని చెప్పక తప్పదు. దేహాభిమానము నశించి ఆత్మాభిమానము పెంపొందవలెనన్న సాధారణ నిత్యజీవనసరళి యందు లభించెడి విరామ సమయమంతా భగవత్ స్మృతి యందు ప్రవేశపెట్టుట అనివార్యమని తెలిసిననాడే, గుర్తించిననాడే అనన్యభక్తికి అంకురార్పణ జరుగును. జీవన వ్యవధిలో కొంత సమయము ఆధ్యాత్మిక పరంగా కేటాయించుట మానవజన్మని సార్ధకత పర్చదు. ఎందుకనగా సంసార భయ నిమగ్నులకు దైవ విశ్వాసము ఎట్లు ఏర్పడును?

236. నేను అనెడి మాయను తొలగించుటకు ఉపాయము, చేయవలసిన విధానము వివరించండి స్వామీ.

అహంకారము, కర్మ బంధము, జీవుని ఆదరించునట్టి శివుని మిథ్యాశక్తి వీటినే అణవ మలము, కర్మ, మాయా అని పిలుస్తారు. శివునికి ఆత్మార్పణము ఒనర్చుట ద్వారా మొట్టమొదటి అణవ మలమును నశింపచేసి అతని అనుగ్రహము పొందవచ్చును. దేవునికి నీవు ఒనర్చు కర్మ యొక్క ఫలములను అర్పించుట చేతను, వివిధ అవయవముల ద్వారా ఆ శివుడే పని చేయుచున్నాడని నిమిత్త భావమును వికశింపచేసుకొనుట చేతను, అతని చేతులలో నీవు కేవలము ఒక ఉపకరణము అని తలచి "నేను కర్త" అనెడి భావమును నశింపచేసుకొనుట చేతను రెండవ మలమగు కర్మను తొలగించుకోవచ్చు. అప్పుడు కర్మలచే బాధించబడవు. ఈ విధంగా రెండవ మలమును తొలగించుకోవాలి. అపుడు కర్మలచే బాధించబడవు, బంధించబడవు. పంచాక్షరీని ఉచ్చరించుట చేతను, గురువును సేవించుట చేతను, దేవుని నానావిధముల లీలలు శ్రవణము ఒనర్చి మననము చేయుట చేతను మాయ అనెడి మూడవ మలము తొలగించబడును. నానా విధ సద్గుణముల వలన, వాటిని అలవర్చుకోవటము చేతను, సాత్వికాహారము సేవించుట చేతను, సత్సంగము, పంచాక్షరీమంత్రజపము, రజస్సు ద్వారా సత్వముగా పరిగణింప చేయును. అపుడు నేను అనెడి అహంకారము నశించి శివైక్యతను పొందును. జపధ్యాన స్వాధ్యాయ కీర్తనలనెడి శుభవాసనలచే మోహము, పేరాశ, ద్వేషము, క్రోధము, అసూయ అనేడి అశుభవాసనలను తొలగించుకుని శివానందాన్ని అనుభవింతువు. గురువును సేవింపుము. అతనిని సేవించి హృదయమును పరిశుద్ధమొనర్చుకొనుము. షడ్రుచులను సంహరింపుము. అంతర్ముఖుడవు కమ్ము, స్థూల సూక్ష్మ కారణములనెడి త్రివిధ శరీరములను చంపుము. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలను దాటి వెళ్ళుము. జాగ్రత్ స్వప్న సుషుప్త్యావస్తలకు **<u>సాక్షివై</u>** ఉండుము. విషయ చైతన్యము నుండి విముఖుడవు కావాలి. అంతర్ముఖుడవై నాల్గవదియగు తురీయావస్థ లేక శివపదమును పొందుము. శరీరము, మనస్సు, చిత్తములకు అతీతమైన నిర్వికల్ప సమాధి పొందాలి. సహజ జ్ఞానము, బుద్ధి, తెలివికి అతీతుడవై శివుడి మూడవ నేత్రమయిన అత్మజ్ఞానమనెడి **<u>దివ్యచక్షువులను</u>** తెరవండి. ఆలోచన, సంకల్పము, అనుభవములకు అతీతుడవై పరమ శాంతి లేక నిస్సంకల్పావస్థ లేక శివ నిర్యాణమునందు ప్రవేశించాలి.

237. స్వామి! మానవుని విలువ తగ్గటానికి కారణం ఏమిటి?

స్వచ్ఛమైన అపరంజి చాలా కాంతివంతంగా ఉంటుంది. దాని విలువ కూడా అధికంగా ఉంటుంది.

కానీ దానికి వెండి, రాగి, ఇత్తడి లోహాలను కలిపితే అది కాంతి హీనమైపోవడమే కాక తన విలువను కూడా కోల్పోతుంది. అదే రీతిగా జన్మతః మానవుని హృదయం పరిశుద్ధమైన అపరంజి వలే ఉంటుంది. కానీ పెరిగే కొలది తన హృదయంలో వాంఛలనే వెండిని, రాగిని, ఇత్తడిని చేర్చుకోవటం చేత తనవిలువను కోల్పోతున్నాడు. మానవతా విలువలు మానవునితోనే ఆవిర్భవించాయి. తన యందే ఉన్న విలువలను మర్చిపోయి మితిమీరిన వాంఛలతో అసత్యంలో, అధర్మంలో ప్రవేశించి తన పవిత్రతను కోల్పోతున్నాడు. తాను తలంచే తలంపులకు, చెప్పే మాటలకు, చేసే పనులకు పొందిక లేకుండా ఉన్నది. తాను మనస్సులో తలచేది బయటకు చెప్పలేకపోతున్నాడు. ఏమి చెబుతున్నాడో అది చెయ్యలేకపోతున్నాడు. మనస్సు ఒక వైపు, క్రియ ఇంకొకవైపు. ఇది మానవుని ఈనాటి పద్ధతి. మహాత్ముడు కావలసిన మానవుడు దురాత్మునిగా మారిపోతున్నాడు. అనేక మంది, స్వామి! ప్రపంచంలో దినదినమునకు దుర్మార్గం పెరిగిపోతున్నది. ఇది ఎప్పుడు చక్కబడుతుంది? అని అడుగుతుంటారు. ఈ దుర్మార్గం ఎక్కడ నుండియో వచ్చి పెరగడంలేదు. మనిషినుండియే వచ్చింది. మనిషి తన భావాలను పరిశుద్ధము గావించుకున్నప్పుడు జగత్తంతా పరిశుద్ధముగానే ఉంటుంది. ప్రపంచంలో ఎట్టి దోషములూ లేవు. మంచిని చెడ్డ వెంటాడుతూనే ఉంటుంది. లేకపోతే మంచితనం బయటకు రాదు. కష్ట సుఖములు ప్రాకృతమైన ప్రభావమునకు లొంగి మనిషి తన స్వభావమును కోల్పోతున్నాడు. తనవిలువను తగ్గించుకుంటున్నాడు.

238. ఎందువలన పరనింద చాలా పెద్ద పాపము స్వామి?

దీని గురించి నీకు ఒక చిన్న కథ చెబుతాను విను. త్రిలోక సంచారి అయిన నారదుడు ఓసారి నరకానికి వెళ్ళి అక్కడ ఒక కొండను చూసి ఆశ్చర్యపడ్డాడు. అది పుణ్యం కోసం నిత్యాన్నదానం చేస్తున్న ఓ రాజుగారి పాపపురాశి అని తెలుసుకున్నాడు. అన్నదాన సమయంలో ఎంగిలి తగలటం వల్ల అతనికాపాపం కలిగిందని గ్రహించిన నారదుడికి రాజు మీద జాలి కలిగింది. రాజు వద్దకు వెళ్ళి "రోజూ రాత్రయ్యే సరికి నీకుమార్తె అంతఃపురంలోకి వెళ్ళి తలుపులు వేసుకొని తెల్లవారే వరకూ ఉండి వస్తూ ఉండు" అని అతనికి సలహా ఇచ్చాడు. ఎంగిలి దోషం తగలకుండా అన్నదానం చేయాలని కూడా చెప్పాడు. రాజు అలాగే చేయ సాగాడు. కొద్ది రోజులలోనే రాజు తన కుమార్తెతో అనుచితంగా వ్యవహరిస్తున్నాడనే మాట ఆ నోట, ఈ నోట రాజ్యమంతా పాకిపోయింది. ఏ తప్పు చేయకపోయినా ఆయనకు నింద తప్పలేదు. కొన్నాళ్ళకు తిరిగి నారదుడు నరకానికి వెళ్ళగా అక్కడ తాను అంత వరకూ చూసిన రాజుగారి పాపపు కొండ

మూడువంతులకు పైగా కరిగిపోయి ఉండటం గమనించి సంతోషించాడు. అలా ఎందుకు జరుగుతుందో వేరే చెప్పనక్కర లేదు కదా. అంటే ఎదుటివారి పాపాల్ని నాలుకతో శుభ్రం చేయడంగా చెప్పవచ్చు. ఎదుటి వారి పాపాలు గురించి ఆలోచించకుండా వివేకంతో సత్కర్మలనే ఆచరిస్తూ అంతర్ముఖులై ఆత్మోద్ధరణకు కృషి చేయడమే పాపం చేయకుండా ఉండటానికి సరైన మార్గం. కానీ అలా చేసేవారు ఎవరు? పాపాలు పోగొట్టుకోవాలనే ఆత్రంతో కాశికి పోయి గంగలో స్నానాలు చేస్తారు. దేవాలయాలకు పోయి "పాపోహం, పాప సంభవా, రక్ష రక్ష" అంటూ లెంపలు వేసుకుంటారు. అంటే పాపాలు చేయకుండా ఉండే బదులు ఒక వంక పాపాలు చేస్తూనే మరొక వంక వాటిని పోగొట్టుకోవడం పైనే దృష్టి పెడతారు. మీరు పాపఫలం వద్దు వద్దు అని **ఘోషిస్తున్నారు**. కానీ పాప కార్యాలకు ముందంజ వేస్తున్నారు. పుణ్యఫలములు కావాలనే ఆశిస్తున్నారు. కానీ పుణ్యకార్యములకు ఏమాత్రం పూనుకోవటం లేదు. ఆశించడం ఒకటి, ప్రయత్నించడం ఒకటి. ఇందులో సరైన ఫలితం లభిస్తుందనేటటువంటి నమ్మకం ఏరీతిగా కుదురుతుంది? మీరు ఆశించిన దానికి తగిన ప్రయత్నము చేయటమే మీ కర్తవ్యము. కనుక మనస్తత్వమును మొట్ట మొదట మీరు కొంత వరకూ తీర్చిదిద్దుకోవడము ప్రతీమానవుని యొక్క కర్తవ్యము. మీ యొక్క మానవత్వాన్ని తీర్చిదిద్దుకోవడమెలా? అని ఆలోచించుకోవాలి. ఎల్లప్పుడూ మనోవాక్కాయ కర్మలలో వ్యక్తికి ప్రేరణ ఇచ్చేది భగవంతుడే అని తలచితే అన్నియూ సక్రమముగా పుణ్యకర్మలుగా మారుతాయి. అందుచేత ప్రతి కర్మనూ దైవ కర్మగా భావించండి. అన్ని పనులను భగవంతుని పనిగా భావించాలి. పరమాత్మకు అర్పితం చేసి యుద్ధం చేసినా అది యజ్ఞం అయినది. సత్సంగం వల్ల సత్ప్రవర్తన అలవడుతుంది. దైవభక్తి పెంపొందుతుంది. దైవానికి చేరువ కావాలనుకునేవారు సహజంగానే పాపకార్యాలకు దూరంగా ఉంటారు. అంతే గాక సేవకు మించినది మరొకటి లేదు అన్నది అర్ధమౌతుంది. సేవ అహంకారాన్ని నిర్మూలిస్తుంది. అందులో ప్రేమ, దయ, త్యాగం కలిసి ఉంటాయి. త్యాగ భావం ఉన్నచోట స్వార్ధానికి తావులేదు. కాబట్టి స్వార్ధం వల్లా కలిగే దురాలోచనలు, దుష్కర్మలుగా మారుతాయి కావున సేవ వల్ల వాటికి దూరంగా ఉండుట సాధ్యపడుతుంది. అదృష్టమనేది అకస్మాత్తుగా లభించేది కాదు. దురదృష్టమనేది విచక్షణా రహితంగా ఇవ్వబడేది కాదు. పూర్వ జన్మలలో పుణ్య కర్మలు ఒక్కసారిగా ఫలితమిచ్చినపుడు అదృష్టం అంటారు. ప్రయత్నించి సత్కర్మలు చేసి అదృష్టాన్ని పొందడమా? లేక దుష్కర్మలు చేసి దురదృష్టాన్ని పొందడమా మీ చేతుల్లోనే ఉన్నది.

239. స్వధర్మం, పరధర్మం అంటే ఏమిటి స్వామీ?

ఏ పని చేసినా, ఏ మాట చెప్పినా అందులో స్వార్థం లేకుండా చూసుకోండి. దేహాభిమానమును పెంచుకోండి. దేశమే లేకపోతే దేహమెక్కడ? స్వేచ్ఛ అంటారు. స్వేచ్ఛ అంటే ఏమిటి? ఇది నా ఇష్టము. నా స్వేచ్ఛ ప్రకారం నేను నడుచుకుంటాను. ఎవరు నన్ను అడిగేవారు? అంటారు. అడుగవలసిన వారే అడుగుతారు. ఇతరులెరుగకున్నా ఈశ్వరుండు ఎరుగడా? మీరు చేసే పనులు, ఆడే నాటకాలు మానవ మాత్రులకు తెలియకుండా ఉండవచ్చు కానీ భగవంతునికి తెలియకుండా పోవు. సమయం వచ్చినపుడు అతనే మిమ్మల్ని దోషులుగా నిలబెడతాడు. అలాంటి పనిష్మెంటు రాక పూర్వమే మీరు సరి అయిన మార్గంలో ప్రవేశించాలి. ఏమిటి స్వేచ్ఛ అంటే? కుక్కలు తిరిగినట్లు తిరగటమా? కాదు కాదు.

స్వ + ఇచ్ఛ = స్వేచ్ఛ. అనగా పరధర్మం స్వధర్మం రెండూ ఉంటాయి. స్వధర్మమనగా ఈశ్వర ధర్మము, పర ధర్మమనగా దేహధర్మము. మీరు వచ్చినది దేహధర్మం కోసం కాదు. కనుక ఆత్మధర్మాన్ని అనుసరించండి. అపుడే మీజన్మ సార్థకమవుతుంది. కానీ ఈనాడు స్వధర్మమంటే బ్రాహ్మణులు బ్రాహ్మణ ధర్మమనీ, వైశ్యులు వైశ్యధర్మమనీ, క్షత్రియులు క్షత్రియ ధర్మమనీ, శూద్రులు శూద్ర ధర్మమనీ ఈ విధంగా ఎవరికీ తోచినట్లు వారు భావిస్తున్నారు. ఇవన్నీ వర్ణాశ్రమధర్మాలు. స్వధర్మాన్ని పాటించాలి గానీ వర్ణాశ్రమ ధర్మాలను కాదు. కనుక మీరు ఆచరించవలసినది ఆత్మధర్మాన్ని.

240. హృదయములో మిమ్ములను బంధించుకుని అనుభవించాలి. అది ఎలా స్వామి?

ఆగు, ఆగు. ఎప్పటికీ హృదయ బంధితుడనే. కానీ పరిశుద్ధ హృదయులను మాత్రమే ఎంచుకుని ఉండటానికి ఒప్పుకుంటాను. కానీ నేటి మానవుడు తన కోరికలన్నీ తీరినపుడే భగవంతుడున్నాడని విశ్వసిస్తారు. పూజలు, భజనలు చేస్తారు. కోరికలు తీరకపోతే భగవంతుని దూషిస్తారు. నమ్మకాన్ని పోగొట్టుకుంటారు. దేముడనే వాడే లేదన్న నమ్మకానికి వస్తారు. గుడ్డిగా మనుష్యుల్ని నమ్ముతారు. వాళ్లే నిజమైన స్నేహితులన్న నిర్ధారణకొచ్చి దారుణంగా మోసపోతారు. కానీ భగవంతుడు మాత్రమే మీ ఆత్మబంధువు అన్న విషయాన్ని విస్మరిస్తారు. మాలిన్యమైన మనస్సుతో భగవంతుని దూరం చేసుకుంటున్నారు. ఎవరైనా ప్రత్యేక వ్యక్తులు మీ ఇంటికి వస్తేనే వారికి స్వాగతం చెప్పటానికి ముందుగా ఇల్లంతా అందంగా, శుభ్రంగా సర్ది ఉంచుతారు. అలాంటిది <u>**సాక్షాత్తు**</u> భగవంతుడే మీహృదయ మందిరంలోకి ప్రవేశించాలనుకున్నప్పుడు మరి మీహృదయ పీఠమును శుభ్రంగా ఉంచుకుంటున్నారా? ఈర్ష్య, అసూయ, ద్వేషాలను <u>**ప్రక్షాళన**</u> చేసుకుంటున్నారా? ప్రేమతో మాత్రమే హృదయాన్ని నింపగలుగుతున్నారా?

లేనపుడు భగవంతుడు మీలో ఎలా ప్రవేశించగలడు? ప్రేమరహిత హృదయములో ఎలా స్థానం ఏర్పరుచుకోగలడు? దోషమంతా మీలోనే ఉంచుకుని మీ కర్మకు మీరే బాధ్యులని గుర్తించకుండా భగవంతుని నిందించి మరింత పాపాన్ని మీరు మూటకట్టుకుంటున్నారు. ఇది భావ్యమా? మాలిన్యమైన హృదయంలో భగవంతుడు కూర్చునడానికి వీలు లేదు. అనిత్యమైన ఈ శరీరమే క్రింద కూర్చోవాలంటే ఒక చాపనో, ఒక దిండునో వేసుకుని కూర్చుంటారు. కానీ భగవంతుడు హృదయంలో కూర్చోవాలంటే దానిని పరిశుద్ధం చెయ్యక్కర్లేదా? హృదయ పరిశుద్ధత లేనపుడు భగవంతుడు వచ్చి కూర్చోటానికి వీలులేదు. భగవంతుడు ఉన్నాడు కానీ హృదయ పరిశుద్ధత లేనపుడు కనిపించుట లేదు. కుండలో నీరు ఉన్నంత వరకూ సూర్యుని ప్రతిబింబము కనిపిస్తుంది. కానీ నీరు లేనపుడు కనిపించదు. మానవ దేహం ఒక కుండ వంటిది. దేహమనే కుండలో ప్రేమ అనే నీరు ఉన్నంత వరకూ దివ్యత్వం చక్కగా ప్రతిబింబిస్తుంది. కానీ ప్రేమ అనే నీరు లేకపోతే ఆ ప్రతిబింబం కనిపించదు. ఈ ప్రేమ హృదయ సంబంధమైనది. ఒక్క క్షణంలో పెరిగిపోయి మరుక్షణంలో తరిగిపోయేది ప్రేమ కాదు. భగవంతుడు ప్రేమపాత్రుని హృదయమునందే బంధించబడి అనుభవించబడుతాడు.

241. పరమాత్మయే బాధ్యత తీసుకుని భక్తుల హృదయాల్లో ఉండి పూర్వం నుండి వారి హృదయంలో ఉన్న వాసనలను తీసిపారవేస్తాడని అనుకుంటాను. దీని గురించి కొంత విశద పర్చండి స్వామీ.

జీవుడు తన కర్మఫలాలు అనుభవించటానికి జన్మనెత్తుతుంటాడు. ప్రతి జన్మలోనూ గత జన్మలోని గుణాలు మంచివి కానీ చెడ్డవి కానీ తిరిగి ప్రవేశిస్తూనే ఉంటాయి. వీటినే వాసనలంటారు. జీవుడికి మోక్షం రావాలంటే ఈ దుర్వాసనాదులన్నీ నశించిపోవాలి కదా! భగవంతుని యొక్క భగవత్ కధాశ్రవణం, కీర్తనాదులతో భక్తుని హృదయం నిండి ఉన్నప్పుడు మరో ధ్యాస ఉండదు. నిరంతర భగవచ్చింతనామృత సాధనలో నిమగ్నమై ఉంటుంది గనుక అట్టి మనస్సులో నిలకడ ఉండి భగవానుడు ఆ భక్తులకెంతో హితం చేకూరుస్తాడు. ఆయన సజ్జన హితకారి కనుక తమ భక్తుల దుర్వాసనలన్నీ నశింపచేస్తాడు. అపుడు జీవుడు ముక్తికి అర్హుడౌతాడు. భగవంతుడే భక్తులహృదయంలో నిలకడగా ఉన్నప్పుడు ఇంక భయమేముంది? వాళ్ళకు భక్తి ద్వారా జ్ఞానం కలిగిన తరువాతనే స్వామి వారి హృదయాలలో ప్రవేశించటం జరుగుతుంది. భగవానుని ఉనికి వలన భక్తుల దుర్వాసనలు మటుమాయమయిపోతాయి. అప్పుడు భగవంతుని గురించిన శాస్త్రాన్ని పునః పునః పఠనాదులు చేస్తూ లేక భగవత్ భక్తులైన పెద్దల సేవలు చేస్తూ కాలం

గడుపుతూ ఉంటే భక్తుని భక్తికి నిలకడ ఏర్పడుతుంది. భగవంతుడు తప్ప కీర్తించ తగిన వాడు మరొకడు ఉంటే కదా. కనుక ఆ పరమాత్మ యందే అనన్య భక్తుడై ఉన్నప్పుడు ఆ భక్తికి నిష్ఠ ఏర్పడుతుంది. అంటే భక్తి నిశ్చలమై ఉంటుందన్న భావము. అనగా ఎలాంటి **విక్షేపాలు** ఆ భక్తికి కలగవు. సుస్థిరంగా భక్తి పరమాత్మ యందే ఉండిపోతుంది. రజోగుణ, తమోగుణ సంబంధమైన కామాదులేవీ ఆ భక్తుని దరి చేరలేవు. అవన్నీ శమించి కేవలము సత్వగుణంతో వారి మనస్సు నిత్యానందంలో ఒలలాడుతుంది. అదే బ్రహ్మానందం. అదే ముక్తి.

242. మా ఆధ్యాత్మిక ప్రయాణం ఎచ్చట నుండి ప్రారంభమౌతుంది స్వామి?

మీ యొక్క ఆధ్యాత్మిక ప్రయాణము మీ హృదయము నుండే మొదలవుతుంది. అది మీ **క్షేత్రము**. అక్కడకు చేరి "మాలో పరివర్తన రావలెను" అని అనుకోవటమే నాంది. ఈ నాందీయే ఆధ్యాత్మిక జీవన "సృజన లేక సృష్టి". దీని కర్తయే బ్రహ్మ. ఇక ఎన్నాళ్ళనుండో అవసరము లేని కలుపుమొక్కలతో నిండి ఉన్న మీహృదయాలను బాగుచేయవలెను. సాగుచేయవలెను. ఈ సాగుకు కొంతకాలము పట్టవచ్చును. ఇది చేయుటకే కాలము ఇవ్వబడింది. ఈ సాగుకు ఆధ్యాత్మిక సేద్యమే అలౌకిక ఆనందమును సాధ్యము చేస్తుంది. ఈ సేద్యము కర్మకు చిహ్నము. కృషికి ఆలవాలము. స్థితి యోగము. దీనికి మూల దైవం విష్ణువు. అనగా సర్వత్రా నిండియున్న ఆత్మ తత్వం ఆకళింపు చేసుకునే ప్రయత్నం. దీనికి ఇచ్చిన పరికరాలు, పనిముట్లు మనస్సు = మడక, గుణము = ఎద్దులు. వీటి సహాయముతో దున్నవలెను. దీని అర్ధము మనసును హృదయ సాధనకై ఉపయోగించాలి. కానీ ప్రపంచ సాధనకైకాదు. ఇది స్థితిలో గల విశేషం. ఇక నాగలి దున్ను రీతి ఎద్దుల మీద కూడా ఆధారపడి ఉన్నది. పొగరుబోతు ఎద్దులు మాటవినక పరుగులు తీస్తాయి. ఇవి రజోగునానికి చిహ్నాలు. ఇక సోమరిపోతు ఎద్దులు కదలలేక, నాగలి చురుకుదనం పోగొట్టి మందగమనంతో ఉంటాయి. ఇవి తమోగుణానికి చిహ్నాలు. ఒక్క మేలు జాతి మచ్చిక ఎద్దులు మాత్రమే సరియైన సేద్యానికి ఉపయోగబడతాయి. ఇవి సాత్విక గుణానికి చిహ్నాలు. అవి శ్రేష్టము. అయితే మచ్చిక చేసేంతవరకూ ఎద్దులు (గుణాలు) ఒదిగి ఉండవు. ఈ మచ్చిక కోసమై అప్పుడప్పుడు ఛలకోలను వాడవలసివస్తుంది. లయతప్పిన ఎద్దులను (గుణాలను) మరలా లయలో నడిపింప చేసేది వివేకము (ఛలకోలు). వివేకము అనగా బుద్ధి గనుక సేద్యము చేసేది రైతు అయితే ఆ ఛలకోలను ఎద్దుల గతి తప్పినప్పుడల్లా వాడి, లయ కారకుడైన శివుడు మరిపిస్తాడు. ఆ పని అప్పుడప్పుడు చేస్తే సృష్టి, స్థితి,

లయముల వల్ల ఈ బంజరు భూమియైన మీహృదయము బంగారు భూమియై విశాలముగా విలసిల్లుతుంది. ఇటువంటి విశాలహృదయములలో మానవులు మేధావులై ఈ ప్రపంచరంగమున సుఖమునొందెదరు. పరములో శాంతి నొందెదరు. ఇది మీ మనస్సుకు నేను చేసే బోధ.

243. స్వామీ! జీవితము అంటే ఏమిటి? దాని అర్థం తెలుసుకోలేక చాలామందిమి కొట్టుమిట్టాడుతున్నాము.

మిమ్మల్ని అన్ని విధాలా ఆకర్షిస్తుంది ఈ జగత్తు. మానవుని ఆలోచనలను, బుద్ధిని తలంపులనూ తన పరిధిని దాటి అవతలకు పోనీయదు. పంచేంద్రియములతో కలుగు తాత్కాలిక ఆనందమనే నిషాలో మునిగినపుడు మానవుడు ముందు ఏమి జరగనున్నది యోచించుకోలేకపోతున్నాడు. మానవునికి మరో పేరు వ్యక్తి. అయితే అవ్యక్తమైన దానిని వ్యక్తము చేయువాడే వ్యక్తి. గుప్తమైన దివ్యత్వమే అవ్యక్త తత్వము. ఈ అవ్యక్తతత్వాన్ని గుర్తించినపుడే మానవుడు తన మానవత్వాన్ని సార్థకం చేసుకుంటాడు. చేసుకున్నవాడవుతాడు. ఆధ్యాత్మిక విద్యను పవిత్రమైన వ్యక్తిత్వంతో సొంతం చేసుకుని అవ్యక్తానందాన్ని, దివ్యానందాన్ని అనుభవిస్తూ సర్వులకూ అటువంటి ఆనందాన్ని పంచిఇవ్వటమే జీవితము. కానీ దేహభావం ఎక్కువై దైవభావం తక్కువై శరీరపోషణకు, శారీరకమైన అందానికి తద్వారా భౌతికమైన ఆనందానికి బానిసలై ఎంతోసమయాన్ని వృధా చేసుకుంటున్నారు. నిజమైన, నిత్యమైన, సత్యమైన ఆధ్యాత్మికానందాన్ని దూరం చేసుకుంటున్నారు. జీవితమంటే ఏమిటి? చాలా మంది కంటి నిండా నిద్ర, కడుపు నిండా తిండి, వంటి నిండా వస్త్రము, ఇంటి నిండా బిడ్డలు, కళకళలాడే కళత్రాలతో గడిచిపోవటమే జీవితంగా భావిస్తున్నారు. ఇది కూడా నిజమే. కానీ జీవితంలో ఇది ఒక భాగం మాత్రమే. జీవిత పూర్వ స్వరూపము ఇదికాదు. కేవలం సౌఖ్యములు అనుభవించటం మాత్రమే జీవితం కాదు. ఆత్మానందం లభించినపుడే పూర్ణమైన దివ్యత్వాన్ని మీరు అనుభవించిన వారు అవుతారు. ఇంద్రియములు చాలా బలవత్తరమైనవి. మీ దేహమంతా దివ్యత్వమైన ఆత్మతత్వములో కూడి ఉంటున్నది. మహాభారతంలో భగవద్గీత నాభిగా ఉన్నది. భౌతికంగా విచారిస్తే మీ దేహములో సత్య ధర్మ స్వరూపమే ధర్మరాజు. ప్రకృతి యొక్క శక్తియే ద్రౌపది. పవన కుమారుడైన భీముడు అంతఃకరణ. అదే ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కూడిన ప్రాణము. అర్జునుడు మనోబుద్ధి యొక్క బలము. నకులసహదేవులు కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు. భగవంతుడే ఈఐదు విధములైన మార్గములను ఏకత్వము గావిస్తూ వస్తున్నాడు.

ఈనాడు ఈ ఏకత్వానికి ఎవ్వరూ ప్రయత్నించటము లేదు. అన్నీ భిన్నత్వంగా విభజన చేస్తున్నారు. అందువల్లనే మానవ్వత్వములో దివ్యత్వము కనిపించుటలేదు. నా ఈ బోధల ద్వారా మీలో చూడాలనుకుంటున్నది ఈ దివ్యత్వాన్నే, కానీ ఏకత్వ సాధన మృగ్యమైపోతోంది. మనుషులలో ప్రేమ రాహిత్యం పెరిగిపోతోంది. దేహభావన అధికమైపోతోంది. అందరిలోనూ ఉండే భగవానుడు మనుష్యుల దృష్టిలో కనుమరుగైపోతున్నాడు. కావున జీవితమంటే విలువలను తెలుసుకుని జీవిత సార్ధక్యాన్ని సాధించాలి. ప్రతి జీవిలోనూ నెలకొనియున్న భగవాన్ను గుర్తించలేనపడు, దర్శించలేనపుడు ఎన్ని చేసినా, ఏమి చెప్పినా వ్యర్ధమే కదా? కాదా? చెప్పండి. నా బాధను అర్ధం చేసుకోండి. మనిషి మనిషిగా ఉండకూడదు. ప్రేమ మూర్తిగా కర్తవ్యం తెలిసి కొని పరిణతి చెందాలి. నేను ఆచరించి చూపినా ఎంత మంది అర్ధం చేసుకోగలుగుతున్నారు? ఎంత మంది ఆచరించగలుగుతున్నారు? ఈనాడు సత్య ధర్మ శాంతి ప్రేమల గురించి ప్రచారం, ప్రబోధలు జరుగుతున్నాయి. ప్రదర్శనలు జరుగుతున్నాయి. కానీ ఆదర్శంగా నిరూపించుట లేదు. దానిని అనుభవించాలి, ఆచరించాలి. మీరు ప్రకటించడము వలన గానీ ప్రదర్శించడము వలన గానీ ప్రయోజనము లేదు. దీని వలన లోకము ఏనాడూ మారదు. ఏనాడు ఆచరణలో మీరు ప్రదర్శిస్తారో అప్పుడే నిజమైన ఆదర్శమౌతుంది. ఈ జగత్తులో మానవత్వాన్ని మించినది మరొకటి లేదు. ఈనాటి అశాంతికి, అల్లకల్లోలానికి కారణం ఏమిటి? చెప్పటము ఒకటి, ఆచరించటము ఒకటిగా జరుగుతున్నది. తలచినదే చెప్పు. చెప్పినదే చెయ్యి. ఆధ్యాత్మిక జీవితమనగా ఏకాకి జీవితమనిగానీ, ఒంటరితనమని గానీ భావించరాదు. మానవత్వాన్నంతా ఒకటిగా చేసి దానిని ఆచరించి, అనుభవించి, ఆనందించి పరులకు అందివ్వటమే ఆధ్యాత్మికము. భజనలు, పూజలు చేసుకోవడము ఆధ్యాత్మికత కాదు. ఇవి సత్కర్మలు. సత్కర్మలను ఆచరించాలి. అవన్నీ ఆధ్యాత్మికతకు తొలి మెట్టు మాత్రమే. కానీ హృదయంలో ప్రేమను పెంచుకుని దానిని పంచటమే. దానిని మించిన ఆధ్యాత్మికత లేదు, జీవితమూ లేదు.

244. స్వామీ! మిమ్మల్ని ఆశ్రయించుకున్న జీవులకు సైతం కష్టాలు పరామర్శిస్తుంటాయి మరి అప్పటి ఆ భక్తుని స్థితి ఏమిటి?

నీవు చెబుతున్న కష్టాలు నిజంగా కష్టాలు కాదు. అవి భగవంతుని దగ్గరకు చేర్చే సోపానాలు. నమ్మకము, విశ్వాసము అనే దారిలో నడిచినట్లైతే శరణాగతి అనే మెట్టుపైన నీవు కాలుపెట్టగలవు. కష్టాలు

పదే పదే పరామర్శిస్తున్నా నిజమైన భక్తుని విశ్వాసము సడలిపోదు. సుఖాలతో పాటు దుఃఖాన్ని కూడా దైవప్రసాదంగానే భావిస్తాడు. భగవంతునితో ఏఫిర్యాదు చెయ్యడు. ఈ సందర్భంగా ఒక చిన్న కథ చెప్పనా? ఒకసారి రామలక్ష్మణులు పంపా సరోవరంలో స్నానానికి దిగారు. స్నానానికి ముందు బాణాలను బురదలో గుచ్చి ముందుకు వెళ్లారు. స్నానాంతరం శ్రీరాముడు తన బాణం లాగి తీసుకోగా అంచున రక్తం తడి కనిపించింది. అనాలోచితంగా చేసిన పనివల్ల ఏదైనా ప్రాణహాని జరిగిందేమోనని రాముడు తల్లడిల్లాడు. లక్ష్మణుడు రాముని ఆదేశానుసారం అక్కడ కొంత బురద తొలగించి చూడాగా ఒక గాయపడిన కప్ప కనిపించింది. దానిని చూచి రామచంద్రప్రభు ఇలా అన్నాడు. బాణం గుచ్చుకోగానే నువ్వు ఎందుకు అరవలేదు? ఎప్పుడైనా పాము నిన్ను పట్టుకుంటే నువ్వు అరవకుండా ఉండగలవా? అని అడిగాడు. అంతిమ శ్వాస తీసుకుంటున్న కప్ప సమాధానం ఇలా చెప్పింది. స్వామీ! నన్ను పాము పట్టుకుంటే రామా! **<u>రక్షించు</u>** అని ప్రార్థిస్తాను. మరి రామబాణమే గుచ్చుకుంటే ఎవరిని ప్రార్థించను? అని అన్నది. ఇంతటి దృఢవిశ్వాసము, భక్తి, శ్రద్ధలు గలవారికి జగమే సర్వంవిష్ణుమయం అనే భావన ఉంటుంది కదా! నీవు, నేను అనే బేధం లేని చోట భయానికి, దుఃఖానికి తావెక్కడిది? నామస్మరణలోని ఆనందాన్ని ఆశ్వాదిస్తూ అనుభవిస్తున్న వారికి ఆరాటం, ఆందోళన, ఆవేదన అనేవి కలగవు కదా! నిజమైన మనశ్శాంతి దైవ చింతనలోనే ఉంటుంది.

245. స్వామీ! యజ్ఞము యొక్క అంతరార్థము ఏమిటి? యజ్ఞము భార్యా సమేతంగానే చెయ్యాలంటారు. ఎందుకు?

యజ్ఞము చేయువారు పతీసమేతంగానే అనగా పత్ని ఉన్నప్పుడే యజ్ఞాధికారి అవుతాడు అంటారు. అంటే దీనిలోని అంతరార్థం ఏమనగా, పత్ని అనగా శ్రద్ధ. కనుక బ్రహ్మత్వ భావన శ్రద్ధతో కూడుకున్నప్పుడే యజ్ఞము సంపూర్ణమవుతుంది. బ్రహ్మకు శ్రద్ధయే పత్ని (సరస్వతి). మానవుని హృదయమే వేదిక, శరీరమే యజ్ఞ గుండము. మీ వెంట్రుకలే దర్భలు, మీ వాంఛలే సమిధలు, మీ తాపమే నెయ్యి, మీ క్రోధమే పశుత్వము, అందులోని తపశ్శక్తియే అగ్ని. తపస్సనగా మనస్సు, వాక్కు, కాయము. ఈ మూడింటి ఏకత్వమే తపస్సు. ఆ తపస్సే అగ్ని నుండి వెలువడే తేజస్సు, అదియే మనోయజ్ఞము. ఋగ్వేదం వాక్ స్వరూపంగా ఉంటుంది. సత్యమైన, పవిత్రమైన పరోపకారమైన వాక్యములు మీ నోటినుండి ఉచ్ఛరించుటయే ఋగ్వేదమంత్రము. మీ నేత్రములు యజుర్వేదము. పవిత్రమైన దృష్టితో మీరు ఈ

జగత్తును పరిశీలించినచో అదే యజుర్వేదసారము. స్తోత్రములు సామవేదము. దివ్యమైన పవిత్రతతో కూడిన శ్రవణమే వేదసారము. కనుక మీరు యజ్ఞయాగాది క్రతువులు బాహ్యమైన వేదికలు, హోమగుండములు పెట్టి చెయ్యనక్కరలేదు. అయితే అంతర్భావములను అభివృద్ధి పరచుకునేంతవరకూ బాహ్యమైన కర్మలను ఆచరించవలసి ఉంటుంది. కానీ అన్ని యజ్ఞములకన్నా జ్ఞానయజ్ఞమే శ్రేష్ఠమైనది, ఉత్కృష్టమైనది. జ్ఞానయజ్ఞం గురించి ఏ గ్రంధాలలో దొరకదు. అహంకార రహిత, స్వార్ధ రహిత కర్మలను ఆచరించటమే జ్ఞానయజ్ఞము. ప్రతి యజ్ఞమునకు కర్త భగవంతుడే. కర్త, భర్త, భోక్త నాయకుడుగా ఉంటాడు. భగవదానుగ్రహం పొందాలనుకునేవారు తమ నిత్య జీవితమునే యజ్ఞముగా భావించుకుని మీ వాంఛలను సమిధలుగా కామమునే నెయ్యిగా హోమం చేసి పశుత్వ గుణములనే బలిపీఠానికి ఆహుతి ఇవ్వాలి. ఇదే యజ్ఞము యొక్క సారము.

246. స్వామి! ప్రేమ, దయ ఈ రెండూ ఒక్కటేనా?

సకల సద్గుణాలలో ప్రేమే ప్రధానమైనది. ప్రేమకు రెండవ పేరు దయ. ప్రేమించే కొద్దీ ప్రేమ అనంతంగా పెరుగుతూనే ఉంటుంది. దీనికి తుకారాం అత్యద్భుతంగా నిర్వచనం ఇచ్చాడు. భగవంతుడ్ని ఏకాత్మ భావంతో పొందటమే జ్ఞానమని పెద్దలు చెబుతారు. అద్వైత దర్శనం అంటే జ్ఞాన దర్శనం. ఆ మార్గంలో నిన్ను చేరుట అంటే పొందటము సామాన్య విషయమా? సామాన్య మానవులకు సాధ్యం కాదు కనుక నాకీ జ్ఞాన మార్గం అవసరం లేదు. జప తపాది కర్మల వంటి కఠిన కార్యాలు నేను చేయలేను. ఒక్క ప్రేమ ద్వారా మాత్రం నిన్ను వశం చేసుకునే శక్తి నాకున్నది. ఆ ప్రేమయే నాలో అభివృద్ధి అయ్యేలా ఆశీర్వదించు అని కోరాడు. మనిషికీ మనిషికీ మధ్య ఉండే అనురాగాన్ని ప్రేమ అని కొందరూ, మనిషికీ పదార్ధానికీ మధ్య ఉండే ఇచ్ఛా శక్తిని ప్రేమ అనీ, మనిషికీ విషయానికీ మధ్యన ఉండే సంబంధము ప్రేమాయని చెబుతారు. కానీ నా దృష్టిలో అది స్వార్ధ ప్రేమ. ఎందుకంటే అది స్వప్రయోజనాన్ని **కాంక్షించేది** కనుక. అందుకే అది స్వచ్ఛమైన ప్రేమ కాదు. ప్రేమ అప్పువలె ఇచ్చి పుచ్చుకునేది కాదు. స్వచ్ఛమైన ప్రేమ స్వార్ధ రహితమైనది. ఇటువంటి ప్రేమ ద్వారానే మీరు భగవంతుడ్ని పొందటానికి అవకాశముంటుంది. ప్రేమ లేని జీవితం, ప్రేమ లేని గమ్యము, ప్రేమరాహిత్యంతో మీరు భగవంతుడిని చేరలేరు. మీ హృదయ**క్షేత్రాన్ని** సాగుచేయటంలో ప్రేమనే ప్రధాన పనిముట్టుగా తీసుకోవలసి ఉంటుంది. సూర్యుని నుండి కిరణాలు, సముద్రము నుండి అలలు పుట్టినట్లు దైవం నుండి ప్రేమ పుట్టింది. కనుక ప్రేమ దైవ స్వరూపమే. దైవాన్ని దర్శించాలంటే ప్రేమద్వారానే

దర్శించాలి. ఐతే ప్రేమ ప్రేమ నిమిత్తమే తప్ప స్వార్థ నిమిత్తం ఉపయోగించుకోకూడదు. నేను లేని స్థలమేది? నీ దృష్టి పడిన ప్రతి పదార్థంలోనూ, నువ్వు నడిచిన ప్రతీ ప్రదేశములోనూ, ప్రతీ వ్యక్తిలోనూ నేనుంటాను. అణువు అణువునా అణుస్వరూపంగా నేనున్నాను. నేను లేని స్థలం ఉంటుందా? ఉన్నదా? సర్వభూతాంతరాత్మ అనేది మానవత్వానికి మాత్రమే పరిమితం కాదు. పిపీలకాదుల నుండి బ్రహ్మాదుల వరకూ జీవత్వమనేది ఆత్మతత్వంగా, ఏకత్వంగా ఉంటుంది. ఇది ఆనాడు గీతలోనూ చెప్పాను ఇప్పుడు మీతోనూ చెబుతున్నాను. ప్రతీ ప్రాణియందునూ దైవత్వమున్నది. దైవ గుణమైన ప్రేమను సర్వజీవులకు ప్రసరింపచేయాలి. దేవుని భజించుచూ జీవుని హింసించూ, దేవుని పూజించుచూ జీవుని బాధించుచూ ఉండినచో సమత్వమునకు విరుద్ధమైపోతుంది. జీవుడే దేవుడు. దేవుడే జీవుడు. దయ దయ అని మాటలు వల్లించినంత మాత్రాన సరిపోదు. బాధపడుతున్న వ్యక్తుల బాధలు పోగొట్టి సాధ్యమైనంత వారిని ఆదుకోవాలి. అందుకే దయగల హృదయమే దైవ మందిరం అంటాను. దానిని ఆచరిస్తున్నవారెవ్వరు? నేను మీ అందరి పాలిటి కామధేనువును, **కల్పవృక్షాన్ని**. ఈ కామధేనువు నుండి **క్షీరాన్ని** గ్రోలాలి. ఈ కల్పవృక్షము నుండి ఆధ్యాత్మిక సంపదను అందుకుని జీవితాన్ని చరితార్థము కావించుకోవాలి. నల్లరేగడిపైన పడిన జలం నల్లగా మారిపోతుంది. ఎర్రభూమిపై పడి ఎర్రగా మారుతుంది. సముద్రంలో పడి ఉప్పగా మారుతుంది. నదిలో పడి తియ్యగా మారుతుంది. అదే విధంగా ప్రేమ పరమాత్మ స్వరూపమైనప్పటికీ వారి వారి హృదయ పరిపక్వాన్ని బట్టి స్వార్థంగా, పరార్థంగా, స్వప్రయోజనంగా, స్వార్థరహితంగా రూపొందుతుంది. ఈ కారణంగానే మీరు భగవంతుని గుణరహితుడిగా భావిస్తున్నారు. కానీ నిజానికి భగవంతునిలో ఎట్టి మార్పులూ లేవు, రావు. మానవుని భావాలలోనే మార్పులు. భావాలే అనేక రూపాలుగా మార్పు చెందుతూ ఉంటాయి. నిజమైన, పరిపూర్ణమైన నమ్మకము గలవాడు మార్పు చెందడు. నిత్య, సత్య, నిర్మలమైన హృదయంలో హత్తుకున్న ప్రేమ చెదరదు, చెరగదు. ప్రేమే దైవం కనుక ప్రేమ స్వరూపుని ప్రేమ ద్వారానే పొందాలి. అటువంటి పవిత్ర ప్రేమనే మీ నుండి నేను కోరుకుంటున్నది. ఎల్లప్పుడూ నా యందు మనస్సు కలవారై సర్వులనూ దయ, ప్రేమతో **వీక్షించగలిగిన** జ్ఞానాన్ని పొందండి. జ్ఞానయోగము జీవాత్మను పరమాత్మ వద్దకు చేర్చునటువంటి నిరుపమాన సామర్థ్యము కలది. పరమాత్మ యందు చిత్తమును నెలకొల్పుటయు, ప్రీతిపూర్వకముగా భగవంతుని భజించుటయు కూడా అందుకు అవసరమైన యోగ్యతను ప్రసాదిస్తాయి. ఆయోగ్యతవలననే అంతర్యామిని దర్శించగలుగుతారు.

247. స్వామీ! మిమ్మల్ని ధ్యానించేవారు అది కావాలి, ఇది కావాలి అని కోరుకుంటారు. ఆధ్యాత్మిక ఉన్నతిని కోరుట కూడా అసంజసమనిపిస్తుంది. ఇది ఎంతవరకు సబబు అంటారు? కోరుట సమంజసమా కాదా స్వామి?

భగవంతుని ప్రతిఫలాపేక్షతో ఎప్పుడూ ధ్యానం చేయకూడదు. భగవంతుని అనుగ్రహ ధనాగారంలో ఎటువంటి విలువైన దివ్యమైన సంపదలున్నాయో ఎవ్వరికీ తెలియదు. నా అనుగ్రహానికి పాత్రుడైన భక్తునికి నేను ఏమి ఇవ్వాలని సంకల్పిస్తానో అది కూడా ఎవ్వరికీ తెలియదు. మరి మానవుడు అల్పమైన వస్తువులనూ, ఆటవస్తువులనూ భగవంతుని నుండి కోరుతూ తమ దివ్య శక్తిని కోల్పోతున్నాడు. కోరికలు కోరినపుడు భగవంతుని మెప్పుపొందాలని భగవంతుని వర్ణిస్తూ నీవు కరుణాసాగరుడవు, ఆపద్బాంధవుడవు, ఆనాధరక్షకుడవు అని వర్ణిస్తూ వల్లించడము వల్ల భగవంతునికి సంతోషము కలుగదు. విసుగు కల్గుతుంది. ప్రాచీనకాలంనుండి ఋషులు, యోగులు ఈ విధంగా భగవంతుని వర్ణించినా స్వార్ధ స్వప్రయోజనాల నిమిత్తమై కాక లోకకళ్యాణము కొరకు ప్రార్ధిస్తూ భగవంతుని స్తుతించేవారు. కానీ ఈ నాటి మానవుడు ప్రతీదీ స్వార్ధంతో కూడుకున్నదై చివరకు భగవంతునితో కూడా వ్యాపార సరళికి దిగి భగవంతుని కూడా దించాలనే ప్రయత్నము ప్రారంభించాడు. రాజకీయ నాయకులను ముఖస్తుతి చేయుట అలవాటయ్యి చివరకు నన్ను కూడా అదే రకమైన స్తుతులు, స్తోత్రాలు చేయుట మొదలుపెట్టాడు. వాడికన్నా హీనస్థితిలోకి దిగజార్చుతున్నాడు నేటి మానవుడు. అదే చాలా బాధ కల్గుతుంది. ప్రతి ఒక్కరిలో మార్పు రావాలి. శరణాగతి తత్వాన్ని అవలంబించాలి. భగవంతుడే పరిపూర్ణంగా నిన్ను ఉద్ధరించగలడు అన్న స్థితి మానవుడు సాధించాలి. భగవంతుని ధ్యానమే ధ్యాసగా, ధ్యాసే ఊపిరిగా, తలంపే తపస్సుగా నిత్యం మీయొక్క ఉనికి భగవంతునితో బంధించబడేలా చేసుకొనగలగాలి. భగవంతునితోటి బాంధవ్యాన్ని మరింతగా పటిష్ఠం చేసుకోవాలి. చేసుకోగలగాలి. అందుకు తగిన అర్హతను సాధించుకోవాలి. భగవంతుని ఒక బొమ్మగానే చూస్తూ కీర్తనల ద్వారా, అష్టోత్తరాల ద్వారా పూజిస్తున్నాము అనుకుంటూ కేవలము పూలు, **<u>అక్షింతలను</u>** పటముపై చల్లుచూ నాకు ఈకోరికలున్నాయి, ఆ కోరికలున్నాయి, నిన్ను నేను ఇన్ని పూలతో పూజ చేసాను, ఇన్ని సహస్రనామాలు చేసాను అంటూ ఎంత ఏకరవు పెట్టినా ఫలితంశూన్యం. నీవు నిన్ను భగవంతునితో కలుపులేకపోయినపుడు ఎన్నిచేస్తే ఏమిలాభము. మీతో ఆడుటకు, పాడుటకు, మాట్లాడుటకు నాకు చాలా ఉత్సాహము. అందుకే మానవాకారాన్ని ధరించి మీతో చరిస్తూ ఉంటాను. మానవాకారాన్నే అభిలషిస్తూ ఉంటాను. నన్ను మీతో ఒక మిత్రుని వలే, చెలికాని వలే భావించినపుడు

నాకు కూడా మీపై ప్రీతి కల్గుతుంది. ఓ ప్రియమైన మిత్రుడా, ఓ హృదయ రత్నమా, ఓ మిత్రమా అంటూ నీలో నన్ను కలుపుకుని అనగా నీలో ఉన్న నన్ను గుర్తించి వర్తించినపుడు నాకూ ఆనందం కలుగుతుంది. నన్ను పూర్తిగా అనుభవించండి, ఆనందించండి. వ్యాపార సరళి కట్టిపెట్టండి. ఇప్పటికైనా మార్పు తెచ్చుకోండి. ఇంతకన్నా నాకు ఇవ్వవలసింది, అందించాల్సింది, నేను కోరేది మీనుండి వేరే ఎదీ లేదు. మీరు మిత్రునిగా భావించినపుడు మీకు అతి సన్నిహితంగా ఉంటాను. నన్ను ఎంతైనా ప్రసన్నుడ్ని చేసుకోవచ్చు. సన్నిహితంగా ఉన్నప్పుడే మీ మీ అభిష్టాలు నెరవేరుతాయి. త్యాగరాజు అనేక సాధనలు చేసి అనేక కోట్ల జపము చేసి నిత్య, సత్య స్వరూపమైన భగవంతుని **సాక్షాత్కారింప** చేసుకున్నాడు. రాముడ్ని తన ఇంటికి ఆహ్వానము చేసినపుడు ఈ విధంగా ఆహ్వానించాడు. "రారా మా ఇంటి దాకా రఘువరా, సుకుమారా, నేమ్రొక్కెద. దశరధ కుమారా నన్నేలుకోరా నేతాళలేనురా" అంటూ రాముడ్ని తనకు సన్నిహితుడిగా భావించి అలా పిలవగలిగాడు. మీరు కూడా అంత సన్నిహితత్వంలో పరమ సన్నిహితులై పిలవండి. పలకటానికి సిద్ధంగా ఉన్నాను. మీ యొక్క కష్ట నష్టాలు, సుఖ దుఃఖాలు, ఆనందానందాలు ఏవైనా, ఏస్థితినైనా, ఏ సందర్భమైనా, ఏ సమయమైనా ఎటువంటి అననుకూల పరిస్థితియందైనా స్వార్ధాన్ని, స్వప్రయోజనాన్ని ప్రక్కకు నెట్టి నిన్ను నిన్నుగా, నన్నూ నిన్నుగా తలచిన తక్షణమే స్వస్వరూపంగా నీ ముందు **సాక్షాత్కరించి** నీలో ఉన్న నేను సమాధానమిచ్చుటకు ఎల్లప్పుడూ ఎదురు చూస్తూ ఉంటాను. ఇది సమంజసమైన పద్ధతి, కోరిక కూడా.

248. స్వామీ! మానవ జన్మను ఎలా ఉన్నత జన్మగా పరిగణించవచ్చు?

స్థావరాల్లో హిమాలయం లాగా, జలాశయాల్లో సాగరం లాగా, **వృక్షాలలో** అశ్వద్ధం లాగా, అశ్వాల్లో ఉచ్చైశ్రవం లాగా, మత్తేభాల్లో ఐరావతం లాగా, ఆయుధాలలో వజ్రాయుధం లాగా, గోగణాల్లో కామధేనువులాగా, నదుల్లో గంగ లాగా, విద్యల్లో ఆధ్యాత్మవిద్య లాగా, అక్షర సముదాయంలో అకారం లాగా, సమాసాల్లో ద్వంద్వ సమాసం లాగా, సారస్వతంలో ఓంకారం లాగా, ఛందస్సులో గాయత్రి ఛందస్సు లాగా, మాసాల్లో మార్గశీర్షం లాగా, మానవుని సర్వ అవయవాల్లో శిరస్సు లాగా, శిరస్సులో మనస్సు లాగా, బుద్ధి లాగా, జ్ఞానం లాగా, విజ్ఞానం లాగా, ప్రజ్ఞానం లాగా, సుజ్ఞానం లాగా సమస్త జీవరాశిలో మానవ జన్మకు ఒక విశిష్ట స్థానమున్నది. ఈ లోకంలో ప్రాణం కల్గిన ఏ జీవిగానైనా పుట్టవచ్చు, పెరగవచ్చు, గిట్టవచ్చు కానీ జ్ఞాన సంపన్నమైన మానవ జన్మను పొందటం కష్టము. సాధ్యమే కాదు. 84 లక్షల జాతి

బేధాలు గల జీవులున్నాయి. ఈ జీవుల్లో ఉత్తమమైన జీవి మానవుడు. ఆశ్చర్యమేమంటే ఈ సమస్త జీవరాశి తల్లి గర్భం నుండి జన్మిస్తూనే ఏడుస్తూ ఆ ఏడుపు జన్మ హక్కుగా పొందిన మానవుని ప్రత్యేకత ఏమనగా తల్లి గర్భము నుండి నేలపై పడుతూనే "క్వ క్వ క్వ ...." అంటూ పసిపాపగా ఏడ్చేటపుడు వినబడే ఆ అక్షరాలు ఎంతో భావగర్భితాలు. దేవ భాష, అమృత భాష, వేద భాష, గీర్వాణ భాష అయిన సంస్కృత భాషలో "క్వ" అంటే ఎక్కడ? అని అర్థం. ఈ ప్రపంచములో మానవుడిగా జన్మించే జీవి మనస్సులో మెరిసిన ఈ సందేహానికి జవాబు కొరకు వెదకుట ఒక్క మానవుడే మొదలుపెట్టాడు.

249. ధ్యానం దేని కొరకై చేయాలి?

కష్టనష్టములు, సుఖదుఃఖములు, విచారములను, భయ బ్రాంతులను దూరం చేసేది ధ్యానం. వీటిని దూరం చేసి దివ్యత్వమైన దైవత్వానికి సన్నిహితత్వము ఏర్పర్చేది ధ్యానము. ధ్యానము అంటే ఎవరో ఒకరిని తలుచుకోవటం కాదు. ఒక చిత్రాన్ని కానీ, ఒక భావాన్ని కానీ అనగా రూప నామములను ధ్యానిస్తూ అందులో తాదాత్మ్యభావం పొందటం లేదా అనుభవించటం తాత్కాలికమైనది, లౌకిక లేక అపర ధ్యానం. ఇది కొంత కాలం నిలచి తర్వాత భిన్నం కావచ్చు. కానీ ఆధ్యాత్మిక లేక పర ధ్యానం అటువంటిది కాదు. అగ్నిలో వేసిన ఇనుము అగ్నిలో(తో) చేరినట్లు ధ్యానం, ధ్యాత, ధ్యేయము మూడూ ఏకమైపోవాలి. ఇదే "నిరవధిక" ధ్యానము. ఈ మూడూ ఏకమైపోవుటకే ధ్యానాన్ని చేయాలి. నిజానికి ధ్యానం ఉద్దేశం కూడా అదే.

250. సామాన్య భక్తికి, అనన్య భక్తికి గల తేడా ఏమిటి స్వామి?

జీవులు మాతృ గర్భమునందు పిండ రూపముగా ప్రవేశించిన క్షణము నుండి మాతృగర్భము నుండి విశ్వగర్భమునందు బయల్పడి జీవనయాత్ర సాగిస్తూ తుదిశ్వాస విడుచువరకూ అనుక్షణమూ భయమే, దుఃఖమే, బాధలే తప్ప అన్యము లేదు. కారణం జీవులందరివీ కర్మజన్య శరీరులగుటయే. పూర్వజన్మ కర్మఫలానుభూతిని పొందుటకే జన్మపరంపర కొనసాగుట. జన్మరాహిత్యత ఒక్కటే నిర్భయస్థితిని ప్రసాదించెడిది. అది కేవలము ఒక్కటే నిర్భయ స్థితిని ప్రసాదించెడిది. అది కేవలము దైవం ఒక్కడే నాకు శరణం తప్ప అన్యము లేవియూ కావనెడి ఆత్మవిశ్వాసము, దైవానికి సంపూర్ణ శరణాగతుడు అగుటయే

జన్మ రాహిత్య స్థితిని చేర్చగలుగుతుంది. అట్టి దృఢ విశ్వాసమునే భక్తి అని తెలుసుకొనుము. అది భగవంతుని తలంపు నుండి సాధకుని క్షణమైనా విడదీయరానటువంటిది. దానినే అనన్యభక్తి అని వ్యవహరిస్తారు. అట్టి భక్తియే సదాదైవస్మృతిని, సాన్నిధ్యమును అనుగ్రహించమని వేడుకొనేది. తదన్య ప్రక్రియలన్నీ భగవంతుని తమ తమ స్వార్ధమునకు వాడుకొనెడివని గమనించిన నాడు సామాన్య భక్తికి, అనన్య భక్తికి గల వ్యత్యాసము బోధపడ్తుంది.

251. స్వామీ! చాలా మంది నన్ను అడుగుతూ ఉంటారు. కొంత మంది ధనవంతులుగా, కొంత మంది ధనము లేకుండా, ఇంకా కొంత మంది వికలాంగులుగా జన్మను తీసుకొని కష్టాలు అనుభవిస్తూ ఉంటారు. దీనికి కారణమేమిటి?

పాపమనేది మీరు చేసే పనులు అంటే కర్మ ద్వారానే వస్తుందని అందరికీ తెలిసిన విషయమే. మీరు సత్కర్మ అంటే మంచి పనులు చేస్తే మంచి జరుగుతుందని, చెడు పనులు చేస్తే చెడు జరుగురుందనీ నమ్మకం మీకు నరనరాలా జీర్ణించుకుపోవడమే అందుకు కారణం. కానీ శ్రేష్టములైన కర్మలను ఆచరించుట వలన సాత్వీక ఫలము అనగా సుఖము, జ్ఞానము మొదలగు నిర్మల ఫలములు కల్గును. రాజస కర్మలకు దుఃఖము, తామస కర్మలకు ఫలము అజ్ఞానము. విత్తనమే లేకపోతే ఫలించేది ఏముంది? విత్తనమనే ప్రాప్తి ఉన్నప్పుడే ఫలములు అందుకోవడానికి అవకాశముంటుంది. కనుక మీరు చేసే ప్రతీ పని ఆలోచించి చేయాలనేది స్పష్టము. కానీ నిత్య జీవితంలో మీరు జీర్ణించుకోలేని కొన్ని చేదు అనుభవాలు ఉంటాయి. ఉన్నత పదవుల్లో అవినీతికి పాల్పడి సుఖభోగాలు అనుభవించేవారు, ఎన్నో దౌర్జన్యాలు చేస్తూ దర్జాగా తిరిగే వారిని చూచి వారితో పోల్చుకుని భగవంతుడు అలాంటి వారికి అన్నీ ఇస్తున్నాడని భ్రమిస్తుంటారు. కానీ కొందరు సుఖులై జన్మింతురు. పరిపూర్ణ ఆరోగ్యభాగ్యములు అనుభవింతురు. మరి కొందరు నిర్భాగ్యులై జన్మింతురు. కొందరికి కాళ్ళు, చేతులు ఉండవు. కొందరు మతి హీనులుగా పుట్టుదురు. వారందరినీ పుట్టించిన వాడు ఎవడు? అట్టి సమదృష్టి కలిగిన భగవంతునకు ఇట్టి పక్షపాత బుద్ధి ఎలానని ప్రశ్నించినా, వాదించినా వాదించవచ్చును. ఈశ్వర పరిపాలనా రాజ్యములో ఇట్టి బేధములు ఏల కలుగవలెనని ఊహించుకోవచ్చును. అయితే మానవుని కష్టసుఖములకు, దౌర్భాగ్యా భాగ్యములకు కారణము పరమాత్మకాడు. ఈ జన్మకు పూర్వము చేసిన కర్మలే మూలకారణము. ఇవి స్వయంకృతములు. పూర్వ జన్మకర్మలు, మానవశరీరము, పోకడలు వారికి వంశపారంపర్యంగా సంక్రమించిన లక్షణవిశేషాలు.

కర్మఫలాన్ని అనుభవిస్తున్న వారు సుఖాన్నో, దుఃఖాన్నో అనుభవిస్తున్నారనేదానికి కౌరవులు, పాండవులనే చెప్పుకోవచ్చు. కౌరవులు పుణ్యకరమఫలమగు సుఖములను అనుభవించుచూ పాపకార్యములు చేసిరి. పాండవులు పాపకర్మఫలమగు కష్టములు అనుభవించుచూ పుణ్యకార్యములు చేసిరి. ఈ రెండే వివేకము లేనివారికి, ఉన్నవారికి గల బేధము. కష్టములు అనుభవించు సమయమున పాపకర్మఫలమును తలంచి భగవంతునిపై కోపము, విసుగు రానీయక ఆ కష్టములనే తలంచక పుణ్యకార్యములు, పరోపకారము చేయుచూ భగవంతుని నామాన్ని తలంచుచుండినయెడల అదియే వివేకమునకు గుర్తు. పుణ్యఫలము అనుభవించు సమయమున మరింత పుణ్యకార్యములనే చేయుచుండిన అట్టివారి జన్మ భగవత్ సాన్నిధ్యమును చేరును. ఇది ఉత్తమ గుణలక్షణము.

252. స్వామీ! మానవునికి మానసిక శాంతి లేదు అంటాడు. ఎందుకని?

ఈ రోజు పౌర్ణమి అనుకుంటాడు. కానీ రేపే చీకటి ప్రారంభమవుతుంది. ఈ రోజు అమావాస్య అంటారు. కానీ రేపటి నుండే చంద్రుడు వృద్ధి చెందుతూ ఉంటాడు. అదే రీతిగా కష్టము, సుఖము వచ్చిపోయే బంధువుల వంటివి. బంధువులు ఎప్పుడూ ఉండరు. వస్తూ పోతూ ఉంటారు. అదే రీతిగా మీకు కష్టాలు, సుఖాలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. మధ్యలో వచ్చి పోయేటటువంటివే బంధుత్వాలు. కానీ దైవత్వం అలా కాదు. దైవం ఆపద్బాంధవుడు. మీ వెంట, జంట, కంట, ఇంట ఉండి కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటాడు. అందుకు తగిన అర్హతను మానవుడు సంపాదించుకోవాలి. ఆ అర్హత నిరంతర దైవ చింతన వలన సాధ్యమవుతుంది. దైవ చింతన చేస్తే ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా, లౌకికంగా, భౌతికంగా, ధార్మికంగా అన్ని విధాలా దైవం ఆదుకుంటాడు. మీకు నిజమైన సుఖ సంతోషాలు మనశ్శాంతి ఆధ్యాత్మిక చింతన వలన లభ్యమవుతాయి. మనశ్శాంతి ఆధ్యాత్మిక చింతన వలన లభ్యమవుతుంది. ఆధ్యాత్మిక చింతన మీకు ఎనలేని తృప్తిని ఇస్తుంది. ఆ తృప్తే మీకు నిజమైన సుఖాన్ని అందిస్తుంది. సుఖాన్ని దూరం చేసే క్రోధాన్ని గురించి విజ్ఞతతో ఆలోచించే వారికి నేను ఒక సలహా ఇస్తాను. అదేమిటంటే కష్టములన్నీ ఒక సుఖాన్నివ్వటానికే వస్తున్నాయి. రెండుబాధల మధ్యనే ఉంటుంది సుఖం. ఈ కష్టనష్టములను, దుఃఖములను ధైర్యంగా ఎదుర్కొవడానికి తగిన శక్తిసామర్థ్యములను సంపాదించుకోవాలి. వాటిని ఎదుర్కొనుటకు తగిన శక్తి దైవానుగ్రహము ఒక్కటే. దైవానుగ్రహం పొందాలంటే ముఖ్యంగా మిమ్మల్ని మీరు సరిచేసుకోవాలి. పలికే ప్రతీ పలుకు బాగా ఆలోచించి మాట్లాడాలి. మీలో ఉన్న ద్వేషాన్ని, అహంకారాన్ని

అదుపులో పెట్టుకోవాలి. ఎవ్వరి మీదా ద్వేషాన్ని పెంచుకోకూడదు. కోపం వచ్చే పరిస్థితి వస్తే దానిని అదుపులో పెట్టుకోవాలి. ఆ పరిస్థితి రానే రాకూడదు. ఈ కోపం వలన అనేక దుష్ఫలితాలను ఎదుర్కోవలసి ఉంటుంది. అంతే గాక వృద్ధాప్యఛాయలు అతి త్వరలో ప్రారంభమవుతాయి. అందుకే ఎప్పుడూ నవ్వటానికి ప్రయత్నించాలి. ఈ చిరునవ్వు దైవత్వాన్ని నిరూపిస్తుంది. దైవంతోటి సాన్నిహిత్యాన్ని పెంచుతుంది. అహంకార మమకారములు దూరం చేసుకుని సుఖమును, దుఃఖమును సమముగా భావించి ఓర్పు కలిగినటువంటి వ్యక్తి నాకు అత్యంత ప్రియుడు. ఇది సామాన్య సాధకులకు అసాధ్యము. కష్టతరము. ఐతే మీతత్వము దైవాజ్ఞలకు భిన్నంగా చూచినంత వరకూ ఇది మీకు కష్టము. దైవము యొక్క ఏకత్వమును, మానవుని యొక్క దివ్యత్వమును గుర్తించిన తర్వాత ఇది మీకు సులభముగా అర్ధమౌతుంది.

253) **ప్ర.** సంతోషంగా ఉండుటకు చిన్న సలహా ఒకటి ఇవ్వండి స్వామి. చిన్నది ఇవ్వండి పెద్దదైతే మేము పాటించలేము.

**జ.** (చిన్నగా నవ్వి) స్వామికి అన్నీ చిన్నవే. అవి మీ దృష్టిలో పెద్దగా ఉంటాయి. సరే సంతోషం యొక్క రహస్యం మీకు నచ్చినది చేయుటలో లేదు. ఏది మీరు చేయాలో అది నచ్చినపుడు సంతోషం కలుగుతుంది.

**ప్ర.** అది చాలా కష్టమైన పనిలా ఉన్నది స్వామీ.

**జ.** అవునా! సమస్తము ఆ పరమాత్మునికే చెందుతుందని అర్ధం చేసుకున్న రోజున మీలో జ్ఞానం ఉదయించిందని అర్ధం.

**బ్రాహ్మణి, భరణిల మధ్య సంభాషణ:**

స్వామి అనుగ్రహముచే నిర్మించబడిన 'శ్రీ సత్యసాయి అనుగ్రహ గృహము' నందు నివసిస్తున్న వారికి **<u>క్షీరాన్ని</u>** అందిస్తున్న గోమాత 'బ్రాహ్మణి' మరియు తన బిడ్డ అయిన 'భరణి'ల మధ్య జరిగిన ఉత్తమోత్తమమైన సంభాషణను స్వామి ఈ విధంగా విశిదీకరించారు.

వి - **విశాలాక్షి**

స్వా - స్వామి

బ్రా - బ్రాహ్మణి (తల్లి)

భ - భరణి (బిడ్డ)

వి. భూమి మీదకు వచ్చి అంటే జన్మను తీసుకున్న కొద్ది రోజులకే తనువును చాలించి మీ యొక్క సాన్నిధ్యాన్ని అనుభవించుటకు భరణి పూర్వజన్మలో ఎంతో సాధన సల్పి ఉండాలి. కావుననే గోమాతగా జన్మించి పూజలందుకుని పరమపదాన్ని పొందింది అని అనుకుంటున్నాను స్వామి.

స్వా. బాగానే ఆలోచించావు. నీవు అనుకున్నట్లే అది చివరి జన్మలో చాలా గొప్ప ఆధ్యాత్మిక సంపన్నుల గర్భాన జన్మించింది. జన్మతః బ్రహ్మచారిగా గడిపి తల్లి, తండ్రుల ఆశీర్వాద ఫలంతో జప, తపాది, యజ్ఞ క్రియలను నిర్వహించి జీవన సాఫల్యతను పొందే ప్రయత్నములో 94.6% సాధించుకున్నది. ఉత్తమమైన గోవుగా జన్మించాలన్న చిరకాల వాంఛ లోపల ఉన్నది. దానికి బ్రహ్మతత్వాన్ని అవలంభించి అనగా కలలో కూడా తన ఆలోచనలు దాంపత్య జీవనముపైకి వెళ్ళలేదు. అంతేకాదు చివరిక్షణంలో ఆధ్యాత్మిక తరంగాలలో కూడిన గర్భాన్ని నాకు ప్రసాదించండి అన్న ప్రార్ధన ఫలితంగా అత్యుత్తమమైన గర్భాన్ని ప్రసాదించుట జరిగింది.

వి. అంటే ఆ జన్మలో తాను ప్రార్ధించినట్లుగా బ్రాహ్మణి గర్భాన్ని ఆశ్రయించుకుని దేహధారియై భువిపైకి వచ్చిందా? అనగా జన్మ రాహిత్యాన్ని పొందిందా స్వామి?

స్వా. అవును వాటి వాటి గత జన్మ కర్మ ఫలాలనే భూమిపై అనుభవించుటకు శరీరధారులై వివిధ నామరూప గుణయుక్తులై పుట్టుచుందురు. 84 లక్షల జీవరాశుల సంగతి ఇదే. కర్మఫల

ప్రదాతయగు దైవముచే ఆయా కర్మఫలములకు అనువుగా జన్మించి ఆయా కర్మఫలానుభవము పూర్తికాబడిన తక్షణమే ఉత్తరజన్మకు సంసిద్ధులగుటకానీ, జన్మరాహిత్య స్థితికి అర్హతపొంది ముక్తిధామమును అలంకరించుట గానీ జరుగునని కర్మసిద్ధాంతము మీకు తెలియపర్చుట.

వి. భరణి వచ్చిన పని అయిపోయినదా? అది ఎటువంటి పని? తాను చిన్న బిడ్డ. ఏమి కర్మ సల్పినది? ఏమి అనుభవించింది? అది ఎలా పూర్తి అయినది? ఇవి అన్నీ సందేహాలే స్వామి.

స్వా. శరీరధారులెవరైనా ఆయా శరీరధారణ స్థితిని దైవము ద్వారా పుచ్చుకుని లేదా తెచ్చుకున్నదే గానీ అన్యథా వేరొక విధంగా పొందినది కాదు అన్నది సుష్పష్టము. ఏది వచ్చినా, ఎలా వచ్చినా, ఎవరి ద్వారా వచ్చినా నిర్ణీత కాలములో వినియోగించుకుని ఇచ్చిన వారికి తిరిగి ఇవ్వవలసిందే కదా? ఆ జీవి యొక్క ఇష్టాఇష్టాలపై ఆధారపడి ఉండదు. కానీ వారి యొక్క జీవన శైలి, తుది వరకూ వారు గడిపిన, అనుభవించిన జీవన మార్గం దాని ద్వారా యోగిగా మారి మిగిలిన సాధన కొరకు పిటీషన్ పెట్టుట జరుగుతుంది. దాన్ని భగవంతుడు ఆమోదించి జన్మను ప్రసాదించుట జరుగుతుంది. భరణి మిగిల్చుకున్న కర్మ కొద్దిపాటిది. ఎంత సంస్కారము కూడగట్టుకోకపోతే ఇంతటి మహర్దశ అనుభవిస్తుంది? బ్రాహ్మిణి లాంటి తల్లి గర్భాన జన్మను తీసుకుంటుంది? తల్లిని సాయిగీతతో పోల్చవచ్చు. ఘోటక బ్రహ్మచారి. భరణి సంపర్కము వలన కలిగిన సంతానము కాదు. భౌతికమైన డాక్టర్లు సంతానం కొరకై చేసిన ప్రయత్నంతో జన్మనిచ్చుట జరిగింది. అది కూడా కారణజన్మను. ఒక యోగికి (భరణికి) జన్మను ప్రసాదించింది. ఆ యోగితత్వమే పుట్టినది మొదలు ఆనంద స్వరూపముగా జీవించింది. సహస్రారముపై పెద్ద సుడి ఉన్నది. అనగా పుట్టుకతోనే సహస్రారము తెరుచుకుని ఉన్నది. ఇంక పొందవలసినది, సాధించవలసినది ఏదీ లేదు. కావుననే పుట్టినది మొదలు నమస్కారాలను పొంది ఆ జీవులకు ఆ నమస్కారముల ద్వారా పుణ్యసంపదను అనుగ్రహించి దీని ద్వారా భరణి అతి త్వరగా సిద్ధిని పొందింది. తల్లీ (బ్రాహ్మిణి), బిడ్డ (భరణి)లు రెండు రోజులుగా దీర్ఘమైన ఆలోచనలతో తల్లి తన బిడ్డకు ఉన్నత సంస్కారముతో చేసిన హితబోధ ఇది. లోకంలో ఉన్న తల్లులందరూ ఆచరించవలసినది, సుసంపన్నమైనది మరియు మహోన్నతమైనది. బ్రాహ్మిణి తన బిడ్డతో ఈ విధంగా చెప్పింది. దీనిని బట్టి ఎంత సంస్కారమో ఆలోచించు.

బ్రాహ్మణి: నేను భగవాన్ నిర్దేశించిన విధంగా జన్మను తీసుకున్నాను. ఈ జన్మ కారణమేంటో తెలుసా? గోమాతగా బిడ్డలకు అమృత ధారలను అందివ్వటమే. కావున ఎదకువచ్చినట్లుగా భగవాన్ ఆజ్ఞతో రంకెవేసి ఋతుక్రమాన్ని ప్రదర్శించి బిడ్డకు జన్మను ఇచ్చి గోధార ప్రజలకు అందించాలన్న సుసంకల్పానికి నాంది పలికినాను. దాని ఫలితంగా నీకు జన్మనిచ్చి అమృత ధారలను అందించే అర్హత సాధించుకున్నాను. గోవుగా జన్మించిన నీవు కూడా దీనిని ఆచరించి ధన్యురాలివి కావల్సి ఉంటుంది అన్నది తల్లిగా నీకు నేను చెప్పదలుచుకున్నది.

భరణి: అంటే జన్మ సార్ధక్యత సాధించుట అంటే మనము పదిమందికీ మంచిని పంచగలిగి ఉండాలి అంటావు. ఆ జీవులకు జ్ఞాన **<u>క్షీరాన్ని</u>** ప్రసాదించే మనకు జ్ఞాన ఆహారాన్ని అందివ్వాలి కదా! భగవాన్ నిర్దేశించినట్లుగా ఆహారాన్నిబట్టి భావాలు అంటారు కదా. స్వార్ధ భావాలతో కూడిన ఈ స్వార్ధ ఆహారంతో కలుషితమైన జ్ఞాన **<u>క్షీరం</u>** బదులు అజ్ఞాన **<u>క్షీరాన్ని</u>** ఇచ్చి తుది వరకూ వచ్చిన నా ఈసంకల్పశరీరము మరలా **<u>క్షీణించి</u>** **<u>క్షీణదశకు</u>** రాకూడదన్నది నా అభిమతం. దీనికి తల్లిగా నీ స్పందన ఎలా ఉన్నది?

బ్రాహ్మణి: నీవు చెప్పింది నిజమే. నీవు సాధించిన ఆధ్యాత్మిక స్థితి కన్నా నా ఆధ్యాత్మిక స్థితి తక్కువే అని చెప్పాలి. ఎందుకంటే ఈ జన్మను తీసుకున్నప్పటి స్థితి ఇప్పుడు చాలా తగ్గిందనే చెప్పాలి. తల్లిని అయినాను కావున ప్రలోభము అనెడిది నా వెంటపడి నిన్ను ఇంకొంత కాలము నాతో ఉంచే ప్రయత్నము కొనసాగించాను. కానీ బిడ్డగా తల్లిని సరి దిద్దుట అనేది నీవు చేస్తున్నావనుకుంటాను.

భరణి: నీ స్థితి నాకు తెలియకపోవచ్చు. కానీ నా స్థితి, నేను వచ్చిన కారణం అయిపోయింది. అంటే నాకు నమస్కరించిన వారి సంస్కారము పెరుగుట అనేది ప్రారంభమయ్యి వారి స్థితిని పెంచాను. వారి నమస్కారం ద్వారా నేను పొందినది సరిపోయినది. తల్లిగా నీవు అంగీకరించినట్లయితే నేను వచ్చిన నా దారికి వెళ్ళి 'భగవాన్'కు నా జన్మను అప్పగించి హృదయస్థానాన్ని అందుకుంటాను. తల్లిగా నీవు ఐహిక బంధాలకు ప్రాధాన్యత ఇవ్వక దారి

వదులు. తుది నమస్కారమందుకో. అమ్మకు నేను పాదాభివందనము చేయాలి. జన్మ బంధంతో ముడిపడిన దేహమాతకు, అమ్మమ్మకు (బ్రాహ్మణి తల్లి అయిన సింధూజ) నమస్కారము సమర్పిస్తూ తుది వీడ్కోలు తీసుకుంటున్నాను.

బ్రాహ్మణి: నీవు ఎంత ఆధ్యాత్మిక ఉన్నత స్థితిని కలిగిన జీవివో నాకు తెలుసు. తల్లిగా స్వార్ధపు ఆలోచనలతో నిన్ను కట్టడి చేయాలనుకున్నాను. నాలో పూర్తిగా స్వార్ధపు ఆలోచనలు రూపుమాసిపోయినవి. భగవాన్ ప్రసాదించిన మన ఇద్దరి జన్మలు సార్ధక్యం సాధించుకోవాలి. తల్లిగా ఇప్పుడు నీకు విముక్తిని ప్రసాదిస్తున్నాను. నీవు కోరిన కోర్కె అమ్మపై దృష్టిని నిల్పి ప్రాణాన్ని భగవంతునిలో కల్పుతాను అన్నావు ఆశీర్వదిస్తున్నాను. ఈ రోజు నుండి నా ప్రార్ధన అనంతంగా చేస్తాను. అదేమిటంటే నా జ్ఞాన **క్షీరాన్ని** గ్రోలిన ఈ ఆశ్రమ జీవులు తమ అజ్ఞానాన్ని దూరం చేసుకుని తమ తమ జన్మలు ధన్యమయ్యేలా ఆధ్యాత్మిక తరంగాలతో కూడిన **క్షీరాన్ని** అందించి కర్మయోగిగా మారి జీవన్ముక్తిని సాధిస్తాను. తప్పక నీ దృష్టిని భగవాన్ చరణములపై నిల్పి నీవు సెలవు తీసుకోవచ్చును.

భరణి: ఇంతటి మహోన్నతమైన తల్లికి, 'భగవాన్'కు నమస్కారం. నా నామం భరణి అని పెట్టుటలోని అంతరార్ధం గ్రహించావా? తారామండలంలోని నక్షత్రము వలే ఛమక్కుమని మెరిసి మెరుపులాంటి జీవితాన్ని అనుభవించి ధ్రువుని వలే తారామండలంలో స్థిరముగా ఉంటూ అచట నుండి నిన్ను **వీక్షిస్తూ** ఉంటాను. సమయము మించిపోతుంది. సెలవు.

స్వా: ఇద్దరూ ధన్య జీవులు, పుణ్య జీవులు, ఆరాధనా జీవులు, ఆత్మ **సాక్షాత్కార** జీవులు. అందుకోండి నా ఆశీస్సులు, ఆహ్వానము నాలోనికి అంటూ దివ్య దర్శనాన్ని ఇద్దరికీ అందించాను. ఆ ఆనందాన్ని అందుకున్న బ్రాహ్మణి తన కృతజ్ఞతా పూర్వక నమస్కారాన్ని పెద్దగా అందించింది.

# స్వప్న సాక్షాత్కారం

## (1)

ఎవరైతే భక్తులు అంతరంగము నుండి మనసూర్తిగా స్వామిని పిలుస్తారో ఆ పిలుపునందుకుని సర్వవ్యాపి అయిన స్వామి వారికి తమ ఆశీస్సులు అందచేస్తారు. ఇంతేగాక భగవంతుని ఏరూపముగానైనా పూజించి, ప్రార్థించిన యెడల స్వామి వారిపై తమ కరుణాకటాక్ష వీక్షణములు ప్రసరింపచేస్తారు. కారణమేమిటంటే స్వామియే పరమాత్మ. దైవం అంటే ఈ విశ్వానికి పాలకుడు.

ఈ ప్రపంచములోని అనేక మంది భక్తులకు స్వామి వారి వారి ఇష్ట దైవంగా దర్శనమిచ్చారన్న సంగతి లోకవిదితమే. చాలా మంది విదేశీయ భక్తులకు యేసు ప్రభువు రూపంలో కనిపించారు. చాలా మందికి షిరిడీసాయి రూపంలో కనబడి, ఇంకా కొంత మంది పుణ్యాత్ములకు షిరిడీలోని సమాధి మందిరంలో శ్రీ సత్యసాయిగా కాన వచ్చారు. తాను అవతారమని తెలియచేయక పూర్వం విరూపాక్ష దేవాలయంలో ఈశ్వరుని విగ్రహం బదులు సత్యసాయి కనబడటం అనే అద్భుతాన్ని చేసారు.

ఆంధ్రప్రదేశంలోని ఒక చిన్న పల్లెటూరు అయిన పుట్టపర్తిలో ధర్మాచరణతో జీవనం సాగించే శ్రీ కొండమరాజు గారికి ఒక రోజు వచ్చిన స్వప్నంలో ఒక దేవి దర్శనం ఇచ్చింది. దివ్య తేజస్సుగల ఆ దేవి వదనంలో వ్యాకులత గోచరిస్తున్నది. ఆ దేవి శ్రీకృష్ణుని అష్ట భార్యలలో ఒకరైన సత్యభామాదేవి. తన కోరికపై దేవపారిజాతం తెస్తానని వెళ్ళిన శ్రీకృష్ణుని రాకకై ఎదురుతెన్నులు చూస్తున్నది. రోజులు గడుస్తున్నాయి. కానీ శ్రీకృష్ణుని జాడ తెలియక దిగులుతో అతని వియోగంతో నయనాల నుండి అశృధారలు ప్రవహిస్తుండగా జడివాన మొదలైంది. ఆ వానలో సత్యభామ అలా తడుస్తూనే ఉండగా కొండమరాజు గారు ఆమెని

చూడటం తటస్థించింది. అప్పుడు సత్యభామ తనకి కొంచెం తలదాచుకోవడానికి నీడ కల్పించమనీ, శ్రీకృష్ణుని ఆగమనం వరకూ **నిరీక్షిస్తూ** తానిక్కడే ఉంటానని అన్నది. కల ముగిసింది. శ్రీకొండమరాజుగారు సత్యభామాదేవి మందిరం నిర్మించాలని నిశ్చయించుకున్నారు. ఆ విధంగానే మందిర నిర్మాణం జరిగింది. కలలో అమ్మను చూపించి, ఇలలో ఆ పని చేయించుకుని తానే పుట్టపర్తి వచ్చి ఎదురుతెన్నులు చూచే అందాల భామ సత్యభామ కొరకు సత్యసాయిగా శ్రీకృష్ణుడు అవతరించారు. ఎప్పుడైతే సాయి బాబా పుట్టపర్తిలో సత్యసాయి బాబాగా అవతరించారో పుట్టపర్తి గోకులమే కాకుండా నందనవనంగా రూపొందింది. ఒక రోజున మారుమూల పల్లెగా ఉన్న పుట్టపర్తి ఈనాడు జగద్విఖ్యాతి గాంచినది. జగమందలి లక్షలాది మంది ప్రజలు శ్రద్ధా భక్తులతో పుట్టపర్తిని ఒక **పుణ్యక్షేత్రంగా, దివ్యక్షేత్రంగా** కొలుస్తున్నారు. దీనికి కారణం శ్రీ కొండమరాజు గారికి పరమాత్ముడు కలలో చూపించిన విధంగా ఇలలో పుట్టపర్తిని **దివ్యక్షేత్రంగా** మార్చారు. స్వామి ఈ విధంగా చెబుతూ ఉంటారు "నా సంకల్పము లేనిదే నేను మీ కలలో కూడా కనిపించను". సంకల్పముంటేనే వస్తాను". ఒక మనిషి యొక్క మానసిక స్థితిని మార్చి దైవత్వం వైపు అడుగు వేసేలా చేస్తాను అని అన్న సత్యసాయి వాక్కులు ఈ రకంగా జరిగి తీరుతాయి అనే దానికి నిదర్శనంగా స్వామి ఇచ్చిన ఈ కల అంతరార్ధము తెలియపరుస్తుంది.

ఎక్కడో తెలియదు కానీ కలలో మా స్నేహితులమందరమూ కలసి ఒక శివలింగాన్ని ప్రతిష్టించుటకు ప్రయత్నము ప్రారంభించాము. అందుకోసము లింగాన్ని తీసుకుని ఒక బావి వద్ద స్నానము చేయించి తదుపరి సముద్రము వద్దకు తీసుకువెళ్ళి సముద్రంలో స్నానము చేయించి ఆ లింగాన్ని తీసుకువచ్చి సముద్రపు ఒడ్డున పెట్టగా ఆ లింగం లోపలి నుండి మాటలు వినిపిస్తున్నాయి. "నాకు ఇచ్చటనే బావుంది. నన్ను ఇచ్చటనే ఉంచండి. ఆ నాలుగు గోడల మధ్య కన్నా నాకు ఇచ్చటనే బావుంది. సముద్రుడు తన తరంగాలతో నున్న తాకడానికి ప్రయత్నిస్తున్నాడు. మానవునిలోని కోర్కెల యొక్క అలల తరంగాలు నా నుండి దూరంగా జరగటానికి ప్రయత్నిస్తున్నాయి. కావున నన్ను ఇచ్చటనే ఉంచండి. మానవునిలోని కోర్కెల అలలు తగ్గినపుడు నాకు నేనుగా ప్రత్యక్షమవుతాను" అంటూ ఉండగా కల సమాప్తమయ్యింది. తెల్లవారి లేచి మా **ఫ్రెండ్స్** కి ఫోన్ చేసి ఈ విషయమంతా చెప్పగా విని అంతా నిజమే ఇదే

విషయం ఇక్కడ జరుగుతోంది అని అన్నారు. నాకేమీ అర్థం కాలేదు. ఏమి చెబుతున్నారు అని అన్నాను. దానికి వాళ్ళు ఇచ్చట స్మశానంలో దహన కార్యక్రమం అయిపోయిన తర్వాత నిలబడుటకు కూడా స్థలం లేక చాలా ఇబ్బందిగా ఉండినది కావున అచట ఒక చిన్న రేకుల షెడ్డు కట్టి ఒక శివ లింగాన్ని ప్రతిష్ట చేస్తున్నాము అని చెప్పారు. నాకు నోట మాట రాలేదు. అంటే నాల్గు గోడల మధ్య కాదు. ఖాళీ స్థలములోనే ప్రతిష్టించబడుతుంది. సముద్రపు ఒడ్డు అన్నారు. అనగా నదుల యొక్క సంగమ స్థానమే సముద్రం. అలాగే ప్రతీ జీవి సంగమించే స్థానం స్మశానం. ఇంకా కోర్కెలు తగ్గిన తరువాత అన్నారు. కోర్కెలు తగ్గే స్థానము స్మశానం. దీనిని ఈ రకంగా చెప్పి మానవ జీవితం యొక్క అంతరార్థాన్ని విశిదీకరించి ఈ రకంగా కార్య రూపాన్ని ఇచ్చి ఇలలో చేయించుకున్న ఘట్టమిది. భగవంతుని ఏడు లక్షణాలలో మూడు సృష్టి, స్థితి, లయము అని చెప్పబడినవి. సృష్టి అనగా నిర్మించుట, స్థితి అనగా పోషించుట, లయము అనగా విసర్జించుట. స్వామి భగవత్ స్వరూపము గనుక ఈ మూడు లక్షణాలు వారిలో నిబిడీకృతమై ఉన్నవి. స్థితి అనగా ప్రాణులందరినీ పోషించుట మరియు వారిని **సంరక్షించుట**. ఈ కార్యమును సదా స్వామి నిర్వహిస్తూ ఉంటూరు. మరి ఇది స్వప్న **సాక్షాత్కారమే** కదా?

పర్తీశ్వరుని పురమందున పాదము మోపిన కల్గును సర్వ పాపక్షయము
ఆ పాదముల చెంత చేరిన దొరకును ఆనందము
ఆనందము కాదు అది బ్రహ్మానందమనునది ఎరుకకు వచ్చును
మోక్ష పురికి మార్గము చూపు ముక్తి పురము పర్తి పురము

## (2)

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః
కామః క్రోదః స్తధా లోభస్తత్మా త్రయంత్యజేత్

పై శ్లోకం భగవద్గీతలోని 16వ అధ్యాయంలోని 21వ శ్లోకం. దీని అర్థం ఏమనగా కామము, క్రోధము మరియు లోభాదులు అనే మూడురకాల నరక ద్వారాలు ఘాతుకమైనవి కనుక వీటిని

త్యజించవలెను. కామ క్రోదాధి అరిషడ్వర్గములు భగవంతుని దరిచేరే మార్గములోని ముఖ్యమైన ఆటంకాలు. ఈ విఘ్నాలని దాటలేకపోయినవారిని భగవంతుడు తన భక్తులుగా స్వీకరించడు. అరిషడ్వర్గాలు నివశించే హృదయంలో దైవం ఎలా నివసించగలడు? కామ, క్రోదాధి శత్రువులు నశించితేనే మనస్సు ప్రశాంతంగా ఉండగలదు. దేహం శరణాగతి కోరుతుంది. హృదయం నిర్మలమౌతుంది. అప్పుడే దానిని పరమాత్మ నివాసయోగ్యంగా భావిస్తారు. భక్తుల కామ క్రోదాదులను స్వామి ఎలా దూరం చేస్తారో ఈ కల ద్వారా తెలుసుకుందాము.

ఇది ఫిబ్రవరి 8న 2011 సం||లో స్వామి అపారమైన ప్రేమతో తన బిడ్డలను సరి అయిన స్థాయిలో చూచుటకు అనుగ్రహించిన దివ్యమైన కల. ఆ కల ద్వారా భగవత్ **సాక్షాత్కారం** దొరికింది. తెల్లవారు ఝామున 3:40 ని||కు స్వామి నేను పడుకుని ఉన్న గదిలోకి వచ్చారు. నన్ను నిద్రలేపి "నీవు నన్ను చూడు. నీలో ఉద్భవిస్తున్న ప్రశ్నకు సమాధానం ఇస్తాను. మారు మాట్లాడక నన్నే చూడు" అన్నారు. స్వామీ! మిమ్మల్నే చూస్తున్నాను అని చెప్పిన దానికి స్వామి "లేదు ఈ రకంగా కాదు ఇంకా తీక్షణంగా చూడు" అని అన్నారు. సరే స్వామి! అని అన్నాను. నా ఎదుట కూర్చున్న స్వామి కొంచెము కొంచెముగా పెరుగుతూ నా కంటి చూపు ఏమేరకు వెడుతుందో అంతవరకు ఆక్రమించారు. ఆ రూపము చూడగానే కొంచెం భయమనిపించి స్వామీ! అన్నాను. వెంటనే స్వామి "నిన్ను మాట్లాడ వద్దని చెప్పానా? మాట్లాడకు. నన్నే చూడు" అన్నారు. అలాగే స్వామి అని స్వామిని చూచుట ప్రారంభించాను. స్వామి దేహం పెరిగిన తర్వాత ఆ దేహంపై ఒక నల్లని రూపురేఖలు గల్గిన అమ్మవారు తన శరీరం నిండా బంగారు ఆభరణములు ధరించి సంచరిస్తూ శరీరంలోని ప్రతీ అవవయాన్ని తాను తాకి పరీక్ష చేయటం మొదలుపెట్టారు. ఏ అవయవమైనా నాకు లొంగకపోతుందా? అన్నట్లుగా చూస్తున్నారు. ఏ అవయవమూ లొంగకపోగా తిరిగి తిరిగి అలసిపోయి చివరకు స్వామి పాదాల వద్ద శరణు కోరుతూ పాదాక్రాంతురాలై శిరస్సు వంచి పాదాభివందనము చేస్తూ కూర్చుని ఉన్నారు. అదే సమయంలో స్వామి హృదయస్థానం నుండి వేయి రేకులతో కూడిన సహస్రదళ పద్మం ఒకటి విప్పారింది. ఆ వేయి రేకులకు వేయి మంది అధిష్టాన దేవతలు ఉన్నారు. వారి వారి స్థానాలలో వారు వచ్చి ఆ పూవు రేకులను అధిష్టిస్తున్నారు. సుందరమైన ఆకృతికల్గి సర్వులనూ మోహింపచేయగల రూపాలు. ఆ రూపాలను చూచిన ఈ తనువు తనను తాను

మర్చిపోయినది. చివరిలో ఆ పువ్వుయొక్క మద్యభాగము నుండి జగన్మోహనాకారి అయిన లలితాదేవి ఉద్భవించినది. ఆవిడ రూపు, ఆవిడ నుండి ఉద్భవించే కాంతి కిరణాలను చూచి ఎనలేని ఆనందాన్ని ఈ తనువూ మనస్సు అనుభవించాయి. ఏ అవయవమూ నా స్వాధీనంలో లేదు. అమ్మ రూపాన్ని చూచిన ఈ నేత్రాలు ఇంక దేనినీ చూచుటకు ఇష్టపడుటలేదు. అంతటి దివ్యమైన రూపురేఖలు కలిగి ఉన్నారు. ఆవిడ హావభావాలు ఎవ్వరినైనా సమ్మోహపర్చగలదు. మేనిఛాయ బంగారు రంగులో మెరిసిపోతుంది. ఆవిడ మీద నుండి కనుచూపు ప్రక్కకు పోవుటలేదు. అంతటి సుందరాకారము. ఈ జన్మ చేసుకున్న పుణ్య సంపద ఫలము ఈ రకమైన దర్శన భాగ్యాన్ని పొందుట. అమ్మవారు ఉద్భవించిన కొన్ని క్షణాలకు స్వామి అమ్మను క్రీగంట చూస్తున్నారు. అమ్మ మునిపంట తన పెదవిని నొక్కిపట్టి స్వామిని చూస్తున్నారు. వారిద్దరి హావభావాలు తిలకించిన ఈ హృదయము ఉప్పొంగి సముద్రము చెలియలికట్ట దాటితే ఎలా ఉంటుందో అలాంటి స్థితిని అనుభవించింది. కొన్ని క్షణాల తరువాత అమ్మ లోపలకు వెళ్లారు. తర్వాత వేయిరేకుల పద్మము ముడుచుకోవటము ప్రారంభించినది. స్వామి యధారూపమునకు వచ్చారు. "ఏమి బంగారు! ఏమైనా అర్ధమయినదా? నీకు నీవు కోరుకుంటున్న స్థితిని తెలియపర్చుట కొరకు ఒక్కొక్కటి ప్రత్యక్ష అనుభవాల ద్వారా తెలియపర్చాలని అనుకున్నాను. దీనిని గురించి ఆలోచించి అంతరార్ధము తెలుసుకో. కొంత సమయము తీసుకో. దీని గురించి విశదీకరించటానికి మరలా వస్తాను" అని చెప్పి స్వామి అంతర్ధానమయ్యారు. మరలా శనివారము 12వ తారీకున స్వామి వచ్చి కూర్చుని "బంగారు! నేనిచ్చిన దర్శనం గురించి ఏమి ఆలోచించావు? ఏమి అర్ధమయినది" అని అన్నారు. స్వామీ! నాకు ఏమీ తెలియుటలేదు. కానీ ఒక్కటి మాత్రం తెలుసుకున్నాను అన్నాను. "ఏమి అది అన్నారు" స్వామి. అమ్మ దివ్యదర్శనాన్ని పొందిన ఈ దేహము దివ్యత్వాన్ని అనుభవించింది. ఆ దివ్యత్వమే తానుగా గుర్తించబడింది. ఇంతకన్నా ఇంక ఏమీ ఆలోచించలేకపోయినది అని చెప్పగానే "మంచిది" అని "ఇంతకూ అంతరార్ధము చెప్పలేదు. ఆలోచించావా? లేక ఆలోచించుటకు సమయము చిక్కలేదా?" అన్నారు. స్వామీ! నాకు ఏమీ తెలియుటలేదు అని మరలా సమాధానమివ్వగా "మొద్దుబుర్ర అంతా మట్టే. ఆ మట్టిలో ఇప్పటికైనా ఈ జ్ఞాన బీజాలను నాటి అంకురం వచ్చేలా చేయి" అన్నారు. సరే స్వామీ

అన్నాను. "ఈ విశ్వమంతా నిండి ఉన్నది నేనే. నా లోపల అనంత విశ్వం నిబిడీకృతమై ఉన్నది. సకల జీవరాసులు నాలోని ప్రతీ అణువు. ఈ జీవులలో నాకు దగ్గరగా చేరి వారి నిజస్వరూపాన్ని తెలుసుకోగోరిన జీవులను **<u>పరీక్షించే</u>** నిమిత్తమై నల్లని రూపు కల్గిన ఆ దేవత సంచరిస్తున్నది. ఇన్ని అవయవాలు ఉన్నాయి. దీనిలో ఏ ఒక్క అవయవమైనా నాకు లొంగుతుందా? లేదా? అన్నది పరీక్షచేయుటకు సంకల్పించబడ్డ దేవత. మీ యొక్క తమస్సు నుండి ఉద్భవించినది. తమస్సు అనగా నీలోని అజ్ఞాన అంధకారములు. ఈ అంధకారము మనిషి శరీరమెల్లా ఆవహించి ఉన్నది. ఈ అజ్ఞానమనే తమస్సు నుండి కోరికలు ఉద్భవిస్తున్నాయి. కోరికలకు అధిపతి కామాఖ్యదేవి. ఈ తమస్సును రూపుమాపవలెనంటే నీ నుండి దివ్య తేజస్సు ఉద్భవించాలి. దివ్య తేజస్సు ఉద్భవించాలంటే నీలోని అజ్ఞాన అంధకారములు దూరమయ్యేకొలదీ నీలోని జ్ఞానజ్యోతి వెలిగించబడి అజ్ఞానమనే చీకటి దూరమయ్యి తమస్సు పాదాక్రాంతురాలు అవ్వవలసిందే. నీలోని కోర్కెల స్థానము ఎప్పుడూ తన పాదాల వద్దే. ఆవిడ ధరించిన నగలే వ్యామోహాలు. ఈ వ్యామోహాలే కోరికలు. ఇవి మనిషి యొక్క స్థితిని అథః పాతాళానికి నెట్టివేసి తన నిజస్వరూపాన్ని తెలుసుకొనగోరు ఆధ్యాత్మిక తత్పరులకు అందనట్లుగా చేసి ఆడించటానికి చూస్తూ ఉంటుంది. ఎప్పుడైతే ఒక్కసారిగా నీలోని దివ్య తేజస్సు అఖండ జ్యోతిగా వెలుగొందినదో అచట ఇంక చీకటికి తావే లేదు. సూర్యుడుదయించిన తర్వాత చీకటికి ఎలా స్థానము లేదో అలాగే జ్ఞానము ఉదయించిన తర్వాత అజ్ఞానానికి తావే లేదు" అంటూ స్వామి ఇచ్చిన ఈ కల కామాన్ని నాశనం చేసి నిజతత్వాన్ని తెలుసుకునే ప్రయత్నానికి **<u>సాక్షాత్కారంతో</u>** మానసిక స్థితిని మార్చి దివ్యోన్ముఖులము అవుటకు సహాయకారి అయినది కావున ఇది స్వప్న **<u>సాక్షాత్కారమే</u>** కదా? నిస్సందేహంగా అన్న సమాధానం ఇవ్వక తప్పదేమో.

మూడు లోకములనేలు మహేశ్వరుడు ముచ్చటైన రూపుదాల్చి మన ముందు నడయాడు చుండె,
నడయాడు వానిని నిజముగా కాంచిన ఈ జన్మకు మరు జన్మ లేదు లేదు, మరి రాదు రాదు
ఆ మంగళకరమైన ఆ రూపునికని ఎనలేని ఆధ్యాత్మిక సిరులను పొందె
ఆ చరణములు నా సాయి చరణములే.

## (3)

దైవం, భక్తులను ఎప్పుడైతే తనదరి చేరనిస్తాడో, అప్పుడే వారి దోషాలను కల్మషాలను తీసివేస్తాడు. దాని వలన భక్తులు తమ కర్తవ్యాలను యోగ్యమైన రీతిలో పాటించగలుగుతారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అజ్ఞానము నుండి, దుఃఖము నుండి, మృత్యువు నుండి ముక్తిని ప్రసాదిస్తారు. భగవాన్ బాబా ఈ విషయమై వివరిస్తూ "మానవ జన్మ అనగా జన్మ మరియు మృత్యువు నుండి ముక్తి పొందటానికి దొరికిన ఒక ప్రత్యేకమైన అవకాశం. ఇంకే స్థాయిలో కూడా ఈ అవకాశం లభించదు. ఈ సువర్ణావకాశం అత్యంత దుర్లభమైనది మరియు ఈ భువి వరకూ మాత్రమే పరిమితమైనది. అన్ని ప్రాణులు మానవ జన్మ కొరకు ఆతురతతో, ఉత్సుకతతో ఎదురు చూస్తుంటాయి. కేవలం మానవ దేహమే భగవంతుని తెలుసుకోగలిగే సాధనము" అని అంటారు.

స్వామి ఇంకా విశదీకరిస్తూ ఇలా అన్నారు. "దైవత్వాన్ని తెలుసుకునే ఉపకరణం దేహమని మీరు అనుకోవచ్చు. దీనికి శారీరక సుఖ ప్రాప్తి కొరకుగల దేహాశక్తి మీరు త్యజించాలి. కైవల్య ప్రాప్తికై మనస్సు భగవదర్పితం గావించాలి. పరమాత్మ మీ మనస్సును స్వీకరిస్తే, మీ కోరికలు నశిస్తాయి. కోరికలు నశించినచో మనస్సు యొక్క ఉనికి నష్టమై మానవుడు ముక్తుడవుతాడు. ఈ స్థితిని మనో నిగ్రహము, మనో లయము లేకమనోనాశనము అని అందురు. అనగా మనస్సు మరణిస్తుంది. మనస్సు విలీనమవుతుంది. మనస్సు సంహరించబడ్డుంది. '"

భగవాన్ బాబా ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని ఉదహరిస్తారు. "బుద్ధుడు ఈ విషయమై చాలా లోతుగా పరిశోధించి గ్రహించినదేమనగా, చివరకు మన మనసే ఆత్మజ్ఞాన వికాశంలో అవరోధాలు సృష్టిస్తుంది. అది గ్రహించిన తదనంతరం వారు "అమనస్కులైనారు" అనగా మనసులోని ఆటంకాలు అన్నీ తొలగించారు. తదుపరి నిర్యాణం అనగా మోక్షం పొందారు.

భగవాన్ బాబా ఎందరినో ఎన్నో రీతులలో ఉద్ధరిస్తున్నారు. ప్రత్యక్ష, **<u>పరోక్షాలలో</u>** జీవన మాధుర్యాన్ని తెలిపి ఆ మాధుర్యాన్ని అనుభవించేలా చేస్తున్నారు. స్వప్నంలో

దర్శనమిచ్చి ఆ జీవి అత్యున్నత స్థితిని అందుకునేలా చేసిన ఒక స్వప్న వృత్తాంతము ఇది. ఫిబ్రవరి 16, 2011లో నిద్రిస్తున్న సమయంలో ఒక దివ్యానుభూతిని ఈ శరీరానికి, నాకు ఉన్న బేధాన్ని గుర్తించుటకు సహాయాన్ని అందించింది. శరీరం నిద్రిస్తుంది, నేను అనే సత్ పదార్ధం మేలుకుని ఉన్నది. స్వామి కృష్ణపరమాత్మ రూపంలో వేంచేసి ఈ దేహాన్ని ఒక మురళిగా మలచి చేతులలోనికి తీసుకున్నారు. ఒక్కొక్క రంధ్రాన్ని పరీక్షగా చూస్తూ వేణువుగా ఆలపించి శుద్ధి చేయడము మొదలుపెట్టినారు. హృదయ చక్రం వద్దకు వచ్చే లోపల స్వామి సరిచేసిన రంధ్రాల ద్వారా విపరీతమైన ప్రవాహము జరిగింది. ఆ ప్రవాహ వేగానికి హృదయంలో ఉన్న మాలిన్యము అంతా ఒక్కసారిగా కొట్టుకుపోయింది. అది చూచి స్వామి ఒక లాస్యాన్ని వదిలినారు. అది విశ్వసమ్మోహనము. ఆ సమ్మోహనాస్త్రము నుండి మోహింపబడే భావతంత్రులు బయలుదేరి <u>**ప్రక్షాళన**</u> చేయుట మొదలయినది. అంతటితో కల ముగిసింది. స్వామీ! "ఈ <u>**దేహప్రక్షాళన**</u> మొదలు పెట్టినారు. మరలా ఎప్పుడు మీ యొక్క అమృత బాండారమయిన మీ పెదవుల వద్దకు చేరుతుంది? అన్న భావన కలిగింది. రెండు, మూడు రంధ్రాలు సరిచేస్తేనే మధుర నాదస్వరాలు వినిపిస్తున్న ఈ దేహంలోని నవరంధ్రాలూ శుద్ధినొందితే ఇంక ఎంతటి సుమధుర స్వరాలు పలికించవచ్చో? విన్పించవచ్చో? ఆ భాగ్యాన్ని కల్పించండి అంటూ ప్రార్ధన మొదలయ్యి ఆలోచనా తరంగాలను శుద్ధి చేయటము మొదలుపెట్టినవి. మరి ఇది స్వప్న <u>**సాక్షాత్కారమే**</u> కదా? అవును అన్న సమాధానమే వస్తుంది. స్వామి నాలో పేరుకుని ఉన్న మాలిన్యాన్ని శుభ్రపర్చుటకు తోడ్పడినది కావున ఇది <u>**సాక్షాత్కారమే**</u>.

మానవుని లోని రాక్షసత్వం ఎలా నిర్మూలించాలి? వారి లోపల ఉన్న ఆ క్రూరత్వాన్ని సంహరించగల ఆయుధం ఒక్క ప్రేమయే. అ ఒక్క ఆయుధంతోటే సంహరించగలము. క్రోధం విచక్షణాజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. ఇంత నాశనం చేసే గుణాన్ని ఎందుకు ప్రోత్సాహపరుస్తున్నాము? గది పరిశుభ్రంగా ఉంటే, సూర్య కిరణాలు ప్రసరిస్తూ ఉంటే విషపురుగులు చేరలేవు. అలాగే హృదయమనే గది పరిశుభ్రంగా ఉంటే ఏ విషపురుగులూ చేరవు. శాంతి, దయ, ప్రేమ, సహనము, సానుభూతి అనేవి మానవత్వ లక్షణాలు. శాంతి అనేది రాగద్వేషాదులతో కూడిన వాడ్ని చూడగానే పరిగెత్తుకుపోతుంది. శాంతి అనేది అంతర్గత

ధనము, సంపద. సంపద నీ ఇంటనే ఉండ ప్రక్క ఇంటికి అప్పుకి ఎందుకు పోవాలి? ఎన్ని విద్యలు నేర్చినా దైవ ప్రేమ అనే విద్య నేర్వకపోతే నిరర్ధకము. అంటే స్వార్ధరాహిత్యమైన ప్రేమను పొందలేనపుడు ఎన్ని నేర్చినా నిరర్ధకమే. దేహాభిమానాన్ని దైవాభిమానంగా, ఆత్మాభిమానంగా పెంచుకుని దైవత్వాన్ని ప్రకటింపచేసుకోవాలి. దైవం నీలో లేడు, నీవే దైవంలో ఉన్నావు అన్నది ఒక్కసారి నీ అంతఃకరణము శుద్ధి చేయబడినపుడు నీకు నీవుగా తెలుసుకోగలవు. అందుకే నిన్ను మురళిగా మలచి నీలోపల ఉన్న మాలిన్యాన్నంతా శుభ్రపరచి దానిని ఖాళీగా ఉంచినట్లయితే సుస్వర సుశాంత ప్రశాంత స్వరాలను వీనుల విందుగా వినగలందులకు సమ్మోహనపరిచే కృష్ణ రూపంలో వేణువుగా మనల్ని మరల్చి తన పెదవుల వద్దనిడ చేతిలో పట్టుకున్నందుకు ఈ జీవన మురళి మధుర గానాలు ఆలపిస్తున్నది.

కోరుకొమ్ము కోరుకొమ్ము కోరినది ఇచ్చుననుచూ
కోటి కోర్కెలైననూ క్షణములో తీర్చి కంటి ఎదుట కన్పించునది సత్యము కాదనుచూ
నీలో ఉన్న దానిని కనుగొని నిత్య సత్యమైన నిధిని సొంతము చేసుకో
నీరజాక్షుని నిజచరణములే నిను కాపాడును
అవే నా సాయి చరణములు.

## (4)

1926వ సంవత్సరములో నవంబరు 23వ తేదీన శివశక్తి రూపమైన భగవాన్ బాబా ఈ భువిపై అవతరించారు. మరుసటి రోజు యోగి అరవిందుల వారు తమ ఆశ్రమంలోని వారిని అందరిని పిలిచి "ప్రత్యక్షంగా శ్రీకృష్ణ భగవానులు ఈ భూతలంపై దేహరూపంలో అవతరించారన్న అనుభూతి నాకు కల్గుతున్నది. ఆ శక్తి మన ఆలోచనలని తప్పక ప్రగతి మార్గం వైపు తీసుకు వెడుతుంది. ఈ మర్త్య భువిపై అందరి అంతఃకరణాలలో ఆత్మజ్యోతి వెలుగుతూ కాపాడుతూ ఉంటుంది. ఆ స్వరం అనేకుల శ్రవణేంద్రియాల వరకూ చేరగలదు. నేడు భగవంతుడు ఈ అవనిపై అవతరించాడు. కొన్ని వేల సంవత్సరముల క్రితమే భ్రుగు, అగస్త్య,

వశిష్టుడు, శుకముని మొదలగువారు భగవాన్ బాబా అవతారము గురించి తమ నాడీ గ్రంధాలలో విస్తారంగా వర్ణించారు. యోగులు మరియు విశ్వమందుగల కోట్లాది భక్తులు భగవాన్ బాబా వారి దర్శనభాగ్యం పొందినారు. ఇది వారందరి పుణ్యభాగ్యమనే చెప్పవచ్చు.

నీవు సగుణుడివా, నిర్గుణిడివా ప్రభూ

సగుణ నిర్గుణుడవైన గోవిందుడవే ప్రభూ

అంటూ సంత్ జ్ఞానేశ్వర్ అంటారు. నిర్గుణ, నిరాకారుడైన భగవంతుడు అవతారము ధరించినపుడు సగుణ రూపంలో ప్రత్యక్షమవుతాడు. దైవం యొక్క సగుణ రూపం విశ్వ కళ్యాణ ప్రదమైనది. జగదోద్ధారణకు అవతరించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సదా సర్వదా విశ్వ కళ్యాణ కార్యక్రమంలో నిమగ్నులై ఉంటారు. భగవాన్ బాబా అంటారు "నేను నాయకుడిని కాదు. సేవకుడను. సేవ కొరకై నేను జన్మించాను". ఈ మాటలు నిజం చేస్తూ కేవలం తన రూప, నామాలు భజించే వారినే గాక అందరి సేవయే తన కార్యమని భావిస్తూ స్వామి అందరి శ్రేయస్సు కొరకై ప్రయత్నిస్తుంటారు. "నా జీవితమే నా సందేశం" అని చెప్పే స్వామి తన బాల్యం నుండే కళ్యాణ ప్రదమైన గుణములు కలిగి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి అది రుజువు చేసారు. అలాగే సూర్యభగవానుడు కూడా. "ఆదిత్యుడు మహా త్యాగి". విశ్రాంతి ఎరుగని నిష్కామ కర్మయోగి. జీవితమనే ఈ సూర్య బింబము నుండి చిన్న చిన్నగా మొదలయిన కిరణాలు దేదీప్యమానమైన వెలుగును పది మందికీ పంచుతూ ఉంటే, అంటే మనిషిలోని మానవత్వ గుణాలు అభివృద్ధి అయ్యి దాని చేత తేజోవంతమైన, దేదీప్యమానమైన, దివ్యమైన కర్మలు మొదలైన తక్షణం భగవాన్ అనుగ్రహ కిరణాలు మనిషిని ఉవ్వెత్తున ముంచెత్తుతాయి. ఆ తర్వాత అంతా చల్లదనమే. భగవన్నామస్మరణ, భగవత్ చింతనలు ఏవిధంగానైతే ఆధ్యాత్మిక సాధనాలని అనుకుంటావో అదే విధంగా మానవాళికి చేసే సేవ కూడా నిస్వార్ధంగా చేసినపుడు అది కూడా ఆధ్యాత్మిక సాధనయే. స్వార్ధ త్యాగమే నిజమైన ఆధ్యాత్మిక సాధన. ఈ సాధన సూర్య భగవానుని నుండి నేర్చుకోవలసి ఉన్నది. ప్రత్యక్షదైవం కావున అట్టి దైవంతో అనుబంధమేర్పర్చుకుని జీవితమనే ఈ సూర్య బింబం ఎల్లప్పుడూ దివ్య కిరణాలనే అందించాలి. అట్టి సూర్య భగవానుని దివ్య దర్శన స్పర్శన పొందగలిగిన ఒక సంఘటన ఇది. ఇద కల కాదు. యదార్ధ సంఘటన. స్వామి దివ్య సంకల్పముతో మాచే చేయించదల్చుకున్న

సేవాసౌధం మొదలుపెట్టుటకు మా ఆత్మీయులైన సాయి సోదరుడ్ని ఆహ్వానించి పూజా కార్యక్రమం చేయదల్చినాము. వారు వచ్చి స్వామి ముందు కూర్చుని కళ్ళు మూసుకుని హృదయాన్ని తెరిచి ప్రార్ధన చేయటం మొదలు పెట్టారు. కొన్ని క్షణములలో అతని ముఖంలో అద్వితీయ ఆనందకరమైన ఛాయలు కనిపించినవి. అంతేగాక కంటి వెంబడి ఆనంద భాష్పాలు శ్రవిస్తున్నవి. అది చూచి అచట ఉన్న మా అందరికీ ఏమి జరిగినదో తెలియక వారు యధాస్థితికి వచ్చు వరకూ వేచియున్నాము. వారు యధాస్థితికి రాగానే వారు చెప్పిన మాటలు మా అందరినీ కూడా అదే స్థితిలోకి తీసుకు వెళ్ళినాయి. వారు ఇలా వర్ణించారు. "లోక నాయకుడైన స్వామి సంకల్పించిన ఈ కార్యానికి సూర్య చంద్రులను ఆహ్వానించినట్లున్నారు. ఒక వైపు నుండి సూర్యుడు ఇంకొక వైపు నుండి చంద్రుడు సమాన వేగంతో ప్రయాణిస్తూ ఆకాశం నుండి ఇద్దరూ క్రిందకు వచ్చి రెండు బింబములూ ఒక బింబముగా తయారయ్యి స్వామి యొక్క హృదయ స్థానములోకి వెళ్ళి అచ్చట నుండి ఒక తెజోపుంజము బయటకు వచ్చి ఇచ్చటనున్న జ్యోతిని వెలిగించింది. కేవలము నేనొక పనిముట్టు లాంటి వానిని. కానీ స్వామి చూపిన ఈ చర్య వల్ల నా శరీరమంతా దివ్యత్వ అనుభూతి చెందింది" అని అన్నారు. ఇది విన్న మేమందరమూ కూడా అదే స్థితిని అనుభవించ గలిగినాము. ఇదే సంఘటన స్వామి తనువు చాలించి మహాసమాధి చెందిన సమయంలో ఆకాశంలో ఒకే సమయంలో సూర్య చంద్రులు స్వామికి నమస్కారము సమర్పించుకొనుటకు వచ్చారు. అది చూచి నోట మాట రాక అలనాటి సంగతి జ్ఞప్తికి వచ్చి కంట నీరు తెలియకుండగనే ప్రవహింపసాగినాయి. ఆ రోజు ఏవ్యక్తి అయితే దీనిని అనుభవించారో ఆ వ్యక్తి నా వద్దకు వచ్చి అమ్మా! మీరు ఏవిషయము మీద బాధతో కంట నీరు పెట్టకూడదు. బాధతో కాదు ఆనందంతో కంటి నీరు రావాలి. మన శరీరంలోని ప్రతీ రక్త బిందువు సేవకై అర్పితం కావాలి. మనందర్నీ అంత ఉన్నతంగానే తీర్చిదిద్దుకోవాలన్న తపన, తాపత్రయం స్వామికి ఉన్నది. ఈ విధంగా ఆయన ద్వారా జీవితాన్ని అంకితం దేనికి చేయాలో తెలియచెప్పిన ఈ సంఘటన **సాక్షాత్కారమే** కదా? ముమ్మాటికీ అనే సమాధానమే వస్తుంది.

ఆశా జీవికి ఆశయాల సౌధము నిర్మించి
సేవయను పదార్ధముతో ప్రేమ సౌధము నిర్మించి

అంతఃకరణమున అంతఃపురమను ఆత్మ యనెడి సౌధము నిర్మించి
దారి తెలియని వారికి సత్య ధర్మ శాంతి ప్రేమ యను రాచబాట నిర్మించె మా సాయి.

## (5)

సర్వ సామాన్య మానవులకి ఉండే స్థల, కాల బంధనాలు భగవంతునికి ఎలా ఉండగలవు? కారణమేమిటంటే కాలచక్రం భగవంతుని కోరికపైనే నిర్మించబడుతుంది. ఎల్లలులేని మహిమగల సాయిని గురించి ఏమి చెప్పగలం?భగవాన్ బాబా గురించి వర్ణించడం మానవుని మేధస్సు యొక్క ఆకళింపు శక్తికి అతీతమైనది. స్వామి మాటలలో "నన్ను తెలుసుకోవటానికి, అంచనావేయటానికి ప్రయత్నించ వద్దు. నేను మీ మేధస్సుకి అందని అతీతమైన వాడిని" అన్నారు. స్వామి చేసే లీలలు మానవుని పరిమితమైన గ్రహింపు శక్తికి అందనివి అని తెలియచేసే ఒక సంఘటన ఇది.

బర్మాదేశ వాస్తవ్యులైన "కృష్ణదాసు" అనే యోగి హిమాలయములలో శ్రీమహావిష్ణువు గురించి అనేక సంవత్సరములు తపస్సు చేసారు. ఇలా చాలా సంవత్సరములు గడిచినవి. వారి తీవ్ర తపస్సు ఫలితంగా ఒక రోజు వారికి దివ్య వాణి వినిపించింది. "నేను ఆంధ్రప్రదేశ్ లోని పుట్టపర్తిలో జన్మించాను. త్వరగా నాదర్శనానికి రా". అది విన్న కృష్ణదాసు ఆనందానికి అవధులు లేకపోయినవి. వారు త్వరగానే పుట్టపర్తికి ప్రయాణం అయినారు. ఎప్పుడూ దిగంబరంగా ఉండే కృష్ణదాసు సమాజంలోకి వచ్చినపుడు మాత్రం కౌపీనం ధరించేవారు. వారు పుట్టపర్తి చేరగానే స్వామి లుంగీ, ఉత్తరీయం పంపించి అవి ధరించే దర్శనానికి రావలసిందిగా కబురు పంపారు. ఇంటర్వ్యూ రూములోకి పిలిచి స్వామి కృష్ణదాసుకి విష్ణు రూపంలో దర్శనం ఇచ్చారు. తమ ఫోటో ఒకటి ఇచ్చారు. అక్కడ నుండి బయలుదేరే కృష్ణదాసు తో స్వామి ఇలా అన్నారు "ఇక్కడ నుండి తిరిగి హిమాలయాలకు వెళ్ళే అవసరం లేదు. మహారాష్ట్రలోని "చేల్" ప్రాంతానికి వెళ్ళు". స్వామి ఆదేశానుసారము కృష్ణదాసు ముంబై వెళ్ళారు. అక్కడ అన్ని దేవాలయాలను దర్శించిన పిమ్మట "చేల్" ఎక్కడ ఉందో మహారాష్ట్ర మ్యాప్ ద్వారా

తెలుసుకొని అక్కడకు చేరారు.

"చేల్" చేరిన తర్వాత చెయ్యవలసిన దాని గురించి స్వామి ఇంటర్వ్యూలోనే సూచించారు. అంతా అలాగే జరిగింది. కొంత మంది కృష్ణదాసు వద్దకు వచ్చి "మీరు ఇక్కడి దేవాలయంలో పూజారిగా ఉండగలరా?" అని కోరారు. కృష్ణదాసు "ఏ దేవుని దేవాలయము?" అని ప్రశ్నించగా శ్రీగురు దత్తాత్రేయుల గారిది అని జవాబిచ్చారు. స్వామి ఆజ్ఞానుసారంగా కృష్ణదాసు ఆ బాధ్యత స్వీకరించారు. గుట్ట మీద ఉన్న దేవాలయంలో పూజార్చనా కార్యక్రమాలు నిర్వహించసాగారు. మిగిలిన వేళల్లో తమ తపస్సు కొనసాగించారు. అక్కడే వారు షిరిడీ సాయి, పర్తి సాయి ఫోటోలు పెట్టారు. స్వామి ఫోటో ముందు ఒక విభూతి పాత్ర పెట్టారు. చూస్తూ ఉండగనే ఆ విభూతి పాత్ర విభూతితో నిండిపోయింది. అంతే కాకుండా భోజనం కోసం వారు ఒక పాత్ర తీసుకుని వెళ్లారు. దాంట్లో వారికి సరిపడే అంత అన్నం ప్రత్యక్షమైంది. వారికి ఎప్పుడైతే అన్నం కావాలని అనిపించేదో అప్పుడు ఆ పాత్రలో అన్నం ప్రత్యక్షమయ్యేది. స్వతహాగా మితాహారి అయిన కృష్ణదాసుకి అన్నం అవసరం ఎక్కువగా కలిగేది కాదు. కానీ స్వయంపాకంలో సమయం వృధా పర్చకూడదని స్వామి ఆ సామాన్య పాత్రని అక్షయ పాత్రగా మార్చారు. అలాగే అక్కడకు వచ్చే భక్తులకు విభూతి ప్రసాదం లభించాలని విభూతి పాత్రను కూడా అక్షయ పాత్రగా మార్చారు. పుట్టపర్తి నుండి బయలుదేరిన కృష్ణదాసుకి స్వామి "నీ యోగ **క్షేమాలు** నేను చూచుకుంటాను" అని వాగ్దానం చేసారు. ఆ మాట నిలబెట్టుకున్నారు కూడా. ఆ అక్షయ పాత్ర నుండే కృష్ణదాసు కొంత మంది భక్తులకు ప్రత్యేకంగా చిన్న పిల్లలకు వాళ్ళకు ఇష్టపడే తీపి పదార్థాలు తీసి ఇచ్చేవారు. కొంత కాలం గడిచిన తరువాత స్వామి ముంబై వచ్చినపుడు శ్రీ పి.కె.సావంత్ ఇంట్లో బస చేసారు. అప్పుడు స్వామి 'చేల్'కి కారు పంపించి కృష్ణదాసును పిలిపించి వారికి దర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. కానీ లుంగీ, ఉత్తరీయం ధరించి రావలసిందని స్వామి చెప్పటం మరవలేదు. అలాగే కృష్ణదాసు స్వామి దర్శనానికి వచ్చినపుడు స్వామి మరలా ఒకసారి గురూపదేశం చేసి సాగనంపారు. స్వామి ఆజ్ఞానుసారము కృష్ణదాసు 12 సంవత్సరాలు అక్కడ తపోసాధన చేసి అటు పిమ్మట స్వామి అనుమతితో అక్కడికి సమీపానగల 'ఖండాల' దగ్గర ఉన్న సిద్దేశ్వర్ పర్వతంపై ఉంటూ తపస్సు చేసుకుంటూ అక్కడే సమాధి చెందారు. ఇలా అనేక రకాలుగా భక్తులను ఉద్ధరించుచూ వారిలోని నిజ తత్వాన్ని

వారు గ్రహించేలా చేయడమే భగవాన్ ముఖ్యోద్దేశము. ఆత్మ **<u>సాక్షాత్కారముతో</u>** గోచరించే సత్యమే "సత్య". భగవాన్ శ్రీ సత్యసాయి బాబా "సత్యస్వరూపులు" అన్న మాటకు అర్థము చెబుతూ "ఈ విశ్వమంతయూ సత్యము నుండి ఆవిర్భవించియున్నది. సత్యమే లేనిచో ఈజగత్తు ఉండజాలదు. ప్రతి విషయము సత్యముతో నిర్మించబడినదే" అని అన్నారు. భగవంతుడు ఈ చరాచర సృష్టిని సత్యము నుండే సృజించెను. ఇక్కడ ప్రతి అణువులో "సత్యము" నిండి ఉన్నది. పరిశుద్ధమైన ఆత్మ స్వరూపము అంటే "సత్యము". సత్యమే పరమేశ్వరుడు. ఉపనిషత్తులలో చెప్పినట్టు "రసో వైసః" అంటే ఈశ్వరుడంటే రసము (మాధుర్యము) అనగా భగవంతుడు సూక్ష్మరూపమున సర్వత్రా నివసించును. చెఱకులోని చక్కెరవలే, పాలలోని వెన్న వలే ప్రభువు అంతటా నిండి ఉన్నారు. దేవుని ప్రత్యక్ష దర్శనము దుర్లభమైనాకానీ అతని యొక్క అనుభూతి మనకు పరిపరి విధాలా కలుగుతూనే ఉంటుంది. చక్కెరలోని తియ్యదనము, నిమ్మపండులోని పుల్లదనము, వేపాకులోని చేదు ఇవన్నియూ భగవంతుడు ఉన్నాడనటానికి నిదర్శనాలే. ఏదైనా సుందరమైన పర్వతము, పైనుండి క్రిందకు ఉరుకులు పరుగులతో వచ్చే జలపాతము లేక అరణ్యములోని అందాలను తిలకించిన మనకు కలిగే ఆనందము అవన్నీ ఈశ్వరుడు ఉన్నాడని ఎలుగెత్తి చాటుతుంటాయి. ప్రకాశించే సూర్యుడు, మిల మిలా మెరిసే తారకలు, తమ పరిధిలో తిరిగే గ్రహాలూ ఇవన్నియూ ఆ సృష్టి కర్తచే నిర్మించబడిన అద్భుతాలే కదా? ఒక చిన్న జ్వాలతో అగ్ని యొక్క నైజము, ఒక చిన్న నీటి బిందువుతో గంగానది స్వరూపము గోచరించినట్లే మానవుని విశ్వరూపము తెలుసుకొనిన ఈశ్వర రూపము తెలుసుకొనవచ్చును. మానవుడు అహోరాత్రులు అనేకమైన కర్మలు ఆచరించుటలో నిమగ్నుడై ఉన్నాడు. అతడు తన నిజస్వరూపమును ఎరుగడు. అతడు తన దేహము, మనస్సు, ఇంద్రియములు ఏక రూపముగా భావిస్తూ సత్ స్వరూపమైన ఆత్మ వీటికి అతీతమైనదని విశ్వసించుటలేదు. మనుష్యులలో రెండుతత్వములు ఉండును. 'దేహము' లేక **<u>'క్షేత్రము'</u>** మరియు అందు నివసించు వారలను 'దేహి' లేక **<u>'క్షేత్రజ్ఞులు'</u>** అందురు. ఈ **<u>క్షేత్రజ్ఞుని</u>** తెలుసుకుని 'స్వ' స్వరూపమును గుర్తించాలి. పూర్వపు రోజులలో స్వామి సాయంత్రం వేళల్లో భక్తులతో కూడి చిత్రావతీనది తీరానికి వెళుతూ ఉండేవారు. అలాంటి సమయంలో భక్తులు స్వామి వారి సత్యస్వరూపమును అనుభవించేవారు. అలాగే ఈ జీవులకు తన స్వరూపము

ఎరుకలోనికి వచ్చుటకు, దివ్యోన్ముఖులను చేయుటకు దివ్య సంకల్పముతో స్వప్న లోకంలో ఎన్నో చూపించి వాటి ద్వారా దివ్య పథంలో నడిచేలా చెయ్యగల నేర్పరి ఒక్క భగవానుడే.

ఒకసారి మమ్మల్ని అందరినీ చేర్చి ప్రయాణం చేయిస్తున్నారు. ఎక్కడికో తెలియదు. చాలా దూరం ప్రయాణించిన తరువాత అడవిలోనికి తీసుకువచ్చి "ఇచట నుండి లోపలకు వెళ్ళండి. ఎన్నో అనుభవాలు, అనుభూతులు పంచుకున్న పిమ్మట భగవత్ **<u>సాక్షాత్కారము</u>** దొరుకుతుంది" అని అన్నారు. 'అలాగే స్వామీ' అంటూ ఈ గ్రూప్ సభ్యులందరమూ నడవడం మొదలుపెట్టాము. అది అయ్యప్పస్వామి వద్దకు వెళ్ళే దారి అని తెలుసుకున్నాము. ఆ దారిలో ఒక పండితుడు మాకు ఎదురు వచ్చి ఒక స్థలం చూపించి "ఈ స్థలంలో మీరు అందరూ కూర్చుని యజ్ఞం చెయ్యండి" అని చెప్పారు. ఆయన అచట కూర్చుని యజ్ఞం చేయించిన పిదప ఒక దారి చూపించి "ఈ దారిన మీరు నడిచి వెళ్ళండి" అని అన్నారు. ఆ దారిలో ప్రయాణం చేస్తున్న సమయంలో చాలా అలసట అనిపించి నిద్ర వస్తున్నది అని అన్నాను. నిద్రపోటానికి ప్రక్కనున్న వారు ఒక టవలు క్రింద పరిచి నిద్రపొమ్మని అన్నారు. అలా నిద్రపోయి లేచిన తరువాత ఎక్కడి నుండో శరణు ఘోష విన్పిస్తోంది. ప్రక్కనున్న వారిని ఈ శరణు ఘోష ఎక్కడ నుండి వినిపిస్తున్నది? అని నేను అడుగగా 'అమ్మా! ఇచట ఏ చెట్టునుండైనా, పుట్టనుండైనా శరణు ఘోష వినిపిస్తుంది' అని అన్నారు. ఇంతలోకి ఇంకొక పండితుడు వచ్చి "ఈ దారిన వెళ్ళండి. ఇది చాలా మంచి దారి" అని చూపించారు. నాతో ఉన్న వారిని 'ఈ దారి మీకు పరిచయమేనా?' అని అడిగినాను. వారు 'అమ్మా చాలాసార్లు వచ్చాము. కానీ ఈ దారిన రాలేదు. ఇప్పుడిది అంతా క్రొత్తగా ఉన్నది' అన్నారు. ఆ దారిలో ఒకరిద్దరు వస్తున్నారు. అలా చాలా దూరం నడిచిన తరువాత నది వద్దకు వెళ్ళి స్నానము చేద్దాము అనుకుని నదిని చూడగా అందులో ఉన్న నీరు మురికిగా ఉండి ఆ నీళ్ళల్లోకి దిగాలని అనిపించలేదు. అచటనే ఉన్న కొబ్బరి బోండాలు కొనుక్కుని ఆ నీటితో ముఖాన్ని కడుక్కుని ప్రయాణం సాగించిన మీదట అయ్యప్ప దేవాలయం వచ్చింది. అచట గల 18 మెట్లు ఎక్కుటకు ప్రయత్నించగా కొంత వరకూ ఎక్కాను. తరువాత గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నా చేయి పట్టుకుని మెట్లు ఎక్కుటకు సహాయసహకారాలను అందించారు. లోపలకు వెళ్ళిన తరువాత జగత్తును ఆడించేవాడు జగన్మోహనాకారంతో ఆశీర్వదిస్తూ మమ్మల్ని ఆనంద లోకాలలో

విహరింప చేసినారు.

ఈ కల అంతరార్ధము ఆలోచించినట్లైతే కలలో చేయించిన యజ్ఞము పేరు "సత్కర్మ". ఈ సత్కర్మ అనే యజ్ఞంలో దుష్ట గుణాలు, దుష్ట భావాలు కాల్చివేసిన తరువాత పండితుల వారు ఒక దారి చూపించారు. ఆ దారి పేరే వైరాగ్యం. కావుననే ఆ దారి నుండి ఎవరూ రావుటలేదు. ఒకరిద్దరే వస్తున్నారు. అంతా కొత్తగా ఉన్నది. ఆ దారి ఎవరిని అడిగినా నాకు తెలియదు అంటున్నారు. నా ప్రక్కనున్న వారిని అడిగినాను. వారు కూడా 'అమ్మా! మేము చాలా సార్లు వచ్చినాము కానీ ఈ మార్గము నుండి ఎప్పుడూ రాలేదు. ఇది చాలా క్రొత్త మార్గము' అని అన్నారు. మార్గము పాతదే. వీరందరికీ తెలుసు కానీ అది రూపాన్ని చూచుట వరకే ఉపయోగపడినది. అంతర్గతంగా ప్రయాణించాలంటే, వైరాగ్య శిఖరాలు అధిరోహించాలంటే సత్కర్మలు, సదాలోచనలు, సద్బుద్ధిని ఆచరిస్తూ రాచమార్గము అనబడే వైరాగ్య రోడ్డుపైన ప్రయాణిస్తూ భౌతికమైన కోర్కెలు సమాధి అయిన పిదప నీలోపలనే ఉన్న, నీ అంతరాంతరాలలో ఉన్న శుద్ధ చైతన్య స్వరూపము నీకు అనుభూతిలోకి వస్తుంది. మోక్ష తీరానికి చేరాలి అంటూ వీరందరినీ వైరాగ్య వీధిలోకి తీసుకువచ్చి 'దేహి'కి విశ్రాంతి అనే దానికి కొంత సమయాన్ని కేటాయించి అంతరాంతరాల్లో నుండి 'నామస్మరణ' పిక్కటిల్లేటట్లుగా విన్పింపచేసి నామస్మరణతో కారడవి లాంటి వన్య మృగాల మధ్య అనగా దుష్ట గుణాలతో ఉన్న నిన్ను **<u>రక్షించడానికి</u>** నేను ఇచ్చిన ఆయుధం. "నిన్ను నీవు తెలుసుకో" అని తెలియపరుస్తూ దివ్యానందము అనే దాహాన్ని దివ్య పానీయంతోనే తీర్చుకునేటట్లైతే వైరాగ్య శిఖరాన అద్వితీయ ఆనందకరమైన దివ్య మంగళస్వరూపుని ఈ దివ్య **<u>చక్షువులతో</u>** అంతర్ముఖంగా, బాహ్యంగా దర్శించుకునే అవకాశాన్ని బిడ్డలందరికీ కలుగచేస్తూ ఒక ఉన్నత మార్గాన్ని ఎన్నుకుని నా దరి చేరండి అని స్వప్న **<u>సాక్షాత్కారాన్ని</u>** ఇచ్చి ఒక దివ్య పధం వైపు నడిపించిన ఈ స్వప్నం నిజతత్వాన్ని దర్శింప చేసే **<u>సాక్షాత్కార</u>** భాగ్యమని భగవానుని అపారమైన ప్రేమ, దయకు చిహ్నం కావున ఈ స్వప్న **<u>సాక్షాత్కారము</u>** **<u>సాక్షాత్కారమే</u>** అనునది అవగతమవుతుంది.

ఆత్మ నివాసి అయిన ఆత్మారాముని కనుగొనుటకు

అంతర్మథనము ఒక్కటే సరి అయిన త్రోవ అంటూ
అంతుచిక్కని అరిషడ్వర్గములని అరికట్టి ఆవలి వడ్డు చేరుటకు
అభయమును అందించు ఆ దివ్య పథము సాయి పథము

## (6)

భగవత్ **సాక్షాత్కారం** పొందిన వ్యక్తి తన జీవితమంతా ఆయన్ను **సాక్షాత్కరింప** చేసుకుంటూనే ఉండాలి. తెలిసినా, తెలియకపోయినా ప్రతి వ్యక్తి గమ్యమూ భగవత్ **సాక్షాత్కారమే.** భగవంతుని చేరే వరకూ ఏ ఆత్మకూ నిజమైన తృప్తి చేకూరదు. దైవాన్ని **సాక్షాత్కరింప** చేసుకోవడంలోనే మానవుని బంధాలన్నీ పటాపంచలైపోతాయి. భగవత్ **సాక్షాత్కారాన్ని** ఒక్కసారి హఠాత్తుగా ఇష్టమొచ్చిన రీతిన మనం సాధించలేము. భగవత్ **సాక్షాత్కారాన్ని** పొందటానికి ఒక సక్రమమైన పద్ధతి ఉంది. ముందుగా నువ్వు భగవంతుని గురించి వినాలి. ఆ విన్నదాన్ని అర్థం చేసుకోవాలి. అక్కడనుంచి **సాక్షాత్కారం** కోసం ప్రయత్నించాలి. వెలుతురు ఎక్కడుందో ఆ స్థానాన్ని నువ్వు తెలుసుకోవాలి. లేకపోతే దానిని తెలుసుకోవడానికి ఇంకొక దిశలో అనగా వేరొకదిశలో ప్రయాణించే ప్రమాదం ఉంది. ఆత్మవిశ్వాసం కలిగి ఉండు. నీకు నీవు అమృత పుత్రుడవని భావించుకో. నీలోని అనంతశక్తి క్రీడిస్తున్నదని దృఢవిశ్వాసం ఉంటే ఈ ప్రపంచాన్నే జయించగలవు. పూర్ణానందానికి మోక్షమార్గమే మార్గమని నీమాటలద్వారా, ఆచరణద్వారా చూపాలి. అందువల్ల సర్వావస్థలలోనూ ప్రశాంతత చెదిరిపోకుండా వినమ్రత, స్వచ్ఛత, శీలం, సచ్ఛీలత, ధీరత్వాలను చూపే బాధ్యత నీమీద ఉంది. నీవు చేసే సాధన నిన్ను ఇంకా బాగు చేసిందని, పనికివచ్చే వ్యక్తిగా చేసిందని చూపే బాధ్యతా నీపైనే ఉన్నది. కేవలం మాటల్లో చెప్పి నిరాకరించడం కాకుండా సాధన చేసి చూపించు అంటూ మార్గదర్శకత్వాన్ని బోధిస్తూ మా మార్గాన్ని ఇంత అందంగా తీర్చిదిద్దుతున్న 'భగవాన్'కు శతసహస్రకోటి పాదాభివందనములు. ఒక నీటిబిందువులో సముద్రాన్నే దర్శించాలని స్వామి చెబుతూ ఉంటారు. అదేదో పైపైన చెప్పే మాటలు కావు. అవి తన ప్రత్యక్ష అనుభవంతో దృఢవిశ్వాసంతో పలికిన పలుకులు. లేనట్లయితే ఆయనతో మనం కలిసి

ఉండగలిగే వాళ్లము కాదు. మనలోని దోషాలను చూడకుండా దయతో ఆయన తనవైపు మనల్ని ఆకర్షించుకుని మనము ఏ విధంగా ఉన్నామో అదే విధంగా ఉండనిచ్చారు. కొద్దిగా కూడా మచ్చలేని వారెవరుంటారు? అసంపూర్ణత నుండి విడివడి ఏకైక లక్ష్యం పరిపూర్ణతను సాధించడమే. స్వామి వద్దకు ఎవరూ పరిపూర్ణులుగా రారు. ఆయన దయ వలన మనలోని చిన్న చిన్న బలహీనతలు క్రమక్రమంగా తగ్గి ఆయన పాదాల వద్ద శరణాగతి పొందినట్లయితే మానవ జన్మ సార్ధకత నీవు సాధించగలుగుతావు అన్న జ్ఞానాన్ని ఇచ్చి తన బిడ్డలను చేయి పట్టుకుని నడిపిస్తున్నారు స్వామి.

స్వామి భౌతికంగా మనందరికీ దూరమయ్యారన్న ఆలోచన ప్రతి జీవిని తెలియకుండగనే అధఃపాతాళానికి నెట్టివేస్తుంది. మనముందర తిరిగే ఆ సుందరరూపము ఒక్క సారిగా అదృశ్యమయినది. దానిని జీర్ణించుకోవటానికి కొంత సమయము ప్రతి జీవి తీసుకోవలసి ఉంటుంది. అందుకే స్వామి మన అందరినీ దేహస్వరూపులు కాదు దేహిస్వరూపులుగా గుర్తింపచేస్తున్నారు. ఈ దేహాన్ని చూచి మోహించకండి. దేహిని చూడండి అంటూ పలుమార్లు జ్ఞానబోధ చేసారు. స్వామి శరీరమైతే చాలించారు. శరీరమే లేదు కాని స్వామి మన మధ్యే సంచరిస్తున్నారు. అలా తిరుగాడుతున్న భగవంతుని దర్శించాలంటే ఈ కర్మ <u>**చక్షువులతో**</u> దర్శించలేము. "కోట్ల కొలదీ మైళ్ళు ప్రయాణము చేసి నన్ను దర్శించుకోవాలన్న కాంక్ష కన్నా అంతర్ముఖంగా అరయించి నీ లోపలకు ప్రయాణము చేసి నీ లోపల ఉన్న దివ్యస్వరూపుని దర్శించుకొను ప్రయత్నము ప్రారంభించు" అని చెబుతూ ఉంటారు. భగవంతుడు భగవద్గీతను తానే బోధించాడు. బోధించిన బోధలు ఎంత వరకు మానవులు ఆచరించగల్గుతున్నారు? అందుకే అలనాటి ఆ కృష్ణుడు నేడు సాయి కృష్ణుడిగా అవతరించి, వీరికి ఎంత చెప్పినా అర్ధము చేసుకోలేని స్థితిలో ఉన్నారు కావున వీరికి జీవితాన్ని ఎలా గడపాలి అన్నది చూపించాలి అన్న ఉద్దేశముతో ఒక దేహాన్ని తీసుకుని మానవుడిగా మూర్తీభవించి మానవతా గుణాలతో ఇలాగే జీవించాలి. దీనికి విరుద్ధంగా జీవించకూడదు అంటూ మానవ జీవితాన్ని మనముందు ఆచరించి చూపారు. అందుకే స్వామి ఎప్పుడూ మనకు చాలాసార్లు చెబుతూ ఉంటారు. "My life is my message" అని. ఆదిపురుషుడు స్వామి. ఆదిపురుషుడు అంటే పూర్వం ఉన్నవాడు. ప్రస్తుతం ఉన్నవాడు మరియు భవిష్యత్తులో కూడా ఉండే వాడని అర్ధము. పురుషుడు అంటే శరీరమనే

రథాన్ని నడిపే సారథి. కృష్ణ పరమాత్మ గీతలో ఇలా అన్నారు.

అజోపి సన్నవ్యయాత్మ భూతానోమీశ్వరోపిసన్

ప్రకృతిం స్వామధిష్టాయ సంభవామ్యాత్మ మాయయా

4వ అధ్యాయం, 6వ శ్లోకం. అర్ధమేమనగా నేను జన్మరహితుడను. ఎవని స్వరూపమైతే మార్పు చెందదో అలాంటి వాడిపై ప్రాణులందరికీ ప్రభువునై కూడా ప్రకృతి యందు అధిష్టితుడనై, నా మాయతోనే నేను జన్మిస్తుంటాను. వర్తమాన శ్రీ సత్యసాయి అవతారము కూడా ఆదిపురుషుడైయుండి తన కోరికపై జనియించి మానవ శరీరం ధరియించారు. కృష్ణ పరమాత్మ అవతరించినపుడు కొంతమంది మానవులు వారి దివ్యత్వాన్ని గుర్తించలేక వారిని మానవ దేహధారిగా భావించి ఎదిరించేవారు. నేడు కూడా అలాంటి మూర్ఖశిఖామణులు ఉన్నారు. వారు అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతూ, స్వామి దివ్యస్వరూపము కనుగొనలేకపోవటంతో తాము నష్టపోతున్నామని, విలువైన రత్నాన్ని చేతులారా విడిచిపెడ్తున్నామని తెలుసుకోలేకుండా ఉన్నారు. అనేకమంది జిజ్ఞాసువులు, జ్ఞానులైన భక్తులకు మరియు యోగ్యులైన వారికి స్వామి ఆదిపురుషులనేది అనుభవవైకవేద్యమే. ఆదిపురుషులు కావటం చేతనే ప్రతి అవతారపురుషునికీ భక్తులయొక్క అనేక జన్మల వృత్తాంతం తెలిసియుండును. సుఖదుఃఖాలు, లాభనష్టాలు మన పూర్వజన్మ కర్మఫలముగా మనకి కలుగుతుంటాయి. సమర్ధ రామదాసు ఇలా అంటారు.

మనసా! పూర్వజన్మ నీకొసగిన పాపపుణ్యాల మూట

అదే నేడు నీ ముందున్న సుఖ దుఃఖాల మూట

స్వామి ఇలా వివరిస్తారు. "సుఖము మరియు దుఃఖము త్రాసు యొక్క రెండు భాగాలు. కానీ మానవులు దుఃఖానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. అందుకని అది చాలా బరువుగా అనిపిస్తుంది." ఇలా అన్నాగానీ దయాళుడైన స్వామి సదా శరణాగతులైన భక్తుల దుఃఖాల బరువు తగ్గించి వాటిని నశింపచేస్తుంటారు. "మీరు నిర్మల అంతరంగంతో, పవిత్ర భావంతో నిస్వార్ధమైన మనస్సుతో నన్ను ప్రార్ధిస్తే నేను మీపై కృపాదృష్టిని నిలుపగలను" అని అన్నారు.

స్వామి తన బిడ్డలను చూడాలన్న ఆకాంక్షతో శరీరాన్ని చాలించిన పిదప జూన్ 14, 2011న స్వప్న దర్శనమిచ్చి అభాగ్యులము అనుకున్న మన అందరినీ భాగ్యవంతులుగా

మార్చిన సంఘటన ఇది. ఎచ్చటనో తెలియదు ఒక సుందరమైన, రమణీయమైన, ఆకుపచ్చని తివాచీ పరిచినట్లుగా ఉన్న స్థలంలో కూర్చుని భగవంతునితో గడిపిన క్షణాలు, మధురోహలు ఒక్కసారి మరలా స్ఫురణకు తెచ్చుకుని వాటి ద్వారా దొరికే ఒక అలౌకికమైన ఆనంద స్థితిలో ఓలలాడుతూ ప్రకృతి అందానికి పరవశించిపోతున్నాను. ఇంతలో ఎచ్చట నుండో జనసందోహం పరుగులు పెడుతూ నా యొక్క ప్రశాంతతకు భంగం కలిగించారు. ఎందుకు అలా పరుగులెడ్తున్నారు? అని వెనుతిరిగి చూచేలోపున ఒక తెల్లటి కారు జనం మధ్యలో నుండి దూసుకువచ్చి నేను కూర్చున్న స్థలానికి కొద్ది దూరంలో ఆగింది. దానిలో నుండి స్వామి దిగారు. ఇంతలో ఒక సేవాదళ్ వచ్చి నాతో 'అమ్మా! మీరిక్కడ కూర్చోవద్దు. అచ్చట బిల్డింగు వద్దకు వెళ్ళండి' అన్నారు. సరే అని చెప్పి బిల్డింగ్ వద్దకు వెళ్ళాను. ఆ బిల్డింగ్ వద్ద ఉన్న సేవాదళ్ 'ఇచ్చట నిల్చొనవద్దు మేడపైకి వెళ్ళండి అచ్చటకు స్వామి వస్తారు. V.I.Pలు అందరూ పైన ఉన్నారు. మీరు కూడా వెళ్ళండి' అన్నారు. సరే అని చెప్పి పైకి వెళ్ళాను. మెట్ల ప్రక్కన ఖాళీ స్థలము ఉన్నది. గది అంతా నిండిపోయి ఉన్నారు. అందుకే మెట్లప్రక్కన కూర్చున్నాను. ఇంతలో స్వామి మెట్లెక్కి పైకి వచ్చారు. కానీ ప్రక్కనే ఉన్న మమ్మల్ని చూడలేదు. లోపలకు వెళ్లారు. అది చూచి బాధ కల్గింది. నాలో అసూయ ప్రారంభమయ్యింది. లోపల ఉన్న అందరితో మాట్లాడిన తరువాత బయటకు వచ్చి నా వెనుక ఉన్న ఇద్దరిని పలుకరించి నా వద్దకు వచ్చి "ఏమి బంగారు! ఎన్ని సంవత్సరములు చెప్పినా మీలో మార్పు రావటం లేదు. 84 సం||లు నా నిరీక్షణ సఫలం కావుట లేదే అని బాధ. అందరిలో అసూయ అనేది తాండవమాడుతున్నది. ఆధ్యాత్మికానికి ప్రధమ శత్రువే అసూయ. నేను లోపలకు వెళ్ళిన తక్షణము బయట ఉన్నవారిలో అసూయ, బయటకు వస్తే లోపల ఉన్నవారిలో అసూయ. దీనిని జయించలేకపోతే ఎలా? నన్ను కోరేవారు నాలుగు రకాలవారుంటారు. శరీరానికి కష్టము కలిగి అలసిపోయిన వాడు వాడే ఆర్తుడు. ఐశ్వర్యం, అధికారం, స్వార్థం, ఆస్తి, సంతానం మొదలగు విషయాల గురించి దుఃఖ పడుతూ ఉంటాడు. వాడు అర్థార్థి. మూడవ వాడు ఆత్మజ్ఞానం కోసం గాఢంగా పరితపిస్తూ మత గ్రంధాలను, పవిత్ర గ్రంధాలను చదువుతాడు. నిరంతరం ఆధ్యాత్మిక సాధనలు చేస్తూ ఆ సాంగత్యములోనే తిరుగాడుతాడు. ఋషులు ఏర్పర్చిన సదాచారాన్ని పాటించడానికి ప్రయత్నిస్తూ భగవత్ సాన్నిధ్యాన్ని చేరటానికి నిరంతరం ఆతృతపడ్తూ

ఉంటాడు. అతడే జిజ్ఞాసువు. ఇక నాల్గవ వాడు జ్ఞాని. అతను ఎల్లప్పుడూ బ్రహ్మతత్వంలోనే మునిగి ఉంటాడు. మొదటి వాడు కష్టంలోనో, దుఃఖంలోనో నన్ను కోరుతూ ప్రార్థిస్తాడు. వాడి కష్టాలు, బాధలు తీర్చి వాడ్ని సంతృప్తి పరుస్తాను. వాడు ఆర్తుడు. అలాగే రెండవ వాడు కోరుకున్న ఐశ్వర్యాన్ని, పదవిని, అధికారాన్ని ఇచ్చి సంతృప్తి చేస్తాను. వాడు అర్థార్థి. జిజ్ఞాసి సద్గురువు మార్గదర్శకత్వంలో ఆత్మానాత్మ విచక్షణ చేయగల్గిన సూక్ష్మ బుద్ధితో నిష్కామ కర్మ చేసే అవకాశం కల్గిస్తూ లక్ష్య సిద్ధికి సహాయాన్ని అర్థిస్తాడు. కావున అతనికి కలిగే కష్టాల నుండి విముక్తిని ప్రసాదిస్తాను. అతడ్ని ఆశీర్వదిస్తాను. ఇక నాల్గవ వాడు అతని ఏకైక మోక్ష లక్ష్యంపై ఏకాగ్రత సాధించటానికి సహాయపడతాను అంటూ నీవు నాతో వస్తావా?" అన్నారు. నేను స్వామి అనేటంతటలోపుననే "నాతో రావటం కొంచెం కష్టమైన పనే. కానీ ఆ కష్టాల తర్వాత దొరికే శాశ్వతానందాన్ని అందుకోగలరు" అన్నారు. స్వామీ! మీతో ఉండే ప్రతిక్షణమూ ఆనందదాయకమే. మీ వద్దవున్న మాకు ఇంక కష్టాలు, దుఃఖాలు అనునవి మాదరి చేరవు. అంతా ఆనందమే కదా స్వామి? అని అన్నదానికి "సంతోషము అయితే నాతో రా" అంటూ క్రిందకు తీసుకువచ్చి కారులో ముందు సీట్లో స్వామి కూర్చుని వెనుక సీట్లో నన్ను కూర్చుండమని చెప్పారు. అలాగే కూర్చున్నాను. కారు బయలుదేరింది. నా కల అయిపోయింది. బాహ్య క్రియలకంటే కూడా హృదయగతమైన భావనలే శ్రేష్టమైనవి ఎందుకంటే హృదయంలో ఉండే సాదుభావన, పవిత్ర భావాలు, శ్రేష్ట భావాలు, సమ భావాలు, నిష్కామ భావాలు అనునవి ఉచ్ఛస్థితికి చెందిన భావాలు. కావున ఇవి క్రియల కంటే అధిక విలువైనవి. మన హృదయములో ఉండే ఉత్తమ భావాల వల్ల మనం చేసే పనులు సహజంగానే పవిత్రంగా మారుతాయి. కొంత మందిలో బాహ్య క్రియలు మంచిగా ఉండి ఆలోచనలు చెడ్డగా ఉండవచ్చు. కానీ అలా సత్ క్రియలు చేస్తూ ఉండడం వలన కొంత సమయం గడిస్తే ఆలోచనలలో కూడా మార్పు వచ్చి సదాలోచనలు ఉద్భవించుట జరుగుతుంది. పవిత్రమైన ఆహారము, పవిత్ర స్థలాల దర్శనము, సత్సంగమము, సదాలోచనలు, సత్కర్మలు నిన్ను సదా సత్ప్రవర్తనునిగా చేస్తుంది అన్న ఒక దివ్యమైన సందేశమును ఇచ్చిన ఈ స్వప్నం మన అందరినీ దివ్యత్వం వైపు అడుగులువేసే సహాయకారి కావున ఇది **<u>సాక్షాత్కారమే.</u>** 100% **<u>సాక్షాత్కారమే</u>**. నిస్సందేహంగా. మనల్ని మనము మార్చుకుని దివ్య స్వరూపులుగా మారుతాము అనుటలో సందేహమే లేదు. కావున

ఇంతటి దివ్య స్వప్న <u>**సాక్షాత్కారాన్ని**</u> అందించిన 'భగవాన్'కు కృతజ్ఞతలు.

అమ్మగా వచ్చి దరి చేరి పలుకరించే ప్రేమగా
తనువంతా పులకరించే ఆ పిలుపులోని మాధుర్యానికి
అమ్మలగన్న అమ్మ వేయి తల్లుల ప్రేమతో
మనీషిగా మార్చే దానవ గుణ సంహారి! దయ గల తల్లి సాయిమా.

## (7)

భగవంతుని హృదయము నవనీతం కన్నా మృదువైనది. భక్తుల వ్యధల తాపంతో అది కరిగి వారి కృపజాలువారుతుంటుంది. కేవలం దైవకృప చేతనే భక్తుల కష్టాలు, కడగండ్లు తొలిగిపోతాయి. అనేక మార్లు పరమాత్మ తాను ధరించిన మానవ దేహంపై భక్తుల శారీరక వేదనలను స్వీకరించి వారిని దుఃఖ విముక్తులను కావించారు. స్వామి ఇలా చెబుతుంటారు "భగవంతుడు మాత్రమే లక్ష్యంగా, మార్గదర్శకుడిగా ఉన్నప్పుడే నిజమైన శాంతి, ప్రేమలు, సత్యాలు ఉండగలవు. నిరంతర నామస్మరణ శరణాగతికి సంకేతము. స్మరణ చాలు. నిరంతర సో -హం స్పృహను అఖండ హంస జపము అంటారు. అది దుఃఖ భయాందోళన నుండి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. మనస్సుపోతే ఇక మోహమే లేదు. మోహక్షయమే మోక్షము. క్రమశిక్షణా పూరితమైన ప్రయత్నం మీద ఆధ్యాత్మిక ప్రగతి, ఆనందాలు ఆధారపడ్డాయి. క్రమబద్ధమైన అలవాట్లు, ఏకాగ్రమైన మనస్సు, ఇంద్రియసుఖ పరిత్యాగము, ఆత్మ యందు విశ్వాసం ఉన్నప్పుడే జీవితం జీవించడానికి యోగ్యమవుతుంది. మార్గం తెలియనినాడు లక్ష్యం చేరలేరు. లక్ష్యం తెలియని నాడు గమ్యాన్ని చేరలేరు. కావున లక్ష్యం, గమ్యంపై దృష్టి నిలిపి ప్రయాణం చేయుట మీ కర్తవ్యం. ఎంతగా అటూ ఇటూ, పైకి పైపైకీ ఎగిరినా చివరికి <u>పక్షి</u> విశ్రాంతి కోసం చెట్టు మీద వాలాల్సిందే. అలాగే ఎంతో ఐష్వర్యవంతుడు, అధికారి అయినా శాంతిని కోరుకుంటాడు. శాంతి ఒకేఒక్క దుకాణంలో దొరుకుతుంది. అదే అంతర్ సత్యము అనే దుకాణం. ఇంద్రియాలు నిన్ను బురదలోనికి లాగుకొనిపోతాయి. అవి నిన్ను పూర్తిగా సుఖ దుఃఖాలనే

వాటిలో ముంచుతాయి. అంటే నిన్ను పూర్తిగా అసంతృప్తిలో ఉంచుతాయి. ఏకత్వాన్ని ధ్యానించడం ఒక్కటే భయాన్ని, అసూయను, లోభాన్ని, కామాన్ని, అసంతృప్తిని కలిగించే వాటన్నింటినీ తొలగించి చెదిరిపోని శాంతిని ప్రసాదిస్తుంది. తక్కినవి ఏవైనా సంతృప్తి అనే భ్రమను మాత్రమే కలిగిస్తాయి. ఈ భ్రమ అనేది బ్రహ్మకు దూరం చేస్తుంది. మీ చుట్టూత, మీతో ఉన్నటువంటి ప్రకృతి భగవంతునికి ఆచ్ఛాదనము. మీ చుట్టూతా ఉన్న వాతావరణంలో అనేక 'రేడియో స్టేషన్'లు ప్రసారం చేసే సంగీతం ఉన్నది. మనకొక రేడియో ఉన్నట్లయితే, దాన్ని సరిగ్గా 'బ్యాండ్'కి ట్యూన్ చేసి కావాలనుకున్న 'స్టేషన్'కి పెట్టినట్లైతే ప్రసారమవుతున్న విషయాన్ని మనము వినగలుగుతాము. అట్లాగే భగవంతుడు అన్నీ చోట్లా పైన, క్రింద, చుట్టూతా, ప్రక్కన, దగ్గరగా, దూరంగా ఉన్నాడు. ఆయన అనుగ్రహించడానికి నీకు కావల్సింది యంత్రం కాదు మంత్రం కావాలి. ధ్యానము అంటే బ్యాండ్ మీద స్టేషన్ని సరిగ్గా పెట్టడం. సత్యాన్ని గ్రహించడానికి ప్రేమ అనే ముల్లును సరిగ్గా పెట్టడం. అది కలిగించే ఆనందమే స్పష్టమైన, సంతోషకరమైన శ్రవణం. భగవంతుడు ఎక్కడా లేడని మీరు ఘోషిస్తే మీ హృదయంలో చీకటిని ప్రతిష్టించుకున్నట్లే. చీకటి పనులని, దుష్ట కార్యాలను చేయటానికి సంసిద్ధులు అవుతున్నారు అన్నమాట. ఆయనను ఒక మూర్తి స్వరూపముగా చూడటానికి నమ్మకంగా, ఖచ్చితంగా విధేయతలతో విధించిన పద్ధతిని అనుసరించినట్లైతే చివరకు ఆయన అనుగ్రహాన్ని, వైభవాన్ని మీరు అనుభవించగలరు. ఆధ్యాత్మిక త్రివేణిలో గంగ భక్తి, యమున వైరాగ్యము, సరస్వతి జ్ఞానం. జ్ఞానం అన్నది సరాసరి రైలు. దాన్లోకి మీరు ఎక్కితే చాలు అది మిమ్మల్ని గమ్యానికి సరాసరి తీసుకువెళ్తుంది. భక్తి అన్నది త్రూ కోచ్. దాన్ని ఒక రైలు నుండి తీసి మరొక రైలుకు తగిలించినప్పటికీ నీవు దానిలోకి ఎక్కితే చాలు చింతించాల్సిన అవసరం లేదు. మీ స్థలంలో మీరు కూర్చుంటే చాలు అది గమ్యానికి మిమ్మల్ని తీసుకుని వెళ్తుంది. కర్మ మామూలు రైలు. దాన్ని ఎక్కితే దిగాల్సి ఉంటుంది. ప్రతీ జంక్షన్లోనూ ఎక్కుతూ దిగుతూ ఉండాలి. మీ సామాన్లని మోసుకుంటూ ఎక్కిస్తూ, దింపుతూ కష్టపడవలసి ఉంటుంది. మీ గమ్యం చేరటానికి చాలా కష్టపడవలసి ఉంటుంది. కావున నేను మీకు సరాసరి రైలు ఎక్కి ప్రయాణించటానికే మార్గాని ఇవ్వాలనుకుంటున్నాను" సరస్వతిగా దర్శన భాగ్యాన్ని కలిగించి స్వామి ఇలా చెప్పారు. "జీవితమనే ఈ వీణను మీటుటకు సహాయసహకారిగా నేను సరస్వతిగా కొలువై ఉన్న బాసర

**క్షేత్రాన్ని,** క్షేత్రపాలకురాలిని దర్శనం చేసుకొనిరా. నీ లోపల ఉన్న జ్ఞాన జ్యోతి దేదీప్యమానంగా వెలుగొందుటకు సహాయమును అందించగలదు" అంటూ దివ్యమైన మార్గాన్ని బోధించారు. ఇది 22 ఫిబ్రవరీ, 2011న స్వామి దివ్య దర్శనాన్ని అనుగ్రహించి జ్ఞాన బోధ ఒసగిన దినము. తెల్లవారుఝామున 3:40ని||లకు స్వామి నా వద్దకు ఏతెంచి నన్ను నిద్ర లేపి కూర్చోనమని చెప్పి స్వామి సింహాసనంలో కూర్చున్నారు. వెంటనే స్వామి తాను కట్టుకున్న అంగీ రంగు కాషాయ రంగు నుండి తెల్లని రంగులోకి మారిపోయినది. వెంటనే ఆ అంగీ తెల్లని చీరగా మారిపొయినది. చూస్తూ ఉండగనే వంటి నిండా బంగారు ఆభరణములు వచ్చినాయి. అమ్మవారిగా రూపాంతరం చెందారు. నన్ను చూచి "ఇప్పుడు నేను ఎలా ఉన్నాను?" అని అడిగారు. స్వామీ! అచ్చు మీరు సరస్వతిలా ఉన్నారు అని సమాధానం ఇచ్చాను. "లా! ఉండుట ఏమిటి నేనే సరస్వతిని. సరస్వతి జ్ఞాన, విజ్ఞాన ప్రదాయిని. జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని ప్రసాదించేది అమ్మయే" అని అన్నారు. వెంటనే వెనక నుండి రెండు చేతులు ఉద్భవించినవి. ఆ రెండు చేతుల్లో ఒక చేతిలో జప మాల రెండవ చేతిలో వేదము. ముందు ఉన్న రెండు చేతుల్లోకి వీణ వచ్చింది. ఆ "వీణను చూపించి, ఇది మానవ జీవితానికి ఒక సంకేతాన్ని ఇస్తూ ఉన్నది అది తెలుసునా" అని అన్నారు. లేదు స్వామీ అని అనగానే "వీణను చూపించి, ఇది మానవ దేహము" అని అన్నారు. వీణకు ఒక వైపు ఐదు **నాబ్స్**, రెండవ వైపు రెండు **నాబ్స్** ఉన్నాయి. వాటిని చూపించి "ఈ ఐదు పంచ ప్రాణాలు, ఈ రెండూ దయ, ప్రేమ. మానవ జీవితమనే ఈ వీణను పంచప్రాణాలతో సరి చేసుకొని దయ, ప్రేమ అనే రెండు గుణాలతో మీజీవితాన్ని మీటగలిగినట్లైతే జీవితమనే ఈ వీణ పైన సుస్వర సుశాంత ప్రశాంత స్వరాలను వినవచ్చును అన్న సంకేతాన్ని అందచేయుటకు సరస్వతి రూపధారియై నిజదర్శనాన్ని అందించాను" అన్నారు. నాలుగు చేతులలతో ఉన్న స్వామి యొక్క దివ్య తేజస్సును **వీక్షించుటకు** రెండు కళ్ళూ చాలవు. అలాగే కళ్ళప్పగించి చూస్తున్న నాతో "విజ్ఞానాన్ని, వినయాన్ని అందించే సుకుమార సుందర రూపం. సకల భూతాల యొక్క హృదయ కమలముల యందుండే ప్రత్యగాత్మను నేనే. దీనినే ఆత్మ అంటారు. దీనిని ధ్యానిస్తే చాలు. అంటే సర్వ భూతాల యొక్క ప్రత్యగాత్మను నేనని విశ్వసిస్తే చాలు. అదే ధ్యానం. అట్టి విశ్వాసానికి ప్రతిబంధకాలు కలగకుండా దృఢవ్రతుడవై ఆచరణలో నిరూపిస్తే నేనే నీవు, నీవే నేను

అనే అనుభవాన్ని పొందుతావు. అదే ఏకత్వం. ఈ ఏకత్వాన్ని సాధించే ప్రయత్నం కొరకే జ్ఞాన విజ్ఞాన విద్యా రూపాన్ని నీకు దర్శింపచేసాను" అని అన్నారు. స్వామీ! మా యొక్క పూర్వ జన్మ సంస్కారం వల్లనే మీ దరి చేరడం. మమ్ము మేము తెలుసుకునేలా చెయ్యడం. ఈ కర్మ **చక్షువులతో** మిమ్మల్ని దర్శించుకోగలిగినాను అన్న నా సమాధానము విని చిరునవ్వుతో "ఎవరు భగవంతునికి ఎంత దగ్గరో వారికి భగవంతుడు అంత దగ్గర. ఎవరు భగవంతునికి ఎంత దూరమో భగవంతుడు వారికి అంతే దూరంగా ఉంటాడు. భక్తుల యొక్క యశస్సు కోరి భగవంతుడు వారి చేత మానవాతీతమైన కార్యాలు కూడా చేయిస్తుంటాడు. తాను సర్వ కర్తయైనా **సాక్షీభూతుడై** యుండి నాటకం ఆడించి ఏమీ ఎరుగనివాని మాదిరిగా నటిస్తూ ఉంటాడు. ఆయనకు భక్తులపై గల వాత్సల్యం అటువంటిది. సుఖదుఃఖాలు మనోధర్మాలు, జననమరణాలు దేహధర్మాలు, ఆకలిదప్పులు ప్రాణధర్మాలు. ఇవి అనాత్మధర్మాలు కానీ ఆత్మధర్మాలు కావు. అనాత్మధర్మాన్ని ఆత్మ యందు ఆరోపించడమే మాయ. మాయ వైపు చూసే వానికి అది అపారమైన సాగరం లాగ అడ్డువస్తుంది. పరమాత్మ వైపు చూపు పెట్టి చూసే వానికి మాయ అనే మాధవుడే **సాక్షాత్కరిస్తాడు.** భగవదైక్యభావంతో గానీ శరణాగతితో గానీ మాయ యొక్క ప్రతిబంధకం నుండి విడిపడవచ్చు. అందులో ఒకటి జ్ఞాన మార్గము మరొకటి భక్తి మార్గము. పూర్తిగా స్వామి వైపు తిరిగి శరణాగతిని సాధించాలి. ఇచట చూచిన దానిని నీ హృదయంలో బంధించుకుని నీయొక్క నిజస్వరూప దర్శనం పొందేలా ఉండాలి. దేహమనే గృహము నందు, హృదయమనే పాత్ర యందు, చిత్తమనే పాలు పోసి, భక్తి అనే పొయ్యిపైన పెట్టి, శ్రద్ధ అనే మూత వేసి, వివేకమనే అగ్ని చేత కాల్చబడినపుడు పాలపై విజ్ఞానమనే మీగడ తయారవుతుంది. మాయ అనే పిల్లి వచ్చి త్రాగకుండా సుజ్ఞానమనే మూత వెయ్యాలి. శాంతి అని చల్లార్చినపుడు, నామము అనే తోడు వేసినపుడు దివ్యకృప అనే పెరుగుగా తయారవుతుంది. ఈ పెరుగును కృప అనే కవ్వము చేత ప్రేమ అనే త్రాడుతో కట్టి చిలికినపుడు అజ్ఞానమనే మజ్జిగ వేరయి జీవుడనే వెన్న తయారవుతుంది. అట్టి జీవుడే దేవునిలో ఐక్యమవుతాడు. దీనినే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు. పరిశుద్ధమైన మానవత్వము ఏనాడు అభివృద్ధి కావించుకుందురో ఆనాడే జీవుడు, దేవుడు ఒక్కటైపోతారు" అని దివ్య సందేశాన్ని అందించారు స్వామి.

ప్రీతితో చేరదీసి ప్రేమ మీర పలుకరించి పరువశింపచేసి
పాప పుణ్యాల గోల ఎల? పట్టితివి పరమ పావన చరణములు
పొరుగువానికి సాయపడి ప్రేమ మీర పలకరించిన చాలనుచూ పరమపదము అందించు
ఆ పావన చరణములు ఈ ప్రణవనాధుని చరణములే అవి నా సాయి చరణములే

## (8)

భగవంతుడు తన ప్రతి అవతారములోనూ భక్తులకు వారి తీవ్రమైన సాధనకి మెచ్చి ఫలములొసంగుట మనమెరిగినదే. దేవుని యెడల ప్రేమ, భక్తి, శ్రద్ధ, గలవారికి స్వామి వారి ఆశీస్సులు ఎన్నో రూపాలలో లభిస్తూనే ఉంటాయి. "నేను ప్రారంభంలో నా భక్తులకు వారికి కావాలిసినది ప్రసాదిస్తాను. ఎన్ని కోరికలు తీరుస్తానంటే చివరకు వారు నాకు కావాలిసినది, నేను ఇవ్వదలచినది మాత్రమే అడగాలి" అని స్వామి అన్నారు. భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా లోకనాధుడు. సమస్త జగతికి పాలకుడైన స్వామికి మన అంతరంగాన్ని స్వర్గము, భూలోకము, పాతాళము అను మూడు లోకాలుగా ఊహించుకుంటే భగవాన్ బాబా ఈ మూడు లోకాలకు అధిపతి. భగవాన్ బాబాని ఒకరు 'ప్రస్తుతం మీ అవతారము ఈ భువిపైన ఉండగనే ఇక్కడ యోగి అరవింద్ కూడా ఉన్నారు' అని అన్నదానికి మరుక్షణంలోనే స్వామి ఇలా ప్రత్యుత్తరం ఇచ్చారు "అరవిందుడు వ్యక్తి నాధుడైతే నేను లోకనాధుడను. దీని భావార్ధమేమనగా ఎవరైతే 'అరవింద్'ని భజించుతారో వారికి అరవిందుడు పాలించేవాడు. కానీ భగవంతుని ఏ రూపమైనా స్మరించేవారికి స్వామి "నాధుడు" అనగా లోకనాధుడు". ఈ ప్రశ్న అడిగినవారికి తెలియకపోవచ్చు అదేమిటంటే స్వామి జన్మించిన రెండవరోజు యోగి అరవింద్ ఇలా ప్రకటించారు. 'నేడు భువిపైన భగవంతుని ఆగమనం జరిగింది'. స్వామి చిన్మయానంద, భగవాన్ బాబా కీర్తిగానం చేస్తూ ఇలా అన్నారు 'నేను కొద్దిమందికి మాత్రమే జ్ఞానోపదేశం చేస్తాను. కానీ స్వామి సముదాయానికి ఉపదేశం చేస్తారు'. ఇందులోని "సముదాయం" అనే పదం వ్యాపిస్తూ వ్యాపిస్తూ పూర్తి విశ్వాన్ని తనలో ఇమడ్చుకుంది. జగత్తులోని భిన్న భిన్న మతములవారు

వారు ఏ దైవాన్ని ఆరాధించినా, ఆ పిలుపు స్వామినే చేరుతుందనే అనుభూతి కలిగింది.

స్వామి అంటుంటారు "నేను ఏదైనా కొంత స్థలము వరకు పరిమితుడను కాను. నాకు కేవలం ఒక్క నామమనే బంధం లేదు. నా వద్ద నీది, నాది అనే బేధం లేదు. మీరు ఏ పేరుతో పిలిచినా నేను స్పందిస్తాను. పిలిచినవారి దరి చేరతాను". అలా చెప్పిన స్వామి ఆ పిలుపును అందుకుని కదిలి వచ్చిన సన్నివేశం ఇది. "ఏ యోగులైతే తపస్సులోని ఒక విశిష్టమైన దశ వరకూ చేరుకున్నారో వారు ఒక గూఢమైన ఆకర్షణతో ఉంటారు" అని స్వామి చెప్పిన విధంగా 'హరే రామ హరే కృష్ణ జప యజ్ఞ ఆశ్రమ' పీఠాధిపతి శ్రీ ప్రణవానంద స్వామిజీ. వారు పేరుకు తగినట్లుగా 24 గంటలూ ప్రణవాన్ని జపిస్తూ ఉంటారు. ఆ ప్రణవ నాదమే భగవాన్ బాబా వారి అడ్రస్సు, ఫోన్ నెంబరు. కావున ఆ ఫోన్ నంబరుతోనే వారిని తమ సన్నిధికి రప్పించుకున్నారు. మంత్రార్థం లాగానే మంత్రంధ్వని కూడా విలువైనదే. విషసర్పం కూడా సంగీతం చేత శాంతించబడ్తుంది. నాదానికి ఆ సమ్మోహన శక్తి ఉంది. ఊయలలో పిల్లవాడు ఏడుస్తూ ఉంటే జోలపాట పాడగానే ఏడుపు ఆపేస్తాడు. కారణం ఆశబ్దములోని మాధుర్యమే. అలాగే నీలోపల ఉన్న, గోల చేస్తున్న పిల్లలను శాంతింప చేయటానికి ఒక శబ్దమే ఓంకార నాదము. ఈ నాద స్వరం సకల జీవులను తనలోని ఆనంద స్వరూపాన్ని కనుగొనేలా చేస్తుంది. ప్రతి కదలికా ఒక ధ్వనిని కలిగిస్తుంది. ఆ ధ్వనియే సాధకుల ఫోన్ నంబరు. ఆ నంబరుకు ఫోన్ చేయగానే నీ లోపలనే ఉన్న నిత్యానంద స్వరూపము నీతో మాట్లాడుట ప్రారంభిస్తుంది. ఆ ఆనంద స్వరూపమే నీవు అనునది నీ ఎరుకలోకి వస్తుంది. నీవే నేను అనునది తెలుసుకున్న జీవికి ఇంక తెలుసుకోవలసినది ఏమీ లేదు. అటువంటి స్థితి ప్రతీ జీవి అందుకోవలెను. అందుకే స్వామీ అంటూ ఉంటారు "ఆనందం ప్రసాదించడమే నా ముఖ్యమైన కార్యము. అందువలన కేవలం ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు మాత్రమే గాకుండా మీకు కావలసినన్నిసార్లు నేను మీ వద్దకు వస్తూనే ఉంటాను". అలాగే స్వామి తమ దివ్య సందేశాన్ని అనుసరించి జూలై 2, 2011న ప్రణవానంద స్వామీజీని తెల్లవారు ఝామున 3:40 కి నిద్రలేపి "నీవు నాతో వస్తావా? నీకు నా సమాధి చూడవలెనని కోరికగా ఉన్నది కదా?" అన్నారట. దానికి స్వామీజీ ఔను స్వామి! తప్పకుండా వస్తాను అని బయలుదేరినారట. ఇద్దరూ కలసి ఒక ప్రదేశానికి వచ్చారు. అచట నుండి ఎచ్చటికో తెలియదు కానీ లోపలకు చాలా మెట్లు ఉన్న మార్గమును స్వామి ప్రణవానంద

స్వామికి చూపించి "ఈ మెట్లమార్గము ద్వారా లోపలకు వెళ్ళినట్లయితే నీవు నన్ను దర్శించుకోగలవు" అని అన్నారట. అదేమీ స్వామి? ఇచ్చటనే కుల్వంత్ హాలులో కనిపిస్తూనే ఉన్నది కదా? లోపలకు ఎందుకు? అని అడిగినారట. దానికి స్వామి "నీవు చూచే ఈ సమాధి పాంచభౌతికమైన ఈ దేహానికి కట్టినది. పాంచభౌతికమైన దేహము పంచభూతాలలో కలిసిపోయినది. ఇంక అచట ఏమీ లేదు. నన్ను చూడాలి అంటే నీవు నేను చూపే మార్గంలో వచ్చినట్లయితే నా నిజస్వరూప దర్శనాన్ని పొందుతావు. నా వెంట రా!" అంటూ క్రిందకు తీసుకు వెళ్లారు. అలా క్రిందకు దిగిన తర్వాత అచట దేదీప్యమానమైన వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి. అవి అచట ఉన్న నవరత్న గోమేధికాలలో ఉన్న రాశుల నుండి ఉద్భవిస్తున్న కిరణాలు అని అర్ధమయినది. వాటి మధ్య స్వామి కూర్చుని దేదీప్యమానంగా వెలుగొందుతున్నారు. సహస్రమైన సూర్యులు ఒక్కసారిగా ఆకాశంలో ప్రకాశిస్తే ఎంతటి వెలుగును చూడగలమో అంతటి వెలుగును చూచి స్వామీ! ఏమి ఇంతటి వెలుగు? నేను ఏమీ దర్శించలేకున్నాను అని అడుగగా "ఇది నీవు చూడాలి అంటే కేవలం నా అనుగ్రహం వలననే చూడగలవు" అంటూ అనుగ్రహ దృష్టిని ప్రసాదించి "ఇది నా నిజస్వరూపము. నేను రూపధారిగా ఉన్నప్పుడు భక్తులకు సదా ఆనందమే ప్రసాదిస్తూ ఉంటాను. నేను కేవలం ప్రేమనే. నేను ఒకే ఒక వస్తువును ఇస్తాను. అదేమిటంటే ఆనందం అని మీరు గమనిస్తారు. ఈ ఆనందం ద్వారా నేను ప్రేమను పంచుతాను. స్వాంతన చేకూర్చటము, ధైర్యమును ఇచ్చుట, శాంతి ప్రసాదించుట నా కర్తవ్యము. ఇది నా స్వభావము. విశేషమేమిటంటే మీ కొరకు ఒక రూపు దాల్చి వచ్చాను. ఆరూపమే మీకు క్రొత్త కానీ నేను పురాతనమైన వాడినే" అంటూ కుర్చీ చూపించి "ఈ కుర్చీలో కూర్చో అంటూ సంభాషణకు ఉపక్రమించారు. ప్రణవా! నీవు ఏ సాధనైతే చేస్తున్నావో ఆ సాధన ద్వారా నీవు చేరదలచుకున్న గమ్యం చేరడానికి కొద్ది దూరం మాత్రమే ఉన్నది. ఆ కొద్ది దూరం చేరడానికి ఇంకొక జన్మ తీసుకోవద్దు. ఏదైతే మిగిలి ఉన్నదో దానిని పూర్తిచేయి. అసంపూర్తిగా ఉంచొద్దు. భగవంతుని అనుగ్రహము దండిగా ఉన్నది. నీ నిజ స్వరూపము ఆత్మ అని తెలుసుకో. అదే ఈ విశ్వం యొక్క అంతర్శక్తి అని కూడా తెలుసుకో. సత్యంలోకి నీ బుద్ధిని పంపించు. నిన్ను నీవు తెలుసుకొనుట ప్రయత్నించి అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, చివరకు ఆనందమయకోశాలనే చైతన్యం యొక్క అనేక పొరలను కనుక్కో.

పంచకోశాలనీ అధిగమించవలసిందే. అప్పుడే ఆత్మ అనే నీ యొక్క సత్యాన్ని పొందుతావు. ప్రణవము ధనుస్సు, ఆత్మయే బాణం, పరబ్రహ్మం లక్ష్యం కాబట్టి ధనుర్విద్యాభ్యాసకునిలాగా, సాధకుడు మనస్సుని ఆందోళనపరిచే వాటికి చెదిరిపోకూడదు. లక్ష్యం మీద ఏకాగ్రత ఉండాలి. అప్పుడతనిలో లక్ష్యమే నిండిపోతుంది. ఏకాగ్రత చూపుతున్న లక్ష్యమే తానయిపోతాడు. కైవల్యోపనిషత్తులో, శృతిలో (వేదాల్లో) అనేకచోట్ల అనేక విధాలుగా ప్రణవం కీర్తించబడింది. కాబట్టి ముక్తిని ప్రసాదించే ఈ మంత్రాన్ని అందరూ జపించి ధ్యానించవచ్చు. ప్రణవోపాసనము అందరూ చేయవచ్చు. ఈ విషయం మీద నీకు సందేహం అక్కరలేదు. జీవితకాలంలో మనిషికి ఏది రాకున్నా మృత్యువు మాత్రం తప్పక వస్తుంది. కాబట్టి ప్రతి మనిషి మరణ వేళలో తనకు ఏది ఎక్కువ లాభమో దాన్ని పొందటానికి వీలయ్యే మనః స్థితి, ఆలోచన కలిగే శిక్షణ పొందాలి. లేకపోతే జీవితం ఓడిపోయినట్లే, వ్యర్థమయిపోయినట్లే. ఈ శిక్షణకు సిద్ధం కాని వాడు తనకు తటస్థించే విధిని అనుభవించాల్సి ఉంటుంది. ఓడిపోవడం కోసం ఎవరూ యుద్ధరంగం లోనికి ప్రవేశించరు. అట్లాగే కావాలని ఎవరూ పతనాన్ని కోరుకోరు. అభ్యుదయాన్ని మాత్రమే కోరుకుంటారు. కాబట్టి నీకు ఎక్కువ మేలు చేసేట్లుగా ఉండే అంత్యకాలం కోసం ప్రయత్నించడం విజ్ఞత కాదా? కాబట్టి ప్రతి మనిషి తన జీవితపు చివరి ఘడియల్లో సప్తమాంశమైన ప్రణవం మీద ఆలోచనలు కలిగేటట్లు ప్రయతించాలి. ఆ ఆలోచనలతో ఎవరు మరణిస్తారో వారు నన్ను పొందుతారు అని శ్రీ కృష్ణుడు చెప్పి ఉన్నాడు. అంతిమ ఘడియల్లో ప్రణవాన్ని జపించు. అందువల్లనే నిరంతర దైవ నామస్మరణ ఇహపరాల్లో భగవంతుణ్ణి నీ **<u>యోగక్షేమ</u>** భారం వహించేటట్లుగా చేస్తుందన్నారు. ఐతే దీన్ని కూడా ఎంతో దీర్ఘ కాలం సాధన చేయాలి. నిశ్చల, దృఢమైన సాధన అన్నింటినీ సాధిస్తుంది. ప్రభువుతోడి యోగము, మౌనము, ప్రార్థన ఇవ్వగల్గిన గొప్ప కానుకను వేరొకటి ఏదీ ఇవ్వలేదు. మంచి బ్యాంకు అకౌంటు గానీ, డిగ్రీల కుప్పలు గానీ, బహుమతిని ఆర్జించిన వస్తాదు కండరాలు కానీ ఏవీ ఇవ్వలేవు. అన్ని రకాల మనుష్యులకూ మంత్రము, జపము అవసరమే. మంత్రం అంటే ఏమిటి? "మ" అంటే మననం "త్ర" అంటే త్రాణము (రక్షణ). కాబట్టి మంత్రం అంటే నీవు దాన్ని ధ్యానిస్తే నిన్ను **<u>రక్షించగలిగేదని</u>** అర్థము. మృత్యువు, దుఃఖం, బాధ అన్నవాటి చేత పురుగుపట్టిన లౌకిక జీవితపు చిక్కులలో చిక్కుకొనకుండా మంత్రం నిన్ను **<u>రక్షిస్తుంది.</u>** అన్ని మంత్రాలలోకి ప్రణవం గొప్పదీ, శ్రేష్టమైనది.

వాటి అన్నింటికీ అది మకుటము, కిరీటము." ఈ రకంగా ప్రణవానంద స్వామీజి తాను ఉన్న స్థితి నుండి అందుకోవలసిన స్థితిని తెలియపరిచిన ఈ స్వప్నం స్వప్నమంటారా? మానవాళికి అందించిన దివ్యోపదేశమిది. అలనాటి శ్రీకృష్ణుడు నేటి సాయికృష్ణుడై మన దరికి వచ్చి మనిషిని మనీషిగా తీర్చిదిద్దుటకై ఏతెంచినారు.

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ

అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

ఇతర ధర్మాలన్నింటినీ వదిలి నన్నే శరణు పొందు అన్నది దాని అర్థం. అలాగే ఆయన సేవకు మనస్సు మొత్తం సమర్పించు. అప్పుడాయన నిన్ను పతనం కాకుండా **<u>రక్షిస్తాడు</u>** అన్న హామీపత్రం మన చేతికందించిన 'భగవాన్'కు ఏరకంగా కృతజ్ఞతలు సమర్పించుదాము? ఆయన చెప్పిన రీతిలో జీవితాన్ని నడుపుకొనుటకు ప్రయత్నిద్దాము. ప్రయత్నించి మన జన్మసాఫల్యతను సాధించి స్వప్న **<u>సాక్షాత్కారాన్ని</u>** అందుకుని యదార్ధ **<u>సాక్షాత్కారం</u>** సాదిద్దాము.

సాయి దృష్టి తగిలిన దూరమవును దురదృష్టము
ప్రశాంతి గాలి సోకిన చాలు మానసిక **<u>క్షేత్రము</u>** **<u>ప్రక్షాళన</u>** మవును
సాయిరాం యని పిలిచినంతనే హృదయమున ప్రేమ ఉప్పొంగు
దివ్యాత్మ స్వరూపులారా! యని సంబోధించి దివ్యాత్మ స్వరూపులుగా మార్చె సాయి అనుగ్రహము.

## (9)

భక్తి, జ్ఞాన దీపాలను ప్రజ్వలింపచేసే స్వామికి నా నమస్కారములు. భగవాన్ బాబా భక్తుల కొరకు మూడు మార్గాలు సూచించారు. అవి కర్మ, భక్తి, జ్ఞానము అంటారు. వాటి గురించి స్వామి ఈ విధంగా తెలియచెప్పారు. "జ్ఞానం ఆధారంగా మీరు కర్మలు చేయండి. కర్మలు భక్తితో అంటే నమ్రత, ప్రేమ, దయ మరియు అహింసలతో నింపివేయండి. కర్మ అంటే మెల్లగా సాగే ప్యాసింజరు లాంటిది. దానిలో భక్తి మిశ్రమం కలిపితే అది **'<u>సూపర్ఫాస్ట్</u>'గా**

మారగలదు. కర్మ మరియు భక్తి వలన సత్యస్వరూప జ్ఞానం వికసిస్తుంది. దాని వలన మీ అంతర్యామి వైపు నీవు స్వయంగా పయనిస్తావు. భగవంతుని నుండి విడిగా అస్తిత్వం లేని మానసిక దశే భక్తి. భక్తుని శ్వాసే భగవంతుడు. అతని ప్రతి కార్యము భగవంతుని చేత జరుగుతుంది. భగవంతుని కొరకు చేస్తాడు. అతని ఆలోచనలన్నీ భగవంతుని గురించే. అతని మాటలన్నీ భగవంతుని చేత ఉచ్చరించబడతాయి. భగవంతుని గురించే ఉంటాయి. నీళ్ళల్లో మాత్రమే బ్రతుకగల్గే చేపలాగా మనిషి కూడా భగవంతునిలోనే, శాంతిలోనే, ఆనందంలో మాత్రమే బ్రతుకగల్గుతాడు. వేరే వైపున అతనికి భయమూ, పిచ్చి సంఘర్షణా, అపజయాలు మాత్రమే ఉన్నాయి. మనిషి యొక్క అధమ స్వభావానికి గుర్తు నంది లేక ఎద్దు. అది దేవుడి వాహనం అయినపుడు గుళ్ళో దేవుని గర్భగుడి ముందు స్థానం సంపాదించుకున్నది. ముందు స్థానం సంపాదించుకుని తరువాత భగవంతునికి లభించే సత్కారాలలో కొంత పాలుపంచుకుంటుంది. భగవంతునితో సాంగత్యం మాత్రమే విలువను, వైశిష్ట్యాన్ని కల్గిస్తుంది. సునిశిత బుద్ధిచేత, స్వచ్ఛమైన మనస్సు చేత మాత్రమే ఆత్మను గ్రహించగలుగుతాడు. మనస్సును నిష్కల్మషం చేయుట ఎట్లు? అది వెంటబడే ఆహార పదార్ధములను దొరకనీయకుండా ఉండటం ద్వారా అంటే విషయ సుఖాలను దొరకనీయక, ఆరోగ్యకరమైన తిండి అంటే భగవద్విచారణ అన్న దానిని పెట్టడం ద్వారా శాశ్వత - అశాశ్వతముల విచక్షణకు పూనుకున్నట్లైతే బుద్ధి కూడా పదునెక్కుతుంది. భగవంతుని మీద, ఆయన నామం మీద, ఆయన రూపం మీద నీ ఆలోచనలు లగ్నమయ్యేటట్లు చేయగలిగితే ఎప్పుడూ స్వచ్ఛమూ, శాశ్వతమూ అయిన ఆనందాన్ని పొందుతావు." అందుకే స్వామి సాధనగా నామస్మరణకు అంత విలువ ఇస్తూ చెబుతారు. మనలో చాలా మంది కోరికలు తీరినపుడు దేవుడ్ని విశ్వసించటానికి పూనుకుంటారు. కోరికకు వ్యతిరేకంగా జీవితం వెళ్ళినపుడు దేవుడి మీద అవిశ్వాసం చూపుతారు. ఇవేవీ భగవంతుని యొక్క సత్యత్వంతో సంబంధం లేనివి. చెడ్డ లక్షణాలే చెడ్డ అలవాట్లుగా మారుతాయి. ఈ అలవాట్ల యొక్క చెడ్డతనాన్ని యాంత్రికమైన సాధన ద్వారా పోగొట్టుకోలేము. దీనికొక చిన్న కథ ఉంది. అజీర్ణంతో ఒకాయన బాధపడ్తున్నాడు. అది దీర్ఘ వ్యాధిగా మారటంతో ఆయన అనేక మందులు వాడినా దండగే అయ్యింది. ఆయన అదృష్టంవల్ల ఒక సాధువు ఆ దారిలో వచ్చి ఆ వ్యాధికొక చికిత్సను సలహాగా చెప్పాడు. ఆయన ఒక రోజంతా సైంధవలవణాన్ని చప్పరించి

మింగమన్నాడు. అట్లా కొంత కాలం చేసిన తర్వాత రోగం చాలా వరకూ తగ్గినట్లు అనిపించింది. ఇతను పండుగ రోజుల్లో పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టేవాడు. ఒక దీపావళి రోజున అతను అనేక మిఠాయి దుకాణాలకు వెళ్ళి లడ్డూలను తిని చూస్తే ప్రతి దుకాణంలోనూ అవి చేదుగా అనిపించాయి. అతను ఉప్పును చప్పరించడమే ఇందుకు కారణం. ఇతని యొక్క అలవాటును తెలిసిన ఒక దుకాణదారు లడ్డూ రుచి చూచే ముందు నోరు కడుక్కోమన్నాడు. దుకాణదారుడు చెప్పింది చేసాక లడ్డూ అతనికి తియ్యగా ఉన్నది.

భగవాన్ బాబా భక్తులను ఉద్దేశించి ఇలా అంటారు "నీ చెడ్డ అలవాట్లకు నీవు లొంగి ఉన్నప్పుడు నీకు తటస్థపడిన దివ్య పురుషుల యొక్క పవిత్ర సాంగత్యం నుంచి మధురరుచి, సువాసన మీకు లభించదు. మీ మనస్సును శుద్ధి చేసుకున్నాకనే సత్సాంగత్యం నుంచి మంచి లాభాన్ని పొందుతారు. అప్పుడే మీరు ఆత్మానందాన్ని అనుభవించగల్గుతారు. జనులందరినీ తరింపచేసే భగవాన్ బాబా సదా నిస్సహాయులకు సహాయము చేస్తుంటారు. వారికి ఆశ్రయమిచ్చి వారిని కృతార్థులను చేస్తుంటారు. "నిస్సహాయులకు సహాయం చేయటమనేది మిమ్మల్ని భగవంతుని దరి చేర్చే ఏకైక మార్గం. ఆ మార్గమే మిమ్ములను భగవంతుని అనుగ్రహం పొందేలా చేస్తుంది. ఆధ్యాత్మజీవితానికి మొదటి గుర్తు వైరాగ్యం. నీకు వైరాగ్యమే లేకపోతే ఆధ్యాత్మిక పాండిత్య విషయంలో నీవు నిరక్షరాస్యునికింద లెఖ్ఖ. సాధన యొక్క "అ, ఆ "లు వైరాగ్యం. ఇంద్రియాలతో బంధాన్ని నీవు వదిలివేయగలిగినంతగా వైరాగ్యం బలపడాలి. కొద్ది నిముషాల ఆలోచన ప్రాపంచిక ఐశ్వర్యాలు, కీర్తి, సుఖం దండగ అని ఎవరికైనా తెలుసుకునేలా చేస్తుంది. నీవు ధనవంతుడివి అయినపుడు ప్రతివాడూ నిన్ను పొగుడుతాడు. చెరువు నిండినపుడు వందలకొలదీ కప్పలు దాని చుట్టూతా బెక బెక మంటాయి. చెరువు ఎండిపోయినపుడు ఒక్కటైనా ఉండదు. సామెత చెప్పినట్లుగా శవం మీద నాలుగు రత్నాలున్నప్పుడు చాలా మంది చచ్చినవాడు తమ బంధువంటారు. దాని మీద విలువైనవేవీ లేకపోతే ఏడవటానికి కూడా ఒక్కరైనా ముందుకురారు. నీ బ్యాంకు ఖాతాకు మరికొంత డబ్బు జమచేస్తున్నప్పుడు నీ పిల్లలకది శుభ్రమైన, సుఖవంతమైన, మర్యాదవంతమైన జీవితం గడపడానికి కష్టం కల్గిస్తూ - కష్టాలను జమచేస్తున్నామేమో అని ఆలోచించుకోవలసిన విషయము. తప్పుడు మార్గాల ద్వారా అల్పమైన కీర్తి కోసం నీవు తన్నుకులాడుతున్నప్పుడు

కోట్ల మంది నీ దేశ ప్రజలలో ఎవరు గౌరవించబడ్డున్నారో? ఎందుకు గౌరవించబడ్డున్నారో? జ్ఞాపకం చేసుకుంటే లోక **సాక్షాత్కారమనే** సులభ మార్గాన్ని పట్టుకున్నవాళ్ళనికాక సర్వత్రా త్యాగంతో, సన్యసించి, దైవ **సాక్షాత్కారమనే** క్లిష్ట మార్గాన్ని పట్టుకున్న వాళ్ళని మాత్రమే గౌరవించడం మీరు చూడటం లేదా? విధి కొట్టే అన్ని దెబ్బలు, అన్ని దురదృష్టాలు, కష్టాలు గుంపులుగా వచ్చినపుడు పాండవులు ఎన్నడూ **ఆక్షేపించలేదు**. అవి కృష్ణుడ్ని తాము జ్ఞాపకం చేసుకోడానికి, ఆయన్ని పిలవడానికి ఉపయోగపడినాయని వారు సంతోష పడ్డారు. మరణానికి ముందు అంపశయ్య మీద భీష్ముడు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. అప్పుడు అర్జునుడు ఎందుకని అడుగగా ఆయన పాండవులనుభవించిన కష్టాలు నా మనసులోకి వచ్చినాయని జవాబిచ్చాడు. కలియుగానికి పాఠం చెప్పడం కోసం ఇదంతా జరిగింది. ఎప్పుడూ అధికారాన్ని, హోదాను లేదా తుచ్ఛమైన ధనాన్ని కోరకుండా సంపూర్ణమైన విరక్తి భావంతో ఈశ్వర సంకల్పానికి సమర్పించుకున్నట్లయితే నీవు నిశ్చలంగా, ఎల్లప్పుడూ సంతోషంగానే ఉండవచ్చును అని భీష్ముడు అన్నాడు. భక్తుడు భగవంతుని వైపు వెళ్ళిన దాని కంటే వేగంగా భగవంతుడు భక్తుని వైపుకు పరిగెత్తుతాడు. ఆయన నీ వైపుకి వంద అడుగులు వేస్తాడు. విశ్వాసం ఉంచిన యెడల, భగవంతుడు నీ తల్లిదండ్రులకంటే ఎక్కువగా నీలో ఉండే నిన్ను కాపాడుతాడు. అనుక్షణం నీ మార్గాన్ని నిర్దేశిస్తూ వెన్నంటి ఉండి నీ జీవన మార్గానికి రథసారథియై నడిపిస్తాడు అన్న దానిలో సందేహమే లేదు."

జూలై 2వ తారీఖున తెల్లవారురఝామున స్వప్నదర్శనాన్ని ఇచ్చి ఇలలో దర్శన భాగ్యాన్ని ఇచ్చిన భగవంతుని ప్రేమకు దాసాను దాసోహులము అవ్వక తప్పదు. ఆ కలలో స్వామి 18 మందిని తన వెంట పిలుచుకుని కుల్వంత్ హాలుకి వెళ్ళి సింహాసనంలో కూర్చున్నారు. మమ్మల్ని ఎదురుగా కూర్చొనమని చెప్పారు. మమ్మల్ని అందరినీ చూస్తూ మా అందరిలోనుండి ఒక వ్యక్తిని పిల్చి అతనికి స్టూడెంటు చేత బట్టలు తెప్పించి ఇచ్చారు. "అవి కట్టుకుని రా!" అన్నారు. అతను బట్టలు కట్టుకుని వచ్చిన తదుపరి అతనిని చూచి "భగవంతుడు ఏది ఇస్తే దానిని అలాగే స్వీకరించాలి" అన్నారు. అతను ఆలోచిస్తూ ఉండగా "నేను ఇచ్చినది ధోవతి, దానిని లుంగీలా ఎందుకు కట్టావు? కట్టుకోవడం రాదా" అన్నారు. వచ్చు స్వామీ అని సమాధానం ఇచ్చాడు. "అయితే అలాగే కట్టుకో" అన్నారు. సరే అని

కట్టుకోగా "అది బాగా లేదు ఇంకొక రకంగా కట్టుకో" అని అన్నారు. ఎలాగా అని ఆలోచిస్తున్నంతలో స్వామియే "తలకు కట్టుకో" అన్నారు. అలాగే తలకు కట్టుకోగానే వేరే స్టూడెంట్ చేత నీళ్ళపైపు తెప్పించి అతనికి ఇచ్చి అచ్చట ఉన్న చెట్లను చూపించి వాటికి నీళ్ళు పెట్టు అన్నారు. అతనికి స్వామిని వదిలి వెళ్ళుటకు ఇష్టం లేక స్వామిని చూస్తూ మొక్కలకు నీళ్ళు పెడుతూ ఉండగా "డ్యూటీని డ్యూటీగా చెయ్యి. మొక్కలకు నీళ్ళు ఎక్కువ అయితే కుళ్ళిపోతాయి, తక్కువ అయితే ఎండిపోతాయి" అంటూ అచట ఉన్న అందరినీ చూపించి "ఈ మొక్కలు కూడా ఇంతే. సరైన పోషణ లేకపోతే పెరగవు. ఈ మొక్కలు ఏపుగా పెరగాలన్నది స్వామి ఉద్దేశము. సదాలోచనలు, సత్కర్మలు, సత్ దృష్టి, సత్ సంభాషణ, సన్మిత్రుల సహవాసం, సత్ భోజనం ఇవి అన్నీ కూడా సత్సంగము అనే ట్యూబ్ ద్వారానే అందించాలి. ఈ మొక్కలు ఏపుగా పెరగాలి. ఆ సద్గుణాలు లేకనే నీరసించిపోతున్నాయి" అని నా వైపు తిరిగి "ఏమి చేస్తున్నావు? ఈ బిడ్డలకు తల్లిగా ఏమి అందిస్తున్నావు? భౌతికమైన తల్లి తన బిడ్డకు కొంత ఆహారం పెడితే సరిపోతుంది. ఆధ్యాత్మికమైన తల్లిగా వారి ఎదుగుదలకు కావలసిన మానసిక ఆహారాన్ని అందించవలసిన బాధ్యత ఉన్నది కదా? నీవు అందించే ఆహారాన్ని అందుకొనుటకు నీ బిడ్డలను తయారు చెయ్యి" అన్నారు. "నిరంతర ఆధ్యాత్మిక సాధన ద్వారా భగవంతుడ్ని **సాక్షాత్కరించుకోవాలి**. నీ అంతట నీవే సందేహ, సంకోచాలకు తావివ్వకు. క్రమశిక్షణను పాటించి నీ అంతఃకరణాన్ని నిష్కల్మషం చేసుకుంటే నీ హృదయ ప్రతిష్టితుడైన దైవాన్ని దర్శించుకోగలవు. కప్పులో పంచదార ఉన్నది కానీ నీటికి రుచి లేదు. కారణం నీవు నీటిని బాగా కలపలేదు. అందుకే రుచి రాలేదు. సాధన అంటే కలపడమే. నీ జీవితంలోని ప్రతి క్షణాన్ని భగవంతునితో కలుపుకో. దానితో జీవితం మధురమౌతుంది. తల్లిగా నీ బాధ్యత అది. ఆ మధుర పదార్థాన్ని బిడ్డలందరికీ కడుపునిండా పెట్టాలికదా? ఇంతకీ నీకు అప్పగించిన పని ఎంత వరకూ వచ్చింది?" అని అడిగినారు. స్వామీ! శ్లాబ్ వేయాలి. "ఓహో రెండవ విడత కట్టినదాన్తోనా?" అని అడిగినదానికి అవును స్వామి అని సమాధానము ఇచ్చాను. "చాలా సార్లు చూచాను. మరలా కూడా చూస్తాను. సేవ ఎలా చేస్తారు?" అని అడిగినారు. స్వామి మీరు ఎలా చెబితే అలా చేస్తాము అని చెప్పాను. "మీ అందరిలో ఇంకా ద్వేషం, అసూయ, క్రోధం, ఈర్ష్య, అభిమాన అహంకారాలనే గుణాలు చాలా మెండుగా

ఉన్నాయి. వాటిని త్యజించి ఆ స్థానంలో ప్రేమ, కరుణ, జాలి, ఆప్యాయత, అనురాగాలనే వాటిని తీసుకుని వాటితో మీరు చేసే ప్రతి సేవ భగవంతునికి పాదార్చన చేస్తుంది" అన్నారు. "మీరు వేసుకున్న రోడ్డు చాలా **సురక్షితమైనది**. ఆ రోడ్డు పైకి ఎక్కడం వరకే నేర్చుకున్నారు. నడవటం చేతకాలేదు. ఆ నడకలో ఎన్నో కష్టాలు, నష్టాలు, దుఃఖాలు, బాధలు, సుఖాలు ఎదురవుతాయి. వాటన్నింటినీ అధిగమించిన తరువాత శాశ్వతమైన సుఖం దొరుకుతుంది. శాశ్వతమైన ఆనందం అందుకోవటమే జీవుల యొక్క నిజస్థితి. ఆ నిజస్థితిని అందుకొనుటయే జీవుల యొక్క ఏకైక లక్ష్యం. కావున ఆ రోడ్డుపైన ప్రయాణించుటకు మీరు, మీ బిడ్డలు, నీ బిడ్డలు అనుకున్న నా బిడ్డలు, నీ తోటి పరివారము అందరూ ప్రయాణించచవలసిన సమయము ఆసన్నమైనది. ఈ సమయం మించితే మరలా దొరకదు. దొరికిన సమయాన్ని సద్వినియోగపర్చుకోండి. నిన్ను తీరం దాటించేది నా బిడ్డలు. నీ బిడ్డలు అనుకున్న వీరందరూ నీ ప్రేమ సంతానం. వీరందరూ గమ్యాన్ని చేరేలా చేయవలసిన బాధ్యతా నీ మీదే ఉంది" అన్నారు. స్వామీ! అంతటి బాధ్యత నాపై ఉంచితే నేను ఎలా చేయగలను? అన్నదానికి స్వామి సమాధానమిస్తూ "అంటే ఇప్పటి వరకూ చేస్తున్నది నీవేనా? నీ చేత ఇప్పటి వరకూ చేయించినవాడు ఇప్పుడు వదిలివేస్తాడా? నిన్ను అలాగే పట్టుకుంటాడు. వీరందరికీ తీసుకోవలసిన దానికన్నా మిన్నగా తీసుకుని బాధపడటం అలవాటు. వారిని సరైన రీతిలో గ్రహించి, గ్రహించవలసిన దానిని గ్రహించేటట్లు బోధ చేయి. సరైన మోతాదులో తీసుకునేటట్లుగా చేయుట నా డ్యూటీ. నా డ్యూటీ నేను చేస్తాను. నీ డ్యూటీ నీవు చేయి. నీ పనల్లా అవసరమైనపుడు ప్రేమను చూపించి, లాలించి, బుజ్జగించి, ఈ బుజ్జగింపులో అప్పుడప్పుడూ నీకున్న ఆధ్యాత్మిక భావాలను పంచుతూ, పెంచుతూ, నీ ఆలన, పాలనలో ఆడుకునేటట్లుగా చేయి" అన్నారు. తప్పక స్వామి అన్నాను. వీరందరి బాధ్యత నాపై ఉంచారు. మరి నా బాధ్యతా మీపై పెడుతున్నాను స్వామీ అని అన్నదానికి వెంటనే స్వామి "నీది ఏమి ఉన్నది? అది తెలుసుకో. నీకు ఇచ్చినది నలుగురికీ పంచమని అంటున్నాను. పంచటానికి కూడా కష్టమేనా? ఎవరికి అప్పగించిన పని వారు చేయవలసిందే. చేసెడివాడు, చేయించెడివాడు తానే అన్న సత్యాన్ని తెలుసుకోండి. నేనిచ్చిన బోధలను పైపైన చల్లితే అది జ్ఞాన వృక్షంగా మొలకెత్తి విజ్ఞాన ఫలాన్నివ్వదు. నీకు అప్పగించిన ప్రతి పనీ నా పనే. నీ పని

కాదు. జీవితంలో ఇది గుర్తుంచుకోవలసిన విషయము. నీ చేత కట్టిస్తున్న బిల్డింగ్ వద్దకు చాలా సార్లు వెళ్ళాను. మరలా కూడా వెళ్తాను. అది నా పని. నీ పని కాదు. అండర్లైన్ చేసుకో" అన్నారు. ఇది ఉదయం 5:40 ని||కు స్వప్నం అయిపోయినది. అప్పుడు నేను హైదరాబాద్ లో ఉన్నాను. 6 గం||లకు పుట్టపర్తిలో ఆశ్రమం నిర్మించే **వర్కర్స్** వద్ద నుండి ఫోన్ కాల్ వచ్చింది. దాని వృత్తాంతం ఈ విధంగా ఉన్నది. ఆ ముందు రోజు సాయంత్రం 5:30 ని||కు **వర్కర్స్** వద్దకు 80 సం||లు ఉన్న వ్యక్తి తెల్లని బట్టలు వేసుకుని షిర్డీ బాబా వలే జోలీ తగిలించుకుని వచ్చారట. అచట కడుతున్న కట్టడం వైపు చూస్తూ ఈ విధంగా సంభాషించారు. బా - బాబా; వ - వర్కర్

బా. ఏమి చేస్తున్నారప్పా?

వ. కట్టుబడి చేస్తున్నాము

బా. ఏమి కట్టుబడి అప్పా?

వ. ఒక వృద్ధాశ్రమం కట్టిస్తున్నారు

బా. వృద్ధాశ్రమము అంటే ఏమి అప్పా?

వ. పెద్ద వాళ్ళకు సేవ చేయుటకు

బా. పెద్ద వాళ్లకు ఏమి సేవ చేస్తారప్పా?

వ. వారికి తిండి, బట్ట, ప్రేమగా పలుకరించుట. ఇవి అన్నీ చేయుటకు

బా. నేను కూడా ఏమైనా సేవ చేయవచ్చా అప్పా?

వ. మీరు ఏమి చేస్తారు స్వామి ఈ వయస్సులో

బా. చేతనయినది చేస్తాలే. నేను మహారాష్ట్ర నుండి వచ్చాను. నాకు బస్సు ఛార్జీకి డబ్బులు లేవు ఏమైనా ఇవ్వగలరా?

అప్పటికే ఆ పెద్దమనిషి నుండి వస్తున్న ఎనర్జీ తట్టుకొనలేక **వర్కర్స్** అతనికి దగ్గరగా నుల్చోలేకపోయారట. ఇంత పెద్ద కట్టడం అమ్మ వల్ల అయితే అవ్వదు. ఇది కేవలం భగవత్ సంకల్పం వల్లే జరుగుతుంది అన్నది అర్థమవుతున్నది. స్వామి ఈ విధంగా చూడటానికి వచ్చి ఉంటారు అని **వర్కర్స్** ఆలోచనచేసి వెంటనే తమ వద్ద ఉన్న పైసలు సేకరించగా 60

రూపాయలు అయినాయట. ఇంకా ప్రక్కనున్న వ్యక్తులు కొంత ధనం ఇవ్వగా తీసుకుని బయటకు షుమారు పది అడుగులు వేసి మాయమయ్యారట. ఈ విషయము చెప్పగానే వాళ్లతో ఎంత అదృష్టవంతులయ్యా మీరు అని మాత్రమే అనగలిగాను. ఆ అదృష్టానికి వారు చేస్తున్న పనే కారణం అనిపించింది. భగవాన్ సేవకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో మనందరికీ అనేక సార్లు స్వామి చెప్పిన బోధల వల్ల సుపరిచితమే. "నా జీవితమే నా సందేశం" అని చెప్పే స్వామి బాల్యం నుండి ఎన్నో సేవలు తాము చేసి, బిడ్డలమైన మన అందరిచేత చేయిస్తూ జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తున్నారు. భగవాన్ బాబా అంటూ ఉంటారు. "నేను నాయకుడ్ని కాను. సేవకుడను. సేవ కొరకే నేను జన్మించాను." ఈ మాటలు నిజం చేస్తూ కేవలం తన రూప నామాలు భజించి, స్తుచించే వారినే కాకుండా సర్వలోకాలలోని జీవులను ఉద్ధరించే నిమిత్తమై సేవనే మార్గంగా ఎన్నుకుని సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను ఆయుధాలుగా స్వీకరించి జగత్తును ఉద్ధరించే నిమిత్తమై భువిపైకి ఏతెంచారు. అలాంటి భగవాన్ తన బిడ్డలపై పెట్టిన ఈ కార్యక్రమాన్ని **వీక్షించటానికి** దేహధారియై ఏతెంచి **వీక్షించిన** సంఘటన ఇది. నిర్గుణ, నిరాకారుడైన భగవంతుడు అవతారము ధరించినపుడు సగుణ రూపంలో ప్రత్యక్షమవుతాడు. దైవం యొక్క సగుణరూపము విశ్వకళ్యాణప్రదమైనది. జగదోద్ధారణకు అవతరించిన భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా సదా, సర్వదా విశ్వకళ్యాణ కార్యంలో నిమగ్నులై ఉంటారు. "సకల ఆధ్యాత్మిక ప్రయత్నమూ మీ మీదికి భగవదనుగ్రహాన్ని ఆకర్షించుటే లక్ష్యంగా కలిగి ఉంటుంది. అందువల్లే నీవు గుడికి వెళ్ళి గర్భగుడి ముంది నుల్చుని గంటను కొడ్తావు. ఆ ధ్వని వేడికోలు వైపుకి పరమేశ్వరుడ్ని ఆకర్షిస్తుంది. ఐతే అప్పుడు నీ హృదయంలో నుండి వచ్చే శ్రద్ధతో కూడిన ప్రార్ధన ఉండాలి" అని పలుమార్లు భగవాన్ చెప్పి ఉన్నారు. అలాగే ఈ శ్రద్ధ అనే ప్రార్ధన 'భగవాన్'కు చేరి తమ యొక్క బిడ్డలను ఉద్ధరించటానికి చేసిన ప్రయత్నమే స్వప్నంలో **సాక్షాత్కరించి,** "ఇది నీ పని కాదు నా పని. మీరు పనిముట్లు" అంటూ విశదపరచి స్వయంగా ఒక రూపమును ధరించి ఆ పనిలో నిమగ్నమై ఉన్న జీవులకు దర్శన, స్పర్శన, సంభాషణలు అనుగ్రహించి మమ్ములనందరినీ జీవన్ముక్తులను చేసి సేవా మార్గం ద్వారా మోక్ష తీరాన్ని చేరవచ్చు అంటూ అభయ ప్రదానం చేసి ఆవలిఒడ్డు చేర్చు ఆనందదాయి మన ఆనంద సాయి. అట్టి 'భగవాన్'కు శిరస్సు వంచి శత సహస్ర కోటి పాదాభి వందనములు

సమర్పించుకుంటున్నాను.

అంతరంగమందు అధిష్ఠించిన ఆనందసాయి
అద్భుత ఆనంద డోలికలలో ఊయలలూపి అదృశ్యమాయె అంతలో ఆదిదేవుడు
ఇంతలో కనుపించి అంతలో మాయమయ్యేడి నటన సూత్రధారి నటనతో నర్తింప చేయు
మందగమనముతో మనసు రంజింప చేయు
మదనమోహనుడు మనసున మాయ పొరనుగప్పి
మందస్మిత వదనుడై మనదరి చేరి మానవుడిని మాధవునిగా మార్చె సాయి అనుగ్రహము.

ఈ వృత్తాంతము సేవా సౌధమైన 'శ్రీ సత్యసాయి అనుగ్రహ గృహము'ను (వృద్ధాశ్రమము) మా చేత నిర్మించేటపుడు స్వామి కురిపించిన అనుగ్రహ వర్షము.

## (10)

అనేక మత, తాత్విక, రహస్య అంశాలను తనలోపల ఉంచుకున్న పవిత్రమైన ఓంకారము - ప్రణవము అన్నది అత్యుత్తమ ఉపదేశం. అప్పుడే నడక నేర్చుకుంటున్న శిశువుకు మూడు చక్రాల తోపిడి బండిని ఇస్తే దాని అడ్డ కర్రను పట్టుకుని ముందుకుతోస్తాడు. అలాగే ఆధ్యాత్మిక ప్రపంచంలో ఉన్న శిశువుకు ఓంకారం అలాంటి బండే. ఈ మంత్రంలో ఉన్న అకార, మకార, ఉకారములన్నవి బండికి ఉండే మూడు చక్రాలు. ప్రాణ శ్వాసలో మొట్టమొదటగా ఉన్న ధ్వనే ఓంకారం. మనం శ్వాస పీల్చినప్పుడల్లా సోహం అంటున్నాము. పీలుస్తున్నప్పుడు "సో" వదులుతున్నప్పుడు "హం". అంటే అతడే నేను. ఈ బహిర్ప్రపంచమైన ఆయన (భగవంతుడు), అంతర్ ప్రపంచము నేను. వీటి రెండిటి ఏకత్వాన్ని తెలుపుతున్నది. వేదములలో ప్రణవము అయిన పరమాత్మను తెలుసుకోవటానికి శబ్దోపాసన ముఖ్యమైన సాధన. నీ ఇంటి వెనుక మొలక పెట్టగానే ఏ చెట్టూ పండునివ్వదు. ఉచ్ఛస్థితిని చేరుకోవాలంటే నువ్వు జాగ్రత్తగా ఎడతెగని ప్రయత్నము చెయ్యాలి. పట్టుదల, ప్రయత్నమూ లేకుండా ఫలాన్ని పొందలేరు. సాధకులు దీన్ని నిరంతరం తెలుసుకుని ఉండాలి. 'ఎట్లా పుట్టాలి?' అన్న

దాని నుండి 'ఎట్లా మరణించాలి?' అన్న దాని వైపుకు మన యొక్క కోరిక మళ్లించాలి. ఎట్లాంటి మరణమో అన్న దాని మీద వచ్చే జన్మ ఆధారపడ్తుంది. ముందు మరణం వస్తుంది తరువాతే జన్మ కల్గుతుంది. చావడం కోసమే పుడతారని, పుట్టడం కోసమే చనిపోతారని తెలియని వారు నమ్ముతారు. ఇది తప్పు. నీవు పుట్టేది మళ్ళీ పుట్టకుండా ఉండుటకొరకే. అంటే మరణించేవాడు మళ్ళీ జన్మించకుండా ఉండేటట్లుగా మరణించాలి. నీవు ఒకసారి మరణిస్తే మళ్ళీ మృత్యువు కలిగేటట్లుగా తిరిగి జన్మించనేవద్దు. నీవు జన్మను ఎత్తితే మరణం తప్పదు. కాబట్టి జన్మను తప్పించుకోవాలి. మరణాన్ని తప్పించుకోవాలి. బ్రహ్మము తనలో నుండి వచ్చిన మాయతో కూడుకొనడానికి ప్రణవ శబ్దం లేక ఓంకారము అన్నది తొలి కదలిక వల్ల కల్గిన ధ్వని. అన్ని మంత్రాలలోకి ప్రణవము చాలా గొప్పది, శ్రేష్టమైనది. నిన్ను మృత్యువు, దుఃఖము, బాధ అన్నవాటి చేత పురుగుపట్టిన లౌకిక జీవితపు చిక్కులలో చిక్కుకొనకుండా మంత్రం అనునది నిన్ను **సంరక్షిస్తుంది**. ఆ మంత్రమే భగవంతుని గుర్తించి నిన్ను నీవు తెలుసుకునేటట్లుగా సహాయసహకారాలు అందిస్తుంది.

యుక్తం కర్మఫలం త్యక్త్వా శాంతి మాప్నోతి నైష్టికీం
ఆయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే

దీని భావార్ధమేమనగా నిష్కామకర్మయోగి అయిన నాడు కర్మఫలమును భగవంతునికి అర్పించి భగవత్ ప్రాప్తి రూపమైన పరమశాంతిని పొందుతారు. యోగయుక్తుడు కానివాడు కోరిక అనే యోగంతో ఫలమునందు ఆసక్తి కలవాడై పాపపుణ్యాలతో బద్ధుడవుతాడు. ఇలా ఉండిననూ, కర్మ ఫలం భగవంతునికి అర్పించుట చేత సంపాదించే పుణ్యము యొక్క ఫలము దైవం ఆ వ్యక్తికి ప్రసాదిస్తాడు. ఈ సందర్భంగా స్వామి ఒక ఉదాహరణ చెబుతూ ఉంటారు. స్వామి అమృతానంద గారు స్వామిని కలుసుకున్నప్పుడు వారి వయస్సు 85 సమత్సరములు. వారిని చూడగానే స్వామి "రా అమృతం!" అని అన్నారు. అమృతానంద గారి గురువుగారైన శ్రీ రమణమహర్షి మాత్రమే అలా ప్రేమగా పిలిచేవారు. బాబా వారు అమృతానంద గారిని ఆశీర్వదించడమే కాకుండా వారు ఏడు సంవత్సరాల బాలుడిగా ఉన్నప్పుడు పాల్గొన్న గణేష్ యాగం గురించి కూడా అడిగినారు. అప్పుడు అమృతానంద గారు 'అప్పుడు నా వయస్సు

ఏడేళ్ళు నాకు దాని ఫలం ఎలా లభిస్తుంది?' అని అడిగినారు. అప్పుడు అమృతానంద గారికి స్వామి రూపం బదులు తేజోవంతమైన గణేషుని రూపం దర్శనమైంది. స్వామి చూపించిన ఈ అద్భుతం అమృతానంద గారి పుణ్యఫలము వలననే అంతేకాక అమృతానంద గారికి యోగ క్రియలో జరిగిన పొరపాటు వలన వచ్చిన ఆస్తమా బాధను కూడా స్వామి నివారించారు. ఈ విశ్వమందు ఎక్కడెక్కడైతే సద్భావాలు కలవారు, సత్ప్రవర్తన కలవారు, మనస్ఫూర్తిగా మంచి పనులు చేయ ప్రయత్నించేవారు ఉన్నారో వారి కోరికలు స్వామి తీరుస్తూ ఉంటారు. ఆ వ్యక్తికి స్వామి రూప, నామాలు తెలిసినవారైనా, తెలియనివారైనా సరే.

'గుజరాత్'లోని 'సూరత్'లో అంబికా భవన్ యొక్క 'భారతీమయ్యా'ని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భారతీమయ్యా బాల్యం నుండే కృష్ణ భక్తిలో లీనమైన వ్యక్తి. వరుసగా పది సంవత్సరాలు కృష్ణ భక్తిలో జీవితం సార్థకం చేసుకున్న పిమ్మట శ్రీకృష్ణుడు ప్రసన్నుడై దర్శనమిచ్చి "నీవు శక్తిని ఉపాసించు" అని చెప్పాడు. మరలా పది సంవత్సరములు ఉపాసన చేసిన ఫలితంగా అంబ ఆమె ఎదుట **సాక్షాత్కరించింది**. ఆ దేవి తన మందిర నిర్మాణం కావించమని ఆమెకి ఆదేశించింది. ఆ కార్య నిమిత్తమై ఆమె ప్రతి వ్యక్తి దగ్గర కేవలం ఒక రూపాయి మాత్రమే తీసుకుని మందిర నిర్మాణం కావించి అందులో దేవి విగ్రహాన్ని ప్రతిష్టించింది. ఇది అంతా దేవి యొక్క ఆదేశానుసారంగా చేసారు. అలాగే జగన్మాత సూచించినట్లుగా మందిరానికి అనుబంధంగా గోశాల, 50 మంది విద్యార్థుల కొరకు వేదపాఠశాల, కొన్ని చోట్ల ఆసుపత్రులు, వృద్ధులైన రోగుల కొరకు ఆశ్రమాలు కట్టించారు. ఆ సమయంలోనే ఒక అద్భుత సంఘటన జరిగింది. అదేమిటంటే సమీపంలోనే ఉండే ఒక స్వామి భక్తుని ఇంట్లో గోడ మీద విభూతితో ఏర్పడ్డ అక్షరాల ద్వారా ఒక సందేశాన్ని స్వామి ఇచ్చారు. "భారతీమయ్యా నీ జీవిత గాథ తెలుసుకో" అన్నది చూచి ఆమె మొదట నమ్మలేదు. కానీ గోడలో నుండి ఆగకుండా వస్తున్న విభూతిని చూచిన తర్వాత మాత్రమే ఆమె స్వామికి శిరస్సు వంచి వందనం చేసారు. స్వామివారి ఫోటో ఒకటి తమ పూజామందిరంలో పెట్టుకున్నారు. కొద్ది రోజులలోనే ఆమె గమనించినది ఏమిటంటే పూజ అయిన తర్వాత సమర్పించే నైవేద్యంలో కొంత తగ్గుతున్నది. స్వామి నైవేద్యం స్వీకరిస్తున్నారన్నదానికి అది ఋజువు. ఒక రోజు వారి వేదపాఠశాలలోని విద్యార్థులు స్వామి దర్శనానికి వెడదాము అనే కోరిక వెలిబుచ్చారు. ఆ ప్రకారంగానే అందరూ ప్రశాంతి నిలయానికి

చేరుకున్నారు. స్వామి వారి వేదపఠనం ఆలకించారు. వారిని ప్రశంశించి వారికి బట్టలు కుట్టించి ఇచ్చారు. తర్వాత భారతీమయ్యాకి స్వామిలో తన ఇష్టమైన అంబ దర్శనము జరిగింది. అప్పుడు పూర్తి శరణాగతురాలైన భారతీమయ్యా స్వామి ఎదుట తమ మనసులోని కోరిక తెలియబరిచారు. అది ఏమిటంటే సూరత్ లో **జైన్** సమాజంవారు ఒక పెద్ద హాస్పిటల్ కట్టే ప్రయత్నంలో ఉన్నారు. దాని కొరకు అత్యాధునికమైన డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మించాలని కోరిక మనస్సులో ఉంది. దానిని స్వామికి తెలియపరిచినారు. అది విన్న స్వామి ఆమెకు U.K మరుయు U.S.A పర్యటించి రమ్మని చెప్పారు. స్వామి ఆదేశానుసారం U.K మరుయు U.S.A వెడితే కేవలం రెండు వారాలలోపే అనేక మంది సాయి భక్తుల నుండి భారతీమయ్యాకి అవసరమైనంత ధనసహాయం లభించింది. దాని వలన ఆమె చిరకాల వాంఛ నెరవేరింది. ఇది జరగటానికి కారణం భక్తుల శుభప్రదమైన కోరికలు తీర్చే భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి బాబా ఆశీర్వాదం వలననే అనేది అందరికీ అర్థమయ్యే విషయమే. అలాగే స్వామిచే సంకల్పించబడి అమోఘమైన ఆశీస్సులలతో ప్రారంభించబడిన వృద్ధాశ్రమము "శ్రీ సత్యసాయి అనుగ్రహ గృహము". ఆ గృహములోని జీవులపైన అపారమైన ప్రేమ అనుగ్రహవర్షాన్ని కురిపిస్తూ ఆధ్యాత్మిక జీవనానికి సహాయము అందిస్తున్నారు స్వామి. దీనిలో భాగంగా 18.11.2011న స్వామి ఆశ్రమ నిర్వహణ కొరకై ఒక ఆవును కొనేలా చేసారు. ఆవును తీసుకున్నరోజు స్వామి దర్శనమిచ్చి ఆ స్వప్నంలో ఆవు, దూడలకు నామకరణం చేసారు. అలనాటి శ్రీకృష్ణుడు నేటి సాయికృష్ణుడై ఏతెంచి గోవుల చేరదీసి గోపాలుడైనాడు. స్వప్నంలో ఆవు, దూడను చూపించి "ప్రతి జీవికి అవసరమయ్యే **క్షీరాన్ని** అందించగల తల్లి ఇది. ప్రతి తల్లి కేవలం తన బిడ్డకు మాత్రమే **క్షీరాన్ని** ఇచ్చి పెంచుతుంది. గోవు తన బిడ్డ కొరకే కాదు సమస్త సృష్టిని తన బిడ్డలుగా భావించి సమస్తలోకం కొరకు తాను **క్షీరాన్ని** ఇచ్చి కడుపు నింపుతుంది. ఎంత సమత్వ భావమో గమనించండి. అలాగే జీవులందరూ కూడా సృష్టికి ఉపయోగపడగల్గి ఉండాలి. పాలు స్వచ్ఛతకు గుర్తు. తాను గడ్డి తిని స్వచ్ఛమైన పాలను అందించి ప్రతి జీవి **క్షీరాన్ని** గ్రోలి శుద్ధసాత్విక భావాలు ఉత్పన్నమయ్యేలా గోమాత ఆశీర్వదిస్తుంది" అన్నారు. పాల మీద నురుగును చూపించి సృష్టి అంతా జీవుల భావాలతో మేఘాలై విస్తరించి ఉన్నాయి. దానిలో నుండే శబ్ద ఆవిష్కరణ జరిగింది. ఈ శబ్దానికి మూలాధారం ఓంకారమే అంటూ పాలపైన ఏర్పడ్డ

నురుగులతో విశ్వమంతా నిండిన ఓంకారాన్ని చూపించి "నీ వద్దకు వచ్చిన గోమాతకు, దాని బిడ్డకు చక్కని నామం పెడితే బాగుండు కదా" అన్నారు. ఔను స్వామి! ఏమి పేరు అని అడిగినాను. "తల్లి పేరు 'సింధుజ' బిడ్డ పేరు 'బ్రాహ్మణి'. ఈ పేర్లకు అర్థము తెలుసునా?" అని అడిగారు. తెలియదు స్వామి అని నేను చెప్పిన దానికి 'సింధుజ' అనగా 'సింధు' అంటే సముద్రము. 'జ' అంటే జన్మించడము. అనగా సముద్రగర్భం నుండి జన్మించినది కామధేనువు కనుక దాని పేరు 'సింధుజ' అన్నారు. 'బ్రాహ్మణి' అనగా 'సింధు' నది యొక్క ఉపనది 'బ్రాహ్మణి' నది. కావున 'సింధుజ' గర్భము నుండి జన్మను తీసుకున్నది కావున దీని పేరు 'బ్రాహ్మణి'" అని చెప్పారు. తర్వాత మేఘాలను చూపిస్తూ "అవి ఎంత అందంగా ఉన్నాయో చూశావా?" అన్నారు. ఔను స్వామీ! చాలా అందంగా అద్భుతంగా కూడా ఉన్నాయి. మధ్య మధ్య ఆ నీలి రంగు మబ్బులు చాలా బాగున్నాయి స్వామి. అవును "కృష్ణతత్వం గుర్తురావటం లేదా?" అన్నారు. "శ్రీకృష్ణుడు తన పరివారంతో అనగా గోవులతో సయ్యాటలాడుచూ క్రీడించు క్రీడా స్థలంగా తెల్లని, నల్లని మబ్బులు అన్పించుట లేదా?" అన్నారు. అవును స్వామి. ఎప్పుడూ ఆ దృష్టితో చూడలేదు అని అనగా అవును "మీ యొక్క దృష్టిని బట్టే సృష్టి ఉంటుంది." 'సింధుజ' వద్దకు వెళ్ళి పెద్ద పాత్ర అచట ఉంచి పాలు పితుకుట ఆరంభించారు. ఆ పాలపైన నురుగ చూపిస్తూ "విశ్వాన్ని తనలో ఇముడ్చుకున్నది అంటూ ఈ నురుగు గగనమండలాన్ని **<u>వీక్షింపచేస్తుంది</u>**. సకల దేవతలకు నివాసమైన ఈ గగన మండలం తన యొక్క **<u>క్షీరంలో</u>** దర్శింపచేస్తుంది. శుద్ధ సాత్వికస్థితే **<u>క్షీరం</u>**. ఈ శుద్ధ సాత్వికస్థితే భగవంతునికి నివాస యోగ్యం. దానిలో నుండే ఓంకార ధ్వని వినిపిస్తుంది చూడు" అంటూ పాలు పితికినప్పుడు ఓంకార శబ్దము వినిపించింది. ఇలా స్వామి ఓంకార శబ్దాన్ని, గోమాత గురించి విశదీకరించిన ఈ స్వప్నము **<u>సాక్షాత్తు</u>** భగవాన్ చూపించిన స్వప్న **<u>సాక్షాత్కార</u>** దర్శనం.

పుణ్యమనునది పూజ చేసిన దొరకదు
పునః పరిశీలన కావించుకున్న లభ్యమవును
పూజ్య సంస్కారమున్నచో పుణ్యగతి పుణ్యలోకమునకు దారి చూపును
విశాల హృదయ శ్రీ సత్యసాయి శిరసా ప్రణమామ్యహం

## (11)

స్వామి అంటూ ఉంటారు "నా ఆనందం కోసం నేను ఈ విశ్వ నిర్మాణం కావించాను. అందులో పర్వతాలు, నదులు, నేల, నింగి, మహా సాగరాలు, సముద్రాలు సృష్టించబడినాయి. సూర్యుడు, చంద్రుడు, ఎడారులు నిర్మించబడ్డవి. ఆపైన ప్రాణుల ఉత్పత్తి జరిగింది. అందులో ప్రధమ స్థానం మానవునికి ఇవ్వబడినది. ఈ మానవుని మనస్సులో నా యొక్క జ్ఞానం ఇవ్వబడింది. భగవంతుని యొక్క జ్ఞానము మనస్సులో ఉండుటచేత మానవుడు ఆ క్షణము నుండే భగవంతుని కీర్తించడం ప్రారంభించాడు. దైవాన్ని స్తుతించి ప్రసన్నం చేసుకోవచ్చునని అతనికి తెలిసి వచ్చినది. 'దేవానాం ప్రియ స్తుతి' అనే మాటను అనుసరించి ఆ క్షణము నుండి భగవంతుని అఖండ స్తుతి ఆరంభమైనది. దైవ మహిమ ఎచట కీర్తించబడుతుందో అచట దైవం ముమ్మాటికీ ఉంటాడనేది నిర్వివాదాంశం." ఒకసారి స్వామి భక్తులైన ఒక దంపతులు 'మనము అన్ని చోట్లకు భజనకు వెళ్తున్నాము కదా? మరి మన ఇంటిలోనే భజన పెట్టుకుంటే బాగుండు కదా' అన్న ఆలోచన వచ్చి ఒక సెలవుదినం భజన ఏర్పాటు చేసుకున్నారు. ఆ భజనలో స్వామి నుంచుని ఉన్న ఫోటో పెట్టారు. పూలమాలతో అలంకరించారు. భజన మధ్యలో పూలమాల ఊగటం ప్రారంభమైనది. ఆ భజనలో కూర్చున్న ఒక పాప జనం మధ్యలో నుండి అదిగో స్వామి వచ్చారు అంటూ పెద్దగా అరవసాగింది. ఎక్కడ ఉన్నారు అని అడుగగా 'అదిగో అక్కడే నిలబడి ఉన్నారు' అని చెప్పింది. ఆ పాప చెప్పిన సమయంలో స్వామి అచట నిలబడి ఉన్నారు. అందుకే దండ అంత ఊగింది. స్వామి వెళ్ళిన తరువాత దండ ఊగలేదు. అనగా నామస్మరణ అంటే భగవంతుని పిలవటం. ఆ పిలుపు ఆయనకు వినిపించే వరకూ పిలవాలి. ఆ పిలుపు హృదయం నుండి రావాలి. అందుకే నారదుడు చెప్పాడు 'దైవ నామం యొక్క అఖండ చింతన చేసినచో భక్తి యొక్క అఖండ ప్రవాహము ఉద్భవిస్తుంది. అది సంపూర్ణంగా పరమోన్నతమైన భక్తితో నిండి పొంగిపొర్లుతూ ఉంటుంది. దాని వలన భక్తుడు దేహభావం విడిచి దైవప్రేమలో పూర్తిగా మునిగిపోతాడు.' దీనికి స్వామి ఇచ్చిన ఈ స్వప్న వృత్తాంతమే <u>సాక్షి</u>.

కైలాస శిఖర దర్శనానికి చాలా మందిమి బయలుదేరినాము. అచట దాకా చేరిన మమ్ములను ఒక వ్యక్తి అచట ఆపి మీ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసి ఇచ్చట ఉంచి మీరు దర్శనం చేసుకురండి. మీరు వచ్చేలోపు ఈ బంగారం రెండింతలు అవుతుంది అని చెప్పగా తమ దగ్గర ఉన్న బంగారం తీసి అచట పెట్టి 'స్టాంప్' ముద్ర వేయించుకుంటున్నారు. చివర్లో ఉన్న నన్ను చూచి ఏదీ మీ బంగారం? దానిని కూడా ఇవ్వండి అని అడిగినారు. నా వద్ద బంగారం లేదు అయినా నాకు బంగారం వద్దు. నాకు ఇచ్చిన ఈ జన్మయే బంగారం. ఈ బంగారంపై 'స్టాంప్' వేయించుకోవాలి. ఈ బంగారంపై 'స్టాంప్' వేయగల్గినవాడు ఒక్క భగవంతుడే. ఆ 'స్టాంప్' కోసం ఎదురుచూస్తున్నాను అన్న నా సమాధానం విని నీవు పిచ్చిదానివా? అని అడిగినారు. అవును. అందరూ పిచ్చి వారే. పిచ్చి లేని వారు ఎవరు? వీరు కావాలని కోరుకునే పిచ్చి వారు. నేను వద్దని కోరుకునే పిచ్చిదానను అన్న నా సమాధానం చెప్పి మెట్ల ద్వారా గుడిలోనికి వెళ్ళాను. అచట ఒక అమ్మవారు దేదీప్యమానమైన వెలుగులను విరజిమ్ముతూ కూర్చుని ఉన్నారు. ఆవిడ చేతిలో ఒక పెద్ద గరిట ఉన్నది. ఆ గరిటతో వచ్చిన వారందరికీ వారు తెచ్చుకున్న పాత్రలో పదార్థాన్ని వడ్డిస్తున్నారు. నన్ను చూచి "నీ పాత్ర ఏది" అని అడిగినారు. అమ్మా! నీవు నాకు ఇచ్చిన పాత్ర ఇదే. ఈ పాత్రలో ఎంత పెట్టాలో, ఏది పెట్టాలో పెట్టండి అని నేను అన్నదానికి "సరే పట్టు" అంటూ ఈ దేహమనే పాత్రలో పదార్థాన్ని వడ్డించడము మొదలుపెట్టారు. అంతలో ఎచట నుండి వచ్చారో స్వామి వచ్చి "నీ బిడ్డకు కడుపు నొప్పి వస్తుంది." అది అరిగిన తరువాత పెడుదువుగానీ అన్నారు. స్వామీ! మీకేమి తెలుసు బిడ్డ ఆకలి తల్లికే తెలుస్తుంది. ఈ బిడ్డ ఆకలి తీర్చటానికి తల్లిగా వచ్చి జ్ఞాన భిక్షను ఒసంగి దేహమనే ఈ పాత్రను శుద్ధినొందించుకొనుటకు సహాయము అందిస్తున్నాను అని చెప్పి అమ్మ వెళ్ళి స్వామిలో లీనమైన కొద్ది క్షణములకు మెళకువ వచ్చింది. ఈ స్వప్నాన్ని <u>**వీక్షించిన**</u> నేత్రాలు, మనస్సు వేరొక దానిని చూచుటకు అంగీకరించుట లేదు. ఈ లోకంలో ఉన్నదంతా జీరోనే అని గ్రహించుట మొదలైన మానవుడు ద్రవపదార్థము వలే మారి తల్లి పాదాల చెంత తన తనువును ప్రవహింపచేయక తప్పదు. కీలకమైన నీ నిజస్థితిని నీవు తెలుసుకొను ప్రయత్నము కొరకై ఒక్క అడుగు ముందుకు వేసిన చాలును. ఈ సృష్టికి మూలకారణమైన అమ్మ లాస్యదరహాస చంద్రికలను చిందిస్తూ సర్వాంగ సుందరంగా సర్వాలంకార శోభితయై

నీజవితానికి ప్రతి అడుగూ చేయూతనిస్తూ నిన్ను ఉచ్ఛస్థితికి తీసుకువెళ్తుంది. మానస **క్షేత్రాన్ని** ఊయలలూగించు అమ్మ ఒడి ప్రతి ఒక్కరికీ కావాలి. జ్ఞాన **క్షీరాన్ని** ఒసగే ఆ తల్లి చనుబాలు ఈ బిడ్డల చంచలమైన ఆలోచనా తరంగాలను అరికట్టకలదు. అజ్ఞాన అంధకారములను తన జ్ఞానాగ్నిచే భస్మీపటలము చేయగలదు. కావున అటువంటి దృష్టిని సారించి ఈ బిడ్డల జ్ఞాన దృష్టిని పెంచి సహస్రారముద్వారా జ్ఞాన **క్షీరాన్ని** ఇచ్చి దేహాన్ని కాంతులీనువరకూ మా నిజస్థితి తెలియచేయువరకూ విడవకుండా అంతర్వాహినివై ఉండు తల్లీ అని మనసు ఆక్రోశించడము మొదలయినది. తీపికన్నా తీయనిది ఏదయినా ఉందా? మంగళకరమైన దాని కన్నా మంగళకరమైనది ఉన్నదా? పవిత్రం కన్నా పవిత్రమయినది ఉన్నదా? ఉంటే అది భగవన్నామమే. భగవంతుడే. ఎన్నో మార్లు స్వామి చెప్పిన మాట గుర్తుకు వస్తుంది. "మీకు నేను ఇచ్చిన హృదయం తప్ప మీ వద్ద నుండి నేను ఏ కానుక ఏ విలువైన వస్తువు కానీ నాకు అవసరము లేదు. నేను ఇచ్చినప్పుడు ఉన్నంత నిర్మలంగా ప్రేమామృతాన్ని నింపి ఎట్లా ఇచ్చానో అలాగే ఆ హృదయాన్ని తిరిగి నాకు ఇవ్వండి. నీ విశ్వాసం, నా ప్రేమ కలిసినప్పుడల్లా జబ్బు కుదురుతుంది." అందుకే భగవాన్ అన్న శబ్దానికి దివ్య ప్రకాశాన్ని, జ్ఞానజ్యోతిని, ఆంతరికమైన శాశ్వత ఆత్మప్రకాశాన్ని వెలిగించగలవాడని అర్థం. సర్వశక్తివంతుడు, సర్వజ్ఞుడు అయిన అలాంటివారి ప్రేమను పొందడంకంటే ఘనమైనది ఇంక ఏమున్నది? ఈ భూమి మీద కానీ దాని అవతల కానీ, దివ్య ప్రేమతో సమమైనది ఏదీ లేదు. ఆ ప్రేమను పొందటానికి సర్వప్రయత్నాలు చేయడమే మానవుడిగా ఉండటానికి లక్ష్యమూ, అర్ధమూ అన్న మాటలు మనిషిని నిలువెల్లా మార్చివేస్తాయి. ఇంతటి జ్ఞాన నిధిని అందించిన ఈ స్వప్నము స్వప్నమే అంటారా? కాదు ఇది స్వప్నము కాదు. స్వప్న **సాక్షాత్కారమే** అనునది ముమ్మాటికీ నిజం.

యాచించవలసినది యదుకుల భూషణుని కరుణకై
యావత్తు జగత్తు నీ స్వరూపంగా భావించిన
యదు, కుబేర, దిక్పాలురు నీవశమవును అనెను
విశాల హృదయ శ్రీ సత్యసాయి శిరసా ప్రణమామ్యహం

# (12)

భగావాన్ బాబా గురించి వర్ణించడం మానవుని మేధస్సుకు అందనిది. స్వామి ఇలా అన్నారు **"నన్ను తెలుసుకోవటానికి, అంచనా వేయటానికి ప్రయత్నించవద్దు. నేను మీ మేధస్సుకి అందని అతీతమైనవాడిని"**. భగవాన్ బాబా స్వయంగా పవిత్ర మూర్తులు. వారి భక్తులలో కూడా పవిత్రత రావాలని వారు ప్రయత్నిస్తూ ఉంటారు. స్వామి చెప్పినదాని ప్రకారం పవిత్రత ఈ మూడు విధాలుగా ఉండాలి.

i. ఉచ్ఛరణలో పవిత్రత

ii. ఆలోచనలలో పవిత్రత

iii. ఆచరణలో పవిత్రత

ఈ విధమైన మూడు రకాల పవిత్రత కలిగినవారు నా ప్రేమకు పాత్రులవుతారు. ఇటువంటి పవిత్రత సదా నామస్మరణం వల్ల చరాచర సృష్టిలోని ప్రతి ఒక్కరిలోనూ పరమాత్మ రూపాన్ని దర్శించగల్గి, వారికి సేవ చేయడం ద్వారా పొందవచ్చు. భగవంతుని దివ్యరూప దర్శనమనెడిది ఒక అంతర్గత మధుర అనుభూతి. అటువంటి దివ్య దర్శన, స్పర్శన పొందగలిగిన మనం ఎంతో అదృష్టవంతులము. భక్తి మరియు జ్ఞానాన్ని ప్రసాదించే ఆ దివ్య చరణాలకు శతకోటి ప్రణామములు. వేదాలలో భక్తుని మూడు రకాలుగా విభజించారు.

i. భౌతిక భక్తి

ii. ఏకాంత భక్తి

iii. అనన్య భక్తి

ఎవరైనా వ్యక్తి యొక్క ధ్యానము మూర్తిలో నిమగ్నమై ఉంటే అన్నీ అనుభవాలు శరీరము, మనస్సు మరియు బుద్ధి నుండి ఉద్భవిస్తాయి. అవి అశాశ్వితమైనవి. దేహం నశిస్తుంది. అనుభవాలు నశిస్తాయి. అయినా ప్రారంభంలో ఇటువంటి భక్తి అవసరమే. ఈ భక్తి మార్గాన ప్రయాణిస్తుండగా మెల్లమెల్లగా రెండవ సోపానమైన ఏకాంత భక్తికి చేరుకుంటారు. ఏకాంత భక్తి అనగా ఒకే రూపానికి సమర్పించబడిన వారై ఏకాంతంలో ఆ ప్రత్యేకమైన రూపము యొక్క మానసిక దృష్టాంతాలు అనుభవపూర్వకముగా తెలుసుకోవడము. ఏకాంత భక్తి **సూక్ష్మవస్తు**

అయి ఉండి ఇది మనస్సుపై పరిణామము జరిగేలా చేస్తుంది. నియంత్రణ ద్వారా తనను అంతరాత్మగా అనుభూతి కలిగిస్తుంది. ఏకాంత భక్తిలో మనసు కరిగి స్తబ్దుగా ఉండే స్థితికి చేరుకుంటుంది. దైవం సర్వత్రా కలడు అనే భావన కల్గుతుంది. స్వామి అంటారు **"భక్తి అనేదిది నిరంతరముగా, అఖండముగా చేసే సాధన."**

పూర్వం గురుపౌర్ణమి, వైకుంఠ ఏకాదశి రోజున స్వామి భక్తులకు అమృతం ప్రసాదిస్తూ ఉండేవారు. ఆ భక్తులందరినీ క్రమశిక్షణగా వరుసలలో కూర్చుండబెట్టి స్వామి ఆ వరుసల మధ్య తిరుగుతూ తన కరకమలముల నుండి సృజయించబడిన అమృతం అందరికీ అందచేసి అందరినీ కృతార్థులను చేసేవారు. భక్తులకిచ్చిన తర్వాత సేవాదళ్ కార్యకర్తలకు స్వామి అమృతం ప్రసాదించేవారు. అలా ఒకసారి అమృతం పంచిన తర్వాత స్వామి ప్రశాంతి నిలయంలోని మొదటి అంతస్తులోని తమ నివాస స్థానము వైపు బయలుదేరారు. శారదమ్మ (పెద్ద బొట్టమ్మ) అనే భక్తురాలు రెండు అవతారాలను అనుభవించిన ధన్యురాలు. ఆమె స్వామిని ఇలా అడిగినారు 'స్వామీ! నాకు అమృతం దొరకలేదు. నేను ఇచట కూర్చొనవచ్చునా?'. స్వామి అనుమతించిన తర్వాత ఆమె స్వామికి ఎదురుగా కూర్చున్నది. స్వామి తన చేతిలోని వెండి కలశంలోని ఉద్ధరిణతో అమృత బిందువులు ఆమె నోటిలో వేసారు. అప్పుడు శారదమ్మ తన నోటిలో ఒక్క బొట్టు కూడా అమృతం పడలేదు అన్నది. అప్పుడు స్వామి "రెండవ <u>ఛాన్స్"</u> అంటూ ఉద్ధరిణిని కలశంలో మూడుసార్లు త్రిప్పగా కలశం అమృతంతో నిండిపోయింది. తర్వాత ఆమెకిచ్చి మిగితాది విద్యార్థులందరినీ త్రాగమని ఇచ్చారు. శారదమ్మ గారు స్వామిని ఇలా ప్రశ్నించింది. స్వామీ! అమృతపానం చేసిన వారికి అమృతత్వం లభిస్తుంది అంటారు గదా కానీ మీరు అమృతం ప్రసాదించిన తర్వాత కూడా మృతులైన వారిని నేను చాలా మందిని చూచాను. దీని కారణమేమిటి? దానికి స్వామి ఈ విధంగా బదులిచ్చారు. "అమృతతత్వం పొందటానికి నేను మీకు అమృతం ప్రసాదించటం లేదు. జ్ఞానము, ఆరోగ్యము, భక్తి మరియు సద్గుణాలు ప్రాప్తించవలనని అందిస్తున్నాను" అన్నారు. భగవాన్ మనకి భక్తి, జ్ఞానము ప్రసాదిస్తుంటారు. అది పొందే భాగ్యము, అర్హత మనము సంపాదించుకోవాలి. ఇదే స్వామి చరణాలయెడ చేరటానికి చేసే ప్రార్ధన. ఈ ప్రార్ధన ఫలితంగా జరిగిన ఈ సంఘటన స్వామికి తన బిడ్డలయెడ ఎంత ప్రేమయో తెలియపరుస్తుంది. మానససరోవర, కైలాస శిఖర

దర్శనమునకై స్వామి ఆజ్ఞతో బయలుదేరిన మా అందరికీ దివ్యదర్శనాన్ని అనుగ్రహించి మమ్ములను దివ్య స్వరూపులుగా మార్చిన సంఘటన ఇది. 21.6.2012 న రాత్రి 9:55 ని||కు మానససరోవరమును చూచుచుండగనే ఆ సరోవరము మధ్యన నీరు అలలు అలలుగా రావటం మొదలైనది. రెండు సెకండ్ల కాలంలోనే బంగారు వన్నె గలిగి దాదాపు 21 అడుగులు గల ఆజానుబాహువు రెండు చేతులలతో పెద్ద జ్యోతిని ధరించి నీళ్ళల్లోపల నుండి బయటకు వచ్చి గగన మార్గానికి వెడుతూ దర్శనమిచ్చారు. ఆ దృశ్యం చాలా అద్భుతంగా అనిపించింది. వెనుక నుండి స్వామి యొక్క స్వరము వినిపించింది. ఆ దివ్యజ్యోతిని ధరించిన ఆ దివ్యపురుషుడు నా సాన్నిధ్యానికే వస్తున్నాడు. దాని నుండి వచ్చే ఒక్క వెలుగు కిరణాన్ని దర్శించినా చాలు నీలో ఉన్న జ్ఞానాన్ని వెలుగొందేలా చేయుటకు. దీనివలన దివ్య జ్ఞానజ్యోతి వెలుగొంది నా యొక్క దర్శనభాగ్యాన్ని పొందగలవు. మీరు అనుభవించే జీవితమే ఒక పెద్ద సాగరము. ఈ సాగరం లోనికి త్రోయబడ్డ ప్రతి జీవి బయటకు రావటానికి కావలసిన సాధన అనే నామ మంత్రంతో నావ తయారు చేసుకుని దాటటానికి సిద్ధంగా ఉండాలి. ఈ జనన మరణాలనే పెద్ద కొండలు ఎక్కిన పిదప కైలాస శిఖరాన్ని అధిరోహించాలన్న వాంఛ ఉద్భవిస్తుంది. ఈ శిఖరాన్ని అధిరోహించుటకు శారీరక శక్తి కాదు మానసిక **<u>ప్రక్షాళన</u>** జరగాలి. అంటే మానసికమైన ఆరోగ్య శక్తి కావాలి. అనగా నీలోపల ఉన్న అరిషడ్వర్గములను ఆపుచేసి సత్వగుణశోభితులు అయిన తర్వాతనే ఈ కైలాస శిఖర దర్శనం జరుగుతుంది. కొండలు అనేవి బయట ఎక్కడో లేవు. బాహ్యంగా కనిపించే ఈ కొండలు మట్టితో కప్పబడి ఉన్నాయి. అలాగే నీలోపలనే ఆరు కొండలు (అరిషడ్వర్గములు) ఉన్నాయి. ఈ కొండలు మనిషిని నిలువెల్లా వాటి ప్రభావంతో కప్పివేస్తున్నాయి. అనగా అహంకారం , క్రోధం, ఈర్ష ఇత్యాది గుణాలతో కప్పబడి తన యొక్క నిజతత్వాన్ని మర్చిపోయేలా చేస్తున్నాయి. నీ లోపలనే ఉన్న మానవత్వగుణాన్ని నీవు తెలుసుకుని ఈ కొండల్ని ఎప్పుడైతే అధిరోహించగలవో అప్పుడే నీకు నీ నిజదర్శన ప్రాప్తి కల్గుతుంది. అదియే మానసిక **<u>ప్రక్షాళన</u>**. ఈ విధమైన **<u>ప్రక్షాళన</u>** జరిగిన తర్వాత అంతర్ దృష్టి ఏర్పడుతుంది. ఇటువంటి అంతర్ దృష్టి ద్వారా మణిమయమైన సహస్ర కిరణాలతో కూడిన మణిద్వీపం నీ సొంతం అవుతుంది. ఆ తర్వాత సృష్టికర్త హృదయస్థానం, పరమ పవిత్రమైన, పరమ శాశ్వితమైన, అద్భుత లీలా తరంగిణియైన, పరమ ఉత్కృష్టమైన, మహోన్నతమైన

దివ్యస్పర్శతో కూడిన మానసిక **ప్రక్షాళనమైన క్షేత్ర** రాజము మానస సరోవరము ఉద్భవించి తనను తాను మర్చిపోయి సర్వం శుభసంకల్పితమైన మానవ జన్మసార్థక్యతను సాధించుకుని తద్వారా నీలోటి జీవులు ఆ సరోవరంలో ఈదులాడుటకు అవకాశాన్ని కల్పించి సత్సంగ, సదాలోచన, సద్భావన, సత్ భోజనాలతో జీవన్ముక్తిని ప్రసాదించే జీవనది, అమృతనది అయిన ఈ మానస సరోవరం జీవ దేహాల కలయికలో గల వైశిష్ట్యాన్ని తెలియపరుస్తుంది. దీనికి శారీరకంగా అలసిపోనక్కరలేదు. మానసిక **ప్రక్షాళనయే** కైలాస నాధుని దర్శనము. ఈ దర్శనమే విశ్వనాధుని కనుగొనేలా చేసి తద్వారా అలౌకికమైన ఆనంద తరంగాలలో ఓలలాడి అద్భుతమైన, అఖండమైన జ్ఞాననిధి ద్వారా **మోక్షాన్ని** అందుకొనగలవు.

దేహాన్ని నిర్లక్ష్యం చెయ్యడమన్న సాధన చేయాలి. అనగా దీని అర్థమేమిటి? ఇంద్రియాకర్షణలకు విముఖుడు కావటం అన్నమాట. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను అనగా అరిషడ్వర్గాలను జయించడం. క్రోధం మనిషిని ఉన్మత్తుడ్ని చేస్తుంది. తక్కినవన్నీ కూడా అంతే ప్రమాదకరమైనవి. ఇంద్రియాల నుండి విడిపోవాలి. ఎవరైతే ఇంద్రియాలను పరిపూర్ణంగా నిగ్రహించగల్గుతాడో అతడే **మోక్షాన్ని** పొందగలిగే స్థితిలో ఉంటాడు. పూర్ణ ఆనందానికి మోక్షమార్గమే మార్గమనీ నీవు మాటల ద్వారా ఆచరణ ద్వారా చూపాలి. అందువల్ల సర్వావస్థలలోనూ ప్రశాంతత చెదిరిపోకుండా వినమ్రత సచ్చింతనను చూపే బాధ్యత మీ మీదనే ఉన్నదంటూ **మోక్షానికి** మార్గము చూపి రహదారి తప్పిపోకుండా చేయి పట్టి నడిపిస్తూ ఇంతటి జ్ఞాన బోధను కావించి దివ్య దర్శనాలని అనుగ్రహించిన ఈ ఉదంతం మానసిక **క్షేత్రప్రక్షాళనయే** అనునది నిర్వివాదాంశము అనక తప్పదు. మోక్షమనగా శాశ్వతానందము మరియు శాంతి. అట్టి స్థితిని పొందుటే మోక్షము అని చెప్పబడుతుంది. తాత్కాలికమైన ఆనందము, అస్థిరమైన శాంతితో అలసట చెందిన మానవుడు తుట్టతుదకు శాశ్వతానందమునకై, శాశ్వత ప్రశాంతతకై కృషి చేయును. అదే **మోక్షాన్వేషణ**. మానవుడు సత్కర్మాచరణకు కృషి చేయాలి. అదొక్కటే మోక్షమునకు మార్గము. మోక్షము అనెడిది బయట దొరికే వస్తువు కాదు. అది ఒక జీవన విధానం. "మీ అంతరాత్మ ప్రబోధమును అనుసరించి, సద్భావములను పెంపొందించుకున్నప్పుడు మీరు ప్రాపంచిక బంధముల నుండి విముక్తులై మోక్షమును పొందగలరు" అంటూ **మోక్షాన్ని** గురించి భగవాన్ శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి

బాబా వారు చెప్పిన మాటలను ఈ సందర్భంలో గుర్తుచేసుకోవటం సమంజసమని భావిస్తున్నాను. ఇంతటి ఉన్నతమైన పధమును చూపిన భగవాన్ కు అనేక కోటి ప్రణామాలు అర్పిస్తూ దివ్య దర్శనాన్ని అందించి ఈ జీవిని జీవన్ముక్తుడ్ని చేయుటకు కదిలి వచ్చిన కరుణాంతరంగునికి హృదయపూర్వక వందనాలు.

కన్నుల ముందు కన్పించునది అశాశ్వితమని తెలుసుకుని
కల్మషములేని కరుణ గల్గిన మనస్సును సాధించి
కఠినత్వ భావనలు దూరము చేసిన కరుణాంతరంగడు ప్రత్యక్షమవుననెను
విశాల హృదయ శ్రీ సత్యసాయి శిరసా ప్రణమామ్యహం

## (13)

అన్ని ఆపదలను తొలగించు సాయికి శతకోటి నమస్కారములు. భక్తులకు ఆపద వాటిల్లినప్పుడల్లా దాని నివారణ కొరకు భగవంతుడు రావలసి వస్తుంది. భక్తుడెక్కడయినా ఉండనీ భగవంతుని దృష్టి వాళ్ళపై ఉంటుంది. స్వకర్మ వలన సంభవించే కష్టాలను ఎదుర్కొనే శక్తిని కూడా భగవంతుడే ప్రసాదిస్తాడు. ఆపదల సుడిగండాల నుండి భక్తుల జీవిత నౌకను **క్షేమంగా** తీరం చేర్చే భారం దైవమే వహిస్తాడు. అంతే కాదు ఏ వ్యక్తికైనా మంచి ఆరోగ్యం లభించడమంటే కేవలం శారీరకమైన ఆరోగ్యమే కాదు. ఎవరి దేహము మరియు మనస్సు దృఢంగా ఉన్నదో వారినే సంపూర్ణ ఆరోగ్యవంతులని అంటారు. ఈ రెండిటిలో ఏదైనా ఒక్కటి దెబ్బతింటే ఆ వ్యక్తి రోగి క్రింద లెఖ్ఖ. భగవాన్ బాబా తన భక్తుల యొక్క మనస్సు, దేహము దృఢంగా ఉండాలని సదా జాగ్రత్త వహిస్తూ ఉంటారు.

"నా సహాయం కొరకు ప్రార్థించే వ్యక్తి అతడెవరైనా కానీ ఇంటిలో ఉండనీ, ఆసుపత్రిలో ఉండనీ ఏ భాషలోనైనా ప్రార్థించనీ అంతా నావారే. నా ఉనికి కేవలం ప్రశాంతి నిలయం వరకే పరిమితమైనది కాదు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ వ్యక్తి అయినా నిర్మల అంతరంగంతో ప్రశాంతత కొరకు నన్ను ప్రార్థిస్తారో వారిని కాపాడి తీరుతాను. వారు ఉండే స్థానము ప్రశాంతి

నిలయమే అవుతుంది" అని స్వామి చెబుతుంటారు. దీనికి ఒక చక్కని ఉదాహరణ. దీనిని ఋజువు చేసే సంఘటన ఇది. కెనడాలోని ఒక భారతీయ కుటుంబంలో జరిగింది. ఈ కుటుంబం కెనడాలో స్థిరపడదామని వెళ్ళగా ప్రారంభంలో నిలదొక్కుకునే ప్రయత్నంలో ఇల్లు, ఉద్యోగం, పిల్లల చదువు వీటన్నింటితో సతమతమవుతూ స్థిరపడే వేళలో ఆ ఇంటి ఇల్లాలి ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆమె శరీరంలో గడ్డలేర్పడినవి అని తెలిసింది. ఆపరేషన్ చేయించుకునే మానసిక స్థైర్యం అప్పుడు ఆమెలో లేదు. అదీకాక దానికయ్యే ఖర్చు, కొత్త ఉద్యోగం అవటం వలన సెలవు సమస్య. ఈ కష్టాలు కొండలాగా ఎదురు నిలిచాయి. ఆవిడకి ఎప్పుడూ కనుల ముందు తన పిల్లల లేతమోహాలు కదలాడేవి. తనకేమైనా జరిగితే వారి గతి ఏమిటి అనే చింత ఆమెను పీడిస్తుండేది. కొన్ని సంవత్సరముల నుండి షిరిడీ సాయిని భక్తిగా సేవించే ఆవిడకు సాయిబాబా అవతారమైన స్వామి గురించి అంతక్రితమే తెలిసింది. కానీ కొన్ని రోజుల నుండే ఆమె మనస్సులో స్వామి యెడల నమ్మకము ఏర్పడి భక్తి శ్రద్ధలు బలపడసాగాయి. అంతలోనే ఆరోగ్య సమస్య. వైద్యం చేయిస్తున్నా గుణం కనబడలేదు. ప్రతి రోజు స్వామిని ప్రార్థించడము మొదలైంది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఆశ - నిరాశల మధ్య జీవితం కొనసాగుతోంది. మృత్యుభయం నీడలా వెన్నాడుతుంది. అంతలో ఒక రోజు స్వామి ఆవిడకి స్వప్నంలో దర్శనమిచ్చి "నేను నీ రక్తం మారుస్తున్నాను" అని అన్నారు. ఆమెపై దయాదృష్టి ప్రసరింపచేసి ఆశీర్వదించారు. మరుసటి **<u>రోజే</u>** వారి చుట్టమైన భారతదేశంలోని డాక్టర్ ఫోన్ చేసి ఒక మందు పేరు చెప్పి ఆ మందును వాడమన్నారు. ఆ మందు చాలా తక్కువ ఖరీదయినది. ఆ డాక్టర్ సలహా ప్రకారం ఆ మందు వాడటం మొదలుపెట్టింది. చూస్తూ ఉండగానే ఆమె ఆరోగ్యం కుదటపడింది. ఆమె పూర్వపు స్థితికి వచ్చింది. కష్టాలనే కారు మబ్బులు, స్వామి స్వప్నంలో ఇచ్చిన అభయంతో తొలగిపోయాయి. కేవలం ఆమెకే కాకుండా ఇంట్లోని వారందరికీ స్వస్థత చేకూరింది. అందుకే స్వామి మన అందరినీ ఆరోగ్యవంతులుగా తయారుచేసే బాధ్యతను నిర్వహిస్తూ ఉంటారు. కావుననే "ఓం శ్రీ సాయి సర్వ రోగ నివారిణే నమః" అని ప్రార్థిస్తుంటాము.

ఈ జీవిని **<u>రక్షించుటకై</u>** ప్రేమామృత వర్షాన్ని కురిపించుటకు కరుణామయుడై కదిలి వచ్చిన సంఘటన ఇది. కైలాస శిఖర దర్శన ప్రాప్తికై వెళ్ళిన నేను అచట ఉన్న వాతావరణాన్ని తట్టుకోలేక శ్వాస అందక దగ్గర దగ్గర షుమారు 58 గం|| సేపు అపస్మారక స్థితిలో గడిపినాను.

కంటి చూపు లేదు. ఆహారం లేదు. నీరు లేదు. దయనీయ పరిస్థితి. ఆ పరిస్థితిలో భగవాన్ కదలివచ్చి నా తలపైన చాలా పెద్దగా కొట్టారు. ఆ దెబ్బకు తల అంతా వాచిపోయినది. వెంటనే స్వామి ఈ విధంగా చెప్పారు. "నా బిడ్డలు సహజమైన మరణాన్ని పొందాలి. నీకు మరణ సమయము ఆసన్నమైనది. కానీ నీవు ఇలా మరణించడము నాకు ఇష్టం లేదు. ఏది అయితే మీరు దానం చేస్తారో దానినే తిరిగి పొందుతారు. నీవు ఇంకొక జీవికి ప్రాణరక్షణ కల్పించిన సంఘటనే నేను నీకు ప్రాణదానం చేయుటకు అవకాశం కల్పించింది. మీరు నాపై సంపూర్ణ భారం వేసి పూర్తి శరణాగతులై నాపై నమ్మకం కలిగి ఉన్నపుడు మీ యొక్క బాధను నివారించడం నా కర్తవ్యమే కదా" అంటూ ప్రాణభిక్షను ఒసంగి ఆ ప్రాణాలతో సత్క్రియలను చేయిస్తూ సదాలోచనలతో జీవనమార్గాన్ని నిర్దేశిస్తున్న 'భగవాన్'కు అనేక కోటి నమస్కారములు సమర్పించుకున్నా తక్కువే అవుతుంది. ఆధ్యాత్మిక ఉన్నతికి కొలత అనగా దేవుని నిజమైన ప్రేమయే. ఈ ప్రేమ మనకు ప్రత్యక్షంగా దేవుడి నుండే ప్రాప్తిస్తుంది. మంచి వారుగా రూపొందడము, మంచినే చూడగలగటం, మంచినే ఆచరించడము అనే దైవ సందేశం మనం అనుసరిస్తే భగవంతుని నుండి సదా లభించే ప్రేమ వలన మనం లాభం పొందగల్గుతాము. దుర్బలులు, పేద వారు మరియు పీడితులైన వారికి సహాయం చేయగలిగే సందర్భాలు చాలా తటస్థపడుతుంటాయి. వీరందరికీ సహాయపడ్తున్నప్పుడు వారి లోని ప్రతి ఒక్కరిలోను దైవ స్వరూపాన్ని మనం కాంచగల్గినపుడు ఆ పరమాత్మ ప్రేమకి మనం పాత్రులవ్వగలం.

నిస్సారమైన జీవితాన్ని సారవంతంగా మార్చుకొనుటకు
నిన్ను నీవు తెలుసుకుని **<u>నిజక్షేత్రాన్ని</u>** దున్ని సద్గుణాలనే పంటవేయి
నిర్గుణ పరబ్రహ్మ సచ్చిదానంద స్వరూపుడు నిన్నే కోరి వచ్చుననెను
విశాల హృదయ శ్రీ సత్యసాయి శిరసా ప్రణమామ్యహం

వరాహ పురాణంలో గీతామహత్యంను వర్ణిస్తూ ఇలా అన్నారు.

గీతామే పరమవిద్యా బ్రహ్మరూపాన సంశయః

అర్ధమాత్రాక్షరా నిత్య స్వనిర్వాచ్య పదాత్మికా

అనగా గీత అనేది నా (భగవంతుని) పరమ శ్రేష్టమైన బ్రహ్మరూప విద్య. నాశనము లేని అర్ధమాత్ర రూపిణియైయుండి, నిత్యమూ మరియు అనిర్వాచ్య పదాత్మికమైనది. అందులోనే ఇంకా ఇలా ఉంది.

చిదానందేన కృష్ణేన ప్రోక్తో స్వముఖతోర్జున

వేదత్రయీ పరమానందా తత్వార్ధ జ్ఞాన మంజస

అనగా చిదానంద స్వరూపులైన శ్రీకృష్ణ పరమాత్మ స్వయంగా అర్జునికి చెప్పింది అది మూడు వేదాల తత్వజ్ఞానయుక్తమై పరమానంద స్వరూపమైనది. **<u>కురుక్షేత్ర</u>** మైదానంలో ధైర్యం కోల్పోయిన అర్జునికి ఉపదేశమిస్తూ ప్రత్యక్ష దైవమైన శ్రీకృష్ణుడు గీత బోధించారు. మన అదృష్టవశాత్తు "సనాతన సారథి" అయిన సాయికృష్ణుడు మనకి అదే గీతను బోధిస్తున్నారు. సాయికృష్ణుడు మన అంతరంగంలో చేరి సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అనే వాటిని స్థాపించుటకై ఏతెంచినవారే. వారే జీవన రాధసారధియైనారు. స్వామి మాటలలో ప్రతి యొక్క హృదయము **<u>ధర్మక్షేత్రము</u>**, **<u>కురుక్షేత్రము.</u>** అనగా మానవుడు తన గుణముల, కర్మల ద్వారా తనను తాను ఉద్ధరించుకోగల్గిన **<u>క్షేత్రమిది</u>**. దానిని **<u>ధర్మక్షేత్రంగా</u>** చేయగలిగితే తరించగలడు. **<u>అధర్మక్షేత్రం</u>** చేస్తే పతనం వైపుకు అనగా గీతలో మొదటి శ్లోకంలో చెప్పబడినట్లు ఈ **<u>ధర్మక్షేత్రమైన</u>** **<u>కురుక్షేత్రంలో</u>** నా (మామకాః) మరియు పవిత్ర జనుల (పాండవాః, అనగా తెల్లని, శుభ్రవర్ణముగల) ఏం చేస్తున్నారు? నా జనులు అనగా అహంకారము, స్వార్ధము, తమో, రజో గుణములు లేనివారు, శుభ్రవర్ణము గలవారు అంటే సత్వగుణములు కలవారు. ఈ యుద్ధంలో సమస్త ప్రాణులు పాల్గొంటున్నాయి. ఈశ్వరుని కృప వారికి సదా లభిస్తుంటుంది అని గీత బోధిస్తుంది. గీతాసారము మనకు ధర్మాన్ని బోధిస్తుంది. ధర్మమంటే మతము కాదు. మానవునికి నిర్దేశించబడిన కర్తవ్యాలే నిజమైన ధర్మము అని గీతా బోధకుడైన భగవాన్ బాబా మనందరికీ గీతాబోధ చేసారు. అలాగే ఉపనిషత్తులలో ఆత్మ విచారం బాగా కనిపిస్తుంది. నదీ తీరాల్లో రెండు ఆనకట్టలు వేసి నదీ ప్రవాహాన్ని సక్రమం చేసి, వరద నీటిని సముద్రంలో పోయేటట్టుగా చేసినట్లే

ఉపనిషత్తులు ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని క్రమబద్ధీకరించి, నిగ్రహించి పరమాత్మలో జీవుడు లయం అయ్యేటందుకు తోడ్పడుతాయి. "ఏకం సత్, విప్రా బహుధావదంతి". ఉన్నది ఒక్కటే. శాస్త్రాలు చదివిన వారు దానిని అనేక ముఖాలు కలదిగా చెప్పారు. పురుషుని (దేవుని) అభివ్యక్తియే స్త్రీ (ప్రకృతి). బ్రహ్మన్ అంటే బృహ్.....చాలా పెద్దది చాలా విశాలమైనది అని అర్థం. సరస్వతీదేవి శక్తి స్వరూపిణి, వాక్కుకు లేక శబ్దానికి, శబ్ద వ్యక్తీకరణకు ఆవిష్కారానికి దైవం. సర్వమూ బ్రహ్మమయమే. బ్రహ్మ కంటే వేరైన పదార్థము లేదు. సర్వమూ భగవత్ స్వరూపంగా ఉన్నప్పుడు మనము వెదుకుట ఎక్కడ? తాను చిక్కుట ఎక్కడ? విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన వీధి. ఇంక వాకిలి ఎక్కడ? విశ్వమంతా మందిరమే అయినపుడు ఇంక వీధికి స్థానమెక్కడున్నది? వీధి లేనపుడు వీధివాకిలి చింత ఎందుకు? విశ్వవిభుడే హృదయేశ్వరుడు. సూర్యుడున్నచోట చీకటి ఉండదు. అంధకారాన్ని, అజ్ఞానాన్ని దూరం చేసేవాడు సూర్యుడు. సూర్యుని "తమఘ్నాయ నమః, హిమఘ్నాయ నమః, కృతఘ్నాయ నమః" అని ప్రార్థిస్తాము. చీకటిని రూపుమాపే గుణము సూర్యునకు ఉన్నది. తమస్సు లాంటి చీకటిని పారద్రోలే గుణము తెల్లనైన, చల్లనైన, అతి గట్టిదైన మంచును కూడా కరిగిస్తుంది. అంటే అజ్ఞాన అంధకారాలను పారద్రోలి నీలో **<u>నిక్షిప్తమైయున్న</u>** కరుకుదనాన్ని సైతం కరిగించగలవాడు సూర్యభగవానుడు. అట్టి సూర్యభగవానునికి నమస్కరిస్తూ తన లోపలకు తాను ప్రయాణించినట్లైతే పారమార్థికమునందు కానీ, ఆధ్యాత్మికమునందు కానీ, వ్యావహారికమునందు కానీ, నిత్యజీవితమునందు కానీ చిత్తశుద్ధితో మానవుడు గమ్యం చేరగలడు. మానవుని జీవితములో కాలము చాలా అమూల్యమైనది. దానిని సార్థకము కావించుకునే ప్రయత్నము మానవుని కర్తవ్యము. ఈ కర్తవ్యపాలనకై సాధన అనే నిచ్చెన ఎక్కి భగవంతుడ్ని పట్టుకోవాలి. ఈ పట్టు చిక్కుటకు మనస్సు అనే దానిని కదలకుండా ఉండేటట్లుగా చేయాలి. నేల స్థిరంగా లేకపోతే నీవు వేసుకున్న నిచ్చెన నిలవదు. నీవు పడిపోవుట ఖాయం. కావున నీవు నిలబడ్డ నిచ్చెన స్థిరంగా ఉండాలంటే స్థిరమైన ప్రదేశములో నిచ్చెన నిలుపవలసి ఉంటుంది.

ఆధ్యాత్మిక అనుభూతులను పెంచుటకు భగవంతుడు ఇలలోనే కాదు కలలో కూడా ఎంతో దివ్యతరంగాలతో కూడుకున్న కలలను అనుగ్రహించి దాని ద్వారా మానసిక ఉత్తేజమే కాక, దివ్యోన్ముఖుల్ని చేయుటకు సహాయ సహకారాలను అందిస్తారు అన్న దానికి ఈ కలయే

ఒక మంచి ఉదాహరణ. అది వైకుంఠ ఏకాదశి. ముందురోజు నిద్రిస్తున్న నాకు కలలో ఇంటి నిండా చాలా చాలా పెద్ద పాములు తిరుగుతూ కనిపించాయి. అవి నా మీద పారాడుతున్నాయి. అయినా భయమనేది కలుగలేదు. ఇంట్లో పైన ఒక చిన్న గూడు ఉన్నది. దాంట్లో ఒక చిన్న పాము ఉన్నది. అది నన్ను చాలా దీక్షగా చూస్తున్నది. ఇంతలో నాకు ఆకలి అనిపిస్తే లేచి వెళ్ళి ప్లేటులో అన్నం పెట్టుకుని వచ్చి కూర్చున్నాను. వెంటనే ఆ చిన్న పాము త్వరత్వరగా దిగివచ్చి నా వద్ద కూర్చుని ఆకలిగా ఉన్నది నాకు కూడా అన్నం పెట్టు అని అడిగింది. సరే తిను అన్నాను. వెంటనే నేను తెచ్చుకున్న అన్నం అంతా తిని నాకు ఇంకా ఆకలిగా ఉన్నది ఇంకొంచెము ఉంటె పెట్టవా? అని అడిగింది. లోపలకు వెళ్ళి మిగిలిన అన్నం కూడా తెచ్చి పెట్టాను. అది కూడా తిని నాకు ఇంకా ఆకలిగా ఉంది అన్నది. అన్నం ఇక లేదు. వండిన తర్వాత పెడతాను అన్నాను. ఆ చిన్న పాము నీకు చాలా ఆకలిగా ఉన్నదా? మొత్తం నాకే పెట్టావు అని అన్నది. ఫరవాలేదు నేను అన్నం మరలా వండుకుని తినగలను. నీకు వంట చేసుకోవటం రాదు కదా అని మరలా అన్నం వండుటకు వంటగదిలోకి వెళ్తున్నప్పుడు మరి కొంచెం అన్నం నాకు కూడా కావాలి. ఆకలి తీరలేదు అన్నది. ఆ మాటలు విన్న నేను ఇలా అన్నాను నీవు చూస్తే చాలా చిన్నగా ఉన్నావు. ఆహారం ఇంత ఎలా తీసుకుంటావు? అసలు నీవు ఎవరు? ఎందుకు వచ్చావు ఇక్కడికి? అని అడగగా ఏం చెప్పను? నాకు ఆకలి వేస్తుంది. నేనెవరు అని అడుగుతున్నావు కదా. తెలియుటలేదా? పామును అని చెప్పింది. సరే అని చెప్పి మరలా ప్లేటులో అన్నం పెట్టుకుని వచ్చి ఇద్దరమూ తిన్నాము. తర్వాత మరలా ఆ పాము పైకి ఎక్కి గూట్లో కూర్చుని స్వామిని చూస్తూ ఉన్నది. కల అంతమయినది. ఉదయం లేవగానే కాసేపటికి స్వామితో అనుబంధమున్న ఒక వ్యక్తి ఇంటికి వచ్చారు. యాదాలాపంగా రాత్రి వచ్చిన కల గురించి వారితో చెప్పగా వెంటనే వారు ఎంత అద్భుతమైన కల వచ్చిందమ్మా అంటూ అభినందించారు. కానీ దానిలోని అంతరార్థమేమిటి? నాకు అర్థము కాలేదు దాన్ని విడమర్చి చెప్పండి అని అభ్యర్థించాను. వారు ఈ విధంగా చెప్పుట ప్రారంభించారు. ఆ పాము ఎవరనుకున్నావు? ఆదిశేషుడు. సాధారణంగా ఆకలి దప్పికలు అనే భౌతిక అవసరాలు ఏవీ తన దరి చేరవు. ఒక్క వైకుంఠ ఏకాదశి నాడు తన నుండి భగవంతుడు దిగి ఎప్పుడైతే సంచారానికి బయలుదేరుతాడో ఆయనతోపాటే తను కూడా ఆయనతో

తిరుగుతూ ఆయన ఎక్కడ ఉంటే అక్కడే తాను కూడా ఉంటుంది కనుక మీ ఇంటికి వచ్చింది. అనగా స్వామి ఇచటనే ఉన్నారు కదా! అందుకే ఆదిశేషుడు ఇచ్చటకు వచ్చి ఉన్నాడు అని చెప్పగానే ఒడలు తెలియని దివ్యానందాన్ని అనుభవించాను. నిజమే మరి. భగవంతుని స్పర్శ అనుభవిస్తున్న జీవుల స్థితి భౌతికానికి అందనంత ఆనందంలో తేలియాడుతూ తనను తాను మర్చిపోతాడు. అలాగే ఆదిశేషుడు భగవంతుని స్పర్శ కోల్పోయిన ఆ దినం ఆకలి, నిద్ర, దాహం అనే వాటిని అనుభవించింది. ప్రతీక్షణం భగవంతుని మనం అనుభవించగల్గితే బాహ్యబంధాలు అనేవి మనము అనుభవించటానికి గానీ, ఆలోచించుటకు గానీ అవకాశమే ఇవ్వదు. ఆనందమనే నిధి చుట్టూ అహంకారమనే సర్పము సర్వత్రా, నిర్విరామంగా సంచరిస్తూ కాపాడుతుంటుంది. ఎవ్వరూ దాని వద్దకు వెళ్ళలేకపోతున్నారు. ఎవరు ఈ అహంకారమనే సర్పమును నిర్మూలించునో, అట్టి వానికే ఈ ఆనందమనే నిధి లభ్యమవుతుంది. అహంకారం కేవలం అజ్ఞానం చేత ఆవరించబడినది. అహంకారమునకు కారణమేమిటి? ధనమా? బలమా? అధికారమా? స్థానమా? విద్యనా? ఇవేవి కారణం కాదు. ఇవన్నీ అల్పమైన శక్తులు. దేహభ్రాంతియే దీనికి మూలకారణము. ఇవన్నీ ఎంత కాలం? అందుకోసమే శంకరాచార్యుల వారు ఇలా అన్నారు.

మా కురు ధన, జన, యవ్వన గర్వం
హరతి నిమేషాత్కాల సర్వం

ఇవి క్షణములో మార్పు చెందుతాయి. ఇవి అన్నీ అనుభవించిన వ్యక్తులు స్థిరముగా ఎక్కడ ఉన్నారు? గొప్ప గొప్ప పదవులనంతా ఏలి, సిరిసంపదలను అనుభవించి ప్రఖ్యాతి పొందిన సత్యహరిశ్చంద్రుడు, నలమహారాజు, మాంధాత, శ్రీరామచంద్రుడు మున్నగు వ్యక్తులంతా ఎక్కడ ఉన్నారిప్పుడు? నేడు వారెవ్వరునూ లేరు. భారతదేశమునందు ప్రాచీనకాలము నుండి అనేక మంది అనేక రకములైన సాధనలు సల్పి ఇవన్నియు అనిత్యమని లోకానికి చాటుతూ వచ్చారు. అందుకోసమే "అనిత్యం అసుఖం లోకం" అని భగవద్గీత చాటి చెప్పింది. ఏదీ మన వెంటరాదు. వచ్చేవి రెండే. అవి మంచి చెడ్డ. మనము ఏది చేస్తామో అది మాత్రం మన వెంట వస్తుంది. మంచిని చేసి మంచిని పొందాలి. ఏ విత్తనము నాటితే అదే ఫలము మనకు లభిస్తుంది. నిత్యానందము, బ్రహ్మానందము, అద్వైతానందము అనేవి మానవుని స్వరూప, స్వభావములు. బాహ్య, భౌతిక, ప్రాకృత సంబంధమైన విషయవాసనలకు లోబడి ఆ దివ్యమైన, భవ్యమైన,

నవ్యమైన తత్వాన్ని అర్థము చేసుకొనలేకపోతున్నాము. అనుభవించలేక, అన్వేషించలేక బాధపడుతున్నాము. పాత్రలో పాయసముపోసి ఆ పాత్రకు ఎన్ని రంధ్రములు కొట్టినా, ఏ రంధ్రము నుండి వచ్చినా ఆ పాయసమే వస్తుంది. కానీ మరొక చేదు పదార్థము రాదు. ఆత్మ ఆనందమయం. కనుకనే ఋషులు ఆత్మకు ఆనందం అని పేరు పెట్టారు. ఎలాంటి ఆనందం?

నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం - ఏకం నిత్యం విమలం అచలం
సర్వధీ సాక్షిభూతం భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి

ఇవి ఆత్మ స్వరూప స్వభావములకు సరియైన గుర్తులు. ఇట్టి ఆనందము ఏనాడూ దుఃఖము కానీ, కష్టము కానీ, బాధను కానీ, విచారమును కానీ అందివ్వదు. అట్టి పెన్నిధి నీ వద్ద ఉండగా, నీ సన్నిధినే ఉండగా దుఃఖములు, విచారములు, కష్టములు కలిగించే ఈ జగత్తునకై ఎందుకు ఇంత ఆరాటపడుతున్నాము అనేది ఈ స్వప్న రూపములో అందించారు. అశాశ్వితమైన దానిని వదిలి శాశ్విత స్థానాన్ని పొందుటకు మార్గము చూపుటకై భగవంతుడే ఏతెంచిన వైనం ఇది. ఏ క్షణము నీవు భగవంతుని వదులుతావో ఆక్షణమే ప్రాపంచికము నిన్ను ఒడిలోనికి లాగుకుంటుంది అన్న పరమ సత్యాన్ని బోధించిన ఈ స్వప్నము స్వప్నమేనంటారా? కాదు కాదు ముమ్మాటికీ ఇది స్వప్న **<u>సాక్షాత్కారమే</u>**.

రసవత్తరమైన జీవితాన్ని అందుకొనుటకు రసస్వరూపుని మదిలో నిలుపుకుని
రమ్యమైన రసాస్వాదన ద్వారా ఇంద్రియాలను రమింపచేయుచూ
రత్న ఖచితమైన సింహాసనముపై రమ్యగుణాభి రాముని ప్రతిష్టించమనెను
విశాల హృదయ శ్రీ సత్యసాయి శిరసా ప్రణమామ్యహం

# దివ్య సంభాషణలు

**(ఇవి స్వామి నాతో జరిపిన దివ్య అనుగ్రహ సంభాషణల సారాంశం)**

**వి - విశాలాక్షి ; స్వా - స్వామి**

వి. మానవుని అంతర్ దృష్టి పెరుగుట లేదు స్వామి.
స్వా. అవును అంతర్ దృష్టిని పెంచుకున్న జీవి యొక్క స్థితే వేరుగా ఉంటుంది. మానవుల ఆలోచనా, ఆ సంకుచిత స్థితే వారిని దిగాజార్చుతుంది. భగవంతుడు అని నమస్కరించుట, వెనుక వారితో సమానంగా అనగా ఒక మనిషిగా భావించి వారికున్న స్థితిగతులనే భగవంతునికి ఆపాదించుతారు. ఇంకెప్పుడు వీరిలో వికాసం ఉద్భవిస్తుంది?

వి. మానసిక పరిపక్వ స్థితి లేనివారితో మాట్లాడుట చాలా కష్టంగా ఉన్నది స్వామి.
స్వా. అవును. వారి ఆలోచనా విధానము పైకి పెరిగిన వారు కాదు, అలాగని అధమస్థాయిలో ఉన్న వారూ కాదు.

వి. అంటే వారి యొక్క స్థితిలోనే ఉండి వారు ఆలోచన చేస్తున్నారంటారా స్వామి?
స్వా. అంతే కదా. ఈ స్థితి నుండి మానవుని మేధా శక్తిని పెంచుకోలేని అసహాయ స్థితిలో వారుండి, పైకి సాధనలో వెళ్ళే కొద్ది భగవత్ తత్వాన్ని అర్థం చేసుకుంటారు. అంటే ఈ కనిపించే శరీరమే సాయి, భగవంతుడు అన్న ఆలోచనా పరిధి నుండి పైకి పెరిగినట్లయితే ప్రకృతి స్వభావము నుండి విడిపడి జగత్తంతా భగవన్మయంగా కనిపిస్తుంది.

వి. దాని నుండి మానవుడు ఏమి గ్రహించగలుగుతాడు స్వామి?
స్వా. జగత్తంతా విష్ణు మయం. జగత్తంతా భగవానుడు ఉన్నాడు. కానీ పరిశీలించి చూస్తే కానీ ఆయన కనబడడు. జగత్తే కనబడుతుంది. ఎందుకు కనబడడు అని ప్రశ్నించినట్లైతే దాన్ని

దర్శించడానికి సహనము, సాధన, శ్రద్ధ కావాలి.

వి. మరి మిమ్మల్ని దర్శించుట ఎలా స్వామి?
స్వా. చంద్రబింబాన్ని చూడటానికి ఎటువంటి దీపమూ అవసరం లేదు. చంద్రుడు ప్రసరింపచేసే వెన్నెల సహాయంతోటే చంద్రుడ్ని చూడగలరు. అదే విధంగా భగవంతుని విషయం చెప్పుకొనవలసి వస్తే మానవమాత్రుల మాటలకు శక్తి చాలదు. అందువల్ల భగవంతుని గురించి భగవంతుడు చెప్పిన మాటలే శరణ్యం అవుతాయి.

వి. ప్రతీ విషయం భగవంతునితో సంబంధాన్ని ఏర్పర్చుకోవాలంటారా స్వామి?
స్వా. నిత్య జీవితంలో మీరు చేసే ప్రతి కర్మను ఆధ్యాత్మికంగా అంటే దైవభావంతో నిర్వహించి నిరంతరము దైవమునందే జీవించి జన్మని సార్ధకం చేసుకోవాలి. నా జీవితమే సందేశంగా, నా వాక్యాలే వేద వాక్యాలుగా, నా పాద స్పర్శయే సత్యరూప సందర్శకంగా, ప్రేమ మూర్తిగా, ధర్మ జ్యోతిగా, కనుల ముందు కదులాడే దైవంగా, మాట్లాడే మనిషిగా, సద్గురువుగా, చిదానంద రూపంగా ఉన్న నేను ఇలా మీతో మాట్లాడుట, గడుపుటా అనేది మీ పూర్వ జన్మ పుణ్యం కొద్ది దొరికింది.

వి. అవును స్వామీ. ఇటువంటి మహాద్భాగ్యాన్ని కలిగించిన మీకు ఏవిధంగా కృతజ్ఞతలు తెలుపగలము స్వామి?
స్వా. భక్తుడు భగవంతునికి ఎంత శరణు అవుతాడో భగవంతుడు కూడా భక్తునికి అంత కన్నా వంద రెట్లు శరణు అవుతాడు.
వి. ధన్యులము స్వామి.

***

*** SSS ***

***

స్వా. ఆవకాయ జాడీలో పెడితే ఎన్నాళ్ళు ఉంటుంది?

వి. ఒక ఏడాది పైబడి ఉంటుంది స్వామి.

స్వా. మరి ఈ జాడీలో (దేహమనే జాడీలో) వేస్తే ఎన్నాళ్ళు ఉంటుంది?
వి. అర్ధ రోజు కంటే ఎక్కువ ఉండదు స్వామి.

స్వా. దేహంలో ఏముంది చెత్త కుండీ. అంతా 'మైండ్'లో ఉంది. అందుకే ఈ దేహాన్ని స్వస్వరూప జ్ఞానం కోసం ఉపయోగపడే సాధనంగా చూడాలి.

వి. దీనికి తప్పనిసరిగా గురువు అవసరం ఉన్నదా?
స్వా. దేహభ్రాంతులు, మనోభ్రాంతులతోటే జీవితం సాగిపోతుంది. దారి తెలియని నీకు, దారి తెలిసిన గురువు కావాలి. విచక్షణా జ్ఞానంతో సద్గురువును ఎన్నుకోవాలి. వారికి నీ హృదయాన్ని అర్పించాలి.

వి. అవును స్వామి, మా అదృష్టం కొద్ది మీరే మాకు సద్గురువుగా దొరికారు.
స్వా. అవును మీ అదృష్టం కొద్దీ అవతార పురుషుడే సద్గురువుగా లభించాడు. సద్గురువు శిష్యుని ఎప్పుడూ పతనం కానివ్వడు.

వి. అందుకే మీ అనుగ్రహం కావాలి స్వామి.
స్వా. నా అనుగ్రహానికేం బంగారు ఎప్పుడూ ఉంటుంది. మీ గ్రహాలు సరిగ్గా ఉంటే.

వి. గ్రహాలూ సరిగ్గా అంటే ఏమిటి స్వామి?
స్వా. గ్రహాలు అంటే రాహువు, కేతువు కాదు. రాగ ద్వేషాలు. వాటిని ముందు తొలగించుకోవాలి.

వి. ఎంత మంచి విషయాన్ని తెలిపినారు స్వామి.
స్వా. ఎప్పుడూ మంచే చెబుతాను. మీ హృదయాల్లో ఉండే దౌర్బల్యము, మీ మనస్సులో ఉండే

మాలిన్యము మీ లోపల ఉండే దైవత్వాన్ని మరుగున పడేస్తుంది అనే విషయం గ్రహించిన మరుక్షణంలో మిమ్మల్ని బాధపెడుతున్న రోగాన్ని గుర్తించినట్లే లెఖ్ఖ. ఒకసారి రోగ నిర్ధారణ అయ్యాక ఇక రోగాన్ని తగ్గించుకోవటం ఎంతసేపు? మొదట మీరు చెయ్యవలసిన సాధన ఏమిటి? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. సర్వ జీవులను నిష్కల్మషమైన హృదయంతో ప్రేమించండి. నిస్వార్ధంగా ప్రేమించండి. నీలో ఉండే ఆత్మయే సర్వులలో వెలుగుతున్నది అని గుర్తించండి. సర్వులనూ ప్రేమించడమంటే నిన్ను నీవే ప్రేమించుకోవటం అన్నమాట.

వి. బాధలను, దుఃఖాలను ఏ విధంగా ఎదుర్కొనాలి స్వామి?

స్వా. శరణాగతిని అలవర్చుకోండి. ఈ శరణాగతి మార్గంలో ఎదురయ్యే వాటిని ఎదుర్కొనండి. ఒక్కసారి అంతా భగవంతుడే, ఆయన ప్రేమసామ్రాజ్యంలో బంధీలమైనాము, ఆయన బాహువులలో **<u>సురక్షితంగా</u>** ఉన్నాము అన్న ఆలోచన సల్పండి చాలు. ప్రేమస్వరూపుడైన భగవంతునిపట్ల ప్రేమను పెంచుకోండి. సంకోచాలను, సందేహాలను మీ హృదయంలో చేరనివ్వకండి. నా ప్రేమను గురించి ప్రశ్నలు, అనుమానాలు వద్దు. నా కష్టాలు ఎందుకు తీరలేదు? నా సాధనాదిశగా ఎందుకు అంత తొందరగా అడుగులు వెయ్యలేకపోతున్నాను? నన్నెందుకు పలకరించలేదు? నన్నెందుకు మాట్లాడించలేదు? అని మీరు వ్యధ చెందుతూ ఉంటారు. మీ బాధలు నాకు తెలియవని అనుకోవద్దు. నేను మీ పట్ల ఉపేక్ష చూపుతున్నానని అనుకోవద్దు. తలంచవద్దు. నేను మీతో మాట్లాడకపోయినంత మాత్రాన మీమీద నాకు ప్రేమ లేదని భావించవద్దు. ఈ ప్రేమ లేకపోతే అవతారాన్ని తీసుకుని రావలసినది ఏమున్నది? ఆలోచించండి. నా ప్రేమ ముందు మీప్రేమను గుర్తించండి. ఇది వేదనతో కూడినది. నా వేదన అర్ధం చేసుకోండి. నాకు పని లేక రాలేదు. నా పనల్లా మిమ్ములను సాధనోన్ముఖులను చేయుటయే. దీని కోసము మీరు ఎన్ని అన్నా, ఏమి చేసినా నా పనిని వదలను. మీ మాటలకు, చేతలకు బాధపడను. ఎందుకంటే నేను మానవున్ని కాదు మాధవుడ్ని.

వి. మీ ప్రేమను పొందుటకు ఎక్కువ సమయము ధ్యానం చేయవలెనా స్వామీ?

స్వా. ఎక్కువ సమయం ధ్యానంలో గడిపినపుడు మీ కనులు, మీ మనస్సు సదా నన్ను వెంటాడుతూ ఉంటాయి. అటువంటి స్థితియే మీ నుండి నేను కోరేది.

***

*** SSS ***

***

వి. అవతార లక్ష్యము మానవులను సంస్కరించుటకేనా స్వామి?

స్వా. సంస్కరించబడేది, సంస్కరించేది రెండూ సత్యసాయి యుగంలో జరగవల్సిందే. సంస్కరించేది దేవుడు, సంస్కరించబడేది జీవుడు. ఈ రెండూ, రెండింటి స్థితిని తెలియచేస్తూ మీతోనే, మీలోనే ఉంటూ పయనంలో జరిగే అనుక్షణము మిమ్మల్ని **వీక్షిస్తూ** ఉంటాను.

వి. మానవుడు తన ధర్మాన్ని మరిచాడంటారా స్వామి?

స్వా. లోకమంతా ఎవరి విధులను వారు నిర్వర్తించినచో నా ఆట చాలా సులభంగా ఉంటుంది. కానీ, మాయాప్రేరిత జీవులు కార్య నిమిత్తము, కారణ నిమిత్తము తీసుకుని వచ్చిన దేహాన్ని ఈ రెండిటినీ మరిచి వేరొకదానికొరకై ప్రాకులాడుతూ ఉన్నారు. చిన్నమాట చెప్పనా? బజారుకు లేక సంతకు కానీ ఏదో ఒక వస్తువు కొనాలన్న ఉద్దేశంతో బయల్దేరావు. ఆ సంతలో ఎవరో కనిపించి నీతో ముచ్చట్లు పెట్టాడనుకుందాము. అప్పుడు నీవేమి చేస్తావు? వెళ్ళిన పని మర్చిపోయి తిరిగి ఇంటికి వస్తావు. ఇంట్లో దేనినైతే తయారు చెయ్యాలనుకున్నావో అది తయారు చేసుకోలేవు. అప్పటికే అలసిన శరీరం విశ్రాంతి కోరుకుంటుంది. మరలా నీవు ప్రయత్నించే సమయానికి సంత అయిపోయి నీవు కోరుకున్న వస్తువు దొరకకపోవచ్చు. దాని కొరకై మరలా సంత జరగాలి, అది నీకు గుర్తు ఉండాలి, ఆ సమయానికి కావలిసిన ధనం ఉండాలి, దాని అవసరము ఉండాలి, శారీరక శక్తి కావాలి. ఒక వేళ ఇన్నీ సమకూరినా ఆ వస్తువు దొరకకపోతే ఏమి ఫలితం? ఏ కారణం కోసమైతే వచ్చారో దానిని మర్చిపోవుటచే మరలా మరలా ఈ లోకంలోకి వచ్చి లోక సంబంధమైన దానిలో చిక్కుకుంటున్నారు. మనస్సు అనేది చాలా తుంటరిది అని అర్ధం చేసుకోండి. దాన్ని ఎప్పటికప్పుడు సరి చేస్తూ నడిచిన జీవి ఉత్తమ గతిని సాధించియే తీరుతాడు.

***

*** SSS ***

***

వి. మీకు సంతోషాన్ని అందివ్వటముకంటే జీవులుగా మా కర్తవ్యం ఇంక ఏమీ లేదు కదా స్వామి?
స్వా. ఒక చిన్న ఉదాహరణ చెప్పనా? మానవుడిగా మీకుగా మీరు కోర్కెల సుడుగుండంలో చిక్కుకుని సంతానాన్ని పొంది మరలా ఆజీవులను కోర్కెల సుడిగుండంలో త్రోసి హమ్మయ్య! నాకు అప్పగించిన బాధ్యత నేను నెరవేర్చాను. ఇక నాకు రిలీఫ్ దొరికింది అంటాడు. కానీ వాడు చేస్తున్నది తప్పు అని వాడికి జ్ఞానోదయం కాదు. తల్లిగా, తండ్రిగా జన్మరహస్యం తెలియచేసి, వచ్చిన కారణం ఉపదేశించి, వారి స్థితిని పెంపొందించే ప్రయత్నముచేసి సఫలమయినపుడు నిజంగా వారి స్థితి పెరిగి వారు నా హృదయస్థానాన్ని అందుకొనుట నిజము. అదియే నాకు ఆనందదాయకము. కానీ భౌతికమైన అవసరాలు తీర్చుకోనుచూ ఇదే నాకు అప్పగించిన పని అని మానవుడు అజ్ఞానంలో నడుచుట తీవ్రమైన విచారస్థితిని కలిగిస్తుంది.

వి. స్వామి, గమ్యం తెలుసుకోనుటకే కదా గురువు అవసరము? ఒకసారి దారి తెలిసినాక ఇంక దారి తప్పుట అనేది జరుగదుగదా?
స్వా. దారి బాగా తెలిసే వరకూ దారి తెలిసిన వ్యక్తి యొక్క **<u>గైడెన్స్</u>** చాలా అవసరము. ఒకవేళ నాకు అంతా తెలుసునన్న అహంకారాన్ని ప్రదర్శిస్తే దారి తప్పుతావు. అపుడు దారి చెప్పేవాడూ ఉండడు. చూపే వాడూ ఉండడు. అపుడు నీ గతి అధోగతి అవుతుంది. ఆదారి చూపే వాడే గురువు. ఆ గమ్యమే **<u>ఆత్మసాక్షాత్కారము</u>**.

***

*** SSS ***

***

వి. మంచైనా, చెడైనా కర్మలకు తగ్గ ఫలితం అంటారు కదా స్వామి. అది ఎలా?

స్వా. సరి అయిన మనోభావాలతో కూడుకున్న ముఖము మరలా మరలా చూడాలని అనిపిస్తుంది. వారి సొత్తు అంతా ఎవరో తీసుకువెళ్ళినట్లు ఫీలయ్యే ముఖము ఆముదం త్రాగినట్లుగా పెడితే చూడబుద్ధి కాదు. లోపల ఒకటి ఉంచుకుని బయటకు ఇంకొకలా నటన చేయగలరు. వారు జాదూలు. ఏమైనా చేయగలరు. మనిషిలోని వారి యొక్క గుణాలే స్వభావంగా మారుతాయి. ఈ స్వభావాలే వాంఛలుగా మారుతాయి. ఈ వాంఛలే కర్మలుగా మారుతాయి. ఈ నాల్గింటికీ ఫలితాలు ఉంటాయి. ఏ పనికి తగిన ఫలాన్ని అపుడే అందించే నిస్వార్థమైన యాజమాన్యం నాది. ఈ యజమాని వారి జీతాన్ని కానీ, జీవితాన్ని కానీ సరిగ్గా అంచనా వేసి అందివ్వ గల మహా మహా మహా..... అందుకే నాల్గింటి మార్కులు కూడుకుంటే భౌతికంగా అయితే మార్కులు ఎక్కువ రావాలి. కానీ ఇచట ఎవడికైతే మార్కులు తగ్గుతాయో అంటే చెడ్డ గుణాలను తగ్గించుకుంటాడో వాడే యోగ్యుడు.

వి. స్వామీ! నిత్యానందం అనుభవించుటకు ఏవి అవసరం. వాటిని మీ నుండి అందుకొనుట ఎలా?

స్వా. మీ పాత్రను తయారుగా ఉంచుకుని వంటకు కావలసిన పదార్థాలను సిద్ధం చేసుకుని రెడీగా ఉన్నట్లయితే దానిని తినుటకు వీలుగా ఉండేటట్లుగా నేను అందించగలను. దీనిని అందుకునేటట్లుగా మీరు సిద్ధం కావాలి. ఈ తాపత్రయం నాలో ఎంతగా ఉన్నదో అంతకు రెట్టింపు మీలో కలగాలి. దాని కొరకే నా నిరీక్షణ. అన్నీ కరెక్టు పాళ్ళల్లో తీసుకుని వంట చేస్తే మధురంగా ఉంటుంది. తినేవారు మరలా మరలా అడిగి పెట్టించుకుంటారు. అంతా వంటచేసేవారి చేతిలోనే ఉన్నది. ఈ వంటకు కావలసిన వస్తువుల జాబితా ఇది: 1. శాంతి 2. నిగ్రహము 3. కట్టడి 4. జిహ్వను కంట్రోల్ చేయాలి 5. దృష్టిని కంట్రోల్ చేయాలి 6. అహంకారము ఛావాలి 7. దైవంతో సంభాషించ గలగాలి 8. నీలోని దివ్య చైతన్యాన్ని గుర్తించాలి 9. కరుణరసం చాలా ఎక్కువ మోతాదులో కావాలి 10. నిర్లిప్తత 11. ఏకాత్మ భావం పొందాలి. అంటే అనాత్మ భావం విడనాడాలి.

***

*** SSS ***

***

స్వా. అప్పుడప్పుడు సరదాగా గడపాలి అనుకోవడం మంచిది.

వి. ఏ విధంగా స్వామి?

స్వా. నీకున్న ఆలోచలననుండి కొంచెము ప్రక్కకువచ్చి మరలా నీ స్థానములో నీవు కూర్చొనవచ్చు. కానీ స్థాన భ్రంశం చెందకూడదు. అంటే నీవు అనేది తన స్థానాన్ని, తన స్థాయిని ఎప్పుడూ మరువకూడదు. అదే ధ్యానం అని కూడా చెప్పవచ్చు.

వి. నేను అన్నది ఎరుకలో ఉంచుకుని మనస్సనే దానిని వదిలి అంటే మరలా నీకు అది చిక్కుతుందనే నమ్మకము కలిగితే కాసేపు వదిలివేసి దానిని **<u>రిలాక్స్</u>** చేసి మరలా నీవు, నీ మనస్సు, ఆలోచనలు అన్నీ సుస్థిరంగా, స్థిరంగా ఉండాలి అంటారా?

స్వా. చాలా బాగా చెప్పటానికి, అడగటానికి ప్రయత్నించావు. దాహంతో ఉన్న జీవి లేక ఆకలిగా ఉన్న జీవి తన ఎదుట ఉన్న పదార్థాన్ని ఆశగా ఒక్కసారే తినేద్దామన్నంత ఉత్సాహంతో ఉంటాడు. కానీ అంత ఆతృతతో తినబోతే కొంచెమే తినగలడు. నెమ్మదిగా తిందామన్న ఆలోచనతో మొదలు పెట్టగలిగితే ఇంకా కొంచెము ఆహారము ఎక్కువ తీసుకోగలుగుతాడు. అలాగే నీ మనస్సుకు కూడా ఆకలి ఎక్కువే. కావున అది ఒక్కసారిగా ఆశగా పదార్థాల వద్దకు వెళ్ళి తిందామనుకుంటుంది. పదార్థము పైన ఆశ చావకపోతే పరార్థము సంగతి ఏమిటి? కావున దానిని ఎక్కువ పదార్థాల మీదకు వదలక పరార్థాన్ని అంటిపెట్టుకునే విధి, ధ్యాస రెండూ అవసరము.

వి. అంటే సమస్థితి అంటారా స్వామి?

స్వా. సమస్థితి అంటే అన్నింటినీ సమంగా తీసుకోగలిగిన స్థితి.

వి. అది ఎలా సాధ్యము స్వామి?

స్వా. మీ లోపల ఏ పదార్థమైతే ఉన్నదో ఆ పదార్థం కొన్ని జన్మల సంస్కారముతో గడ్డ కట్టింది.

కావున దానికి కొంచెం వేడి తగిలించాలి.

వి. అది ఎటువంటి వేడి స్వామి?

స్వా. సంస్కారమనే అగ్ని మీ లోపల ముందుగనే ఉన్నది. అది ఆరిపోకుండా ఆ సంస్కారానికి ధ్యానమనే గాలి కావాలి. కావున ఆ గాలి అందించినట్లయితే జ్ఞానాగ్ని రగులుకుని దివ్యత్వమనే నెయ్యి కరిగి ప్రకాశవంతమైన అగ్నిజ్వాలలు వెలువడి అరిషడ్వర్గములు దహింపబడి తేజోవంతమైన ఆత్మతత్వములో లీనమవుతారు.

***

*** **SSS** ***

***

వి. నేను అనేది అంతటా వ్యాపించి ఉన్నప్పుడు ఇంక పోయేది ఏమిటి? వచ్చేది ఏమిటి? ముక్తికి వెళ్ళేది ఎవరు? ద్వైత భావన లేదు కదా? జీవన్ముక్తుడైన జీవి మరలా జన్మను తీసుకున్న పక్షంలో కష్టాలను అనుభవించాలా? ఇవన్నీ ప్రశ్నలుగా ఉన్నాయి స్వామి.

స్వా. జీవుడికి అంతటి ఆత్మ జ్ఞానము కలిగినపుడు తెలుసుకోవలసినది ఇంక ఏమీ లేదు. ఇంతకు ముందు పోయిందెవరు? ఇపుడు వచ్చిందెవరు? పోయినది, వచ్చినది దేహధర్మము. దేహము అనుభవిస్తున్నది అన్న జ్ఞానమే జ్ఞానము. అవతార పురుషుడిగా జన్మను తీసుకున్న నేను అనగా ఇది సంకల్ప శరీరము, జీవన్ముక్త శరీరము కాదు. మరి ఈ దేహము ఎందుకు కష్టాలను అనుభవించింది? కష్టాలను అనుభవించినది ఏది? ఏకర్మలు ఏదిశలో, ఏదశలో అనుభవించవలసి వచ్చింది? ఇది శోధించవలసిన విషయము. దీనితో సమాధానము దొరకవచ్చు.

వి. కారణ శరీరము ఈ కష్టాలను దుఃఖాలను అనుభవించుట ఎందుకు స్వామి?

స్వా. కారణ శరీరమైనా కన్పించే ఈ శరీరము మానవ దేహము. కావున పైనుండి ఎదో ఊడిపడ్డట్టు కాక చూచే వారికి తనలాగే కష్టాలు, సుఖాలు అనుభవిస్తూ వీటిని ఎంత తేలికగా

అనుభవించవచ్చో చూపిస్తూ అదే సమయంలో మాయ నుండి విముక్తులయ్యే వారిని విముక్తులుగా, బంధీ అయ్యేవారిని బందీలుగా మార్చుటయే "మాయా క్రీడిత" అనే నాటికను రక్తికట్టిస్తుంటాను.

వి. మీరు రక్తికట్టించేపుడు ఇంక మానవునికి ఈ కర్మలేమిటి? వాటి భారాలేమిటి? ఇవన్నీ ఏమిటి? అంటే ఇది కూడా నాటకమేనా స్వామి?
స్వా. అవును నాటకమే కదా. అర్థం కాలేదా? మీ ముందు ఎన్నో కర్మలను ఉంచాను. ఉదా: నీ మనుమడికి ఆడుకునేందుకు నీవు ఎన్నో బొమ్మలను తట్టనిండా ఉంచి వాడు ఏడుస్తున్నప్పుడు ఆ తట్ట తెచ్చి వాడి ముందు పోస్తావు. దానిలో నుండి బిడ్డకు ఏ బొమ్మ అయితే నచ్చుతుందో ఆ బొమ్మను తీసుకుని ఆడుతాడు. అలాగే మీ ముందు నేను ఎన్నో రకాల ఆకర్షణలనే బొమ్మల్ని ఇచ్చాను. దాంతో పాటు వివేకం అనే దానిని ఇచ్చాను. ఎవరు దేనిని తీసుకుంటాడో వాడి యొక్క బుద్ధిని, విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి తీసుకున్న వైనాన్ని బట్టి వారి వారికి దొరికే ఫలమే కర్మ. ఆ కర్మల ఫలితాలను అందించుటే నా పని కదా. ఇదే నాకు ఆట.

వి. మరి ఈ ఆట లోని పావుల సంగతి ఏమిటి స్వామి?
స్వా. తెలుసుకోవాలన్న ఆరాటం చాలా ఎక్కువగా ఉన్నట్లుంది? ఆరాటం ఉండకూడదు. జిజ్ఞాస ఉండాలి. అర్థమయినదా?

వి. అంటే మానవుడిగా తాను అనుభవించవలసిన, ఆశ్వాదించవలసిన విషయాన్ని మీ నుండి గ్రహించే విషయంలో ఆసక్తిని కనబర్చుటే జిజ్ఞాస అంటారా స్వామి?
స్వా. నూటికి నూరుశాతం అనవచ్చు. భౌతికమైన ఇహానికి సంబంధించి ఏదో కావాలని కోరికతో ఒకదాని తర్వాత మరొకదాని కోసం ఆశపడుతూ ఉంటే ఆ జీవిని ఎందుకు అంత ఆరాటపడతావు అని మీకు అర్థం తెలియకుండగనే అడుగుతారు. అందుకే ఆశయంతో కూడిన జిజ్ఞాస అవసరము.

వి. అట్టి జిజ్ఞాస, విషయ అవగాహనతో కూడినదై ఉండాలంటారా?

స్వా. అవును తప్పకుండా. మీరు జ్ఞానులుగా మారుటే గాక ఇతరులను కూడా అలా తీర్చిదిద్దవలసి ఉంటుంది. అందుకోండి దండిగా, మెండుగా, నిండుగా నా ఆశీస్సులు.

***

*** **SSS** ***

***

వి. శాంతి అనేది ఎలా ఉండాలి స్వామి?

స్వా. నీవు అనే పదార్థం నిశ్చలస్థితిలో ఉండాలి. సత్ పదార్థము ఏదైతే ఉన్నదో అది 'సత్'తో కలిసినపుడు కలిగే దివ్యానుభూతి. అంటే మధుర పదార్థంతో కలిసి మధురంగా తయారవ్వాలి. భాషకు అందని భావము భవిష్యత్తే వద్దు అంటూ వర్తమానంలో ఉండిపోతే బావుండు అని కోరుకోవాలి. కానీ ఈ వర్తమానమే భూత, భవిష్యత్తుకు మూలాధారం. ఎప్పటికీ ఇది వర్తమానమే కాక కర్తమానము కూడా. మీ స్థితిని మీరు మరువకూడదు. జగత్తు అనే స్టేజీపైకి వచ్చి మీరు నటించవలసిన క్యారెక్టరే గుర్తుపెట్టుకుని మీరు ఏమిటో? మీ డ్యూటీ ఏమిటో? మరువకూడదు. నేను మిమ్మల్ని మీరు గుర్తించేలా చేసేందుకు మీ వెంట పడ్డాను. పడ్తూనే ఉంటాను. అలుపు వచ్చినా సరే ఆగకుండా పరుగులు పెట్టించడమే నా పని. నేను పని మొదలుపెట్టానంటే ఆపేది లేదు. అంతటి కార్యదీక్ష గలిగిన వాడిని. అందుకే నన్ను గుర్తించిన వారిని తెజోస్వరూపులుగా మార్చి తీసుకువెళ్లగలిగిన స్థితికి తీసుకువెళ్తాను. అది తథ్యం. పులి నోట బడ్డ జీవి, సద్గురువు చేత బడ్డ జీవి తప్పించుకునే ప్రసక్తే లేదు.

వి. దాని గూఢార్థము ఏమిటి స్వామి?

స్వా. పులినోట బడ్డ ప్రాణి అనగా శరీరము కృశించి నశించేదిగానే ఎప్పటికీ గుర్తించుకున్నట్లయితే దేహ భావన నశించి నీవు అనే దానిని **<u>సాక్షాత్కరింప</u>** చేసే సద్గురువు

చేతిలో నీవు చిక్కుతావు అని అర్థము. పులినోట బడినా మృత్యువు నోట బడినా పోయేది దేహమే. అనిత్యమైన దేహభావన వీడటమే జీవి యొక్క లక్ష్యము. దీనితో సర్వమూ ఒక్కటేనన్న భావన స్ఫురించి నిత్యసత్యనిర్మల స్వరూపములో జీవుడు ఓలలాడుతాడు.

వి. ఈనాడు మేము అందరమూ సద్గురువు చేతిలోపడుట మా అదృష్టము స్వామి.

స్వా. మీరు ఎంత త్వరగా అడుగులు వేస్తారో అంత త్వరగా గమ్యం చేరగలుగుతారు. మీకు మానవ జన్మ ఇచ్చుటకు కారణం అదే. గురుదక్షణ పుష్కలంగా సమర్పిస్తూ సర్వస్యశరణాగతి పొందాలి. మీరు ఎన్నో అనుకోవచ్చు. కానీ నేను మీరు అనుకునవన్నీ చేయను. నా టైంటేబుల్ ప్రకారం చేసే ఒక మంచి మాష్టర్ని. అందుకే స్టూడెంట్ కూడా మంచిగా ఉండాలని కోరుకునే ఛండామార్కుల వారిని. నేను తలుచుకుంటే చాలానే చేస్తాను. కానీ మీరు మీకుగా పరిధి అనే ఒక చట్రం బిగించుకుని దాని వరకే చూడగలిగిన స్థితిలో ఉంటున్నారు.

***

*** **SSS** ***

***

వి. పుట్టపర్తి యోగ్య భూమి అంటారు కదా స్వామి.

స్వా. ఈ పుట్టపర్తి యోగుల నిలయం. యోగుల యోగ్య భూమి, యోగుల యోగ స్థితిని గుర్తించి యోగ్యమైన వారికి ఆహ్వానము పంపి రప్పించి వారిని కాపాడుటేగాక వారి వారి స్థితిని వారికి ప్రసాదించి జగత్ కల్యాణం కొరకు నేను చేయు సంకల్ప వికల్పాలకు ఒక పనిముట్టుగా ఉపయోగించి పని తీరిన తరువాత ఆ వస్తువులను శుభ్రముగా కడిగి నా ఇంట్లో భద్రంగా దాచుకుంటాను. వాటిని ఎవ్వరికీ అందనివ్వను. ఏదైనా అవసరమనుకుంటే బయటకు తీసి వాడుకుని పని అయిపోయాక మరలా శుభ్రం చేసి దాచిపెడ్తాను. ఎందుకంటే వస్తువు నాది, పని నాది. అందుకని భద్రపర్చవలసిన పని కూడా నాదే. ఎంత పెద్ద పని అయినా, ఎటువంటి పని అయినా ఆ పాత్ర చెయ్యవలసిందే. ఎందుకంటే అది కేవలం పాత్ర కావున యజమాని దేని కోసం ఉపయోగపెట్టినా మాట్లాడకుండా అప్పగించిన పని చేయటమే దాని పని. అది నేను పాత్రను అన్న సంగతి మరువదు. కావున దాని పని చాలా తేలికగా అది చేస్తుంది. అటువంటి

యోగ్యమైన పాత్రలే యోగులు.

వి. తనది అంటూ ఏదీ లేదన్న స్థితిని పొందినవారు అంటే సర్వస్యశరణాగతిని పొందిన జీవులను యోగులుగా గుర్తించవచ్చునా?
స్వా. అవును. ఈ యోగ్య స్థితిని అందుకోవటానికి కొన్ని జన్మల నుండి కొనసాగిస్తున్న సాధన వల్లనే సర్వస్యశరణాగతిని పొందగలరు. సామాన్య జీవులకు అది అంతుచిక్కనిది. కనీసం వారి పరిధిలో కూడా వారు ఆలోచించలేనిది. అందుకే జన్మతః ఎంతో కొంత ఆధ్యాత్మికతతో కూడిన జీవనాన్ని అవలంబిస్తే కొన్ని జన్మలకైనా ఈ దారిలోకి రావటానికి, గమ్యం అనెడిది ఒకటి ఉన్నది దానిని చేరాలి అన్న కాంక్ష కలుగుతుంది. అసలు ఆలోచనే ఈ దిశగా లేకపోతే దిక్కు, దిశ లేనివాడు ఎక్కడకు వెడతాడు? అందుకే మీ అందరి గురించి తపన నేను పడుతున్నాను. ఎందుకనగా దారిలోకి వచ్చిన మీరు దారి తొప్పుతారో లేక కొంచెం సేపు **రిలాక్స్** అవుదామని ఆగి కూర్చుంటే ఏమి వీరి గతి అని మీ వెంట పడ్డాను. నేను ఒక తల్లిని కదా మీ బిడ్డల ఉన్నతిని మీరు ఎలా **కాంక్షిస్తారో** అదే విధంగా నా బిడ్డల ఉన్నతిని నేను కోరుకుంటాను. భౌతికమైన తల్లులు భౌతికావసరాలకే ఇంత ప్రాకులాడుతున్నప్పుడు మరి నా సంగతి ఏమిటి?

***
*** **SSS** ***
***

వి. స్వామి! మాధవుడ్ని దర్శించే మార్గం తెలియపర్చండి?
స్వా. మానవ సేవయే మాధవ సేవగా భావించినపుడు మాధవుడ్ని మానవునిలో చూడగల్గుతావు. మాధవుడ్ని చూడాలంటే మొట్టమొదట మానవత్వాన్ని గుర్తించాలి. మానవత్వాన్ని గుర్తించకుండా మాధవత్వాన్ని అనుభవించడము అసాధ్యము. కావున మాధవుడ్ని దర్శించాలంటే తప్పనిసరిగా మానవ సేవయే త్రోవ.

వి) కేవలం సేవతోనే దర్శన ప్రాప్తి లభిస్తుందంటార?

స్వా) సేవ జీవితమునకు ఆనందమను రుచిని కలిగించే లవణం వంటిది. సేవలో ఉండేది పవిత్రత, సేవ ద్వారా ప్రేమ అనుభూతి లోకి వస్తుంది. హృదయం విశాలం అవుతుంది. సేవ ద్వారా భగవంతుని మెప్పును కూడా పొందవచ్చు. సేవకుడిగా నమ్మినబంటుగా హనుమంతుడు ప్రశంసలు అందుకున్నాడు. సేవను గురించి చెప్పడం కన్నా సేవ చేసి చూపించాలి.

వి) సేవ వలననే ఆత్మదర్శన ప్రాప్తి కూడా కల్గుతుందంటారా?

స్వా) సేవ చేయడం వలన మనస్సు నిర్మలమవుతుంది. హృదయం విశాలం అవుతుంది. పవిత్ర భావాలకు హృదయం నిలయమవుతుంది. దయ, ప్రేమ, కరుణలు సంప్రాప్తమవుతాయి. అట్టి దైవీగుణాలకు నిలయమైనపుడు అజ్ఞానం దూరమవుతుంది. అహంకారం దూరమవుతుంది. రాగవాసనలు మటుమాయమైపోతాయి. కనుక ప్రతి ఒక్కరూ సేవకు అంకితం అవ్వాలి. ఈ సేవ ద్వారానే నిన్ను నీవు తెలుసుకునే ప్రయత్నము ప్రారంభించగనే అంతర్ ఆనందము దొరుకుతుంది. అదే సత్యసందర్శనము. అదే ఆత్మానందానుభూతి.

వి) దీని ద్వారా మానవత్వాన్ని జీవుడు పరిపూర్ణంగా అనుభవించగలడా?

స్వా) మానవత్వం లేని భక్తి నిరుపయోగం. ఇంక ఎక్కడ పరిపూర్ణ మానవతావాది? మానవుడు పుట్టి కొన్ని లక్షల సంవత్సరాలైనా మానవత్వం మాత్రము ఇంకా పురిటినొప్పులు పడుతూనే ఉన్నది. ఈనాడు కేవలం ఆకార మానవుడే కనపడుతున్నాడు. మానవత్వం గల్గిన మానవుడు కనిపించుట లేదు. నేడు **పశు<u>పక్ష్యాదుల</u>** మధ్య సహకారం కనిపిస్తుంది గానీ మానవుల మధ్య కనిపించుట లేదు. ఒక చిన్న బెల్లం ముక్క చీమకు కనిపిస్తే తన తోటి చీమలను వెంటబెట్టుకుని వచ్చి అన్నీ కలసి మోసుకుపోతాయి. ఒక కాకికి ఎంగిలి మెతుకులు కనిపించినట్లైతే తన తోటి కాకులను పిలిచి వాటితోపాటు తానూ తీసుకుంటుంది. మానవుడు మాత్రం వీటికి విరుద్ధంగా ఐకమత్యం అనేది లేకుండా జీవిస్తున్నాడు.

వి) ఇటువంటి ఉన్నతమైన భావాలు మానవుడు కలిగి ఉండాలి కదా స్వామి?

స్వా) ఔను. ఇంటువంటి ఉన్నత భావాలు, విశాల భావాలు, విశ్వాసం ప్రతి ఒక్కరూ పెంచుకోవాలి. ఇటువంటి ఆలోచనలను ఆచరణలో పెట్టినపుడు కల్మషాలకు, కార్పణ్యాలకు తావే ఉండదు. మానవుల మధ్య ఉన్న బేధభావాలు తొలగిపోతాయి. కేవలం బోధవల్ల మార్పురాదు. ఆచరణతో మాత్రమే మార్పు సంభవం. అటువంటి మార్పు వచ్చినపుడు నిజంగానే మానవుడిగా తయారవుతాడు. తద్వారా వారు ఏదైతే కోరుకుంటున్నారో దానిని అందుకోవచ్చు.

వి) అటువంటి మానవుడు నిర్మల స్వభావుడై నిరాడంబరంగా ఉండగల్గుతాడు కదా స్వామి?
స్వా) ఆదర్శవంతుడైన మానవుడు నిరాడంబరమైన, ధర్మబద్ధమైన జీవితం గడపాలని నిర్దేశించినప్పటికీ సర్వకాల సర్వావస్థలలోనూ భగవంతుని ప్రేమించడమే మానవ జీవిత సార్థకత. మనస్పూర్తిగా ఇటువంటి దివ్య తత్వమును అంటిపెట్టుకుని ఉండటమే జీవిత పరమార్ధము.

వి) మా అందరి అదృష్టం కొద్దీ మీ దర్శనాన్ని మేము పొందగలిగాము స్వామి.
స్వా) అవును అది మీ అదృష్టం. ఒకప్పుడు ప్రశాంతి నిలయమనే పద్మంలో నుంచి దివ్యకాంతులతో ధగధగా మెరుస్తున్న ఒక తుమ్మెద ప్రతి రోజు రెండుసార్లు బయటకు వచ్చి భక్తుల హృదయపద్మాలలో తొణికిసలాడే మకరందాన్ని ప్రేమతో ఆశ్వాదిస్తుంది. ఆ భ్రమరత్వం అద్వితీయం, అనిర్వచనీయం. అదే సత్యం, శివం, సుందరం.

***

*** **SSS** ***

***

# క్లుప్త ప్రశ్నోత్తరాల శీర్షిక

వి. అసలైన సంతోషం ఎలా లభిస్తుంది స్వామి?

స్వా. ప్రాపంచిక బంధాలను తొలగించుకున్నప్పుడు.

వి. మనిషికి కీడు చేసేది ఏది స్వామి?

స్వా. కోపం.

వి. భగవంతుడు ఎవరిని చేరదీయును స్వామి?

స్వా. కోపం లేనివారిని.

వి. అసలైన దొంగలెవరు స్వామి?

స్వా. ప్రాపంచిక సుఖలోలులైన వారు.

వి. రేయింబవళ్ళు మా ఆలోచనలు ఎలా ఉండాలి స్వామి?

స్వా. జీవితం శాశ్వితం కాదని, క్షణభంగురమన్న జ్ఞానం.

వి. ఆదర్శ గుణం ఏది స్వామి?

స్వా. బీదలకి ఇవ్వడం. అవసరమైన వారిని ఆదుకోవడం.

వి. నిజమైన జ్ఞాని ఎవరు స్వామి?

స్వా. దూరదృష్టి, వివేకము, ఉత్సాహము కలవాడు.

వి. గ్రుడ్డి వారు ఎవరు స్వామి?

స్వా. తమ తప్పులను ఎరుగని వారు, ప్రాపంచిక సుఖాల కోరిక కలవారు, దైవ విశ్వాసం లేని వారు, మంచిని సహించని వారు.

వి. ఆత్మకు హితమైనది ఏది స్వామి?

స్వా. ధర్మం పట్ల ధృడమైన విశ్వాసం.

వి. విషంతో సమానమైనది ఏది స్వామి?

స్వా. గురునింద.

వి. మనిషికి అపకీర్తి తెచ్చునది ఏది స్వామి?

స్వా. కోపము, దురాశ, స్వార్థము, అహంకారము, అసూయ మరియు ద్వేషము.

వి. మా ఆలోచనలు ఏవిధంగా ఉండాలి స్వామి?

స్వా. దైవచింతనాయత్తంగా ఉండాలి.

వి. గురువు అంటే ఎవరు స్వామి?

స్వా. తన శిష్యులు, అనుయాయుల **సంక్షేమం** పట్ల అత్యంత ఆశక్తి కలవాడు.

వి. మోక్షసాధనా అవసరాలు ఏవి స్వామి?

స్వా. జ్ఞానము మరియు వివేకము.

వి. ఎవరు మంచివారు స్వామి?

స్వా. మంచి మనస్సు కలవారు.

వి. జనులందరూ ఆశించతగినది ఏది స్వామి?

స్వా. పరోపకార బుద్ధి కలిగి ఉండుట.

వి. మా శత్రువు ఏది స్వామి?

స్వా. జీవిత లక్ష్య సాధన పట్ల దీక్ష లేకుండుట.

వి. మానవులకు అత్యంత భీతిని కలిగించేది ఏది స్వామి?

స్వా. మరణం.

వి. నిజమైన నాయకుడు ఎవరు స్వామి?

స్వా. అందరి శ్రేయస్సును **ఆకాంక్షిస్తూ** లక్ష్యసాధనకు అవిశ్రాంతంగా పని చేసేవాడు.

వి. మనిషి చెవులకు ప్రీతిపాత్రమైనది ఏది స్వామి?

స్వా. సాధుపురుషుల ప్రవచనం, భగవన్నామ సంకీర్తనం.

వి. వ్యక్తి తన గౌరవాన్ని కాపాడుకోవటం ఎలా స్వామి?

స్వా. దుర్జన సహకారం ఏమాత్రము ఆశించకుండుట వలన.

వి. చింతకు మూలం ఏది స్వామి?

స్వా. తృప్తి లేక పోవడము, పరుల సొమ్మును అన్యాయంగా కోరుట.

వి. అతి నీచమైన పని ఏది స్వామి?

స్వా. స్వార్థం కోసం పని చెయ్యటం.

వి. ఆదర్శ జీవితం ఏది స్వామి?

స్వా. పాపకార్యాలు చెయ్యని జీవితం.

వి. వివేకం అంటే ఏమిటి స్వామి?

స్వా. చదివిన మంచి ఆశయాలను ఆచరణలో ఉంచడం.

వి. తామరాకుపై నీటి వంటిది ఏమి స్వామి?

స్వా. భౌతిక సుఖము, ధనము మరియు యవ్వనము.

వి. వెన్నెల వంటి చల్లని వ్యక్తి ఎవరు స్వామి?

స్వా. జ్ఞానులైన సాధుపురుషులు.

వి. నీచమైన పని ఏది స్వామి?

స్వా. అల్పమనస్కులకు సేవ చెయ్యడం.

వి. వివేకి ఎవరు స్వామి?

స్వా. అపారమైన జ్ఞాన సంపద కలవారు.

వి. సత్యం అంటే స్వామి?

స్వా. సకల ప్రాణుల పట్ల దయ, ప్రేమ కలిగి ఉండుట. అంటే భూత దయ.

వి. సంతోషం ఎప్పుడు ఉంటుంది స్వామి?

స్వా. సత్సహవాసం లభించినపుడు.

వి. మా సమస్యలన్నింటినీ తొలగించు వారు ఎవరు స్వామి?

స్వా. శక్తిమంతుడైన భగవంతుడు.

వి. మా జీవితాలకు హాని కలిగించేది ఏది స్వామి?

స్వా. పాప కార్యాలు చేయుట.

వి. కుంటివారు ఎవరు స్వామి?

స్వా. పుణ్య **క్షేత్రాలను** దర్శించని వాడు.

వి. మేము దేనిని కోరాలి స్వామి?

స్వా. కరుణ, బీదల పట్ల దయ, సాధువుల పట్ల భక్తి మరియు తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవ భావం.

వి. సాధువంటే ఎవరు స్వామి?

స్వా. గుణవంతుడు మరియు జ్ఞాని.

37. అల్పుడెవరు స్వామి?

స్వా. చెడు పనులు చేయు వారు.

వి. **విశ్వవిజేత** ఎవరు స్వామి?

స్వా. సత్య, ధర్మ, శాంతి మరియు ప్రేమ కలవారు.

వి. పూజనీయుడు ఎవరు స్వామి?

స్వా. దయ మరియు మానవీయ గుణం కలవాడు.

వి. మానవుల ప్రేమ, అనురాగం సాధించగలవారెవరు స్వామి?

స్వా. సర్వభూత దయ కలవాడు, సత్యవ్రతుడు.

వి. మేము ఏ మార్గం అనుసరించాలి స్వామి?

స్వా. ధర్మ మార్గాన్నే అనుసరించాలి.

వి. చెవిటి వారు ఎవరు స్వామి?

స్వా. సత్పురుషుల ప్రసంగాలు వినుట ఇంష్టం లేనివారు.

వి. మూగ వారు ఎవరు స్వామి?

స్వా. అబద్ధములు చెప్పు వారు, మంచిగా మాట్లాడని వారు.

వి. దానమంటే ఏమిటి స్వామి?

స్వా. అర్హులకు ప్రతిఫలాపేక్ష లేకుండా నమ్రతతో సహాయం చేయుట.

వి. నిజమైన మిత్రుడెవరు స్వామి?

స్వా. పాపకార్యాలకు దూరంగా ఉంచేవాడు.

వి. జీవితంలో మెరుపులాంటిదేమిటి స్వామి?

స్వా. లౌకిక ప్రపంచములోని జీవితం.

వి. జగత్తులో అపురూపమైనది ఏమిటి స్వామి?

స్వా. దయతో దానం, అహంకారం లేని జ్ఞానం, అచంచలమైన ధైర్యం మరియు సంపదలను (మంచి గుణాలను) ఇతరులతో పంచుకోవడం.

వి. అసహ్యించుకోదగినదేమిటి స్వామి?

స్వా. ఇతరుల సంపదను ఆశించడం.

వి. ఆదర్శ గుణమేది స్వామి?

స్వా. ఇవ్వటం, ఇవ్వటం, ఇవ్వటం. అవసరమైన వారిని ఆదుకోవడం, బీదలకివ్వటం.

వి. గౌరవనీయులు ఎవరు స్వామి?

స్వా. నిరాడంబరమైన వ్యక్తి, నమ్రతాగుణంగల వ్యక్తి.

వి. ఈ ప్రపంచంలో **విజేత** ఎవరు స్వామి?

స్వా. సత్య, దయ, ధర్మ గుణం కలవాడు.

వి. శ్రీ**మహాలక్ష్మి** ఎవరిని వరించును స్వామి?

స్వా. సోమరితనం లేక కష్టపడి పనిచేయు వారిని. ధర్మవర్తనుని, పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించు వ్యక్తిని **లక్ష్మి** అనుగ్రహించును.

వి. ఎవరి సహవాసం చేయాలి స్వామి?

స్వా. న్యాయమార్గానుయాయులతో సహవాసం చేయాలి. అవినీతిపరులతో, లోభులతో సహవాసం తగదు.

వి. అధముడు ఎవరు స్వామి?

స్వా. ఇతరుల తప్పులను వెదుకువాడు, అన్యాయార్జనాపరుడు మరియు అల్పుడు.

వి. మా ఆలోచనలు ఎలా ఉండాలి స్వామి?

స్వా. దైవ చింతనా ఎత్తంగా ఉండాలి.

వి. ఏమి కోరాలి స్వామి?

స్వా. మంచి చదువు, మానసిక శారీరక ఆరోగ్యం.

వి. మనిషికి అపకీర్తి తెచ్చేది ఏమిటి స్వామి?

స్వా. కోపం, దురాశ, స్వార్ధం, అహంకారము, అసూయ మరియు ద్వేషం.

వి. ఎట్టి పనుల యందు ఆశక్తి చూపాలి స్వామి?

స్వా. చేస్తున్న పనులలో నీతి, నిజాయితీ, దీక్ష, దక్షత కలిగి ఉండాలి.

వి. విలువైన సంపదలు ఏమిటి స్వామి?

స్వా. సమయస్పూర్తి, చైతన్యం మరియు శారీరక దార్ఢ్యము.

వి. వ్యక్తి అసలు శక్తి ఏమిటి స్వామి?

స్వా. ధైర్యం. ధైర్యే సాహసే **లక్ష్మి** అన్నారు.

వి. ఏది దుర్మార్గం స్వామి?

స్వా. సత్పురుషులకు కీడు చేయుట.

వి. శ్రేష్టతను సాధించుట ఎలా స్వామి?

స్వా. తన లక్ష్య సాధనలో నిబద్ధత, అంకిత భావంతోనూ, నైపుణ్యంతోనూ పని చేయుట.

వి. దుఃఖానికి మూలమేమిటి స్వామి?

స్వా. దురాలోచనలు, ద్వేషం, కోపం, అసూయ, అహంకారం మరియు గర్వం.

వి. ఎవరు సంపన్నులు కాగలరు స్వామి?

స్వా. దైవ భక్తి, పరోపకార గుణం గలవారు.

వి. నమ్మదగని వారు ఎవరు స్వామి?

స్వా. అబద్ధము చెప్పు వారిని నమ్మరాదు.

వి. నిజమైన సంపద ఏమిటి స్వామి?

స్వా. ఆరోగ్యం

వి. సంతుష్టులు ఎవరు స్వామి?

స్వా. గుణవంతులైన సంతానం కలవారు మరియు సేవాపరాయణులు.

వి. అదుపులో పెట్టుకొనలేనిది ఏమిటి స్వామి?

స్వా. మనస్సు మరియు ఆలోచనలు.

వి. భువిపై స్వర్గము ఏది స్వామి?

స్వా. సంతృప్తి కలిగి ఉండుట.

వి. **రక్షాకవచము** ఏది స్వామి?

స్వా. దైవ భక్తి, మీరు చేసే మంచి పనులు.

వి. పూజార్హులు ఎవరు స్వామి?

స్వా. తల్లిదండ్రులు, గురువు, దైవము మరియు మహాత్ములు.

వి. దైవసముడెవరు స్వామి?

స్వా. సద్విద్య కలవాడు, కర్తవ్యనిష్ఠ గలవాడు, పరోపకార గుణం గల వ్యక్తి, అంతా దైవానుగ్రహమని విశ్వసించువాడు.

విత్తం, చిత్తం, జీవితం అన్నీ క్షణికమైనవే. యమునికి దయ ఉండదు. దేహాలు అనిత్యమైనవి, సంపద అశాశ్వితమైనది, మరణం సమీపంలోనే ఉన్నది. కామ క్రోధ లోభాలనే దొంగలు నీలో ఉన్న జ్ఞాన రత్నాన్ని అపహరించుటకు వేచియున్నారు. ఆశలు, చింతలకు మానవుడు బద్ధుడై ఉన్నాడు. ఆయుష్షు తరుగుతూ ఉంది. సంపదలు కలల వంటివి, యవ్వనం పూవువలే వాడిపోతుంది. ఆయుష్షు మెరుపు వంటిది. తల్లి, తండ్రి, బంధువులు, సోదరులు, ధనం ఇవేవి శాశ్వతం కావు. జన్మ దుఃఖమయం, ముదిమి దుఃఖమయం, భార్య దుఃఖహేతువు, వివాహం దుఃఖం. అంతెందుకు సంసారసాగరమే దుఃఖమయం. వీటి నుండి తప్పించుకోవాలంటే సద్గ్రంధ పఠనం, సత్కార్య నిర్వహణ, పరోపకార బుద్ధి, నిరాడంబరత, ప్రశాంత చిత్తం కలిగి ఉండాలి. లేకపోతే ఏ క్షణానైనా మృత్యువు అనేది నీవెంటనే నిన్ను కబళించుటకు సిద్ధంగా ఉంటుంది. జాగ్రత్త అనే హెచ్చరికను ఈ రోజు నేను నీలో గడిపిన ఈ అద్భుత అవకాశాన్ని తీసుకుని హెచ్చరిక చేస్తున్నాను. సరదాగా జరిగిన ఈ సన్నివేశం చివరకు ఆధ్యాత్మికమైన జీవన మాధుర్యాన్ని తెలుపగలిగేదిగా మారినది. అంతా సంతోషం అంటూ ఆశీర్వచనాలు అందించిన శుభవేళ ఇది.